పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న
సాహిత్యంలో విభిన్న కోణాలు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)



సంపాదకులు

ప్రొఫెసర్ కె.కృష్ణమూర్తి

తెలుగు శాఖాధ్యక్షులు

ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)

సదా స్మరామి



సాహితీ సుగంధాల సుహాస విహంగమై బహుముఖ ప్రజ్ఞా పాటవాలతో శిఖరాయమానమైన బోయి భీమన్న గారి జీవితాన్ని వారి సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో అనితర సాధ్యమైన తోడ్పాటును అందించిన సరస్వతీ స్వరూపినీ, బోయి భీమన్న ఆశయాలు ఆదర్శాలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా సాగుతూ, భీమన్న ఆలోచనాలోచన వ్యాప్తికై అనన్యసామాన్యమైన కార్యదీక్షతో కదులుతున్న నిష్కామయోగి, వయస్సు వాకిళ్లను వదిలి మనస్సు కోవెలలో నవ నవోన్మేష గీతాలాపన లీలలతో దర్శనమే దైవికతకు నిదర్శనంగా నడయాడే ఆదర్శమూర్తి స్ఫూర్తి అజరామరం.

Smt. A. SRIDEVASENA, IAS
COMMISSIONER

Prof. Jayashankar Vidyabhavan
Nampally, Hyderabad-500 001
Off. +91-040-2474 5021
+91-040-2474 5669
commissioner.cete.ts@gmail.com

Department of Collegiate Education & Technical Education

అభినందనలు



తెలంగాణలో ఉన్నత విద్యాభివృద్ధికి కాలేజియేట్ ఎడ్యుకేషన్ చేస్తున్న సేవ ఎంతో విశిష్టమైనది. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించేందుకు వారి సర్వతోముఖాభివృద్ధికై ఎన్నో కార్యక్రమాలను రూపొందించి అమలుపరుస్తున్నది. అంతేకాకుండా విద్యార్థులకు అవసరమయ్యే కార్యక్రమాల నిర్వహణకు కళాశాలలకు అనుమతినిస్తూ ప్రోత్సహిస్తున్నది. ఎం.వి.ఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న **పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు** రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆ కోవలోకి చెందినదే.

ఈ సదస్సులో ఇరుతెలుగు రాష్ట్రాల ప్రాతినిధ్యంతో పాటు దేశ, విదేశాల నుండి వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పండితులు, పరిశోధకులు పాలుపంచుకోవడం ఆహ్వానించదగ్గ విషయం. అంతే కాకుండా ఇతర దేశాల్లో ఉన్న తెలుగు కవి పండితులు, పరిశోధక మిత్రులు ఈ సదస్సులో తమ పరిశోధన పత్రాలు సమర్పిస్తుండటం ముదావహం.

డాక్టర్ బోయి భీమన్న గారు దూరదృష్టి కలిగిన కవితామూర్తి. సమాజాన్ని చైతన్య పరిచేందుకు తన కలాన్నే గళంగా మార్చుకున్న ఆదర్శమూర్తి. అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసిన పుంభావసరస్వతి. మానవతావాదం, జాతీయవాదాలకు నిలువెత్తు దర్పణాలు వీరి రచనలు. కవిగా సంఘసంస్కర్తగా తాను ఆశించిన సమాజాన్ని నిర్మించడానికి భీమన్న చేసిన రచనలు ప్రతి తరానికి అవసరం. అంతటి మహానుభావుని అమూల్య సాహితీ సంపదను అంతర్జాతీయ స్థాయిలో విభిన్న కోణాల్లో చర్చించడం ఎంతో ఆవశ్యకం. ఇంతటి బృహత్కార్యానికి ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదిక కావడం మరింత గొప్ప విషయం. ఆఫ్‌లైన్ & ఆన్‌లైన్ మాధ్యమంగా జరుగుతున్న ఈ సదస్సు యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారమవడం శుభపరిణామం. సాహిత్యాన్ని సాంకేతికతతో జోడించి నాలుగు కాలాల పాటు ఈ సదస్సు నిలిచిపోయేలా నిర్వహిస్తున్నందుకు సదస్సు సంచాలకులు డా. కె. కృష్ణమూర్తి గారికి, వారికి వెన్నుదన్నుగా నిలిచిన కళాశాల తెలుగు విభాగానికి అభినందనలు. ఇలాంటి చక్కని కార్యక్రమాల్ని ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. పద్మావతి గారికి ప్రత్యేక అభినందనలు.


ఈ అంతర్జాతీయ సదస్సు పరిశోధనా పత్రాలను పుస్తక రూపంలో తీసుకురావడం మరింత ఆనందదాయకం. ఇలాంటి సదస్సుల నిర్వహణకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఎప్పుడూ ముందుండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ....

(శ్రీమతి ఎ. శ్రీదేవసేన)

Telangana Council of Higher Education
(A Statutory Body of the Government of Telangana)
Opp: Mahavir Hospital, Mahavir Marg, Masabtank, Hyderabad- 500 028.
Ph. 040-23311879
Website: www.tgche.ac.in , E-mail: chairman@tgche.ac.in, chairmantgche@gmail.com

PROF. V. BALAKISTA REDDY
LL.M; M.Phil; Ph.D.(JNU)
CHAIRMAN

సందేశం



పాలమూరు ప్రాంతంలోని ఎం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆలోచనా పరిధిని విస్తరింపజేసేలా, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం హర్షణీయమైన విషయం. అందులో భాగంగానే కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 మరియు 4 తేదీలలో **"పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు"** అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం.

ఇలాంటి సదస్సులు విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి ఎంతగానో తోడ్పడటమే కాక, వారిలో పరిశోధనా పటిమను పెంపొందిస్తాయని గట్టిగా నమ్మవచ్చు. ఈ కార్యక్రమాలు విద్యార్థులకే కాకుండా అధ్యాపకులు, సాహితీ పరిశోధకులు మరియు సాహిత్యాభిలాషులకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయి.

బోయి భీమన్న గారు పాలేరు నుంచి పద్మభూషణ్ స్థాయికి ఎదిగిన మహాకవి. సామాజిక స్పృహతో రచనలు చేసి, సంఘ సంస్కరణ లక్ష్యంతో సాహిత్యాన్ని సృష్టించిన కవి. మానవతావాదాన్ని అందలమెక్కించి, సాహిత్యం ద్వారా సమాజంలో మార్పులను తీసుకురావచ్చని నిరూపించిన మహానుభావుడు. సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి అండగా నిలిచిన ఆదర్శవంతుడు. ఆయన వ్యక్తిత్వం మరియు కవిత్వం రెండూ మనిషిని మానవత్వం వైపు నడిపించేలా ఉన్నాయి.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, తెలుగు శాఖ అధ్యక్షులు, అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన అధ్యాపకులు, ఉపన్యాసకులు, నిర్వాహకులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

చైర్మన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి (TGCHE)

Prof. G.N. SRINIVAS
M.E., Ph.D.
VICE-CHANCELLOR

PALAMURU UNIVERSITY
(Accredited by NAAC with 'B' Grade)
Government of Telangana
Mahabubnagar – 509 001,
Telangana, India.
Phone: +91 94404 32277

E-mail: vicechancellor@palamuruuniversity.ac.in :: Website : www.palamuruuniversity.ac.in

అభినందనీయం



కవిగా, రచయితగా, అధ్యాపకుడిగా, చారిత్రక పరిశోధకుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, లాక్షణికుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి నొందిన వారు డా. బోయి భీమన్న గారు. అలాంటి మహోన్నతమూర్తి సాహిత్యాన్ని, విశిష్ట వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తూ M.V.S ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ **"పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు"** అనే అంశంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఈ అంతర్జాతీయ సదస్సుకు కవి పండితుల నుండే కాక పరిశోధక విద్యార్థుల నుండి దేశవిదేశాలలో ఉన్న సాహితీ మూర్తుల నుండి గొప్ప స్పందన రావడం సంతోషం. ఇలాంటి సాహిత్య సదస్సులు విద్యార్థుల జ్ఞానాభివృద్ధికే కాక వారిలో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తాయి. తద్వారా వారి ఉన్నతికి ఎంతగానో తోడ్పడుతాయి. వారిలో ఆలోచన పరిధిని పెంపొందిస్తాయి. పరిశోధకులకు, సాహిత్యాభిలాషులకు ఒక ప్రేరణను కలిగిస్తాయి.

"పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు" అనే అంశంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ఒక బృహత్తరకార్యంగా భావిస్తున్నాను. ఈ సదస్సుకు వచ్చిన పరిశోధనా పత్రాలను ఎంతో ఓర్పుతో పరిశీలించి, పరిష్కరించి పుస్తక రూపంలో తీసుకురావటం మిక్కిలి ప్రశంసనీయం. ఇంతటి కార్య భారాన్ని వహిస్తున్న తెలుగుశాఖ అధ్యక్షులు, సదస్సు సంచాలకులు డా. కె.కృష్ణమూర్తి గారిని తెలుగువిభాగ అధ్యాపకులను, కళాశాల ప్రిన్సిపల్ గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇలాంటి సదస్సులు మరెన్నో నిర్వహించాలని కోరుకుంటున్నాను.

(జి.యన్. శ్రీనివాస్)

ఆశీస్సులు



పద్మభూషణ్ డాక్టర్ బోయిభీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు అనే అంశంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్న ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మహబూబ్‌నగర్ తెలుగుశాఖ వారికి అభినందనలు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాక దేశంలో ఇతర అనేక సాహిత్య సంస్థలలో, విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో బోయి భీమన్న గారి జీవితం, సాహిత్యం గురించిన సదస్సులు నిర్వహించడం ఆయన సాహిత్య మూర్తిమత్వానికి నిదర్శనం. భీమన్న గారు కులాలకు, మతాలకు, వర్ణాలకు, వర్గాలకు అతీతంగా ఆలోచన చేశారు. సర్వజనహితమే తన హితంగా భావించి రచనలు చేసిన జాతీయకవి. సమసమాజ స్థాపన వారి అభిమతం. వసుధైక కుటుంబం వారి ఆశయం. ఏది ఆలోచించారో అదే చెప్పారు, ఏది చెప్పారో అదే ఆచరించిన నిష్కామయోగి భీమన్నగారు. నియమ నిబద్ధతతో నిజాలను నిర్భయంగా తన రచనలలో వ్యక్తీకరించారు. పాలేరు నుంచి పద్మభూషణ్ వరకు సాహితీ ప్రస్థానాన్ని కొనసాగించిన మహాకవి కళాప్రపూర్ణ పద్మభూషణ్ బోయిభీమన్న. వారి సాహిత్యం, జీవితం, వ్యక్తిత్వం ప్రధానాంశాలుగా M.V.S కళాశాల రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేయడం అత్యంత ప్రశంసనీయం.

ఈ అంతర్జాతీయ సదస్సులో బోయిభీమన్న సాహిత్యంలోని విభిన్న అంశాలతో పత్ర సమర్పకులు పాల్గొంటున్నందుకు చాలా సంతోషం. దాదాపుగా 80 పరిశోధన పత్రాలు రావడం ఆనందదాయకం. పత్రాలన్నింటినీ పరిశీలించి, పరిష్కరించి వాటిని సంపుటిగా తీసుకురావడానికి కృష్ణమూర్తి గారు పడిన ఆరాటం మిక్కిలి అభినందనీయం. సదస్సు రోజే పుస్తకంగా తీసుకురావాలనే వారి సంకల్పం చాలా గొప్పది. ఈ సదస్సు నిర్వహిస్తున్న M.V.S డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు కృష్ణమూర్తి గారికి, ఇతర అధ్యాపక బృందానికి ఆశీస్సులు. కళాశాల ప్రాచార్యులకు అభినందనలు.

హైమవతీ భీమన్న
బోయి భీమన్న సాహితీ నిధి చైర్‌పర్సన్

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

M.V.S GOVT.Arts & Science College (A)
(Affiliated to Palamuru University, Mahabubnagar)
Christianpally, MahabubnagarTelangana State
Email id: mahaboobnagar.jkc@gmail.com

మనసులో మాట



ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల పాలమూరు జిల్లాలో విద్యాభివృద్ధికై ఏర్పాటు చేసిన తొలితరం కళాశాలల్లో ఒకటి. 1965 లో ఏర్పాటు చేయబడిన ఈ కళాశాల ఎందరో మేధావుల్ని సమాజానికి అందిస్తూ విద్యాసుగంధాలను నిరంతరం వెదజల్లుతూ ఉంది. 18 విభాగాల అధ్యాపకులు డిగ్రీ విద్యార్థులకు బోధన అందిస్తుండగా, ఏడు విభాగాల్లో స్నాతకోత్తర విద్యను అందిస్తున్నాము.

విద్యార్థుల జ్ఞానతృష్ణను తీర్చడంలో కళాశాల తెలుగువిభాగం చేస్తున్న కృషి అద్వితీయం. పాఠ్యాంశాలతో పాటుగా కార్యశాలలు, విస్తృతోపన్యాసాలు, సదస్సులు నిర్వహిస్తూ చురుకైన పాత్రను పోషిస్తుంది. అందులో భాగంగా నిర్వహిస్తున్నదే **పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో వివిధ కోణాలు** రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు.

సాహిత్యంతో సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసిన కవి భీమన్న. పాలేరు, 'గుడిసెలు కాలిపోతున్నాయి', 'కూలిరాజు' మొదలైన రచనలు అందుకు ఉదాహరణ. వీరి సాహితీ సేవకు గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మించిన సన్మానాలు అందుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఆయన మార్గం. కులమతాల కంటే మానవత్వానికే పెద్దపీట వేసిన మానవతావాది. మనిషికి జీవితంలో ఆత్మగౌరవమే అలంబనమని నమ్మిన మహనీయుడు.

పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో వివిధ కోణాలు రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్న సంచాలకులు డా. కృష్ణమూర్తి గారికి మరియు కళాశాల తెలుగు విభాగానికి అభినందనలు. ఇలాంటి సదస్సులు ఇంకెన్నో కళాశాల తెలుగు విభాగం నిర్వహించాలని మనసారా ఆకాంక్షిస్తూ.....

ప్రిన్సిపాల్
(డాక్టర్ కె.పద్మావతి)

సంపాదకీయం



పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు" అనే అంశంతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం సాహిత్య అధ్యయన కేంద్రంగా మా తెలుగుశాఖ బాధ్యత. ఈ సదస్సులో అశేష సాహితీమూర్తుల సమక్షంలో భీమన్న గారి సమగ్రసాహిత్య చర్చ జరగాలన్నదే మా ఉద్దేశ్యం. అందుకు దేశ విదేశాల నుండి ఇతర రాష్ట్రాల నుండి దాదాపు 88 కి పైగా పరిశోధన పత్రాలు రావడమే నిదర్శనం. తెలుగుసాహిత్యంలో సాహితీ మూర్తుల సాహిత్యానుశీలనం చారిత్రక అవసరం. విద్యార్థులలో సృజనాత్మక శక్తిని, పరిశీలనాత్మక దృక్పథాన్ని, పరిశోధనాత్మక ఆలోచనలు కలిగించడంలో ఇలాంటి సదస్సులు ఉపయోగకరంగా ఉంటాయని ప్రగాఢంగా నమ్ముతున్నాం.

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన చరితార్థులు బోయి భీమన్న. తన సాహిత్యం సర్వలోకహితంగా నిబద్ధతకు కచ్చితత్వానికి ప్రతీకగా దర్శనమిస్తాయి. సామాజిక స్పృహతో పాలేరు నుండి పద్మభూషణ్ వరకు ఎదిగిన కవి బోయి భీమన్న సాహిత్యం ద్వారా సమాజంలో మార్పును, చైతన్యాన్ని తీసుకురావచ్చని నిరూపించారు. భీమన్న సాహిత్యాన్ని అధ్యయనం చేయడమంటే సమకాలీన సమాజాన్ని చదవడమే. అలాంటి పుంభావసరస్వతి సాహిత్యానుశీలనం గురించి రెండు రోజులపాటు ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహించే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నాం.

కృతయుగంబున ధర్మవ్యాధులు బోయ
త్రేతాయుగంబున వాల్మీకి బోయ
ద్వాపరయుగమున వ్యాసుడు బోయ
కలియుగమున భీమన్న బోయ అంటూ సాహితీరంగంలో తనదైన ముద్రను వేసుకున్న కవి డాక్టర్ బోయి భీమన్న. సమాజంలో ఒకడు తింటూ మరొకడు పస్తులుండటం ధర్మం కాదు. ప్రతి ఒక్కరికి కూడు గూడు గుడ్డ కనీస అవసరాలు తీరాలన్న వీరి సామాజిక స్పృహ గొప్పది. ధనికులు పేదలు అనే తారతమ్యం లేకుండా సమాజాన్ని నిర్మించి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అభ్యుదయభావంతో విశ్వమానవతను చాటిన గొప్ప కవి. పట్టుదలతో విద్యను అభ్యసించారు. దానికి తోడు వినయాన్ని సమకూర్చుకున్నారు. డబ్బు, చదువు, ధైర్యం ఉంటే సమాజంలో కులంతో పని ఉండదని గౌరవమర్యాదలు వాటంతటవే లభిస్తాయని నమ్మినవారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే గాక భారతజాతి మొత్తం గర్వించదగిన బోయి భీమన్న నిరంతర సాహిత్య సమారాధకులు. వారి ప్రజ్ఞాపాటవాలు బహుముఖంగా దర్శనమిస్తాయి. తెలుగులోనూ ఆంగ్ల భాషలోనూ అపారమైన పాండిత్యం సంపాదించారు భీమన్న. సాహిత్యం పట్ల అభినివేశంతో పాటు లోతైన అధ్యయన పద్ధతులను అవలంబించారు. పురాణాలను, ఇతిహాసాలను,కావ్యాలను, పూలే అంబేద్కర్ భావాలను

ఆమూలాగ్రం ఔపోసన పట్టారు. పద్య కావ్యాల నుండి కథల వరకు వారి సాహిత్యాన్ని మొత్తం పరిశీలిస్తే వారు స్పృశించని తెలుగు సాహిత్య ప్రక్రియ లేదు విస్మరించిన వస్తువు లేదు. వారి ప్రతి వాక్యం సమాజ హితం, ప్రతి కావ్యం మనిషి మనోగతాల ప్రతిబింబం. బోయి భీమన్నగారు గొప్ప సాహితీ పిపాసి. వారిని ఏ ఒక్క విషయంతో పరిమితం చేయలేని సాహితీ మహర్షి. అటువంటి ప్రతిభాసంపన్నులైన భీమన్న గారి సాహిత్యాన్ని గురించి అంతర్జాతీయ సదస్సు నిర్వహించే అవకాశం రావడం మా తెలుగు శాఖకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాం.

ప్రాచీన సాహిత్యంతో పాటు ఆధునిక సాహిత్యంలో అభిరుచి, అభినివేశం మెండుగా ఉండడం చేత వారి రచనల్లో గొప్ప పరిపూర్ణత, పరిపక్వత దర్శనమిస్తుంది. బహుముఖ కోణాలలో దర్శనమిచ్చే వారి ప్రతిభ ఏ ఒక్క విషయానికి పరిమితం కాలేదు. వారి జీవితమంతా సాహిత్యానికే అంకితం చేసిన అసలు సిసలైన సాహితీమూర్తి భీమన్న. తన జీవితాంతం జాతీయవాదిగానే ఉన్నారు. తాను పుట్టి పెరిగిన దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు. డాక్టర్ బోయి భీమన్న గారి బహుముఖీనమైన ప్రజ్ఞాతత్వాన్ని విశ్లేషించి తెలుగు సాహిత్యానికీ నేటి యువతరానికీ అందించే ఉద్దేశంతో ఈ సదస్సుకు పూనుకున్నాము. కళాశాల విద్యార్థులకు, నేటి యువతరానికి బోయి భీమన్న జీవితము, సాహిత్యము మార్గదర్శకంగా ఉంటుందని భావిస్తూ, వారి నిరాడంబరత్వం ప్రతి తరానికి ఆదర్శంగా ఉండాలనే ఆశయంతో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాం.

ఈ సదస్సులో భీమన్న గారి సాహిత్యంలో వివిధ అంశాలను, అనేక కోణాల్లో చర్చ జరిపి వివేచించి విశ్లేషించడం ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ అంతర్జాతీయ సదస్సులో ఆస్ట్రేలియా, జర్మనీ, అమెరికా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాలతో పాటు మనదేశంలోని కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ మొదలైన రాష్ట్రాల నుండి ప్రాతినిధ్యం లభించడం ఆనందంగా ఉంది. పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు అనే అంతర్జాతీయ సదస్సుకు చాలామంది పరిశోధకులు వ్యాసాలు పంపించారు. ప్రామాణికత ఆధారంగా ముద్రణ కొరకు వ్యాసాలను ఎంపిక చేయడం కమిటీకి సంక్లిష్టంగా మారింది. కొన్ని వ్యాసాలలో వాసి తగ్గినప్పటికీ శ్రమపడి రాసిన పరిశోధకులను నిరుత్సాహపరచకూడదని చాలా వ్యాసాలు ముద్రణకు తీసుకోవడం జరిగింది. భీమన్న గారి సాహిత్య కృషిని పూర్తిగా ఆవిష్కరించే ఈ వ్యాస సంపుటిని పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమం నిర్వహించడానికి ఆశీస్సులు అందించిన ఎందరో మహానుభావులు, వారందరికీ వందనాలు.

(డా. కె. కృష్ణమూర్తి)
సదస్సు సంచాలకులు

కృతజ్ఞతలు

పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు అనే అంశంతో ఫిబ్రవరి మూడు నాలుగు తేదీల్లో మా తెలుగు శాఖ ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు పూనుకోవడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా భావిస్తూ, అందుకు గర్విస్తున్నాం. ఈ సదస్సు నిర్వహణకు కారకులైన ఎందరో మహానుభావులు వారి సుసంపన్నమైన సహృదయానికి కృతజ్ఞతాభివందనాలు. ఈ సదస్సు నిర్వహణకు అనుమతించిన కళాశాల విద్యా కమిషనరేట్‌కు, తమ ఆర్థిక సౌజన్యాన్ని అందించిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి వారికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారికి, PM - USHA వారికి, కావలసిన సహాయ, సహకారాలు అందించి మమ్మల్ని ముందుకు నడిపించిన మా ప్రాచార్యులు ప్రొఫెసర్ డాక్టర్ కె. పద్మావతి గారికి ధన్యవాదాలు.

సదస్సు ప్రారంభం నుండి తమ హార్థిక, ఆర్థిక సూచనలు, సలహాలు ఇస్తూ ఎప్పటికప్పుడు సదస్సు నిర్వహణను పర్యవేక్షిస్తూ పరిశోధనా పత్రాలను సంపుటంగా అచ్చు వేసే వరకు మా వెంటే ఉన్న నిరాడంబరమూర్తి బోయి భీమన్న గారి ధర్మపత్ని శ్రీమతి హైమవతీ భీమన్న గారికి శత సహస్ర కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

ఈ పరిశోధనా పత్రాల సంకలనాన్ని చూసి అభినందన సందేశాన్ని పంపిన శ్రీమతి శ్రీదేవసేన కమిషనర్ కాలేజియెట్ ఎడ్యుకేషన్ వారికి, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్. వి.బాలకిష్టారెడ్డి గారికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారికి, పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి బహుముఖ ప్రజ్ఞావంతులు ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ గారికి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి వెల్దండ నిత్యానందరావు గారికి, బోయి భీమన్న సాహితి నిధి చైర్ పర్సన్ శ్రీమతి హైమవతీ భీమన్న గారికి, కళాశాల ప్రాచార్యులు ప్రొఫెసర్ కె.పద్మావతి గారికి కృతజ్ఞతలు. ఈ సదస్సు నిర్వహణకు ఆర్థిక హార్థిక ఆశీస్సులు అందించిన వారందరికీ కృతజ్ఞతలు.

(డా. కె. కృష్ణమూర్తి)

విషయసూచిక

1. శ్రీమతి హైమవతీ భీమన్న గారిని కలిసిన సందర్భంగా
   వారు పంచుకున్న కొన్ని అనుభవాలు, జ్ఞాపకాలు
   – డా. కె. కృష్ణమూర్తి.....1
2. బోయి భీమన్న సాహిత్యం – సమసమాజ స్థాపన
   – డా. కె. కృష్ణమూర్తి.....6
3. అభినవవ్యాసుడు మహాకవి బోయి భీమన్న
   – డా. కోయికోటేశ్వరరావు 12
4. రాగవాసిష్ఠం – నాటక వైశిష్ట్యం: జాతీయ సమైక్య దృక్పథం
   – ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు 18
5. పిల్లీ శతకం తత్త్వదర్శనం – సామాజిక విశ్లేషణ
   – డా. మన్నెమోని కృష్ణయ్య.....34
6. బోయిభీమన్న – రాగవాసిష్ఠం నాటకం – రసాద్వైతం
   – డా. కె.సురేశ్ 38
7. పాలేరు నాటకం – దళిత దృక్పథం ఒక విశ్లేషణ
   – గంజి. కుమార్ రాజా 42
8. బోయి భీమన్న సాహిత్య ప్రస్థానం – ఒక పరిశీలన
   – డా. బూర్గుల స్వరూప 47
9. భీమన్న రాఖీలు ప్రేమతత్వపు ప్రతీకలు – ఒక పరిశీలన
   – డా. స్వప్న భువకర్ 51
10. సమాజం – సాహిత్యం– బోయి భీమన్న మరో చూపు
    – డా. పెబ్బేటి మల్లికార్జున్ 56
11. బోయి భీమన్న దర్శించిన జాషువా కవిత్వపు మెరుపులు లోతులు
    – డా. బి. వెంకటయ్య 61
12. బోయి భీమన్న త్రిపదలు – దళిత జీవన వాస్తవాలు
    – డా. ఇడికోజు శ్రీనివాసాచారి 66
13. బోయి భీమన్న నాటకాలు – సామాజిక దృక్పథం
    – డా. ఏ. వేంకటప్రసాదు 72
14. డా. బోయి భీమన్న సాహిత్యం – సామాజిక చైతన్యం
    – డా.ఎం. మంజుశ్రీ 79

15. పిల్లీ శతకం – సామాజిక విశ్లేషణ
– డా. బకరం నర్సింహ 87
16. పాలేరు నుంచి పద్మశ్రీ దాకా – ఒక పరిశీలన
– డా. భీంపల్లి శ్రీకాంత్ 93
17. బోయి భీమన్న – గుడిసెలు కాలిపోతున్నాయి
– డా. మంగళగిరి శ్రీనివాసులు 101
18. భీమన్న దృష్టిలో శ్రీశ్రీ
– నాయుడు గారి జయన్న 107
19. డా. బోయి భీమన్న 'ఓయి, కవి! కవిత్వం వ్రాయి!' – ఇతివృత్తం
– డా. నారగోని సైదులు 112
20. అంబేద్కర్ మతం – డాక్టర్ బోయి భీమన్న అభిమతం
– డా. ఖేతావత్ సైదులు 119
21. "భారతీయ కవిగా బోయి భీమన్న"
– బైలపూడి అమర్‌నాథ్ 124
22. బోయి భీమన్న సాహిత్యంలో భిన్నకోణాలు
– బసవరాజప్ప 130
23. బోయిభీమన్న నాటక సాహిత్యంలో సామాజిక చైతన్యం
– బొడిగె అఖిల 136
24. పాలేరు నాటకం – దళిత దృక్పథం
– గరిగంటి కృపాకర్ 141
25. డా. బోయి భీమన్న కవిత్వం –
అణగారిన వర్గాల ఆర్తనాదం నుంచి విశ్వమానవ చైతన్యం
– జి. గిరి ప్రసాద్ 144
26. దళిత–పేదల జీవన చిత్రణ – బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై కవిత
– డా. ఆర్. సంగీత 147
27. బోయి భీమన్న 'ప్రగతి' నాటకంలోని సామాజిక అంశాల విశ్లేషణ
– పొన్నగంటి ప్రభాకర్ 151
28. బోయి భీమన్న గేయ నాటికలు – పరిశీలన
– చింతలపల్లి రాఘవేంద్ర రావు 158

29. జానపదుని జాబుల్లో సామాజిక చైతన్యం
– డా. శ్రీపాద సీతామహాలక్ష్మీ సత్యవతీ పేరమాంబ 165
30. బోయి భీమన్న సాహిత్యంలో మానవతావాదం
– గండి స్వామిప్రసాద్ 170
31. జానపదుని జాబులు ఒక పరిశీలన
– బి. శ్వేత 174
32. బోయి భీమన్న రచనలు: సమకాలీన సమాజానికి ప్రాసక్తి
– డా. ఎం.ఎ. మాలిక్ 179
33. బోయి భీమన్న – దుక్కిటెద్దువు కాదు – రైతు ప్రస్థానం
– బి.మారెప్ప 187
34. బోయి భీమన్న "జానపదుని జాబులు" పరిశీలన(శ్రమ జీవుని అంతరంగం)
– మణి కోపల్లె 191
35. డా. బోయి భీమన్న కవిత్వంలో జానపద మూలాలు –పరిశీలన
– దుప్పటి. మొగిలి 199
36. బోయి భీమన్న కవిత్వం – సామాజిక అభ్యుదయం
– డా. యమ్. ఆదిశేషయ్య 204
37. బోయి భీమన్న కేదారేశ్వరి గేయ సంపుటి – వస్తు వైవిధ్యం
– వంగ వెంకటయ్య గౌడ్ 210
38. బోయి భీమన్న త్రిపదలు – ఒక పరిశీలన
– బోల యాదయ్య 213
39. బోయి భీమన్న నాటక సాహిత్యం – సామాజిక చైతన్యం
– డా. బాలశ్రీనివాస్ 217
40. బోయి భీమన్న గారి ఉగాదులలో – కవితా దృక్పథం
– డా. డి. రమణమ్మ 223
41. బోయి భీమన్న కావ్యకుసుమాలు – తాత్త్విక విశ్లేషణ
– భూషనమోని కమల 228
42. బోయి భీమన్న కూలీరాజు నాటకం – సామాజిక అంశాలు
– ఈ. జనార్దన్ 232
43. "బోయి భీమన్న 'పైరుపాట' గేయ నాటిక – ప్రకృతి సౌందర్యం"
– డా. గోపినాథ్ రాథోడ్ పి. 237

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

శ్రీమతి హైమవతీ భీమన్న గారిని కలిసిన సందర్భంగా వారు పంచుకున్న కొన్ని అనుభవాలు, జ్ఞాపకాలు

– ఆచార్య కె. కృష్ణమూర్తి
తెలుగుశాఖ అధ్యక్షులు
ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మహబూబ్ నగర్

భీమన్న, 1978వ సంవత్సరంలో రాష్ట్ర గవర్నర్ చేత శాసన మండలికి నామినేట్ చేయబడ్డాడు. 1978 నుంచి 1984 వరకు ఒక ఆరు సంవత్సరాల కాలం పాటు తన ప్రసంగాలతో అందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసేవాడన్నమాట. శాసన మండలిలో ఉన్న సభ్యులే కాకుండా పాత్రికేయులందరూ కూడా ఆయన మీద ప్రశంసల జల్లు కురిపించేవారు. శాసనమండలిలో అంత అద్భుతమైనటువంటి ప్రసంగాలు చేశారు.

ఆ తర్వాత 1983 లో ఎన్.టి. రామారావు ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కూడా ఒక సంవత్సర కాలం పాటు ఈయన ఆ శాసనమండలిలో ఉన్నాడు. రామారావు గారి ప్రభుత్వం చేపడుతున్నటువంటి కార్యక్రమాలన్నిటిపై ఈయన స్పందించని రోజంటూ ఉండేది కాదు. పత్రికలేమో చాలా చమత్కారంగా పతాక శీర్షికల్లో అన్నకు భీమన్న చిట్కాలు, అన్నకు భీమన్న సలహాలు అంటూ రకరకాల వ్యాఖ్యలతో వార్తా కథనాలన్నీ ప్రచురిస్తూ ఉండేవారు.

అలాగ ఆరు సంవత్సరాల పాటు చాలా అద్భుతంగా ఆయన శాసన మండలి సభ్యుడుగా కొనసాగాడు. ఆ తర్వాత 1985లో ఆల్ ఇండియా దళిత రైటర్స్ ఆయనని చైర్మన్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈయన ఆధ్వర్యంలోనే దళిత మహాసభలు జరిగాయి.

అంతకుముందు 1983లోనూ అనంతపూర్‌లో ఉన్నటువంటి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సిండికేట్ మెంబర్‌గా కూడా ఈయన సెలెక్ట్ అయ్యాడు. ఈయన అనంతపూర్ వెళ్ళినప్పుడు ఆయన వెంట నేను వెళ్ళేదాన్ని, లేకపోతే మా అమ్మాయి పల్లవి వెళుతూ ఉండేది.

ఆ సమయంలో అనంతపూర్‌లో అక్కడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఏబుల్ గారు ఉండేవారు. నిజంగా ఎంతో సౌమ్యుడు, చాలా మంచివాడు. ఆయన్ను మహోన్నత వ్యక్తి అని చెప్పాలి. అలాంటి ఏబుల్ గారు, తర్వాత కొలకలూరి ఇనాక్ వంటి వాళ్లు అక్కడ ఉండేవారు. వీరే కాకుండా ఇంకా చాలామంది పరిశోధక విద్యార్థులు మేము వెళ్ళినప్పుడల్లా మాతో కలిసి సరదాగా గడుపుతూ ఉండేవాళ్లు. అనంతపూర్ విశ్వవిద్యాలయంలో మా జ్ఞాపకాలు గొప్పవి, మరిచిపోలేనివి.

ఆ తర్వాత 1988లో విజయవాడలో కనకాభిషేకం జరిగింది. అంటే, పాలేరు నాటకానికి స్వర్ణోత్సవం చేశాం అన్నమాట. భీమన్నకి అత్యంత ఆప్తుడు, స్నేహితుడు అయిన కోనాడు సూర్యప్రకాశరావు గారికి ఈ పాలేరు నాటకాన్ని అంకితం ఇవ్వడం జరిగింది. ఆ రోజున పాలేరు స్వర్ణోత్సవం జరిగినప్పుడు పోలవరపు వెంకట సుబ్బారావు దంపతులు భీమన్నకు కూడా కనకాభిషేకం చేశారు. చాలా అద్భుతంగా జరిగింది ఆ కార్యక్రమం.

మేము సకుటుంబంగా విజయవాడ వెళ్ళాము. ఆ స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్నాము. ఆ పోలవరపు దంపతులు మా ఇద్దరిని చాలా చక్కగా సన్మానించారు. అలాగే కోనాడు సూర్యప్రకాశ రావు గారికి పాలేరు నాటకం అంకితం ఇవ్వడం జరిగింది. కోనాడు సూర్యప్రకాశ రావు గారి అబ్బాయి కోనాడు అశోక్ మంచి గాయకుడు. ఆ రోజున విజయవాడలో ఆ పాలేరు నాటక ప్రదర్శన కూడా జరిగింది.

చాలా అంటే చాలా అద్భుతంగా నటించారు నటీనటులంతా కూడాను. అసలు నభూతో నభవిష్యతి అన్నంత గొప్పగా ఆ నాటకం ప్రదర్శించబడింది. అసలు ఎక్కడా మనిషి నిలబడడానికి స్థలం లేదన్నమాట. ఆ హాలంతా కిటకిటలాడిపోయింది. అంత జనసమ్మర్ధం అన్నమాట. అంత గొప్ప నాటకం అది.

ఈనాటికీ ఆనాటికి పాలేరు నాటకం రిలవెంట్ అని చెప్పుకోవాలి మనం. ఎందుకంటే సామాజిక చైతన్యాన్ని ఆశించి రాసినటువంటి నాటకం ఇది. ఇంకా సామాజిక చైతన్యం ఆశించిన మేరకు జరగలేదు. అందుకనే నిజంగా జనంలో చైతన్యం వచ్చేవరకు కూడా ఈ నాటకం ఇలా చిరస్థాయిగానే ఉంటుంది. అంత గొప్ప నాటకం అన్నమాట పాలేరు నాటకం.

ఇంకొక విషయం ఏంటంటే బోయి భీమన్న అని ఎవరైనా అనగానే ఓ! పాలేరు నాటకం రాశారు కదా అని అంటుంటారు. ఆయన జీవించి ఉండగా 70 గ్రంథాలు రాసారు. అనువాదాలు కానీ అనుకరణలు గానీ ఏమీ లేవు. అన్నీ స్వీయ రచనలే. అన్ని సాహిత్య ప్రక్రియలలో కూడా రాసినటువంటివాడు భీమన్న. అలాంటిది ఈ పాలేరు నాటకాన్నే ఎక్కువగా అందరూ కూడా ప్రస్తావిస్తూ ఉంటారు. ఎందుకంటే ఆ నాటకం అంత బహుళ జనాదరణ పొందినటువంటి నాటకం అన్నమాట. అంత గొప్ప నాటకం. భీమన్న గారికి మంచి పేరు తెచ్చి పెట్టింది.

కనకాభిషేకం తర్వాత 1989లో ఇక్కడ ఆంధ్ర సారస్వత పరిషత్తులో కొంతమంది మిత్రులందరూ కలిసి ఈయనకి పుష్పాభిషేకం చేశారు. ఆ పుష్పాభిషేక సభ ప్రత్యేకంగా నిర్వహించినవారు జొన్నకూటి నాగేశ్వరరావు. ఆయన ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా

ఉండేవాడు. స్నేహితులందర్నీ కూడగట్టుకుని ఈయనకి ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఈ పుష్పాభిషేకం జరిపించారు.

అలాగే వరసగా ఈ పుష్పాభిషేకం తర్వాత 1990లో విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి ఆచార్య ఆపదరావు గారు కనక పుష్పాభిషేకం చేస్తాం మీకు విశాఖపట్నంలో మీరు రావాలి అని చెప్పేసి భీమన్న గారికి ఫోన్ చేశాడు. సరే వెళ్దామంటే వెళ్దామనుకున్నాం. ఎందుకంటే మాకు విశాఖపట్నం అంటే అదొక ప్రత్యేక అభిమానం, ఏమిటో తెలియదు.

మా పిల్లలు విశాఖపట్నం అంటే వెంటనే తయారైపోతారు. వాళ్ళని ఆకర్షించింది అక్కడి సముద్రం. ఆ సముద్రపు ఒడ్డుకు వెళ్ళి కాసేపు అక్కడ ఆడుకుని సరదాగా ఎంజాయ్ చేసి రావడం వాళ్ళకి చాలా ఇష్టం. కానీ కనక పుష్పాభిషేకానికి వెళ్ళినప్పుడు పిల్లలతో వెళ్ళలేదు. మేము ఇద్దరమే వెళ్ళాము. నేను, భీమన్న గారు ఇద్దరం వెళ్ళాము.

ఇంతకీ ఆ కనక పుష్పాభిషేకం ఏమిటి అంటే సింహాచలం నుంచి గంపలు గంపలు, తట్టలు తట్టలు నిండా సంపంగి పూలు తీసుకొచ్చారు అన్నమాట. అప్పటి పార్లమెంట్ సభ్యుడు ఏ.వి.ఎస్ మూర్తి గారు, ఆపద రావు గారితో పాటు విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నటువంటి అధ్యాపకులు, అక్కడ ప్రముఖ న్యాయవాదిగా ఉండే గణపతిరాజు అచ్యుతరామరాజు గారు, అలాగే మన శంకరాభరణం సోమయాజులు గారు మొదలగు ప్రముఖులందరూ పాల్గొన్నారు. చాలా అద్భుతమైనటువంటి సత్కార కార్యక్రమం ఆ కనక పుష్పాభిషేకం. ఆ కనక పుష్పాలు అంటే సంపంగి పూలు అన్నమాట. ఆ సంపంగి పూలు తట్టలతో తెచ్చి పోసేశారు మాకు. చాలా చక్కటి అనుభూతి నాకు అది ఇప్పటికీ కూడాను.

తర్వాత 1991లో తిక్కవరపు రామిరెడ్డి శత జయంతి ఉత్సవాల సందర్భంగా డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు భీమన్న గారికి తిక్కవరపు రామిరెడ్డి పేరు మీద పురస్కారం అందించారు. అప్పుడు నేను కూడా వెళ్ళాను. జిల్లా కలెక్టర్‌గా కొప్పుల రాజు గారు ఉండేవారు.

మమ్మల్ని చాలా చక్కగా ఆదరించారు ఆయన. మేము వస్తున్నామని తెలిసి మమ్మల్ని రిసీవ్ చేసుకుని, మాకు కావలసినటువంటి సౌకర్యాలు, సదుపాయాలు అన్నీ కూడా చాలా చక్కగా సమకూర్చారు. మాకు అక్కడ ఉండడానికి కూడా ఆయన వసతి కూడా ఏర్పాటు చేస్తానంటే, బెజవాడ గోపాలరెడ్డి గారు "నో నో, వాళ్ళు ఎక్కడా ఉండడానికి వీల్లేదు, మా ఇంట్లోనే ఉండాలి, మా ఆతిథ్యమే స్వీకరించాలి" అని చెప్పి పట్టు పట్టారు. కాదనలేక బెజవాడ గోపాలరెడ్డి గారి ఇంట్లో ఉండడం జరిగింది.

ఆ సాయంత్రం నెల్లూరు టౌన్ హాల్‌లో అశేష ప్రజావాహిని మధ్యన ఈ తిక్కవరపు రామిరెడ్డి శత జయంతి ఉత్సవాల సందర్భంగా భీమన్న గారికి సన్మానం జరిగింది.

అలాగే అదే సంవత్సరం మళ్ళీ దళిత ఓపెన్ యూనివర్సిటీ గుంటూరుకు వెళ్ళాం. అక్కడ వాళ్ళంతా కూడా చాలా చక్కగా అక్కడ మాకు సత్కారం అందించారు. అది దళిత ఓపెన్ యూనివర్సిటీ గుంటూరు అన్నమాట.

అదే సంవత్సరమే రమణయ్య రాజు గారు ఏర్పాటు చేసినటువంటి అతి ప్రతిష్ఠాత్మకమైన రాజాలక్ష్మి అవార్డు కూడా భీమన్న గారికి ఇవ్వడం జరిగింది. ఆ సభలన్నింటికీ మేమెవరో ఒకరం కుటుంబ సభ్యులు తప్పనిసరిగా పాల్గొనడం ఆనవాయితీ.

తర్వాతేమో 1992 ఆ ప్రాంతంలో అంబేద్కర్ సెంటెనరీ సెలెబ్రేషన్స్‌కి కూడా రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా వేశారు భీమన్న గారిని.

1992లో యన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సి. నారాయణ రెడ్డి గారు ఉపాధ్యక్షులుగా ఉన్నారు. అప్పుడు ఈ యూనివర్సిటీ వారు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'విశిష్ట పురస్కారం' ప్రప్రథమంగా బోయి భీమన్న గారినే వరించింది.

అప్పుడు. అది ఎన్.టి. రామారావు గారి సమయం, ఆ టైమ్‌లో ఈయనకు ప్రధానం. నారాయణ రెడ్డి గారి టైమ్‌లో అది ఇవ్వడం జరిగింది.

అలాగే 1993లో మళ్ళా గుంటూరు వెళ్ళాం. ఎందుకంటే నాగార్జున యూనివర్సిటీ వాళ్ళు ఈయనకి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు.

తర్వాతేమో సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్, నాగ్‌పూర్ వాళ్ళు భీమన్నగారిని 1995లో మెంబర్‌గా వేసుకున్నారు.

1996లో రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ఆత్మగౌరవ పురస్కారం ప్రకటించారు. అది మొట్టమొదటి ఆత్మగౌరవ పురస్కారం. 50 వేల నగదు, పారితోషికం చాలా గొప్ప సన్మానం అది.

అలాగే చాలా వాటిల్లో ఈయన ఉండేవాడు. కల్చరల్ కౌన్సిల్‌లో మెంబర్‌గా ఉండేవాడు. తర్వాత గోల్డెన్ జూబ్లీ, భారత స్వాతంత్ర్య 50 సంవత్సరాల ఉత్సవాలలో కూడా కమిటీ మెంబర్‌గా ఉండేవాడు భీమన్న.

తర్వాత అసలు బాగా విశేషంగా, ప్రత్యేకంగా చెప్పుకోవలసినది ఏమిటి అంటే శ్రీకాకుళంలో జరిగిన సమావేశం. అప్పుడు దానం గారు కలెక్టర్‌గా ఉండేవాడు. అక్కడ ఎస్పీ ఇంకొకాయన. వీళ్ళ సమక్షంలో 2000 మంది స్టాండింగ్ ఒవేషన్ (అందరు నిలబడి) ఇచ్చారు. అంటే అత్యంత గౌరవప్రదమైనది అన్నమాట అది.

అటువంటి సభలో ఈయనకి 'నవయుగ కవిసార్వభౌమ' బిరుదు ప్రధానం చేశారు. నిజంగా ఆ రకమైనటువంటి సభ నభూతో నభవిష్యతి. ఎందుకంటే 2000 మంది స్టాండింగ్ ఒవేషన్. ఆ విధమైన సభలో మేమిద్దరం కూడా పాల్గొన్నాము. విజయభావన సంస్థ వాళ్ళు 2000 సంవత్సరం ఉగాది రోజు ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆ తర్వాత 2001లో భారత ప్రభుత్వం ఈయనని పద్మభూషణ్‌తో (అంతకు ముందు 1973లో పద్మశ్రీ ఇచ్చింది) సత్కరించారు. అప్పుడు మా అమ్మాయి పల్లవి, నేను, భీమన్న ముగ్గురం కలిసి ఢిల్లీ వెళ్ళాము. భీమన్నతో పాటు బాలసుబ్రహ్మణ్యానికి అప్పుడు పద్మశ్రీ ఇచ్చారు. అలాగే భానుమతి రామకృష్ణ గారు కూడా ఉన్నారు. వీళ్ళంతా కూడా అక్కడ కలిశారు అదొక చక్కటి అనుభూతి అన్నమాట.

ఆ తర్వాత 2002లో మహాత్మా గాంధీ వాళ్ళ హార్మొనీ అవార్డు జై భారత్ సంస్థ వాళ్ళు ఇచ్చారు. జై భారత్ అనేది ఒక పెద్ద సంస్థ. వాళ్ళు చాలా చక్కటి కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. రమణమూర్తి దాని అధ్యక్షుడు. పి.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో జై భారత్ చాలా బ్రహ్మాండమైన కార్యక్రమం నిర్వహించాడు.

ఆ తర్వాత 2003లో గుర్రం జాషువా గారి పేరు మీద కూడా భీమన్న గారికి ఒక పురస్కారం లభించింది.

అలాగే 2004లో ఎన్.టి. రామారావు జీవిత సాఫల్య పురస్కారాన్ని ఇచ్చారు.

2005... ఆయన 2005 డిసెంబర్‌లో చనిపోయారు. చనిపోక ముందు కూడా అదే సంవత్సరంలో రామినేని ఫౌండేషన్ వాళ్ళ సత్కారం, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారి సిటిజన్ అవార్డు కూడా భీమన్నను వరించాయి. ఇవన్నీ భీమన్న స్వయంగా హాజరై స్వహస్తాలతో తనే స్వీకరించాడు.

అదే సమయంలో డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఏర్పాటు చేసినటువంటి లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు కూడా అనౌన్స్‌మెంట్ జరిగింది. కానీ, ఈయన అందుకునే స్థితిలో లేడు. ఎందుకంటే 2005 డిసెంబర్‌లో ఆయన చనిపోయాడు. 2006 జనవరిలో ఈ అవార్డు ఇవ్వడం జరిగింది.

ఇంక ఈ అవార్డుకి నేను 2006 జనవరిలో పిల్లల్ని తీసుకుని వైజాగ్ వెళ్లి ఆ అవార్డు స్వీకరించాను. అక్కడి నుంచి పిల్లలతో సరదాగా రెండు మూడు రోజులు విశాఖపట్నంలోనే పిల్లలకన్నీ చూపించి మళ్ళా తిరిగి హైదరాబాద్ రావడం జరిగింది.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న సాహిత్యం సమసమాజ స్థాపన

– ఆచార్య కె. కృష్ణమూర్తి
తెలుగుశాఖ అధ్యక్షులు
ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మహబూబ్ నగర్

ఉపోద్ఘాతం

"ఒక చేతితో సంపాదిస్తూ, రెండో చేతితో విద్యలకోసం ఖర్చు పెట్టేవాడే నిజమయిన ధనవంతుడు" అంటూ ధర్మం కోసం పోరాటంలో నిలబడ్డ భీమన్న సామాజిక ఆర్తిని, అశాంతిని జీవద్భాషలో వెలువరించిన మహానుభావుడు. జీవితపు వాస్తవ లోతుల్ని తరిచి చూసినవాడు. స్వీయ అనుభవాలతో మానవ అంతర్వేదనలను ఛేదించుకోగల శక్తి గలవాడు. ఒకడు తింటూ మరొకడు పస్తు ఉండడం ధర్మం కాదనీ, ప్రతి ఒక్కరికి కూడు, గుడ్డ, నీడ కనీస అవసరాలనీ ధనికులు, పేదలు అనే తారతమ్యం లేకుండా సమాజాన్ని నిర్మించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలనే అభ్యుదయంతో విశ్వమానవతను చాటినవాడు బోయి భీమన్న.

కీలకమైన పదాలు

భారతజాతి, మనిషి జన్మహక్కు, ఆత్మజ్ఞానం, సమసమాజం, వేదజ్ఞానం, కులమతాలు, సంప్రదాయం.

పరిశోధన ప్రారంభం

భీమన్నగారు సమాజం పట్ల గౌరవం, అసమానతల పట్ల తిరస్కార భావాలు కలవాడు. కవిగా ఊహించి, భావకుడిగా భావించి, సర్వమానవ సమానత్వాన్ని అభిలషించాడు. డబ్బు, చదువు, ధైర్యం ఉంటే కులంతో పని ఉండదని, గౌరవ మర్యాదలు వాటంతకవే లభిస్తాయని నమ్మినాడు. అందరూ అభ్యుదయం వైపు నడవాలని ఆశించాడు.

కవి అనేవాడు సమాజాన్ని జాగృతపరచాలి, అందుకే "కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు" అంటారు. తెలుగు సాహిత్యం అంబరమైతే భీమన్న విహరించని ఎత్తులు లేవు, సంద్రమైతే ఆయన మధించని లోతులు లేవని చెప్పొచ్చు.

సామాజిక అసమానతలు, కుల, మత, లింగ, వర్గ, వివక్షతలు, సామాన్యుల అణిచివేతలాంటి అంశాలతో కూడిన ఇతివృత్తాలుగా తన రచనల్లో దృశ్యమానమయ్యాయి. భీమన్న రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా భారతజాతి ఏకత్వం కనిపిస్తుంది. కుల మతాల కంటే మానవత్వాన్ని ఆశించిన జాతీయవాది భీమన్న. జాతీయతతో పుట్టి పెరిగి, దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూ, ఆత్మ గౌరవంతో జీవించాలనే ఆకాంక్షతో ఉండాలని బోధించాడు.

"జన్మానాం జాయతే కర్మణేని బ్రాహ్మణఃు" బ్రాహ్మణత్వం విద్యవల్ల, తపస్సు వల్ల వస్తుందనేది భీమన్న విశ్వాసం. సమాజంలో కొంతమంది స్వార్థపరులు సృష్టించిన నమ్మకాన్ని వమ్ము చేయాలని, అర్థంలేని ఆచారాల్ని కూకటి వేళ్ళతో పెకలించాలని, అందరూ ఆత్మగౌరవంతో బ్రతకాలని ప్రబోధించాడు.

భారత జాతికి కవులు ముగ్గురు వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు. త్రేతా యుగానికి వాల్మీకి, ద్వాపర యుగానికి వ్యాసుడు, కలియుగానికి కాళిదాసు. ఈ ముగ్గురు గిరిజన, హరిజన, బహుజన కులాలకు చెందినవారే. అటువంటప్పుడు వారి వారసులు వారసత్వం కాపాడుకోవాలంటాడు. అందుకే మతమార్పిడి వద్దన్నారు. మతం మారాల్సిన అవసరమేముంది, మత మార్పిడులపై కూడా ఆయన చాలా దృఢంగా, బలంగా స్పందించారు.

బలము కలవాడు పులి
తెలివిగలవాడు నక్క
ఈ ఇరువర్గాలకు ఆహారంగా
బ్రతుకుతున్న మూర్ఖులు గొర్రెలు
కర్మ సూత్రం పై విశ్వాసం
చచ్చిన అవతారాల పట్ల భక్తి
పులికి పాద సేవ, నక్కకు దాసోహం
గొర్రెలకు మోక్షమార్గాలు

అట్లాగే బోయి భీమన్న ఆత్మగౌరవ ప్రతీకగా కింది మాటలనే ఉదహరించవచ్చు.

నాకు తిండి దొరక్కపోతే
నేను పస్తులు ఉండను
ఉపవాసాలు చేస్తాను.
నాకు పేదరికం లేదు
నాకు బట్టలు దొరక్కపోతే
నేను చింకి పాత బట్టలు కట్టను

దిగంబరోద్యమం చేస్తాను
నాకు పేదరికం లేదు

అంటూ భీమన్న తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి జీవించాడు. ప్రతి వ్యక్తి ఆత్మగౌరవంతో జీవించడం నేర్చుకోవాలంటాడు. భీమన్న ఆచరించినవే చెప్పాడు.

నాకు రాజకీయాలు లేవు
ఏ ఇజంతోనూ నాకు పొత్తు లేదు
నేను పదవులు ఇచ్చే నాయకున్నో
మార్కులు ఇచ్చే ఆచార్యున్నో కాదు
నేనొక మామూలు తోటమాలిని
నీకు నచ్చిన పూలుంటే కోసుకుంటూ ఉండు
ఇష్టమైతే ఇక్కడే ఉండు

గ్రామ దేవతల నుండి బాబాల దాకా, చిత్తం పూజల మీద, ప్రజల మీద కాదు, టీచర్ల నుంచి ప్రొఫెసర్ల దాకా, దృష్టి జీతం మీదే, చేత మీద కాదు అంటాడు.

1980లో వెలువడిన 'జన్మాంతర వైరం' గ్రంథంలో సమసమాజ స్థాపనార్థం అనేక విషయాలు చర్చించాడు. అందులో మత మార్పిడిపై వారి అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. వారి మాటల్లో "నేను హిందువుగా పుట్టాను మతం మార్చవలసిన అవసరం లేదు. పెనంలో నుండి పొయ్యిలోకి దూకటం దేనికి. ఈ హిందూ మత మూలపురుషులు ఈ భారత సంస్కృతి మూలపురుషులు నా వాళ్ళు, నా హరిజనులు అని నేను విశ్వసిస్తున్నప్పుడు నా వారసత్వ హక్కుల్ని ఏదో విధంగా తిరిగి సంపాదిస్తానే కానీ పారిపోవడం అనేది ఎందుకుంటుంది? మెజార్టీ జనం వాన్ని మైనార్టీగా ఎందుకు మారుతాను? కాగా నేను హిందువుని, ఈ జాతి, ఈ దేశము నావి. పోనీ నేనొక్కడినే మరో మతంలోకి పారిపోతాను అనుకోండి, నాతో కొంతమందిని తీసుకుపోతాను అనుకోండి. ఎంతమందిని తీసుకుపోగలను లక్షా, రెండులక్షలా? వాళ్ళైనా నామీద గౌరవంతో వస్తారు. అవతలి మతంలో విశ్వాసంతో కాదు" అన్న అభిప్రాయాన్ని జన్మాంతర వైరం కావ్యంలో వివరించాడు.

అక్షరాలే ఆయుధంగా అనుక్షణం ఉద్యమించిన వేద విద్యాభిలాషి భీమన్న. వీరు వేదాల ప్రామాణికతను అంగీకరించారు. గో బ్యాక్ టూ వేదాస్ 'వేదాలవైపు మళ్ళండి' అనే వీరు వేద సంస్కృతిలోని సత్యాన్ని గ్రహించారు. దాన్ని గౌరవించారు. కానీ అందులోని మూఢాచారాలను ఖండించారు. అందులో భాగంగా వైదిక సంప్రదాయంలో ఉన్న గురు పరంపరను అంగీకరించలేదు. మనిషి తరించడానికి, మోక్ష సిద్ధికి, గురుముఖతః దీక్ష, సాధన చేయాలనే సంప్రదాయాన్ని ఒప్పుకోలేదు.

"గురువులేని విద్య గుడ్డి విద్యను మాట
పరమవిద్య పట్ల పనికిరాదు,

ఎవని పరము వాని ఇష్టార్థసిద్ధియే
ముక్తి ఎవనికేని వ్యక్తిగతము"

అంటూ సంకుచిత మనసుతో ఉండే గురువుల ప్రమేయం అనవసరం అంటాడు.

విద్య ప్రతి మనిషికి జన్మహక్కు. భౌతిక జీవితంలో నిద్రాహారాలు ఎంత వాస్తవమో అంతరంగ జీవితానికి ఆత్మజ్ఞానం కూడా అంతే. బుద్ధి చేతనే మానవ సమస్యలను పరిష్కరించుకోగలం. అది వ్యక్తిగతమే కానీ సమాజ గతం కాదు. వ్యక్తి పరంగా సమాజాన్ని సంస్కరించగలం మలుచుకోగలం కానీ సామాజిక సూత్రాల ద్వారా అనుకూల సమాజం, సమసమాజం ఏర్పడదనేది భీమన్న ఆలోచన విధానం.

భౌతిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ లేని దుర్దశకు మనిషి చేరడం ఆక్షేపమన్నారు. ప్రతి విషయంలో తీవ్రతతో కూడిన ఒక ఆదర్శం, అంతరార్థం ఉండాలంటూ... భీమన్న వేదాంత ధోరణి, ఆయన మాటలనే ఉదహరించటం సమంజసం.

"పరమాత్మకు పదార్థ రూపం మెదడే అని నా ఉద్దేశం. మెదడు మానవుడిలో బాగా వికసించింది. ఇంకా అనేక రెట్లు వికసించవలసి ఉంది. దాని వికాసం ఏ స్థాయి అందుకోవాలంటే దాని మూలమైన పరబ్రహ్మ స్థాయిని అందుకోవాలి. అంటే మెదడు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ పరబ్రహ్మ అయిపోవాలి" అంటూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

భీమన్న సంప్రదాయ, ఆధునిక, అభ్యుదయ మార్గాల సమన్వయకర్తగా దర్శనమిస్తాడు. ప్రతి జాతికి, దేశానికి ఒక జీవన శైలి ఉంటుంది. భారతదేశం ఆధ్యాత్మిక దేశం. భారతదేశంలో సామాజిక సమతను సాధించడానికి ఆధ్యాత్మిక సామ్యవాదాన్ని సాధించే ప్రయత్నం చేయాలంటాడు.

మనిషికి మనిషికి నడుమ ఉండే అంతరాన్ని తొలగించడానికి, శ్రమ ఫలాన్ని దోచుకునే తత్వాన్ని పోగొట్టుకోవడానికి, పేదవాని మెదడులో వేద జ్ఞానం నిండాలని కోరుకున్నారు. కులమతాలు రూపుమాపి, ఏకైక భారతజాతిని తయారుచేసి, రాజకీయ ఆర్థిక సమానత్వం సాధించడమే తన ఆశయంగా ఎన్నో కవితలు రాశారు.

ఈ దేశంలో మతం మారినంత మాత్రాన వెతలు తీరిపోవు అంటారు.

గుడిని మార్చినంతనే దే
వుడు మారిపోవునా
దొరకు పేరు మారినా
భక్తునికి భజన తప్పునా

అంటూ మతమేదైనా, గతమేదైనా మనోబలం లేక మనిషి తరించలేడని, సర్వ మతాల సారము ఒక్కటేనని, ప్రేమతత్వమే దాని పరమావధి అన్నది భీమన్న అభిమతం.

"ఏది హిందూ? ఏది ముస్లిం? ఏది క్రైస్తవము? ఎల్ల మతముల సారమొకటే, కృష్ణుడు, క్రీస్తు, మొహమదో– గీత, బైబిల్, ఖురాను ప్రేమనే బోధించలేదా ద్వేషమును నిరసించె కదా! అంటాడు

భీమన్న.

"తూర్పు పడమర భేదమేల? తోటకెల్ల వసంతుడొక్కడే కరములె వారెటు మోడ్చి పిలిచిన ఖంగుమను గుడి గంట ఒకటే". ఏ మతమైనా, ఏ దేవుడైనా, ఏ విధంగా ఆరాధించినా అవన్నీ ప్రేమనే బోధిస్తున్నాయి, ద్వేషాన్ని నిరసిస్తున్నాయంటూ సర్వమత సౌభ్రాతృత్వాన్ని ప్రేమించాడు ఆశించాడు భీమన్న.

భారతదేశ వాసులు వారసత్వపరంగా ఏకోదరులే, ఏకజాతీయులే, ఏకమతస్తులే. దేశంలో ఇతర మతాల వారి ఆగమనానికి పూర్వం అందరం హిందువులమే అన్నది భీమన్న భావన. జాతి రీత్యా మనమందరము ఒక్కటే. మతాలు మార్చుకోగలిగినవి. జాతి శాశ్వతమైనది.

మనమంతా మౌలికంగా ఒకే జాతికి చెందిన వాళ్ళం. విదేశీయులు మన దేశానికి రాకముందువరకు భారతీయులంతా ఏదోఒక కులానికి చెందిన హిందువులే. కనుక మతానికి కాక మానవత్వానికి ప్రాధాన్యం ఇవ్వండి. విదేశీ సంప్రదాయాలను తగ్గించుకొని స్వదేశీ ప్రజా జీవనసరళిలో కలిసి నడవండంటూ సర్వజనహితాన్ని ప్రకటించాడు భీమన్న.

విశ్వాసం ఊహాభయజనితం
విజ్ఞానం వాస్తవా అభ్యుదయం
మతాచారములకు మంత్రాంగం స్వార్థం
స్వార్థాలకు మూలం అవిశ్వాసం
సైతానుకు దాసోహం
దైవం పై విశ్వాసం గలవాడు
ధనములనెందుకు దోచుకుంటాడు?
అంటూ మతపెద్దల మనస్తత్వం బహిరంగపరిచాడు.

మతమౌఢ్యం తొలగించుకోకపోతే జాతీయ సమైక్యత సాధ్యం కాదంటారు బోయిభీమన్న.

అందులో భాగంగానే భీమన్న గారు ఇదే 'జన్మాంతర వైరం' పుస్తకంలో సగటు మనిషిలోని సామాజికపరమైన సందేహాలకు సరైన సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. ప్రధానంగా బ్రాహ్మణులు, అగ్రవర్ణాల వారు, దళితుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుని ఖండించారు. వివక్ష ఏవిధంగా సమంజసమో ఆలోచించుకునేలా చేశారు. కులం తాలూకు కుళ్లును, మనుషుల్లో నాటుకున్న మూఢనమ్మకాన్ని వమ్ము చేసే ప్రయత్నం చేశారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా తీసుకొని, కొన్ని అగ్రవర్ణాల సంకుచిత అభిప్రాయాలను తూర్పారబట్టారు. దళితులను శ్రమించేవారుగా, ఉత్పత్తి కులాలకు చెందినవారుగా అభివర్ణించారు.

ముగింపు

సమాజంలోని వాళ్లంతా చెడ్డవాళ్లే కాదని, మంచివాళ్లు ఉంటారనే ఒక విశిష్ట ఆశావాద దృక్పథం భీమన్నది. ఒక వ్యక్తి జీవితంలోని అనేక ఘట్టాలను, జ్ఞాపకాలను నిక్షిప్తం చేస్తూ జీవిత చరిత్ర

రాయటం ఒకటి. అదే వ్యక్తి జీవితంలోని లిఖితపూర్వక మౌఖిక విషయాల్ని వ్యాఖ్యానంచేస్తూ మరొకరు ఆ వ్యక్తి జీవిత చరిత్రను రాయడం మరొకటి. భీమన్న తన ఆత్మకథను తాను రాసుకోలేదు. తన ప్రతి రచన తన ఆత్మకథ గానే చెప్పుకున్నారు. శ్రీమతి హైమవతీ భీమన్న గారు పాలేరు నుండి పద్మశ్రీ వరకు అన్న రచనలో భీమన్న గారి జీవిత చరిత్రను అక్షరబద్ధం చేశారు.

ఆధార గ్రంథ సూచిక :

1. భీమన్న, బోయి. గుడిసెలు కాలిపోతున్నై, ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, 1977.
2. భీమన్న, బోయి. పాలేరు (నాటకం), దేశికవితామండలి, 1946.
3. వెంకటేశ్వరరావు, దార్ల. జాతీయ కవి బోయి భీమన్న, సూర్య దినపత్రిక సాహిత్య అనుబంధం, 2011.
4. హైమవతీ. పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, జీవిత చరిత్ర.
5. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు, హైదరాబాద్, 2010.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

అభినవ వ్యాసుడు మహాకవి బోయి భీమన్న

– డా. కోయికోటేశ్వరరావు
కీలకోపన్యాసం,
సెల్ : 9440480274

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని నవనవోన్మేషంగా తేజోవంతం చేసిన సృజన భాస్కరుడు డాక్టర్ బోయి భీమన్న. అనునిత్యం "స్వతంత్ర విప్లవజ్వాల"గా ప్రభాసించిన మహాకవి భీమన్న. ప్రగాఢమైన, వైవిధ్యభరితమైన తన రచనలతో సామాజిక పునర్నిర్మాణానికి వినూతనతాత్త్విక చైతన్యాన్ని అందించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్, కుమరన్ ఆశన్, ముల్క్ రాజ్ ఆనంద్ తదితర కవుల్లాగా భీమన్న కూడా జాతీయ కవి. ఆంధ్ర మహాసభ నుండి దళిత మహాసభ వరకు సాగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ ఉద్యమాల ఎరుకతో ఆయన తనదైన విలక్షణ సాహిత్య దర్శనాన్ని ఆవిష్కరించాడు.

శ్రీ బోయి భీమన్న నవ్యాంధ్ర కవులలో గణనీయమైన స్థాయిని సంపాదించుకున్నారు. 'ప్రగతీ సముద్దీపనాటకకర్తగా' 'రసాద్వైత తత్త్వ నిర్మాతగా' సాహిత్యంలో ప్రఖ్యాతిగాంచాడు. మాధుర్యము వీరి రచనల ప్రత్యేక విశిష్టత. శ్రీ భీమన్న ఉచ్చశ్రేణికి చెందిన యశస్కాములగు మధురకవి" (పాలేరు నుండి పద్మశ్రీవరకు) బూర్గుల రామకృష్ణారావు అన్న మాటల్లో భీమన్న అసమాన కర్తృత్వ గరిమ అవగతమవుతుంది.

"కుల, మత, వర్గ విభేద రహితమైన భారతజాతి ఆవిర్భవించాలనేదే నా ధ్యేయం" అంటూ ప్రకటించి, ఈ మహోన్నత ధ్యేయ సాధన కోసం ఏడున్నర దశాబ్దాల తన సాహిత్యాన్ని అంకితం చేసిన భీమన్న పద్మశ్రీగా, కళాప్రపూర్ణగా, పద్మభూషణుడిగా కవి పండితుల మన్ననలు అందుకున్నాడు. ఒక మహావృక్షం పరిసరాల చుట్టూ తన మూలాలను విస్తరింపజేసినట్లు భీమన్న నాటకం, నాటిక, పద్యకవిత్వం, వచన కవిత్వం, గేయకవిత్వం, విమర్శ, పరిశోధన, లేఖా రచన, అనువాదం తదితర ప్రక్రియల్లో ప్రామాణికమైన రచనలు చేసి ఆధునిక తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేశాడు.

"సరస వాక్యమ్మె కావ్యమై వరలు నేని
కవిత నా దొక్క టొక మహా కావ్యమగును
వేల కవితల తోటమాలి నేను"

అని సగర్వంగా ప్రకటించిన భీమన్న తెలుగు సాహిత్య నందనోద్యాన వనంలో పరిమళభరితమైన కావ్యసుమాలు పూయించాడు. ప్రారంభ దశలో మంగిపూడి వెంకటశర్మ, కుసుమ ధర్మన్న, గుర్రం జాషువ కవుల సృజన స్ఫూర్తితో ముందుకు నడిచాడు.

తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో పుల్లయ్య, నాగమ్మ దంపతులకు 1911 సం. సెప్టెంబర్ 19న డాక్టర్ బోయి భీమన్న జన్మించాడు. పేద దళిత కుటుంబానికి చెందిన భీమన్న, అంటరానితనం రగిలించిన పెనుమంటల్లో, పేదరికం రాజేసిన ఆకలి మంటల్లో కరిగి ఒక తాత్త్విక ఆయుధంగా పదునెక్కి, సామాజిక దుర్నీతిని ఖండించాడు. పంట పొలాల్లో తండ్రి పాడే వేదాంత తత్త్వగీతాలను ఆలకిస్తూ, తల్లి మధుర గాత్రంలో నుండి జాలువారే ఏలపాటల్లో, తుమ్మెద పాటల్లో మునిగి తేలుతూ, "కోమలారామ సీమ కోనసీమ" పచ్చని మైదానాల్లో విహరిస్తూ, ప్రకృతి అందచందాలకు పరవశిస్తూ తదనుగుణమైన శైశవానుభూతులతో భీమన్న మౌలిక వేదాంత చింతనాపరుడిగా, సౌందర్యోపాసకుడిగా, ప్రేమతత్వారాధకుడిగా రూపుదిద్దుకున్నాడు.

జాతీయోద్యమ నేపథ్యం, కాకినాడ పి.ఆర్. కళాశాల వాతావరణం, వృక్షశాస్త్ర అధ్యాపకుడు గోరా భావజాల స్ఫూర్తి, బ్రహ్మసమాజ ఆశయాల ప్రేరణ, దివ్యజ్ఞాన సమాజ నాయకులు తాడిమేటి కుటుంబ శాస్త్రి, హరిజన నాయకులు ఈలివాడవల్లి, పాములరామమూర్తి, భాగ్యరెడ్డి వర్మ, తాపీ ధర్మారావు మొదలగు వారి పరిచయంతో భీమన్న ప్రాపంచిక జ్ఞానాన్ని, సామాజిక చైతన్యాన్ని సమకూర్చుకున్నాడు. కొంతకాలం పాత్రికేయుడిగా, ఉపాధ్యాయుడిగా, ప్రభుత్వ అనువాద శాఖ సంచాలకులుగా, శాసన మండలి సభ్యులుగా భీమన్న వివిధ హోదాల్లో విశేషమైన సేవలందించాడు. మద్రాస్‌లో జనవాణి, ప్రజామిత్ర వంటి పత్రికల్లో ఉపసంపాదకుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు. కుసుమ ధర్మన్న స్థాపించిన జయభేరి, బి.యస్. మూర్తి ప్రారంభించిన నవజీవన్ పత్రికలకు సంపాదకుడిగా వాటి రూపకల్పనలో, నిర్వహణలో కీలకంగా వ్యవహరించాడు. సుప్రసిద్ధ దినపత్రిక ఆంధ్రప్రభకు ఉపసంపాదకుడిగా ఐదు సంవత్సరాల పాటు విధులు నిర్వహించాడు.

భీమన్న స్వతంత్రమైన సృజనశీలి. స్థిరపడిన సాహిత్య మార్గంలో నడిచిపోవడం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదు. బారెడు దూరమైనా బాటలో నడిచే నైజం కాదు భీమన్నది. క్రోసెడు దూరమైనా కొత్త బాట వేయాలనేది ఆయన తత్త్వం. అందుకే వస్తు రూపాల్లో, దృక్పథంలో ఎంతో సాహసోపేతంగా స్వతంత్ర విప్లవ నైజాన్ని ప్రదర్శించి ప్రయోగవాదిగా, సిద్ధాంతకర్తగా భీమన్న విమర్శకుల ప్రశంసలందుకున్నాడు. అద్వైతం, విశిష్టాద్వైతాలకు భిన్నంగా రసాద్వైతాన్ని సోషలిజానికి ప్రతిగా, "శివ సోషలిజాన్ని" వర్ణ, వర్గ వ్యవస్థలకు బదులుగా "వన్య వ్యవస్థ"లను ప్రతిపాదించి, సూక్ష్మ వివేచనతో నిర్వచించి తన రచనల ద్వారా వాటిని సమర్థవంతంగా ప్రచారం చేశాడు భీమన్న.

మినీ కవితకు ప్రత్యామ్నాయంగా టుమ్రీలు, త్రిపదులు, మాట వెలదులు, భీమన్న చాటువులు వంటి లఘు కవితా రూపాలను సృజించి అపరిమితమైన ప్రణయ తత్వాన్ని అక్షరబద్ధం చేశాడు. ఆరు

ఋతువుల కాల పరిమితులను దాటి "దిసెవెంత్ సీజన్" అనే ప్రేమాన్వితమైన ఏడో ఋతువును రచనల్లో సృష్టించాడు. 'జానపదుని జాబులు' అనే రచనతో భీమన్న తన సాహిత్య ప్రస్థానాన్ని ప్రారంభించాడు. తెలుగులో లేఖా రచనా శైలిలో ఉత్తమ కావ్యాలు రచించిన భీమన్న సంకీర్ణ ప్రక్రియాత్మకమైన ఫణితిలో సృజన సాగించాడు. 'శివాలకులు' అనే కవితా సంపుటి ద్వారా ప్రేయసీ ప్రియుల మధ్య నడిచే ప్రేమలేఖల తీరుతెన్నులను విలక్షణంగా కవిత్వీకరించాడు. "రాగ వైశాఖి" అనే శృంగార లేఖా కావ్యంతో తెలుగు కవిత్వానికి గొప్ప వైవిధ్యాన్ని సమకూర్చాడు. భారత దేశంలో ప్రగతికి పెను అవరోధంగా మారిన మూఢాచారాల ముళ్లను నరికి వేస్తూ, భావ విప్లవానికి బాటలు వేస్తూ నవ సమాజ నిర్మాణానికి నాంది పలికిన రమణీయ కావ్యం 'రాగ వైశాఖి'. కొంత మంది ఈ రచన చుట్టూ ఒక పెద్ద వివాదాల తుఫాన్ సృష్టించారు. అందుకే నాటి శాసన సభలో కూడా ఈ కావ్యానికి సంబంధించిన సాహిత్య చర్చలు జరిగాయి.

బ్రిటీష్ వలసవాద పాలనలో జాతీయోద్యమ కాల ధర్మంతో ఆనాటి ప్రఖ్యాత కవులందరూ భారతదేశ పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రాభవాలను కీర్తిస్తుంటే, అందుకు విభిన్నంగా భీమన్న భారతదేశ ఆధ్యాత్మిక, పౌరాణిక, సాంస్కృతిక వారసత్వానికి పునాదులు నిర్మించింది దళితులేనని తన కృతుల ద్వారా సాధికారికంగా నిరూపించడంలో విశేషమైన కృషి చేశాడు. సామాజిక దృష్టితో పౌరాణిక గాథలను ఆధునీకరించాడు. ఈ రకమైన ఎరుకతో 'ఆదికవి వాల్మీకి', 'ధర్మవ్యాధుడు', 'వేదవ్యాసుడు', 'రాగ వాసిష్ఠం', 'జగత్ సత్యం బ్రహ్మమిథ్య' వంటి పౌరాణిక నాటకాలు రచించాడు. బౌద్ధ కథ నేపథ్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్లంలో రాసిన చాండాలిక నాటకాన్ని స్వతంత్రంగా తెలుగులో అనువదించి బుద్ధుని సమతా సందేశాన్ని, సాంఘిక సమానత్వాన్ని ప్రబోధించాడు. జాతీయోద్యమ ఆశయాలను, హరిజనోద్యమ భావధారను తన రచనల్లో అద్భుతంగా ఆవిష్కరించాడు.

నవ్య సంప్రదాయ కవులకు అసలు సిసలైన భారతీయ వారసత్వాన్ని, ఆదిభారతీయుల, మూలవాసుల విశిష్టతను తేటతెల్లం చేశాడు. అరుంధతీ, వశిష్ఠుల కళ్యాణ చరిత్రను భీమన్న పునర్వ్యాఖ్యానించాడు. ఆర్య, ద్రావిడ జాతుల ఆవిర్భావ వికాసాన్ని పునర్మూల్యాంకనం చేశాడు. పాలేరు, కూలిరాజు నాటకాల ద్వారా దళితుల్లో విద్యా చైతన్యాన్ని, రాజ్యాధికార భావనను పెంపొందింప జేయటంలో భీమన్న చారిత్రాత్మకమైన పాత్ర పోషించాడు. ఆంధ్రదేశంలో కొన్ని వేల సార్లు ప్రదర్శింపబడిన పాలేరు నాటకాన్ని దర్శించి వ్యవసాయ కూలీలుగా బతుకులీడుస్తున్న వందలాది మంది దళితులు చదువుకొని కలెక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఎదిగిన ఉదాహరణలెన్నో ఉన్నాయి. కాకి మాధవరావు వంటివారు "నేను రిటైర్డ్ చీఫ్ సెక్రటరీని మాత్రమే కాదు, నేను పాలేరు వెంకన్నను" అని గర్వంగా చెప్పుకుంటాను అంటూ ఒక సభలో పేర్కొనటం పాలేరు నాటకం గొప్పతనానికి నిదర్శనం. సామాజిక ప్రభావం కొలమానంగా భావించి విలువ కట్టినపుడు కన్యాశుల్కం నాటకం కంటే పాలేరు ఉన్నతమైన, ప్రయోజనవంతమైన నాటకమని ఖచ్చితంగా విశ్లేషించవచ్చు.

సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో భీమన్న రచనలు చేసినప్పటికీ పద్య కావ్యాలు అంటే మక్కువ ఎక్కువ. భీమన్న పద్యకావ్యాలు తెలుగు సాహిత్యంలో విశిష్టమైనవి. మధుబాల, మధుగీత,

కావ్యసుమాలు, మణిమానసం, భీమన్న శంఖారావం, పంచమస్వరం, బాలయోగీయం వంటి అపురూపమైన కావ్యాలు రచించి, పద్యకవిత్వానికి వస్తు, రూప వైవిధ్యాన్ని చేకూర్చాడు. భీమన్న కృతుల్లో దీపసభ ఒక గొప్ప ప్రయోగాత్మకమైన మహాకావ్యం.

"ఏ పరం జ్యోతినో వెలిగి
విధులు నెరవేర్చు చిన్న దివ్వెలము మనము
దీపికా నిన్ను నన్నొక వాపి ముంచు
అంధకారము పై దండయాత్ర నాది (దీపసభ)"

అంటూ అక్షర దీపాలతో ఆధునిక తెలుగు కావ్య జగతిని వెలిగించాడు.

మంజరీ ద్విపదలో 'ప్రకృతిలో మానవ ప్రకృతి' అనే ప్రణయ కావ్యాన్ని అమలిన ప్రేమ తత్వాన్ని రచనలో చిత్రించాడు. "ఏక పద్యోపాఖ్యానం" పేరుతో తాను రాసిన ఒక్క పద్యానికి విస్తృతమైన వ్యాఖ్యానం రాశాడు. ఇలాంటి రచన తెలుగు సాహిత్యంలో మృగ్యం. హాస్య, వ్యంగ్య శైలిలో ఆయన రచించిన పిల్లి శతకం ఆధునిక శతక సాహిత్యంలో ప్రత్యేకమైనది. పద్యకవిత్వంతో పాటు వచన కవిత్వంలో కూడా భీమన్న సముచితంగా తన ప్రతిభను చాటుకున్నాడు. గుడిసెలు కాలిపోతున్నై, గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, అనాది కొస నుండి అనంతత్వంలోకి, మోక్షం నా జన్మ హక్కు, కుక్క మొరుగుతూనే ఉంది వంటి విలక్షణమైన సామాజిక చేతనతో కూడిన వచన కవితా సంపుటాలను వెలువరించాడు.

మానవుని మరొక మజిలీ, అకాండ తాండవం వంటి రచనలతో గేయ కవిత్వానికి భీమన్న కొత్త నడకలు నేర్పాడు. పైరు పాట, బొమ్మ తదితర గేయకావ్యాలను రాశాడు. సందేశాత్మకమైన, ప్రణయ భావ విలసితమైన, జీవన తాత్విక భరితమైన ఎన్నో లలితా గీతాలు రచించి ఆకాశవాణి శ్రోతల మనసులకు విందు చేశాడు. దేశభక్తి, జాతీయ సమైక్యత, మత సామరస్యాన్ని వంటి ప్రగతిదాయకమైన అనేక అంశాలను కళా తత్వ స్ఫోరకంగా అక్షరబద్ధం చేశాడు.

తల్లి రక్తం బిడ్డలో ప్రవహించినంత సహజంగా బతుకు తత్వం రచనల్లో అనివార్యంగా ప్రతిఫలిస్తుంది. దళిత స్పృహ ప్రారంభం నుండి భీమన్న కావ్యాల్లో స్పష్టంగా దర్శనమిస్తుంది. 1968 డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ "ఎన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్" అనే గ్రంథాన్ని కుల నిర్మూలన పేరుతో అనువదించాడు. ఈ గ్రంథ అనువాదం తరువాత భీమన్న సాహిత్య ప్రస్థానంలో ఒక గుణాత్మకమైన మార్పు కనిపిస్తుంది. గాంధీ భావజాల పరిమితులను దాటి భీమన్న అంబేద్కర్ తాత్విక దృక్పథం వైపు పయనించాడు. 'ధర్మం కోసం పోరాటం' వచన గ్రంథం అంబేద్కర్ సిద్ధాంతాలకు అక్షర దర్పణంగా, దళిత మేనిఫెస్టోలాగా కనబడుతుంది. దళితుల ఐక్యత, దళిత సంక్షేమం, దళిత హక్కులు, కుల నిర్మూలన గురించి సర్వత్రా చర్చలు జరుగుతున్న ఈనాటి సందర్భంలో ఈ అంశాల పూర్వాపరాలను యాభై సంవత్సరాల క్రితమే ధర్మం కోసం పోరాటం గ్రంథంలో భీమన్న విస్తృతంగా చర్చించాడు.

కుల సమస్య తీవ్రత, దళితుల స్వీయ ఉద్ధరణ, వర్గ కుల పోరాటాల వైఖరి, సాంస్కృతిక చైతన్యం, సంస్కరణ ఉద్యమాల వైఫల్యం, ప్రభుత్వ మార్కు సంక్షేమం, ప్రజాస్వామిక సోషలిజం వంటి

అంశాలను ఈ గ్రంథంలో భీమన్న శాస్త్రీయంగా విశ్లేషించాడు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లక్ష్యాలను, ఆ మహనీయుడు ప్రతిపాదించిన రాజకీయ, సాంస్కృతిక విలువలను సామాన్య ప్రజలకు తేటతెల్లంగా చెప్పవలసి ఉంది అని భీమన్న బలంగా విశ్వసించాడు. అందుకే ఆయన బాబాసాహెబ్ బహుముఖీన ఔన్నత్యాన్ని తన రచనల ద్వారా ప్రామాణికంగా ప్రపంచానికి చాటి చెప్పాడు.

'గొంతెత్తి నీ పాట పలికింతునా / గంతేసి నీ బాట నడిపింతునా' అంటూ తన రచనల ద్వారా అంబేద్కర్‌కి నీరాజనాలు పలికాడు. అంబేద్కర్ విశ్వరూపం భీమన్న కవిత్వంలో సాక్షాత్కరిస్తుంది. అంబేద్కర్ ఆంధ్రదేశ పర్యటన సందర్భంగా (1944లో జరిగిన సభలో) డా. బోయి భీమన్న అంబేద్కర్ గురించి ఆంగ్లంలో కవిత చదివి ఆ మహనీయుని ప్రశంసలు అందుకున్నాడు. కలకత్తా నుండి వెలువడే పీపుల్స్ హెరాల్డ్ పత్రిక భీమన్న కవితను సంపాదకీయంగా ప్రచురించింది. సంప్రదాయ వాదులు పదే పదే చెప్పే ధర్మం అనే మాటకు ఆయన సరికొత్త నిర్వచనం చెప్పాడు. ధర్మం అంటే సర్వమానవ సమానత్వమే. అంబేద్కర్ అభిలషించిన సమతా మార్గాన్ని అనుసరించటమే ఈనాటి ఏకైక సాంఘిక ధర్మమని భీమన్న ప్రతిపాదించాడు.

"లంచం పుచ్చుకున్న లక్ష రూపాయిల కంటే ఒక్క తుపాకి బలమైనది. తుపాకులు పుచ్చుకున్న లక్ష మంది సైన్యం కంటే ఒక్క ఆటంబాంబు బలమైనది. లక్ష ఆటంబాంబుల కంటే కార్మికుని చెమట బొట్టు బలమైనది. లక్ష మంది కార్మికుల చెమట బొట్ల కంటే ఒక మార్క్స్ సిద్ధాంతం బలమైనది" (ధర్మం కోసం పోరాటం) అని విశ్లేషించి, మార్క్స్ కంటే మహాత్ముడి రాజనీతి, మహాత్ముడి రాజనీతి కంటే అంబేద్కర్ సమతా ధర్మం ఉన్నతమైనదని భీమన్న వాదించాడు. అంబేద్కర్ తాత్త్విక చైతన్యానికి జేజేలు పలికాడు. అంబేద్కర్ జీవిత ప్రస్థానాన్ని, ఆయన పోరాట నైజాన్ని, ఉద్యమ స్వభావాన్ని 'అంబేద్కర్ సుప్రభాతం' అనే పద్య కావ్యంలో ప్రభాశీలంగా ఆవిష్కరించాడు. అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని, ఆయన ప్రబోధాలను, ఆలోచనల సారాంశాన్ని వివేచిస్తూ వందకు పైగా పాటలు రచించి (పాటల్లో అంబేద్కర్) ప్రజల్లో భీమ చైతన్యాన్ని రగిలించాడు.

"జయ జయ అంబేద్కర / జయ దళిత జనస్వరా / జయ భారత భాస్కరా" అనే భీమన్న పాట ఆరు దశాబ్దాలుగా తెలుగు ప్రజల గుండెల్లో ప్రతిధ్వనిస్తుంది. "అడుక్కుంటే దొరికేది ఎంగిలి / అదిలిస్తే లభించేది అధికారం" అంటూ భీమన్న అంబేద్కర్ నిర్దేశించిన 'మాస్టర్ కీ' విశిష్టతను జాతి జనులకు చాటిచెప్పాడు. 'అంబేద్కరిజం', 'అంబేద్కర్ మతం' వంటి వచన రచనల్లో ఆ మహానాయకుడిని అనుసరించవలసిన ఆవశ్యకతను, ఆయన ఆశించిన సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్య దృష్టిని భీమన్న నిశితంగా విశదపరిచాడు.

'అంబేద్కర్ శరణం గచ్ఛామి' అంటూ భీమన్న ఈ యుగానికి ఒక నినాదాన్ని అందించాడు. అంబేద్కరిజానికి బద్ధ వ్యతిరేకమైన "గో బ్యాక్ టు వేదాస్" అంటూ భీమన్న సంచలనాత్మకమైన పిలుపునిచ్చాడు. వేద కాలంలో కులం లేదని, వృత్తి గతంగా మాత్రమే మనిషికి గుర్తింపు ఉండేదని భీమన్న నమ్మకం. ఇలాంటి వైరుధ్యాలు కూడా భీమన్న సాహిత్యంలో కనబడతాయి.

భీమన్న అత్యాధునిక సాహిత్య భీష్ముడు. కౌరవుల సార్వభౌమాధికారాన్ని అంగీకరిస్తూనే భీష్ముడు పాండవుల విజయాన్ని అభిలషించినట్లుగా భీమన్న కూడా వైదిక సమాజ వైభవాన్ని కొంతవరకు

ఆమోదిస్తూనే అంబేద్కర్ తాత్త్విక చైతన్యం భారతదేశంలో విస్తరించాలని ఆకాంక్షించాడు. కేవలం దళిత చైతన్యం దగ్గరే భీమన్న ఆగిపోకుండా మానవతా వాదం, ప్రేమ తత్వం, జాతీయ దృష్టి, ప్రగతిశీల దృష్టి వంటి విశ్వజనీన ఆలోచనలను కూడా భీమన్న అద్భుతంగా కవిత్వీకరించాడు. సామాజిక శాస్త్రవేత్తలా అనేక అంశాలను తన సాహిత్యంలో ప్రస్తావించాడు.

జాషువ, శ్రీశ్రీల సాహిత్య వ్యక్తిత్వాన్ని వివేచిస్తూ ఆయన వెలువరించిన గ్రంథాల్లోను, తన కావ్యాలకు రాసుకున్న సుదీర్ఘమైన విశ్లేషణాత్మకమైన స్వీయ పీఠికల్లో భీమన్న పరిణత విమర్శకునిగా కనిపిస్తాడు. శైవ వైష్ణవుల మధ్య రగులుతున్న మత వైషమ్యాలను నివారించడంకోసం తిక్కన హరిహరాద్వైతాన్ని సృష్టించినట్లుగా, మాల, మాదిగ అనే ఉపకుల నామాలకు ప్రత్యామ్నాయంగా భీమన్న 'మామాలు' అనే పదాన్ని ప్రతిపాదించి 'నేను మా మాల ఋషిని' అనే ఎంతో ఉదాత్తంగా తెలియజెప్పాడు.

లక్ష ఎకరాల పొలాన్ని దోసెడు నీళ్ళతో సాగు చేయటానికి ప్రయత్నించడం ఎలాంటిదో దళితుల ప్రగతికి నేడు జరుగుతున్న కృషి అలాంటిదని ఆయన విమర్శించాడు. భూమిని, వ్యవసాయాన్ని, పరిశ్రమలను జాతీయం చేస్తేనే భారతదేశంలో ప్రజాస్వామ్య సోషలిజం ఆవిర్భవిస్తుందని భీమన్న పిలుపునిచ్చాడు. **"విశ్వ పరిణామున జరిగే / విప్లవమ్ముల నేది ముందుకు పోవునో / అదే నాకు నిలయము"** అని చెప్పిన భీమన్న సంస్కృతిక విప్లవ ఋషి. జాషువ అన్నట్లు 'తళుకుల్ బెల్కులు గలుగు మేలైలుగు శబ్దశ్రేణితో ఆధునిక సాహిత్యానికి ప్రాణ చైతన్యాన్ని అందించాడు. ఆధునిక సాహిత్యంలో భీమన్న సాహిత్యం 'దీపసభ'లాగా కాలాన్ని కాంతిమంతం చేస్తుంది. అత్యంత స్ఫూర్తిదాయకమైన ఆయన సృజన కవిపండిత లోకానికి 'దారిదీపం'లా నిలుస్తుంది.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

రాగవాసిష్ఠం – నాటక వైశిష్ట్యం: జాతీయ సమైక్య దృక్పథం

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
పూర్వ శాఖ అధ్యక్షులు, తెలుగు శాఖ,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
సెల్ : 9989628049

పరిశోధన పత్రం సారాంశం (Abstract)

ఈ పరిశోధన పత్రం పద్మభూషణ్ బోయి భీమన్న గారు రచించిన 'రాగవాసిష్ఠం' (1959) నాటకంలోని సామాజిక, చారిత్రక, జాతీయ సమైక్యతా కోణాలను విశ్లేషిస్తుంది. పురాణ ప్రసిద్ధమైన అరుంధతీ–వసిష్ఠుల ప్రణయ గాథను ఇతివృత్తంగా తీసుకున్నప్పటికీ, దీని వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం భారతదేశంలోని కుల వివక్షను రూపుమాపడం, ఆర్య–అనార్య సిద్ధాంతాలలోని అపోహలను తొలగించడం. డా. బి.ఆర్. అంబేద్కర్ గారి సామాజిక సిద్ధాంతాల ప్రభావంతో భారతీయులందరూ ఒకే మూలార్య జాతికి చెందిన వారని, కుల భేదాలు కేవలం వృత్తిరీత్యా, స్వార్థపూరిత రాజకీయాల వల్ల ఏర్పడినవేనని ఈ నాటకం నిరూపిస్తుంది. నాటకంలోని పాత్రల విశ్లేషణ, పౌరాణిక ఇతివృత్తానికి జోడించిన అభ్యుదయ భావజాలం, రచయిత ప్రతిపాదించిన విశ్వజనీన మానవతావాదాన్ని ఈ వ్యాసం సవివరంగా చర్చిస్తుంది. కుల రహిత సమాజమే దేశ సమైక్యతకు పునాది అనే సత్యాన్ని ఈ నాటకం ఎలా చాటిచెప్పిందో ఈ పత్రం వివరిస్తుంది.

కీలకాంశాలు (Keywords)

రాగవాసిష్ఠం, ఆర్య–అనార్య సిద్ధాంతం, జాతీయ సమైక్యత, సామాజిక విప్లవం, అరుంధతీదేవి, వసిష్ఠుడు, మతంగ మహర్షి వంశం, బోయి భీమన్న.

పరిశోధన పద్ధతి: సామాజిక–సైద్ధాంతిక విశ్లేషణ

ఈ పరిశోధన పత్రం ప్రధానంగా వివరణాత్మక (Descriptive) మరియు విశ్లేషణాత్మక (Analytical) పరిశోధన పద్ధతుల కలయికగా సాగింది. ఇందులో పాటించిన ముఖ్యమైన అంశాలు ఇవే:

- ★ **తులనాత్మక అధ్యయనం (Comparative Study):** పురాణాల్లోని అరుంధతీ వసిష్ఠుల మూల కథకు, బోయి భీమన్న గారు నాటకంలో చేసిన మార్పులకు మధ్య గల తులనాత్మకతను ఇందులో చర్చించారు. పాత కథకు సామాజిక అవసరాల రీత్యా ఇచ్చిన కొత్త ముగింపును విశ్లేషించారు.
- ★ **సైద్ధాంతిక అన్వయం (Theoretical Application):** డా.బి.ఆర్. అంబేద్కర్ గారు ప్రతిపాదించిన 'ఆర్య–అనార్య' సిద్ధాంతాన్ని, వర్ణ వ్యవస్థ పుట్టుకకు సంబంధించిన చారిత్రక అంశాలను ఈ నాటక పాత్రలకు, సన్నివేశాలకు అన్వయించి పరిశోధించారు.
- ★ **అంతర్విద్యా దృక్పథం (Inter-disciplinary Approach):** సాహిత్యాన్ని కేవలం ఒక కళాఖండంగానే కాకుండా.. చరిత్ర, సామాజిక శాస్త్రం, మానవ శాస్త్రాల వెలుగులో విశ్లేషించారు. వేదాలు, మనుస్మృతి వంటి గ్రంథాలలోని శ్లోకాలను ఉదహరిస్తూ సాహిత్యానికి ఉన్న సామాజిక బాధ్యతను నిరూపించారు.
- ★ **శిల్ప మరియు వస్తు విశ్లేషణ (Textual Analysis):** నాటకంలోని 12 రంగాలు, పాత్రల ప్రతీకాత్మకత (ఉదాహరణకు కులగిరి, సంధ్య పాత్రలు), నాటక శిల్పంలో రచయిత పాటించిన ప్రత్యేకతలను నిశితంగా పరిశీలించారు.
- ★ **గుణాత్మక పరిశోధన (Qualitative Research):** నాటకం ద్వారా సమాజానికి అందే సందేశం ఏమిటి? అది 'జాతీయ సమైక్యత'కు ఎలా తోడ్పడుతుంది? అనే అంశాలపై గుణాత్మకమైన చర్చను ఈ పత్రం చేపట్టింది.

ఉపోద్ఘాతం:

పురాణ ప్రసిద్ధమైన అరుంధతీ – వసిష్ఠుల ప్రణయగాథను ఆధారంగా చేసుకొని వచ్చిన నాటకమే రాగవాసిష్ఠం దీన్ని బోయి భీమన్న గారు 1959లో రాశారు. 12 రంగాలు గల ఈ నాటకం రావడం వెనుక కుల సమస్యను, దళితుల సంస్కృతీ పరమైన విషయాలను చర్చించాలనే లక్ష్యం కనిపిస్తుంది. భారతదేశంలో ఆర్య– ద్రావిడ జాతుల పుట్టుకకు సంబంధించిన చారిత్రక లోతులెన్నో ఈ నాటకంలో ఉన్నాయి. పౌరాణిక ఇతివృత్తాన్ని తీసుకొని సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యను లోతుగా చర్చించి, "భారతీయులంతా ఒక్కటే" అనే జాతీయతా వాదాన్ని స్థాపించే నాటకంగా దీన్ని అభివర్ణించవచ్చు.

రాగవాసిష్ఠం నాటకం – రచనా నేపథ్యం

నెల్లూరులో1957లో రాష్ట్ర హరిజన సేవా సంఘం మహాసభలు జరిగాయి. ఆ సంఘం ఆధ్వర్యంలోనే హరిజన కవులకు సన్మానాలు కూడా చేయాలనుకున్నారు. ఆ సన్మాన సభలో బోయి

భీమన్న గారు పాల్గొన్నప్పుడు, ఆ సభలో అధ్యక్షుడు మాట్లాడిన మాటలకు సమాధానంగా ఈ నాటకం రూపొందిందని హైమవతీ గారు పేర్కొన్నారు (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు,బోయి భీమన్న, 1982: 324) అయితే, రచయిత జీవితం, సాహిత్య విషయాల గురించి కథనాత్మక శైలిలో సాగిన హైమవతీ గారి రచన పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్నలో ఈ నాటకానికి భీమన్నగారు రాసిన ముందుమాట గురించిన ప్రస్తావన గురించి కూడా కనిపిస్తుంది "హరిజనులు ఆదిమ వాసులైనా, ఆర్యులు వారిని జయించిన తర్వాత బానిసలుగా మారారనీ, అలాగే చచ్చిన గొడ్లను తినడం వల్ల వెలికి గురికాబడ్డారనే" ప్రచారం జరుగుతుండటాన్ని భీమన్నగారు అంగీకరించలేదు పిపాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982: 327ర. దానికి తనదైన వాదాన్ని వినిపించాలనుకున్నారు.

దాని కోసం వేదాలు, మనుస్మృతి, అమరకోశం, రామాయణ మహాభారతాలు, ప్రాచీన సాహిత్యం లోతుగా అధ్యయనం చేశానని కవి చెప్పుకున్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ రచనలను చదివారు. మంగిపూడి వేంకటశర్మగారు రాసిన నిరుద్ధ భారతం భీమన్న గారి "హరిజనులు ఆర్యులే" అనే సిద్ధాంతానికి గొప్ప ప్రేరణనిచ్చిందని రచయితే చెప్పుకున్నారు. నిరుద్ధ భారతం "భారత జాతి సమైక్యాన్ని నిజంగా కాంక్షించే ప్రతి వ్యక్తికీ పారాయణ గ్రంథం"గా కూడా భీమన్న గారు ఆ కావ్యాన్ని వ్యాఖ్యానించారు. ఆ కావ్యాన్ని భీమన్నగారు విద్యార్థి దశలోనే చదువుకున్నారు. ఆ కావ్యమే ఈ నాటకాన్ని రాయడానికి పురికొల్పిందని నాటక రచనా నేపథ్యాన్ని దాని ముందుమాటలో చెప్పుకున్నారు.

పై అంశాలను బట్టి ఈ నాటకం ఒక సామాజిక సమస్యకు పరిష్కారాన్ని లేదా ఒక సమన్వయాన్ని అందించే గురుతర బాధ్యతతో రాయబడిందని తెలుస్తుంది.

వస్తు వైవిధ్యం

అరుంధతీదేవి కథ పురాణ ప్రసిద్ధమైనదని ముందే చెప్పుకున్నాం. అయితే, పురాణాల్లో ముఖ్యంగా శ్రీదేవీ భాగవతం, శివపురాణం, భాగవతం, భారతం తదితర పురాణేతిహాసాల్లో వసిష్ఠుని గురించి చెప్పే కథా సందర్భంలో ఆయన ధర్మపత్నిగా అరుంధతీదేవి ప్రస్తావన వస్తుంది.అరుంధతీదేవి గురించి ప్రచారంలో ఉన్న కథల్లో పాఠకులకు రకరకాల అనుమానాలు కూడా వ్యక్తమవుతుంటాయి. ఆ పద్ధతిలోనే అరుంధతీదేవికి సంబంధించిన కథలు పుస్తక రూపంలో కనిపిస్తున్నాయి. ఆమె పుట్టు పూర్వోత్తరాల గురించి స్పష్టంగా వివరించకపోయినా, ఆమె ఒక చండాల వంశానికి చెందిన స్త్రీగానూ, గొప్ప సత్యవంతురాలు, పతివ్రతా ధర్మం గల స్త్రీ అని ఎంతో మంది వర్ణించారు. అరుంధతీదేవి చరిత్రము పేరుతో నములకంటి జగన్నాథం గారు 1968లో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. అలాగే 1992లో డా.బి.వి.ఎస్.మూర్తి దళిత కథామంజరి పేరుతో రాసిన అస్పృశ్య జాతుల్లో పురాణ పురుషుల కథల్లో 'అరుంధతీదేవి' కథ ఒకటి ఉంది. ఎండ్లూరి సుధాకర్ గారు ఆరంజ్యోతి పేరుతో ఒక కథ రాశారు. ఇంకా మరికొన్ని పుస్తకాల్లో ఆల్వాల్ మల్లేష్ రాసిన అరుంధతీయ చరిత్రము కూడా పేర్కొనదగినదే! అయితే, వీటన్నింటిలోనూ అరుంధతీదేవి – వసిష్ఠుల కథను పవిత్రంగా వర్ణించడమే తప్ప, ఆ కథను ఒక ప్రత్యేకమైన సైద్ధాంతిక భూమికతో రాసినట్లు కనబడదు.

బోయి భీమన్న గారు మాత్రం అరుంధతీదేవి కథను ఆర్య – అనార్య భేదాలను చర్చించి, శూద్రులు, చండాలురు, మాల, మాదిగల వంటి పేర్లతో పిలిచే వారంతా ఈ దేశ మూల వాసులే

కాకుండా, అసలైన ఆర్య జాతీయులవుతారని వాదించే దిశగా ఈ నాటకాన్ని పౌరాణిక – సాంఘిక నాటకంగా తీర్చిదిద్దారు. ఆ విధంగా రచయిత నాటకేతివృత్తంలో వస్తు వైవిధ్యాన్ని సాధించారు.

ఈ రాగవాసిష్ఠం నాటకంలో మరో ప్రత్యేకత ఏమిటంటే పాత్రల పేర్లను కూడా ఎంతో ఔచిత్యంతో పెట్టారు. అరుంధతీదేవి – వసిష్ఠులు పౌరాణిక పాత్రలు. పరమ శివుడు దైవీయమైన పాత్ర.. ఇక, ప్రాచీనుడు, కులగిరి, సంధ్య, శివోహం, కుంభోదరం, గోష్పాదం వంటి పాత్రలన్నీ ప్రతీకాత్మకాలు. అవి ప్రకృతికీ, మానవుని స్థితిగతులకూ, వర్ణాహంకారానికి ప్రతీకలుగా రచయిత అభివర్ణించారు. కనుక, పౌరాణిక – సాంఘిక ఇతివృత్తంతో నాటకాన్ని వస్తు వైవిధ్యం దీనిలో స్పష్టంగా కనిపిస్తుంది.

నాటక కథా సారాంశం

అరుంధతీదేవి ఒక అనార్య యువతి. వసిష్ఠుడు ఆర్య జాతీయుడు. వేదవనంలో తపస్సు చేసుకొంటున్న వసిష్ఠుడికి ఒకనాడు మధురమైన గీతం వినిపిస్తుంది. ఆ గీతం అతని మనసుని ఆకర్షిస్తుంది. పాడిందెవరని చుట్టూ పరికించి చూస్తాడు. సంధ్య అనే అమ్మాయి పాడిందా పాట. ఆమె అరుంధతీదేవికి సోదరి. ఆ పాట ద్వారా సంధ్యని, ఆమె ద్వారా అరుంధతీదేవినీ వసిష్ఠుడు కలుసుకొని, అప్రయత్నంగా సరస్సులో పడిపోయిన అరుంధతీదేవిని రక్షించడం ద్వారా అరుంధతీదేవి నివాసం ఉండే ఆశ్రమానికి చేరతాడు. ఇద్దరి మనసులు ఏకమవుతాయి.

అరుంధతీదేవి – వసిష్ఠుల ప్రణయం విషయం వసిష్ఠుడిని చిన్ననాటి నుండీ పెంచి పోషించిన ప్రాచీనుడికి తెలుస్తుంది. మొదట ప్రాచీనుడు ఆ ఇద్దరినీ చూసి పార్వతీ పరమేశ్వరులేమో అని భావిస్తాడు. తాము వసిష్ఠుడు – అరుంధతులమని వసిష్ఠుడు ప్రాచీనుడికి వివరిస్తాడు. అరుంధతీదేవి గురించి చెప్తాడు. ఆమె ఒక తాపస కన్య అనీ, ఈ పరిసర ఆశ్రమంలోనే ఉంటుందనీ వసిష్ఠుడు చెప్తాడు. ఆమె పేరు "అరుంధతీదేవి" అని చెప్పగానే, ప్రాచీనుడు "హరి హరీ! అంటరాని, చూడరాని, చెప్పరాని చండాల కన్య!" అనుకొంటూ తిరిగి వెళ్ళిపోతాడు.

ఆమె చండాల కన్యా? అని వసిష్ఠుడు ఆశ్చర్యపోతాడు. ఆ మాట వినగానే సాలభంజికలా కదలకుండా అయిపోతుంది అరుంధతీదేవి.

అక్కా! అక్కా! అంటూ సంధ్య పరుగెత్తుకొంటూవచ్చిఆ దృశ్యాన్ని చూసి సజల నేత్రాలతో నిలబడి పోతుంది.

ఆమెను అలాగే వదిలేసి వసిష్ఠుడు తన ఆశ్రమానికి వెళ్ళిపోతాడు. తనలో తాను తర్కించుకుంటాడు. అరుంధతీదేవి చండాలకన్యేనా? ఎంతటి దివ్య సౌందర్యమది? ఆమె ఉన్న ప్రతిచోటూ ఎంత ఆనందదాయకంగా ఉంది! ఎంత పవిత్రంగా ఉంది? ఎంత ప్రశాతంగా ఉందో కదా... అనుకొంటూ మళ్ళీ అరుంధతీదేవి ఆశ్రమానికి వెళ్ళాలని బయలుదేరతాడు.

వసిష్ఠుడికి ఎదురుగా కులగిరి అడ్డు నిలబడతాడు. వసిష్ఠుడిని ఆశ్రమాన్ని విడిచి వెళ్ళనివ్వవద్దని ప్రాచీనుడు తనతో చెప్పాడని అంటాడు.

అంతలో ప్రాచీనుడు వస్తాడు.
వసిష్ఠ– ప్రాచీనుల వాదనలు

మాల మాదిగలను వారి జన్మను చులకనగా మాట్లాడతాడు ప్రాచీనుడు. నత్తితో మాట్లాడే కులగిరి "బ్రహ్మజ్ఞానం" గురించి మాట్లాడుతుంటాడు. నత్తి నత్తిగా ఉచ్చారణా దోషాలతో మాట్లాడుతుంటాడు. యజ్ఞోపవీత ధారణ చేసినంత మాత్రం చేత అందరూ బ్రాహ్మణులవ్వరనీ, నిజానికి అటువంటి వాళ్ళు బ్రహ్మజ్ఞానం అనే మాటను ఉచ్చరించడానికే అర్హులు కారనీ వాదిస్తాడు వసిష్ఠుడు.

ఇరువురూ జాతి భేదాల గురించి వాదించుకుంటారు.

ఆర్యజాతి సంరక్షులమైన మనం, సమిష్ఠి క్షేమం కోసం వ్యక్తిగత ప్రయోజనాలను తృణప్రాయంగా త్యజించాలని, అందువల్ల నీచ జాతితో పవిత్రమైన ఆర్యజాతిని సంకరం చేసి సర్వ నాశనం చెయ్యవద్దని ప్రాచీనుడు వసిష్ఠుడికి బోధిస్తాడు.

దీనితోవసిష్ఠుడు సంఘర్షణకు లోనవుతాడు.

ఈలోగా సంధ్య వసిష్ఠుడిని వెతుక్కొంటూ కులగిరి దగ్గరకు వస్తుంది. వసిష్ఠుడు ఆ ప్రాంతాన్ని వదిలి వచ్చేసినప్పటి నుండీ అరుంధతీదేవికి స్మృతి రాలేదని ఆమెను అతడొక్కడే రక్షించగలడని అనుకొంటుంది. వసిష్ఠుని గురించి వివరాలు అడుగుతుంది. అప్పటికే ఆ ఆశ్రమం వదిలి అరుంధతీదేవి ఆశ్రమం వైపుకే వసిష్ఠుడు వెళ్ళిపోయాడని కులగిరి చెప్తాడు.

తనకు వర్ణభేదంలేదనీ తన హృదయపు తలపులు మూసుకోలేదనీ అరుంధతీదేవి తన హృదయంలో ఉండి సర్వత్రా ఆమె ప్రతిబింబమే కనిపిస్తుందని తనలో తాను సమాధానం చెప్పుకుంటాడు వసిష్ఠుడు. అంతలో వసిష్ఠుని దగ్గర కొచ్చిన సంధ్యతో తాను క్షణంలో వచ్చేస్తాననీ, ఆమెను అరుంధతీదేవి దగ్గరకు వెళ్ళమని చెప్తాడు. "ఆర్య, అనార్య భేద భావాల్ని తునాతునకలు చేసి, ప్రాచీనుడి నోరు మూయించి, ఈ పారతంత్ర్య వాతావరణం నుంచి బైటికి దూకి వచ్చేస్తానని, తాను పొరపాటు చేసి, ఆమెను వదిలి వచ్చేశాననీ" పశ్చాత్తాప పడుతుంటాడు.

అంతలో మళ్ళీ ప్రాచీనుడు వస్తాడు.
అతడు వసిష్ఠుడిది స్త్రీ వాంఛ అని నిందిస్తాడు.

తనది స్త్రీ వాంఛ కాదనీ, తన జీవితం ప్రేమ యజ్ఞంలో బలయిపోయిందంటాడు.

ఇక, తపస్సు మానేసి గృహస్థాశ్రమానికి చేరమనీ, అప్పుడు గానీ కామం చల్లారందంటాడు ప్రాచీనుడు.

తనది కామం కాదంటాడు వసిష్ఠుడు. తపస్సు మానవలసిన పనిలేదనీ అంటాడు.

అయినా ఇప్పటికే మహా తపస్వివి. యౌవనస్థుడవు. కనుక ఇప్పటికైనా గృహస్థుడివి కమ్మంటాడు ప్రాచీనుడు. తగిన తేజోవతిని వివాహమాడి రాజయోగినిగా మారమని చెప్తాడు ప్రాచీనుడు.

అరుంధతీదేవి కంటే ప్రపంచంలో తేజోవతి లేదంటాడు వసిష్ఠుడు.

మసి బొగ్గుకి రత్నకాంతులు ఉంటాయా? అలాగే చండాల కన్యకు తేజస్సెక్కడిదని, ఆమెను తారామాత్రంగా చేయగల ప్రచండ రవి తేజస్విను లెందరో ఉన్నారంటాడు. అలా అనేసిగుప్పిటతో కొంత ఇసుకను పైకి తీసి "దీన్ని అన్నంగా వండి పెట్టగల కన్య నీకు అర్థాంగి కాగలదు. ఇక నీవు స్వేచ్ఛగా పోవచ్చని" వసిష్ఠుణ్ణి వదిలేసి ప్రాచీనుడు వెళ్ళిపోతాడు.

వసిష్ఠుడి ప్రణయవేదన – శివుని దర్శనం

ప్రాచీన ధర్మం కంటే ఇసుకే కొంత మెత్తగా కనిపిస్తుందనుకొంటూ, ఇసుకను అరుంధతీదేవి వండక పోతే తాను మరో స్త్రీని పెండ్లాడడం జరుగుతుందా? అయినా ప్రేమకు పరీక్ష పెట్టడమేమిటని తనకి కావాలసింది అరుంధతీదేవి. అంతే తప్ప ఓ స్త్రీ మాత్రమే కాదనీ అనుకుంటాడు. ఇసుకను పారబోసేస్తాడు.

అక్కడ అరుంధతీదేవి తపస్సులో నిమగ్నమై పోతుంది.

వసిష్ఠుడు అరుంధతీదేవినే తలచుకొంటూ, మానసిక సంఘర్షణకు గురవుతుంటాడు.

ఆనాటి నుండి అరుంధతీదేవి ఉండే వేదవనంలోని ఆశ్రమం తప్ప, మిగిలిన ఆశ్రమాలన్నీ కరువు కాటకాల పాలవుతాయి. ప్రజలు ఆకలికి తట్టుకోలేక ముసులు కుక్కలను కూడా వదలరు. వాటితోనే తమ ఆకలి తీర్చుకుంటుంటారు.

ఈ పరిస్థితిని గమనించిన ప్రాచీనుడు తన శిష్యుడు కులగిరిని పంపి త్రిమూర్తుల దగ్గరకెళ్ళి సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోమంటాడు. బ్రహ్మ, విష్ణువు తమ చేతుల్లో లేదనీ పరమేశ్వరుడి దగ్గరకెళ్ళమంటారు. అప్పటికే ఈశ్వరుడు అరుంధతీదేవి ఆశ్రమానికి బయలుదేరతాడు.

అరుంధతీదేవినే తలచుకుంటూ వసిష్ఠుడు తాను తప్పు చేశాననీ, ఇక శాశ్వతంగా అరుంధతీదేవికి దూరమవ్వాలని అనుకుంటుంటాడు. తన తపస్సు వ్యర్థమనుకుంటాడు. అది ఇసుక తుఫానులో చేసిన తపస్సులాంటిదని అనుకుంటాడు. తనకి మరణమే శరణ్యమనుకుంటాడు.

ఆ సమయంలోనే సాధారణ మానవుడిలాగే ఈశ్వరుడు అతడికి ప్రత్యక్షమవుతాడు.

ఆ స్థితిలో వసిష్ఠుడు ఈశ్వరుడిని గుర్తించలేదు. తన ప్రేమ సఫలం కానందుకు మరణించాలనుకుంటున్న వసిష్ఠుడిని శివుడే పలకరిస్తాడు. చైతన్యంతో జీవించడంలోనే నిజమైన పురోగతి దాగి ఉందని ఎంత చెప్పినా వినిపించుకోకుండా వెళ్ళిపోవాలనుకున్న వసిష్ఠుణ్ణి తన చేతితో స్పర్శిస్తాడు శివుడు. ఆ స్పర్శతో అతడు నూతన చైతన్యం పొందుతాడు. అయినా తన దారిని తనని పోనిమ్మంటాడు. అయితే అతనిదేదో భగ్న హృదయంలా ఉందనుకుంటాడు శివుడు. ఆ పూర్వాపరాలను అడగకుండానే, అతణ్ణి అంత కఠినంగా హింసించిన ఆ ప్రియురాలెవరని మాత్రం అడుగుతాడు. ఆమె మృదుస్వభావురాలేననీ, తానే కఠినాత్ముడిననీ వసిష్ఠుడు వివరిస్తాడు. తనది ఆర్యజాతి అనీ అనార్య జాతి కన్యను ప్రేమించాననీ చెప్తాడు వసిష్ఠుడు.

దానితో శివుడు అసలు భారతదేశంలో అలాంటి భేద భావమే లేదనీ ద్రావిడులు ఆర్యులు ఒకే జాతివారనీ స్పష్టం చేస్తాడు. భారతీయులదంతా దితి, అదితుల సంతానమే కదా అనీ చెప్తాడు. వెంటనే

మళ్ళీ అది కూడా కేవలం "పెరుగుదలలో పరిసరాల ప్రాబల్యం మినహాయిస్తే, మానవ జాతి అంతా ఒక్కటే కదా?" అంటాడు.

దీనితో తన అజ్ఞానం క్షమార్హం కాదని తపిస్తుంటాడు వసిష్ఠుడు. పొరపాటు చెయ్యడం మానవ లక్షణమనీ దాన్ని సరిదిద్దుకోవడానికి పశ్చాత్తాపమే సరైన మార్గమని వివరిస్తాడు శివుడు. తన తప్పుని సరిదిద్దుకుంటానని వసిష్ఠుడు శివుడికి చెప్పి వెంటనే శివుణ్ణి వదిలేసి అరుంధతీదేవి దగ్గరకు వెళ్ళిపోతాడు. ధన్యుడవయ్యావంటూ శివుడు వసిష్ఠుణ్ణి దీవిస్తూ నిలబడతాడు.

ఇంతలో సంధ్య శివుడి దగ్గరకొచ్చి లోకాలన్నీ తమరినే వెతుకుతున్నాయని అంటుంది. శివుడిని సంధ్య తన అక్క అరుంధతీదేవి తపస్సు చేసుకుంటున్న ఆశ్రమానికి తీసుకొని వెళుతుంది.

మార్గ మధ్యలో ప్రజలు, గోష్పాదం, కుంభోదరం, మునులు కనిపిస్తారు. తాము ఆకలితో అల్లాడుతున్నామనీ కరువుని తీర్చమనీ అంటారు. శివుడితో వస్తున్న సంధ్యను వాళ్ళు మొదట పార్వతీదేవి అనుకుంటారు. తర్వాత కులగిరి గుర్తిస్తాడు. మాదిగ పిల్లను శివుడు ముట్టుకుంటున్నాడంటాడు. శివుడు మైల పడిపోతున్నాడని గోష్పాదం, కుంభోదరం అతని మాటకు జత కలుపుతారు. చావనైనా చస్తాం గానీ మైలపడిన చేత్తో తమకేమిచ్చినా తీసుకోమంటారు.

మరొక వైపు ప్రజలు ఆకలీ... ఆకలీ అని అరుస్తుంటారు.

"ప్రజలారా! మీరెంతకాలం కుల మత వర్గ విభేదాలతో అజ్ఞానులై ప్రవర్తిస్తారో అంతకాలం మీకీ అరిష్టాలు తప్పవు. ఇక ప్రస్తుతానికి మిమ్మల్ని ఈ విపత్తునుంచి రక్షించగలవారు ఒక్క పతివ్రతలు మాత్రమే. మీరు పోయి పతివ్రతలను ఆశ్రయించండి. మీకింత భిక్ష పెట్టగలర"ని అంటాడు శివుడు.

అక్కడే దూరంగా ఉన్న ప్రాచీనుడు వర్ణాధిక్యతతో ఈశ్వరుడిని కూడా గుర్తించలేని స్థితిలో ఉంటాడు. "మాదిగ పిల్ల తపస్సు చేయడం! ఉత్పాతాలు సంభవించడం! ఎంత విపరీతంగా వుంది. ఇక ఆర్య జాతి అడుక్కు తిన్నట్టే!" అనుకుంటుంటాడు.

కొంచెం దూరం వెళ్ళిన తరువాత సంధ్యా పరమశివులను చూస్తాడు. కానీ వాళ్ళిద్దరినీ అరుంధతీదేవి వసిష్ఠులనుకుంటాడు. తన మాట వినకుండా వశిష్ఠుడు మాదిగ పిల్లనే చేరాడనుకుంటాడు. అందువల్లనే ధర్మగ్లాని ఏర్పడిందనుకుంటాడు. ఈ ఘోరకలిని చూడలేననుకుని ముఖం తిప్పుకుంటాడు. ఈ స్థితిలో వస్తున్న పరమశివుడే ప్రాచీనుడికి అభివాదం చేస్తాడు. ప్రాచీనుడు పరీక్షగా చూసి తమర్ని గుర్తుపట్టలేదంటాడు. తనని పరిచయం చేసుకుంటాడు. ప్రాచీనుడు అప్పుడు పరమ శివుడికి నమస్కరించి ఆ పక్కనున్న సంధ్యను పార్వతీదేవేనా అని అడుగుతాడు. తాను పార్వతీదేవిని కాదనీ, అరుంధతీదేవి తన అక్క అనీ శివుడు తనకు తాత అవుతాడని సంధ్య ప్రాచీనుడికి వివరిస్తుంది.

ఆ సంభాషణకీ, సంబంధానికీ ఆశ్చర్యపోయి వాటి పూర్వాపరాలను అడుగుతాడు ప్రాచీనుడు.

తమది ఆద్యార్య సంబంధమనీ, అరుంధతీదేవి మాతంగ కన్య అయినట్లే, కాటికాపరి అయిన పరమేశ్వరుడు కూడ మాతంగుడేననీ చెబుతుంది.

తమతో వేళాకోళంగామాడుతున్నారేమోననే సందేహాన్ని వ్యక్తం చేస్తాడు ప్రాచీనుడు.

ఇది వేళాకోళం కాదనీసత్యమేననీచెప్తాడు శివుడు. "అధికారం కోసం ఆర్య ద్రావిడుల మధ్య జరిగిన అనేక యుద్ధాల పర్యవసానంగా సమాజంలో హెచ్చు తగ్గు లేర్పడ్డాయి. గుణాలను అనుసరించి వృత్తులు పుట్టాయి. వృత్తులను అనుసరించి వర్ణాలేర్పడ్డాయి. అవే కులాలైనాయి. మతంగ మహర్షి సంతానం మాల మాదిగలు. మతంగుడు ఆర్య ద్రావిడ సమైక్యతా మూర్తి. ఆర్య ద్రావిడులు మూలార్య జాతి శాఖలు. అన్నదమ్ములు. ఈ భేదాలు తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం సంఘ సముద్రంలో పుడుతూ పోతూ వుండే అలల వంటివని తెలిసికూడా, మీ వంటి పెద్దలు వీటిని పాటించబూనడం కడుంగడు శోచనీయం" అని స్పష్టంగా వివరిస్తాడు.

ఈ భేద భావాలు స్వార్థం కోసం మానవులు సృష్టించుకున్నవనే కనీస జ్ఞానం తనకు కలగనందుకు సిగ్గుపడుతూ మౌనంగా ఉండిపోతాడు ప్రాచీనుడు.

ఆకాశం తెల్లని మేఘాలతో పొగలు వ్యాపించి ఉంటుంది. అదంతా అరుంధతీదేవి తపస్సు వల్ల కలిగిన పొగలుగానే ప్రజలు భావిస్తుంటారు.

అరుంధతీదేవి – వసిష్ఠులపునఃసంయోగం

అరుంధతీదేవి తపస్సు తీవ్రమై, ఆ తపోవహ్నిలో భగ్నమవుతుందేమోనని, ఆమె తమ్ముడు శివోహం ఒక పాత్రతో నీళ్ళు పట్టుకొని ఆమె చుట్టూ తిరుగుతుంటాడు.

వసిష్ఠుడు ఆకాశంలో కనిపిస్తున్న దివ్యజ్యోతిని చూసి ఆశ్చర్యపోతూ ఆందోళన పడుతుంటాడు. "తపోవహ్నిలో భస్మమైపోతున్నావా అరుంధతీదేవీ" అంటూ విలపిస్తూ తానూ యోగవహ్నిలో చితాభస్మమైపోతానని అతడు యోగ ముద్ర ధరిస్తాడు. శరీరంలో నుండి మంటలు బయలుదేరతాయి. భస్మం వాసన గుప్పుమంటుంది.

పరమశివుడు ప్రవేశించి ఈ మహా చరిత్ర విషాదాంతం కారాదని, తన దగ్గరున్న కమండలంలోని తీర్థం తీసి ఇద్దరి మీదా చల్లుతాడు.

తపోవహ్నిచల్లారిపోతుంది.
కన్నులు తెరచిన అరుంధతీదేవి, పక్కనే ఉన్న వసిష్ఠుణ్ణి చూసి పాదాభివందనం చేస్తుంది.

ఆ తరువాత పరమశివుణ్ణి చూసి భక్తి భావంతో నమస్కరిస్తుంది. తానెంత అదృష్టవంతుణ్ణో కదా అని వసిష్ఠుడు మురిసిపోతాడు.

"కల్యాణ మస్తు" అని ఇరువురినీ పరమశివుడు దీవిస్తాడు. అరుంధతీదేవి తన పక్కనే ఉన్న ప్రాచీనుడికి నమస్కరించి, ఆశీర్వాదాలు కోరుతుంది.

అతడూ ఆమెను దీవిస్తాడు.

నమస్కరించిన వసిష్ఠుడినీ ప్రాచీనుడు దీవిస్తాడు.

పరమశివుని అనుగ్రహంతో జ్ఞానినైయ్యానని చెప్పి వెళ్ళిపోతాడు.

అప్పుడు వసిష్ఠుడు పరమశివుని పాదాలపై పడతాడు. ఏదైనా వరం కోరుకోమన్న శివుడితో తనకు అరుంధతీదేవిని అగ్ని సాక్షిగా వివాహం చేయమంటాడు వసిష్ఠుడు.

ఇద్దరినీ దగ్గరకు చేరదీసి ఒకటి చేస్తాడు శివుడు.

ఇంతలో ప్రజలు, మునులు, ముని శిష్యులు కొన ఊపిరితో వస్తారు. "ఆకలి తీర్చే వాళ్ళే దొరకలేదా" అని పరమశివుడు అడుగుతాడు. దానితో వాళ్ళు ఆకలి తీర్చేవాళ్ళే దొరకలేదని, ఈ పాపాత్ములకు అన్నపూర్ణ ఎక్కడ కనపడుతుందని పశ్చాత్తాప్పడతారు.

అరుంధతీదేవి "ఈ ప్రజలింత దీనావస్థలో ఉండటానికి కారణం ఏమిట" ని పరమశివుణ్ణి అడుగుతుంది.

అదంతా అరుంధతీదేవికి జరిగిన పరాభవ ఫలితమేననీ, ప్రజల్ని రక్షించమని పరమశివుడు అరుంధతీదేవికి చెప్తాడు.

ప్రజలంతా మాదిగల అన్నం తింటారా? అని సంధ్య అడిగితే, "తింటాం తింటాం" అంటారు.

"దేవీ! నీవే ఈ ప్రజల్ని రక్షించగలవ"నివసిష్ఠుడు కూడా చెప్తాడు.

అప్పుడు వసిష్ఠుడి పాదధూళిని తీసుకొని తాను పతిభక్తి గలదాన్నయితే, అన్నపూర్ణమ్మకు నా పట్ల దయ ఉంటే కొండ రాళ్ళన్నీ పిండి వంటలుగా మారాలనీ, చెట్లన్నీ ఫలించాలనీ, చెరువులన్నీ మంచినీళ్ళతో నిండాలని కోరుకుంటుంది.

అలాగే జరుగుతుంది. ప్రజలంతా ఆనందిస్తారు.

"ఇంత గొప్ప మహాత్కార్యాన్ని సాధించినందుకుగానూ ద్యోమండలంలో నీ నాథుని దగ్గరే ఒక శాశ్వత స్థానం లభించేటట్లు వరం ప్రసాదిస్తున్నాను. లోకంలోని ప్రతి నూతన దంపతులు ముందుగా నీకే నమస్కరించి, నీ ఆశీస్సులు పొందుతారు, వైదిక భారతీయులకూ, భారత వంశానికీ మాతవుకాగలవనీ" అరుంధతీదేవిని దీవిస్తాడు శివుడు.

ఆ విధంగా నాటకం సుఖాంతమవుతుంది.

ప్రజలందరికీ శ్రేయస్సుని కలిగించి సుఖాంతమూ అవుతుంది. భగవంతుడే ప్రత్యక్షమైనా, భర్తనే ముందుగా పూజించడం, తర్వాత భగవంతుణ్ణి, ఆ తర్వాత పెద్దల్ని గౌరవించడంలో అరుంధతీదేవి సనాతన సంప్రదాయాన్ని చక్కగా పాటించినట్లు రచయిత వర్ణించారు.

నాటక రచనా విధానం

నాందీ, ప్రస్తావనల కంటే, నాటకాన్ని 12 రంగాలుగా విభజించి, మొదటి రంగంలోనే జరగబోయే కథను చక్కగా సూచించగలిగారు. నాటక ప్రదర్శనలో పంచసంధులను ఉపయోగించుకున్నారు..

"మేలుకో మేలుకో" పాటతో వసిష్ఠుడు తపస్సు నుండి మేల్కొనడం, మూఢత్వాన్ని వదిలి జ్ఞానం వైపు పయనించడం జరిగింది. సంధ్య ద్వారా పరిచయమై, అరుంధతీదేవిని చేరి, జలగండం నుండి

రక్షించినట్లు మొదటి రంగాన్ని బట్టి తెలుస్తుంది. జలగండాలేమైనా సంభవించినప్పుడు వాటి నుండి రక్షించుకోవడానికి యోగ ముద్రను దాల్చవచ్చనీ అలా అరుంధతీదేవి చేసిందన్నట్లు రంగాన్ని వర్ణించారు.

తరువాత కథలో కూడా ఇదే రకంగా జరుగుతుంది. వసిష్ఠుడిని ప్రేమించడం, ఆ విషయం ప్రాచీనుడికి తెలియడం. ఆమె చండాల కన్య అని వసిష్ఠుడికి, ప్రాచీనుడికీ తెలిసినా, ఆమెకు ఆ విషయం తెలియకుండానే సాలభంజికగా మారిపోవడం, మళ్ళీ సమస్య పరిష్కరింపబడిన తర్వాత ఆమె యోగ ముద్రను దాల్చడం, దాన్ని వీడటం వంటివన్నీ ఒక దాని తర్వాత మరొకటి జరిగిపోతాయి.

ఇది గొప్ప సంవిధానం. గొప్ప నాటక శిల్పం. నాందీ, ప్రస్తావనలు లేకుండానే పంచసంధులు, కార్యావస్థలతో కథా కథనాన్ని ముందుకి నడిపించడంలో ఉన్న శిల్పం ప్రత్యేకత. ఈ పరిశోధన పత్రంలో శిల్పానుశీలన కంటే విషయానుశీలనకే ప్రాధాన్యతనిస్తున్నాను.

గేయాలు – పద్యాలు

ప్రతి రంగంలోనూ సందర్భానుగుణంగా చక్కని భావాలతో గేయాలు, పద్యాలు వర్ణించారు. ఆ గేయాలు, పద్యాలు గొప్ప భావుకతతో పాటు, చైతన్యవంతమైన సందేశాలతో కూడి ఉన్నాయి. వీటన్నింటితో దీన్ని దృశ్య నాటకంగా ప్రదర్శిస్తే ఆధునిక సినిమాకి ఏ మాత్రమూ తీసిపోనట్లే ఉంది. సినిమా స్క్రిప్టులో ఉండే ఎన్నో రకాల పద్ధతులు దీనిలోనూ ఉన్నాయి.

పాత్రలు – సంఘర్షణ

ఈ నాటకంలో అరుంధతీదేవి, వసిష్ఠుడు, ప్రాచీనుడు, సంధ్య పాత్రలు ప్రధానమైనవి. వసిష్ఠుడు – ప్రాచీనుడు సంఘర్షణాత్మక పాత్రలు. సంప్రదాయాన్ని చెక్కు చెదరనీయకుండా కాపాడేందుకు ప్రాచీన ధర్మాలన్నింటినీ పాటించమని వాదించేవాడు ప్రాచీనుడు. స్నేహం, పరస్పర అవగాహన, మానవీయతా గుణాలే ప్రధానమని నమ్మి, వాటి ముందు జాతి భేదాలు నిలబడవని వాదించే స్వభావం వసిష్ఠుడిది. ఆర్ష సంప్రదాయానికీ, మార్పుని కోరుకొనే అభ్యుదయ వర్గానికీ మధ్య పాత్రోచితంగా గొప్ప సంఘర్షణ జరిగేటట్లు ఈ పాత్రలను తీర్చిదిద్దారు రచయిత.

కులగిరి ప్రాచీనుడి శిష్యుడు. సదాచారాన్నే నమ్ముకునేవాడు. నత్తి నత్తిగా మాట్లాడుతూ, వచ్చీ రాని శ్లోకాలతో పురాణేతిహాసాలను ప్రామాణిక వాక్యాలుగా చెప్తుంటాడు. అయినా, సందర్భాన్ని బట్టి గురువు దగ్గర కూడా అబద్దమాడడానికి వెనుకాడడు. మాదిగ లేదా కింది వర్ణాల వారిని వ్యతిరేకిస్తూనే, అందగత్తె అయితే, ఆమె మాదిగమ్మాయి అయినా, ఆమె వల్ల ఆనందం కలుగుతుందంటే దాన్ని పొందడానికి వెనుకాడని వాడు. అగ్రవర్ణమని చెప్పుకుంటూనే, కింది వర్ణాలనబడేవారిని అవసరానికి అనుగుణంగా ఎలా వాడుకుంటూ ఉంటారో కులగిరి పాత్ర ద్వారా రచయిత సూచించే ప్రయత్నం చేశారు.

సంధ్య పాత్ర ప్రకృతి చైతన్యానికి ప్రతీకాత్మకంగా ఎన్నుకున్నారు రచయిత. అలాగే కుంభోదరం, గోష్పాధం పాత్రలు కూడా సనాతన సంప్రదాయంలో కొనసాగే అవకాశవాద పెద్ద మనుషులకు ప్రతీకగానే తీర్చిదిద్దారు. అరుంధతీదేవి పాత్ర ఒక స్వచ్ఛమైన ప్రేమ మూర్తిగా,

ఆదర్శనారిగా, వర్ణభేదాలేమీ తెలియని నిష్కల్మషమూర్తిగా, అందరి సుఖసంతోషాలను కాంక్షించే వరప్రదాయినిగా ఈ పాత్రను గొప్ప ఔచిత్యంతో తీర్చిదిద్దారు.

నాటకతత్వం

నిష్కల్మషమైన జీవనానికి మానవుల మధ్య వర్ణ భేదాలు అవసరం లేదు. అవన్నీ కొంతమంది స్వార్థంకోసం, తమ ఆధిక్యం కోసం సృష్టించుకొన్నవి, వాటిని ఎంత త్వరగా విస్మరించి నిర్మూలించగలిగితే, అంత త్వరగా భారతీయత సమైక్యంగా బలపడుతుందనేది ఈ నాటకం ఇచ్చే సందేశం.

నాటకంలో వసిష్ఠుడు, ప్రాచీనుడు, శివుడు పాత్రలగతంగా పలికించిన సంభాషణల్లో ఆర్య – అనార్య భేదాలు భారతదేశంలో నెలకొన్నాయనీ, అవి మానవ జీవనాన్ని హెచ్చు తగ్గుల సమాజంగా విభజించి, మానసిక, భౌతిక సంఘర్షణలకు కారణమవుతున్నాయనీ, వాటిలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని చెప్పించగలిగారు.

పరమశివుడు పాత్ర ద్వారా మానవులంతా ఒకే జాతి వారనీ, స్థల, కుల భేదాలను బట్టి, తాత్కాలిక అవసరాలను బట్టి అలా రూపొందించుకున్నారు తప్ప, భేదాలేమీ లేవని చెప్పడం ద్వారా ఈ నాటకం ద్వారా రచయిత విశ్వజనీన మానవుడి లక్షణాలను ప్రతిపాదించినట్లయ్యింది. దీనికి డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన 'ఆర్య జాతి సిద్ధాంతాన్ని' చాలా వరకు ఈ నాటకంలో అనువర్తించిన విధానం ప్రశంసనీయం.

సిద్ధాంతం కోసం నాటకం రాసినట్లుగా కాకుండా, నాటకంలోనే అప్రయత్నంగా ఆ సిద్ధాంతం వచ్చి చేరినట్లుగా రచన కొనసాగింది.

అయితే ఈ సిద్ధాంతం పట్ల ఇప్పటికీ వాదవివాదాలు జరుగుతునేఉన్నాయి. చరిత్రకారుల్లో ఈ సిద్ధాంతం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతునే ఉన్నాయి. అయినప్పటికీ ఒక నాటకంలో ఏదైనా ఒక సిద్ధాంతం ఎలా సమన్వయించే ప్రయత్నం జరుగుతుందో విశ్లేషిస్తూ, ఆ నాటకాన్ని పరిచయం చేయాలనే లక్ష్యమే ఈ వ్యాసాన్ని రాయించింది.

ఆర్య – అనార్య సిద్ధాంతం

శూద్రులు, ఆ తర్వాత 'పంచములు' పుట్టుక గురించి రకరకాలుగా ప్రచారాలు జరుగుతున్నాయి. ఆర్యులు ఇతర దేశాల నుండి వచ్చి, ఈ దేశవాసులైన వారిని జయించి, వీరిని దాసులుగా చేసుకొని, దస్యులు, బానిసలుగా పిలిచారని చరిత్ర కారులు చెప్తున్నారు. దీన్ని డా.బి.ఆర్. అంబేద్కర్ రచనలు – ప్రసంగాలు 7వ సంపుటిలో సోదాహరణంగా విశ్లేషించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం..

1. శూద్రులు సూర్యవంశానికి చెందిన ఆర్య కులాల్లో ఒకరు;
2. ఆర్యుల సమాజం మూడే వర్ణాలను అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల్ని మాత్రమే గుర్తించిన కాలం ఒకటే ఉంది;

3. శూద్రులు ఒక ప్రత్యేక వర్ణంగా ఏర్పడలేదు. ఇండో ఆర్యన్ సమాజంలో శూద్రులు క్షత్రియ వర్ణంలో ఒక భాగం;
4. శూద్ర రాజులకు బ్రాహ్మణులకు మధ్య ఎడతెగకుండా సాగుతూ వచ్చిన పోరాటంలో బ్రాహ్మణులు అనేక అవమానాలకు హింసలకు గురయ్యారు;
5. ఆ హింసా ఫలితంగా బ్రాహ్మణులకు శూద్రులంటే ఏర్పడిన ద్వేషం కారణంగా బ్రాహ్మణులు శూద్రులకు ఉపనయనం చేయడానికి నిరాకరించారు;
6. ఉపనయన కర్మకు తిరస్కృతులైన కారణంగా ఆత్మీయులైన శూద్రులు సాంఘికంగా అధఃపతనమై వైశ్యులకన్నా తక్కువ స్థాయికి దిగజారి నాలుగో వర్ణం అయ్యారు.

అరుంధతీదేవి చండాలకన్యా? అనార్య జాతి స్త్రీయా?

అరుంధతీదేవిని 'ఆరంజ్యోతి' అని కూడా వ్యవహరిస్తుంటారు. మహా పతివ్రత. కర్ధమ ప్రజాపతి కుమార్తె. వసిష్ఠుని భార్య. కర్ధముడు బ్రహ్మచ్ఛాయలో పుట్టినవాడు. ఆతని భార్య దేవహూతి. కపిలుడు కూడా కర్ధముని కుమారుడే మన పురాణాలు తెలుపుతున్నాయి.

బ్రహ్మ పుత్రిక అయిన సంధ్యా దేవి మేధాతిథి యజ్ఞంలో ప్రాతస్సంధ్య, అరుంధతీదేవి, సాయం సంధ్య అనే ముగ్గురు మూర్తులుగా పుట్టినట్లు ఒక కథ ఉంది. కర్ధమ ప్రజాపతి తొమ్మండుగురు కుమార్తెలు. అందులో అరుంధతీదేవి ఒకరు. అనే ఒక కథ కూడా ఉంది.

కర్ధముడు ప్రజాపతి అయితే, సృష్టికి కారకులైన ఆది పురుషులలో అతడొకడవుతాడు. ప్రజాపతుల కాలంలో వర్ణభేదమే లేదు. అలా కాకుండా కర్ధముడు ఆ తరువాత వాడైతే అతడు మతంగుడే కావచ్చు. అప్పుడు అరుంధతీదేవి అక్క చెల్లెండ్రు అనసూయ మొదలైన వాళ్ళంతా మతంగ వంశీయులే కావచ్చు. అరుంధతీదేవి తమ్ముడు కపిలమహర్షి కూడా మతంగుడే అవుతాడు కదా! (రాగవాసిష్ఠం ముందుమాట 10–11) అనేది రచయిత వాదన.

పురాణాల్లో కూడా అరుంధతీదేవి పుట్టుక గురించి స్పష్టమైన వివరణలు కనిపించడం లేదు. అయినా, పురాణనామ చంద్రిక వంటి ఆధారాలను అనుసరించి దొరికినంత వరకు ఇలా వివరించుకొనేవీలుంది.

అరుంధతీదేవి, వసిష్ఠులకు పుట్టినవాడు శక్తిమహర్షి. శక్తిమహర్షికీ మాతంగ కన్యకు పుట్టినవాడు పరాశరుడు. పరాశరుడికీ, సత్యవతికి పుట్టినవాడు వ్యాసుడు. ఇలా ఈ పుట్టుక పరిణామాన్ని పరిశీలిస్తే వ్యాసుడు ఆర్యుడా? అనార్యుడా? మహాభారతంలో అంతర్గతమైన భగవద్గీతలో ఇలాంటి భావాలు కొన్ని కనిపిస్తున్నాయి. 'భగవద్గీత' నాల్గవ అధ్యాయం 13వ శ్లోకంలో చాతుర్వర్ణాలను గుణ కర్మలను బట్టి సృష్టించినట్లు ఒక శ్లోకం కనిపిస్తుంది.

"చాతుర్వర్ణ్యం మయా సృష్టంగుణకర్మవిభాగశ:
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమం." (భగవద్గీత,4–13)

ఆర్యోక్తి గా ప్రచారంలో ఉన్న ఒక శ్లోకాన్ని నాటకం ముందుమాటలో బోయి భీమన్న గారు ఉదహరించారు.

"జన్మనాజాయతే శూద్రః
కర్మణాజాయతే ద్విజః
వేద పాఠంతువిప్రాణాం
బ్రహ్మజ్ఞానే బ్రాహ్మణః"

దీని భావజాలమే సమాజంలో స్థిరపడిందనేది రచయిత బోయి భీమన్న గారి అభిప్రాయం. ఒకే వ్యక్తి జన్మతో శూద్రుడైతే, కర్మతో ద్విజుడుగా మారితే, ద్విజులంతా ఆర్యులైతే, శూద్రుడు అనార్యుడెలా అవుతాడు? అంతా ఆర్యులే కదా! ఆ విధంగా "అరుంధతీదేవి" కూడా ఆర్యురాలే అవుతుందనేది బోయి భీమన్న గారి ఆభిప్రాయం.

ఈ శ్లోకం ఎక్కడుందని భగవద్గీత, మనుస్మృతులను పరిశీలించాను.నేను చూసిన ప్రతుల్లో కనిపించలేదు. బహుశా అదేమైనా స్మృతులలో గాని ఉండే అవకాశం ఉందేమో. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కులం–అస్పృశ్యత గురించి చర్చిస్తూ ఈ శ్లోకాన్ని పాదసూచికలో కొంత భాగాన్ని ఇచ్చారు. అయినా వర్ణ వ్యవస్థ భారతదేశంలో ఉందనీ, అది గుణ కర్మలను అనుసరించి ఏర్పడిందని చెప్పేవాదనలు ప్రసిద్ధమే. కనుక అది ఎందులో ఉందనేది అవసరమే అయినా, అది దొరకకపోతే ఈ వ్యాసంలో ప్రతిపాదించే సిద్ధాంత సమన్వయానికి భంగం వాటిల్లుతుందనిభావించనవసరం లేదనుకుంటాను.

చాతుర్వర్ణాలు గుణ, కర్మలను బట్టి ఏర్పడ్డాయనేది భగవద్గీత, మనుస్మృతులు మాత్రం చాటి చెప్తున్నాయి.

మనుస్మృతి ద్వాదశ అధ్యాయంలో చాతుర్వర్ణాల వారు ఆచరించవలసిన ధర్మాలను ఇలా వివరించడం కనిపిస్తుంది.

"చాతుర్వర్ణ్యస్యకృత్స్నో?యముక్తోధర్మస్త్వయానఘ,
కర్మణాంఫలనిర్వృత్తింశంసనస్తత్త్వతఃపరామ్
స తాను వాచ ధర్మాత్మా మహర్షీన్మానవోభృగుః
అస్యసర్వస్యశృణుత కర్మ యోగస్యనిర్ణయమ్?" (మనుస్మృతి, 12-1,2)

మహానుభావా! మాకింత వరకు బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులనుష్ఠించాల్సిన ధర్మాలన్ననీ చెప్పినారు. ఇక ఇప్పుడు ఈ జన్మలో చేసిన కర్మలకు తరువాతి జన్మలలో కలుగు ఫలం ఏవిధంగా ఉంటుందో దానినంతా వివరించండి అని మహర్షులు భృగుమహర్షిని అడిగినారు. అప్పుడా మహర్షులతో మనుపుత్రుడైనభృగుమహర్షి సమస్త కర్మల యొక్క ఫలితాన్ని ఇట్లు చెప్పసాగెను.

"శుభాశుభఫలం కర్మ మనోవాగ్దేహసంభవమ్,
కర్మజాగతయోన?ణాముత్తమాధమమధ్యమాః
"తస్యేహత్రివిధస్యాపిత్ర్యధిష్ఠానస్యదేహినః,
దశ లక్షణ యుక్తస్యమనోవిద్యాత్ప్రవర్తకమ్." (మనుస్మృతి, 12-3,4)

మనస్సు, వాక్కు దేహం ఇవి చేసే కర్మ శుభాశుభ ఫలములను కలిగిస్తున్నది. ఈ కర్మవల్లనే జీవులకు ఉత్తమ, మధ్యమ అధమగతులేర్పడుతున్నాయి. ఈ విధంగా జీవికి మనోవాక్కాయములచే ఉత్తమాది త్రివిధ గతులేర్పడుతున్నా దశవిధ లక్షణాలుగల కర్మకు కారణమని చెప్పాల్సి ఉంది. అని మనుస్మృతి కర్మలను అనుసరించి జన్మ ఏర్పడుతుందనే వివరణను ఇస్తుంది. (చూడు: మనుస్మృతి, తెలుగు తాత్పర్య సహితం, డా. యన్. యల్. నరసింహాచార్య 2000: 334)

బ్రాహ్మణ స్త్రీకి – శూద్ర పురుషునికి పుట్టినవాడు 'చండాలుడు' అని మనుస్మృతి చెప్తుంది. శూద్రుని వలన వైశ్య స్త్రీకి పుట్టిన వాడు అయోగుడు. క్షత్రియ స్త్రీకి పుట్టిన వాడు క్షత. వీరంతా వర్ణ సంకరులు. వీరే అవర్ణులు. అంటే, ఏ వర్ణానికీ చెందనివారు. వారే 'పంచమ వర్ణం' వాళ్ళు!

వర్ణానికీ, జాతికీ కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి.

"జాతి అంటే కొన్ని ఆనువంశిక ప్రత్యేక లక్షణాలు కలిగిన ఒక జన సమూహం అని నిర్వచించవచ్చు."(శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి,1992 : 59.) అని డా.బి.ఆర్.అంబేద్కర్ నిర్వచించారు.

జాతిని రూపొందించేటప్పుడు చూడవలసిన కొన్నిలక్షణాలను పేర్కొన్నారు. అవి: 1.శిరస్సు ఆకృతి, 2. ఱుట్టు, 3. శరీరచ్ఛాయ, 4. మనుషుల పొడవు.

దీనిలో రంగు, పొడవు అనేవి శీతోష్ణ స్థితిని బట్టి ఆవాసాన్ని బట్టి మారుతూ ఉండే లక్షణాలు.కనుక, వాటిని జాతి నిర్ణయ లక్షణాలుగా పేర్కొనవలసిన అవసరం లేదనే అభిప్రాయం నేడు ప్రబలి ఉంది." (శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి,1992 : 59.) అని డా.బి.ఆర్. అంబేద్కర్ వివరించారు.

కేవలం శరీర వర్ణమే ప్రధానమైతే యూరోపియన్ జాతులలో అన్ని వర్ణాల వారూ ఉన్నారని, అయినా వారి మధ్య వర్ణ భేదాలు లేవని డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్లేషించారు.

"ఆర్యజాతి వారు, అనార్య జాతులైన దాసులను, దస్యులను యుద్ధంలో జయించారని చెప్పే సిద్ధాంతానికి తావు లేదని ఋగ్వేదంలోని అనేక ఋక్కుల్లో పేర్కొన్న "ఆర్య" శబ్దాన్ని ఆధారం చేసుకొని డా.బి.ఆర్. అంబేద్కర్ సోదాహరణంగా నిరూపించారు.

"ఆర్యులు భారతదేశంపై దాడి చేసి జయించారనేది అభూత కల్పన." అని డా.బి.ఆర్. అంబేద్కర్ వాదన (శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి, 1992 : 73) అంతేకాదు "దాసులు, దస్యులు భారత దేశానికి చెందిన ఆదిమతెగల వారు అనడం ఖచ్చితంగా తప్పు" [3 పే. 73] అని కూడా డా.బి.ఆర్. అంబేద్కర్ ఆర్యజాతి సిద్ధాంతాన్ని పూర్వ పక్షం చేసే ప్రయత్నం చేశారు.

ఈ పై సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొనే 'రాగవాసిష్ఠం' నాటక రచయిత బోయి భీమన్న గారు భారతీయులందరూ ఆర్యులే అనే సిద్ధాంతాన్ని ఈ నాటకంలో అన్వయించే ప్రయత్నం చేశారు.

పైగా ఈ నాటకం గురించి హైమవతీ గారు భీమన్న గారి ఆత్మకథలో రాస్తూ "ఆర్యులు ద్రావుడులు ఒకే జాతికి చెందిన వారు, రక్త సంబంధీకులు" అనే సిద్ధాంతం కూడా నార్ల వారికి నచ్చలేదా కాలంలో. రాగవాసిష్ఠం నాటకం ఈ సిద్ధాంతం మీద వ్రాయబడినట్టిదే" (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982 : 277) అని మరింతగా స్పష్టం చేయడాన్ని గమనించవలసి ఉంది.

ఈ నాటకం గురించే వ్యాఖానిస్తూ హైమవతీ గారు "నిండాచాదస్తం గల సనాతన పండితులు సైతం కాదనలేని సిద్ధాంతాలు భీమన్నవి" (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982 : 634) అన్నారు.

ఏది ఏమైనా డా.బి.ఆర్. అంబేద్కర్ భావజాలం బోయి భీమన్న గారిలో స్పష్టంగా కనిపిస్తుందని చెప్పడానికి ఈ నాటకం గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు.

అంతేకాకుండా ఆర్య, అనార్య భేద భావాలు స్థల కాలాలను అనుసరించి ఏర్పడినవని చెప్పడం ద్వారా కూడా ఒక విశ్వజనీనమైన మానవుణ్ణి రచయిత ఈ నాటకంలో ప్రతిష్టించే ప్రయత్నం చేసినట్లు చెప్పే వీలుంది.

నాటక నామౌచిత్యం

ఈ నాటకానికి రచయిత రాగవాసిష్ఠం అని పేరు పెట్టారు. దీన్ని హైమవతీ గారు పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్నలో రాగవాశిష్ఠం అనే చాలా సార్లు రాశారు. ఈ వ్యాసంలో మాత్రం నాటకం ముఖ చిత్రంపై ఉన్న రాగవాసిష్ఠం అనే ప్రయోగించడానికి ప్రయత్నించాను.యోగవాశిష్ఠం, జ్ఞానవాసిష్ఠం ఉన్నట్లే ఈ పవిత్ర కల్యాణ గాథకు 'రాగవాసిష్ఠం' అనే పేరు పెట్టానని రచయిత రాసుకున్న ముందుమాటలోనే చెప్పుకున్నారు. 'రాగం' అంటే అనుబంధం, ప్రేమ, అనురాగం వంటి అర్థాలు ఉన్నాయి. వసిష్ఠని ప్రేమ, వసిష్ఠని అనురాగం, వసిష్ఠనిపై అనురాగం వంటి అర్థాలను ఆశించి ఈ నాటకానికి ఈ పేరు పెట్టారని తెలుస్తుంది. నాటకం చివరి వరకూ రాగబంధమే. అంటే ప్రేమ బంధమే కొనసాగింది. ఈ విధంగా చూసినప్పుడు ఇది గొప్ప ఔచిత్యంతో పెట్టిన పేరే.

ఈ విధంగా పరిశీలించినప్పుడు రాగవాసిష్ఠం నాటకంలో కొన్ని చర్చనీయాంశాలు ఉన్నాయనీ, సృజనాత్మక సాహిత్యం కేవలం ఆనందం కోసమే కాకుండా ఆలోచనాత్మకంగా కూడా మలచి సాహిత్య ప్రయోజనాన్ని గుర్తించేలా చేయవచ్చని నిరూపించిన రచనగా దీన్ని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. జ్ఞానానందకవి. యస్.టి, 1997, షెడ్యూలు కులాలు అంటరానివా! కాకినాడ: సురగాలి ప్రచురణలు

2. జగన్నాధం నములకంటి. 1968, ఆరుంధతీదేవి చరిత్రము. హైదరాబాద్ : వైదిక గ్రంథప్రచారమండలి ప్రచురణలు

3. నారాయణరెడ్డి, సి.(ప్రధాన సంపాదకుడు) 1992, బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు – ప్రసంగాలు 7వ సంపుటి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణలు

4. భీమన్న బోయి. 1959, రాగవాశిష్ఠం. హైదరాబాదు : సుఖేలానికేతన్ ప్రచురణలు

5. మూర్తి .బి .బి.యస్,1992, దళిత కథామంజరి. రాజమండ్రి : త్రివేణి ప్రింటర్స్ ప్రచురణలు

6. నరసింహాచార్య యన్.యల్. (వ్యాఖ్యాత), 2000, మనుస్మృతి, (తెలుగు తాత్పర్యం సహితం) హైదరాబాదు: గాయత్రీ ప్రచురణలు

7. వేదవ్యాస, 2000, ప్రాచీన భగవద్గీత (పరిష్కృతమైన మూలము), యోగమిత్రమండలి ప్రచురణ, హైదరాబాదు, ప్రథమ ముద్రణ.

8. హైమవతి, 1982, ద్వితీయ ముద్రణ, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, (ప్రథమ ముద్రణ, 1978), హైదరాబాదు : సుఖేలానికేతన్ ప్రచురణలు

9. Religion and Society By S. Radhakrishnan p. 129

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

పిల్లీ శతకం తత్త్వదర్శనం - సామాజిక విశ్లేషణ

- డా. మన్నెమోని కృష్ణయ్య,
సహాయాచార్యులు
పాలమూరు యూనివర్సిటి

బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 19 న తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో నాగమ్మ, పల్లయ్య దంపతులకు జన్మించారు. బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై, పాలేరు, కూలిరాజు, రాగవైశాఖి, రాగోదయం, శంఖారావం, పంచమస్వరం, ధర్మవ్యాధుడు, పిల్లీ శతకం మొదలగు 70 కి పైగా రచనలు చేశాడు. దళితుల ఆత్మగౌరవాన్ని ఎగురవేసిన పద్మభూషణుడు బోయి భీమన్న. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కళా ప్రపూర్ణుడు బోయి భీమన్న.

"నేనేమి చేస్తే అది కళాఖండం

నేనేమిచెబితే అది వేదం" అని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించిన కవి బోయి భీమన్న. అణిచివేయబడుతున్న దళితులను ఉద్ధరించే ప్రయత్నం చేసి, అటువైపు రచనలు చేసిన కవులు ముగ్గురు కుసుమ ధర్మన్న, బోయి భీమన్న, గుర్రం జాషువా. ఇక్కడ ముగ్గురు కవులు కూడా దళిత కవిత్వాన్ని రాసినప్పటికీ ముగ్గురు కవుల యొక్క మార్గం విభిన్నంగా కనిపిస్తుంది. ఒక్కసారి చైతన్యవంతులైన దళితుల్ని ఇక మీదట ఎవరు కూడా అణిచి పెట్టలేరని, దళితుల్ని చదువు వైపు నడిపించినటువంటి గొప్ప సంస్కరణవాది బోయి భీమన్న. బోయి భీమన్న రచనల్లో జాతీయవాదం కనిపిస్తుంది. తన రచనలలో దళితుల ఆవేదనను, ఆలోచనల్ని, అభ్యున్నతిని చెబుతూనే దేశం పట్ల విపరీతమైనటువంటి భక్తిని ప్రదర్శించటం జరిగింది. అది ఆయనను జాతీయవాదకవిగా నిలబెట్టింది.

జాషువా గబ్బిలం కావ్యంలో కష్టజీవి యొక్క ఆవేదనను కైలాసంలో ఉన్న శివునికి చేరవేయమని చెప్తూ అంటరానితనంతో తను అనుభవిస్తున్న కష్టనష్టాలను అలా వెలివేయబడ్డటువంటి పక్షి, జంతు జాతులకు సంబంధించినటువంటి ఒక జీవి గబ్బిలంగా భావించి గబ్బిలంతో తన సందేశాన్ని పంపించాడు గుర్రం జాషువా. అలాగే ఆయన గబ్బిలాన్ని ఎంచుకుంటే భీమన్న పిల్లీని వస్తువుగా తీసుకొని పిల్లీ యొక్క గొప్పతనాన్ని చెప్తూ, పిల్లీ శతకం రాశాడు. అంటే సమాజంలో ఎవరూ పట్టించుకొనటువంటి అంశాలను తీసుకొని కవిత్వం రాయట మనేది మనకీ కవుల ద్వారా తెలుస్తుంది.

అల్లన తక్కుచు, తారుచు,
మెల్లన మ్యా వనుచు నను సమీపించుటకున్
చెల్లునె యెవ్వరికిని? నా
ఇల్లాలికి నీకు తప్ప ఇలలో? పిల్లీ!

నా ఇల్లాలి తర్వాత నాదగ్గరకు వచ్చే స్వేచ్ఛా స్వాతంత్ర్య మున్నది పిల్లీ అని చెప్పగలిగారు భీమన్న. సమాజంలో అసమానతల్లో, అంటరానితనాన్ని, అణచివేతను స్వయంగా అనుభవించి, వాటన్నింటినీ తట్టుకొని, ఎదిగి నిలబడి అందరినీ ఉద్ధరించే ప్రయత్నం చేసి ఆ ప్రయత్నంలో వివిధ రకాల రచనలుచేసి, తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన కవి పద్మశ్రీ డా.బోయి భీమన్న. పిల్లీ శతకంలోని తత్వాన్ని దర్శింపజేయటం, సామాజికంగా విశ్లేషించటం ఈ వ్యాసం యొక్క ప్రధానోద్దేశం.

పిల్లీని చంకన బెట్టుక
వెళ్ళుట యను పిచ్చినుడులు, విశ్వాసములున్
చెల్లవిక, నిన్నుగైకొని

ఢిల్లీ వరకేగవచ్చు, తెలియవె! పిల్లీ ! అంటూ పిల్లీ శతకాన్ని 124 పద్యాలతో వెలువరించాడు బోయి భీమన్న. పిల్లీ శతకాన్ని తాను వెంట బెట్టుకొని ఢిల్లీ చేరి ఉత్తమ స్థితి పొందానని చెప్పుకున్నాడు. మూఢనమ్మకాల ముసుగును వదిలి కఠోర శ్రమతో కడలి అంచుల దాటి ఉన్నత పదవులనలంకరించే తత్వాన్ని బోధిస్తాడు భీమన్న. జంతుల పట్ల, పక్షుల పట్ల, దళితుల పట్ల గల అసమానతల అంతర్గత తీరును బహిర్గత పరిచి సమాజ పోకడలను పరిశీలించి ప్రశ్నించాడు బోయి భీమన్న.

'ఇంత ప్రత్యక్ష సాక్ష్యాన్ని కళ్ళారా చూచి కూడ ఈ సాహిత్యపు పిల్లీ ప్రాముఖ్యాన్ని ఎందుకు గుర్తించరు? గుర్తించిన వాళ్ళు ధన్యులు. గుర్తించని వాళ్ళు వట్టి కర్మోపజీవులు. జన్మలో సాహిత్యం కోసం మూడు రూపాయలు కూడ ఖర్చుచెయ్యలేని పచ్చి లోభులు!'. సంగీత సాహిత్యాది లలితకళలలో అభినివేశం కలిగి వాటి అనుభవం కోసం తన జీవితంలో విలువైన కాలాన్ని, తాను కష్టించి సంపాదించుకున్న ధనంలోని విలువైన భాగాన్ని వెచ్చించ గలవాడే నిజమైన మనిషి అంటాడు భీమన్న.

"పురుష వ్యాఘ్రుం డనుచున్
పురుష సింహుడనుచు, పురుష పుంగవుడనుచున్

నరుడు మృగము కాదలచును!
నరుడందుకే శివుడు కాడు, నమ్ముము, పిల్లీ !"

అన్న పద్యపాదంలోని భావమదే. "నేడు మన డబ్బుతింటూ, మన నెత్తిపైన వామన పాదమో, భస్మాసుర హస్తమో పెడుతున్న మన ప్రతినిధులంతా ఇదే తరహా పురుష సింహులు!. ఒక్క యోగానందయ్య గారు తప్ప, నన్ను పట్టి ప్రోత్సహించిన ఉపాధ్యాయులు కూడా లేరు. నిజానికి గురుశిష్య వ్యవస్థకు స్థానంలేని కాలం అది. ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్ప గురువులు, శిష్యులు లేరు నేడు. విద్యాలయాల లోపల కంటే, బైట లభిస్తున్న విద్య విజ్ఞానాలే ఎక్కువ యువకులకు" అంటూ విద్యావ్యవస్థ పట్ల జాగరూకత వహించాలని సూచించారు. గురుశిష్య సంబంధాల గుర్తెరిగి నడుచుకోమంటాడు భీమన్న. నాకు గురువు ఎవరైనా ఉన్నారనుకోవలసి వస్తే అది మా నాన్నే, అదైనా, వేదాంత దృక్పథంలోనే. నా అభిరుచి, నా ఆరాధన, నా సాహితీ తత్వం, నా జీవితశైలి సమస్తమూ ప్రకృతి నుంచి, ప్రజలనుంచి గ్రహించిందే. పుస్తకాల ద్వారా నేర్చుకున్నది బహు తక్కువ. వేదాంతంలో నాన్న, ప్రేమలో అమ్మ నాకు గురువులు అని చెప్పుకున్నాడు.

సశాస్త్రీయము, హేతుబద్ధము అయిన సాహిత్యాన్ని, సంస్కృతిని, మతమును, మర్యాదను, మందిని, మార్భలాన్ని పుష్కలంగా కలిగి వున్న మనం అన్నీ విధాలా వెనుకబడి ఉండటానికి కారణం– మెరిట్ ను కాలరాసి, పై మెరుగులకు గొడుగు పట్టడమే. ఈ శతకంలోని ధ్వని అదే.

ఈ శతకాన్ని వ్రాసి కూడ చాల కాలమే అయింది. కొన్ని సంవత్సరాల క్రితం ఇందులోని కొన్ని పద్యాలు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఆధ్వర్యంలో ఆకాశవాణిలో కావ్యగానం చెయ్యబడినై, వాణి పత్రికలో ప్రకటించబడినై. భారతిలో కాబోలు ఉన్నత స్థాయిలో ప్రశంసించ బడినై. దాశరథిగారి దాశరధీశతకం ఉపోద్ఘాతంలో ఆచార్య నిడదవోలు వేంకటరావుగారు ఈ పిల్లీ శతకాన్ని ప్రత్యేకంగా మెచ్చుకొన్నారు. అన్యాపదేశం, వ్యంగ్యం, వక్రోక్తి, ధ్వని – వీటిని స్వేచ్ఛగా వాడుకొన్న సెటైరు ఇది. మానవునితో కలిసి మెలిసి ఉంటూ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడ సంపూర్ణంగాగల జంతువు పిల్లీ ఒక్కటే. పిల్లీని గురించి ఉన్నన్ని సామెతలు, చమత్కారాలు, నానుడులు, విశ్వాసాలు మరే జంతువు గురించీ లేవు. అందుకే పిల్లీని ఈ శతకానికి మకుట నాయికగా తీసుకున్నాను. ఇంతవరకు ప్రకటించబడ్డ నా గ్రంథాల కంటె, ఈ శతకం విలక్షణమైనట్టిది. సహృదయులు గుర్తించగలరు అంటాడు భీమన్న.

ఈనాడు రాజకీయ రంగంలో కంటె సాహిత్య రంగంలో ముఠాతత్వం ఎక్కువ. నేను ఏ ముఠాకూ, ఏ ఇజానికీ చెందిన వాణ్ని కాను. వ్యావహారికంగా ఈ మనస్థితి నష్టదాయకమే. సహాయ సన్మానాలన్నీ ఏ ముఠాకు ఆ ముఠాకే పరిమితమై ఉంటాయి. అంటూ మనుషుల మనస్సు మార్మిక తత్వాన్ని తేల్చి చెబుతాడు. నిష్పక్షపాత దృష్టితో, రచయితల పేర్లు కనపడకుండా ఉండే నిమిత్తం అట్టలు చింపేసి, గ్రంథాలను పరిశీలిస్తే – లక్ష రూపాయల ప్రైజు ఏం కర్మ, నోబెలు ప్రైజునే కొట్టుకు రాగల సృజనాత్మక సాహిత్యం తెలుగులో ఉంది అని 'సాహిత్య తస్కరణ' తత్వాన్ని బట్టబయలు చేస్తాడు భీమన్న. పిల్లీ శతకంలోని తాత్త్విక అంశాలను, సామెతలను, మూఢనమ్మకాలను, వక్రీకరించి చెప్పే ధ్వని రూపాలను, సమాజ పోకడలను విశ్లేషించి, సమాజం సన్మార్గంలో వెళ్ళేతీరును సూచించారు భీమన్న.

ఉపయుక్తగ్రంథ సూచి:

1. జాషువ, గుర్రం, గబ్బిలం కావ్యం. జాషువా సర్వలభ్యరచనల సంకలనం, మనసు ఫౌండేషన్, బెంగుళూరు.
2. తెలుగులో కవిత్వోద్యమాలు– తెలుగు సాహిత్య అకాడమీ, హైదరాబాద్.
3. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 3, వచన కవితలు భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2010
4. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 4, నాటకాలు, భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2008
5. మంజులత, ఆవుల. (సం.) బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్: 2008
6. జాషువా–గుర్రం. గబ్బిలం ప్రథమ భాగం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయిభీమన్న - రాగవాసిష్ఠం నాటకం - రసాద్వైతం

- డా. కె.సురేశ్
తెలుగు సహ ఆచార్యులు
మొబైల్ నెం: 9441705076

వ్యాస సంగ్రహం:

పౌరాణిక - సాంఘిక అంశాల కలబోతగా సామాజిక అసమానతలు, ప్రేమతత్వం, ప్రకృతి ఆరాధన, పారమార్థిక చింతన, తాత్విక ఆలోచనతో నేటి సమాజంలోని కుల భేదాలను, సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి చేసిన అద్వితీయ ప్రయోగమే ఈ నాటకం. నేను హేతువాదిని, మానవతావాదిని , నాకు మానవునిలోను, వాని అభ్యుదయములో పూర్తిగా విశ్వాసం ఉన్నది. అని ఒకానొక సందర్భంలో పలికిన బోయి భీమన్న మానవ సమాజంలో కొత్త వెలుగు నింపడానికి, ఆశించిన మార్పు తీసుకురావడానికి, ఆయన చేసిన రచనా వ్యాసంగం అనితరసాధ్యం. అద్వైతం - శంకరాచార్యులు, విశిష్టాద్వైతం - రామానుజా చార్యులు బోధిస్తే, భీమన్న - రసాద్వైతం బోధించాడు. ప్రేమ, అభిమానం, గౌరవం అందరూ సమానంగా పొందాలని చెప్పడమే రసాద్వైతం. ఈ 'రాగవాసిష్ఠం' నాటకంలో కులం కంటే గుణశీలత ప్రధానమని చెప్పిన తాత్విక చింతన అందరినీ ఆలోచింపజేస్తుంది.

కీలకపదాలు: రసాద్వైతం, పారమార్థిక చింతన, ప్రేమ తత్వం, ప్రకృతి ఆరాధన, హేతువాదం.

ఉపోద్ఘాతం:

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహానీయుడిగా వెలుగొంది విశేష రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించిన స్ఫూర్తిప్రదాత డాక్టర్ బోయిభీమన్న. నాటక రచయితగా విభిన్న కథాంశాలను ఎన్నుకొని పౌరాణిక, సాంఘిక, సోషియో ఫాంటసీ, తాత్విక రచనలతో పండిత పామరులను

అలరించారు. సామాజిక సమస్యలను తన రచనల్లో పొందుపరచి, అందరికీ అర్థమయ్యే రీతిగా, హృదయానికి హత్తుకునే విధంగా పాత్రలను చిత్రించి, తాత్విక దృష్టితో ఆలోచింపజేస్తాడు. ప్రేమ, ఆరాధన, తాత్వికచింతన తన రచనల్లో అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, దేశభక్తి, మానవులంతా ఒక్కటేనన్న భావన సందేశాత్మకంగా తన రచనల్లో కనిపిస్తుంది.

అసలు రాగవాసిష్ఠం అంటే వసిష్ఠుడి యొక్క అనురాగం, ప్రేమ, పెళ్ళి అని అర్థం. ఇందులో అరుంధతి ఒక దళిత స్త్రీగా చిత్రించబడింది. ముఖ్యంగా ఈ రచన ఉద్దేశం సంఘసంస్కరణ. వ్యంగ్యం, హాస్యం సున్నితంగా చెప్పబడింది. రసపోషణ, పాత్రచిత్రణ అద్భుతంగా సృష్టించి నాటకాన్ని దృశ్య మరియు శ్రవ్య కావ్యంగా మలిచారు. పౌరాణిక - సాంఘిక మిశ్రమ కథగా, రాగవాసిష్ఠం నాటకంలో సామాజిక అసమానతలను ప్రేమతత్వం జయించిన విధానాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు. ఆ విశేషాలను కొన్నింటిని ఇక్కడ విశ్లేషించడం జరిగింది.

కథాంశం:

అరుంధతి ఒక పంచమజాతి కన్య. వసిష్ఠుడు ఒక బ్రాహ్మణుడు. ఇద్దరి ప్రేమ వివాహమే రాగవాసిష్ఠం. వసిష్ఠుడు అరుంధతిని ప్రేమిస్తాడు. ఆమె అస్పృశ్యురాలని తెలిశాక కొంచెం దూరమైపోతాడు. విరహం భరించలేక పశ్చాత్తాప పడి మళ్ళీ ఆమె దగ్గరికి వస్తాడు. అప్పుడు అరుంధతి తపస్సులో ఉంటుంది. ఆమె తపస్సు వలన తాపం చెలరేగి వర్షాలు పడక కరువు ఏర్పడుతుంది. ప్రజలు తిండి తిప్పలు లేక నానా కష్టాలు పడతారు. చివరకు వాళ్ళంతా కలిసి బ్రహ్మదేవుని వేడుకుంటారు. ఆయన శంకరుని దగ్గరకు వెళ్ళమని ప్రజలకు సూచిస్తాడు. వాళ్ళు శివుని కలవడానికి కైలాసం వెళతారు. అక్కడ శివుడు ఉండడు. అప్పటికే శివుడు అరుంధతి ఆశ్రమానికి చేరుకుంటాడు. అంతా అక్కడికి వస్తారు. అక్కడ శివుడు అరుంధతి వసిష్ఠుల వివాహం చేయడానికి సిద్ధపడగా, ప్రాచీనుడు మొదలైన పూర్వాచార పరాయణులు అడ్డుపడతారు. వారికి బుద్ధి చెప్పి అరుంధతి వసిష్ఠుల కులాంతర వివాహాన్ని జరిపిస్తాడు శివుడు.

బోయి భీమన్న రచనలలో మకుటాయమానంగా నిలిచి గొప్ప ఇతిహాస రూపకంగా వెలిసింది రాగవాసిష్ఠం. బోయి భీమన్నలో ఒక ప్రత్యేకత ఉంది. వివిధ తత్వవేత్తల భావాలను చదివి అర్థం చేసుకుని తనదైన ఒక సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి దానికి "రసాద్వైతమని" పేరు పెట్టారు. పౌరాణికాలలోని మంచిని గ్రహించాలనుకోవడం వల్లనే భీమన్న ఈ ఇతివృత్తాన్ని సాంఘిక దృష్టితో రచించాడు.

"మిమ్మల్ని సమానంగా సృష్టిస్తున్నాను. మీలో భేదాలు సృష్టించుకుని ఒకరిని ఇంకొకరు హింసిస్తున్నారు". అని బ్రహ్మదేవుని చేత అనిపిస్తాడు. అదేవిధంగా శివుని చేత వర్ణభేదనిర్వచనం ఈ విధంగా చెప్పించాడు. "గుణాలను అనుసరించి వృత్తులు పుట్టాయి. వృత్తులు అనుసరించి వర్ణాలు, కులాలుగా ఏర్పడ్డాయి". ఇక్కడ బోయి భీమన్న మానవతాదృష్టి కలవాడు కనుక అస్పృశ్యతను నివారించడానికి, ప్రజలను చైతన్య పరచడానికి సాహిత్యాన్ని ఉపయోగించాడు.

పాత్రచిత్రణ:

వసిష్ఠుడు ఆదర్శవంతమైన వ్యక్తిత్వం గలవాడు. సాంఘిక దురాచారాన్ని, కులభేద భావాన్ని ఎదిరించి, అరుంధతిని ప్రేమించి పెళ్ళాడుతాడు. పరస్పర ప్రేమ స్వచ్ఛమైనదని, అద్వితీయమైనదని తెలియజేస్తాడు. స్త్రీ, పురుష సమానత్వం అద్వైత్వం. ఇదే శివపార్వతులలో కూడా కనిపిస్తుందని లోకానికి తెలియపరుస్తాడు. అరుంధతి నిమ్నజాతి కన్యయని ఆమెతో కలిసి ఉండటాన్ని 'ప్రాచీనుడు' అనే ముని ప్రశ్నించగా కలవరపాటు చెందిన వసిష్ఠుడు కల్లోల మనస్కుడై ఈ విధంగా అనుకుంటాడు.

దివ్యబాల అరుంధతీ దేవి, అమృత
హృదయ నస్పృశ్యయనగ నో రెట్లు వచ్చె?
నరుని వెలివెట్టి హింసించు నరుడు నరుడే?
మానవాభ్యుదయము కిది మంచిదగునె?

ఈ విధంగా మానవులు ఏర్పరచుకున్న వర్ణ ధర్మాలను, కులభేదాలను నిరసిస్తూ మనిషినిమనిషి వెలివేయడం ఇదెక్కడి ధర్మమని ప్రశ్నిస్తాడు.

అరుంధతి అస్పృశ్యురాలు అయినా, తన సరళస్వభావంతో, నిర్మలమైన మనసుతో, ప్రకృతి సౌందర్యమంతా ఆమె అందంలో ఇమిడి ఉందని, బ్రహ్మతేజంతో ఆమె ముఖం వెలుగొందుతుందని ఎంతో చక్కగా ఈ నాటకంలో అరుంధతి వర్ణించబడింది. అందచందాలతో పాటు అరుంధతి గుణశీలంలోనూ ఉన్నతంగా కనిపిస్తుంది. ప్రాచీనుడు వీరి ప్రేమకు అడ్డుపడతాడు. మానసికంగా బాధించి వారి ప్రేమను అంగీకరించడు. కానీ అరుంధతి ధైర్యంగా ఎదుర్కొంటుంది. చివరకు అరుంధతి వసిష్ఠుని కులాంతర వివాహం చేసుకుంటుంది.

ఇందులో 'కులగిరి' పాత్ర ఒక బ్రాహ్మణుడు. 'శివోహం' అరుంధతి సోదరుడు ఈ రెండు కల్పితపాత్రలు. కులగిరి అంటే పర్వతం అనగా కరగని హృదయానికి ప్రతీకగా , 'శివోహం' అంటే నేను శివున్ని అనే అర్థంలో వర్ణ ధర్మానికి, కుల వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా ఈ పాత్రను సృష్టించారు.

'పులి నోట్లో నన్నా చస్తాను గాని నిన్ను ముట్టుకోను' అంటాడు కులగిరి.

"ఏడ్చినట్లుగా ఉంది నీ సిద్ధాంతం ఎవడు బోధించాడు రా నీకు ఇది. మనిషిని తాకవా? పులి నోట్లో చస్తావా, అయితే చావు" అంటాడు శివోహం. ఇలా మనుషుల మధ్య తారతమ్యాలను, దురన్యాయాన్ని ఈ నాటకంలో ప్రశ్నిస్తాడు.

ఇతర పాత్రల్లో 'సంధ్య' అరుంధతికి చెల్లిగా, ప్రియ సఖిగా నాటక ప్రారంభం నుండి చివరి వరకు అరుంధతి వసిష్ఠుల వివాహం జరిపించడంలో ప్రధాన భూమిక పోషిస్తుంది. అందర్నీ నవ్విస్తూ కవ్విస్తూ హాస్యపు జల్లులతోపాటు, ప్రణయ మధురిమలు మాటల ద్వారా కురిపిస్తుంది.

వర్ణధర్మానికి ప్రతీకగా సనాతన ధర్మపరాయణుడిగా ప్రాచీన భావాలతో, అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ప్రాచీనుడు కఠినమైన కులవ్యవస్థకు ప్రతినిధిగా వ్యవహరిస్తాడు.

అలాగే పరమశివుడు ఇలకు దిగివచ్చి, సనాతన పూర్వాచార పరాయణుల కళ్ళకు కమ్మిన పొరలు తొలగించి చివరకు అరుంధతి వసిష్ఠుల కళ్యాణం జరిపిస్తాడు.

ఇతర చిన్న పాత్రల్లో గోష్పాదం, కుంభోదరం, మునులు, ప్రజలు ఆయా సందర్భాల్లో కనిపిస్తారు.

ముగింపు:

నిమ్న కులస్థులనే భావనతో ఉన్నతమైన గుణశీలత కలవారిని సాంఘిక అసమానతలతో చూడటం విచారకరమని అరుంధతి పాత్ర ద్వారా బోయి భీమన్న తెలియజేశారు. కొత్త దంపతులకు మార్గదర్శకంగా నేటికీ ఆకాశ తారగా అరుంధతిని చూపించడం, కొలవడం ఒక ప్రత్యేకత. ప్రకృతి పురుషుల సంయోగమే సృష్టికి మూలమని భీమన్న మనసులో సరికొత్త రసానుభూతి రవళించగా, ప్రకృతి ప్రియురాలిగా, పరబ్రహ్మయే పురుషుడిగా, వారి ప్రేమయే 'రసాద్వైతం'గా ప్రతిపాదించాడు. సనాతన ధర్మాన్ని ఆధునికమైన మానవీయ విలువలతో ముడివేస్తూ రచనలు చేసిన భీమన్న సామాజిక వ్యవస్థను, గ్రామీణ జీవితంలోని ప్రేమను ఆదర్శంగా తన నాటకాలలో చక్కని తాత్వికతతో ప్రతిఫలింప చేశారు. మనుషులను స్నేహపాశములో బంధించే మానవత్వం అందరూ చూపగలిగినప్పుడు నవసమాజ, సమసమాజ నిర్మాణానికి రాబోయే తరాలు బాటలు పరుస్తాయనడంలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు

1. రాగవాసిష్ఠం – నాటకం., – బోయి భీమన్న.
2. బోయి భీమన్న రూపకాలు – తాత్విక చింతన., –తక్కళ్ళ బాలరాజు.
3. ఆంధ్ర నాటక రంగ చరిత్ర – మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

పాలేరు నాటకం - దళిత దృక్పథం ఒక విశ్లేషణ

- గంజి. కుమార్ రాజా,
పరిశోధక విద్యార్థి
సెల్ : 7730896943

సారాంశం

బోయి భీమన్న తెలుగు సాహిత్యంలో ప్రగతిశీల భావజాలానికి ప్రతీకగా నిలిచిన రచయిత. ఆయన రచించిన "పాలేరు" నాటకం భారతీయ గ్రామీణ సమాజంలో నెలకొన్న భూస్వామ్య వ్యవస్థ, కుల వర్గ అసమానతలు, శ్రమదోపిడీ వంటి మౌలిక సామాజిక సమస్యలను సాహిత్య రూపంలో విశ్లేషించే ముఖ్యమైన కృతి. ఈ నాటకం ద్వారా రచయిత పాలేరు అనే అణగారిన వర్గానికి చెందిన వ్యక్తి జీవితాన్ని కేంద్రంగా చేసుకొని, గ్రామీణ సమాజంలో అతడు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, మానసిక పీడనలను వాస్తవికంగా చిత్రించాడు.

నాటకంలోని పాత్రలు కేవలం వ్యక్తులు మాత్రమే కాకుండా, సమాజంలోని వివిధ వర్గాలకు ప్రతినిధులుగా నిలుస్తాయి. పాలేరు పాత్ర ద్వారా శ్రమకు తగిన ప్రతిఫలం లభించని పరిస్థితి, భూస్వాముల అణచివేత, కుల ఆధారిత వివక్ష వంటి అంశాలు స్పష్టంగా ఆవిష్కృతమవుతాయి. భూస్వామ్య వ్యవస్థలో పాలేరు జీవితం అనిశ్చితితో నిండి ఉండటం, అతడి శ్రమను లాభసాటిగా మలచుకునే అధికార వర్గాల వైఖరి నాటకంలోని ప్రధాన సంఘర్షణగా నిలుస్తుంది. ఈ సంఘర్షణ ద్వారా రచయిత సామాజిక అన్యాయంపై ప్రశ్నలు లేవనెత్తి, వ్యవస్థాత్మక మార్పు అవసరాన్ని సూచిస్తాడు.

భాషా పరంగా "పాలేరు" నాటకం సరళమైన, సహజమైన గ్రామీణ సంభాషణలతో సాగుతూ, పాత్రల భావోద్వేగాలను బలంగా వ్యక్తపరుస్తుంది. నాటక నిర్మాణం, సంఘటనల క్రమం, సంభాషణల లోతు ఇవన్నీ కలిసి సామాజిక వాస్తవికతను ప్రతిఫలించే శక్తివంతమైన నాటక రూపాన్ని సృష్టిస్తాయి. బోయి భీమన్న ఈ నాటకం ద్వారా శ్రమజీవులలో చైతన్యాన్ని పెంపొందించడం, మానవ గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ప్రతిపాదించడం తన ప్రధాన లక్ష్యంగా

పెట్టుకున్నాడు. అందువల్ల "పాలేరు" నాటకం కేవలం సాహిత్య కృతిగా కాకుండా, ఒక సామాజిక పత్రంగా కూడా పరిశీలించదగినదిగా నిలుస్తుంది. తెలుగు ప్రగతిశీల నాటక సాహిత్యంలో దీనికి విశిష్టమైన స్థానం ఉంది.

కీలక పదాలు:

పాలేరు, ప్రగతిశీల, భీమన్న, నాటకం, సామాజిక సమస్యలు, భారతీయ సంస్కృతి, కులవర్గ, సామాజిక వాస్తవికత, అణగారిన.

పాలేరు నాటకం ఇతివృత్తం

కుబేర్రావు అనే మానవత్వం లేని భూస్వామి వద్ద పుల్లయ్య పాలేరుగా ఉంటాడు. పుల్లయ్య కొడుకు వెంకన్నను ఈ భూస్వామి దగ్గరనే పాలేరుగా పెడతాడు. బానిసలాంటి పాలేరు తనం ఇష్టం లేని వెంకన్న దాని నుండి బయటపడాలని కోరుకుంటాడు. వనబాల, ఉపకారి, సుందరం సహాయంతో వెంకన్న వెంకటేశ్వరరావుగా పేరు మార్చుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం సంపాదిస్తాడు. తనకు సహాయం చేసిన వనబాలను కులాంతర వివాహం చేసుకొని అస్పృశ్యత నివారణకు పాటుపడతాడు. ఇది పాలేరు నాటకంలోని ఇతివృత్తం.

పరిచయం:

తెలుగు సాహిత్య చరిత్రలో 20వ శతాబ్దం ఒక కీలక మలుపుగా పరిగణించబడుతుంది. ఈ కాలంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాల ప్రభావంతో సాహిత్యం సామాజిక చైతన్యాన్ని మేల్కొల్పే ఒక ప్రభావవంతమైన సాధనంగా మారింది. ముఖ్యంగా భారత స్వాతంత్ర్య ఉద్యమసంతర గ్రామీణ సమాజంలో నెలకొన్న భూస్వామ్య వ్యవస్థ, కులవర్గ, అసమానతలు, పేదరికం, శ్రమ దోపిడి వంటి సమస్యలు సాహిత్యం సాహిత్య కేంద్రంగా మారాయి. ఈ ధోరణిలోనే నాటక రూపంలో స్పష్టమైన స్వరం వినిపించిన రచయిత బోయి భీమన్న ఒకరు. కవి, నాటక కర్తగా, సామాజిక సంస్కర్తగా ఆయన అణగారిన వర్గాల జీవితాలను సాహిత్యంలోకి తీసుకువచ్చారు. భీమన్న రచనలు మానవ గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ప్రతిపాదిస్తూ వ్యవస్థలోని అన్యాయాలను ప్రశ్నించడం చూడవచ్చు.

ఈయన రచించిన పాలేరు నాటకం తెలుగు నాటక సాహిత్య జగత్తులో అత్యంత ముఖ్యమైన రచనగా నిలుస్తుంది.

గ్రామీణ భూస్వామ్య వ్యవస్థలో జీవించే పాలేరు శ్రమ జీవితాన్ని కేంద్రంగా చేసుకొని ఈ నాటకం సామాజిక వాస్తవాలను ఆవిష్కరిస్తుంది. పాలేరు నాటకం కేవలం బాధల వర్ణనతో పరిమితమవ్వదు, పాలేరు పాత్రలో క్రమంగా వికసించే చైతన్యం ఆత్మగౌరవ భావన నాటకానికి ప్రగతిశీల దృక్పథాన్ని అందిస్తుంది. అందువల్లే పాలేరు నాటకాన్ని సామాజిక ఆర్థిక నేపథ్యంలో ప్రగతిశీల సాహిత్య సిద్ధాంత కాంతిలో విశ్లేషించడం అవసరం. నాటకంలోని ఇతివృత్తం, పాత్ర నిర్మాణం, భావజాలం ద్వారా బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఎలా నిర్మించాడో పరిశీలించడమే ప్రధాన ఉద్దేశం.

వ్యాస సంగ్రహం

కథానాయకుడు వెంకన్న మొదటిసారిగా తాను పాలేరునని గ్రహించాడు తన జీవితాన్ని నాశనం చేసిన వ్యవస్థను మార్చడం తన వల్లనే సాధ్యమవుతుందని భావించి తన నుదుటి రాతను చెరుపుకోవడానికి కంకణం కట్టుకున్నాడు. ఈ భూస్వామ్య వ్యవస్థ తనపై రుద్దుతున్న పెత్తందారీతనాన్ని వదిలించుకోవడానికి సిద్ధపడినాడు. "నువు పాలేరువు. కామందు కాలికి నిన్ను కట్టేశారు ఆ తాడుని తెంచుకో. తెంచుకుపోతే ఎంత స్వేచ్ఛ చూడు" అని చెప్పారు. అది తెలుసుకున్న పాలేరు తాడును తెంపుకోవడం ఈ నాటకం ద్వారా చక్కగా చూపించారు. పాలేరు డిప్యూటీ కలెక్టర్ అయ్యాడు.

'బానిసతనమును-బాపుమురా / భారత భూమికి భాగ్యము తేరా' అనే సందేశాన్ని వినిపిస్తాడు. సకల దేశముల సర్వ మానవుల సామ్యము సాధించమంటారు భీమన్నగారు ఎంత స్పష్టమైన,నిర్దిష్టమైన అవగాహనతో ఈ నాటకాన్ని చేపట్టాడు. జీవితంలో తెలుస్తుంది. (పాద సూచిక: రంగం:1)

ఒకడు తినుచు మరియొకడు పస్తుపడి / యుండుట - ధర్మము కాదురా! అంటారు. ఎటువంటి సమాజాన్ని రచయిత కోరుకుంటున్నాడో పై వాక్యాల ద్వారా అవగతం చేసుకోవచ్చు. ఈ నాటకంలో ప్రధాన సమస్యగా భూస్వామ్య వ్యవస్థను తీసుకున్నారు దాన్లో రెండు ప్రధాన భాగాలు తీసుకున్నాడు రెండింటికి రెండు రకాల పరిష్కార మార్గాలు చెప్పారు. ఒకటి వ్యక్తిగతమైనది రెండోది సామాజికపరమైనది.

పాలేరు నాటకంలో నాయకుడు వెంకన్న. ఒక పాలేరు అతని కామందు కుబేర్రావు చాలా క్రూరుడు. పాలేరుని చాలా చిత్రహింసలు పెడుతుంటాడు. ఏమాత్రం విశ్రాంతికి అవకాశం ఇవ్వడు. పాలేరు తండ్రి పుల్లయ్య కామందుకు సేవ చేయడానికి తాము పుట్టామని నమ్ముతాడు.

తన కొడుకు ఆ సేవలో ఎక్కడ లోటు చేస్తుంటాడో అని భయపడి కొడుకును చావకొడుతుంటాడు.పాలేరు పట్ల సానుభూతి చూపే అమ్మాయి వనబాల. సవర్ణ వర్గానికి చెందినది. పాలేరు పడుతున్న అవస్థ చూసి జాలిపడి ఆకలి పోగొట్టుకోవడానికి కొబ్బరికాయలు, అరటి పళ్ళు తెచ్చి తినమని బలవంతం చేస్తుంది.

తనలా చదువుకోమంటుంది. తన అన్న తాను కలిసి అతనికి ఎంతో ప్రోత్సాహం ఇస్తారు కామందు బాధలు తట్టుకోలేక వనబాల ఇచ్చే ప్రోత్సాహంతో పాలేరు పారిపోయి పట్నం వెళ్లి అక్కడ చదువుకుంటాడు. వనబాల అన్న మరో స్నేహితుడు కూడా పాలేరు చదువుకోవడానికి సహాయపడతాడు.

పాలేరులు "చదువుకోవడం పాపం కాదటరా అని భూస్వామి అంటే బోల్డంత పాపం బాబయ్య. అని పాలేరు తండ్రులు అంటారు. పేడ పిసుక్కునే వెధవకు చదువులు సంగీతాలును" అంటాడు భూస్వామి.(పాద సూచిక: రంగం:5 కుబే:వీరే సంభాషణ) అనడం మాత్రమే కాకుండా పాటలు పాడే పాలేరులు ఉండడం అతనికెంతో నామోషి అనుకుంటాడు. భూస్వామి ఎన్ని తిట్టినా కొట్టిన కామందు గారి కాళ్ళే పట్టుకొని బ్రతికాను కానీ ఈ ఎదవ లాగా చదువు అని ఏడ్చాన అంటాడు పాలేరు తండ్రి. పాలేరు తనం చేయలేని వాడు మనిషి కాదని అతని నమ్మకం. అట్టి భూస్వాముల పాలేరులను ఈ వ్యవస్థ సృష్టించింది.

'మాలను గావించి – పాలేరుగా చేసి/ కామందు కాలికి గట్టినావు అంటరాదని చెప్పి పెంటల పాలిజేసి నీచులమని పేరా నిల్పినావు.(పాద సూచిక రంగం:6) మొత్తం అంటరానితనాన్ని పాలేరు తనాన్ని పై వాక్యాల్లో చెప్పాడు రచయిత. మాలవాన్ని చేసి పాలేరుని చేసి కామందు కాలికి కట్టారు. అంటరాదని చెప్పి పెంటల పాలిజేశారు అందుకనే పాలేరుతనాన్ని కామందుతన్నాని సృష్టించిన వ్యవస్థ మీద, సంఘం పైన దండయాత్ర చేయిస్తాడు ఉపకారి చేత.

ఈ నాటకంలో ఉపకారి ముఖ్యమైన పాత్ర. అప్పటికి మాల, మాదిగ పల్లెలో ఉపాధ్యాయులు పేటలోకి వెళ్లి పిల్లల్ని బడికి తీసుకువెళుతూ ఉండేవారు. బడికి పంపమని పెద్దల్ని ప్రోత్సహిస్తూ ఉండేవారు ఆ పాత్రనే తీసుకుని మంచి ప్రయోజనాన్ని సాధించాడు భీమన్న.

'గోచి పెట్టుట నేర్చు కొనగానే బిడ్డకు చేతికి కర్రిచ్చు రైతుల' దగ్గరకు నడువ నేర్చిన బుడతని గొంపోయి పాలేరు తనముంచు మాలల దగ్గరకు పోయి శక్తి కంతకు మూలము చదువుకొన మీ పిల్లల్ని చదువుకు పంపమని హితబోధ చేస్తాడు. గ్రామాలు నిండా తన కొడుకులను చిన్న పాలేరులుగా చేసే పెద్ద పాలేర్లు అతనికి కనిపిస్తున్నారు. అతనికి చేతి కర్ర, చెప్పు దెబ్బలు, గంజి మెతుకులు తప్ప తన బిడ్డల్ని ఒక అడుగు అయినా ముందుకు వేయని వారే అతనికి కనిపిస్తున్నారు. (పాద సూచిక రంగం:3)

అందుకనే–

'విద్య అనియెడు కాగడా వెలుగుచూసి

ఏల రక్షించుకొనరు మీ బాలకులను' అని ఆవేదన చెందుతాడు.'పసిబిడ్డ తెచ్చు సంపాదన కాసించి బ్రతుకుతున్నారని' (పాదసూచిక: రంగం:3) అతనికి తెలియక పోలేదు. అందుకనే నిర్బంధ ప్రాథమిక విద్య అమలు చేసి పేదలకు చదువు చెప్పించాల్సిన అవసరం గూర్చి ఈ పాత్ర ద్వారా వివరిస్తాడు భీమన్న.

"ఎందుకు నీకు పాలేరుతనం"అని జాలి పడుతుంది బాల.తన లాగానే చదువుకోకూడదా! అంటుంది. (పాద సూచిక: రంగం:4 వనబాల & వెంకన్న సంభాషణ) ఆనాటి నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ గురించి అగ్రవర్ణ వర్గాల బాలికలకు తెలియదు. కుబేర్రావు పాలేర్ని, అతని తండ్రిని ఎందుకు కొడతాడు తెలియదు. కుడి ఎడమా, మాల మైలా లేకుండా అందర్ని రాసుకుని తిరుగుతాడని వాళ్ళన్నయ్యను కూడా కుబేర్రావు అసహ్యించుకొంటాడు.

ఈ పాలేరు నాటకంలో అభ్యుదయభావాలు కలిగినటువంటి మరో ఇద్దరు వ్యక్తులు గురించి ప్రధానంగా చర్చించుకోవాలి.వారే వనబాల అన్నయ్య సుందరం, మరొకరు అనాథ శరణాలయం మేనేజర్ రామం. వీరిద్దరూ పాలేరుకు చదువు చెప్పిస్తారు. సుందరం తమ చెల్లెలు బాలను రామంకిచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు.

" కుటిల కులమత భేదాలు క్రుళ్ళు లోన కూలబడి

యెంతకాలం కుందెదమ్ము"! (పాద సూచిక: రంగం:19) అని భారత మాతను చూసి

బాధపడతాడు. వనబాల కథానాయకుడు వెంకటేశ్వరరావుని ఇష్టపడుతుందని తెలుసుకున్న ఆ ఇద్దరూ స్నేహితులు వారిద్దరికీ వివాహం జరుపుతారు.

నాటకంలో ఈ పరిణామాన్ని ప్రాముఖ్యమైనదిగా అభివర్ణించవచ్చు. భారత నిచ్చెన మెట్ల కులవ్యవస్థ సమాజంలో ఒక సవర్ణ వర్గానికి చెందిన అమ్మాయిని అంటరాని కులం అబ్బాయికి ఇచ్చి పెళ్లి చేయించడం ఒక విప్లవాత్మక మార్పు.

పాలేరుతనాన్ని రూపుమాపడం ఒకటే కాక కుల భేదాలు లేని భారత జాతిని నిర్మించుకోవాలనుకోవడం భీమన్న గారి ప్రధాన ఉద్దేశం. దానికి చదువు ద్వారా పాలేరు తనాన్ని, కులాంతర వివాహం ద్వారా ఏకైక భారత జాతిని నిర్మించడం రచయిత సూచిస్తాడు ఈ రెండు సాధ్యమే అని రుజువు చేయడానికి చాలా ప్రతిభావంతంగా రాసిన నాటకమే పాలేరు.

బోయి భీమన్న గారు ఇక్కడతోనే ఆగరు. కూడు, గుడ్డ, కొంపయు సమానముగా కూర్పుమురా లోకమున" అని కోరుకుంటాడు. ఇంకా ప్రభువు సేవకుడు లేని సంఘమును పదిలముగా నిర్మింపురా! అని హెచ్చరిస్తాడు. రచయిత అంతిమ లక్ష్యం కూడ అదే.

ముగింపు:

ఈ విధంగా బోయి భీమన్న రచించిన "పాలేరు" నాటకం దళిత శ్రమజీవుల జీవితాన్ని కేంద్రంగా చేసుకొని భారతీయ గ్రామీణ సమాజంలోని భూస్వామ్య వ్యవస్థ, కుల వివక్ష, శ్రమ దోపిడీ వంటి మూలక సమస్యలను తీవ్రంగా ప్రశ్నిస్తుంది. పాలేరు అనే అణగారిన వర్గానికి చెందిన వ్యక్తి జీవితాన్ని కేవలం బాధల ప్రతిరూపంగా కాకుండా, చైతన్యంతో ఎదిగి వ్యవస్థను ఎదిరించే వ్యక్తిగా ఆవిష్కరించడం ఈ నాటకంలోని ముఖ్యమైన ప్రగతిశీల లక్షణం. వెంకన్న పాత్ర ద్వారా చదువు శక్తి, ఆత్మగౌరవ భావన, సామాజిక మార్పు సాధ్యమనే విశ్వాసాన్ని రచయిత పాఠకుడిలో నాటుతాడు.

నాటకంలో వ్యక్తిగత విముక్తి (విద్య ద్వారా పాలేరుతనాన్ని వదిలించుకోవడం)తో పాటు సామాజిక విముక్తి (కులాంతర వివాహం, సమానత్వ భావన) రెండింటినీ సమన్వయంగా ప్రతిపాదించడం బోయి భీమన్న యొక్క దూరదృష్టిని తెలియజేస్తుంది. ఉపకారి, సుందరం, రామం వంటి పాత్రల ద్వారా రచయిత సమాజంలో చైతన్యాన్ని పెంపొందించే శక్తులు ఎలా పనిచేస్తాయో స్పష్టంగా చూపించాడు. భూస్వామ్య వ్యవస్థను కేవలం వ్యక్తుల దౌర్జన్యంగా కాకుండా, వ్యవస్థాత్మక అన్యాయంగా చిత్రించి, దానికి పరిష్కారం సమిష్టి చైతన్యమేనని సూచించాడు.

అందువల్ల "పాలేరు" నాటకం ఒక సాహిత్య కృతిగా మాత్రమే కాకుండా, అణగారిన వర్గాల విముక్తి కోసం పోరాడే ఒక సామాజిక పత్రంగా నిలుస్తుంది. మానవ గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను బలంగా ప్రతిపాదించిన ఈ నాటకం తెలుగు ప్రగతిశీల నాటక సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించింది. సమకాలీన సమాజంలోనూ ఇంకా కొనసాగుతున్న కుల-వర్గ అసమానతల నేపథ్యంలో "పాలేరు" నాటకం యొక్క ప్రాసంగికత మరింత పెరుగుతుందని చెప్పవచ్చు.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న సాహిత్య ప్రస్థానం - ఒక పరిశీలన

- డా. బూర్గుల స్వరూప,
తెలుగు సహ ఆచార్యులు
సెల్ : 9000982008

ఓ వాసంతిక నంచు, నీ విరహ భావోత్తప్త నంచున్, భవత్
జీవో జ్జీ వన నంచు, నీ కమ్మృత మిచ్చే చాంద్రి నంచున్, త్వదో జో విశ్వంభర నంచు
వచ్చి ఏవెవో శోభల్ వరించున్ ననున్, నా వొ ఈ సిరులెల్ల నీవే కదటే నా తల్లి : వాగీశ్వరీ

తన సుఖాలకు, సంతోషాలకు, విజయాలకు, విలాసాలకు సమస్తానికి మూలం సరస్వతే అంటాడు భీమన్న. ఎక్కడో గోదావరి లంకలో, ఒక పల్లెటూరి పేటలో అట్టడుగున ఒక అణువుగా పుట్టి, మహాకవిగా వికసించి, కళాప్రపుర్ణుడై, పద్మశ్రీయై, కాశీ విద్యాపీఠ గౌరవ డాక్టరేటు పొంది, ఇంకా ఎన్నెన్నో పురస్కారాలతో బ్రహ్మాండంగా ఎదిగిపోయినాడు ఈ మాల పిల్లవాడు. "ఈయన ఆలస్యంగా వికసించిన కవితా పారిజాతం" అన్నారు ఒక సహృదయ కవి.

బోయి భీమన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం పొందిన కవి-రచయిత. ఆయన సాహిత్యం సామాజిక వాస్తవికత, మానవీయ విలువలు, పీడిత వర్గాల వేదన వీరి కవిత్వంలో గాఢంగా ప్రతిబింబిస్తుంది. సంప్రదాయ కవిత్వపు పరిమితులను దాటి, సమకాలీన పరిస్థితులను, సాంఘిక స్పందనతో కూడిన సృజనాత్మక వ్యక్తీకరణను ఆయన సాధించారు.ఈయన సుమారు 70 పుస్తకాలను రాసినట్లు తెలుస్తుంది. పద్య, గేయ, వచన రచనలతో పాటు నాటికలను కూడా రాశారు. వివిధ గ్రంథాలకు రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది.

భీమన్న సాహిత్యం –సామాజిక చైతన్యం

భీమన్న రచనలలో ప్రధానంగా కనిపించేది సామాజిక చైతన్యం. కులవివక్ష, పేదరికం, శ్రమజీవుల జీవితం, అన్యాయానికి వ్యతిరేక నిరసన వంటి అంశాలు ఆయన కవిత్వానికి కేంద్రబిందువులు. సాహిత్యాన్ని కేవలం సౌందర్యానుభూతికే పరిమితం చేయకుండా, సమాజ మార్పుకు సాధనంగా భావించిన దృక్పథం ఆయనది.

ఎక్కడో ఎవరో పదిమంది ఆర్థికంగా బాగుపడడం
ఉద్యోగాలు చేయడం, పదవులు అలంకరించడం
నిజమైన అభివృద్ధి కాదు
సాంస్కృతిక అభివృద్ధే స్థిరమైన అభివృద్ధి
చదువు లేని వ్యక్తికి ఉద్యోగం రాదు
సంస్కృతి లేని జాతికి అభ్యుదయం లేదు **– ధర్మంకోసం పోరాటం**

సామాజిక అభివృద్ధి కావాలి అంటే చదువు ముఖ్యమైన సాధనం, చదువు వల్లనే జ్ఞాన సముపార్జన జరుగుతుందని కవిగారి ప్రగాఢ నమ్మకం.

అవమానం సహించడం సహనం కాదు
బానిసగా పడి వుండడం సామరస్యం కాదు
సమానుల మధ్య స్నేహమే శాంతి
ఆత్మ గౌరవంతో పురోగమించడమే జీవితం .... – టుమ్రీలు

ఈ సృష్టిలో అన్ని జీవులు సమ భావనలో జీవిస్తున్నప్పుడు, మానవాళి మాత్రమే అసమానతలు, ఈర్ష్యలు, కక్ష్యలు, వివక్షతలతో అశాంతితో జీవిస్తున్నారు. ఈ అసమతుల్య సమాజాన్ని మార్చడం కోసం నిరంతరం సాహిత్య తపస్సు చేశారు, ఆత్మ గౌరవంతో పురోగమించడమే జీవిత పరమార్థంగా హితవు పలికారు. వ్యత్యాసం లేని, హద్దులు లేని స్నేహమే మానవులు శాంతియుతంగా జీవించడానికి దోహదం చేస్తుందని కవిగారి భావన. మనిషిగా ధనికుడైన, పేదవాడైన, ఏ కులంలో పుట్టిన, ఏ మతంలో ఉన్న తనూ ఆత్మగౌరవంతో జీవించాలని, అప్పుడే మానవజాతి పురోగమిస్తుంది. భీమన్న గారు సమాజ హితాన్ని కోరుకుంటున్నారు.

"అదే మనధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాపనార్థం ఈ గుడిసెలు మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై!
పోతుంటై పుట్టుకొస్తుంటై" **– గుడిసెలు కాలిపోతున్నై**

అంటూ వ్యంగ్యాత్మకమైన బాణాలను సంధించడం పైవాక్యాల్లో గమనించదగినది. పై కవిత ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలు చైతన్యం పొంది ఒకసారి ఆగిపోయిన దగ్గరే ఉండకుండా, ప్రగతి పథం (మార్గం)లో ముందుకు సాగాలని కవి కాంక్షించారు. గుడిసెల స్థానంలో మేడలు రావడం

ప్రగతి. అయితే ఈ ప్రగతి వారి జీవితంలోనే రావాలి. అంతేగానీ స్వార్థపరులైన ప్రతినిధుల జీవితాల్లో కాదు.

"ఈ విషవలయం సాగడం ఎంత వరకు?
'రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసేవరకు!" **- గుడిసెలు కాలిపోతున్నై**

అంటూ కాలిపోతున్న గుడిసెల స్థానంలో మళ్ళీ ఈ గుడిసెలు రావని, ఎప్పుడైతే ఈ మంటల్లో కింది వర్ణాల జీవితాలు ఉన్నాయో, దానిలోనే వాళ్ల యొక్క అజ్ఞానం, బూడిదై, సరికొత్త ప్రాపంచిక విజ్ఞాన పరుడిగా అవతరించాలని మరియు రానున్న కాలంలో దళితులు కూడా అన్ని రంగాల్లో చైతన్యం పొంది తమ అస్థిత్వాన్ని నింపుకుని అజ్ఞానజ్యోతి నుంచి జ్ఞానజ్యోతిగా వెలుగుతారని భావించవచ్చు.

పై ఖండిక సారాంశాన్ని ఒకసారి గమనించుకొన్నట్లయితే, భీమన్న గారి కవిత్వం ఒక మతానికి గానీ, ఒక వర్గానికిగానీ, ఒక కులానికి గానీ పట్టం కట్టదు. దేశ అభివృద్ధిలో సగభాగంగా ఉంటూ శ్రామికులు, దేశ అభివృద్ధి అనే వాహనానికి చక్రాలుగా ఉంటూ ముందుకు సాగిస్తున్నారు. అంటువంటి అభివృద్ధి కారకులైన శ్రామికులను, అగ్రవర్ణాలవారు హీనంగా చూస్తున్న దుస్థితి మారాలని, వారిలో కూడా చైతన్యం రావాలని భావించారు. భారతీయ సనాతన ధర్మం ప్రకారం ఎక్కువ తక్కువలు ఉండరాదని ప్రబోధించారు.

భాషా ప్రయోగం

తెలుగు తల్లి పాలు తాగుతూ
తెలుగు నేల అన్నం తింటూ
తెలుగంటే అసహ్యించుకునే వాళ్ళతో
రాజీ లేదు నాకు ? **- టుమ్రీలు**

భీమన్న గారికి మాతృభాషపై ఉన్న మమకారం తన కవిత్వంలో కనిపిస్తుంది. ఆయన భాష సూటిగా, సరళంగా ఉండటం వారి ప్రత్యేకత. గ్రామీణ జీవనానికి దగ్గరగా ఉండే మాటలతో, లోతైన భావాలను వ్యక్తపరచగలిగారు. అలంకార ప్రాధాన్యం కంటే భావ సత్యానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే ఆయన కవిత్వం సామాన్య పాఠకుడికీ సులభంగా చేరుతుంది.

మానవతావాదం

మానవుడై పుట్టి, మహాత్ముడుగా బ్రతికి
మనుగడ చాలించిన ఏ గొప్పవాణ్ణి
దేవుణ్ని చేసి దూరం చేసుకోను నేను
ప్రతిభావంతుడైన ప్రతివాన్ని
పరమేశ్వరున్ని చేసేస్తూ

ప్రజల మధ్యనుంచి తీసేస్తూ వుంటే
ఇక సామాన్యుడు పెరిగే దెలా ?
సంఘాభ్యుదయం జరిగే దెలా ?

బోయి భీమన్న సాహిత్యంలో ఏ రచనను పరిశీలించినా మానవతావాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. మనిషిని కేంద్రంగా పెట్టుకొని, సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ వంటి విలువలను ఆయన ప్రతిపాదించారు. వ్యక్తి బాధను సమాజ బాధగా చూడగల దృష్టి ఆయన రచనలకు బలం చేకూర్చింది.ఒక పేదవాణ్ణి, ముష్టివాణ్ణో చూస్తాం. మానవ సమాజంలో ఎంతో దైన్యం ఉందనిపిస్తుంది. కవి హృదయం కరుగుతుంది. ఆత్మ ఆవేశపడుతుంది. తన కలం నుంచి ఒక రచన వెలువడుతుంది.

ముగింపు

బోయి భీమన్న సాహిత్య ప్రస్థానం ఒక కవి వ్యక్తిగత ప్రయాణం మాత్రమే కాదు. అది ఒక సామాజిక ఉద్యమానికి ప్రతిబింబం. ఆయన రచనలు సమాజాన్ని ప్రశ్నిస్తాయి. పాఠకుడిని ఆలోచింపజేస్తాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయన కృషి శాశ్వత విలువ కలిగినదిగా నిలుస్తుంది. ఆధునిక, ప్రగతిశీల సాహిత్య ప్రవాహాల ప్రభావం భీమన్నపై స్పష్టంగా ఉంది. అయితే ఆయన గుడ్డిగా అనుకరణ చేయలేదు. స్థానిక అనుభవాలు, వ్యక్తిగత జీవన పరిశీలనలను సాహిత్యంగా మలిచారు. అందువల్ల ఆయన రచనలు స్వతంత్ర స్వరంతో నిలుస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు – శ్రీమతి హైమవతీ భీమన్న
2. గుడిసెలు కాలిపోతున్నై – బోయి భీమన్న
3. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

భీమన్న రాభీలు ప్రేమతత్వపు ప్రతీకలు - ఒక పరిశీలన

- డా. స్వప్న భువకర్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

జీవనది లాంటి తన సాహితీ స్రవంతిని భిన్న ప్రక్రియలలో పారించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న. వారు తన సాహితీ క్షేత్రంలో పండించిన ఫల భరిత కావ్యాలలో గేయకావ్యాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆయా సందర్భాలలో పాడుకున్న లేదా రాసిన పాటల్ని సంకలనం చేసి పుస్తక రూపంలో ప్రకటించినవే రాభీలు. గానం, గేయం అనేవి మానవజాతి పుట్టుకతో పెనవేసుకున్నవి. సాహిత్యంలో కూడా గేయమే మొదట పుట్టింది తర్వాత మిగిలిన ప్రక్రియలు ప్రచారంలోకి వచ్చాయి. మనిషి అంతరింద్రియాల్ని మేల్కొలిపే చైతన్యం పాటకే ఉంది కాబట్టి భీమన్న తన భావాభివ్యక్తికి గేయాన్ని ఎంచుకున్నారు.

రాభీ అంటే భీమన్న రాసిన ప్రేమ గేయం అని అర్థం. రసాద్వైతం వీరు సృష్టించుకున్న సిద్ధాంతం అయితే, రాభీ వీరు ప్రేమ గీతాలకు సృష్టించుకున్న కొత్త పేరు.

రాభీలలోని తాత్వికత అంతరార్థం

ప్రకృతి రెండు ప్రధాన ప్రవృత్తులతో, గుణాలతో కూడినట్టిది. అందులో ఒకటి స్త్రీ సహజమైన రామము రెండోది పురుష సహజమైన భీమము. ఈ రెండు శక్తుల సంసార విన్యాసమే పూర్ణ ప్రకృతి. వాటి సంయోగ వియోగాలే సుఖదుఃఖాదులు. వాటి ఆత్మ సమైక్యమే రసాద్వైతం. రామత్వభీమత్వ సహధార్మికమైనదే ప్రకృతి. కనుక ప్రకృతిని పూర్ణంగా అనుభవించేవే ఈ గేయాలు కనుక ఈ గేయాలకు రాభీలు అని పేరు పెట్టాను. ఈ రాభీలకు ఆలంబన ప్రేయసి ప్రియులు. (భీమన్న సమగ్ర సాహిత్యము సంపుటి 1, పుట 9)

రాభీలలోని ప్రేమత్వం

భీమన్న నమ్మింది అనుసరించింది రసాద్వైత మార్గం. "అద్వైతం నన్ను పురుషులు స్థానంలో నిలిపినందువల్ల నాకు ప్రకృతి ప్రియురాలు అయింది" (భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 6)

ప్రకృతిలోని ప్రతి సౌందర్యము వారికి ప్రియురాలు అయింది.

నాకోసం
ఈ జగమే నాకోసం!
ఈ విరిసే విరులన్నీ
మెరిసే ఝరులన్నీ
ఈ తోటలో ఈ పాటలు
ఆ కోనలు, ఈ తేనెలు!

(భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 24) అంటూ ప్రకృతిలోని అందాలన్నీ తనకోసమేనంటూ ఆనందపడతారు.

ప్రకృతిలో తన ప్రేయసిని వెదుకుతూ

చూశానులే
చూశానులే నిన్ను చూశానులే
మల్లెపూ మొగ్గ లో
మందార మధువులో
పద్మిని వ్రతములో (34) అంటూ పాడుకున్నారు.

భీమన్న రసాద్వైతం గురించి చెబుతూ

"ప్రేమించు వ్యాజంగా ప్రేమించు ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రేమించు ఎన్ని కష్టాలు కలిగిన నీ ప్రేమను చలించనివ్వకు ఆత్మార్పణ చేసుకో దానివల్ల కలిగే ఆనందమే రసానందం. దాని ద్వారా నీకు కలిగేదే మోక్షం "(భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 8) అని వివరిస్తారు. రాభీల్లోని ఒక గేయంలో ఇదే భావాన్ని చెబుతూ

రసాద్వైతులం మనం
రసా స్వాదకులం మనం!
చీకటిలో వెన్నెల వలె
స్నేహ చందనం మనం
పరమాత్మకు జీవాత్మకు
ప్రణయ బంధనం మనం (బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 323)

రాభీలకు ఆలంబన ప్రేయసి ప్రియులు అని ముందుగా చెప్పుకున్నట్లు

ప్రకృతిలో తన ప్రేయసిని వెతుక్కున్న భీమన్న తన అవ్యాజమైన ప్రేమను ప్రకటించే గీతాల్లో

నీవా?
నా ఎదలో దాగున్నది నీవా?
పుట్టుక నుంచి నాతో
పుట్టి పెరుగుతున్నదీ
పెరిగిన కొలదీ నాలో
విరిబారుతున్నది - నీవా

అని ప్రశ్నించడంలో ప్రేమ కేవలం భౌతిక ఆకర్షణ కాదు అది ఒక ఆత్మబంధమని, పుట్టినది మొదలు అలాంటి ప్రేమ కోసమే మనం పరితపిస్తామని తెలిపారు. అలాంటి ప్రేమ అవ్యాజమైన ప్రేమ లోతుల్ని తెలుపుతూ...

నీ మాటలు వినాలనీ
నీ పాటలు పాడాలనీ
నిత్యము నిను చూడాలనీ
నీతోనే ఉండాలని
మనసుకెంతో కోరిక
తనువుకెపుడొ ఈరిక!

(బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 38)

ప్రేమ అనాదిగా సజీవస్రవంతిలా ప్రవహిస్తుందని భీమన్న విశ్వాసం. యమునా నదిని దీనికి ప్రతీకగా చెబుతూ రాధాకృష్ణుల పవిత్ర ప్రేమకు ఇది సాక్ష్య మైందంటూ ధన్యవే యమునా నదీ అంటూ పాడుతారు.

రాస లీలా నంద బృందా
రామ రమణీ రాగ హృదిలో
ఉంటి వటవే నీవు కృష్ణుడు
ఉద్ధవించని ముందు కూడా?

(బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 42)

ప్రేమ సంయోగ వియోగాల సమ్మేళనం. సంయోగం కంటే వియోగంలోనే ఆత్మైక్యం గాఢతర మవుతుందనే లోకానుభవం ఈ రాభీల్లో కనిపిస్తుంది.

తెలుసు కొంటిరా!
తెలుసు కొంటిరా నిజము!
నీవు నాకు ప్రాణమని

నేను నిన్ను విడలేనని
నీవు నన్ను విడిచినచో
నిమిషమైన మనలే నని!

ఈ వియోగాన్ని తట్టుకోలేక మరొక చోట

ఏడ్చి ఏడ్చి, నీకై నా
ఎదయే ఒక కడలి కాగ
నన్ను నేనె పరచుకొని
కన్ను మిన్ను చేసుకొని ....

(బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట.43)

మనసుకు నచ్చిన వారు దూరంగా ఉన్నా వారు ఎప్పుడు హృదయాన్ని వీడి పోరని దగ్గరగా ఉన్నా దూరంగా ఉన్నా ఒకే రకమైన భావం ఉండాలని, ఎందుకంటే సంయోగ వియోగాల కతీతమైన మానసిక ప్రేమ ఎంతో గొప్పదని చాటారు ఈ గేయంలో

ఏది సమక్షము?
ఏది పరోక్షము?
హృదిని నీ వున్నప్పుడు
సర్వరస రాగములకు ను నే
స్వామినై మనునప్పుడు? (బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 51) మేఘురంజని

అంతులేని ప్రేమ, తట్టుకోలేని విరహం నుండే ఒక పరిణితి మనసుకు కలుగుతుంది. ప్రేమలో ఒకరి కొకరు అర్పణ చేసుకోవడంలో ఒక అద్వైత భావన మొదలవుతుంది. అదే ఆనంద మార్గం వైపు నడిపిస్తుంది.అలాంటి భావనల్ని చెబుతూ రాసిన గేయాల్లో,

ప్రేమలో అర్పణ
పూజింతును నిన్ను
నేనే నీ అలయమై !
నా ప్రణయపు పళ్లేరమున
నా ప్రాణము వెలిగించి
నిత్య స్మిత రశ్మి తో
నీరాజన మందించి ! **(బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 55)**

సాధారణంగా పూజా సమయాల్లో దేవుడికి హారతి ఇచ్చేందుకు కర్పూరాన్ని వెలిగిస్తాం అది అగ్నికి ఆహుతి అవుతూ దేవుడి సేవలో తరిస్తుంది. అలాగే ప్రేమికులు ప్రణయపు పళ్ళెంలో ప్రాణం వెలిగించడం అంటే విరహమనే అగ్నిలో ఆహుతి అవుతున్నప్పటికి సంతోషంగా ప్రేమించిన వారికి నీరాజనాలందిస్తారు.

ప్రేమలో అద్వైతం
పాల పొంగులో
పంచదార వలె
చెరకు విల్లులో
శీధు కణము వలె!
కౌముది ఎదలో
కలువ కన్నె వలె
గీతములో సం
గీతము వోలె!

(బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 88)

పాలలో పంచదార లాగా, చెరుకులో శీధువు లాగా, కౌముది కలువ వలె కలిసిపోయిన ఇరువురు ఎప్పటికీ విడిపోరని తెలిపే అద్భుతమైన అద్వైత భావన.

డా బోయి భీమన్న రాభీలు అతడు నమ్మిన, అనుసరించిన రసాద్వైతానికి ప్రతీకలు. రసానందమే బ్రహ్మానంద స్వరూపమని వారి విశ్వాసం. ఇప్పుడు జరుగుతున్న కష్ట నష్టాలకు జీవిత వైఫల్యాలకు ఈర్ష్యలకు, హింసలకు, దుఃఖాలకు ఈ నా రసా ద్వైత సిద్ధాంతమే పరిష్కార మార్గం. (బోయి భీమన సమగ్ర సాహిత్యం సంపుటి 1, గేయ కావ్యం భాగం-1, పుట 11)

ఆ మార్గంలో పయనించి మన జీవిత గాథల్ని రాధామాధవం చేసుకొందాం. రసానందంతో మోక్షానుభవం పొందుదాం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

సమాజం - సాహిత్యం- బోయి భీమన్న మరో చూపు

- డా. పెబ్బేటి మల్లికార్జున్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్ : 9491881916

నేపథ్యం:

ప్రాచీన భారతదేశం యొక్క సాంఘిక వ్యవస్థ గురించి తెలుసుకోవడానికి శాసనాలు, సాహిత్యం ఆధారాలుగా ఉన్నాయి. భారతీయ సాహిత్యంలో వేదాలు మొదటివిగా పేర్కొంటారు. వీటి తరువాత బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు, స్మృతులు వచ్చాయి.ఇవి ఆర్యుల యొక్క సాహిత్యం. వీటి తరువాత పురాణాలు పుట్టుకొచ్చాయి. పురాణాలు ప్రాచీన గాథలను తెలుపుతాయి. తర్వాత ఇతిహాసాలు వచ్చాయి. ప్రాచీన సాహిత్యంలో రామాయణం, మహాభారతం ఇతిహాసాలుగా ప్రసిద్ధి పొందాయి. ఇతిహాస్ అంటే హిందీలో చరిత్ర అని అర్థం. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు భారతీయ సమాజపు జీవన విధానంపై స్పష్టమైన ప్రభావాన్ని చూపాయి. ఇవి భారతీయ సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడిపాయని పండితులు ఘంటాపథంగా చెప్పారు.

వీటి వలన వేల సంవత్సరాలు అవకాశాలకు, ఆస్తికి, అక్షరానికి, అధికారానికి దూరమై అణచివేతకు గురైన వర్గాలు ఆధునిక కాలంలో ప్రశ్నించడం మొదలుపెట్టారు పురాణాలను కల్పిత కథలుగా కొట్టి పారేశారు. వీటి ద్వారా పాలకవర్గాలు, ఆధిపత్య వర్గాలు కొన్ని వర్గాల సామాజిక, భౌతిక, మానసిక ప్రవర్తనలను నియంత్రిస్తూ తమ ప్రయోజనాలకు అనుకూలంగా రూపొందించుకున్నారని, ఈ సాహిత్యాన్ని, ఈ సాహిత్యం ద్వారా ఏర్పడిన భావనలను మరో కోణంలో చర్చించారు.

వెనకబడిన వర్గాల నుంచి వచ్చిన డా.బోయి భీమన్న సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు తెచ్చే ప్రయత్నం చేశాడు. "భీమన్న కవితాతత్వం రసాద్వైతం. ఈయన సాహితీ జీవితానికిది సుషమ్న అనుకుంటే- ప్రేమ, శృంగారం సూర్యచంద్ర నాడులనవచ్చు. సాంఘిక, రాజకీయ సమస్యల్ని ఇతివృత్తాలుగా తీసుకొన్నా, ఈయన వాటిని సాహితీకరించిన రీతి, స్థాయి తాత్వికోన్నతమైనట్టివి.

సాధించిన సాంఘిక సాంస్కృతిక విప్లవాలు అసదృశమైనట్టివి" (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు). బోయి భీమన్న వేదాలు, పురాణాలు, కావ్యాలలోని మంచి విషయాలను సమర్థిస్తూనే సమాజాన్ని అసమానతలకు గురిచేసిన అంశాలను ప్రశ్నించాడు, వాటిలోని విషయాలను పునర్నిర్వచించాడు. మహాకవులు చెప్పినవి అన్ని సత్యాలే అనుకోవడానికి వీలులేదని, అసంగతాలు కూడా ఉన్నాయని చెప్పాడు. సామాజిక అంశాలలోని సాంస్కృతిక విశేషాలకు సంబంధించి కొత్త కోణంలో నిర్వచనాలు ఇచ్చాడు." పూర్వం నుండి మహాకవులుగా భావించబడుతున్న గొప్ప వాళ్ళల్లో అనేక అసంగతాలు కనిపిస్తున్నాయి.నాకు వేమన గారి ఉప్పుకప్పురంబు పద్యంలో ఆంగ్ల మహాకవి కీట్స్ గారి 'A Thirty of Beauty is a joy for ever' అనేది కూడా నిజం కాదు. అందమైన ఏ వస్తువైనా ఆనందాన్ని కలిగిస్తుంది. నిజమే కానీ అది శాశ్వతమైనటువంటిది కాదు. ఏ వస్తువు అందం ఆ వస్తువుదే, అది సుస్థిరం కాదు తాత్కాలికం. కొన్ని తళుక్కుమని మాయమైతే మరికొన్ని కొంతకాలం వెలిగి ఆరిపోతాయి. అలాంటి అనేక రకరకాలుగా అలంకరించబడ్డ అసత్యాలను సత్యాలుగా నమ్మేస్తున్నాం. ఆలోచించడమే మానేశాం. (శంఖారావం కావ్య పీఠిక - పుట 32).

సాంస్కృతిక అంశాలకు సంబంధించి చేసిన మరో పునర్నిర్వచనం చూద్దాం. "పెళ్లికి ముందు ద్వైతం/ పెళ్లయిన కొత్తలో అద్వైతం/ పిల్లలు పుట్టిన తర్వాత విశిష్టాద్వైతం/ ఈ అన్నింటి గుండా ప్రవహించే ఏకాత్మతే/ మన రసాద్వైతం" (గిల్లి చెబుతున్న- పుట 81) వివాహానికి ముందు వధూవరులు వేరువేరుగా ఉంటారు కాబట్టి దానిని ద్వైతం అని చెప్పాడు. వివాహం తర్వాత కలిసి ఉంటారు కాబట్టి దానిని అద్వైతం అని చెప్పాడు. వీరికి సంతానం కలుగుతుంది కాబట్టి అది విశిష్టాద్వైతం అని చెప్పాడు. ఎల్లకాలం నిలిచి ఉండే దాంపత్యమే ఏకత. అదే రసాద్వైతం. రసం పరమాత్మ స్వరూపం. వ్యక్తి నుండి పరమేశ్వరుని వైపు తీసుకెళ్లారు. భీమన్న దీనిని చమత్కారం కొరకు కాకుండా మన యొక్క సంస్కృతి, తాత్వికత, సంప్రదాయం, రసాలంకారత అన్ని కలగలిపిన జాతీయ ఆత్మ పీఠం పైన నిలిపిన భావ చిత్రం ఇది. ఇలా కొత్తగా జాతీయ, సాంస్కృతిక, సామాజికపరమైన పునర్దర్శనం చేయించాడు.

భారతదేశంలో రామాయణం, మహాభారతం చూపించినంత ప్రభావం ఏ గ్రంథాలు చూయించలేదు. రాముడి ప్రభావం రాజకీయాలనే ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వాలనే మార్చే శక్తి ప్రస్తుతం ఈ దేశంలో రామ నామానికి ఉంది. ఇంత బలమైన ప్రభావం మధ్యలో కూడా రాముడిని దేవుడిగా కాకుండా మానవుడిగా చూడాలని మరో కొత్త కోణంలో "రాముడు సాక్షాత్తు దేవుడే అనుకుంటే/ అతడే ఏడిస్తే మనకు నవ్వు రాదా? రాముడు మానవుడు కనుకనే /అతని కష్టాల పట్ల మనకంత సానుభూతి! మాయా సీత ఏమైపోతే మనకేం? అసలు సీత బాధ పడితేనే మనకు బాధ (గిల్లి చేష్టలు- పుట 81). ఆధునిక కాలంలో రామాయణం, మహాభారతాలను వివిధ కోణాల్లో దర్శించిన వారు ఉన్నారు. "రామాయణం, మహాభారతం ప్రతిపాదించిన అంశాలకు భిన్నమైన సామాజిక వ్యవస్థ పూర్వ సమాజంలో ఉండేది. స్వేచ్ఛాయుతమైన, క్రమబద్ధమైన జీవన విధానం ఉండేది. గణ రాజ్యాలు ఉండేవి.స్త్రీ రాజ్యాలు ఉండేవి. వర్ణధర్మం పేరిట గో బ్రాహ్మణ అధికారం ఎక్కువైన కాలంలో ప్రజలు పాలకుల అధికారాన్ని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. మత విషయాలలో రాజ్యం జోక్యం చేసుకోవడం

వల్ల స్థానిక అసుర జాతులు పాలకుల ఆధిపత్యాన్ని ప్రతిఘటించడం మహాభారత, రామాయణ కథలలో గమనించవచ్చు." (పురాణాలు– మరో చూపు)

దేవుడికి సంబంధించిన విగ్రహాల రూపంలో కూడా కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు. మన దేశంలో విగ్రహారాధన ప్రాచీన కాలం నుండి వస్తుంది. సాకారం– నిరాకారం రెండు పద్ధతుల్లో మనదేశంలో పూజిస్తారు. "నాకు దేవుడు లేడు, ఉన్నవి ప్రతిమలు/ లోకమానవ నైజ ప్రతీకలవీ/ పితరుల ఫోటోలు, వీరుల విగ్రహములు /ఆశలకు ఈప్సితములకు ఆకృతులవి"

సర్వసముడు, దయాళువు, జగతికొకడే/ స్రష్ట అను మాట రుజువుకురాని కతన / ప్రాణ రక్షణ స్వీయకర్తవ్యమగుట/ కోర్కెలకు రూపముల నిచ్చుకొని ఎనరుడు."

దేవతల విగ్రహ రూపాల నిర్మాణంలో గల తేడాలను కొత్త కోణంలో దర్శించిన బహుశా మొదటి కవి అయి ఉండవచ్చు. ఆకారాన్ని ఇవ్వడంలో గుణాన్ని బట్టి, వర్ణనలను బట్టి, దేవతలలో వారికుండే హోదాలను బట్టి విగ్రహాలకు ఒక రూపాన్ని ఇచ్చారని ఆలోచించాడు. దీనితోపాటు మానవుడు విగ్రహారాధనను ఎంచుకోవడానికి సౌలభ్యం కారణంగా చెప్పాడు. ఈ భూమి మీద ఉండే జీవరాశులు దేవుని గురించిన ఆలోచన గానీ, అతీతమైన శక్తుల అవసరాన్ని గాని అవి కోరవు. దైవారాధన అనే భ్రాంతిని ఆశ్రయించి బ్రతికే బలహీనుడు మానవజీవి మాత్రమే. మనిషి తాను చేయలేని పనిని దేవుడు చేస్తాడని, కోరికలు తీరుస్తారని విశ్వాసంతో ఉంటాడు. భగవంతుడు – భక్తుని మధ్య జరిగే భక్తికి మనిషి యొక్క బలహీనతనే కారణమననే కోణంలో ఆవిష్కరించాడు.

విగ్రహారాధకుడ నేను, విజ్ఞతకు
విగ్రహములు సింబల్స్ విశ్వమందు
వ్యక్తులెందరో అన్ని సింబల్స్ కలవు
దేవుడును సింబలే కద భావమునకు (శంఖారావం కావ్య పీఠిక)

భూమి మీద ఉండే లక్షల జీవరాసులు దైవం యొక్క శక్తిని, సహాయాన్ని కోరడం లేదు. మానవుడు ఇతర జీవుల కన్నా బలహీనుడనే భ్రాంతిలో బ్రతుకుతుండడం వల్లనే దేవుడిని ఏర్పరచుకొన్నాడని, దేవుడు అనే రూపం మనిషి యొక్క ఆలోచనలకు,గుణాలకు తగిన ఒక గుర్తు అని కొత్తకోణంలో ఆవిష్కరించాడు.

భారతదేశంలో లెక్క లేనంత సంఖ్యలో దేవుళ్ళు ఉన్నారు. వీటికి గల కారణాలను రంగనాయకమ్మ చర్చించారు. ప్రాచీన కాలంలో "గణాన్ని పరిపాలించే నాయకులే పురోహితులుగా వ్యవహరించే వారు. ప్రతి తెగకి వారి అనుభవ జ్ఞానాన్నిబట్టి, పరిస్థితులను బట్టి అనేక విశ్వాసాలు, అభిప్రాయాలు, ఆచారాలు ఏర్పడ్డాయి, దేని మత కార్యకలాపాలు దానికి ఉన్నాయి. అప్పటికి వారికి ప్రకృతి గురించి ఏమీ తెలీదు. మెరుపుల్ని, ఉరుముల్ని, వర్షాన్ని, చీకటిని భూకంపాలని, వరదల్ని ఇలాంటి అన్నిటిని అతీత శక్తులుగా భావించి పూజించారు (రామాయణ విషవృక్షం). వివిధ ప్రాంతాలలో ప్రజల యొక్క సంప్రదాయాల,ఆరాధనలకు అనుగుణంగా ఇచ్చిన రూపాలు దేవతా ప్రతిబింబాలని దేవతల శిల్ప నిర్మాణాన్ని కొత్త కోణంలో దర్శించాడు.

"నీవు ఏ రూపంలో నన్ను ఆరాధిస్తే
ఆ రూపంలో సాక్షాత్కరిస్తానన్నది పరమాత్మ
వివిధ సంప్రదాయాల ఆరాధనలే
వివిధ మతాల అధిదేవుళ్ళు
మన అభిలాష ప్రతిబింబాలే
మనం కొలిచే దేవతామూర్తులు
గుడికి వెళ్లినా, గదిలో కూర్చున్నా ఒక్కటే
కావలసింది ఆరాధనలో ఏకాగ్రత (గిల్లి చెబుతున్న)

పుణ్యం, పాపం, స్వర్గం, నరకం వంటివి సత్యాలు కావని కుండ బద్దలు కొట్టాడు.

"ఉత్తరాదికి ఉత్తరాయణం వలెనే దక్షిణాదికి దక్షిణాయణం పుణ్యకాలం
పుణ్య పాపాలు, స్వర్గ నరకాలు వంటివి
దేశ కాలానుగత వైయక్తికాలు,
విశ్వజనీన సత్యాలు కావు (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 92)

సాహిత్యమే కాకుండా సామాజికంగా ఉండే అసమానతలలో ప్రధానమైన అస్పృశ్యతను అనుభవించిన జాతులన్నీ పల్లెలను వదిలిపెట్టి పట్టణాలకు తరలిపోయినప్పుడే కుల భేదాలు నశిస్తాయని మరో కొత్త ఆలోచనను ఇచ్చాడు. గ్రామాలలో సహజంగానే కిందివర్గాలు ఎంత ఎదిగినా కుల దృక్కోణంలోనే చూస్తారు. పట్టణాలలో కులాని కంటే డబ్బు, హోదాలకే గౌరవం ఉంటుంది. ఆ కోణంలో భీమన్న గారు

"దళిత తత్వము నెల్లను తగలబెట్టి
పయనమై పొండు చేరువ పట్టణములకు
పట్టణం చుట్టూ గృహములు కట్టుకొండు
మారునప్పుడు సంఘసంస్కరణ తీరు " (శంఖారావం)

సమాజంలో మానవుని యొక్క సాంఘిక భద్రత కొరకు ఏర్పర్చిన నియమాల అమలును కొత్త దృక్కోణంలో ఆవిష్కరించాడు. ఈ నియమాలను ఆధిపత్య వర్గాలు వెనకబడిన వర్గాలను లొంగదీసుకోవడానికి వాడుకుంటున్నారని

"నీతి శాస్త్రాల కుప్ప పై నిల్చి, ధర్మ
నిర్ణయము కోరుచున్నాడు నేడు నరుడు
రేపు తిండి ఎట్లను బెంగబాపకుండ
దేవి సంఘమ్ము నెటు చక్కదిద్ద లేవు" (దీప సభ)

వేదకాలం నుండి ఉన్న ప్రబోధాలు ప్రజలందరికీ ఉపయోగపడాలి కానీ కొందరికి తమకు పోటీ వచ్చే వాళ్లను నిర్దాక్షిణ్యంగా నిర్మూలించడానికి ఉపయోగపడ్డాయి. అవి ఈనాటికీ కొనసాగుతున్నాయి. కాబట్టి సమాజ శ్రేయస్సు కొరకు నీతి శాస్త్రాలను ఉపయోగించాలి అంటాడు.

'వలలు' అనే కవితలో
"వద్దు మతం, వద్దు మత బోధలు
వద్దు భక్తి, వద్దు భజనలు
అవేవీ నిన్ను రక్షించలేవు

అవన్నీ నీకోసం పన్నిన వలలు ఏది పులిదో, ఏది నక్కదో కనిపెట్టు మనఃశక్తిని పెంచుకొని మనిషిగా బ్రతుకు". (గిల్లి చెబుతున్న)

ముగింపు:

బోయి భీమన్న తన జీవితాంతం జాతీయవాదిగా ఉన్నారు. జాతీయవాదంలో జరిగిన హిందూ మత పునరుద్ధరణ, అందులోని కులాల అసమానతలకు సంబంధించిన అంశాలను బోయి భీమన్న తన కవిత్వానికి కొన్నిచోట్ల వస్తువుగా తీసుకున్నాడు.ప్రాచీన సాహిత్యం, సమాజంలోని మంచిని స్వీకరిస్తూనే అందులోని అసమానతలను, అన్యాయాలను కొత్త కోణంలో ప్రశ్నిస్తూ తన కవిత్వానికి సిరాగా వాడుకున్నాడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. హైమవతీ భీమన్న- పాలేరు నుంచి పద్మశ్రీ వరకు-బోయి భీమన్న సాహిత్య కళా పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ- తృ. ము. 2008
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - భీమన్న సాహిత్య కళా పీఠం- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ- 2008.
3. బి.విజయభారతి-పురాణాలు మరో చూపు-హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ-ద్వి. ము. -2017
4. రంగనాయకమ్మ- రామాయణ విషవృక్షం-స్వీట్ హోమ్ పబ్లికేషన్స్-పం. ము. 2015

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న దర్శించిన జాషువా కవిత్వపు మెరుపులు లోతులు

- డా. బి. వెంకటయ్య,
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
సెల్ : 9010974241

పరిచయం:

సహకవులు, సోదరకవులు బోయి భీమన్న మరియు జాషువాలు. సామాజిక పీడన, అవమానం ఇద్దరూ అనుభవించారు. పేదరికం, అవమానాలను అధిగమించి సామాజిక మార్పుకోరే కవిత్వం రాశారు. ఇద్దరి మధ్య నలబై యేళ్ల సాహిత్య - సాన్నిహిత్య అనుబంధం ఉంది. జాషువా కవిత్వాన్ని అభిమానిస్తూ అధ్యయనం చేస్తూ వాటిలోని విశేషాలను తెలుపుతూ చేసిన రచన "నాకు తెలిసిన జాషువా".

ఉద్దేశ్యం:

బోయి భీమన్న గారు "నాకు తెలిసిన జాషువా" అనే ఈ పుస్తకంలో జాషువా కవిత్వంలోని శిల్పసొగసులను, లోతులను తెలిపారు. జాషువా కవిత్వంలో భీమన్న దర్శించిన ఈ అంతరార్థపు లోతుల్ని, మెరుపులను (శిల్ప సొగసుల్ని) పరిశీలించే ప్రయత్నం ఈ వ్యాసంలో చేస్తున్నాను.

పరిశీలనా పద్ధతి:

బోయి భీమన్న గారు జాషువా కవిత్వానికి గల నేపథ్యం, సందర్భం, శిల్ప మరియు భావ ప్రత్యేకతలను సంభాషణ, కథనాత్మక పద్ధతిలో విశ్లేషించారు. ఇదే పద్ధతిని నేనూ అనుసరిస్తున్నాను.

విశ్లేషణ:

ఒకసారి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సమావేశం జరుగుతున్నప్పుడు నేను జాషువా ప్రక్కనే కూర్చున్నాను. రెండు క్షణాల మౌనం తర్వాత ఇన్విటేషన్ కార్డును వెనుకకు తిప్పి పెన్సిల్‌తో ఏవో నాలుగైదు గీతాలు గీసి నాకు చూపారు. నా చేతిలోంచి డా॥ సి. నారాయణరెడ్డి గారు లాక్కున్నారు. ఆ కార్డు అలా అందరిలోకి వెళ్లిపోయింది. ఇంతకూ జాషువా గీసినదేమంటే మాముందు వరుసలో కూర్చున్న "కృష్ణ శాస్త్రి" గారి ముఖ చిత్రం ఎంతో సహజ సుందరంగా, ఆరితేరిన చిత్రకారుడి

చతురశిల్పంగా ఉన్నదది. నన్నేకాదు నారాయణ రెడ్డి గారిని కూడా ఆశ్చర్యంలో ముంచివేసింది. జాషువా గారు మా ముఖాలలోకి చూసి చిరునవ్వు నవ్వుతూ అన్నారు.

"లలిత కళలయందు బలమైన అభిరుచి
చిన్నతనమునందె చిగురుబెట్టి
లీలనెదిగి చిత్రలేఖనంబయి మారి
కట్టకడకు నాంధ్ర కవనమయ్యె"

ఈ పద్యాన్ని వర్తమానంలోని సందర్భంతో సమన్వయించి బాల్యంలోనే జాషువాకు లలిత కళల పట్ల ఉన్న అభిరుచి తర్వాత తర్వాత అది కవిత్వంగా మారిన విషయాన్ని అర్థం చేయిస్తారు భీమన్న గారు.

"ఎదుటపడ్డ వస్తు వింపైన దైనచో
ఊరకొనదు చిత్ర కారు కలము"

చిత్రకారుని గురించి జాషువా మరొక చోట అన్న ఈ విషయాన్ని మన దృష్టికి తెస్తూ కవిత్వంలో దృశ్యాన్ని రచించే కవిచిత్రకారుడిగా జాషువా ఎదిగిన విషయాన్ని మనం గ్రహించేటట్లు చేస్తారు భీమన్న గారు.

పోతన భాగవతం పద్యాలతోనూ శ్రీనాథుడి చాటువులతోనూ నాకప్పటికీ బాగా పరిచయం. ఆధునికులలో అంత అందమైన పద్యాలు వ్రాయగలవారు లేరు అనుకుంటూ ఉండేవాణ్ణి. జాషువా పద్యాలతో పరిచయం ఏర్పడిన తర్వాత నా అభిప్రాయం మారింది. "ఫిరదౌసి"లోని ఈ సీసపద్యం నాకు చాలా ఆత్మీయమైందన్నారు భీమన్న గారు.

విత్తనంబున మహావృక్షంబు నిమిడించి
సృష్టించి గారడీ సేయువాడ
కడుపులో శిశువును గల్పించి పదినెలల్
మోయించి యూపిరివోయివాడ
సద్భక్తవరులకు సాక్ష్యాత్కరించియు
నున్నచోటెఱింగింపకున్న వాడ
పొటమరింపకముందే పుష్పసంతతులకు
వింతగా రంగులు వేయువాడ

చెలువ మొప్పుబుడమి సృష్టించి మాకిచ్చి
అనుభవింపుడనుచు నానతిచ్చి
నిలువనీడలేక నిల్చిన కలవాడ
కడుపునిండ నన్ను కన్నవాడ!

విత్తనంలో మహావృక్ష్యాన్ని ఇమిడించడం, కడుపులోని శిశువుకు ప్రాణం పోయడం, నిజమైన భక్తులకు ప్రత్యక్షమై తానున్న చోటు మాత్రం బహిరంగపర్చకపోవడం, పూలు వికసించకముందే వింతవింతైన రంగులు వేయడం, ఈ అందమైన ప్రపంచాన్ని అనుభవింపుడంటూ ఇవ్వడం – ఇవి అన్నీ చూసినప్పుడు ఈ ప్రపంచపు సృష్టియంతా దేవుడు గారడీ చేస్తున్నట్లుగా అనిపిస్తుందంటాడు. ఇదంతా చేసినా తనకు మాత్రం నిలువనీడ లేదంటాడు. అంతా కలిగి ఉండే నిలువ నీడలేని వాడంటాడు. దైవ విశ్వాసపు తత్వాన్ని, ఆయన చేస్తున్న అద్భుత సృష్టి చర్యలను అంతే అద్భుతాశ్చర్యాలతో మెరిసే శైలితో ఈ పద్యాన్ని సృష్టించారు జాషువా.

అందుకే భీమన్న గారు ఈ పద్యమెంతో నాకు ఆత్మీయమైంది అన్నారు. పోతన, శ్రీనాథుల సరసన ఆధునికులలో అందమైన పద్యాలు అల్లగలవాడుగా జాషువా నిలుస్తాడనీ మనం గ్రహించేటట్లు చెబుతారు భీమన్న గారు.

కాళిదాసు "మేఘ సందేశం"లో యక్షుడు తన భార్యకు ప్రణయ సందేశం పంపడానికి మేఘాన్ని రాయబారిగా ఎంచుకున్నాడు. జాషువా దీన్ని నమూనాగా తీసుకొని అంటరానివాడి పరివేదనని కైలాసంలోని శివునికి నివేదించడానికి గబ్బిలాన్ని రాయబారిగా ఎంచుకుంటాడు.

కాళిదాసుని మేఘంబు గౌరవంబు
తెచ్చుకొన్నదె నీదు సందేశగాధ
ఘనులు చేకొను భూభృదగ్రముల పూజ
యసమ చతురత్వమున్న బానిసకురాదు

దీన్ని భీమన్న గారు "యక్షుడిది వ్యక్తిగత సమస్య. వ్యక్తిగత బాధ. ఆ బాధకు విశ్వజనీనతను కాళిదాసు కల్పించాడు. గబ్బిలం కూడా స్వభావంలో అలాంటిదే. గుణంలో అంతకంటే గొప్పది గబ్బిలం తీసుకువెళ్లింది వ్యక్తికి వ్యక్తి సందేశం కాదు. భగవంతుడికి బహిష్కృతుల మొర" అంటూ విశ్లేషిస్తారు.

విశ్లేషణను ఇంకా విస్తరిస్తూ "అరుంధతీ సుతుడొక్కడు కాడు". కోటాను కోట్ల దళితులకు ప్రతినిధి. అతడితో మమేకం చెందిన కవి యొక్క ఆత్మవేదనా నివేదన ఇది. "ఘనులు" అంటే "గొప్పవారు", "మేఘములు" అని రెండర్థాలు. పర్వత శిఖరోన్నతమైన పూజ లభించేది మేఘానికే కదా! గబ్బిలానికి ఎంత అర్హత ఉన్న అది క్రిందనే ఉండిపోతుంది! రెండూ సహజోక్తులే, అయినా వాటిని మానవ స్వభావంలోని తారతమ్య భేదాలను సూచించడానికి జాషువా వాడుకున్న పద్ధతి అద్భుతంగా ఉంది. సమున్నత సన్మాన గౌరవాలు లభించేది మరి పైవాళ్లకే! పైపైన తిరిగే వాళ్లకే!" అంటూ ఈ చిన్ని పద్యంలోని లోతును వెలికి తీశారు భీమన్న గారు.

ఒకామెకు ఆరుగురు సంతానం. చివరి బిడ్డకు పురుడు పోసిననాడే భర్త మరణించాడు. ఆమె జోలెతో ఊరూరా తిరుగుతూ పిల్లలతో బతుకుతున్నది. ఒక్క షోకిలా త్రొక్కుడుబండి కొత్తగా నేర్చుకుంటూ వచ్చి ఆమె మీద పడ్డాడు. ఆమెకు గాయాలై రక్తం కారుతున్నది. ఆమె అవస్థను చూసిన బ్రాహ్మణ వ్యక్తి ఆమెను ఆస్పత్రికి తీసుకుపోయి వైద్యం చేయించాడు. ఇది చూసిన అమ్మలక్కలు ఆ బ్రాహ్మణ వ్యక్తి భార్య దగ్గరికి పోయి అమ్మా! నీ భర్త ఒక "మాలది" పడిపోతే "ముట్టుకొని" వైద్యం

చేయించారు. నీ భర్త కుడి, ఎడమ లేకుండా చేస్తున్నాడనీ అంటారు. భార్య కోపించి భర్త మాల స్త్రీని ముట్టుకొని అంటుపడినందుకు స్నానం చేసి గానీ ఇంట్లోకి రావద్దంటుంది. ఆమె మాట ప్రకారం స్నానం చేసి భోజనం చేసిన తర్వాత భార్యను పిలిచి ఇలా అంటారు.

అలుక శమించెనా జలకమాడిన యంతనె? మాలదాని పి
ల్లల కడగండ్లు సూచి బహుళంబుగ తప్తము నందు నామనో
జలజము మైలవడ్డదది స్నానము చేసెనె? వెట్టిదాన! యీ
వెలుపలి శుద్ధి జీవులకు బెట్టునె? పోయెనె? ముక్తినిచ్చునే? **(అనాథ)**

ఒక బ్రాహ్మణ పాత్ర చేతనే తన భార్యకు హితవు చెప్పించడం అనేది కవిత్వ సృజనా విశేషమే (మెరుపే). భీమన్న గారు దీన్ని ఇంకా లోతుగా విశ్లేషిస్తూ" "ఏ సవర్ణ హిందువులు ఈ బాహ్యమైన అంటరానితనాన్ని పాటిస్తున్నారో ఆ సవర్ణ హిందువుల ప్రామాణిక శాస్త్రాలు చేస్తున్న ఉపదేశం చూపిస్తారు.

అపవిత్రః పవిత్రోవా
సర్వావస్థాంగతోపివా
యస్మరేత్ పుండరీకాక్షం
సబాహ్యాంభ్యంతరః శ్శుచిః

మనిషి పవిత్రంగా ఉన్నా అపవిత్రంగా ఉన్నా అతడి అవయవాలు ఏ అవస్థలో ఉన్నా (ఏ పని చేస్తున్నా) అతడు పుండరీకాక్షుడ్ని స్మరిస్తే చాలు బైటా లోపలా కూడా శుద్ధిగలవాడే అవుతాడు".

శాస్త్రాలకు భిన్నంగా అంటరానితనం అనే దురాచారం సమాజంలో ఉండటంలోని అహేతుకతను, లోగుట్టును పైకి లాగి ఈ ద్వంద్వ ప్రమాణాలను జాషువా కవిత్వంలో నిరసించిన దాన్ని భీమన్న గారు దర్శించి మన వివేకంలో భాగం చేశారు.

ఇజ్రాయిల్ దేశం యూదయ, సమరయ, గలలియ అనే మూడు ప్రాంతాలుగా విభజింపబడి ఉంటుంది. యూదయ గలలియ ప్రాంతాలకు మధ్యలో ఉన్నది సరయ. ఈ సరయ ప్రాంతంలో నివసిస్తున్న సమరయుల్ని యూదులు అస్పృశ్యులుగా చూస్తారు. యూదయ నుండి గలలియ వెళ్ళటానికి దగ్గరిదారి సమరయ మీదుగా వెళ్ళటం. అయినప్పటికీ చుట్టూ తిరిగి వెళ్తారు కానీ సమరయ మీదుగా వెళ్లరు. కాని "యేసు" సమరయ మీదుగానే గలలియకు వెళ్ళుచున్నప్పుడు దాహం వేస్తుంది. నీళ్లు తోడుతున్న సమరయ స్త్రీని చూసి నీళ్లు పోయమనీ అడుగుతాడు. నేను అస్పృశ్యురాలిని (సమరయ వంశం). నీవు యూదు వంశంలో జన్మించిన వాడివి. "మీరు ఈ బావినీళ్లను త్రాగరాదు, తప్పు" అంటుంది. అప్పుడు "ఏసు"

జలముల్ వాయువు నగ్నియున్ బరమ రాజన్యుండు భూలోకవా
సులకుం బంచియొసంగిపోయిన స్థిరాస్తుల్ స్పృశ్యతాస్పృశ్యతల్
కులగోత్రాలు ప్రపంచ సభ్యతకు సిగ్గుంజేటు జుమ్మిమ్మహా
కలుషంబెల్ల మహాపదార్థములకున్ గల్పింతురల్పాశయుల్

నీరు, గాలి, నిప్పు అనేవి భూలోకవాసులకు పరలోక ప్రభువు పంచియిచ్చిన స్థిరాస్తులు. తాకనీయడం, తాకనీయకపోవడం మరియు కులగోత్రాలు ప్రపంచ సభ్యతకు సిగ్గు చేటైన విషయాలు. ఈ మహాపాపాన్ని పంచభూతాలకు సైతం అల్పబుద్ధులు కల్పిస్తున్నారు.

భీమన్న గారు ఈ పద్యంపై స్పందిస్తూ "ఏసు సర్వమానవ సమతా తత్వాన్ని సమరయ స్త్రీకి బోధించారు. ఇది నేను రాసిన "చాండాలిక" నాటికలోని చాండాలిక ఆనందుడికి తన బావి నీళ్లను ఇవ్వడానికి భయపడిన సన్నివేశంలాంటిది. అక్కడ కూడా బౌద్ధ ప్రముఖుడైన ఆనందుడు చాండాలికకు విశ్వజనీనతను బోధించి ఆమెలోని న్యూనతాభావాన్ని పోగొట్టాడు" అన్నారు.

ముగింపు:

మనతో సంభాషిస్తూ కథనం చేస్తూ జాషువా కవిత్వంలోని నేపథ్యాలు, సందర్భాలు, మెరుపులు, లోతులనూ బోయి భీమన్న గారు తనదైన పద్ధతిలో దర్శించారు.

"మిద్దెల్ మేడలు వృద్ధి చెందిన గతిన్

మేధస్సు పెంపొందెనే - అనీ స్వతంత్ర భారత పురోభివృద్ధి గురించి జాషువా వేసిన ప్రశ్నకు జవాబు చెప్పుకోగలిగితే ఆయన ఆశించిన సాంఘిక పరిణామానికి దోహదం చేసిన వాళ్ళమవుతాం" అంటారు బోయి భీమన్న గారు. ఇట్లా మనం కూడా భీమన్న దర్శించినట్లు జాషువా కవిత్వాన్ని దర్శించి సామాజిక మార్పుకు దోహదం చేద్దాం.

ఆధార గ్రంథాలు:

1) నాకు తెలిసిన జాషువా - బోయి భీమన్న.
2) గబ్బిలం, ఫిరదౌసి, నాకథ ఇతర రచనలు - గుఱ్ఱం జాషువా
3) మా నాన్న గారు - హేమలతాలవణం
4) జాషువా సాహిత్యం దృక్పథం - పరిణామం - డా॥ ఎండ్లూరి సుధాకర్.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న త్రిపదలు - దళిత జీవన వాస్తవాలు

- డా. ఇడికోజు శ్రీనివాసాచారి,
తెలుగు అధ్యాపకులు,
సెల్ : 9885349305

తెలుగు సాహిత్యంలో ప్రజాజీవన వేదనను, కులవివక్షను, దళిత అణచివేతను అత్యంత స్వచ్ఛమైన, అసంప్రదాయమైన, హృదయాన్ని కదిలించే రూపంలో వ్యక్తీకరించిన కవుల్లో బోయి భీమన్న ఒకరు. ఆయన కవిత్వం సంప్రదాయ కవిత్వ మార్గాలు, అలంకార శైలులు, మహాకావ్యాల శోభను అనుసరించదు. భీమన్నకు కవిత్వం అనేది కళా విన్యాసం కాదు. జీవితం, ప్రజల దుఃఖం, వారి ఆకలి, వేదనలు, శ్రమ, పోరాటం, అట్టడుగు వర్గాల భావజాలం, కష్టజీవుల జీవనావశేషాలు, మట్టితో పెరిగిన మనిషి ప్రతిదిన పోరాటం, సామాజిక అన్యాయం అన్నీ ఆయన త్రిపద రూపంలో కనిపిస్తాయి. 1962 లో వెలువడిన 'త్రిపదలు' కవితాసంపుటి ఆయన రచనా యాత్రలో ఒక శిలా సాక్షి. ఈ త్రిపదలు సంఖ్యలో చిన్నవి అయినప్పటికీ భావంలో పెద్దవి. రూపంలో లఘువైనా, పేదరికం-అణచివేత చరిత్రను మోసే భారమున్నవి. ఈ కవితలను సంపూర్ణంగా పరిశీలించినపుడు దళిత జీవన తత్వం, శ్రమజీవి గౌరవం, మానవతా ధర్మం, సామాజిక విమర్శ అన్నీ ఒకే తాత్విక ప్రవాహంలో కలిసిపోతాయి. ఈ త్రిపదలు అంతర్జ్ఞానం, కఠోర అనుభవాల గుణపాఠం, సామాజిక అసమానతపై తిరుగుబాటు, మనిషి-సమాజ సంబంధాలపై బాధ్యతా భావం వంటి అంశాలను తనలో మోసుకొంటాయి.

త్రిపది కర్ణాటక జానపద సంప్రదాయంలోని ఒక కవితా రూపం. భీమన్న ఈ రూపాన్ని సామాజిక చైతన్యానికి ఆయుధంగా మలిచారు. ప్రతి త్రిపదలో మూడు పంక్తులు ఉన్నప్పటికీ, వాటిలో వ్యక్తమయ్యే అర్థసాంద్రత అత్యంత ఘనంగా ఉంటుంది. త్రిపది శిల్పం సాధారణంగా మూడు పాదాలు:

1. స్థితి-వాస్తవాన్ని చెప్పడం
2. స్పందన-ఆలోచన లేదా విమర్శ
3. తీర్పు / సూత్రం-బోధ, నిర్ణయం, అంత్యార్థం

దళిత జీవనవాస్తవాల కవిత్వీకరణ :

దళిత జీవితం అనేది భారతీయ సమాజపు అంచుల్లోనే ప్రారంభమై, అదే అంచుల్లో తరతరాలకు కొనసాగిన ఒక బాధానుభవ చరిత్ర. ఈ చరిత్ర శాస్త్రీయ గ్రంథాల్లో కనిపించదు. దళితుని రక్తంలో, చెమటలో, మట్టిలో, పోరాటంలో మాత్రమే కనిపిస్తుంది. ఆ వేదనాత్మక జీవనాన్ని కవిత్వంగా మార్చిన అరుదైన కవి భీమన్న. ఆయన త్రిపదలు దళితుల శతాబ్దాల జీవన సత్యాలను మూడు పాదాలలోనే అద్భుతమైన స్పష్టతతో, సునిశిత వ్యంగ్యంతో, ఆవేదనతో, ప్రతిఘటనతో వ్యక్తీకరిస్తాయి.

కులవివక్ష దళితుల జీవితాన్ని నిర్వచించే ప్రధాన వాస్తవం. దళితుని ఇల్లు గ్రామం చివర, అతడి నీటి బావి వేరు, ఉపయోగించే పాత్రలు వేరు, పండుగలు వేరు, శ్మశానాలు వేరు. ఈ విభజన దళితుని మనిషిగా చూడని సామాజిక నిర్మాణం. దళితుని జీవితాన్ని కవి భీమన్న ఒక అంతులేని పోరాటంలా చూపిస్తాడు. పేదరికంతో పోరాటం, అవకాశాల కోసం పోరాటం, గౌరవం కోసం పోరాటం, మనిషిగా గుర్తింపు కోసం పోరాటం.

భీమన్న త్రిపదలు తెలుగు దళిత సాహిత్య చరిత్రలో ఒక కీలక మార్పును తీసుకువచ్చాయి. ఇవి పేదల గాథను పుస్తకాల్లో స్థాపించాయి. ఇంతకు ముందు తెలుగు సాహిత్యంలో పేద వాడి శ్రమ, దళితుడి అణచివేత, కష్టజీవుల చరిత్రకు స్థానం చాల తక్కువ. భీమన్న ఆ లోటును తీర్చాడు. ఆయన సాహిత్యం దళిత చైతన్యానికి నాంది పలికింది.

దళిత వాస్తవాల్లో మరొక ప్రధాన అంశం అవమాన అనుభవం. పాఠశాలలో, బస్సులో, దుకాణాల్లో, దేవాలయాల్లో, గ్రామ విభజనలో ప్రతి దశలో దళితుడు ఎదుర్కొనే అవమానం అతని మనసుపై గాయాలను మిగులుస్తూ ఉంటుంది.

"ఈ సౌందర్య సుధార్ణవంలో / ఏకాంతంగా నేను కోరుతున్నది నిన్ను / నీవు కోరుతున్నది నన్ను ! " ఈ త్రిపదలో భీమన్న ప్రేమను దళిత దృష్టితో నిర్వచిస్తాడు. సంప్రదాయ సాహిత్యంలో సౌందర్యం దేవతలకో, రాజులకో, కళాఖండాలకో పరిమితం అయితే, భీమన్న దాన్ని మనిషి–మనిషి మధ్య అనుభూతిగా నిలబెడతాడు. దళిత జీవితంలో "ఏకాంతం" అనేది సహజంగా లభించదు. కుల నియంత్రణలు, పేదరికం, సామాజిక గస్తీలు – ఇవన్నీ వ్యక్తిగత భావోద్వేగాలపై ఆంక్షలు. అందుకే " ఏకాంతంగా నిన్ను కోరడం " ఒక ప్రేమ ప్రకటన మాత్రమే కాదు. సామాజిక నియంత్రణలకు వ్యతిరేకమైన ధైర్యప్రకటన.

"నీవూ, నేనూ, మనచుట్టూ అమృత పదార్థమూ / ఈ త్రికమే కదా ప్రపంచం అంటే ?" ఇక్కడ భీమన్న ప్రపంచాన్ని తత్త్వ పరంగా మూడు అంచెలుగా నిర్వచిస్తున్నాడు:

1. వ్యక్తి 2. సంబంధం 3. జీవనోపాధి దళితుడి ప్రపంచం గ్రంథాలలో ఉండదు. అది అన్నం చుట్టూ తిరుగుతుంది. ఈ త్రిపదలోని "నలుపు–తెలుపు నమూనాలు" కేవలం తత్త్వ ద్వంద్వాలు కాదు. అవి కుల భేదాల ప్రతీకలు. ప్రపంచం సమానంగా లేదు అది విభజితమై ఉంది అన్న దళిత సత్యాన్ని ఈ త్రిపద స్పష్టం చేస్తుంది.

"నీవు నా ఎదురుగా వుండగా / బొమ్మల్ని చూస్తూ కూర్చోలేను నేను..." ఇది కళ-మనిషి మధ్య ఉన్న శ్రేణీకరణను తలకిందులుగా చేస్తుంది. సంప్రదాయ సాహిత్యంలో కళ శాశ్వతం. మనిషి తాత్కాలికం. భీమన్న వద్ద మాత్రం మనిషే కళకన్నా గొప్పవాడు. దళితుడికి కళలకన్నా జీవితం ముఖ్యం. ఈ త్రిపద మానవ కేంద్రిక దృష్టిని ప్రతిపాదిస్తుంది.

"నాకు కావలసిందేదీ అక్కడ లేదు !" ఇది వినియోగవాద సంస్కృతిపై దళిత విమర్శ. మార్కెట్ అన్నీ అమ్ముతుంది. కానీ ప్రేమను, ఆత్మీయతను, గౌరవాన్ని అమ్మలేదు. దళితుడి అవసరాలు భౌతిక వస్తువులకన్నా మానవ సంబంధాలు. "నే కోరేది రత్నశిల్పాలు కాదు, నీ ఒక్క ముద్దు..." ఈ త్రిపద దళిత శరీర రాజకీయాలపై అత్యంత ధైర్యవంతమైన ప్రకటన. దళిత శరీరాన్ని అపవిత్రమని చెప్పిన సమాజానికి భీమన్న శరీరాన్నే ప్రేమకు కేంద్రంగా నిలబెడతాడు. ఇది శృంగారం కాదు అస్తిత్వ ప్రకటన.

"గౌరవం, మర్యాద, విందు, వినోదం కాదు /....నీతో ఒక్కలేశం ఏకాంతం" సమాజం ఇచ్చే గౌరవం దళితుడికి సాధారణంగా దక్కదు. అందుకే భీమన్న సంస్థాగత గౌరవాన్ని తిరస్కరించి వ్యక్తిగత అనుభూతిని ఎంచుకుంటాడు. ఈ త్రిపద దళిత జీవనంలో "ఏకాంతం కూడా ఒక హక్కే" అని ప్రకటిస్తుంది.

"ఎన్నెన్ని నదులు ఒకటిగా కలిసినా / పెద్దదాని పేరే వస్తుంది ఆ నదికి ! / ఎన్నో నీవులు కలిసిందే నేను"ఈ త్రిపద దళిత వ్యక్తిత్వ నిర్మాణాన్ని అత్యంత లోతుగా వివరిస్తుంది. నదుల ఉపమానంలో ఆధిపత్య సంస్కృతి స్పష్టంగా కనిపిస్తుంది. ఎన్నో చిన్న నదులు కలిసినా, పెద్ద నది పేరే నిలుస్తుంది. ఇది చరిత్రలో దళితుల పాత్రను మరిచిపోయిన విధానానికి రూపకం. "ఎన్నో నీవులు కలిసిందే నేను" అని చెప్పడం ద్వారా భీమన్న దళితుడి వ్యక్తిత్వం సమూహ అనుభవాల ఫలితమని ప్రకటిస్తాడు. ఇది వ్యక్తివాదానికి వ్యతిరేకంగా నిలిచే దళిత సమూహ తత్వం.

"ప్రపంచంలో నేను మాత్రమే వుండాలనుకోను నేను / నాలాంటి కోట్లమంది కలసిందే ఈ ప్రపంచం! / నా హృదయం కూడ ఒక సుప్రపంచం!' ఇక్కడ భీమన్న దళిత ఆత్మగౌరవాన్ని తత్వస్థాయికి తీసుకెళ్తాడు. దళితుడిని 'అంచు మనిషి' గా చూసిన సమాజానికి ఇది సూటి ప్రతిఘటన. ప్రపంచం ఒక్కరికోసం కాదు అనేక దళితుల సమష్టి అనుభవమే ప్రపంచం. "నా హృదయం కూడా ఒక సుప్రపంచం" అనడం దళితుడి అంతర్గత లోకానికి ఇచ్చిన గొప్ప గుర్తింపు.

"సౌందర్యం నగ్నం, దాన్ని చూడలేదు మనిషి! / సత్యం నగ్నం, దాన్ని ధరించలేదు మనిషి! / పరబ్రహ్మ నగ్నం, దాన్ని పొందలేదు మనిషి!" ఈ త్రిపదలో "నగ్నం" అనేది కేవలం శారీరక భావం కాదు నిర్మల సత్యానికి ప్రతీక. దళిత జీవితం నగ్న సత్యం. అది అలంకరణలు లేని నిజం. కానీ సమాజం ఆ నగ్న సత్యాన్ని భరించలేను. భీమన్న చెప్పే సత్యం దళితుడి దగ్గర ఉంది కానీ దాన్ని స్వీకరించే సామర్థ్యం సమాజానికి లేదు.

"ఈ వొడ్డు పోతే, ఆ వొడ్డు వస్తుంది చేరువకు! / వెనక్కి చూస్తే అంతా చెడ్డే! / ముందుకు చూస్తే అంతా మంచే!"ఈ త్రిపద దళిత చైతన్యానికి ఆశావాద పునాది. వెనక్కి చూస్తే బానిసత్వం, అణచివేత, అవమానం. ముందుకు చూస్తే విముక్తి, గౌరవం, సమానత్వం. ఇది దళిత ఉద్యమ తత్వానికి సాహిత్య రూపం.

"సెక్సును శీలంతో ముడిపెట్టడం తప్పు / ఆహార నిద్రల వలెనే సెక్సు వ్యక్తి గతం/సర్వజన హితాభిలాషమే సౌశీల్యం!' ఇది భీమన్నలోని అత్యంత ధైర్యవంతమైన త్రిపదలలో ఒకటి. శరీరాన్ని పాపంగా చేసిన బ్రాహ్మణీయ సంస్కృతికి ఇది ప్రత్యక్ష సవాలు. దళితుల శరీరాలపై నియంత్రణ పెట్టిన వ్యవస్థకు శరీరం వ్యక్తిగతం అని చెప్పడం విప్లవాత్మక ప్రకటన. ఇది దళిత-ఫెమినిస్ట్ ఆలోచనలకు కూడా మూలం.

"ప్రేమతో చూస్తే గులాబీ పూలతోట / ద్వేషంతో చూస్తే రాళ్లగుట్ట, ప్రపం చం! / నీవు ఏది విసిరితే అదే నీకు తగులుద్ది!" ఈ త్రిపద దళిత జీవనంలో ఉన్న ప్రతిస్పందన సూత్రాన్ని చెబుతుంది. దళితులపై ద్వేషం విసిరితే తిరిగి సంఘర్షణ. ప్రేమ విసిరితే మానవత్వం. ఇది నైతిక బోధ కాదు. ఇది అనుభవ సత్యం.

"శత్రువు శత్రువూ కాదు, మిత్రుడు మిత్రుడూ కాదు / ఎవ్వరికీ, ఎల్లప్పుడూ ప్రపంచంలో / ఎవ్వరికీ, ఎల్లప్పుడూ వుండేది ఒక్కటే - అది స్వార్థం!" ఈ త్రిపద దళిత జీవితం నేర్పిన అత్యంత కఠిన సత్యం. సమాజంలో శాశ్వత శత్రుత్వాలు లేవు, శాశ్వత మిత్రత్వాలు లేవు, స్వార్థమే శాశ్వతం. దళితుడికి మిత్రుడనుకున్నవాడే కష్టం వచ్చినప్పుడు దూరమవుతాడు. శత్రువనుకున్నవాడే అవసరమైతే దగ్గరవుతాడు. ఇది భావోద్వేగాత్మక మానవతావాదాన్ని తిరస్కరించే దళిత వాస్తవవాదం.

"అన్నమే పరబ్రహ్మ, ఆకలే బ్రహ్మజిజ్ఞాస / ఆకలికింత అన్నమే ఆనందసిద్ధి / కోటి విద్యలూ కూటికోస మన్నదే సత్యం!", ఇది భీమన్న త్రిపదలలోని కేంద్ర మానిఫెస్టో. దళిత తత్వానికి ఇది మూల వాక్యం. ఆకలితో ఉన్నవాడికి దేవుడు కాదు, ధర్మం కాదు. అన్నమే పరబ్రహ్మ. విద్య కూడా చివరకు కూటికోసమే. ఈ త్రిపద బ్రాహ్మణీయ తత్వాన్ని పూర్తిగా పునఃవ్యాఖ్యానిస్తుంది.

"వంగితే సవారి చేస్తుంది / సవారి చేస్తే వంగుతుంది, లోకం ! / గుర్రమో, రౌతో, ఎంచుకో నీవే!" ఇది దళిత రాజకీయ చైతన్యానికి పునాది. వంగితే అణచివేత ఎదిరిస్తే ప్రతిఘటన. భీమన్న దళితుడికి స్పష్టమైన ఎంపిక ఇస్తాడు గుర్రమా? రౌతా? ఇది ఆత్మగౌరవ రాజకీయాల సాహిత్య ప్రకటన.

"తన మాటను తానే నమ్మని జీవి / తన పని తనకే నచ్చని జీవి / తన ఊహకు తానే బెదిరే జీవి-మనిషి!" ఇది అణచివేత వల్ల పుట్టిన మానసిక భయాన్ని చూపిస్తుంది. దళితుడు వ్యవస్థ చేత అంతగా బెదిరింపబడ్డాడు ?? తన ఆలోచనలకే భయపడే స్థితికి చేరాడు. ఈ త్రిపద మానసిక దాస్యాన్ని బహిర్గతం చేస్తుంది.

"ఐశ్వర్యం కలవాడే అందగాడు / అధికారం కలవాడే మేధావంతుడు / రెండూ లేనివాడు మందిలో ఒకడు!" ఇది "మెరిట్" అనే మిథ్యపై భీమన్న చేసిన ఘాటైన విమర్శ. దళితుడికి మేధస్సున్నా, అధికారం లేకపోతే అతడు కనిపించడు.

"మర్మాలు, ధ్వనులూ, సంజ్ఞలూ కిట్టవు నాకు / చెప్పేదుంటే చెప్పేస్తాను నగ్నంగా /వినేదుంటే విను సావధానంగా ! " ఈ త్రిపద దళిత సాహిత్య స్వభావాన్ని నిర్వచించే ప్రకటనగా చూడాలి. భీమన్న సంకేతాలు, అలంకారాలు, పరోక్షార్థాలను తిరస్కరిస్తాడు. దళితుడి జీవితం అలంకారాల్లేని నగ్న వాస్తవం. "నగ్నంగా చెప్పడం" అంటే అసభ్యత కాదు అది దాచుడు లేని నిజాయితీ. ఇది ఆధిపత్య సాహిత్యంలోని ముసుగులను ఛేదించే దళిత వాక్చాతుర్యం.

"మనిషి తానే తన లోకానికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు / తాను వలచింది గంగ, తాను మునిగింది రంభ ! అందుకే విశృంఖలత్వంలో అంత ఆనందం!" ఈ త్రిపద మతాధికారాన్ని వ్యక్తి చేతుల్లోకి తీసుకొస్తుంది. సృష్టికర్త దేవుడు కాదు మనిషే తన లోకానికి దేవుడు. దళితుడికి గంగ-రంభ అన్నీ అతని ఎంపికలే. స్వేచ్ఛ దొరికినప్పుడు కలిగే ఆనందం. అది నియంత్రణల నుంచి బయటపడిన ఆనందం. ఇది దళిత విముక్తి తత్వానికి సాహిత్య రూపం.

"విచారించకు, దేవీ, విచారించకు దేనికీ ! / కర్మను కడిగేసే శక్తి లేదు కన్నీటికి / కర్మ స్వయంభువు, కన్నీరు పాల్కుడలి మాత్రం ! " ఈ త్రిపద దళిత జీవితంలో విస్తృతంగా వాడబడిన "కర్మ సిద్ధాంతం" పై తీవ్రమైన విమర్శ. కన్నీటితో జీవితం మారదు. దళితుడు ఏడ్చి కాదు చర్యతోనే పరిస్థితిని మార్చాలి. భీమన్న ఇక్కడ దళితుడిని నిష్క్రియ భక్తి నుంచి చైతన్య చర్య వైపు నడిపిస్తాడు.

"మనిషిని చూచి భయపడకు, ప్రియా ! / అతడెందులోనూ నీ కంటే అధికుడు కాదు / జీవితంలో నీ జయం నీ చేతిలోదే ! " ఇది దళిత ఆత్మవిశ్వాస ప్రకటన. భయం అనేది సహజం కాదు అది నూరేళ్ల అణచివేత ఫలితం. భీమన్న దళితునికి చెప్పేది. నీవు తక్కువవాడవు కాదు. నీ జయం నీ చేతుల్లోనే ఉంది. ఇది దళిత ఉద్యమ ఆత్మవాక్యం.

"భగవత్ప్రార్థన అవసరమే మనిషికి / అయితే, అది భగవంతుడి బాగు కోసమా ? / తన అహంకార వ్యాధికే ఔషధం అది ! " ఈ త్రిపద భీమన్నలోని తీవ్ర మతసమీక్షను స్పష్టంగా చూపిస్తుంది. ప్రార్థన దేవుడి కోసం కాదు. ప్రార్థకుడి మనసు కోసం. దళిత జీవితంలో భగవంతుడు విముక్తి ప్రసాదించలేదు. అయినా భక్తి కొనసాగుతోంది. ఎందుకు? అణచివేతలో ఉన్న మనిషికి భక్తి ఒక మానసిక ఉపశమనం.

"ఎందుకు వచ్చాను నే నీలోకం లోకి? / ఏమిటి పట్టుకుపోతున్నా నిక్కడ నుంచి? / నా జీవిత సంపాదనలో అలాంటి దేముంది ?" ఈ త్రిపద దళిత జీవితంలోని అస్తిత్వ శూన్యతను వ్యక్తపరుస్తుంది. పుట్టుక అనేది దళితుడికి ఉత్సవం కాదు. జీవితం సంపాదన కాదు. మరణం విజయం కాదు.

"అధికారం కావలిస్తే రాజకీయాలలో దిగు / ధనం కావలిస్తే వ్యాపారం నడుపు / సుఖం కావలిస్తే వ్యవసాయం చేసుకో!" ఇది జీవన మార్గాలపై దళిత వాస్తవబోధ. రాజకీయాలు ? అధికారం వ్యాపారం ? ధనం వ్యవసాయం ? సుఖం దళితుల చారిత్రక జీవనాధారం వ్యవసాయమే. ఈ త్రిపద శ్రమ ఆధారిత జీవనానికి ఉన్న ఆనంద విలువను గుర్తిస్తుంది.

"ప్రకృతి తన గాలానికి గ్రుచ్చిన తియ్యటి ఎరే / స్త్రీకి పురుషుడు, పురుషుడికి స్త్రీ ! / మ్రింగిన తరువాత గాని తగులుకోదు ముల్లు! " ఇది ప్రేమ-శరీరం-ప్రకృతి మధ్య సంబంధాన్ని చెప్పే త్రిపద. భీమన్న ఇక్కడ నైతిక తీర్పులు ఇవ్వడు. సహజత్వాన్ని మాత్రమే గుర్తిస్తాడు. దళిత జీవితంలో ప్రేమ కూడా పోరాటమే. అనుభవం తరువాతే బాధ తెలుస్తుంది. ఇది జీవన సత్యం.

"జీవితమనేది ఎప్పుడైనా ఎవరికైనా విషాదాంతమే / సంతోషారంభమూ, విషాదాంతమూ అది / జీవితాన్ని దాటి జీవించడమే శాశ్వతానందం!" ఇది దళిత తత్వంలోని నిరాశ కాదు నిర్వేదం. జీవితం పరిమితమైనది. అందుకే దాన్ని దాటి ఆలోచించాలి. ఇది బౌద్ధ-దళిత భావనలకు దగ్గరగా ఉంటుంది.

"సహజసిద్ధమైన రేడియో సెట్టు ఈ మెదడు / ఆనుచేసి ట్యూను చెయ్యి ఏదో ఒక కేంద్రానికి / లభిస్తుంది వాణివాద్యమో, లక్ష్మిగాత్రమో!' ఇది చైతన్యంపై ఆశావాద త్రిపద. మనిషి ఏది వినాలనుకుంటే అదే వింటాడు. దళిత విముక్తికి చైతన్య ట్యూనింగ్ అవసరం.

"కారు మబ్బులు, శీతగాలులు, చిమ్మ చీకట్లు / చుట్టుముట్టి ముట్టడించనీ, భయంలేదు! / నా కిప్పుడు /నా వెలుగు బైటిది కాదు, లోనిది ! ' ఇది దళిత ఆత్మప్రకాశానికి పరాకాష్ఠ. బాహ్య పరిస్థితులు ఎంత కఠినమైనా అంతర్గత వెలుగు నిలుస్తుంది. ఇది దళిత విముక్తి కవిత్వానికి ముగింపు వాక్యం.

భీమన్న త్రిపదల్లో కనిపించే మానవతా తత్వం అంబేద్కరైట్ భావజాలానికి కూడా దగ్గరగా ఉంటుంది. "నిన్ను నువ్వు మార్చుకో ప్రపంచం మారుతుంది" అని చెప్పిన ఆయన మార్పు వ్యక్తి నుండి ప్రారంభమవుతుందని స్పష్టం చేస్తున్నాడు. ఇది అంబేద్కర్ చెప్పిన "మైండ్ రిఫార్మ్" సిద్ధాంతానికి సమీపం. సమాజపరమైన సమానత్వ పోరాటం మనస్సు మార్పుతోనే ప్రారంభమవుతుంది. కవి ఈ సాధారణ భావనను అసాధారణమైన పదజాలంతో చెప్పగలిగాడు.

త్రిపదల శిల్పం కూడా పరిశీలనీయమైనది. మూడు పాదాలలోనే కవి ఒక బృహత్తర తత్వాన్ని, ఒక సామాజిక వ్యవస్థను, ఒక చరిత్రను, ఒక వేదనను, ఒక మార్పు పిలుపుని చేస్తాడు. చివరి పాదం ప్రతి త్రిపదలో కూడా ధార్మిక గ్రంథంలోని సూక్తిలా అనిపిస్తుంది. త్రిపద యొక్క పంచ్ లైన్ భీమన్న కవిత్వానికి హృదయకేంద్రం. "ఒక్క చుక్క ప్రేమ వేల మనసులను మార్చగలదు" అన్న వాక్యం మానవతా ధర్మాన్ని అత్యంత సంక్షిప్తంలో చెప్తుంది.

మొత్తానికి, భీమన్న త్రిపదలు కేవలం కవితలు కాదు. అవి అణచివేతకు గురైన మానవజాతి చరిత్ర, పేదరికపు వేదన, శ్రమజీవి గౌరవం, మానవతా ధర్మం, నైతిక మార్గదర్శనం, సామాజిక తిరుగుబాటు. త్రిపదలు చిన్నవైనా అవి మానవతా సముద్రాలు. కవి మనకు చివరిగా చెప్తున్న సందేశం స్పష్టంగా వినిపిస్తుంది.

దేశం శుభ్రమవ్వాలంటే మనసులు శుభ్రమవ్వాలి సమాజం మారాలంటే మనిషి మారాలి మానవతే అసలైన ధర్మం. ఇవి తెలుగు దళిత సాహిత్యంలో పరిశోధనకు, విమర్శకు అపూర్వమైన పుణ్యక్షేత్రం. త్రిపదలు చిన్నగా కనిపించినా వాటి వెనుక ఒక జాతి పోరాటం, మనుష్యుడి విలువ, సామాజిక న్యాయం కోసం దహించే అగ్నిజ్వాల ఉంటుంది. భీమన్న చూపించిన మార్గం నేటికీ ప్రాసంగికమే. "మనసులు మారితేనే ప్రపంచం మారుతుంది."

ఆధార గ్రంథాలు

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం (సంపుటి 3) – ఆచార్య అనుమాండ్ల భూమయ్య
2. త్రిపదలు – బోయి భీమన్న (1962)

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న నాటకాలు - సామాజిక దృక్పథం

- డా. ఏ. వేంకటప్రసాదు,
సహ ఆచార్యులు,
సెల్ : 9959 9949 02.

విశ్వ శ్రేయస్సును కోరి సాహిత్య సృష్టిని చేసిన వారు కవులు. వారిలో ఆది కవి నన్నయ్య నుండి మొదలు పెట్టవచ్చు. జగత్తు యొక్క హితం కోరి సాహిత్య రచనను చేశానని నన్నయ్య పేర్కొన్నారు. నన్నయ గారిది ప్రభోదాత్మక దృష్టి. ఆధునిక కవులలో బోయి భీమన్నగారు ఆర్థిక అంతరాలు లేని మానవ సమాజం కోసం రచనలు చేశాడు. భీమన్న గారిది సంఘసంస్కరణ దృష్టి.

'సమకాలీన సమస్యలను ప్రస్తావిస్తూ సమాజవికాస పరిణామానికి మానవజాతి సంక్షేమానికి తోడ్పడేది గొప్ప నాటకం' అని ఆర్థర్ ముల్లర్ అన్న పలుకులు భీమన్న గారి నాటకాలకు సరిపోతాయి. నాటకరంగానికి సాహిత్యము, సమాజానికి నాటకరంగము పరస్పరము ఏవిధంగా అవి తోడ్పడుతున్నాయో భీమన్నగారు తన నాటకాల ద్వారా నిరూపించాడు. వీరు తన నాటకాల ద్వారా సమకాలీన సామాజిక పరిస్థితులను చక్కగా వివరించారు. భీమన్నగారు సమాజంలోని ప్రధాన సమస్య కులవ్యవస్థ అని, ఈ కులవ్యవస్థకు ప్రధానకారణం నిరక్షరాస్యతే అని గ్రహించాడు. సాంఘిక సమస్యలపై తెలుగులో ఎక్కువ రచనలు 1945 నుండి ప్రారంభమయ్యాయి. నాటక రచయితలు వచ్చారు. వారిలో భీమన్నగారు ఒకరు. ఆనాటి సాంఘిక దురాచారాలు, సాంప్రదాయాలను నిర్మూలించడానికి "పాలేరు" నాటకం రాశారు. ఇందులో కులవ్యవస్థను ఎత్తిచూపుతూ, మానవులంతా ఒకటేనని "పాలేరు" నాటకంలో వివరించారు.

సీ॥ మాలను గావించి - పాలేరుగా జేసి
కామందు గాలికి కట్టినావు
అంటరాదని చెప్పి పెంటల పాల్జేసి

నీచుల మనుపేర నిల్పినావు
చదువు సంధ్యలు లేక జంతువులను బోలె
ఊరి వెలుపల చావ నుంచి నావు
అజ్ఞాన తిమిరాల యడుగున బడద్రోసి
బరిగీసి యెదనొక్కి పట్టినావు
వెలుగు జూపవు, నేర్పవు మెలగు సరళి
దాస్యముం బాపుకోనీవు ధైర్యమూని
మనిషిగా నన్ను మననీవు మహిని కేల
చంపుకొని పొమ్ము చాలింతు జన్మమింక

భీమన్న గారు తన బాధనంతా ఇందులో వివరించారు. ఇంకా వయోజన విద్యను ప్రోత్సహిస్తూ బానిస బ్రతుకుకు విద్యలేకపోవటమే కారణమని, దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో సాగాలంటే ప్రజలంతా విజ్ఞానవంతులు కావాలని ముఖ్యంగా వయోజనులు విద్యావంతులు కావాలంటాడు.

గోచి పెట్టుట నేర్చుగోగానే బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులారా
నడువ నేర్చుటతోనే బుడతని గొంపోయి
పాలేరు తనముంచు మాలలారా
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించు
మనుగడలే మాపు జనకులారా
వంట యిల్లోకటె ప్రపంచమ్ముగా జేసి
తనయల నేడ్పించు తల్లులారా
జాతిశక్తి విహీనమై చచ్చుచుండ
కన్నులను మూసి కొంటిరే గాఢనిద్ర!
శక్తికంతకు మూలము చదువుకొన
బడికి పంపుడు మీ వంశవర్ధనులను ..

భీమన్నగారు 'పాలేరు' నాటకంలో వర్ణాంతర వివాహాలను ప్రవేశపెట్టాడు. అభ్యుదయం కోరే యువకులంతా కులాంతర వివాహాలు చేసుకుని కులమత భేదాల అడ్డు గోడలను కూలదోయాలని అపుడే హైందవ జాతి అంతా ఏకతాటిపై అత్యంత శక్తివంతంగా రూపొందుతుందని అభిప్రాయాన్ని వ్యక్త పరిచాడు.

ఒక వైపున సనాతన కులదివాంధులు
శపియించి నిప్పులు జల్లుచుండ
ఒకవైపు ప్రగతి కాముకులైన యువకులు
ప్రేమ కాన్కలు సమర్పించుచుండ

ఒకవైపు భారతాభ్యుదయ నిరోధకుల్
నోటి కత్తులు చాల నూరు చుండ
ఒకవైపు జాతి ఏకోన్ముఖ మగు చుండ
దాస్య శృంఖలలు బ్రద్దలగు చుండ
కుటిల కులభేద కుద్యాలు క్రూల దోసి
పూర్వవైభవ శిఖరాల బూజు దులిపి
తెలిసి జాతి నిద్దుర లేచి నడువ
బాల బెండ్లాడె వెంకటేశ్వరుడు, నేడు

కులాలలో వుండే అంతరాలవల్లనే భారతజాతి సంఘటిత శక్తిని కోల్పోయిందని, సంఘుం యొక్క శ్రేయస్సును కోరి, సంఘంలో వుండే సంకుచిత మనస్తత్వా న్ని తొలగించడం అత్యంత అవసరమనే అభిప్రాయం వీరి నాటకాలలో కనిపిస్తుంది.

మూఢ విశ్వాసాలతో కొన్ని సాంఘికమైన కట్టుబాట్లు, ఆచారాలు దురాచారాలుగా మారాయని "కూలిరాజు" నాటకంలో కనబడుతుంది. అంతేగాక భీమన్నగారు సామాజిక స్పృహతో రచనలు చేస్తూ తన కవిత్వాన్ని సాంఘిక ప్రయోజనాలపై మళ్ళించడమే గాక తాత్విక చింతనను కూడ తన కవితలలో పేర్కొన్నారు.

కులమత వర్గ భేదములు
కూలిచి, వాటి కతీతులై ధరా
స్థలి నీరులెల్ల నొక్కటని
చాటుడు సర్వజనీన స్వామ్య సం
కలిత ప్రణాళిక పథక
కర్తలు కార్మిక నాయకుల్ సమ
ర్థులు తన మో ట్లో సంగి రయి
తుల్ గెలిపింపుడు శాంతికాముకులై

అంటూ మనకు స్వాతంత్ర్యం వచ్చింది కాని ఇంకా స్వరాజ్యం రాలేదని మనం సంపాదించాలి అని పేర్కొన్నారు.

హిందూమతంలో అయా సందర్భాలలో కొన్ని కొత్త మతాలు వెలిశాయి. ప్రతిమతంలోను ఎన్నో ఉపకులాలున్నాయి. ఈ ఉపకులాలలో ఒకరినొకరు పెళ్ళిళ్ళు చేసుకోవడం గాని, కలసి భోజనాలు చేయడం గాని జరగడంలేదు. ఇవి పెళ్ళిళ్ళ సమయాలలో తెలుస్తున్నాయి. మన భారతదేశ రాజకీయాలు మనుష్యులను కులాల వారీగా, మతాల వారీగా విడదీసి పాలిస్తుంది. మన భారతరాజ్యాంగంలో అస్పృశ్యత పేరుతో మనుష్యులను మానసికంగా హింసించవద్దని చెబుతున్నా సమాజంలో నేటికి జరుగుతున్నది అదే.

కూలిరాజు నాటకంలో "కనుక ప్రజాస్వామ్య వాద మందును, 'మానవసేవయే మాధవ సేవ' అనెడి నుడి యందును నమ్మకం గల వారందరూ ముఖ్యంగా పడచు ఆడపిల్లలలో, మగపిల్లలలో ముందుగా కులవ్యవస్థను కూలదోస్తేనే గాని మనదేశం కులమత రహిత ప్రజాస్వామ్య దేశం కాజాలదు" అని పేర్కొన్నారు.

గీతలో శ్రీకృష్ణుడు
"చాతుర్వర్ణం మయా సృష్టం
గుణ కర్మ విభాగస్య"

అని బోధిస్తే కొందరు స్వార్థంతో, కుతంత్రాలతో కొంతమందికి జన్మతోనే ఈ కులాలు పుడతాయని పేర్కొంటూ సమాజాన్ని చిన్నాభిన్నం చేశారని భీమన్న ఆవేదనతో మానవుల మధ్య జాతి, మత, కుల, వర్గాలన్నీ ఆయా వర్గాల బలాబలాల వల్ల పుట్టినవేనని తన రచనలలో, తన ఆవేదననంతా తెలియజేశారు. భీమన్నగారు మానవత్వానికి మించిన మనుగడ లేదని, కుల రహిత సమాజంకోసం పాటుపడ్డారు.

కూటికోసము అటుమీద కులము లేని
జాతి కోసము అటు మీద జాతి లేని
మానవత్వము కోసము పూని మీరు
అడుగు ముందిడి సాగురో అయ్యలార

కూలిరాజు నాటకంలో స్త్రీ స్వాతంత్ర్యానికి సంబంధించిన సమస్యలను కూడ చర్చించాడు. ఇంకా ఇందులో కులవిభేధాలను రూపుమాపుతూ భారతజాతిని మేల్కొల్పి భారతీయులందరిని సంఘటిత మొనర్చి రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమానత్వాలతో ఏకం చేయాలని పరంజ్యోతి నాయిక పాత్ర ద్వారా ...

" ..... నిరుద్యోగాన్ని, నిరాశని, దారిద్ర్యాన్ని, దాస్యాన్ని, బాధను, బలహీనతను, అవిద్యను, అధర్మాన్ని నిర్మూలించి, మన ప్రజలందరికి చాలినంత తిండి, బట్ట, కొంప కలిగిస్తాం "

అని చెప్పించారు.

వీరి "అసూయ" నాటకంలో కులమతభేదాలు సమాజ ప్రగతికి ప్రతిబంధకముగా వుంటూ మానవత్వాన్ని ఎలా మంటగలుపుతున్నాయో వివరించాడు. అంతేగాక సాంఘిక దోషాలను ఎత్తిచూపి మానవత్వపు విలువలను ప్రభోదిస్తూ, విద్యావంతులంతా కులవిభేదాలను మరచిపోయి సమాజాన్ని చైతన్యవంతం చేయాలంటాడు.

సత్యము నసత్యముగ చూపజాలు నొకడు
లేని అపవాదులెన్నో కల్పించు నొకడు
మంచి వానిని పడ ద్రోయ నెంచు నొకడు
మానవత్వము నాశనమయ్యె నేడు

భీమన్నగారి ఇంకొక నాటకం "మానవుని మరొక మజిలి" లో జగత్తు యొక్క శ్రేయస్సును కాంక్షిస్తూ సమాజం ధర్మబద్ధంగా ఎలా జీవించాలో వివరించారు.

రాజకీయ తీర్మానం కాదిది
కాదిది ఆర్థిక కార్యక్రమము
వేదమాత మనకాదేశించిన
అఖిల జగశ్రేయ స్వరూపమది
ప్రభాతమయ్యిందోయ్
ప్రపుల్ల మయ్యిందోయ్ లోకం
అంటూ వివరించారు.

భీమన్నగారు గాంధీజీ తలపెట్టిన ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం, హరిజనోద్ధరణ వంటి వాటికి ప్రభావితుడై "పడిపోతున్న అడ్డుగోడలు" అనే నాటకంలో ఆనాటి సాంఘిక సమస్యలను ఎత్తి చూపుతూ వ్యంగ్యంగా రచించి ప్రజలకు కనువిప్పు కలిగించే ప్రయత్నం చేసాడు. ఇందులో మతాచారం ముఖ్యం కాదని నైతిక జీవితమే ముఖ్యమని చెప్తూ కులపట్టింపులు అర్థంలేనివని, మూఢనమ్మకాలు తొలగిపోవాలని చెప్తాడు.

మానవుల మధ్య ప్రేమాదరాలకు కులభేదం అవసరము లేదని చెప్తూ "రాగవాసిష్ఠం" అనే నాటకంలో ప్రేమకు కులభేదాలు లేవని సృష్టి మొత్తం ప్రేమమయమని భూమిపై ప్రేమరాజ్యం వుండాలని కోరుకుంటాడు.

" పికము పాడుటకు వల్లిక పల్లవించుటకు
సంబంధమేటే సంధ్యాకుమారి ?
పరిణతినిజెందు చుందురు ఎవ్వరికి వారె
నవ మాసమందు నీవా భేదమెచటిదె ? "

భీమన్నగారు మన సంఘంలోని అస్పృశ్యత, కులమత విభేదాలు, అన్యాయాలు, దౌర్జన్యాలను, దోపిడీలను చిన్నతనం నుంచి చూస్తూ అనుభవిస్తూ తన శాయశక్తుల అడ్డుకుంటూ దానికి నివారణోపాయాలను వివరించే ప్రయత్నం చేశాడు. అంతే గాక భీమన్న మనసుకు అంటరానితనమనే క్రూర దురాచారం తీవ్ర గాయం చేసింది. అరుంధతీ దేవిని కూడ అస్పృశ్యురాలనే వారిని భీమన్నగారు ఈసడించుకున్నారు.

" పైరుపాట" నాటకంలో భీమన్నగారు
పని యేదైనా గాని
పరమేశుని రూపకం గద
పరమేశుని రూపంలో
తర తమమ్ములేముంటై

అంటూ కక్షలతో, బాధలతో కష్టాల పాలైన లోకాలన్ని ప్రేమతో ఏకం కావాలంటాడు. ఎప్పటికైనా ఈ విషయం మానవులకంతా తెలియాలంటాడు.

ఆనాటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక రుగ్మతలైన కులాలకుళ్ళు, మూఢాచారాలు, అంధవిశ్వాసాలను తూర్పారబడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రయత్నం " చిత్ర కళా ప్రదర్శన " నాటక సంపుటి. ఇందులోని 'చాండాలిక' లో నాయిక చాండాలికతో

కులాన్ని బట్టి కాదమ్మా అదృష్టం
మనిషిగా పుట్టటమే ఒక అదృష్టం
తనను తాను తెలుసుకొని
తన్మయమైన పోవడమే పరమార్థం
కులమేమిటి - కులం?

రెండే కులాలు మనిషికి
పండితుడు, పామరుడు
పండితునికి కులం లేదు
పామరుడే కులమైన పశువే !

అని చెప్పించాడు. పండితుడు, పామరుడు అని రెండే కులాలని అంతకు మించి వేరేవి ఏవి లేవని చెప్తాడు. ఈ కులతత్వం మనుష్యులలోని మానవత్వాన్ని మంటగలుపుతుందని బాధను వ్యక్తం చేశాడు.

మానవత్వం అన్ని తత్వాలకు మూలమని, మానవత్వంలో దైవత్వాన్ని, దైవత్వంలో మానవత్వాన్ని చూడవచ్చు అంటూ " బాలయోగి" అనే నాటకంలో ఒక చోట

ఎవరు వెలుపల లోపల ఎవరు తలుప
ఎవరు తనవారు పరవారు ఎవరు ధరణి
తనకు రాధకు మధ్య బాంధవ్యమేమిటి
ప్రాణ మొకటన్న జ్ఞానమె బ్రహ్మతాను

భారతజాతి ఒకటేనని ఆనాడు వర్ణవ్యవస్థ వున్నప్పటికి అవి ఆనాడు పాటించే వృత్తుల ద్వారా మాత్రమేనని, అస్పృశ్యత అసలే లేదని ఇది మధ్యలో ప్రవేశపెట్టబడినది అంటూ, ఇవి ఆనాటి మహాభారతం, భగవద్గీత, మనుస్మృతిలలో లేవంటూ ఆర్యులు, ద్రావిడులు ఒకే జాతికి చెందినవారని, వారి మధ్య జాతివిభేదం లేదని "ఆదివాల్మీకి" నాటకంలో భీమన్నగారు తెలిపారు.

భీమన్నగారు కులతత్వాన్ని తీవ్రంగా ఖండించారు. తన "ప్రగతి" నాటకంలో

లోకులు కాకులే
కోకిల పిల్ల
లోకువిచ్చావంటే

నూకలు కల్ల
చేతికందిన పూలు
చిదిమి పారేస్తారు
అందకపోతే
అరడిపెడతారు
పైనున్న వాళ్ళ కాళ్ళు
పట్టుకు వేలాడుతారు
తక్కువ వాళ్ళను
తొక్కుకుని పోతారు

విద్యావంతుల యొక్క ధర్మం సాంఘిక దోషాలను సరిదిద్దడం, మానవత్వపు విలువలకు కనీసం పోరాడటం. కాని ఈ కుల విభేదాల్లోంచి పుట్టి పెరిగిన ఈ సాంఘిక దురన్యాయంలో మాత్రం భీమన్న గారు సహించలేదు. తన విశాల దృక్పథాన్ని ప్రదర్శించారు.

బోయి భీమన్న గారు తన నాటకాలన్నింటిలో సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను ఏకరువు పెట్టడమే గాక ప్రజల జీవన పరిస్థితులు ఎలా మెరుగుపరచుకోవాలో వివరించాడు. ఈ భూమిలో మానవుడు మహర్షిలా వెలుగొందాలంటే కులమతాల జాఢ్యం అంతరించాలన్న కోరిక వెలిబుచ్చాడు.

ఆధార గ్రంధాలు :

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం - సంపుటి 5, పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
2. పాలేరు నుండి పద్మశ్రీ వరకు - శ్రీమతి హైమవతీ భీమన్న, పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
3. బోయి భీమన్న రూపకాలు - తాత్త్విక చింతన, చైతన్య సాహితి, వరంగల్, మార్చి 1996.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

డా. బోయి భీమన్న సాహిత్యం - సామాజిక చైతన్యం

- డా. ఎం. మంజుశ్రీ
అసిస్టెంట్ ప్రొఫెసర్,
సెల్ : 9959626733

తెలుగు సాహిత్య చరిత్రలో సామాజిక సంస్కరణను, అక్షర చైతన్యాన్ని మేళవించిన అరుదైన సృజనకారుడు డా. బోయి భీమన్న. ఈ పరిశోధన వ్యాసం భీమన్నగారి రచనలలో ప్రతిఫలించే సామాజిక దృక్పథాన్ని, ముఖ్యంగా అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాన్ని విశ్లేషిస్తుంది. ఒక దళిత కుటుంబంలో పుట్టి, పద్మభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలను అందుకున్న భీమన్న గారి జీవిత ప్రస్థానం, ఆయన సాహిత్యంలో అంతర్లీనంగా ఉన్న సామాజిక విలువలపై ఈ వ్యాసంలో ప్రతిపాదించాలనుకుంటున్నాను. భీమన్న గారి సాహిత్యానికి మూల చైతన్యం డా. బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాలు. అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన' గ్రంథాన్ని తెలుగులోకి తర్జుమా చేయడం ద్వారా ఆయన తెలుగు సమాజంలో నూతన ఆలోచనా ధోరణికి పునాది వేశారు. ఆయన ప్రసిద్ధ నాటకం 'పాలేరు', కేవలం ఒక కథ కాదు; అది ఒక సామాజిక విప్లవం. విద్య ద్వారానే బానిసత్వం నుండి విముక్తి లభిస్తుందని, పాలేరుగా ఉన్న వ్యక్తి కూడా తన మేధస్సుతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని ఈ నాటకం ద్వారా ఆయన నిరూపించారు. అలాగే, 'రాగవాసిష్ఠం' వంటి నాటకాలలో కులాంతర వివాహాల ఆవశ్యకతను పురాణ నేపథ్యంతో విశ్లేషించారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందిన 'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యంలో శ్రమదోపిడీని, సామాజిక అసమానతలను ప్రతీకాత్మకంగా ఎండగట్టారు. భీమన్న గారి దృష్టిలో సాహిత్యం కేవలం వినోదం కాదు, అది సమాజంలోని అంధకారాన్ని పారద్రోలే ఒక జ్ఞానజ్యోతి. ఆయన ప్రతిపాదించిన 'రసాద్వైతం' భౌతిక సుఖాలకు, ఆధ్యాత్మిక ఉనికికి మధ్య సమతుల్యతను కోరుకుంటుంది. భీమన్న గారి సాహిత్యం కులరహిత, వర్గరహిత సమాజ స్థాపనే ధ్యేయంగా సాగింది. జాతీయవాదాన్ని, మానవతావాదాన్ని సమన్వయం చేస్తూ ఆయన అందించిన సుమారు 70కి పైగా రచనలు నేటికీ

సామాజిక సమరసతకు దిక్సూచిగా నిలుస్తున్నాయి. ఈ వ్యాసం ఆయన సాహిత్యంలోని ఈ విభిన్న కోణాలను పరిశోధిస్తూ, సమకాలీన సమాజానికి ఆయన సాహిత్యం ఎలా మార్గదర్శకంగా ఉందో వివరిస్తుంది. ఈ కోణాలను నా పత్రంలో వివరించాలనుకుంటున్నాను.

కీలకమైనపదాలు (Keywords): అంబేద్కరిజం, పాలేరు, సామాజిక విప్లవం, కుల నిర్మూలన, రసాద్వైతం, విద్య – విముక్తి, తెలుగు సాహిత్యం.

పరిశోధన వ్యాస ప్రారంభం (Introduction)

తెలుగు సాహితీ క్షేత్రంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి, సమాజంలోని అంధకారాన్ని పారద్రోలడానికి కృషి చేసిన మహనీయుడు డా. బోయి భీమన్న. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాదు, ఒక సామాజిక విప్లవ దార్శనికుడు. "సాహిత్యం కేవలం రసాస్వాదన కోసం మాత్రమే కాదు, అది సామాజిక సంస్కరణకు ఒక శక్తివంతమైన సాధనం" అని నమ్మిన నిబద్ధత గల రచయిత ఆయన. తూర్పు గోదావరి జిల్లా కోనసీమ మారుమూల గ్రామంలో, ఒక దళిత పాలేరు ఇంట పుట్టిన భీమన్న, తాను అనుభవించిన పేదరికాన్ని, ఎదుర్కొన్న అంటరానితనాన్ని సమాజంపై తిరుగుబాటు చేసే చైతన్యంగా మార్చుకున్నారు.

భీమన్న గారి సాహితీ ప్రస్థానం ప్రాచీన ఛందస్సు నుండి ఆధునిక వచన కవిత వరకు, పౌరాణిక నాటకాల నుండి సమకాలీన సామాజిక సమస్యల వరకు బహుముఖంగా విస్తరించింది. ఆయన రచనలలో అంబేద్కరిజం ఒక అంతఃసూత్రంగా ప్రవహిస్తుంది. "పాలేరు నుండి పద్మశ్రీ వరకు" ఆయన సాగించిన జీవన యానం, అణగారిన వర్గాలకు ఒక ఆశాదీపం. విద్య ద్వారా విముక్తి, రాజ్యాధికారం ద్వారా సమానత్వం, భావ విప్లవం ద్వారా కుల నిర్మూలన అనే మూడు సూత్రాల చుట్టూ ఆయన సమగ్ర సాహిత్యం పరిభ్రమిస్తుంది.

'పాలేరు' నాటకంతో దళిత విద్యార్థులలో విద్యా చైతన్యాన్ని, 'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యం ద్వారా పేదలలో రాజకీయ మేల్కొలుపును, 'రాగవాసిష్ఠం' ద్వారా సాంస్కృతిక సమానత్వాన్ని ఆయన ప్రబోధించారు. కుల వ్యవస్థలోని సంకెళ్లను తెంచడానికి పురాణాలను సైతం పునర్వ్యాఖ్యానించిన ధైర్యశాలి ఆయన. ఈ పరిశోధన వ్యాసం, భీమన్న గారి డెబ్భైకి పైగా వెలువడిన రచనలన్నింటినీ సమన్వయం చేస్తూ, ఆయన కవిత్వంలో రైతు, శ్రామికుడు, మహిళ మరియు దళితుడు ఏ విధంగా చైతన్యవంతం చేయబడ్డారో లోతుగా విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది. అభ్యుదయ భావజాలం, హేతువాదం మరియు మానవతావాదాల మేళవింపుగా సాగిన భీమన్న సాహిత్యం నేటికీ సామాజిక సమరసతకు ఒక గొప్ప దిక్సూచి.

పరిశోధన వ్యాస ఉద్దేశం (Research Objectives)

ఈ పరిశోధన వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం డా. బోయి భీమన్న గారి సమగ్ర సాహిత్యాన్ని– నాటకాలు, కావ్యాలు, వచన రచనలు మరియు తత్త్వాల ద్వారా –ఆయన ప్రతిపాదించిన సామాజిక చైతన్య పరిధిని లోతుగా అన్వేషించడం. భీమన్న గారి సాహిత్యం కేవలం అణగారిన వర్గాల ఆవేదనకు

పరిమితం కాకుండా, అది ఒక సమగ్ర మానవతావాద జాతీయవాదంగా ఎలా పరిణామం చెందిందో నిరూపించడం ఈ వ్యాస లక్ష్యం.

ముఖ్యంగా, 'పాలేరు' నాటకం ద్వారా విద్యా చైతన్యాన్ని, 'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యం ద్వారా రాజకీయ–ఆర్థిక చైతన్యాన్ని, మరియు 'రాగవాసిష్ఠం' ద్వారా కుల నిర్మూలన చైతన్యాన్ని ఆయన ఏ విధంగా ప్రబోధించారో ఈ పరిశోధన విశ్లేషిస్తుంది. అంబేద్కరిజం ప్రభావంతో సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన అక్షర పోరాటాన్ని గుర్తిస్తూనే, ఆయన ప్రతిపాదించిన 'రసాద్వైతం' అనే తాత్విక సిద్ధాంతం వ్యక్తిగత విముక్తికి, సామాజిక ప్రగతికి మధ్య ఎలా వంతెనగా నిలిచిందో చర్చించడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

అంతేకాకుండా, రైతును 'సృష్టి స్థితి దేవత'గా, శ్రామికుడిని సమాజ నిర్మాతగా గౌరవించే ఆయన అభ్యుదయ దృక్పథాన్ని, యువతలో నినాదాలకు అతీతంగా భావ విప్లవం రావాలనే ఆయన ఆకాంక్షను సమగ్రంగా ఆవిష్కరించడమే ఈ పరిశోధన యొక్క పరమార్థం. మొత్తంగా భీమన్న గారి సాహిత్యం ఒక జాతిని మేల్కొలిపే 'జ్ఞాన జ్యోతి' అని నిరూపించడం ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశం.

ఊహాపరికల్పన (Hypothesis)

డా. బోయి భీమన్న గారి సాహిత్యం కేవలం ఒక వర్గానికి చెందిన వేదన కాదు, అది "అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రకటన మరియు విశ్వమానవ సమానత్వ సిద్ధాంతం" అనే ఊహాపరికల్పన ఆధారంగా ఈ పరిశోధన సాగుతుంది. దీనిని ఈ క్రింది అంశాల ద్వారా నిరూపించవచ్చు:

1. విద్యయే విముక్తి మార్గం: భీమన్న గారి రచనలు (ముఖ్యంగా 'పాలేరు') దళిత, పేద వర్గాలలో కేవలం ఆర్థిక ఎదుగుదల కంటే, విద్య ద్వారా లభించే సామాజిక హోదా మరియు చైతన్యంపైనే ఎక్కువ దృష్టి సారించాయి.
2. రాజకీయ చైతన్యం – ఓటు హక్కు: "గుడిసెలు కాలిపోతున్నై" వంటి కావ్యాల ద్వారా, ఓటు అనే శక్తి పేదవాడి చేతిలో ఆయుధంగా మారాలి తప్ప, నాయకుల చేతిలో బానిస సంకెళ్లుగా మారకూడదనే విప్లవాత్మక చైతన్యాన్ని ఆయన కలిగించారు.
3. కుల నిర్మూలనకు సాంస్కృతిక పునర్వ్యాఖ్యానం: కులం అనేది కేవలం సామాజిక అంశం కాదు, అది ఒక మానసిక రుగ్మత అని భీమన్న గారు నమ్మారు. అందుకే పురాణ పాత్రలను (రాగవాసిష్ఠం, ధర్మవ్యాధుడు వంటివి) పునర్వ్యాఖ్యానించడం ద్వారా సాంస్కృతిక సమానత్వాన్ని సాధించవచ్చని ఆయన ప్రతిపాదించారు.
4. రసాద్వైతం – మానవతావాదం: ఆయన ప్రతిపాదించిన 'రసాద్వైత' సిద్ధాంతం, వ్యక్తిగత ఆధ్యాత్మిక ఆనందానికి మరియు సామాజిక బాధ్యతకు మధ్య సమన్వయం సాధిస్తూ, మతం కంటే మానవత్వం గొప్పదని నిరూపిస్తుంది.

5. శ్రామిక చైతన్యం: రైతును, కూలీని సమాజ నిర్మాతగా (సృష్టి-స్థితి కారకుడు) గుర్తించడం ద్వారా, శ్రమకు గౌరవం ఇచ్చే ఒక నూతన సామాజిక విలువను ఆయన సాహిత్యం సృష్టించింది.

ఈ పరిశోధన ద్వారా భీమన్న గారి సాహిత్యం కేవలం గతకాలపు ఆవేదన కాదని, అది నేటికీ, ఏనాటికీ వర్తించే ఒక "సమకాలీన సామాజిక చైతన్య సూత్రం" అని నిర్ధారించడం జరుగుతుంది.

పరిశోధన పద్ధతి (Research Methodology)

ఈ పరిశోధన వ్యాసం ప్రధానంగా విశ్లేషణాత్మక, వర్ణనాత్మక పరిశోధన పద్ధతి (Analytical and Descriptive Research Method) ద్వారా రూపొందించబడింది. భీమన్న గారి సాహిత్యాన్ని లోతుగా పరిశీలించడానికి ఈ క్రింది పద్ధతులను అనుసరించడం జరిగింది:

1. **ప్రాథమిక ఆధారాల సేకరణ (Primary Sources):** పరిశోధనలో భాగంగా డా. బోయి భీమన్న గారు స్వయంగా రచించిన గ్రంథాలను ప్రధాన ఆధారాలుగా స్వీకరించడం జరిగింది.

   కావ్యాలు: 'గుడిసెలు కాలిపోతున్నై', 'పంచమ స్వరం', 'అంబేడ్కరిజం', 'రాగోదయం' వంటివి.

   నాటకాలు: 'పాలేరు', 'కూలిరాజు', 'రాగవాసిష్ఠం', 'ధర్మవ్యాధుడు' మొదలైనవి.

   వచన రచనలు: 'జానపదుని జాబులు', 'పల్లెటూరి లేఖలు', ఆయన రాసిన వివిధ పీఠికలు.

2. **గౌణ ఆధారాల సేకరణ (Secondary Sources):** భీమన్న గారి సాహిత్యంపై ఇతర విమర్శకులు, పరిశోధకులు వెలువరించిన గ్రంథాలను, వ్యాసాలను విశ్లేషణ కోసం ఉపయోగించుకోవడం జరిగింది.

   డా. దార్ల వెంకటేశ్వరరావు, హైమవతీ భీమన్న, డా.కోయి కోటేశ్వరరావు వంటి ప్రముఖ పరిశోధకుల విశ్లేషణలు.

   పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు.

   వివిధ పత్రికల్లో వెలువడిన సాహిత్య అనుబంధ వ్యాసాలు.

3. **తులనాత్మక విశ్లేషణ (Comparative Analysis):** భీమన్న గారి సామాజిక చైతన్యాన్ని అంచనా వేయడానికి, అంబేడ్కర్ సిద్ధాంతాలతో ఆయన రచనలను పోల్చి చూడటం జరిగింది. అలాగే, ఆనాటి సామాజిక వాస్తవికతకు, భీమన్న గారి సాహిత్య చిత్రణకు మధ్య గల సంబంధాన్ని విశ్లేషించడం జరిగింది.

4. **చారిత్రక, సామాజిక దృక్పథం (Historical and Sociological Approach):** భీమన్న గారు జీవించిన కాలం, ఆనాటి ఆది ఆంధ్ర ఉద్యమం, అస్పృశ్యతా నివారణ పోరాటాల నేపథ్యంలో ఆయన రచనలను పరిశీలించడం జరిగింది. సాహిత్యం ఏ విధంగా సామాజిక మార్పుకు తోడ్పడిందో 'సామాజిక శాస్త్ర' (Sociology of Literature) కోణంలో విశ్లేషించడమైంది.

5. **ఫలితాల నిర్ధారణ (Inference):** సేకరించిన సమాచారాన్ని సమన్వయం చేస్తూ, భీమన్న సాహిత్యం ఏ విధంగా సమసమాజ స్థాపనకు, భావ విప్లవానికి బాటలు వేసిందో తార్కిక ముగింపు ఇవ్వడం జరిగింది.

సామాజిక చైతన్యం అంటే సమాజంలోని వ్యక్తులు తమ చుట్టూ ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, అన్యాయాలను గుర్తించి, వాటి పట్ల ఒక అవగాహనను కలిగి ఉండటం. ఇది కేవలం సమాచారం తెలుసుకోవడం మాత్రమే కాదు, సమాజంలో నెలకొన్న అసమానతలు, దోపిడీ, వివక్షలకు వ్యతిరేకంగా ఆలోచించడం, స్పందించడం. వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యత ఇస్తూ, సామూహిక హితం కోసం పాటుపడటమే నిజమైన సామాజిక చైతన్యం. డా. బోయి భీమన్న గారి మాటల్లో చెప్పాలంటే, తన అక్షరాల ద్వారా ప్రజల్లో ఆలోచనను రేకెత్తించి, వారిని అజ్ఞానం నుండి విముక్తం చేసే క్రియే సామాజిక చైతన్యం.

సాంఘిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, సామాజిక చైతన్యం అనేది ఒక వర్గం లేదా సమూహం తమ సామాజిక ఉనికిని, హక్కులను గుర్తించే ప్రక్రియ. కార్ల్ మార్క్స్ (Karl Marx) తన సిద్ధాంతాల్లో "సామాజిక ఉనికి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది" (Social existence determines consciousness) అని పేర్కొన్నారు. అంటే, మనిషి జీవించే పరిస్థితులే అతని ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తాయి. భీమన్న గారి సాహిత్యంలో కూడా ఈ అంశం కనిపిస్తుంది; ఆయన 'పాలేరు' నాటకంలో దళితులు తమ బానిసత్వాన్ని గుర్తించి, విద్య ద్వారా చైతన్యం పొందాలని పిలుపునిచ్చారు. ఈ రకమైన అవగాహన ప్రజలను వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించేలా చేసి, సమసమాజ స్థాపనకు దారితీస్తుంది.

డా. బోయి భీమన్న గారి సమగ్ర సాహిత్యాన్ని విశ్లేషించే ఈ ప్రధాన చర్చ (Main Body Analysis) విభాగం, ఆయన రచనల్లోని వివిధ చైతన్య కోణాలను విపులీకరిస్తుంది. దీనిని ఐదు ప్రధాన ఉప శీర్షికలుగా విభజించవచ్చు

1. విద్యా చైతన్యం – 'పాలేరు' నాటక విశ్లేషణ

భీమన్న గారి సాహిత్య ప్రస్థానంలో 'పాలేరు' నాటకం ఒక సామాజిక మానిఫెస్టో. అంబేడ్కర్ ఆశయమైన "చదువుకో, సమీకరించుకో, పోరాడు" అనే సూత్రాన్ని ఈ నాటకం ప్రతిబింబిస్తుంది.

మార్పుకు నాంది: పశువులు కాసే పాలేరు వెంకన్న, విద్యావంతుడై కలెక్టరుగా తిరిగి రావడం అనేది కేవలం ఒక వ్యక్తి విజయగాథ కాదు. అది ఒక జాతి విముక్తికి బాట.

సామాజిక స్పృహ: చదువు అనేది కేవలం ఉద్యోగం కోసం కాకుండా, సమాజంలోని అన్యాయాలను చట్టబద్ధంగా ఎదిరించే శక్తిగా భీమన్న చిత్రించారు.

2. రాజకీయ చైతన్యం – 'గుడిసెలు కాలిపోతున్నై'

ఈ కావ్యం ద్వారా భీమన్న గారు అట్టడుగు వర్గాల రాజకీయ స్థితిగతులపై పదునైన విమర్శలు చేశారు.

పేదవాడి ఓటును ధనికులు, రాజకీయ నాయకులు ఎలా కొనుగోలు చేస్తున్నారో ఆయన ఎండగట్టారు. "ఈ దేశంలో పేదలకు ఓటుండటం పక్కలో పాముండటమే" అని అనడం ద్వారా, రాజకీయ అవగాహన లేని ఓటు పేదలకు ప్రమాదకారి అని హెచ్చరించారు.

గుడిసెలు కాలిపోవడం, మళ్ళీ ఎన్నికలప్పుడు కొత్త గుడిసెలు రావడం అనే విషవలయాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన తాపత్రయపడ్డారు.

సామాజిక చైతన్యం ఉన్నత శిఖరానికి చేరాలంటే అది రాజ్యాధికారం వైపు మళ్లాలని భీమన్న ఆకాంక్షించారు. 'పాలేరు' లో వెంకన్న డిప్యూటీ కలెక్టర్ పదవిని చేపట్టడం అనేది దళిత ఉద్యమం సాధించిన ఒక చైతన్య శిఖరం.

వెంకన్న 'వెంకటేశ్వరరావు'గా పేరు మార్చుకోవడం కేవలం అక్షరాల మార్పు కాదు, అది దళితులపై ఉన్న అగౌరవ వాచకాలను తుడిచివేసే ఆత్మగౌరవ చైతన్యం.

మీరు పంపిన సమాచారం ప్రకారం, ఓటు హక్కు పేదవాడికి శని కాకూడదని, రాజకీయ నాయకుల కుటిల నీతిని అర్థం చేసుకోవడమే నిజమైన చైతన్యమని భీమన్న నొక్కి చెప్పారు.

3. సాంస్కృతిక చైతన్యం – కుల నిర్మూలన

భీమన్న గారు కుల వ్యవస్థను వేర్లతో సహా తొలగించడానికి పురాణాలను సామాజిక కోణంలో పునర్వ్యాఖ్యానించారు.

రాగవాసిష్ఠం నాటకంలో అరుంధతి–వశిష్ఠుల వివాహ నేపథ్యంతో కుల రహిత సమాజ ఆవశ్యకతను వివరించారు.

పురాణ పాత్రల పునర్దర్శనాన్ని తన రచనల్లో పేర్కొన్నారు. వాల్మీకి, వ్యాసుడు, ధర్మవ్యాధుడు వంటి పాత్రల ద్వారా దళితుల మేధో సంపత్తిని, వారసత్వాన్ని గుర్తు చేస్తూ, వారిలో ఆత్మగౌరవాన్ని రగిలించారు.

చదువుకు అడ్డుపడేది కేవలం పేదరికం కాదు, కామందులు నూరిపోసిన మూర్ఖత్వం అని ఆయన విశ్లేషించారు. తన దుస్థితికి కారణం 'కర్మ' అని నమ్మే మెట్టవేదాంతాన్ని ఆయన నిరసించారు."దైవాన్నీ, కర్మనూ, కులవర్గ సాంఘిక భేదాన్నీ సృష్టించింది స్వార్థపరుడైన మానవుడే" (రిఫరెన్స్: పాలేరు నాటకం, ఉపకారి పాత్ర ప్రసంగం)

4. శ్రామిక, రైతు చైతన్యం

రైతును, కూలీని సమాజానికి వెన్నెముకగా నిలిపిన కవి భీమన్న.

రైతును "సృష్టి స్థితి దేవత"గా, "నిష్కామ యోగి"గా కీర్తించారు. సమాజం మొత్తానికి అన్నం పెట్టే రైతు, తనను తాను త్యాగం చేసుకునే జీవజ్యోతి అని అభివర్ణించారు.

"మేడలను నిర్మించింది పూరి గుడిసెలే" అని అనడం ద్వారా శ్రామికుడి శ్రమ దోపిడీని నిరసించారు.

సామాజిక చైతన్యం అంటే సమాజంలోని దోపిడీ స్వభావాన్ని అర్థం చేసుకోవడం. భీమన్న గారు తన 'జానపదుని జాబులు' లో ఆర్థిక వ్యత్యాసాల మూల కారణాలను అద్భుతంగా ప్రశ్నించారు:

"ఎన్ని కొంపలు కూలిస్తేగానీ ఒక్క కొంప కోటికి పడగెత్తగలదు? ఎన్ని కొంపల్ని కడుపులు మాడ్చి–ఏడ్పించితే గాని ఒక కొంప సుఖంగా వినోదించగలదు?" (రిఫరెన్స్: జానపదుని జాబులు, 1933)

ఒకరి రక్తంతో వేరొకరు సౌఖ్య సౌధాలు నిర్మించుకునే ఈ క్రూర సంఘం పట్ల ఆయన కన్నెర్ర చేశారు. దున్నేవాడికి భూమి లేకపోవడమే అసలైన దురన్యాయమని ఆయన గుర్తించారు.

5. తాత్వికత – రసాద్వైతం

భీమన్న గారి తాత్విక చింతన 'రసాద్వైతం' లో కనిపిస్తుంది.

ఇది భౌతిక వాదానికి, ఆధ్యాత్మిక వాదానికి మధ్య సమతుల్యత. మనిషి గౌరవంగా బతకడానికి అవసరమైన భౌతిక వనరులతో పాటు, మానసిక వికాసం కూడా ముఖ్యమని ఆయన ప్రతిపాదించారు.

మతం, భక్తి పేరిట ప్రజలను నిద్రపుచ్చే ధోరణులను నిరసిస్తూ, మానవత్వమే పరమార్థమని చాటారు.

ముగింపు (Conclusion)

తెలుగు సాహిత్య యవనికపై డా. బోయి భీమన్న ఒక ధ్రువతార. ఆయన సాహిత్యం కేవలం అక్షర విన్యాసం కాదు, అణగారిన వర్గాల ఆత్మగౌరవ ఘోష. మారుమూల పల్లెలో పాలేరు బిడ్డగా జన్మించి, అంచెలంచెలుగా ఎదిగి పద్మభూషణ్ వరకు సాగిన ఆయన ప్రస్థానం ఒక చారిత్రక పరిణామం.

ఈ పరిశోధన ద్వారా తేలిన ముఖ్యాంశాలు:

సామాజిక చైతన్యం: భీమన్న గారి రచనలు సమాజాన్ని మేల్కొలిపే 'జ్ఞాన జ్యోతులు'. విద్య ద్వారానే దళితులకు, పేదలకు అసలైన విముక్తి లభిస్తుందని ఆయన బలంగా నమ్మారు. 'పాలేరు' నాటకం ద్వారా ఆయన సృష్టించిన విద్యా చైతన్యం తెలుగు నాట విప్లవాత్మక మార్పులకు బాటలు వేసింది.

రాజకీయ చైతన్యం: రాజకీయ నాయకుల స్వార్థానికి పేదవాడు ఓటు ద్వారా బానిస కాకూడదని, రాజకీయ స్పృహ కలిగిన ఓటు మాత్రమే సమాజాన్ని మారుస్తుందని 'గుడిసెలు కాలిపోతున్నై' ద్వారా హెచ్చరించారు.

మానవతావాదం: కుల వ్యవస్థను వేర్లతో సహా పెకిలించడానికి ఆయన పురాణాలను సైతం మానవతా దృక్పథంతో పునర్వ్యాఖ్యానించారు. కులం కంటే గుణం, మతం కంటే మానవత్వం గొప్పవని ఆయన ప్రతిపాదించిన 'రసాద్వైతం' నిరూపిస్తుంది.

శ్రామిక గౌరవం: రైతును, కూలీని సమాజ నిర్మాతగా గుర్తించి, శ్రమకు దైవత్వాన్ని ఆపాదించిన అభ్యుదయ కవి ఆయన.

సారాంశం:

డా. బోయి భీమన్న గారు ఒక వర్గానికి లేదా ఒక కులానికి పరిమితమైన కవి కాదు. ఆయన ఒక విశ్వమానవ కవి. సాహిత్యం ద్వారా సమానత్వం సాధించవచ్చని నిరూపించిన మహనీయుడు. నేటి సమాజంలో పెరుగుతున్న అసమానతలను, రాజకీయ వైరుధ్యాలను తొలగించడానికి భీమన్న సాహిత్యం ఒక దిక్సూచిలా పనిచేస్తుంది. ఆయన ఆశించిన కులరహిత, వర్గరహిత, సమసమాజ స్థాపన కోసం కృషి చేయడమే భీమన్న గారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

ఆధార గ్రంథ సూచిక (Bibliography)

1. భీమన్న, బోయి. గుడిసెలు కాలిపోతున్నై, ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, 1977.
2. భీమన్న, బోయి. పాలేరు (నాటకం), దేశికవితామండలి, 1946.
3. భీమన్న, బోయి. రాగవాసిష్ఠం, సుఖేలా నికేతన్ ప్రచురణలు.
4. వెంకటేశ్వరరావు, దార్ల. జాతీయ కవి బోయి భీమన్న, సూర్య దినపత్రిక సాహిత్య అనుబంధం, 2011.
5. హైమవతీ. పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, జీవిత చరిత్ర.
6. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు, హైదరాబాద్, 2010.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

పిల్లీ శతకం - సామాజిక విశ్లేషణ

- డా. బకరం నర్సింహ
తెలుగు సహ ఆచార్యులు
సెల్ : 9948985954

తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటిలో శతకం తనదైన విశిష్టతను నిలుపుకున్నటువంటి ప్రక్రియ. భారతీయ భాషలన్నింటిలో శతకం ఉన్నప్పటికీ తెలుగులో పాఠకులను విశేషంగా ఆకర్షించిన ప్రక్రియగా గుర్తింపు పొందింది. తెలుగులో గొప్ప శతక సాహిత్య సృజన జరిగింది. కానీ ' కవుల దృష్టిలో శతకము పేరు పెట్టి పేర్కొనదగిన కృతి కాకపోయినను శతక వాఙ్మయం సంఖ్యలోనూ కావ్యగుణములలోను, భావనాపటిమలోను పద్య, ద్విపద, ప్రబంధ వాఙ్మయమున కేవిధమునను తీసిపోదు. ఇంకను ఒక్కింత మొగ్గు చూపు' (శతక వాఙ్మయ సర్వస్వము) అని శతక వాఙ్మయ వైశిష్ట్యమును తెలియజేశాడు. వాస్తవముగా చూస్తే ప్రబంధము కంటెను శతకమే ఒకవిధంగా గొప్పదని చెప్పవచ్చు. పద్య కావ్యాలలో కథా వస్తువొకటి ఉండటం చేత కవి స్వేచ్ఛగా ధారాళముగా తన భావాలను వెల్లడించుటకు అవకాశము లేదు. కవికి కృతికి మధ్య కథ అడ్డుగా ఉంటుంది. ఈవిషయం మనం శతక లక్షణాలను పరిశీలిస్తే తెలుస్తుంది. శతక లక్షణాలు ఛందోనియమం, సంఖ్యానియమం, మకుటం, ముక్తకం అని చెప్పవచ్చు. ఛందోనియమం అనగా శతకంలో ఎన్ని పద్యాలుండాలి. శతకం అంటే వంద అని మనందరికీ తెలిసినప్పటికీ తెలుగు కవులు తమ శతకాలలో వంద నుంచి 106, 108, 116 పద్యాలను రాశారు. వేమన శతకం సంఖ్యానియమానికి మినహాయింపు అయినప్పటికీ వేమన శతకాన్ని మనం శతకముగనే భావిస్తున్నాం. మకుటం అనగా చివరి పాదంలో ఒక పదం గానీ పాదం గానీ చివరి రెండు పాదాలు మకుటంగా ప్రయోగించారు. ఈమకుటం వల్లనే ఇది ఒక కావ్యమని తెలుస్తుంది. ఒక్కొక్క పద్యం ఒక్కొక్క ఖండంగా ఉండటం మూలాన వీటన్నింటినీ కలిపి ఉంచేది మకుటమే. సుమతీ, భాస్కరా, శ్రీకాళహస్తీశ్వరా, విశ్వదాభిరామ వినురవేమ, భూషణ వికాస శ్రీధర్మపుర నివాస, దుష్ట సంహార నరసింహ దురిత దూర మొదలయినవి. ముక్తకం అనగా ఏ పద్యానికా పద్యం స్వతంత్రంగా ఉండడం. శతకం ఆత్మకవితారీతికి చెందినది. ప్రబంధం వస్తుకవితా రీతికి చెందినదని పేర్కొనవచ్చు.

తెలుగు శతకాలలో నీతిశతకం (సుమతీశతకం, వేమనశతకం, భాస్కరశతకం) భక్తి శతకం (వృషాధిప శతకం, నారసింహ శతకం, నారాయణ శతకం, శ్రీకాళహస్తీశ్వర శతకం) శృంగార శతకం, (రాధికా శతకం) అధిక్షేప శతకం (ఆంధ్రనాయక శతకం) మొదలైనవి ఉన్నాయి.

బోయి భీమన్న (1913 - 2006) ప్రముఖ తెలుగు కవి. ప్రజాకవిగా, ఆధునిక తెలుగు సాహిత్యానికి చైతన్యాన్ని, దళిత సాహిత్య ఉద్యమానికి మార్గదర్శనం చేసిన కవిగా భీమన్నను గుర్తుంచుకోవచ్చు. భీమన్న రచనలు సమాజంలోని అణచివేత, కులవివక్ష, పేదరికం, అసమానతలపై ప్రశ్నలను సంధించటమే కాక ఆలోచింపజేస్తాయి. గాంధేయ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోమని ఉద్బోధిస్తాయి.

పిల్లీ శతకంలో 126 కంద పద్యాలున్నాయి. పిల్లీ అను ఏకపద మకుటంతో రాసిన ఈశతకంలోని పద్యాలను కందంలో రాస్తానని చెప్తూ

అందమననేమి! హృదయ
స్పందనమే అందమౌను స్పందనె కవితా
నందమును కాని నీకది
కందముతో నిత్తు ప్రీతి గైకొను పిల్లీ

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట: 521)

అంటూ కందము రాసినవాడే కవి అనే కవి ఉక్తిని అందమైన తన హృదయ స్పందనను కందపద్యాలలో రాస్తానని ప్రకటించాడు. పిల్లీకి కుటుంబసభ్యులకు, పిల్లలకు మరియు పిల్లీకి ఉన్న సంబంధాన్ని వివరిస్తూ పిల్లల మనస్తత్వం పిల్లీ మనస్తత్వం ఒకటేనని, పిల్లీది పసితనము అని

పసి మనసు నీది లోకపు
పసివారికి నీకు దోస్తీ పసితనమే తా
పసితనము మానవాళుల
పసిమికి మిసిమికి నీవే ప్రాణము

(11వ పద్యం)

అంటూ పిల్లీ మనస్సును పసిమనస్సు అని కవి పిల్లీది కల్లాకపటం ఎరుగని పసిమనస్సు అని తాపసి మనస్సు అని గొప్పగా చూపెట్టాడు.

సాధారణ ప్రజలు తమతమ లోకసుఖాలు, ఇంద్రియ సుఖాలకోసమే జీవిస్తారు. అలాంటి వారు ఉన్నతమైన భావజాలానికి సాహిత్య సృష్టి ద్వారా కలిగే శాశ్వత ఆనందాన్ని పొందలేరు. 'కవితా సృజనమే అజరామరము మరియు లోకహితము' అని 'ప్రతి నిత్యం విధులలో అలసిపోయిన ప్రాణులకు ' కావ్యం బానంద మొసగు మోహిని' అని అలా కాకపోతే కావ్యము ఎందుకని ప్రశ్నించాడు. 'లయబద్ధము ఆలయబద్ధము నౌను రాగ లయబద్ధ రసోదయ చైతన్యమె లోకము ప్రియ కవితే ప్రాణ నవత' అని కావ్యము గొప్ప తనాన్ని వివరించాడు. కావ్యంలోని విషయం ఆధారంగా గుర్తింపు రావాలి

కానీ కవి కులం ఆధారంగా, ప్రాంతం ఆధారంగా, పూర్వికుల ఆధారంగా కవులకు బిరుదులు ఇచ్చే దానిని ప్రశ్నిస్తూ

కవి భుజగుడు, కవి వృషభుడు
కవి పికుడని పిలువబడక కవి కాలేడా
కవితకు కాదా బిరుదులు
కవి బ్రతుకుకు తోకలమ్మ కలిలో **(32వ పద్యం)**

కవితకు బిరుదులు కావాలే కాని కవి బ్రతుకుకు తోకలు కావద్దని హితవు పలికాడు. ఇది కీర్తి దాహం అని ఇది ఈ కాలంలో పరాకాష్టకు చేరిందని, వ్యాపారంగా మారిందని దీని వల్ల అసలైన ప్రతిభకు గుర్తింపు రాకుండా పోతుందని ఎలుగెత్తి చాటాడు. కీర్తి కాంక్ష వల్ల పరస్పరం లాభం పొందేట్టుగా పరిస్థితులను మార్చుకుంటున్నారని భీమన్న అంటాడు.

వారిని వీరును, వీరిని
వారును బహుగొప్పగ జేసి పైకెత్తుచు తత్
బేరుమును పంచుకొందురు
కీరితి గడియించువారి కిటుకిది'

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 524)

అని ఒకరికొకరు లాభం చేసుకుంటూ నిజమైన సేవకు అసలైన ప్రతిభకు గుర్తింపు లేకుండా చేస్తున్నారని వివరించాడు. దీని ద్వారా మహానుభావులుగా పైకెత్తుతూ వచ్చిన లాభాన్ని పంచుకుంటున్నారు అని ఈ దుష్ట సంస్కృతిని తులనాడాడు.

మనుషులు అనేక జంతువులను పెంచుకుంటారు. వాటిని కుటుంబంలోని వ్యక్తి వలె పేర్లతో పిలుచుకుంటారు. అలాంటి పెంపుడు జంతువులలో పిల్లీ ఒకటి. మిగతా జంతువులకు ప్రత్యేక గదులు ఉంటాయి. వాటి ద్వారా ఫలితాన్ని పొందుతారు. కానీ పిల్లీ వలన ఏ ఇతర ప్రయోజనం లేకపోయినా పిల్లీ ఇల్లును వదలక ముఖ్యంగా వంటిల్లును వదలకుండా ఉంటుంది. కృష్ణుడు వెన్నను వెతుక్కుంటూ వెళ్ళినట్లు పిల్లీ కూడా వంటిల్లును వెతుక్కుంటూ వెళ్తుందని

ఇంటికి సతియును, చుక్కల
మింటికి చంద్రుడు గొప్ప! మేదిని కెల్లన్
వంటిల్లు గొప్ప దానికి
బంటువు నీ గొప్ప నెన్న వశమా పిల్లీ

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 525)

ఇంటికి దీపం ఇల్లాలు అని, ఇల్లును చూసి ఇల్లాలును చూడాలని, ఇల్లు అంటేనే ముఖ్యంగా ఉండవలసినది ఇల్లాలు అని చెప్తారు. ఇల్లుకు అందం ఇల్లాలు అని అంటారు. ఈ కవి ఇంటికి గొప్ప

ఇల్లాలు అంటున్నాడు. అలాగే చుక్కల మింటికి చంద్రుడు గొప్ప అని, అదే చంద్రుడు లేని ఆకాశం అంధకారమయం అని చెప్తారు. అలాగే వంటిల్లుకు నీవు బంటువు అని పిల్లిని కొనియాడాడు.

వంటిల్లుకు కాపాలా ఉంటూనే పాలు త్రాగుటకు తాను చూపే నైపుణ్యంను వివరిస్తూ

బడ బడ మను చప్పుడు విని
బడితెను గొని వంటయింట పాదంబిడ అ
క్కడ కర్మయు క్రియయునె క
న్పడు! కర్త హుళక్కి యౌను! భళిరే, పిల్లీ!

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 525)

వంటింట్లో జరిగే చప్పుడుకు కర్త కర్మ క్రియ పిల్లే అయినప్పటికీ, యజమానులు కర్ర పట్టుకుపోతే అక్కడ పిల్లీ చేసిన క్రియ కనిపిస్తుంది, పడిపోయిన పాత్ర కనిపిస్తుంది కానీ కర్త అయిన పిల్లీ మాత్రం కనపడదు. అలాగే వేదాల తాత్విక అర్థాన్ని చెప్తూ

కర్మయు క్రియయునె చాలును
ధర్మము కొనసాగ, కర్త దర్శనమేలా
చర్మాక్షుల కను వైదిక
మర్మము మాకిడెడు నీదె మహిమము పిల్లీ! (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 525)

ఈ పద్యంలో కర్త కర్మ ధర్మం వేదం గురించి లోతైన భావన ఉంది. కర్త యొక్క దర్శనం అవసరమే లేదని, చర్మాక్షులైన మానవులు పైకి కనిపించే కళ్ళతో చూసేవారు లోతైన వేదార్థంను గ్రహించలేని వారికి పిల్లీ వైదిక మర్మం తెలుపుతుందని చెప్పాడు.

లోకరీతిని మానవుల మనస్తత్వాన్ని రాజకీయాలలో ఉన్న నాయకులు కూడా విషయాన్ని వదిలిపెట్టి నోటికే ప్రాధాన్యమిస్తున్నారు. పదవులకు పెదవులకు ఉన్న సంబంధాన్ని వివరిస్తాడు ఈపద్యంలో

భయపెట్టెడి కుక్కలకే
భయపడుదురు, దేవుడేని భయపడరు సుమీ
నయశాలియైన! కావున
భయపెట్టుము, పెత్తనములు పడయుము పిల్లీ

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 528)

భయపెట్టే వారికే జనం భయపడతారు. అధికారం రావాలంటే అరవడం, భయపెట్టడం రాచమార్గమని అలా ఆ విధంగానే పిల్లి కూడా పెత్తనము పొందాలని కాంక్షించాడు.

అడగకుండా ఏవీ తన వరకు రావని అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదని, కావున నీవు కూడా అడిగి హక్కులు సాధించుకోవాలని చెప్తూ..

దానము ధర్మము కుక్కకే
మానము గల నీకు కాదు మర్యాదగ నీ
ప్రాణములు నిల్పుకొందువు
మానము గల వారి కెల్ల మాన్యవు పిల్లీ (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 530)

ఆత్మగౌరవం, స్వాభిమానం ఉన్న వారందరికీ నీవు గౌరవనీయురాలివని చెప్తాడు.

మానవుల స్వభావం, కలహ ప్రియత్వంపై కవి చేసిన చురుకైన వ్యాఖ్య ఇది. ఈ పద్యంలో మనుషులు కలహాశనుడనే పేరు నారదునకే కాదు నరునకు కూడా అని, నరుడు తన చుట్టూ ఉన్నవారు కలిసి మెలిసి ఉండడం ఓర్వలేరని, అది మానవుల సహజ ధర్మం అంటాడు. మనుషులు కుల, వర్గ, జాతి వైరాలను వదులుకోలేరని చెప్తూ

ఎలుక పయి పిల్లీ, పిల్లీపై
ఎలుకను ఎక్కించు చెపుడు ఈమనుజులు మీ
కుల వైర మారన్విరు
కలహాశనులమ్మ నరులు! కనవే పిల్లీ (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 528)

మానవుల స్వభావాన్ని సూటిగా చెప్పాడు. మానవుల వలెనే నీవు కూడా లోపల స్వార్థం, విషం, దుష్టబుద్ధి ఉన్నప్పటికీ ముఖములో, పలుకులో మృదువుగా, మధురంగా తేనెలొలుకుతూ మాట్లాడుమని పిల్లీకి చెపుతూ

హృదయములో విషమున్నను
వదనములో తేనె కార్చవమ్మా! ప్రజల
భ్యుదయ పరురాల వని నీ
పదములు సేవింత్రు బాగుపడుదువు పిల్లీ (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 528)

నీవు అభ్యుదయపరురాలిగా నీ పరిణతి చూపవమ్మా పిల్లీ అని అప్పుడే నిన్ను ప్రజలు సేవిస్తారు అన్నాడు.

సమాజంలోని పేదరికాన్ని తొలగించడానికి మేధావులు, ఉద్యమకారులు అభ్యుదయపరులు ప్రగతిశీల దృష్టితో పోరాడుతారని చట్ట సవరణకు, రాజ్యాంగ సవరణకు పట్టుబడతారు. అలాగే సమాజంలో నూటికి తొంభై మందికి కూటికి గుడ్డకు లేదని, ప్రజలకున్నప్పుడే, తిన్నప్పుడే పిల్లీకి కూడా తిండి దొరుకుతుందని కాబట్టి పిల్లీ కూడా పేదల పట్ల దయతో వారి పక్షాన పోరాడమని చెప్తూ

నూటికి తొంభై మందికి
కూటికి గుడ్డకును లేదు కూర్చుంటావే
నోటికి తాళం వేసుక?
చాటింపుము వంటగదుల సవరణ పిల్లీ
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం పుట 525)

మనుషులలోని అసమానతల పైననే కాదు వంటగదుల అసమానతలపై కూడా చట్ట సవరణ కోసం ఉద్యమించాలని పిల్లీని కోరుతాడు.

తెలుగు శతకాలలో మానవులకు జీవితంలో ఉపయోగపడే విషయాలు అనేకం ఉంటాయి. తాత్విక, ఆధ్యాత్మిక, నీతి సంబంధిత విషయాలు సరళమైన, సులభమైన భాషలో శతకకారులు తమ జీవితానుభవాలను చెప్తారు. ఇందులో విషయాలు సూటిగా చెప్పటానికి ప్రతీకలను వాడుకుంటారు. ప్రతీకలను వాడటం ద్వారా చెప్పదలచిన అంశాన్ని తక్కువ పదాలలో చెప్పవచ్చు. బోయి భీమన్న తన పిల్లీ శతకంలో కూడా అనేక ప్రతీకలను సందర్భానుసారం ప్రయోగించాడు. "ఓయమ్మ నీకుమారుడు మాయిండ్లను పాలు పెరుగు మననీడనుచున్" అని మరోచోట "బాలకృష్ణునకు రేలును, పవలును లేవు వెన్నలును జున్నులును నే మనుగడ నీకును నటులే నిను తెలియుట బాలకృష్ణ నెరుగుట" అంటారు. గణపతిని గురించి 'కడవంత బొజ్జ దేవుడు కడు వెరుచును నిన్ను చూచి కాదే' అని పిల్లీకి ఎలుకకు ఉన్న వైరమును గణనాథుడి ఆధారంగా అద్భుతంగా వివరించాడు. అలాగే సామెతలను కూడా వాడటం ద్వారా విషయాన్ని గుండెలకు హత్తుకునేట్టు చెప్పవచ్చు. బోయి భీమన్న తన పిల్లీ శతకంలో కూడా అనేక సామెతలను సందర్భానుసారం ప్రయోగించాడు. అందులో కొన్ని 'పొయిలోని పిల్లీ లేవదు' పిల్లీ కనులు పోగోరును కుక్క పిల్లల సిరిగోరును' 'శీలమన పిల్లీ శీలమే' అని అనేక సామెతలను ప్రయోగించాడు. పిల్లీని చంకను బెట్టుక వెళ్ళుట యను పిచ్చినుడులు' మూఢవిశ్వాసములు చెల్లవని పేర్కొన్నాడు.

పిల్లీ శతకము సామాన్య జీవితంలోని చిన్న చిన్న సంఘటనల ద్వారా గొప్ప నైతిక విలువలను బోధిస్తుంది. సరళమైన భాష, వ్యంగ్య ధోరణిలో మానవ స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ శతకం తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యానికి దోహదపడిన కృతి అని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు:

1. ఆంధ్ర వాఙ్మయ సర్వస్వము
2. పిల్లీ శతకము

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

పాలేరు నుంచి పద్మశ్రీ దాకా - ఒక పరిశీలన

- డా. భీంపల్లి శ్రీకాంత్
సాహిత్య పరిశోధకులు,
సెల్ : 9032844017

సమాజాన్ని జాగృతపరిచే కళాత్మక ఆయుధం సాహిత్యం. అలాంటి సమాజాన్ని చైతన్యపరచడం కోసం ఎంతోమంది కవులు కలం పట్టారు. అలాంటి వారిలో సామాజిక చైతన్యం కోసం రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారిలో సుప్రసిద్ధ కవి, రచయిత డా. బోయి భీమన్న ఒకరు. ఎక్కడో మారుమూల పల్లెలో పాలేరులో పుట్టి పద్మశ్రీ దాకా తన ప్రస్థానాన్ని కొనసాగించిన నిత్య సాహిత్య దురంధరుడు బోయి భీమన్న. బోయి భీమన్న పద్మశ్రీ పురస్కారమే కాదు కేంద్ర సాహిత్య అకాడమీ, పద్మభూషణ్‌లతో పాటు లెక్కకుమించి అనేక గౌరవ, సన్మానాలందుకున్నవాడు. సుమారు డెబ్భై పుస్తకాలకు పైగా రాశాడు. పద్యం, గేయం, వచనం రచనలతో పాటు, నాటకాలను కూడా రాశాడు. త్రిపదలు అనే సరికొత్త కవితాప్రక్రియను సృజించాడు. వీటన్నింటితో పాటు అంబేద్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి చక్కగా అనువదించాడు. ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రచనలు చేశాడు.

బోయి భీమన్న అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చేది ఆయన రాసిన "గుడిసెలు కాలిపోతున్నై" కవితా సంపుటి. అణగారిన దళితుల జీవితాలకు అద్దం పట్టిన పుస్తకమిది. దీనికే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అలాగే బోయి భీమన్న జీవిత చరిత్ర కూడా ఆయనకు ఎనలేని కీర్తిప్రతిష్టలను తీసుకువచ్చింది. "పాలేరు నుంచి పద్మశ్రీ దాకా" అనే ఆయన జీవిత చరిత్ర ఆయన జీవితాన్ని, సాహిత్య ప్రస్థానాన్ని ఆవిష్కరించింది. దీనిని ఆయన భార్య హైమవతీ భీమన్న చక్కగా కథనాత్మక శైలిలో రచించింది. ఈ పుస్తకంలో భీమన్న రచనల నేపథ్యాన్ని సవివరంగా వివరిస్తూ ఆయన సామాజిక దృక్పథాన్ని, జాతీయవాదాన్ని కూడా చక్కగా ఆవిష్కరించింది. ఆయన జీవితంలోని అనేక ముఖ్య ఘట్టాలను, ఆయన సాహిత్యకృషిని హైమవతీ చక్కగా కథ కథనాత్మక రూపంలో సులభ సుందరంగా అందించింది. ఈ పుస్తకం బోయి భీమన్న వ్యక్తిగత జీవితంలోని అనేక పార్శ్వాలతో పాటు

ఆయన సామాజిక పోరాటాన్ని తెలుపుతుంది. అలాగే ఆయన రచనలను అక్కడక్కడ ప్రతి సర్గలో వివరించింది. ఆయనకు లభించిన కళాప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదుల వరకు సాగిన అద్భుత ప్రస్థానాన్ని తెలియజేస్తుందీ పుస్తకం.

భీమన్న వాస్తవానికి జాతీయ కవి. అంతకుమించి మానవతామూర్తి. "భిన్నత్వంలోని ఏకత్వం" లాగే, భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుంది. ఆయన కులమతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది. భీమన్న జీవితాంతం జాతీయవాదిగానే ఉన్నాడు. తాను పుట్టి పెరిగిన దేశీయవాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్షతో రచనలు చేసిన అసలైన సామాజిక చైతన్యస్ఫూర్తి. నిత్యం పేదరికంతో పాటు అంటరానితనం వంటి దురాచారాలను ఎదుర్కొన్నవాడు. సహజంగానే భీమన్న వీటిని నిరసించాడు. ఇవన్నీ తన రచనల్లో ప్రస్ఫుటంగా ఆవిష్కరించాడు.

పాలేరు నుంచి పద్మశ్రీ దాకా

భీమన్న జీవిత చరిత్రలో మొత్తం పదమూడు సర్గలున్నాయి. ప్రతి సర్గలో తన జీవితంలోని ముఖ్య ఘట్టాలను హైమవతీ భీమన్న సందర్భానుసారంగా భీమన్న రచనలను పేర్కొంటూ జీవితచరిత్రను పాఠకులు ఆకట్టుకునేలా రచించడం విశేషం. ఇదొక సరికొత్త జీవిత చరిత్ర. భీమన్న రచనలు ఆయన జీవితంలాగే రసభరితమని చెప్పవచ్చు. భీమన్న రచనల్లో సామాజిక, రాజకీయ సమస్యలను ఎక్కువగా ఇతివృత్తాలుగా తీసుకున్నాడు. ఈ గ్రంథం భీమన్న సాహిత్య చరిత్రనే కాదు ఆ కాలంనాటి సాంఘీక, రాజకీయ స్థితిగతులను కూడా సవివరంగా వివరిస్తుంది. ఇదొక మహాకవి జీవిత చరిత్ర కాదు. అన్ని జీవిత చరిత్రలకు భిన్నంగా ఇది మనకు దర్శనమిస్తుంది. ఒక మారుమూల పల్లెటూరిలో పుట్టి సాహిత్యరంగంలో అత్యున్నత శిఖరంగా ఎదిగి పద్మశ్రీ దాకా తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించిన ఒక అసామాన్య కవి చరిత్ర ఇది. జీవితంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ జీవితాన్ని కొనసాగించిన మానవతామూర్తి బోయి భీమన్న.

రామాయణంలో కాండలున్నట్లు, మహాభారతంలో పర్వాలున్నట్లు, భాగవతంలో స్కంధాలున్నట్లు భీమన్న జీవితచరిత్రలో సర్గలున్నాయి. ఇందులోని మొదటిసర్గ బాలసర్గ. ఈ బాలసర్గలో భీమన్న బాల్యం, విద్యాభ్యాసంతో పాటు అతని తల్లిదండ్రుల విశేషాలు, తొలి రచనలు పేర్కొనబడ్డాయి. ఊరికి, నాగరిక సమాజానికి దూరంగా చదువుసంధ్యలు నిషేధించబడ్డ ఒక వెలివాడలో పుట్టిన ఒక సామాన్య పిల్లవాడి జీవితం, భవిష్యత్తులో తెలుగు సాహిత్య చరిత్రలో ఒక శాశ్వతమైన స్థానాన్ని పొందాడని ఎవరూ ఊహించి ఉండరు. తన ఊరికి దగ్గరగా ఉన్న పంటకాలువపై రోజూ నడిచి వచ్చి చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను చూస్తూ తనలోని కవిని ఆవిష్కరించుకున్నాడు. ఆరు ఋతువుల్లోని అనేక సౌందర్యాలను ఆస్వాదిస్తూ, అవ్యక్తమైన అందాలను అనుభవిస్తూ బాలకవిగా అవతరించాడు. భీమన్న సాహిత్య వికాసానికి ఈ బాల్యమే దోహదం చేసింది. చదువుతో పాటు భాషాజ్ఞానం పెరుగుతూ వచ్చింది. దాయాది వెంకయ్య బర్మా నుంచి తెచ్చిన గ్రంథాలను ఎన్నో చదివి తన కలానికి పదునుపెట్టాడు. చిన్నతనంలోనే తన చేతిలోకి చేరిన పంచతంత్రం, అమరకోశం, మనుచరిత్ర వంటి

గ్రంథాలను చదవడంతో తనలోని భాషా సరస్వతిని మేల్కొలిపాడు. వాటిని పట్టుదలతో ఎన్నోసార్లు చదవటం వల్ల భాషాజ్ఞానం అబ్బింది.

భీమన్నకు మిడిల్ స్కూల్లో చేరేవరకు అంటరానితనం అంటే ఏమిటో తెలియదు. అంటరానితనాన్ని తొలిసారిగా చవిచూసింది నగరం స్కూల్లో చేరినప్పుడు మాత్రమే. ఈ స్కూల్లో అంటరానివారికి కొద్దిగా దూరంగా బెంచీలు ఉండేవి. పైకులాల పిల్లలను కానీ, వారి బెంచీలను కానీ, వారి పుస్తకాలను కానీ వీళ్ళు ముట్టుకోకూడదు. అంత అంటరానితనం అప్పట్లోనే రాజ్యమేలింది. ఈ అంటరానితనం ఎంత బాధించినా, ఎంత అవమానపరిచినా అవన్నీ భీమన్న లెక్కపెట్టలేదు. దీనిని ఆయన తన సాహిత్య సృజనకు ఉపయోగించుకున్నాడు. అట్లా ఫస్టుఫారం క్లాసులోనే...

" కేలన్ గేల్, పయిటన్ బయంట కొని, సంకీర్ణ ప్రలాపాను హా
స్యాలాపంబుల, ముద్దునవ్వుల, విలాసార్థంబ యేతెంచుచున్
లీలా మానుషగాన మాధురికి హాళిన్ దూలి, మోహార్తులై
బాలల్ వేలుగ గూడిరందు, ధవళంబై జ్యోత్స్న లాలింపగన్! "

అంటూ పద్యాన్ని రచించగా తెలుగు టీచరు ఆశ్చర్యంతో క్లాసంతా చదివి వినిపించాడు. దీంతో పద్యాలు ఇంటి దగ్గరే కాదు స్కూల్లో కూడా రాస్తాడని తెలిసిపోయింది. అంతేకాదు భీమన్న పద్యాలు రాస్తాడని ఎంతోమంది వచ్చి భీమన్న పద్యాలను విని పోతుండేవారు. అదీ భీమన్న గొప్పతనం. అదీ భీమన్న పద్య చమత్కారం.

రెండవ సర్గ కోరక సర్గ. ఇందులో భీమన్నకు బయటి ప్రపంచంతో పరిచయం ఏర్పడుతుంది. అంతంత మాత్రంగానే ఉన్న భీమన్న జీవితం అదృష్టవశాత్తు సెకండు ఫారంలో వచ్చిన స్కాలర్‌షిప్ తను బి.ఏ. చదివే వరకు కొనసాగడంతో చదువుకు ఏ ఇబ్బంది ఉండేది కాదు. ఈ స్కాలర్‌షిప్ రావడానికి ప్రధాన కారణం తను రాసిన పద్యాలే కావడం విశేషం. పద్యాలు రాసి స్కాలర్‌షిప్ సాధించడమనేది ఒక్క భీమన్న విషయంలోనే జరిగిందని చెప్పవచ్చు. భీమన్న ఫోర్తు ఫారం చదివేటప్పుడు విద్యార్థులందరికీ వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీకి భీమన్న ఒక్కడే వ్యాసం పంపడంతో అతడికే అవార్డు లభించింది. తను రాసిన వ్యాసానికే తొలి అవార్డు రావడం విశేషం. ఈ సర్గలో బాల్యంలోని చదువుతో పాటు తన గురువులు చెప్పిన జీవిత పాఠాలను ఎలా నేర్చుకున్నాడో, ఎలా పద్యాలను రాసి తన గురువులను ఇబ్బంది పెట్టాడో, భీమన్న వల్ల గురువులు ఎలా ఇబ్బంది పడ్డారో హైమవతీ భీమన్న మన కళ్ళముందు చూపెట్టింది.

ఇందులోని మూడవ సర్గ వికాస సర్గ. పాఠశాలలకు ముగింపు పలికి కళాశాల జీవితంలోకి అడుగులు వేసిన సందర్భంలో ఎందరో ప్రసిద్ధకవులు పరిచయమయ్యారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, తల్లావఝుల శివశంకరశాస్త్రి, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, అడవి బాపిరాజు వంటివారు పరిచయమయ్యారు. ఇందులో భీమన్నకు నచ్చిన ఏకైక కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి. కాకినాడలోని చాలా ప్రసిద్ధి చెందిన పి.ఆర్. కళాశాలలో భీమన్న ఇంటర్ రెండేళ్ళు, డిగ్రీ రెండేళ్ళు హాస్టల్లో ఉంటూ చదువుకున్నాడు. ఈ నాలుగు సంవత్సరాలు భీమన్న జీవితంలో ఒక మరుపురాని మధురస్మృతులను మిగిల్చింది. ఈ కళాశాలలో ప్రసిద్ధ నాస్తికులు గోపరాజు రామచంద్రరావు (గోరా) భీమన్నకు బాటనీ

లెక్చరర్. జీవితంలో ఎలా మెలగాలో శ్రీశ్రీ హేతుబద్ధమైన ఆలోచన పద్ధతులను భీమన్నకు నేర్పినవాడు. విశేషమేమిటంటే భీమన్న ఆస్తికుడు. గోరా నాస్తికుడు. అయినా ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. అలాగే కళాశాలలో ప్రిన్సిపాల్‌కు, భీమన్నకు జరిగిన అనేక సంఘటనలు చదివితే భీమన్న నిక్కచ్చిగా ఎలా వ్యవహరించాడో తెలుస్తుంది.

రవీంద్రుని "గీతాంజలి, నెలవంక" మొదలైన ఆంగ్ల కవితలను చదివిన స్ఫూర్తితో ఆంగ్లంలోనూ, తెలుగులోనూ రచనలు చేశాడు. అనంతరం అవన్నీ వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. భీమన్న జీవితంలో అధికభాగం ప్రణయమేనని, అతని రచనల నిండా అది కన్పిస్తుందని రచయిత్రి పేర్కొన్నది.

ఇక నాల్గవ సర్గ మధుకర సర్గ. ఇందులో భీమన్న పెళ్ళి సరికొత్త పద్ధతిలో జరిగిన తీరును రచయిత్రి చక్కగా ఆవిష్కరించింది. తనకు నచ్చిన అమ్మాయితో పెళ్ళి చేయమని చెప్పడం, వాళ్ళ నాన్న అలాగే చేయడం, అప్పట్లోనే కులాంతర వివాహం చేసుకోవడం, సంప్రదాయ విధానానికి భిన్నంగా జరగడం ఒక రకంగా భీమన్న అభ్యుదయ భావాలకు నిదర్శనం. అనంతరం ఈ పద్ధతిని కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు అనుసరించడం విశేషం. పెళ్ళి అనంతరం మద్రాసుకు ఉద్యోగం కోసం వెళ్ళడం, అదీ రాకపోవడంతో పిఠాపురం రాజావారు మద్రాసులో "జనవాణి" పత్రిక ప్రారంభించడంతో అది తెలుసుకుని వెళ్ళడంతో ఆఫీసు మేనేజర్ క్లర్కుగా అపాయింట్ చేశాడు. నెలకు ఇరవైఐదు రూపాయలు. అయితే ఉద్యోగంలో చేరిన నాలుగు రోజులకే భీమన్న ప్రతిభను మెచ్చుకుని పత్రిక సంపాదకుడైన తాపీ ధర్మారావు ఉపసంపాదకులుగా పదోన్నతి కల్పించాడు. దాంతో భీమన్న జనవాణి పత్రికలో రెగ్యులర్ గా కవితలు, వ్యాసాలు రాసేవాడు. అనంతరం రాజమండ్రిలో కుసుమ ధర్మన్న స్థాపించిన "జయభేరి" పత్రికను నడిపాడు. ఆ తర్వాత మళ్ళీ మద్రాసు "ఆంధ్రప్రభ" కోసం వెళితే గూడవల్లి రామబ్రహ్మం గారి "ప్రజామిత్ర" పత్రిక అక్కున చేర్చుకుంది. గూడవల్లి రామబ్రహ్మం ప్రసిద్ధ సినీ దర్శకులు. ఆ కాలంలో మద్రాసులో భీమన్న సతీసమేతంగా ఉండేవాడు. "ప్రజామిత్ర" లో ఉద్యోగం అయిపోవడంతో కాంగ్రెస్ నాయకుడు బి.ఎస్.మూర్తి ప్రారంభించిన "నవజీవన" పత్రికకు భీమన్నను సంపాదకుడిగా చేశాడు. ప్రారంభ పత్రికను అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఇలా మద్రాసులో భీమన్న జీవితం పత్రికల చుట్టే తిరిగింది. అయితే భీమన్న తండ్రికి ఇవేవీ నచ్చేవి కావు. భీమన్న వయస్సు ఉన్నవారంతా ఉద్యోగం చేస్తుంటే భీమన్న మాత్రం పత్రికలంటూ తిరగడం తన తండ్రికి అస్సలు నచ్చేది కాదు. చివరికి చేసేవాళ్ళు లేక కౌలు వ్యవసాయం కూడా వదిలేశాడు.

ఇక ఐదవది ఉద్యోగ సర్గ. ఇందులో భీమన్న ఉద్యోగ జీవితం వివరించబడింది. 1940 సెప్టెంబర్ నెలలో తొలిసారిగా భీమన్న ముమ్మిడివరం సెకండరీ స్కూల్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. అక్కడ నుంచి రాజోలుకు బదిలీ అయ్యాక పాఠశాలలో తనకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడే ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నాడు. ఇప్పుడిద్దరూ సహచర ఉద్యోగులు కావడం విశేషం. మిగతా సహోపాధ్యాయులందరూ భీమన్నతో ఎంతో స్నేహంగా ఉండేవారు. పాఠశాల సాంస్కృతికోత్సవాలలో భాగంగా భీమన్న రాసిన "మిఠాయి గంప" నాటికను విద్యార్థులు ఎంతో చక్కగా ప్రదర్శించారు. హరిజనులు విద్యావంతులు కావాలనే ఉద్దేశ్యంతో భీమన్న రాసిన

"పాలేరు" నాటకాన్ని మోరి గ్రామంలో తొలిసారిగా ప్రదర్శించారు. మూడుగంటల పాటు నాటకం అద్భుతంగా ప్రదర్శించడంతో మరోసారి ఊరివాళ్ళు కోరికోరి ప్రదర్శింపజేసుకున్నారు. ఆ తర్వాత ఈ నాటకం అనేకచోట్ల అనేకసార్లు ప్రదర్శించబడింది. ఈ నాటకం భీమన్నకు మంచి పేరును తీసుకువచ్చింది.

భీమన్న తాను చదివిన పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా రావడం, తనకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు తన కింద పనిచేయడం భీమన్నకు ఒక రకమైన మధురానుభూతిని కల్గించింది. ఆ తర్వాత ఆంధ్ర యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా కూడా ఎన్నికయ్యాడు భీమన్న. ఒకసారి ఆంధ్రరాష్ట్ర పర్యటనకు వచ్చిన అంబేద్కర్ రామచంద్రపురంలో ఉత్తేజభరిత ఉపన్యాసాన్నిచ్చాడు. భీమన్న అంబేద్కర్ ను చూడడం అదే తొలిసారి. చూడడమే కాదు అదే వేదిక మీద అంబేద్కర్ గురించి రాసిన ఆంగ్ల పద్యాలను చదివాడు. ఆ పద్యాలకు అబ్బురపడిన అంబేద్కర్ భీమన్నను అభినందించి కరచాలనం చేశాడు. ఆ తర్వాత ఆ పద్యాలు కలకత్తా నుంచి వెలువడుతున్న పీపుల్స్ హెరాల్డ్ పత్రికలో ప్రచురితం కావడంతో భీమన్న ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. అనంతరం ఉపాధ్యాయ జీవితం వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం అక్కడా ఉండకుండా మళ్ళీ పత్రికలలో చేరిపోవడం జరిగిపోయాయి.

ఆరవ సర్గ అయిన సంకీర్ణ సర్గలో భీమన్న కుటుంబ విషయాలు పేర్కొనబడ్డాయి. తన తల్లి నాగరత్నమ్మ ఆరోగ్యం విషయంలో భీమన్న చాలా ఇబ్బందులు పడ్డాడు. ఆ తర్వాత భీమన్న తొలిసారిగా ఎన్నికల బరిలో నిలవడం, మహామహులతో పోటీపడడం, కాంగ్రెస్ లో అసమ్మతి వర్గాలు వివిధ పార్టీలు పెట్టి పోటీచేయడంతో భీమన్న ఓడిపోయాడు. ఎన్నికలు ముగియగానే భీమన్న మళ్ళీ మద్రాస్ వెళ్ళి ఆంధ్రప్రభ పత్రికలో చేరాడు. మద్రాసులో ఒకసారి ప్రసిద్ధ విమర్శకులు నిడదవోలు వెంకటరావును కలిసి తన "మధుబాల" కావ్యాన్ని వినిపించాడు. అతడు చాలా మెచ్చుకున్నాడు. ఆ తర్వాత ఈ మధుబాల కావ్యాన్ని అప్పుడే కొత్తగా మంత్రి అయిన దామోదరం సంజీవయ్యకు అంకితమిచ్చాడు. భీమన్న రాసిన "పాలేరు" నాటకం వందకుపైగా ప్రదర్శనలు పూర్తి చేయడంతో గుంటూరు జిల్లా చెరకుపల్లిలో భీమన్నకు పెద్ద ఎత్తున సన్మానం చేశారు. అదీ దామోదరం సంజీవయ్యతో. భీమన్న కాలికి బంగారు గండపెండేరం అలంకరించబడింది. అది తన జీవితంలో మరుపురాని మధురానుభూతిని మిగిల్చిన సన్నివేశం. దామోదరం సంజీవయ్య చలువతోనే కర్నూలులో ప్రభుత్వ అనువాద శాఖాధిపతిగా, పుస్తకాల రిజిస్ట్రారుగా ఉద్యోగం లభించింది.

ఏడవ సర్గ నవనవోదయ సర్గ. భీమన్న జీవితం అనేక మలుపుల పుట్ట. ఎక్కడో పుట్టి, చదివి ఎక్కడెక్కడో ఉద్యోగం చేసుకుంటూ ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్న భీమన్న ఆంధ్రప్రదేశ్ అవతరణతో భాగ్యనగరానికి చేరుకున్నాడు. ఇక్కడ ఎంతోమంది ప్రసిద్ధ కవులు కాళోజీ నారాయణరావు, డాక్టర్ దివాకర్ల వేంకటావధాని, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీశ్రీ, దేవులపల్లి రామానుజరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, దాశరథి, సినారె, కురుగంటి సీతారామయ్య, పోతుకూచి సాంబశివరావు తదితరులు భీమన్నకు పరిచయమయ్యారు. ఆ తర్వాత సాహిత్య అకాడమీలో సభ్యుడిగా, సంయుక్త కార్యదర్శిగా, సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా భీమన్న ఎన్నుకోబడ్డాడు. అంతేకాదు భారతీయ రచయితల సంఘం, అఖిల భారత తెలుగు రచయితల మహాసభ వంటి

సంస్థల్లో కూడా భీమన్న ప్రధానపాత్ర పోషించాడు. భాగ్యనగరంలో ఎంతోమంది సాహితీవేత్తలతో పరిచయం కలగడమే కాదు ఎన్నో సాహిత్య సభల్లో పాల్గొన్నాడు భీమన్న.

ఎనిమిదవ సర్గ నికషోపల సర్గ. భీమన్న అటు సాహిత్యరంగంలోనూ, ఇటు సామాజిక రంగంలోనూ కూడా పలుకుబడి, ప్రాబల్యమూ అధికం కావడంతో బాధ్యతలు కూడా పెరిగాయి. హైదరాబాద్ లో కిరాయికున్న భీమన్న అప్పుచేసి అశోక్ నగర్ లో ఒక ఇల్లును నిర్మించుకున్నాడు. కొత్తగా ఇల్లు కట్టుకున్న భీమన్నకు అదే సమయంలో సంసార ఒడిదుడుకులు కూడా ప్రారంభమయ్యాయి. కారణం వేళాపాళాలు లేకుండా భీమన్న సాహిత్యం చుట్టూ తిరగడం. దీంతో భార్య నాగరత్నమ్మ భీమన్నతో కారాలు మిరియాలు నూరేది. మరోపక్క భీమన్న పలు సాహిత్య సమావేశాల్లో మునిగి తేలుతున్నాడు. తాను ఎన్నడూ ఆశించని, ఊహించని సన్మానాలు, గౌరవాలు, కీర్తి ప్రతిష్టలు వరదలా వెతుక్కుంటూ వచ్చాయి. అయితే భీమన్న ఒకపక్క భార్యతో పోరుసల్పుతున్నా మరోపక్క సాహిత్యంతో సహవాసం చేయడం విశేషం. ఈ సమయంలోనే భీమన్నకు "రాగ వైశాఖిని" చాలా పేరు తీసుకువచ్చింది. ఎంతోమంది కవులు, సాహిత్యవేత్తలు, మంత్రులు మరీ కొని దీనిని చదివారంటే పుస్తకం ఎంత ప్రభావవంతంగా, ప్రతిభావంతంగా రచించాడో తెలుస్తున్నది. మరోవైపు భీమన్న ఉద్యోగం ఎక్స్ టెన్షన్ కోసం పెట్టిన దరఖాస్తు కూడా విఫలం కావడంతో చేసేదేమీ లేక అక్కడ నుంచి బయటపడ్డాడు.

తొమ్మిదవ సర్గ సంస్కృతీ విప్లవ సర్గ. భీమన్న జీవితం అనేక వైరుధ్యాల, వైవిధ్యాల పుట్ట. అతని సాహిత్యం కూడా అంతే. భీమన్న అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించాడు తన రచనల్లో. నేడు ఉన్న నాలుగు వర్ణాల సిద్ధాంతం సహజమైనది కాదంటాడు భీమన్న. ఎవరూ పుట్టుకతో శూద్రుడిగా, వైశ్యుడిగా, క్షత్రియుడిగా, బ్రాహ్మణుడిగా పుట్టడంటాడు శ్రీశ్రీ. ఈ నాలుగు వర్ణాల సిద్ధాంతం సహజమైనది కాదంటాడు భీమన్న. ఈ పుట్టుకులం సిద్ధాంతం ధర్మవిరుద్ధమైందంటాడు. వేదకాలం నుంచి నేటివరకూ ఎందరో మహర్షులు, ప్రవక్తలు ప్రతిపాదించిన మతాలు, ధర్మాలు, నీతులు ఏవి సమగ్ర సత్యదర్శకాలు కావంటాడు భీమన్న. సోషలిజమే సర్వరసాల సమైక్య దీపమంటాడు. ప్రతి మనిషి తనకు నచ్చినట్లు జీవించడమే దీని తత్వమంటాడు భీమన్న.

1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమం గాలి భీమన్నకు కూడా తాకింది. ప్రత్యేక తెలంగాణ ఆందోళన మహోధృతంగా సాగుతున్న సందర్భంలో యువకులు చందా కోసం రిక్షాలో పోతున్న భీమన్నను అడిగారు. భీమన్న ఖరాఖండిగా ఇవ్వనన్నాడు. ఎందరో పెద్దలు సంపాదించిన విశాలాంధ్ర ముక్కలు కావడం తనకు ఇష్టం లేదన్నాడు. దీంతో భీమన్నకు తెలంగాణ ఉద్యమకారులకు ఘర్షణ బాగానే జరిగింది. వదిలెయ్యండిరా అన్న కేకతో ఆ ఘర్షణ అంతటితో ముగిసింది. ఒకసారి బాపురెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో పనిచేస్తున్న కాలంలో భీమన్న ఆ జిల్లా అంతా తిరిగాడు. ప్రత్యేకించి పిల్లలమర్రిని దర్శించాడు. అక్కడ ఎంతోమంది కవులు, రచయితలు పరిచయమయ్యారు.

పదవ సర్గ అయిన రసాద్వైతసర్గలో భీమన్నకు మహాకవి, కళాప్రపూర్ణ వంటి బిరుదులను ప్రసాదించారు. దీంతో భీమన్న గురించి అనేక తెలుగు, ఆంగ్ల పత్రికలు వేనోళ్ళ పొగిడాయి. ఇండియన్

ఎక్స్ ప్రెస్ అయితే తిరుగుబాటు కవి అని ఆకాశానికెత్తింది. ఆ తర్వాత భీమన్నకు అనేక సన్మానాలు, సత్కారాలు జరిగాయి. భీమన్న స్వగ్రామమైన మామిడికుదురులో వైభవోపేతంగా షష్టిపూర్తి జరిగింది. ఆ తర్వాత 1973 లో భీమన్నకు పద్మశ్రీ పురస్కారం లభించింది. భీమన్న జీవితంలో అదొక మరుపురాని ఘట్టం. అంతేకాదు అప్పుడే భీమన్న కేంద్రసాహిత్య అకాడమీ రీజనల్ సలహా సంఘం సభ్యుడిగా ఎన్నిక కావడం విశేషం. ఆ సంవత్సరమంతా భీమన్నకు సన్మానాల సంవత్సరంగా గడిచింది. ఈ రసాద్వైత సర్గ భీమన్నను నిజంగా రసాద్వైతంలో ముంచేసిన సర్గ. తన జీవితంలో సాధించిన ఉత్కృష్ట సాహిత్య సృజనకు అలంకారంగా పద్మశ్రీ వంటి బిరుదు పొందడం.

పదకొండవ సర్గ అయిన విద్యా విలాస సర్గలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆకాశవాణి నిర్వహించే జాతీయ కవి సమ్మేళనంలో తెలుగు భాష నుంచి భీమన్న ఒక్కడే ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత భీమన్న రాసిన "గుడిసెలు కాలిపోతున్నై" కవితాసంపుటికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ సందర్భంలోనే కాశీ విద్యాపీఠం వారు భీమన్నకు గౌరవ డాక్టరేట్ ప్రసాదించడం. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, ప్రసిద్ధ తెలుగు ప్రముఖులు ఏడిద నాగేశ్వరరావు, ఇలపావులూరి పాండురంగారావు వంటి వారితో కలిసి భోజనం చేయడం భీమన్న ఆనందానికి అవధులు లేకుండాపోయింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ మంత్రి మండలి వేంకటకృష్ణారావు ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తే హరిజన సంక్షేమ శాఖ మంత్రి భాట్టం శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో హరిజన సభలు జరపడానికి నిశ్చయించుకున్నారు. ఈ సభలో భీమన్న పాల్గొన్నాడు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ ఆస్థానకవిగా ఉన్న కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పరమపదించడంతో ఆ ఖాళీని భీమన్నతో భర్తీ చేయాలని సంకల్పించారు రాష్ట్ర పెద్దలు. ఈ ఖాళీని భీమన్నతో పూరించాలనుకున్నారు కాంగ్రెస్ పెద్దలు. కానీ కొందరు కాంగ్రెస్ నాయకులు వారించడంతో భీమన్నకు ఆ అవకాశం దక్కకుండాపోయింది. ఆ తర్వాత ఒక సంవత్సరానికి మహాకవి దాశరథి ఆస్థానకవిగా నియమించబడడంతో భీమన్న ఎంతో సంతోషించాడు. దాశరథి ఒక్కడే అన్ని విధాలా అర్హుడని అతన్ని మనసారా ఆశీర్వదించడం భీమన్న పెద్దమనసుకు నిదర్శనం.

పన్నెండవ సర్గ గ్రంథసర్గ. ఇందులో భీమన్న రచనలు పేర్కొనబడ్డాయి. "మధుగీత శ్రీశ్రీ, త్రిపదలు, టుమ్రీలు, మధుబాల, అశోకవనిలో రాముడు, మణిమానసం శ్రీశ్రీ, ప్రకృతిలో మానవ ప్రకృతి" వంటి లఘు కావ్యాలు, "దీపసభ, రాగవైశాఖి" వంటి మహాకావ్యాలు, "అనాది కొసనుంచి అనంత తత్వంలోకి, గుడిసెలు కాలిపోతున్నై, రాఖీలు, శివాలకలు" వంటి వచన కవితాసంపుటాలు, ఏక పద్యోపాఖ్యానం వంటి వ్యాఖ్యాన గ్రంథాలు, "మానవుని మరొక మజిలీ, పైరుపాట శ్రీశ్రీ, బొమ్మ, అకాండ తాండవం, కేదారేశ్వరి" వంటి గేయ కావ్యాలు, "పాలేరు, కూలిరాజు శ్రీశ్రీ, రాగవాశిష్ఠం, బాలయోగి, ఆదికవి వాల్మీకి, అసూయ, ప్రగతి, పడిపోతున్న గోడలు, వేదవ్యాసుడు, చిత్రకళా ప్రదర్శన", వంటి నాటకాలు, "ధర్మం కోసం పోరాటము శ్రీశ్రీ, ఇదిగో ఇదీ భగవద్గీత, జన్మాంతర వైరం, పురాణాలలో హరి – గిరి మనీషులు, ధర్మం కోసం పోరాటం, అంబేద్కరిజం, అంబేత్కర మతం, జానపదుని జాబులు" వంటి వచన రచనలు శ్రీశ్రీ, "పిల్లి శతకము" వంటి శతకాలు భీమన్న సృజించిన

తెలుగు సాహితీరత్నాలు. అయితే భీమన్న స్వీయ రచనలే చేశాడు కానీ అనువాదాలు, అనుసరణల జోలికి పోలేదు. భీమన్న ప్రతి రచన దేనికదే వైవిధ్యం. అన్నీ తనకిష్టమైన రచనలే. తన జీవితంలో తాను అనుభవించిన, ఆస్వాదించిన అనుభూతులను అక్షరమయం చేశాడు భీమన్న.

చివరిదైన పదమూడవ సర్గ ప్రశంసా సర్గ. ఇందులో భీమన్న గురించి సమకాలీనులైన తన కవిమిత్రులు, పండితులు వివిధ సందర్భాలలో చెప్పిన ప్రశంసాత్మక పద్యాలు, సన్మానపత్రాల ప్రశంసలు పేర్కొనబడ్డాయి. ప్రసిద్ధ కవుల నుంచి తన సమకాలీన కవుల దాకా ప్రశంసించిన పద్యాలున్నాయిందులో. మహాకవి విశ్వనాథ సత్యనారాయణ, జాషువా, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం శ్రీశ్రీ, ఆచార్య నిడదవోలు వేంకటరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, స్ఫూర్తిశ్రీ, జ్ఞానానందకవి, దివాకర్ల వేంకటావధాని, బూర్గుల రామకృష్ణారావు, సినారె, దాశరథి, జె.బాపురెడ్డి వంటి ఉద్ధండ పండితులు మనఃపూర్వకంగా భీమన్నను అక్షరాలతో అభిషేకించారు.

మొత్తం పదమూడు సర్గలలో భీమన్న జీవనయానాన్ని, సమకాలీన సాదృశ్యాలను, సంఘటనలను అక్షరబద్ధం చేసిన హైమవతీ భీమన్న మనకు కళ్ళకు కట్టినట్టు రచించడం విశేషం. ఇందులో భీమన్న సాహిత్యానికి సంబంధించిన విషయాలే ఎక్కువగా ఉన్నా అక్కడక్కడా ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులు కూడా ఆవిష్కరించబడ్డాయి. జీవిత చరిత్ర అంటే అన్ని కోణాలను స్పృశించవలసిందే. కానీ సమాజానికి ఉపయోగపడే వివరాలను మాత్రమే రచయిత్రి ఇక్కడ ఆవిష్కరించింది. భీమన్నను ఆరాధించే కవయిత్రిగా, తను మెచ్చిన భర్తగా హైమవతీ భీమన్న చరిత్రను తను విన్నంతవరకు, కన్నంతవరకు అక్షరబద్ధం చేసింది. నేటి వర్తమాన కవులందరూ తప్పకుండా చదువవలసిన గ్రంథమిది. ఒక పద్మశ్రీ, ఒక పద్మభూషణ్, ఒక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గురించి ఎంత తెలుసుకుంటే అంత భీమన్న అక్షరామృతం మనకు లభిస్తుంది.

ఆధార గ్రంథం :

1. పాలేరు నుంచి పద్మశ్రీ దాకా – శ్రీమతి హైమవతీ భీమన్న

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న – గుడిసెలు కాలిపోతున్నాయి

– డా. మంగళగిరి శ్రీనివాసులు,
సహాయ ఆచార్యులు,
సెల్ : 9491388662

ఆయన ఓ సామాన్య వ్యక్తి, విద్యాభ్యాసం చేసి విలువలను పెంచుకొని, అక్షర జ్ఞానంతో కవిత్వ రచన చేసి జ్ఞానం ఒకరి సొత్తు కాదు అనే నానుడిని సమాజానికి తెలియపరిచాడు. ప్రతికూల పరిస్థితుల నుంచి మహాపండితుడిగా పేరు తెచ్చుకుని ఉత్తమమైన కావ్యాలు రచించి సాహిత్య లోకంలో సాటిలేని ప్రతిభా మూర్తిగా బోయి భీమన్న నిలిచారు. బోయి భీమన్న గారు రచించిన రచనలలో గుడిసెలు కాలిపోతున్నాయి ఒక ఉత్తమోత్తమ రచన. గుడిసెలు కాలిపోతున్నాయి పుస్తక ముఖపత్ర చిత్రం చూడంగానే పెద్దనైన అక్షరాలతో శీర్షిక ప్రకటన గుడిసెలు కాలిపోతున్నాయి అని ఉంటుంది. గుడిసెలు అంటుకొని కాలిపోతున్న చిత్రము మనకు కనిపిస్తుంది. దీని ప్రథమ ముద్రణ 1973, ద్వితీయ ముద్రణ 1977లో ముద్రించారు, ఇప్పటికీ కూడ ఎన్నో పునర్ముద్రణలు పొందుతున్నది. దీనిని మొదట ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్ హైదరాబాదు వారు ముద్రించారు. ప్రారంభ పుస్తక ధర 9 రూపాయలుగా కేటాయించబడింది. ప్రతులకు సుకేలా నికేతన్, ఐసి 85, ఎర్రమంజిల్ కాలనీ హైదరాబాద్ చిరునామాలో లభించేది. ఇప్పుడు అన్ని పుస్తక విక్రయశాలలో లభ్యమవుతున్నది.

పుస్తక ఆరంభ పేజీల్లో గుడిసెలు కాలిపోతున్నాయి కావ్యాన్ని గూర్చి తెలిపిన వ్యాసాలు ఉన్నాయి. అవి ఈ క్రింది శీర్షికలతో అందులోని సారాన్ని తెలుపుతున్నాయి. దండోరా, అరణ్య రోదనయేనా, నిర్మాణం లేని నిర్మూలనం, నిరుద్యోగులు బిచ్చగాళ్లు, మతం ఎవరికి, కులపిశాచం, మూడు పీడలు, నా గ్రంథము నేను!, మతానికో దేవుడా, నా పరిసరాలు నేనూ, దేవుడికే నాకున్న పాటి హృదయం వుంటే, నేటి సాహిత్య విమర్శలు, మోసమా? మూర్ఖత్వమా?, గుడిసెలు అంటే జ్ఞాపకం వచ్చింది, యువకులు భావ విప్లవం, జరగవలసిందదేమిటి, మానవుడు బ్రతకడం ఎందుకు, అంకితం చరిత్ర, గుడిసెలే గుడిగంటలు, వెంకటస్వామి గారి హేతువాదం, వేదమా! అరణ్యమా!, అనే శీర్షికలతో

వారి జీవిత సంఘటనల, అంతరంగాల్ని కావ్యవస్తువులుగా తీసుకుని సాహిత్యం సద్విమర్శ రూపంలో రచించారు.

గుడిసెలు కాలిపోతున్నాయి రచనకు 1975 సంవత్సరంలో జాతీయ బహుమానం, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. అవార్డ్ అందుకున్న సమయంలో కవి గారు "ఎందరికో వందనాలు" పేరిట పలికిన మాటలు, నేనింతవరకు ఎంతో కవితా సృష్టి చేసి ఉన్నాను. ఈ గుడిసెలకే బహుమతి రావడం చాలా గొప్ప విషయం అని ప్రకటించుకున్నాడు. గుడిసెలలో పుట్టి గుడిసెల మధ్య పెరిగిన నాకు గుడిసెల కవితకే జాతీయ బహుమానం రావడం చిత్రం. ఇందులో సరస్వతీదేవిని ఉద్దేశించిన సామాజిక సాంస్కృతిక విప్లవ రహస్యం ఏదో ఇమిడి ఉన్నదనుకోవాలి, అవును, సరస్వతీదేవికి సమస్తమైన ప్రజలు సరిసమానులైన బిడ్డలే కదా! ఆ బహుమానాన్ని 1976 ఫిబ్రవరి 21వ తేదీన ఢిల్లీలో ఏర్పాటు చేసిన కేంద్ర సాహితీ సదస్సులో సకుటుంబంగా వెళ్లి అందుకున్నారు. అన్ని మతాలవారు మతపిచ్చి లేకుండా ఉంటేనే ప్రగతి ఉంటుందనే సత్యాన్ని తెలిపారు.

గుడిసెలైనా మేల్కొని ఈ కల్మషాన్ని కాల్చిపారేస్తాయని కవి భీమన్న ఆశపడ్డాడు. ఈ కావ్యాన్ని పేదల పాలిటి పెన్నిధి, ప్రజలే పరమాత్మగా భావించి ప్రజలసేవ కోసం తపించిన శ్రీ జి.వెంకటస్వామి గారికి అంకితం ఇచ్చారు. గుడిసెలు కాలిపోతున్నాయి పుస్తకంలో కవితల వరుస క్రమం ఈ క్రింది విధంగా సాగుతుంది. మొదటి కవిత పుస్తకానికి శీర్షిక ప్రకటన చేసినది, పుస్తకానికి గుండెలాంటి కవిత గుడిసెలు కాలిపోతున్నాయి 2. గుద్ది పారేస్తాం 3. కత్తి రాజ్యపు దేవుడు గారు 4. ఎక్కడికి పోతున్నారు 5.నా వారసత్వపు హక్కులు 6. మతం ఒక పిచ్చి 7. నమః స్వామికం 8. బానిసల జాబితా 9. కులమతాల ఉమ్మడి కాష్టం 10. భగవంతుడిక కొట్టిన పిండి 11. మనిషే మార్గదర్శకుడు 12. చచ్చినవాణ్ణి సాయమడిగితే 13. వద్దు రాబందులు 14. ఇల్లు చేరుకోవాలి 15. ఒక్కొడిక్కొక్క రోగం 16. నినాదాలు విప్లవం తెస్తాయా 17. యువకులు ఉన్నారు జాగ్రత్త 18. మేకతోలు వాతపూలు 19. అమ్మో దున్నలు 20. ఇదిగో మోక్షమార్గం 21. చీమల పుట్టలు 22. మానవుడు బాగుపడడం 23. పశువే నయం 24. నాకు రావలసిన బాకీ 25. ప్రపంచ పోటీలు 26. చీకట్లో అరసున్న 27. మానవుడు ఎక్కడున్నా 28. ముగ్గురు భార్యలు 29. గద్దలు ఉండేలు బద్దలు 30. కవిత వల్ల ప్రయోజనం 31. నాకు పేదరికం లేదు 32. అందరూ నేను 33. పాత్రతో పనిలేదు 34. ఆనంద రాయబారులు 35. విత్తనాల మడి 36. వాకిట్లో వసంత లక్ష్మి 37. ఒక ఓటు పోయింది 38. రోడ్డు దురబిడ్డ 39. దుక్కితెద్దువు కాదు 40. నిరంకుశ ప్రొడ్యూసర్ 41. వర్షాల కమిటీ 42. రైల్లో సంత్రాలు 43. విశ్వశాంతి 44. పార్థికేల్ల పెంపు 45. గోలగోల 46. రేసు కోర్సు 47. పాపం ప్రజలు 48. హోం వర్క్ 49. మారనివాడు 50. మేం ఆధుని కులం 51. నర విషయం 52. సృష్టికర్తనే మార్చాలి 53. వాల్మీకి వనిత అయివుంటే 54. ప్రసాద్వైతం 55. మళ్లీ ఒక ఉగాది 56. నా పురోగమనం 57. టుమ్రీలు, టుమ్రీలు నాలుగు పాదాలలో ఉండే మినీ కవిత రూపం. ఇందులో కవి చెప్పదలచిన భావం అంతా ఇమిడింపచేసి ఒక సూక్ష్మ సందేహాన్ని అందిస్తాడు. పుస్తక అంతిమ భాగంలో 69 టుమ్రీలతో ఈ కవితలను సమకూర్చాడు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత కవిత్వ ఆవిర్భావం మరియు భీమన్న స్థానం:

బోయి భీమన్న ఆధునిక తెలుగు కవులలో అగగ్రణ్యులు, దళిత సాహిత్య విప్లవంలో ఒక కీలకమైన స్వరాన్ని వినిపించిన తాత్విక కవిగా ఆయన స్థానం సుస్థిరం. తెలుగు దళిత సాహిత్యం కేవలం అణగారిన వర్గాల యొక్క కష్టాలను, నిస్సత్తువను మాత్రమే కాకుండా, అది ఒక "తిరుగుబాటు" సాహిత్యంగా, మానవ విముక్తిని మరియు మానవత్వాన్ని ఉదాత్తం చేస్తూ, వంశపారంపర్య, జాతి మరియు కుల ఆధిపత్యాన్ని సవాలు చేసే'ప్రొటెస్ట్ సౌందర్యాన్ని' (Aesthetics of Protest) కలిగి ఉంది. ఈ నేపథ్యాన్ని బలోపేతం చేస్తూ, భీమన్న 1937–38లోనే తన కవితా రంగప్రవేశం చేశారు. "కాలము మారిపోయే, కల కాలము దాస్యము నిల్వబోదు, ఈ / మాలలు రాజులౌదురు సుమా..." అనే విశ్వాస ప్రకటనతో దళిత అస్తిత్వ చేతనను ఆయన తమ సమస్తసాహిత్యంలోకీ పరివర్తితం చేశారు. భీమన్న కవిత్వం, పద్యకావ్యాలు, గేయకావ్యాలు, నాటకాలు–ఏ పక్రియలో రచన చేసినా దళిత అభ్యున్నతిని కాంక్షించారు.

ఆయన అణగారిన వర్గాల కష్టాలను, భావోద్వేగాలను తమ రచనల్లో బలంగా వినిపించారు. తెలుగు సాహిత్యంలో అనేక ఉద్యమాలు తలెత్తినా, కవిత్వం ఎన్ని వైవిధ్యాలను వెల్లడించినా, భీమన్న వాటిలో సిద్ధహస్తులుగా నిలిచారు.

బోయి భీమన్న – కవి, తాత్వికుడు, అభ్యుదయవాది: సాహితీ నేపథ్యం:

బోయి భీమన్న కేవలం కవి మాత్రమే కాదు, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన తూర్పు గోదావరిజిల్లాలోని మామిడికుదురులో 1911 సెప్టెంబర్ 19న జన్మించారు. తన వృత్తి జీవితాన్ని ఉపాధ్యాయుడిగా ప్రారంభించి, తరువాత 'జనవాణి', 'జయభేరి', 'నవ జీవన్', 'ఆంధ్రప్రభ' వంటిపత్రికల్లో పాత్రికేయుడిగా పనిచేశారు. అస్పృశ్యత ఉన్న రోజుల్లో కూడా ఆయన దళిత హక్కులను నిర్భయంగా సమర్థించిన మానవహక్కుల న్యాయవాదిగా కీర్తి గడించారు. ఆయన 1978 నుండి1984 వరకు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా కూడా పనిచేయడం ఆయనకు సమాజంలో లభించిన గౌరవాన్ని సూచిస్తుంది. భీమన్న సాహిత్యానికి తాత్విక పునాది ఉంది. ఆయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యొక్క 'కులనిర్మూలన' (Annihilation of Caste) గ్రంథాన్ని తెలుగులోకి అనువదించడం ద్వారా అంబేద్కర్ సిద్ధాంతాన్ని బలంగా ప్రచారం చేశారు, తద్వారా దళిత సమాజంలోని సామాజిక అంతరాలు మరియు అణచివేతను తమ రచనల్లో ప్రధాన ఇతివృత్తాలుగా మార్చారు. ఆయనకు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రగాఢమైన విశ్వాసం ఉండేది. ఆయన నాటకం 'కూలిరాజు' దీనికి ప్రతీక. హింసను, పగను, దౌర్జన్యాన్ని పారద్రోలి, సంఘటిత శక్తిని బలోపేతంచేస్తే బడుగువర్గాల చేతిలోకి ప్రభుత్వం వస్తుందని ఆయన బలంగా విశ్వసించారు. భీమన్న యొక్క సాహిత్య వ్యక్తిత్వం కేవలం నిరసన స్వరానికే పరిమితం కాలేదు. ఆయన కవిత్వాన్ని 'రస అద్వైతం' (Cosmic union of Beauty and Love) గా వర్ణించారు. ఈ దృష్టికోణం, ఆయన నిరసనను కేవలం పగతో కూడిన ఆగ్రహంగా కాకుండా, ఒక నూతన సామాజిక ఐక్యత (అద్వైతం) వైపు చేసే ఉన్నతమైన, తాత్విక ప్రయాణంగా చిత్రీకరించడానికి ఉపయోగపడింది. ఇది దళిత విప్లవాన్ని ఒక ఉన్నతమైన వేదాంత నేపథ్యం నుంచి సమన్వయం చేసే ప్రయత్నం. అంతేకాకుండా, ఆయన వేదాలన్నా, అవి ప్రవచిస్తున్న జ్ఞానమన్నా

గౌరవం చూపారు, అయితే పురాణాలను మరియు వేద ధర్మాలను స్వార్థపరులు తమ ప్రయోజనాల కోసం దుర్మార్గంగా వ్యాఖ్యానించడం వల్ల కులవివక్ష ఏర్పడిందని భావించారు. ఈ వైఖరి, సాంప్రదాయ దళిత కవుల మాదిరిగా పౌరాణిక గ్రంథాలను పూర్తిగా తిరస్కరించకుండా, వాటిని విమర్శనాత్మక దృక్పథంతో సమీక్షించి, 'ధార్మిక పునర్నిర్మాణానికి' ప్రయత్నించినట్టు స్పష్టమవుతుంది.

కావ్య నిర్మాణం, ప్రచురణ మరియు పురస్కార వివరాలు:

బోయి భీమన్న రచించిన 'గుడిసెలు కాలిపోతున్నాయి' (ఆంగ్లంలో: The Huts are on Fire) ఒక గొప్ప గద్య కావ్యం (Prose Poem). ఈ రచన ప్రచురణ సంవత్సరాలపై రెండు భిన్న వివరాలు అందుబాటులో ఉన్నప్పటికీ– ఒకటి 1959 మరియు మరొకటి 1973 – ఈ కావ్యం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ కావ్యం 1975లో భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ గుర్తింపు దళిత చైతన్య ప్రధాన స్రవంతి సాహిత్య గౌరవాన్ని పొందడంలో కీలక పాత్రపోషించింది. 1959లో ప్రచురణ అయిన రచన 1970లలో తిరిగి ప్రచురణ ప్రాధాన్యత సంతరించుకుని 1975లో అవార్డు పొందడంలో ఒక సామాజిక ఔచిత్యం దాగి ఉంది. 1970లలో దళిత ఉద్యమాలు ఊపందుకుని, సామాజిక న్యాయంపై చర్చ పెరిగిన సమయంలో, ఈ విప్లవాత్మక శీర్షిక కలిగిన రచనకు జాతీయ గుర్తింపు లభించడం, దళిత నిరసనకు పెరుగుతున్న సామాజిక మరియు రాజకీయ స్పందనను ప్రతిబింబిస్తుంది.

భీమన్న కవిత్వంలో 'దళిత చేతన' ఆవిష్కరణ, దళిత అస్తిత్వ చేతన తమ సాహిత్యంలో ప్రధానాంశాలుగా తీసుకున్నారు. కుల భేదాలు సృష్టించి అహంకార పూరితులైన పూజారులను, మతాధికారులను ఆయన నిర్మొహమాటంగా ప్రశ్నించారు. దళితుల అమాయకత్వాన్ని, నిస్సత్తువను తమ రచనల్లో ప్రతిబింబిస్తూనే, వారి నిద్రాణమైన భావాలను, అణచివేతపై ఆగ్రహాన్ని చైతన్యవంతం చేయడంలో ఆయన ఈ కావ్యం ద్వారా కృషిచేశారు. 'రస అద్వైతం' మరియు దళిత తాత్త్వికత మధ్య సమన్వయం 'గుడిసెలు కాలిపోతున్నాయి' కావ్యం, భీమన్న యొక్క 'రస అద్వైతం' తాత్త్వికతను దళిత విప్లవంతో ఎలా సమన్వయం చేసిందో అర్థం చేసుకోవడం ముఖ్యం. రస అద్వైతం ప్రేమ, అందం మరియు విశ్వఐక్యతకు సంబంధించిన భావన. సాంపద్రాయ దళిత సాహిత్యం అణచివేత దారులపై పగ లేదా ప్రతీకారాన్ని బలంగా వ్యక్తం చేస్తే, భీమన్న మాత్రం దళిత అభ్యున్నతిని కేవలం రాజకీయ విజయం లేదా విధ్వంసం కాకుండా, మానవత్వంలోని అంతర్గత సౌందర్యాన్ని పునరుద్ధరించే ఒక ఉదాత్తమైన ప్రక్రియగా భావించారు. గుడిసెలు కాలిపోవడం అనేది తాత్కాలికంగా విధ్వంసంగా కనిపించినా, అంతిమంగా అది నూతన సౌందర్యం–జ్ఞానోదయం, ఆత్మగౌరవం మరియు భవనాలు ఆవిర్భవించడానికి చేసే ఒక పవిత్రమైన ప్రక్షాళన మార్గంగా భీమన్న భావించారు. ఈ విధంగా, ఆయన తమ తాత్త్వికతను నిరసనలో సమన్వయం చేస్తూ, దళిత విముక్తిని మానవ విముక్తి యొక్క ఉన్నత స్థానంలో నిలబెట్టారు.

ఈ కావ్యం అణగారిన వర్గాల కష్టాలను, దుఃఖాన్ని చిత్రించడంలోనేకాక, ఆ దుఃఖం నుంచి విముక్తివైపు పయనించాల్సిన మార్గాన్ని సూచించడంలో గొప్ప శక్తిని కలిగి ఉంది. దళితులలో ఉన్న

అమాయకత్వాన్ని, నిస్సత్తువను ఈ కావ్యం ప్రతిబింబిస్తుంది. భీమన్న తమ కవిత్వం ద్వారా, దళితులు తమ అణచివేతకు మరియు బాధలకు గల కారణాలను ఇతరుల చర్యల ద్వారానే కాకుండా, తమలో ఉన్న బలహీనతలను కూడా ప్రశ్నించుకోవాలని బలంగా ఆకాంక్షించారు. దళిత అభ్యున్నతి, సామాజిక న్యాయం మరియు పరివర్తన భీమన్న దళిత వర్గాలలో నిద్రాణమైన భావాలను చైతన్యవంతం చేసి, అణచివేతపై ఆగ్రహాన్ని ప్రేరేపించడానికి ఈ కావ్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించారు. సామాజిక న్యాయం కేవలం అభ్యర్థన ద్వారా కాకుండా, రాజకీయ అధికారాన్ని సాధించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారు.

'గుడిసెలు కాలిపోతున్నాయి' కావ్యంలోని అత్యంత శక్తివంతమైన రూపకం, గుడిసెలు కాలిపోవడం. ఇది కేవలం భౌతికమైన విధ్వంసాన్ని సూచించదు. ఈ అగ్ని, దళితుల గుండెల్లో పేరుకుపోయిన నిరక్షరాస్యత, అమాయకత్వం, నిష్క్రియత్వం (inertia), చీకటి (darkness), బలహీనత (frailty) మరియు మురికి (filth) వంటి అంతర్గత లక్షణాలను దహించివేయడాన్ని సూచిస్తుంది. ఈ కావ్యం యొక్క ప్రధాన శక్తి, అణచివేతదారుల ద్వారా గుడిసెలు కాలిపోవడం కాదు, దళిత చైతన్యం యొక్క అగ్నిజ్వాల ద్వారా ఆత్మ పరిశుద్ధి జరుగుతుందని చెప్పడం. దీని ద్వారా, భీమన్న దళిత విముక్తి ఉద్యమంలో స్వీయ–చర్య (Self-Agency) పాత్రను హైలైట్ చేశారు. అంటే, దళితులు తమలో ఉన్న బలహీనతలను, అజ్ఞానాన్ని తామే దహించుకోవాలని ఆకాంక్షించడం. ఈ ప్రక్రియ, విమోచన శక్తిని తెలియజేస్తూ, సామాజిక న్యాయ పోరాటంలో వ్యక్తిగత బాధ్యతను సూచిస్తుంది. ఇది డా. అంబేద్కర్ అందించిన 'చదువు, సంఘటితం కండి, పోరాడండి' అనే సందేశాన్ని కవిత్వ రూపంలో బలంగా ముందుకు తీసుకువచ్చింది. కాలిపోతున్న గుడిసెల స్థానంలో భవనాలు (Mansions) వెలుస్తాయని భీమన్న ఆశించారు. ఈ భవనాలు కేవలం మెరుగైన నివాసాలను సూచించవు. ఇవి జ్ఞానోదయం, ఆర్థిక బలం, సామాజిక హోదా, రాజకీయ అధికారం మరియు దళిత అస్తిత్వం గౌరవ ప్రదంగా నిలబడే ఒక కొత్త, సమానత్వ వ్యవస్థను సూచిస్తాయి.

ముగింపు:

భీమన్న ఆశించిన నవ సమాజం 'గుడిసెలు కాలిపోతున్నాయి' కావ్యం దళిత సాహిత్యంలో అత్యంత శక్తివంతమైన మరియు తాత్వికంగా లోతైన రచనలలో ఒకటి. ఈ కావ్యం కేవలం దళితుల యొక్క దుఃఖాన్ని వ్యక్తపరచడానికే పరిమితం కాకుండా, ఆ దుఃఖం నుంచి విముక్తిని ఎలా సాధించాలో నిర్దేశించింది. ఇది దళిత సమస్యలను ఒక నిర్దిష్ట ప్రాంతీయ సమస్యగా కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అణచివేతకు గురైన వర్గాల (Fourth World Nations) అంతర్గత విముక్తి పోరాటంగా మార్చింది. బోయి భీమన్న ఆశించిన నవ సమాజం కేవలం భౌతిక సంపదతో కూడినది కాదు. భవనాలు వెలసిల్లాలనే ఆకాంక్ష, నిష్క్రియంగా ఉండటం కంటే, జ్ఞానాన్ని సంపాదించి, చైతన్యవంతమై, ఆత్మగౌరవాన్ని పెంపొందించుకోవాలనే అంబేద్కర్ యొక్క తాత్విక మూలాలను కవిత్వంలో ప్రతిబింబిస్తుంది. గుడిసెలు కాలిపోవడం అనేది అంతిమంగా నవ సమాజ నిర్మాణం మరియు మానవ విముక్తికి దారితీసే ఒక అనివార్యమైన, పవిత్రమైన పరిణామంగా భీమన్న భావించారు. ఈ కావ్యం

నిరసనను, ఆత్మవిమర్శను మరియు నూతన చైతన్యంపై అపారమైన ఆశను మేళవించినందుకు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

ఉపయుక్త గ్రంథాలు:

1. గుడిసెలు కాలిపోతున్నాయి – బోయి భీమన్న
2. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి
3. తెలుగు సాహిత్య కోశము – తెలుగు అకాడమి ముద్రణ
4. పరిణతవాణి (రెండవ సంపుటిలోని వ్యాసం) – ఆంధ్ర సారస్వత పరిషత్తు ముద్రణ

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

భీమన్న దృష్టిలో శ్రీశ్రీ

– నాయుడు గారి జయన్న,
తెలుగు ఉపాధ్యాయుడు,
సెల్ : 9885217819

బోయి భీమన్న సహజ కవి, ప్రజాకవి. ఆధ్యాత్మిక మానవుడు, యదార్థవాది. ఒకనాటి తూర్పు గోదావరి జిల్లా, నేటి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురులో, నిరుపేద హరిజన కుటుంబంలో 1911లో జన్మించాడు. తాను అనుభవించిన పేదరికం, అంటరానితనం అతనిని ఆవేదన చెందించాయి. మానవతావాద కవిగా మార్చేశాయి.

ఇంచుమించు అదే కాలంలో, ఒక సంవత్సరం ముందు 1910లో విశాఖపట్నంలో శ్రీశ్రీ జన్మించాడు. ఆ విధంగా భీమన్న, శ్రీశ్రీ ఇద్దరూ సమకాలికులు. ఇద్దరు కవులే, మహాకవులే. కవితాప్రస్థానంలో తారాస్థాయికి చేరుకున్న వారే. కాకపోతే దారులు వేరు. భీమన్న సాంప్రదాయ జాతీయవాదిగా ముద్రపడ్డారు. కాంగ్రెస్ నాయకులుగా చెలామణి అయ్యారు. శ్రీశ్రీ అభ్యుదయ కవిగా, కమ్యూనిస్టులకు అత్యంత ప్రీతిపాత్రమైనవాడుగా ఎదిగారు. భిన్నమార్గాలలో ప్రయాణం చేసిన ఇద్దరూ మహాకవులలో ఒకరైన భీమన్న మరో మహాకవి అయిన శ్రీశ్రీని ఏ దృష్టితో చూశాడన్నది చెప్పడమే ఈ వ్యాసం అంతిమ లక్ష్యం.

భీమన్న దృష్టిలో శ్రీశ్రీ ఎలాంటివాడని అర్థం చేసుకోవడానికి, భీమన్నకు కమ్యూనిజం పట్ల ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయి? శ్రీశ్రీ–భీమన్నలు సమాంతరంగా సాగించిన జీవన విధానం ఎలాంటిది? శ్రీశ్రీ కవిత్వం పట్ల భీమన్న దృక్పథం ఏమిటి? అన్న విషయాలు తెలపటం ద్వారా భీమన్న దృష్టిలో శ్రీశ్రీని సంపూర్ణంగా ఆవిష్కరించవచ్చని నేను భావిస్తున్నాను.

కమ్యూనిజంపై భీమన్న అభిప్రాయం :

భీమన్నకు కమ్యూనిజం మీద నమ్మకం లేదు. అదంతా వట్టి మిథ్యావాదమని కొట్టిపారేస్తాడు. రష్యాలో, చైనాలో కమ్యూనిస్టు పోరాటం విజయవంతమైనట్టు కనిపించిందంతా నిజం కాదు. అది యుక్తులతో, కుయుక్తులతో, అనుబంధాలతో, ఆశ్రయింపులతో, సైనిక సహాయంతో; నిజమైన

కార్మికులకు, రైతులకు, కూలీలకు, పేదలకు ఏ సంబంధం లేకుండానే ఆయా కుహనా నాయకులు వ్యక్తిగతంగా సాధించిన విజయాలని భీమన్న భావించాడు. కమ్యూనిజం ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల తప్ప ఎక్కడా విజయవంతం కాలేదని వక్కాణించాడు. రష్యా విప్లవాన్ని రైతు కూలీ విప్లవం కాదన్న సత్యాన్ని భారత కమ్యూనిస్టులు, ముఖ్యంగా ఆంధ్ర కమ్యూనిస్టులు మరుగున పరిచారు. వారు అంటరాని పేటలను లేబర్ పేటలుగా మార్చారు. ఎస్సీ యువకులను నాయకత్వ పరిధిలోకి రానివ్వలేదు. అంటరానితనాన్ని పాటించడం, పట్టించుకోకపోవడం, పేదరిక నిర్మూలనకు కృషి చేయకపోవడం, ప్రశ్నించే వారికి తమ రాజ్యం వచ్చేవరకు వేచి చూడమని చెప్పడం కమ్యూనిస్టులు చేసిన ద్రోహాలు.

కమ్యూనిస్టు నాయకులు పేదలను, దళితులను ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి, పోలీసులు తరుముకొచ్చినప్పుడు తాము కాంగ్రెస్ అగ్ర నాయకుల ఇళ్లల్లో చేరి తప్పించుకుని, పేదలను, దళితులను మాత్రం పోలీసులకు బలి చేసేవారంటారు భీమన్న.

కమ్యూనిస్టులు అంటే నిస్వార్థపరులు, నిరాడంబరులు, పదవీ నిర్వ్యామోహకులు అనేవి అబద్దాలు. వాళ్లూ మామూలు మనుషులే. వాళ్లకు మమకారాలు ఉంటాయి. వాళ్లల్లో అధిక భాగం బూర్జువాలు, భోగప్రియులు, అధికార పదవీలాలసులు. అవకాశాలను వెతుక్కుంటారు. అధికారం కోసం పాకులాడుతారు. పాకులాడినవి దక్కకపోతే పదవి కోసం కొత్త గుంపులు కూడా సృష్టిస్తారు. వీటికి రుజువులే అరసం, విరసం, దిగంబర వాదం, ఉగ్రవాదం, నక్సలిజం. అహింస చేతకాకపోవడం వలననే హింసావాదాన్ని సృష్టించారని భీమన్న భావించాడు.

భీమన్న - శ్రీశ్రీల సమాంతర జీవనం :

శ్రీశ్రీ 1910లో జన్మించాడు. భీమన్న 1911లో జన్మించాడు. ఇద్దరూ జాతీయోద్యమానికి ఊతమిచ్చినవారే. భీమన్న జాతీయోద్యమాన్ని నడిపిన కాంగ్రేసులో కొనసాగాడు. పాలేరు నుండి పద్మభూషణ్ దాకా ఎదిగాడు. అదే కాంగ్రేసులో, ఆ కాంగ్రేసుతో పొసగని, తీవ్రవాద సోషలిస్టులు కమ్యూనిస్టులుగా మారిపోతే, వారితో శ్రీశ్రీ జతకట్టాడు. యువతలో కమ్యూనిజం వేళ్ళూనుకోవడానికి శ్రీశ్రీ గేయాలు పాదులు తీస్తే, మహాకవి పీఠం మీద శ్రీశ్రీని కమ్యూనిజం కూర్చోబెట్టింది.

శ్రీశ్రీ గురించి భీమన్నకు బాగా తెలుసు. భీమన్న గురించి కూడా శ్రీశ్రీకి కొంతైనా తెలిసి ఉండాలి. కానీ వారిద్దరి మధ్య వ్యక్తిగతంగా ఏ పరిచయమూ లేదు. సమావేశాల్లో చూసుకోవటమే తప్పా వారిద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదు.

అప్పుడెప్పుడో ఒకసారి ఒక కార్యక్రమానికి హైదరాబాదు రమ్మని భీమన్న మద్రాస్ లో ఉన్న శ్రీశ్రీని ఆహ్వానించాడు. మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు రావడానికి తన దగ్గర డబ్బులు లేవని, అంత ఖర్చు కూడా మీరు భరించలేరని, అందుకే రాలేకపోతున్నాను అంటూ శ్రీశ్రీ భీమన్నకు ఉత్తరం రాశాడు.

1938లో బీఈడీ కాలేజీ వదిలి పెట్టి మద్రాస్ ఆంధ్రప్రభలో సబ్-ఎడిటర్ గా చేరమని రాజమండ్రి కాంగ్రెస్ నాయకులు క్రొవ్విడి లింగరాజు భీమన్నకు సూచించాడు. కానీ భీమన్న అందులో

చేరడానికి కొంత ఆలస్యం చేశాడు. ఈ లోపు అక్కడ సబ్–ఎడిటర్ గా శ్రీశ్రీ చేరిపోయారు. ఆయన 1938 నుండి 1942 దాకా నాలుగేళ్ల పాటు అందులో కొనసాగాడు. ఇది కాస్తా భీమన్నకు అసహనాన్ని, ఆగ్రహాన్ని తెప్పించి ఉంటుంది.

వీరి జీవన గమనాన్ని పరిశీలించి చూస్తే, ఈ ఇద్దరు మహాకవుల మధ్య అంత సఖ్యత లేదేమోనన్పిస్తుంది. దానికి కారణాలు నమ్మిన సిద్ధాంతాలు వేరవడం, నడిచే దారులు వేరవడం ప్రధానమైతే, తన ఆహ్వానాన్ని శ్రీశ్రీ అమోదించకపోవడం, తనకు రావలసిన ఆంధ్రప్రభ సబ్–ఎడిటర్ ఉద్యోగంలో శ్రీశ్రీ చేరిపోవడం వీరిద్దరి మధ్య దూరం మరింత పెరగటానికి కారణాలై ఉండవచ్చు. ఒకే కవన మార్గంలో నడిచే సమకాలికుల మధ్య స్పర్ధ సహజమే కదా!

"ఏ గతి రచియింతురేని సమకాలము వారలు మెచ్చరే కదా" అన్నాడు చేమకూర వేంకట కవి.

"నిజానికి మానవ సమాజంలో ఎవరికి వాడే పరమాత్మ. ఎవరి గొప్ప వారిదే. ప్రతివాడు తనను తాను గొప్పవాడు అనుకుంటాడు. మరొకడు ఎంత గొప్ప విషయం చెప్పినా పట్టించుకోడు. సామాన్య విషయంగా తీసిపారేస్తాడు" అచ్చంగా ఇవి భీమన్న మాటలే. వీళ్లిద్దరూ ఒకరికి ఒకరు నచ్చకపోవడానికి ఇదీ ఒక కారణమే. ఇలాంటి పరిస్థితుల్లో శ్రీశ్రీ కవిత్వాన్ని, శ్రీశ్రీ వ్యక్తిత్వాన్ని భీమన్న ఎలా తూచి ఉంటాడన్నది చూచాయగా మనకు ద్యోతకమవుతుంది.

భీమన్న దృష్టిలో శ్రీశ్రీ కవిత్వం

మొదట్లో అందరి లాగే భీమన్న కూడా శ్రీశ్రీ గేయాల ఉదృతిలో కొట్టుకపోయాడు. జాతీయోద్యమ కాలంలో పదండి ముందుకు, పదండి త్రోసుక అని శ్రీశ్రీ గర్జిస్తే, ఆయన చూపుతున్న మార్గం స్వరాజ్యం వైపే కదా అని తాను కూడా గొంతెత్తి నినదించాడు. కానీ క్రమంగా శ్రీశ్రీ కమ్యూనిజం వైపు మళ్ళడంతో, ఆయన కవిత్వంలో అనౌచిత్యాలు కనపడి, భీమన్నను పునరాలోచనలో పడేశాయి. శ్రీశ్రీ చాలా కవితల్లో కవిత్వం పాలు కూడా తక్కువేనని భీమన్న భావించడం మొదలుపెట్టాడు.

"కవి అనేవాడు సృష్టిని సరిదిద్దగల శిల్పి, సృష్టిలో ఉన్న లోపాలను సరిదిద్ది అసలు సృష్టినే మెరుగుపరిచి దాన్ని అంతర్యాన్ని ప్రజలకు వివరించి చూపగల ఊహ కళాకారుడు. మంచిని చెడుగా చూపేవాడు కాదు, చెడును మంచిగా చూపే వాడే నిజమైన కవి. ఇది కదా నిజమైన కవితా లక్షణం. మరి శ్రీశ్రీ ఏం చేశాడు చల్లని వెన్నెల వెలుగులను పంచే చంద్రుడిని ఎడారిలో కాళ్లు తెగిపడి ఉన్న ఒంటరి ఒంటెతో పోల్చి కవిత్వ లక్షణాన్ని చెడగొట్టాడు. అందుకే ఈ వర్ణన నాకు నచ్చలేదు. అందుకే శ్రీశ్రీని కవి కాదు అంటాను" అన్నాడు భీమన్న.

మహాప్రస్థానం పేరు మహాభారతంలోని పర్వం పేరు. శ్రీశ్రీ తన జయభేరి గీతంలో. "నేను సైతం/ ప్రపంచాగ్నికి/ సమిధ నొక్కటి ఆహుతిచ్చాను" అన్నాడు. ఇందులో సమిధ ఏమిటి? వేద సంప్రదాయం కాదా! విశ్వశాంతి అగ్నిగుండంలో తన సమిధ కూడా కాలుతూ ఉన్నదన్నమాట. ఇంతకన్నా సనాతన సంప్రదాయం మరొకటి ఏది? ఇదీ భీమన్న ప్రశ్న.

కుక్కపిల్ల, అగ్గిపుల్ల కవితలో అల్పవస్తువులను కవితా వస్తువులుగా, కమ్యూనిస్టు యువతకు శ్రీశ్రీ సూచించి, కవిత్వాన్ని, యువకుల ప్రతిభను అల్పం చేశాడని భావించాడు భీమన్న. సబ్బుబిల్ల కన్నా దానిని ఉపయోగించే సౌందర్యవతి గొప్ప కవితా వస్తువు కదా అని సూచిస్తాడు.

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవరు?" అన్నాడు దేశ చరిత్రలలో శ్రీశ్రీ. కూలీలు రాలెత్తడం వల్లనే తాజ్‌మహల్ నిర్మాణం సాధ్యమైందన్నది సత్యమైనా, అంతకన్నా వాస్తవమైనది దాన్ని నిర్మాణానికి యోచన చేసిన యజమాని ముఖ్యం కదా! యజమాని యోచన చేయకుండా, ధనాన్ని వ్యయపరచకుండా ఉండి, ఉంటే లక్షల మంది కూలీలు ఏకమైనా, తాజమహల్‌ను నిర్మించేవారా?

"పతితులారా! భ్రష్ఠులారా! ఏడవకండి ఏడవకండి" అంటాడు శ్రీశ్రీ. ఏడుస్తుంది కేవలం కార్మికులు మాత్రమే కాదు అన్ని వర్గాల వాళ్లకు ఈ ఏడుపు ఏదో రకంగా తప్పటం లేదు కదా! అంటాడు భీమన్న. ఈ సంగతులు శ్రీశ్రీకి కూడా తెలుసు. అందుకే అవి శ్రీశ్రీ మనస్ఫూర్తిగా రాసిన మాటలు కావంటాడు భీమన్న.

శ్రీశ్రీ రచనల్లో అనేక కవితా వ్యతిరేక లక్షణాలు కనిపించడం వల్ల శ్రీశ్రీ కవిత్వం పట్ల భీమన్నకు క్రమంగా ప్రతికూలత ఏర్పడింది. శ్రీశ్రీ పుట్టి సాహిత్యాన్ని, ఘంటసాల పుట్టి సంగీతాన్ని నాశనం చేశాడని కూడా ప్రకటించి శ్రీశ్రీ అభిమానుల చేత తీవ్ర ప్రతిఘటనను కూడా భీమన్న ఎదుర్కొన్నాడు.

భీమన్న దృష్టిలో శ్రీశ్రీ

శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు. ఆయన కవిత్వమూ కమ్యూనిస్టు కవిత్వం కాదు. గిడస బారిన భావకవిత్వం. కన్నీటి కెరటాల వెన్నెలలో ఉక్కిరిబిక్కిరి అయోమయ స్థితిలో ఉన్నప్పుడు, భావకవిత్వం పసలేనిదిగా భావించిన యువకులు కమ్యూనిజం వైపు వెళ్లారు. అదే ఊగిసలాటలో ఉన్న శ్రీశ్రీ కూడా భావ కవిత్వాన్ని వదిలి కమ్యూనిస్టు రాజకీయాలలో తేలి, ఆ యువకులకు నాయకుడు అయి కూర్చున్నాడు.

జాతీయోద్యమ కాలంలో కాంగ్రెస్‌లోని తీవ్రవాదులైన సోషలిస్టులు కమ్యూనిస్టులుగా విడిపోయి, గుర్తింపు కోసం పాకులాడుతున్న కాలంలో కమ్యూనిస్టులకు ఉద్యమ గేయాలు రాసే కవులు కావలసి వచ్చింది. అప్పుడు శ్రీశ్రీ వాళ్ళకు కనపడ్డాడు. శ్రీశ్రీ మహాకవి కదా. కవిత్వం మాత్రమే రాస్తాడు. మరి జీవిక? దాని కొరకే శ్రీశ్రీ కమ్యూనిస్టు పంజరంలో చేరిపోయాడు. లోకంలోని బ్రతుకులన్నీ ఆదర్శాలను చూపుతూ అవసరాలు తీర్చుకునే బ్రతుకులే కాబట్టి శ్రీశ్రీ అవసరమర్యాదలు తప్పయినవి కాదు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వచ్చినప్పుడు, కమ్యూనిస్టు యువకులు స్వీకరించవద్దంటే, సరే అని అవార్డును తిరస్కరించి, అది పంపిన డబ్బులు మాత్రం తీసుకున్నాడు. అదీ కమ్యూనిజం పట్ల శ్రీశ్రీకి ఉన్న విశ్వాసం. కమ్యూనిస్టు పార్టీ, శ్రీశ్రీ అవసరార్థం ఒకరినొకరు ఆశ్రయించారు. పరస్పరం సహకరించుకున్నారు. ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. శ్రీశ్రీ పట్ల కాంగ్రేసు అలసత్వం, నిరాదరణ; కమ్యూనిస్టుల చొరవ, శ్రీశ్రీ జీవితావసరాలు శ్రీశ్రీని కమ్యూనిస్టుగా మార్చాయే తప్ప. ఆయన మనస్ఫూర్తిగా కమ్యూనిస్టుగా మారలేదు. దానికి రుజువులే ఆయన రాసిన సినిమా పాటలు, పత్రికలలో కవితలు. వీటిని పరిశీలించి చూస్తే ఆయన ఎంత రసవత్కవో మనకు అర్థం అవుతుంది అంటాడు భీమన్న.

గొప్ప నిర్మాణాలకు యోచన, ధనము అవసరమే. అవి మాత్రమే నిర్మాణాలను సాకారం చేయలేవన్నది నగ్నసత్యం. వాటిని ఆసరా చేసుకొని నిర్మించే బడుగు జీవుల వైపు శ్రీశ్రీ నిలబడ్డాడు. అరగని వారి రోదనా రోదనే, ఆకలి జీవుల రోదనా రోదనే. ఆకలి జీవుల రోదననే ప్రపంచానికి వినిపించి, వారి కన్నీటిని తూడ్చే పనిని శ్రీశ్రీ చేశాడు. భీమన్న దృష్టిలో శ్రీశ్రీ ఎలాంటి కవి అయినా, లోకంలో దృష్టిలో మాత్రం శ్రీశ్రీ మహాకవే. కమ్యూనిస్టు కవే. ఆయన కేవలం తన జీవిక కొరకు మాత్రమే సినిమాలకు పాటలు, మాటలు, పత్రికలకు కవితలు రాశాడు. మిగిలిన తన జీవితాన్నంతా తెలుగు వారి అభ్యుదయం కోసం ధారపోశాడు. తెలుగు అభ్యుదయ సాహిత్యమున్నంత కాలం శ్రీశ్రీ వెలుగునింపే సూర్యుడై నిలిచే ఉంటాడు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు – బోయి భీమన్న.
2. తెలుగు సాహిత్య చరిత్ర – డా. ద్వా.నా. శాస్త్రి.
3. శ్రీశ్రీ జాబులు – సం. చలసాని ప్రసాద్.
4. చలసాని ప్రసాద్ సాహిత్య వ్యాసాలు – సం. వరవరరావు

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

డా. బోయి భీమన్న 'ఓయి, కవి! కవిత్వం వ్రాయి!' – ఇతివృత్తం

– డా. నారగోని సైదులు
తెలుగు అధ్యయన శాఖ
సెల్ : 9490585645

వ్యాస సంగ్రహం:

ప్రాచీన కాలం మొదలుకొని అత్యాధునిక కాలం వరకు ప్రపంచ వ్యాప్తంగాను, భారతదేశ వ్యాప్తంగాను ఎన్ని మార్పులు చోటుచేసుకున్నా, లెక్కలేనన్ని సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చినా అటు ప్రపంచ సాహిత్యాల్లోనూ, ఇటు భారతీయ సాహిత్యాల్లోనూ చెక్కు చెదరకుండా మూడు పువ్వులు ఆరుకాయలుగా దిన దిన ప్రవర్ధమానమవుతున్న సాహిత్య ప్రక్రియల్లో కవిత్వం ప్రధానమైనది. సాహిత్య లోకంలో చిత్ర కళలుగా, లలిత కళలుగా, సరస కళలుగా పేరుగాంచిన సంగీతం – చిత్రలేఖనం – విగ్రహ శిల్పం – నాట్యం కళల్లో కవిత్వ కళ విశిష్టమైనది, విలక్షణమైనది. ఇంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న కవిత్వ ప్రక్రియ ఏ విధంగా ప్రారంభమైంది? అనే విషయాన్ని పరిశీలిస్తే– ఈ భూమ్మీద మానవుడి ఊహ రెక్కవిప్పుకున్న రోజున చిత్ర విచిత్ర కార్యకమనీయమైన ఈ ప్రకృతి అందాలకు పరవశుడై ఆనందంతో చిందులు వేస్తూ, నోటి నుంచి ఉద్భవించిన తొలి పాటతోనే కవిత్వం ఆవిర్భవించింది అని సాహితీవేత్తలు వారి వారి గ్రంథాల్లో తెలియజేశారు. కావున మానవుడు సంఘజీవి, బుద్ధిజీవి. మనిషిగా భూమి మీద జీవించినన్ని రోజులు జీవితం సాఫీగా సాగదు. అనేక వలయాకారాలుగా సాగుతుంది. అంటే– ఆ వలయాలన్ని మానవుడిని కేంద్ర బిందువుగా చేసుకొని సంసారంలోను, నివాసంలోను, గ్రామంలోను, దేశంలోను, సమాజంలోను బాధ్యత గల పౌరుడిగా నిలబెడతాయి. ధర్మంతో, నిజాయితీతో, మానవత్వంతో సమాజంలో నడుచుకోవలసిన మార్గాలను తెలియజేస్తాయి. అయితే, సమాజంలో బాధ్యత గల పౌరుడిగా నడుచుకోవలసిన మానవుడు ధర్మాన్ని విడిచి, నీతి నియమాలను త్యజించి – కామ, క్రోధ, మద వాత్సల్యాలకు గురైనప్పుడు, కుల మతాల పేరుతో ఇతరులకు భంగం కలిగించినప్పుడు, దుర్బుద్ధితో సమాజాన్ని తప్పుతోవ పట్టిస్తున్నప్పుడు, మానవత్వాన్ని మరచి క్రూరంగా ప్రవర్తిస్తున్నప్పుడు మానవుడిని సరైన మార్గంలో నడిపించగల

దివ్యౌషధం కావాలి. దీంతోపాటు మానవుడి కర్తవ్యాలను ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ, అతని దుర్బుద్ధిని సరిదిద్దగల ఋషులు కావాలి. అటువంటి కవులు, వాళ్లు రాసిన లేదా రాస్తున్న కవిత్వమే దివ్యౌషధం. ఇంత విశిష్టత కలిగిన కవిత్వరంగంలో డా. బోయి భీమన్న గారు 1971వ సంవత్సరంలో జరిగిన అఖిల రచయితల ఐదవ మహాసభల సందర్భంగా 'ఓయి, కవీ! కవిత్వం రాయి!' పేరుతో 54 పద్యాలతో కూడిన వచన కవిత్వాన్ని రాశారు. ఆ కవిత్వంలోని ఇతివృత్తాన్ని పరిశోధన పూర్వకంగా విశ్లేషించటం ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం. దీనికంటే ముందు కవిత్వం అంటే ఏమిటి?, కవిత్వం ఎలా ఉండాలి?, కవిత్వం వల్ల సమాజానికి, సాహిత్యానికి ఉపయోగం ఏమిటి?, డా. బోయి భీమన్న గారి సాహిత్య ప్రస్థానం మొదలైన విషయాలను సంక్షిప్తంగా చర్చిస్తాను.

కీలక పదాలు: భారతీయ సాహిత్యం, తెలుగు సాహిత్యం, కవిత్వ ప్రక్రియ, డా. బోయి భీమన్న, ఓయి, కవీ! కవిత్వం రాయి!

1. కవిత్వం – అర్థాలు, నిర్వచనాలు:

ప్రపంచ, భారతదేశ వ్యాప్తంగా ప్రాచీన కాలం మొదలుకొని నేటి దాకా పద్య రూపంలో, వచన రూపంలో రాయబడుతున్న లేదా వెలువడుతున్న కవిత్వం వల్ల ప్రయోజనమేమిటి?, అసలు కవిత్వమంటే సరైన అర్థమేమిటి? అనే అంశాలకు కచ్చితమైన సమాధానాలను చెప్పటం అసాధ్యం. కాని కవిత్వం అంటే– నిగూఢతను కలిగి, సాధారణ వాక్యానికి భిన్నంగా ఉండి, మానవుని మనసును రంజింపజేస్తూ, ఒక మంచి ఆలోచనను రేకెత్తించే రచనను కవిత్వంగా చెప్పవచ్చు. కవిత్వం అనేది ఒక సృజనాత్మక సాహితీ ప్రక్రియ. ఈ ప్రక్రియ సాధన ద్వారా మెరుగుపడుతుంది. "కవిత్వం అంటే అక్షర హింస కాదు. అక్షరాల కుంటి నడక అంతకంటే కాదు. కవిత్వం అంటే అక్షర తాండవం. కవిత్వం అంటే ఒక అన్వేషణ, ఒక తీరని వేదన. కవి అనేవాడు పదాలను ఒక కళాత్మకమైన, లయబద్ధమైన రీతిలో ఉపయోగిస్తూ, తాను చెప్పదల్చుకున్న భావాలను, ఆలోచనలను, అనుభూతులను చక్కగా వ్యక్తపరచాలి. అంతేకాని కవిత్వంలో సంకోచాలు, మొహమాటాలను ప్రదర్శించకూడదు. కవిత్వంలో చెప్పేదేదైనా బలంగా ఉండాలి. వట్టి మాటలు, నత్తి చేష్టలు ఉండకూడదు అంటారు సాహితీవేత్తలు. ఇంతకి కవిత్వం ఎలా ఉండాలి? అనే విషయాన్ని ప్రముఖ తెలుగు కవి పిండిప్రోలు లక్ష్మణ కవి తన లంకా విజయంలో– కొందరు కవులు శబ్ద సౌష్టవానికి ప్రాధాన్యతనిస్తే, మరికొందరు భావానికి, ఇంకొందరు అర్థస్పష్టతకు ఇచ్చారు. కొందరు సంధి సంఘటనలో, అలంకారాలలో, వృత్తి వైవిధ్యంలో నైపుణ్యం చూపిస్తే, మరికొందరు తెలుగు సంస్కృత మిశ్రమ భాషను, ఛందస్సును ఆశ్రయిస్తారని ఈ క్రింది పద్యంలో పేర్కొన్నారు.

"కొంద శబ్ద సౌష్టవము, కొంద భావము, కొదర్థముం
కొంద సంధి సంఘటన, కొందలంకృతి, వృత్తి కొందం
కొంద తెన్గు సంస్కృతము కొంద, చందము కొందన్నియుం
కొంద జూతురెల్ల కవి కోటి బళీయనజేయు మీకృతిన్"

(లంకా విజయం, పుట. 56)

కవిత్వం గురించి ఒక్కమాటలో చెప్పాలంటే– ఈశ్వర తత్వాన్ని, కవితా తత్వాన్ని తెలుసుకోవటం అంత సులభమైన పని కాదు. ఎందుకంటే కవిత్వాన్ని నిర్వచించే క్రమంలో భారతీ–యాలంకారికులు అయిన మమ్మటుడు 'లోకోత్తర వర్ణనా నిపుణ : కవి :, కర్మ : కావ్యం' విద్యాదరుడు అన్నాడు. 'కవనీయం కావ్యం' అని అభినవగుప్తుడు భావించాడు. 'వర్ణించువాడు కవి, అతని కర్మ కావ్యం' అని విద్యాధరుడు అభిప్రాయపడ్డాడు. ఇలా అనేకమంది అలంకారికులు కవిత్వం గురించి, కవి గురించి, కావ్యం గురించి నిర్వచించారు.

2. డాక్టర్ బోయి భీమన్న సాహిత్య ప్రస్థానం:

"ఓయి కవీ!/ కవిత్వం వ్రాయి!/ జీవితాన్ని మథించు/ భావ లతలు పూయించు/ అందాలను ఆనందంతో నింపి/ అందరికీ పంచు" అంటూ మే నెల, 31వ తారీఖు, 1971వ సంవత్సరంలో జరిగిన అఖిల రచయితల ఐదవ మహాసభల సందర్భంగా 'ఓయి, కవీ! కవిత్వం రాయి!' పేరుతో చక్కటి కవితా సంపుటిని వెలువరించాడు డాక్టర్ బోయి భీమన్న గారు. భీమన్న గారు 19–9–1911న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురులో శ్రీ పల్లయ్య, శ్రీమతి నాగమ్మ దంపతులకు మూడవ సంతానంగా జన్మించారు. లేబర్ స్కూలు, నగరం మిడిల్ స్కూలు, రాజోలు ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, పిఠాపురం మహారాజా వారి కళాశాలలో బి.ఏ. విద్యను పూర్తి చేశారు. 1911వ సంవత్సరం మొదలుకొని 16–12–2005 వరకు (84 సంవత్సరాలు) జీవించిన భీమన్న గారు తన పదకొండవ యేట 'కేలన్ గేల్ పయిటన్ బయంటగొని, సంకీర్ణ ప్రలాపాను' పద్యంతో రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించారు. 'జానపదుని జాబులు మొదలుకొని పాలేరు, కూలిరాజు, దీప సభ, పిల్లి శతకం, ధర్మ కోసం పోరాటం, గుడిసెలు కాలిపోతున్నాయి. అంబేడ్కర సుప్రభాతం, మోక్షం నా జన్మహక్కు, చివరి మెట్టుమీద శివుడు, శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు, కుల నిర్మూలన (అనువాదం)' వరకు 66కుపైగా పుస్తకాలను రచించారు. అంతేకాకుండా జనవాణి, జయభేరి, ప్రజామిత్ర, నవ జీవన, ఆంధ్రప్రభ మొదలైన పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పని చేశారు. ఒకవైపు ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలు బోధిస్తూనే, మరోవైపు ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యునిగా, కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ ఆర్గనైజర్‌గా, హరిజన సేవక్ సంఘం సంయుక్త కార్యదర్శిగా పని చేశారు.

డా. బోయి భీమన్న రాసిన గుడిసెలు కాలిపోతున్నాయి రచనకు 1975వ సంవత్సరంలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వరించింది. భీమన్న రచనల్లో అతి ప్రధానమైన రచనగా పేరొందిన పాలేరు నాటకం ద్వారా కులవ్యవస్థ దేశాభ్యుదయానికి హానికరం అని చెప్పారు. కూలివాడు రాజ్యమేలినపుడు గానీ సంఘ బాధలెల్ల చక్కబడవు అంటూ కూలిరాజు నాటకం ద్వారా వ్యక్తీకరించారు. ఈ విధంగా భీమన్న రాసిన రచనలకు గాను 'కళాప్రపూర్ణ, సాహితీ వసంత, పద్మశ్రీ' వంటి బిరుదులతో పాటు ఎన్నో సత్కారాలు, సన్మానాలు జరిగాయి. అయితే, డా. బోయి భీమన్న గారు సాహిత్య రంగంలోకి అడుగుపెట్టడానికి, తన వ్యక్తిత్వాన్ని మార్చుకోవడానికి కారణమైన ఈ క్రింది పద్యాన్ని ఇంటర్వ్యూలలోను, పుస్తకాలలోను, వ్యాసాలలోను ప్రస్తావించేవారు.

"మృత్పిండ మేకో బహు భాండ రూపా
సువర్ణ మేకో బహు భూషణాని,
గో క్షీర మేకో బహు ధేను రూపా
ఏకో పరాత్మా బహు జీవరూపం"

(భీమన్న సమగ్ర సాహిత్యం, పుట. 230)

అంటే– అనేక కుండల రూపాలలో కనిపిస్తున్నా మట్టి ముద్ద ఒక్కటే. అనేక భూషణాలుగా రూపొందినా బంగారం ఒకటే. ఆవులు వేరయినా ఇస్తున్న పాల రంగు ఒకటే. అనేక జీవులుగా కనిపిస్తున్నా పరమాత్మ ఒక్కటే అని అర్థం.

3. డా. బోయి భీమన్న 'ఓయి, కవీ! కవిత్వం రాయి!' – ఇతివృత్తం:

కవిత్వం రాయాలన్నా, నవల రాయాలన్నా, కథ రాయాలన్నా, నాటకం రాయాలన్నా కచ్చితంగా ఇతివృత్తం కావాలి. ఇతివృత్తం అంటే గడిచిపోయిన సంఘటనల గురించి తెలియజేసేది. ఇంగ్లీషులో దీన్ని థీమ్ అని పిలుస్తారు. ఇతివృత్తం అనేది ఒక రచనలో ఉండే అంతర్లీనమైన ఆలోచన లేదా సందేశం. ఇది ఆ రచన యొక్క సారాంశాన్ని, రచయిత చెప్పాలనుకున్న లోతైన అర్థాన్ని బహిర్గతం చేస్తుంది. సూక్ష్మంగా చెప్పాలంటే ఇతివృత్తం అంటే సారాంశం. దీనినే కవిత వస్తువు, కథ వస్తువు, నవల వస్తువు, నాటక వస్తువుగా వ్యవహరిస్తుంటారు. మరి డా. బోయి భీమన్న రాసిన సందర్భంగా 'ఓయి, కవీ! కవిత్వం రాయి!' కవితా సంపుటిలోని ఇతివృత్తం ఏమిటి అనే విషయాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం.

"ఓయి కవీ!
కవిత్వం వ్రాయి!
జీవితాన్ని మథించు
భావ లతలు పూయించు,
అందాలను ఆనందంతో నింపి
అందరికీ అందించు!

కవి అనేవాడు కావ్య వ్యవసాయి,
మానవ హృదయం కావ్య మధుపాయి
ఎవర్నో విమర్శించడం కాదోయి!
ఎలనీరే ఎండలకు మందోయి!

ఒక్కొక్క జిహ్వకు ఒక్కొక్క రుచి
ఒకొక్క పుర్రెకు ఒకొక్క బుద్ధి
ప్రతి జిహ్వనూ, ప్రతి పుర్రెనూ లాలించగలది
కవిత్వం ఒక్కటేనోయి!

మేము నీనుంచి ఆశించేది–
చీకటిని కాదు, వెన్నెలను,
ఉద్రేకాన్ని కాదు, ఉపశాంతిని,
రక్తపాతాన్ని కాదు, రక్తి ప్రభాతాన్ని"

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, పుట. 471)

డా. బోయి భీమన్న దృష్టిలో కవిత్వం అంటే ఎట్లా ఉండాలి?, కవి అనేవాడు ఎలాంటి కవిత్వాన్ని రాయాలి?, కవిత్వం ద్వారా ప్రజలకు ఎలాంటి విషయాలను వ్యక్తం చేయాలి? అనే అంశాలను ఇతివృత్తంగా తీసుకొని, పై కవితా పంక్తుల ద్వారా ఒక చక్కటి విషయాన్ని వ్యక్తపరిచాడు. కవి తన కవిత్వాన్ని కేవలం వ్యక్తిగత ఆనందం కోసం రాయకుండా జీవితాన్ని లోతుగా మథించి, అందులోంచి పుట్టిన అందాన్ని సమాజానికి పంచాలంటాడు భీమన్న గారు. కవిత్వం వ్యక్తిగతం నుంచి సామూహికానికి చేరాలంటాడు. కవి అంటే రైతు, మానవ హృదయం అతని పొలమంటాడు భీమన్న. కావున ప్రజల బాధలను చల్లార్చేవిధంగా కవిత్వాన్ని రాయాలని సూచించాడు. కవి రాసిన కవిత్వం ఎండలో ఉన్నవాడికి ఎలనీరు లాగా ఉపశమనం ఇవ్వాలంటాడు. సమాజంలో నివసించే మనుషుల అభిరుచులు, ఆలోచనలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి అందరినీ ఒకే విధంగా సంతృప్తిపరచడం కవికి అసాధ్యం. అయితే, సమాజం కవి నుంచి కోరేవి ఏమిటో తెలియజేస్తూ– హింస కాదు, శాంతి. ఉద్రేకం కాదు, సమతుల్యత అంటాడు భీమన్న గారు. అంతేకాదు..

"నీతులు చెప్పకయ్యా! కవీ!
నీకు తెలిసిన నీతులు మాకూ తెలుసు
వేదాంతం బోధించకు,
ఆ మాత్రం ఎరగనివా డెవడూ ఇక్కడ లేడు.

మా దారికి, మా తిండికి ఎవరైనా అడ్డంవస్తే
మా దగ్గర కత్తులున్నై, శక్తులూ ఉన్నై
నీ కలం నరకడానికి పనికిరాదయ్యా!
అమ్రఫలం ఆటంబాంబు కాలేదయ్యా!

గోవు గడ్డి తింటుంది
వ్యాఘ్రం మాంసం తింటుంది,
మనిషి గోముఖ వ్యాఘ్రమయ్యా, బాబు!
అర్థం చేసుకోవయ్యా మనీషి డాబు!

తన తిండికి మరొకడు పోటీ రానంతకాలం
మనిషి మనీషిగా నీతులు చెపుతాడు,
పోటీ ఏదైనా అగుపిస్తే చాలు–
అశ్వత్థామ నైనాసరే హతః అంటాడు!"

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, పుట. 472)

కవి అనేవాడు తన కవిత్వంతో ప్రజలకు ఏం చెప్పాలి, ఏం చెప్పకూడదో వ్యక్తం చేస్తూ ఇలా అంటాడు. 'నీతులు చెప్పకయ్యా కవి. ప్రజలకు తెలియవని కావు. కవిత్వం బోధ కాదు అనుభవం. ఉపన్యాస ధోరణి కవిత్వానికి హానికరం. కవిత్వం ఆయుధం కాదు. హింసకు ప్రత్యామ్నాయం కాదు. కలం బాంబు కాదు, అది మానవత్వ సాధనం.' అంటూ మనిషిలోని ద్వంద్వ స్వభావాన్ని ప్రశ్నించాడు. చివరగా..

"కవుల పేర్లు దాచేసి, కవితల్ని మాత్రం ప్రకటిస్తే-
నేటి కవితలన్నీ ఒకటే మోడలుకు కాపీలు!
తన అసమర్థతకు మరెవర్నో నిందిస్తున్నాడు ఆధునికుడు!
నిస్పృహ వద్దు నిజ స్థితిని గుర్తించు!

జీవితాన్ని నలుముఖాలుగా అనుభవించు,
అనుభవం నుంచి ఆనంద సుధను వెలయించు,
కుల మత ముఠాలకు అతీతంగా జీవించు,
తెలుగుకు మూలసాహిత్య భాగ్యాన్ని కలిగించు.

ఎండ వానల దాంపత్యం ఈ జీవితం,
రెంటికీ సమంగా గొడుగు పట్టగలిగిందే సాహిత్యం!
చిమ్మ చీకటిలో చిరుదీపమైనా కావాలి నీ పాట!
మరింత చికాకు కల్పించే కారు మబ్బు కారాదు నీ బాట!"

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, పుట. 473)

ఆధునిక కవిత్వంలో అనుకరణ ఎక్కువైపోయిన విధానం గురించి భీమన్న గారు చక్కగా వర్ణించారు. 'తన లోపాన్ని ఇతరులపై నెట్టడం ఆధునికుడి అలవాటు. నిజాయితీగా తన అసమర్థతను గుర్తించు. కవిత్వం కుల, మతాలకు అతీతంగా ఉండాలి. తెలుగు సాహిత్యానికి మౌళికమైన సృజనాత్మకత తీసుకురావాలి. జీవితం సుఖ, దుఃఖాల మేళవింపు. సాహిత్యం రెండింటినీ సమంగా స్వీకరించగలిగినప్పుడే నిజమైన కవిత్వ కళ అవుతుంది. కవిత్వం అనేది చీకటిలో దీపంలా నిలవాలి గానీ మబ్బులా భారం కాకూడదు అంటారు డా. బోయి భీమన్న గారు. ఈ విధంగా మనిషిని ఇతివృత్తంగా ఎంచుకొని కవి, కవిత్వం చేయవలసిన పనులను 54 పద్యాలలో చక్కగా వివరించారు.

ముగింపు:

సాహిత్యం కేవలం సౌందర్యానందాన్ని మాత్రమే అందించే కళ కాదు. అది సమాజాన్ని ప్రశ్నించే, మార్గనిర్దేశం చేసే శక్తివంతమైన ఒక సాధనం. డా. బోయి భీమన్న గారు వెలువరించిన 'ఓయి, కవీ! కవిత్వం రాయి!' అనే కవితా సంపుటి ద్వారా సమాజంలో కవి పాత్ర, కవిత్వ లక్ష్యం, సమాజంతో కవికి ఉండవలసిన అనుబంధాన్ని స్పష్టంగా నిర్వచించారు. కవిత్వం వ్యక్తిగత భావాల వ్యక్తీకరణకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతతో కూడిన సృజనాత్మక చర్యగా మారాలని

సూచించారు. హింస, ద్వేషం, ఉద్రేకాలకు కాకుండా శాంతి, మానవత్వం, సహనానికి మార్గం చూపే కవిత్వమే నేటి కాలానికి అవసరమని నొక్కాణించారు. టెక్నాలజీ అభివృద్ధి వేగంగా జరుగుతున్నా నేటి కాలంలో మానవ సంబంధాలు రోజు రోజుకు సంకుచితమవుతున్నాయి. ఇటువంటి సందర్భంలో కుల, మత భేదాలను అధిగమించి, అనుభవాన్ని ఆధారంగా చేసుకొని, మూల సాహిత్యానికి ప్రాణం పోసే కవిత్వాన్ని సృష్టించాలని నేటి కవులకు 1971లోనే భీమన్న గారు దిశానిర్దేశం చేశారు. భీమన్న గారి 'ఓయి, కవీ! కవిత్వం రాయి!' కవిత్వాన్ని పాఠశాల స్థాయిలో పాఠ్యాంశంగా చేర్చాలి. సమాజంలో పెట్రేగిపోతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవగాహన కల్పించి, భీమన్న వలె కవిత్వాన్ని రాసే అలవాటును నేర్పించవలసిన అవసరం, ఆవశ్యకత, బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

ఆధార గ్రంథాలు:

1. లక్ష్మీకాంతం, పింగళి. 2018. సాహిత్య శిల్ప సమీక్ష.నవచేతన ప్రింటింగ్, హైదరాబాద్.
2. విజయభారతి, పి. 2017. బోయి భీమన్న. సాహిత్య అకాదెమీ, న్యూఢిల్లీ.
3. భీమన్న, బోయి. 1971. ఓయి కవీ! కవిత్వం రాయి!. కవి సమ్మేళన పీఠం. హైదరాబాద్.
4. భీమన్న, బోయి. 1987. మోక్షం నా జన్మహక్కు. సాహితీనిధి. హైదరాబాద్.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

అంబేద్కర్ మతం – డాక్టర్ బోయి భీమన్న అభిమతం

– డా. ఖేతావత్ సైదులు,
సహాయ ఆచార్యులు, జి.డి.సి,
సీతాఫల్‌మండి

పరిచయం

మతం అనేది మనిషి జీవితం, నైతికత, సమాజం, ఆచరణ, ఆధ్యాత్మికతలకు దారిదీపమైనది. మతమనేది నమ్మకాల పునాది పైన నిలిచిన వ్యవస్థ. మానవ సమాజం ఆవిర్భవించినప్పటి నుండి మనిషి జీవన విధానాన్ని ప్రభావితం చేసిన శక్తివంతమైన సామాజిక వ్యవస్థ. "మతం అనే పదానికి అర్థం అభిప్రాయమని, అభిప్రాయం అంటే దేని గురించి అయినా కావచ్చు నా మతం నాది అంటే నా అభిప్రాయం నాది అని, నా మతం నాది నీ మతం నీది ఎవడి మతం వాడిది. కాగా మతం వ్యక్తిగతమైన ఒక పద్ధతి" (డా. బోయి భీమన్న– అంబేద్కర్ మతం, పేజి:10) మతం ఒకవైపు మానవునికి నైతిక విలువలను బోధించినా, మరొకవైపు సామాజిక అసమానతలకు, కులవ్యవస్థకు, దోపిడీకి సాధనంగా కూడా మారింది. దేవుడు, ఆత్మ, పరమార్థంపై నమ్మకం, మంచీచెడుల గుణగణాల బోధ. మతం మనిషిని మనిషిగా గౌరవించాలి అనే భావన లేకపోతే అది దోపిడీ సాధనంగా మారుతుందని సామాజిక సంస్కర్తలు హెచ్చరించారు.

సాంప్రదాయంగా మతం దేవుడు, ఆత్మ, పరమార్థం వంటి ఆధ్యాత్మిక భావనల చుట్టూ తిరుగుతుంది. కానీ సామాజిక శాస్త్రవేత్తల దృష్టిలో మతం ఒక సామాజిక నియంత్రణ వ్యవస్థ. మతం సమాజాన్ని క్రమబద్ధం చేసింది. కానీ కులవ్యవస్థను శాశ్వతం చేసింది. అందుకే ఆధునిక సామాజిక ఆలోచనాపరులు మతాన్ని తర్కం, మానవతా విలువల ఆధారంగా పునర్మూల్యాంకనం చేయాలని సామాజిక సంస్కర్తలు సూచించారు.

అంబేద్కర్ దృక్పథం:

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ (1891–1956) భారతదేశపు రాజ్యాంగశిల్పి మాత్రమే కాకుండా సామాజిక శాస్త్రవేత్త, తత్వవేత్త, మతాచార్యుడు, ధర్మవేత్త. అంబేద్కర్ మతం గురించి చేసిన అధ్యయనం భారతీయ సామాజికశీలిగా అణగారిన వర్గాల విమోచనానికి దారులు వేసింది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం వంటి ప్రజాస్వామ్య విలువల దృష్టితో సాగింది. మతం ఒక వ్యక్తిగత ఆధ్యాత్మిక వ్యవస్థ మాత్రమే కాకుండా సమాజాన్ని నియంత్రించే శక్తి అని అంబేద్కర్ లోతుగా విశ్లేషించారు. అందుకే ఆయన మతాన్ని "సామాజిక తన్మయత్వాన్ని నిర్మించే శక్తి"గా చూశాడు. "మతం మనిషి జీవనాన్ని నైతికంగా ఉన్నత స్థితికి తీసుకెళ్లే శక్తి" అది మనిషిని మనిషిగా జీవించేలా చేసే విలువల సమాహారమనీ ఆయన పేర్కొన్నాడు. అఖిల మానవ సమానత్వాన్ని స్థాపించాలని అహింస, కరుణ, సానుభూతి, సత్యం వంటి నైతిక విలువలను బలపరచి సామాజిక దోపిడీ వ్యవస్థలను ధ్వంసం చేయాలని సూచించారు.

అంబేద్కర్ మతాన్ని మూఢాచారాల సమాహారంగా చూడలేదు. "నైతికతలేని మతం మతం కాదు, అది ఆచారాల దిబ్బ మాత్రమే" అన్నది అంబేద్కర్ భావన. పుట్టుక ఆధారంగా మనుషులను వర్గీకరించడం, అణగారిన వర్గాలపై శతాబ్దాలుగా జరుగుతున్న అన్యాయం. అస్పృశ్యతా వ్యవస్థను పవిత్రంగా ప్రకటించడం. ఇవన్నీ "మతం పేరుతో సామాజిక దోపిడీకి చట్టబద్ధత" అని ఆయన పేర్కొన్నారు.

అంబేద్కర్ హిందూ శాస్త్రగ్రంథాలను తెగదెంపులు చేశారు. మనుస్మృతి వంటి గ్రంథాలలో అసమానతలను శాశ్వతీకరించాయి. అందుకే ఆయన మనుస్మృతిని ప్రతీకాత్మకంగా దహనం చేశారు. హిందూమతంపై నిరసనగా అంబేద్కర్ మతపరిశోధన బౌద్ధంవైపు ప్రయాణం చేశారు. ఆక్రమంలో వివిధ మతాలపై అధ్యయనం చేశాడు. ఇస్లాం, క్రైస్తవం, హిందూధర్మం, సిక్కు మతం, బౌద్ధం వంటి అనేక మతాలను సామాజిక దృష్టితో పరిశీలించారు. తాను అనుసరించాల్సిన మతం కోసం ఆయన ప్రధానంగా గమనించిన ప్రమాణాలు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, తర్కం, మానవత్వం ప్రధానంగా తర్కించి, బౌద్ధమతంపై ఆయన ఆకర్షణ పెంచుకున్నాడు. బౌద్ధమతంలో ఆయన ప్రధానంగా సమానత్వం, వర్గ జాతి ఆధారిత వివక్ష లేకపోవడం గమనించాడు.

అంబేద్కర్ మతదృష్టిపై బోయి భీమన్న అభిమతం

"బలం కలవాడు రాజు
బలహీనుడు బానిస,
బానిసగా బతకలేవా
బలం సంపాదించుకో" **(అంబేద్కర మతం – డాక్టర్ బోయి భీమన్న)**

బోయి భీమన్న దృష్టిలో అంబేద్కర్ మతం అంటే కుల, మత, వర్గ భేదాలు లేని మానవతా, సమతా, సమానత్వ సిద్ధాంతం, కావాలని అంబేద్కర్ కలలుకన్నాడు. అస్పృశ్యతను రూపుమాపి, సామాజిక న్యాయం కోసం డా. అంబేద్కర్ పోరాటం చేశాడు . దీనినే డాక్టర్ బోయి భీమన్న తన

రచనల ద్వారా, పాటల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళి, 'అంబేద్కర్ శకం'గా పేర్కొన్నారు, బౌద్ధ ధర్మాన్ని కూడా ఒక మార్గంగా స్వీకరించాలని సూచించారు.

"మాన్య చరితయో భారతమాత మెడకు
కుటిల తరమైన ఉరి త్రాళ్లు కులమతాలు
నిష్కులము నిర్మతము చేయ నేర్చి జాతి
నుద్ధరింపగ లెండిక యువకులారా "! **(డా. బోయి భీమన్న – కూలిరాజు)**

యువకులారా లెండి, మేల్కోండి భరతమాత మెడకు కుల మతాలు ఉరి త్రాళ్ళుగా వేలాడుతున్నాయి. వాటిని తొలగించి సమసమాజ స్థాపనకోసం నడుం బిగించాలని సూచించారు. బోయి భీమన్న రచనల్లో అంబేద్కర్ మతచింతనకు ప్రత్యేక స్థానం ఉంది. మతం సామాజిక విప్లవ సాధనమనీ అన్నారు. అంబేద్కర్ మతదృష్టి దళితుల పునర్జన్మానికి మార్గం వేశారు. మతరూపంలో సమానత్వ రాజకీయం. అంబేద్కర్ నవయాన బౌద్ధం ఒక కొత్త సామాజిక వ్యూహం. దేవుణ్ణి మార్చుకోవడం కాదు. దాస్యాన్ని విడిచిపెట్టడమనీ భీమన్న స్పష్టం చేశారు. అంబేద్కర్ మత మార్పు ఆధ్యాత్మికత కాదు, దోపిడీ నిర్మూలనమనీ పేర్కొన్నారు. హిందువుగా చావననే శపథం తీసుకున్న తర్వాత రెండు దశాబ్దాలకు పైగా అంబేద్కర్ హిందువుగానే ఉన్నాడు. హిందూ మతంలోని లోపాలను దురాచారాలను కుల వ్యవస్థను అస్పృశ్యతను అసహ్యించుకుంటూ నిశితంగా విమర్శిస్తూ వాటి నిర్మూలనకు పోరాటం చేశాడు. ఆయన అంతకాలం పాటు ఆ మతంలోనే ఉండగలిగాడు అంటే ఆయన మనస్సులో హిందూ మతంపై అభిమానం ఉన్నది.

బౌద్ధం ధర్మం మానవ శ్రమ, సమానత్వం, న్యాయం ప్రధానంగా చూచిస్తాయి. అంబేద్కర్ బౌద్ధం, కులరహిత జీవనం, తర్కబద్ధ నైతికత, దళిత చైతన్య నిర్మాణం అంబేద్కర్ బౌద్ధం బోదిస్తుంది. భీమన్న అంబేద్కర్ దృష్టిని ప్రజల్లోకి తీసుకెళ్లిన చైతన్యవాది. దళిత విముక్తి మతమార్పు ద్వారానే సాధ్యమనీ అంబేద్కర్ వాదన "జాతి నిర్మూలన కోసం మతాన్ని మార్చాలి" అన్న అంబేద్కర్ ఆలోచనను భీమన్న విశ్లేషణాత్మకంగా బలపరుస్తాడు. అంబేద్కర్ మతదృష్టి భారతీయ సామాజిక చరిత్రను మార్చిన గొప్ప మేధో విప్లవమనీ చెప్పవచ్చు. ఆయన స్వీకరించిన నవయాన బౌద్ధం అణగారిన వర్గాల సామాజిక పునర్నిర్మాణానికి దారి చూపింది.

బోయి భీమన్న ఈ దృష్టిని తెలుగునాట సాహిత్య సామాజిక చైతన్యంగా మార్చిన ప్రముఖ సిద్ధాంతకర్త. ఇరువురి మత తాత్విక దృష్టి దళిత సమానత్వ పోరాటానికి చరిత్రాత్మక విధానాన్ని అందించాయి. అందువల్లనే అంబేద్కర్ భీమన్న మతచింతన భారత సమానత్వ పోరాటానికి శక్తులుగా నిలుస్తాయి.

నవయాన బౌద్ధం

1956 అక్టోబర్ 14న నాగపూర్‌లో అంబేద్కర్ దాదాపు ఐదులక్షల మంది దళితులతో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించారు. ఇది సంప్రదాయ బౌద్ధం కాదు, ఆయన పునర్నిర్మించిన నవయాన బౌద్ధం. అందువల్ల కొత్త మతదృష్టి అవసరమనీ భావించాడు. బౌద్ధం సమానతను తిరిగి స్థాపిస్తుంది. దళిత

విముక్తి మతమార్పు ద్వారానే సాధ్యమనీ అంబేద్కర్ వాదన. అంబేద్కర్ మతదృష్టి భారతీయ సామాజిక చరిత్రను మార్చిన గొప్ప మేధోవిప్లవం. ఆయన స్వీకరించిన నవయాన బౌద్ధం అణగారిన వర్గాలలో సామాజిక పునర్నిర్మాణానికి దారి చూపింది.

డాక్టర్ బోయి భీమన్న ఈ దృష్టిని తెలుగునాట సాహిత్య సామాజిక చైతన్యంగా మార్చిన ప్రముఖ సిద్ధాంతకర్త. మతపరమైన మూఢనమ్మకాలపై ఆయన పోరాటం చేశారు. ఆయన దివ్యశక్తులు, పూజా క్రతువులను సమాజ హితానికి విరుద్ధమని భావించారు. కర్మసిద్ధాంతాన్ని, పునర్జన్మ ధోరణినిని, వర్గాల మధ్య అడ్డుకట్టలను అంబేద్కర్ విమర్శించారు. మతం ప్రజాస్వామ్యాన్ని బలపరచాలి. మతంలో స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఉండాలి. ఇవి రాజ్యాంగంలోని ప్రాథమిక విలువలుగా చేశారు.

హిందూ సమాజంలో అంతర్గత సంస్కరణలు కష్టమని అధిక నిరాశ చూపారన్న విశ్లేషణలు ఉన్నాయి. అయితే ఈ విమర్శలు కూడా ఆయన సమాజాంతర అనుభవాల నేపథ్యంలో అర్థవంతమే. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మతదృష్టి మానవతా విలువలతో నిండి ఉన్న సామాజిక నైతిక తత్వశాస్త్రమనీ పేర్కొనవచ్చు. ఆయన మతాన్ని దోపిడీకి సాధనంగా కాకుండా, విముక్తికి ఆయుధంగా చూశారు. నవయాన బౌద్ధం ఆయన సామాజిక దృష్టి, ప్రజాస్వామ్య తత్వం, మానవ సమానత్వ విలువల సారం. అంబేద్కర్ మతం గురించి చేసిన పరిశోధన భారతదేశంలో మతం, సమాజం రాజకీయాల సంబంధాన్ని తిరిగి అర్థం చేసేలా చేసింది. అణగారిన వర్గాల విమోచనకు ఆయన మతపరమైన మార్పు ఒక శక్తిగా నిలిచింది. అందువల్ల అంబేద్కర్ మతతత్వం వ్యక్తిని మాత్రమే కాదు, సమాజాన్ని మొత్తం మార్చే శక్తి.

ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మత దృక్పథం మరియు డాక్టర్ బోయి భీమన్న మతాన్ని సామాజిక న్యాయం కోణంలో విశ్లేషించారు. హిందూ మతంపై విమర్శ అంబేద్కర్ గారు హిందూ మతాన్ని కేవలం విశ్వాసంగా కాకుండా, ఒక సామాజిక నిర్మాణంగా చూశారు. ఆయన విమర్శల ప్రధానాంశాలు వర్ణాశ్రమ ధర్మం, మనుస్మృతి ఆధారిత చట్టాలు, అస్పృశ్యతకు మతపరమైన మద్దతు. అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం సమానత్వాన్ని నిరాకరించే మతం మతం కాదు అది దోపిడీ వ్యవస్థ. బౌద్ధ ధర్మ స్వీకరణ విముక్తి మార్గం 1956 లో అంబేద్కర్ గారు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం ఒక ఆధ్యాత్మిక నిర్ణయం కంటే రాజకీయ సామాజిక విప్లవంగా భావింపవచ్చు. అంబేద్కర్ ప్రవేశపెట్టిన నవయాన బౌద్ధం సామాజిక విముక్తికి మార్గం చూపింది.

భీమన్న అంబేద్కర్ భావజాలానికి సాహిత్య రూపం ఇచ్చిన వ్యక్తి. మతంపై ఆయన విమర్శానాత్మక దృష్టి భీమన్న దృష్టిలో కులాన్ని నిలబెట్టే మతం అసంబద్ధం. దేవుడి పేరుతో జరిగే అణచివేత అనైతికం అన్నది ఆయన రచనలలో కనిపించే భావన. భీమన్నదృష్టిలో మతం కన్నా మానవతా విలువలే ప్రధామైనవి. మనిషి గౌరవమే పరమ ధర్మం. ఆయన మతాన్ని సామాజిక న్యాయ సాధనంగా మార్పు చేయాలనుకున్నారు. భీమన్న అభిమతంలో మానవతావాదమే నిజమైన మతం. మతం మనిషిని విడదీయకూడదు కలపాలి. మతం ఒక విశ్వాసంగా కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా మారినప్పుడే అది మానవ సంక్షేమానికి ఉపయోగపడుతుందని భావించవచ్చు.

ముగింపు

కుల, మతాలకు అతీతంగా మానవత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని బోయి భీమన్న నమ్మారు. కుల నిర్మూలనకు బౌద్ధ ధర్మాన్ని ఒక మార్గంగా అంబేద్కర్ సూచించారని భీమన్న కూడా దానిని సమర్థించారని ఆయన రచనలు సూచిస్తున్నాయి. అంబేద్కర్ హిందూ మతాన్ని సంస్కరించి, కులవ్యవస్థను రూపుమాపాలని ప్రయత్నించారని, బ్రాహ్మణమతం వేరు, హిందూమతం వేరని భీమన్న వివరించారు. పీడిత ప్రజల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన పోరాటమే ఆయన మతమని భీమన్న విశ్వసించారు. గుడిసెలు కాలిపోతున్నాయి వంటి రచనల ద్వారా అంబేద్కర్ భావాలను విస్తృతంగా ప్రచారం చేశారు. అంబేద్కర్ మతదృష్టి భారతీయ సామాజిక చరిత్రను మార్చిన గొప్ప మేథో విప్లవంగా పరిగణించారు. ఆయన స్వీకరించిన నవయాన బౌద్ధం అణగారిన వర్గాల సామాజిక పునర్నిర్మాణానికి దారి చూపింది. ఈ విధంగా ఇరువురి మత తాత్విక దృష్టులు దళిత సమానత్వ పోరాటానికి చారిత్రాత్మక విధానాన్ని అందించాయి. అందువల్ల అంబేద్కర్, భీమన్నల మత చింతన భారత సమానత్వ పోరాటానికి ప్రేరణాత్మక శక్తులుగా నిలిచాయి.

ఆధార గ్రంథసూచి

1. అంబేద్కర్ మతం – డా. బోయి భీమన్న
2. డా. బోయి భీమన్న – దళిత సాహిత్య వ్యాసాలు
3. అంబేద్కరిజం – డా. బోయి భీమన్న
4. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

"భారతీయ కవిగా బోయి భీమన్న"

- బైలపూడి అమర్‌నాథ్,
పరిశోధక విద్యార్థి,
సెల్ : 9160310656

A Legend of "Godari", Rised from "Kaveri"

" Men may come and men may go, but I go on forever"

- Lord Tennyson.

* Rivers are the Banks of civilisation, It is a nostalgic Inspiration to men, without rivers there is no existence of mankind. Similarly the eternal Godavari River has it's unique place in many works of literatrure, as well as from the banks of "Godavari" there born a literary Legend, Rised from "Kaveri" kingdom namely ***- Boyi Bheemanna***

పరిచయం :

శ్రీ బోయి భీమన్న గారి గూర్చి అచ్చ తెలుగులో తెలియజేయాలంటే మహామానవతావాది, పరమతాత్విక చింతనుడు, తిరస్కారాలనే- పురస్కారాలుగా, దూషణలే - భూషణాలుగా అలంకరించినవారు "బోయి భీమన్న". పేదగా పుట్టి, పేదగా పెరిగినా, పేదగా బ్రతికినవారు కాదు భీమన్న. కష్టాలు, బాధలు ఎన్నో అనుభవిస్తూ కూడా నిత్య సంతోషిగా జీవించినవారు. అవమానాలను అవతలకు నెడుతూ, అభిమానాలను పదిలపర్చుకుంటూ భారతీయ కవిగా అగ్రస్థానానికి చేరుకున్నవారు శ్రీ బోయి భీమన్న.

"భీమన్నా, నిను గురించి
ఏమన్నా వ్రాయాలని!
నా మనసులో తలంచినా,
నా తనువంతా తపించెనే
నీదొక దీర్ఘాలాపన
నీది అనర్ఘాలోచన,
నీది నిశా సూర్య దృష్టి,
నీది దివాచంద్ర సృష్టి"

అని డా॥ సి.నా.రె.గారు ఆయనను కొనియాడారు.

భీమన్న " నా సాహిత్యమే నా జీవిత చరిత్ర" అని అన్నారు. భీమన్న సాహితి విశేషాలు వర్ణించడమంటే, 20వ శతాబ్ధపు పూర్తి భారతీయ చరిత్ర వివరించడమే అని చెప్పవచ్చు. ఏదైనా గ్రంధం రాయాలంటే మరెన్నో గ్రంథాల్ని పరిశీలించాలి. కానీ భీమన్న గ్రంథాలు గూర్చి తెలియజేయాలంటే 20వ శతాబ్ధంలో జరిగిన మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల కాలం నాటి పరిస్థితులు, భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ పూర్వ, పర స్థితిగతుల మీద కనీస అవగాహన వుండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే "భీమన్న, జీవితంలో ఎదుర్కొన్న సమస్యలను, ఆనంద – ఆశ్చర్యపరిచిన సందర్భాలను కలగలిపిన "సాహిత్య మహాసముద్రమే" ఆయన రాసిన రచనలు, ఈ రచనలు ప్రతీదీ, ప్రత్యక్షంగా జీవితానుభవం నుండి రూపుదిద్దుకుని ఎన్నో ఆటుపోట్లు, ఉలిదెబ్బలతో మలిచినా ఒక అద్భుత శిల్పంలా మనకు దర్శనమిస్తుంది.

విషయం:

బోయి భీమన్న రచనలు ప్రధానంగా నాటి సమకాలీన భారతంలో ప్రధాన సమస్యలైన నిరక్షరాస్యత, వెట్టిచాకిరి, కులకల్లోలం, మతవిద్వేషం, ఆటవిక మూధనమ్మకాలు, సామాజిక రైతు సమస్యలు, సామ్యవాదం, తదితర అంశాలను స్పృశించి, సరిచేయాలని కృషి చేశాయి.

భీమన్న పై విద్యార్థి దశనుండే జాతీయతాభావం ఏర్పడింది. ఉద్యమాల్లో పాల్గొంటూనే, తనవంతుగా 1922 నుండి సాహిత్య సేవ సుసంపన్న చేయడం, ప్రారంభించారు. వాటిలో ప్రధానంగా రాగవాసిష్ఠం, పాలేరు, కూలీరాజు, అంబేద్కర్ మతం, పడిపోతున్న అడ్డుగోడలు, మానవుని మరొక మజిలీ, అసూయ, త్రిపదలు, పిల్లిశతకం, జానపదుని జాబులు, కేదారేశ్వరి రచనలు గూర్చి తెలుపవచ్చు.

"పాలేరు, కూలీ రాజు" నాటకాలు ద్వారా నిరక్షరాస్యత వల్ల వచ్చే సమస్యలను కళ్ళకు కట్టినట్లు సాక్షాత్కరించారు. సామ్యవాద నియంతృత్వాన్ని, అధికారదాహాన్ని, గాఢమైన ఆవేశాన్ని, వయోజన ఓటుహక్కు అవశ్యతకను ఈ రూపకాలు ద్వారా భారతజాతికి సెలవిచ్చారు. అందుకే క్రింది కులాల వారిలో సాంస్కృతిక చైతన్యం, విద్య వికాసం కలిగించవలసి వున్నదంటారు భీమన్న. ఈ కులాల్లో

విద్యారంగంలో జరిగిన కృషి అత్యల్పం అంటారు. సాంస్కృతిక విప్లవం కోసం ఒక ఉద్యమం జరగాలని ఆక్షేపించారు.

రాగవాసిష్ఠం:

భీమన్న రూపకాలలో ప్రత్యేకమైనది రాగవాసిష్ఠం. భారతీయులందరూ ఆర్యులే అన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. తద్వారా హైందవ సమాజం నుండి కులం అనబడే వ్యాధి పూర్తిగా నిర్మూలించబడాలంటారు. వ్యాసుడు–హరిజనుడు, వ్యాస సంతతైన కౌరవ పాండవులు హరిజనులే అంటూ రాగవాసిష్ఠ పీఠికలో ఎలుగెత్తి చాటారు.

రాగవాసిష్ఠం పౌరాణిక ఇతివృత్త వస్తువైనప్పటికీ నేటి కుల సమస్యను కూలంకషంగా చర్చించి, జాతీయవాదాన్ని ప్రేరేపించే విధంగా రూపొందించ బడింది.

ఇందు పాత్రలను పరిశీలిస్తే

ప్రాచీన ధర్మానికి ప్రతినిధి – ప్రాచీనుడు
మానవీయతకు ప్రతి రూపం – వశిష్టుడు
ఆధునిక భావజాలానికి ప్రతీక – అరుంధతి

అట్టడుగు వర్గాలను అభిశంసిస్తూనే, అవసరాలకు వారినే పావుగా వాడుకునే – "కులగిరి" ఇందులో ముఖ్యులు.

అరుంధతి అస్పృశ్య స్త్రీ, వశిష్టుడు ఆర్యజాతీయుడు, వీరిరువురు ప్రేమించుకుంటారు, మధ్యలో మూడవ వ్యక్తి అయిన ప్రాచీనుడి యొక్క సైద్ధాంతిక విభేదం వలన అరుంధతీ, వశిష్టుల మధ్య సంఘర్షణ, ఎడబాటు కలుగుతుంది. అందుకు ఆగ్రహించిన అరుంధతి ఆక్రోశంతో చేసిన తపస్సుకు లోకం అల్లకల్లోలం అయ్యి సాక్షాత్తు ఈశ్వరుడే వచ్చి వారిరువురికి వివాహం చేస్తారు. తద్వారా " మానవజాతి అంతయు ఒక్కటే" అనే భవిష్యదర్శనం చేస్తూ, ప్రపంచంలోనే ఆధునిక అగ్ర రాజ్యాలలో భారత రాజ్యం ఒకటి కావాలనీ, కుల సమస్యను అధిగమించి వికసించాలనీ ఆకాక్షించిన **కవితామూర్తి డా॥ బోయి భీమన్న.**

"డ్రగ్ ఎడిక్ట్ " అనే కవితలో

ప్రపంచంలో ఏ మత విశ్వాసులైనా
అందరూ డ్రగ్గెడెక్టులే,
ఆ డ్రగ్గు పేరు దేవుడు !
"బుద్ధి విఫలమై బలహీనత ముసురుకొనగా
ఆఖరి ఆయుధమై మతమొకటి మెరయున్ " అన్నట్లు, ఈ మతం, దేవుడు, కర్మ సిద్ధాంతాల నుంచి తనని తాను రక్షించుకున్నప్పుడు మనిషి బాగుపడతాడు. ఏ మతం కూడా జీవుల్ని సమర్ధవంతునిగా, మంచివానిగా చేయలేవని, పైగా మతం మందు తాగితే అది స్వేచ్ఛను హరిస్తుందని తెలిపారు. ఏ మతానికి చెందిన దేవుడైనా జీవులందరికీ మంచి చేశాడు, అన్ని శక్తులకు ఆయనే

సమర్థుడు అని నిరూపించలేక పోయాయి. దేవుడి పేరుతో అన్ని మతాలు మానవుల్ని హత్యలు చేశాయి. న్యాయం తప్పాయి, తీవ్రంగా నష్టపోయాయి.

ఇందుకు కారణం దేవుడికి "ఇష్టమైన ద్రగ్గునే అందరూ తీసుకోవాలనే" కఠిన నిబంధన ఉండటంవల్ల, కానీ ఆ ద్రగ్గు వ్యక్తిగత స్వేచ్ఛనే అణిచివేస్తుంది. కాబట్టి భగవంతుడు వేదకాలంలోనే కాదు ఈ కాలంలోను వున్నాడు. అన్ని మత గ్రంధాలసారం మానవజాతి అంతయు సమానమే, ఈ సత్యాన్ని ప్రజలు, ముఖ్యంగా యువకులు గుర్తించి కాలానుగుణమైన మార్పుని సాధిస్తే మానవ జాతి బ్రతుకుతుంది, లేకపోతే సమాదైపోతుంది.

ఓయి ! కవి కవిత్వం వ్రాయి !

శరీరానికి – అన్నం, హృదయానికి – స్పందన ఎలానో ఆత్మకు – జ్ఞానం అవసరం. ఇది కేవలం సాహిత్య సృజన, స్పర్శ ద్వారానే అలవడుతుంది. జన్మలో సాహిత్యం కోసం మూడు రూపాయలు ఖర్చు చేయలేనివారు నిజంగా పిసినారి వాళ్ళే. తాము సంపాదించిన ఆదాయం నుంచి ఒక్క పది రూపాయలైనా పుస్తకాలు కొనడానికి ఉపయోగించని వారు మానవరూప మృగాలు అంటూ జీవితంలో సాహిత్యం కోసం ఖర్చు చేయాలని వాపోయారు సాహితీ ప్రపూర్ణులు భీమన్న.

" ఓయి కవీ !
కవిత్వం వ్రాయి !
జీవితాన్ని మధించు
భావలతలు పూయించు,
కవి అనేవాడు కావ్య వ్యవసాయి,
మానవ హృదయ మధుపాయి !
పుర్రెకో బుద్ధి, జిహ్వకో రుచి
ప్రతి పుర్రెను ప్రతి జిహ్వను లాలించగలది
కవిత్వమొకటే నోయి !

మనుషుల్లో **"పులి – నక్క – గొర్రె"** అనే నైజాలు ఉంటాయి. ఆ మనిషి యొక్క స్వభావాన్ని ఏ నర–నారాయణులో, ప్రకృతి – పరంధాములో మార్చలేరు. నరుడు ఎప్పటికీ నరుడే కావున, కవి ఎలాంటి కవిత్వాలు రాయాలో భీమన్న తెలిపారు. కవి అనేవాడు కవిత రాసేటపుడు మానవ స్వభావాన్ని అపార్థం చేసుకోకుండా, నిందించకుండా **"బురద లేకుండా పద్మాలు వుండవు"** అన్న సత్యాన్ని గ్రహించి, నిగ్రహంతో వారిని కళా వస్తువుగా స్వీకరిస్తే ఆ కవిత జనానికి ఆమోదం అవుతుంది. నీ కవిత అందరినీ ఆనందపర్చలేకపోవచ్చు, కానీ ఎట్టి పరిస్థితుల్లోను నీ కవితను రాజకీయనాయకులకు రాజీపడి కళను వాళ్ళ దాసోహం చేయకూడదు. **"కళ కేవలం ప్రజల కోసమే".**

ఓ కవీ ! నిజంగా నీవు కవి అయితే కవిత్వం వ్రాయి. నీ కవిత్వం ప్రజలకు పంచు, కర్షక దీనుల క్రియాశీలత కాంక్షించు.

"రసాద్వైతం" ద్వారా భీమన్నగారు ప్రకృతి–పురుషుల అద్వితీయ హృదయాన్ని ఆవిష్కరించారు. "నేను దేవున్ని నమ్మను – నీలోని పరమాత్మను నమ్ముతాను, దేవుడు అనేది వ్యక్తిగతం, పరమాత్మ–ప్రాపంచికం, ప్రాపంచికమైన సత్యంలోనే సౌందర్యం వుంది, ఆ(సత్యం, సౌందర్యమే) రసాద్వైత సారం.

"గతకాలం మేలు వచ్చుకాలం కంటెన్" అని ప్రాచీనులు పలికినా

"ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం " అని ప్రాచ్యులు నిలదీసిన ఈ రెంటిని గాకుండా సాహిత్యపు సౌందర్యాన్ని, ప్రకృతితో రమించే వ్యక్తిత్వాన్ని కలిగిననాడే సంపూర్ణత లభిస్తుందని స్ఫురణకు తెచ్చిన "రసాద్వైత బ్రహ్మ " భీమన్న.

ముగింపు:

ఇట్టి మహోన్నత రచనలు చేసిన మహాచైతన్యమూర్తి డా॥ బోయి భీమన్న గోదావరి (ఆంధ్ర) పరివాహక ప్రాంతంలో పుట్టి,పెరిగి ఇక్కడి మట్టి తత్వంతో, మానవీయత పరిమళంతో వికసించి, కావేరీలోని(మద్రాస్) అణగారిన వర్గాల వారి గుడిసెలు మధ్య పర్యటించి తన దళిత జాతీయుల అవస్థలు చూసి చలించిపోయి, తన రచనల ద్వారా యావత్ జాతిజనులు యొక్క కష్టాలను నలుమూలలా "దండోరా" వేసారు,

"మానవుడు సంఘజీవే కాని సంఘ బానిస కాదు", సాహిత్యంలోను, సమాజంలోను వ్యక్తిగత స్వేచ్ఛను కాంక్షించిన స్వతంత్ర విప్లవతార భీమన్న.

డా॥ భీంరావు అంబేద్కర్ యొక్క ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా "జైభీమ్" అనేది ఒక నినాదం కాదు, ఒక విధానంగా ప్రకటించి ధర్మాన్ని రక్షించు, సంఘాన్ని నడిపించు, కుల,మత, వర్గాలు లేని సమసమాజాన్ని స్థాపించు, అను ధృడ సంకల్పంతో అంబేద్కర్ ఆదర్శాలకు ప్రతిరూపంగా నిలిచారు భీమన్న

" నా కవితాలక్ష్యం
చీకట్లో బ్రతికేవాళ్ళను మెప్పించడం కాదు,
వాళ్లను తిట్టినా, కొట్టినా సరే అక్కడనుండి లేపడం
అరుణోదయం కోసం తరమడం "

చివరిగా భారతీయ కవిగా "బోయి భీమన్న" కులం లేని జాతికోసం కలలుగన్నాడు. ఈయన రచనలు ద్వారా కులమతాల కంటే మానవతకు, సమానతకు ప్రాధాన్యమిచ్చారు.

భీమన్న చూపిన సమానత మార్గంలో పయనిద్దాం
సమైక్య భారతాన్ని నిర్మిద్దాం.

సమానత్వం అనేది ఆచరణాత్మక అంశం, అది హృదయ భావావేశం కాబట్టి హృదయ పరివర్తన చెందుదాం,, విశ్వమానవతకు పెద్ద పీట వేద్దాం, విశ్వ కల్యాణాన్ని సాధిద్దాం.

ఆధార గ్రంధాలు:–

1. బోయి భీమన్న – బి.విజయభారతి
2. సాహితీ ప్రపూర్ణ బోయి భీమన్న – రేగుళ్ళ మల్లిఖార్జునరావు.
3. గుడిసెలు కాలిపోతున్నాయి – బోయి భీమన్న
4. రాగవాసిష్టం – బోయి భీమన్న
5. బోయి భీమన్న రూపకాలు–తాత్విక చింతన – డా॥ తక్కళ్ళ బాలరాజు.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న సాహిత్యంలో భిన్నకోణాలు

- బసవరాజప్ప,
అధ్యాపకులు
సెల్ : 9603834634

పరిచయం:

బోయి భీమన్న సాహిత్యం - మానవ వికాసానికి దిక్సూచి. మానవజాతి పెంపొందించుకున్న ఒక శక్తివంతమైన సాధనం సాహిత్యం. వ్యక్తుల ఆలోచనలను భావాలను వివిధ ప్రక్రియల ద్వారా వ్యక్తీకరించడానికి తోడ్పడుతుంది సాహిత్యం. మానవుడు సంఘజీవి తోటి సమాజ సభ్యులతో సంబంధాలు పెంపొందించు కోవడానికి ఎదుటివారి భావాలను గ్రహించడానికి తన అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి సాహిత్యం, సాహిత్య ప్రక్రియలు మానవ వికాసాలకు దిక్సూచి. సహితస్య భావః సాహిత్యం అని అన్నారు పెద్దలు అంటే హితాన్ని చేకూర్చేది సాహిత్యం కాలాన్ని బట్టి సంస్కృతిని బట్టి దేశాన్ని బట్టి ఏది హితమైన సాహిత్యం. అందుకే మానవ వికాసాలకు దిక్సూచి అయినది.

తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి మహాకవి పద్మ విభూషణ్, కళాప్రపూర్ణ బిరుదాంకితులు బోయి భీమన్న. ఆయన సంఘసంస్కర్తగా, మానవతావాదిగా, పండితుడిగా తెలుగు సమాజంలో ప్రత్యేకతను నిలుపుకున్నాడు. సామాజిక చైతన్యాన్ని ఆశించి, కులం, మతం కంటే మానవత్వాన్ని ఆశించి ఆత్మస్థైర్యంతో, ఆత్మవిశ్వాసంతో సాహిత్యంలో పద్యం, గద్యం, గేయం, నవల, శతకం, నాటకం వచన ప్రక్రియలలో తన సృజనతో తనదైన శైలిలో మానవీయ కోణం ద్వారా తన మనసులోని మాటలను సాహిత్యం ద్వారా సమాజాన్ని మేల్కొలిపిన మానవతావాది డాక్టర్ బోయి భీమన్న గారు.

బోయి భీమన్న సాహిత్యాన్ని పరిశీలించి చూస్తే వారి సిద్ధాంతాలకు అనుగుణంగా పీడిత ప్రజల అభ్యుదయం తన లక్ష్యం అంటూ సాహిత్య సేద్యం చేసి సమాజాన్ని చైతన్యపరిచి మానవ అభివృద్ధికి దిక్సూచిగా నిలిచినాడు.

పాలేరు నాటకం:

బోయి భీమన్న పాలేరు నాటకంలో దళితుల ఆలోచనా విధానాలను సున్నితంగా పరిశీలించి, పరిశోధించి విశిష్ట లక్షణాలను వెలుగులోకి తేవడం ఈ నాటకం ద్వారా నాటి భూస్వామ్య వ్యవస్థను, కుల వ్యవస్థను అందులో దాగి ఉన్న అంతర కోణం అంటరానితనాన్ని నిర్మూలించడానికి బానిసత్వపు శంకలాలను చేధించడానికి నాటి ప్రజల అభ్యున్నతే తన లక్ష్యం అంటూ పెత్తందారితనంపై కామాంధుల పొగరు మీద విప్లవ బావుటాలను పాలేరు నాటకం ద్వారా విభిన్న పాత్రల ద్వారా సమస్యలను తమ కళ్ళ ఎదుట వివరించడం జరిగింది. సమకాలీన సమాజంలో జరుగుతున్న మార్పులను, మార్పు కోసం జనం పడుతున్న ఆరాటాన్ని పోరాట పటిమతో వాటిని ఇతివృత్తంగా తీసుకొని పాలేరు నాటకం ద్వారా ఒక ఉద్య మాన్ని నడిపించి ఒక సాహిత్య సంక్షోభాన్ని సృష్టించి నిరుపేదల ఆకలిమంటలు, వెట్టిచాకిరి, వికృత చేష్టల స్వరూపాన్ని నాటకం ద్వారా చిత్రీకరించాడు.

ఉగాది కవితా సంపుటిలో:-

వాకిట్లో వసంతలక్ష్మి కవితలో పేదరికాన్ని గురించి
గతరాత్రి వచ్చిపోయింది పాత ఏడాది
దాన్ని చితినుంచి పుట్టుకొచ్చింది కొత్త ఉగాది.
పాత కన్నీళ్ళు రాలిపోకపోతే
కొత్త వెలుగులకు చోటెక్కడిది

ఈ కవిత కవి మనిషి జీవిత సారాన్ని చెప్పాడు. పాతది మరచి వర్తమానానికి స్వాగతం పలకాలి. లేకుంటే అంతర్గతంగా ఎన్నో బాధలతో బాధపడతారని చెప్పవచ్చు. కొత్తవెలుగుల కోసం కవి స్వాగతం పలుకుతాడు. అలాగే పండుగ వచ్చినప్పుడు పరిస్థితిని గురించి. ఈ కవితలో

మనకి ఏమున్నదో ఏమి లేదో
పండుగకు ఏమి తెలుస్తుంది
పండుగకు కావాల్సింది గుండె
అది మనకుంది చెప్పు

బోయి భీమన్న సాహిత్య ప్రక్రియలో ప్రధానంగా మానవీయ దృక్పథాలు కనిపిస్తాయి వస్తువు ఏదైనా సామాజిక చైతన్యం, మానవత్వాన్ని ప్రేరేపించేలా రచనలు చేయడం జరిగింది.

అనాది నుండి అనంత తత్వంలోకి:

ఈ కవితాసంపుటిలో ఉన్న కవితలు సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తూ బడుగు జీవులలో వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ కవితలు చదువుతున్నప్పుడు సమస్త విశ్వం కళ్లముందు ప్రత్యక్షమవుతాయి. జీవితం మీద ప్రేమను కలిగిస్తుంది. జీవించడానికి సత్యాన్ని, జీవితాన్ని ప్రేమించమనే సందేశాన్ని ప్రసాదిస్తుంది. మానవ జీవితం వికసించాలి, పరిమళించాలి, ఫలించాలని, రసం, భావం, కవితలో ఇలా అంటాడు.

పురుషుడికి స్త్రీ అందం, స్త్రీకి పురుషుడు అందం
మనం ఇద్దరం లేకుంటే ప్రపంచం లేదు అంటాడు
సత్యం శివం సుందరం కవితలో
ప్రేయసిని సత్యం, శివం సుందరంగా
వర్ణిస్తారు. ఆమె తోడే లోకమని భావిస్తారు.

నీ దరహాస రుచికంటే సుందరం
నీ అనురాగ వీక్షణం కంటే శివం
నీ ఆనందం రూపం కంటే సత్యం
ఏముంది నాకు జగత్తులో నీవుతప్ప
ఏమున్నది జగత్తు ఇంట బయట.

ఈ విధంగా స్త్రీ, పురుషుల మధ్య ప్రేమ, అనుబంధాలు, ఆప్యాయతలు, వారి భావదృక్పథాన్ని మేళవించి జాగృత పరిచారు బోయి భీమన్న.

జానపదుని జాబులు:

ఇది లేఖా రచన. చదువు మీద ఆసక్తి ఉండి ఒక వ్యక్తి పేదరికం కారణంగా చదువు కొనసాగించలేకపోతాడు పట్నం నుండి తన పల్లెటూరుకు తిరిగి వెళ్తాడు పల్లెటూరులో తన జీవితం ప్రారంభిస్తాడు. ఎన్నో అవస్థలు కష్టనష్టాలు ఎదుర్కొంటూ అణువణువునా ఈ దీనస్థితి గురించి 1933లో ప్రజామిత్ర అనే పత్రికలో ప్రచురించడం జరిగింది భీమన్న. ధనవంతుడైన మిత్రుడికి ఉత్తరం రాయడం ప్రారంభిస్తాడు. పల్లెటూర్లో తన అవస్థల గురించి లేఖ ద్వారా సమ సమాజానికి ఆకాంక్ష, స్వార్థం నిరంకుశత్వాలపై పేదల తిరుగుబాటు చేయాల్సిన ఆవశ్యకతలపై జానపదుని జాబులో ఆనాటి పల్లెటూర్లు సాంఘిక సంస్కృతికి, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ఎంతో చక్కగా ఆవిష్కరించాడు భీమన్న. ధనికుల, భూస్వా ముల చేతుల్లో నిరుపేదల బతుకులు కీలుబొమ్మలుగా మారిపోయాయని తరాలు మారుతున్నప్పటికీ వాళ్ల కబంధ హస్తాలలో నుంచి బయటపడలేక కొట్టుమిట్టు ఆడుతున్నరు అని తెలియజేస్తాడు. మానవులకు బతుకుదెరువు కనిపించడం లేదు అంటూ బానిస సత్యాన్ని విడనాడి ధైర్య సాహసాలతో సమానత్వాన్ని సాధించుకోవాలని ఇలా సమసమాజ ఆకాంక్ష. ధ్యేయంగా భీమన్న జానపదుని జాబులో అనేక సంఘటనలను చిత్రించి చదువరుల కళ్లముందు ఆవిష్కరిస్తాడు.

ఒంటరిగొంతు కవిత సంపుటిలో:

ఒంటరిగొంతు కవితా ఖండికలో ప్రజా పాలన అభ్యున్నతి వర్ణ వైరుధ్యాల నిర్మూలన, కోల్పోతున్న మానవత విలువలు, మొదలైన కవితలు ఉన్నాయి. మానవ సంబంధాలు నెలకొల్పడమే విప్లవోద్యమానికి నాంది. అపురూపమైన అనుభవాన్ని ఆదర్శంగా లోకానికి అందించడమే ఈ కావ్య ఉద్దేశ్యం. సామాజిక పురోగమనానికి నాంది పలికిన సాహిత్యమే భీమన్న సాహిత్యం. మానవత్వం అనే కవితలో మానవత్వం అంటే హ్యూమనిజం. ఇతర జీవరాసుల వల్లనే మానవ జాతికి కూడా ఒక

విశిష్టలక్షణం ఉన్నదనుకొని మానవత్వం అన్నాను. నిజంగా మానవుడికి విశిష్ట లక్షణం ఉన్నదా లేదనే నా ఉద్దేశ్యం అంటూ కవి తన ఆవేశాన్ని ప్రదర్శిస్తాడు.

మనిషిలో మానవత్వం చచ్చిపోయిందని కవి బాధ. అందుకే తన సాహిత్య రచనల ద్వారా మానవత్వం కోసం నవసమాజ నిర్మాణాన్ని నిర్మించడమే లక్ష్యంగా భావించాడు బోయి భీమన్న. స్వేచ్ఛ అనే కవితలో తన ఇచ్చా కొనసాగడమే సుఖ జీవితం.

భయభక్తులు దానికి సంకెళ్లు. కులం పేరుతో, మతం పేరుతో, పౌరసత్వం పేరుతో, సంఘనీతి పేరుతో, వివిధ నాయకులు ప్రజల్ని పరిపాలిస్తున్నది. ఈ భయం, భక్తుల ఆయుధాలతోనే అని తెలియజేస్తున్నారు. స్వేచ్ఛ లేని మనిషి బతుకులకు నరకం. తాను కోరుకున్నది ఎప్పుడైతే జరుగుతుందో అప్పుడు మనిషి బతుకు సంతృప్తిగా ఉంటుంది. మనిషికి భయం ముసుగువేసి సంకెళ్లతో బంధిచేసి కుల, మతాల అడ్డగోడలు పెట్టి కొందరు నాయకులు ప్రజలని వంచన చేసి పరి పాలిస్తున్నారని అంటున్నాడు. భయం అనేది ప్రజలకు తెలియజేసి దాన్ని నాయ కులు తమ ఆయుధంగా చేసుకుంటున్నారని అంటున్నాడు ఇది మానవ అభివృద్ధికి విరోధకమని కవి ఆవేదన. నవోష కిరణాలు అనే కవితలో ఇలా అంటాడు.

ఇంతకు నువ్వు చెపుతున్నది నేను వివరిస్తున్నది ఏమిటి? సర్వమానవ సమతా ధర్మం జాతీయతను ప్రాతిపదికగా తీసుకొని దేశాలు ఏర్పడాలి.ప్రతిదేశం తన జాతీయతా ప్రకారం సర్వ మానవ సమతను ప్రభుత్వ ధర్మంగా స్వీకరించాలి.

సర్వమానవ సమతా ధర్మం సకలజాతి, ప్రజల ఐక్యత అని చాటి చెప్పాడు. ప్రతిదేశం, ప్రతి ప్రాంతం ఐక్యమత్యంగా ముందుకు నడవాలని అప్పుడే ప్రగతిని సాధించవచ్చు అని భీమన్న గారు సకల మానవ చైతన్య వికాసాన్ని సాధించాలని ఈ కవితలో తన మనోభావాలను వ్యక్తపరిచాడు.

బాలయోగీయం:

భీమన్న రచనలలో విలక్షణమైనది బాలయోగీయం ఇందులో ఒక మహాయోగి జీవితాన్ని(బాలయోగి అసలు పేరు సుబ్బారావు) చక్కటి కావ్యంగా మలిచాడు. భారతదేశం యోగ భూమి. ఎందరో యోగులు ఈ భూమి మీద పుట్టి ప్రపంచ ప్రజలను ప్రభావితం చేశారు. యోగవిద్యకు భారతదేశం పుట్టినిల్లు. యోగవిద్యలో పతంజలి రచించిన యోగదర్శనం ప్రామాణిక గ్రంథం. ఇందులో అష్టాంగాలు ఉన్నాయి.

వీటిని సద్గురువుల వద్ద శిష్యువులు క్రమ పద్ధతిలో నేర్చుకుంటారు. అట్లనే మన బాలయోగి కూడా సిద్దాసనం వేసుకొని నిద్రహారాలు మాని తపస్సు చేశాడు. బోయి భీమన్న బాలయోగీయం కావ్యంలో బాలయోగిని తీర్చిదిద్దడంలో ఆధ్యాత్మిక దృక్పతమే కాక, సామాజిక కోణం కూడా దాగి ఉంది. ఈ కావ్యంలో బాలయోగి కల్పిత పాత్ర కాదు తన సమకాలంలో జీవించిన ఒక మహాయోగి చరిత్ర. ఈ కావ్యంలోని, సమాజంలోని కుళ్లును కడిగి పారేశాడు. అన్నం మానుకున్న బాలయోగిని అనుమానించిన వారిని అన్నాన్ని దోచుకునేవారిని అడ్డుకోలేక పోయారని అన్నాడు ఈ విధంగా

అన్నము మానుకొన్న నిన్ను ఆరడి సేయునె కానీ లోక
మందున్న సమస్త అన్నమును,
దోచుక దాచుక తామే మెక్కబోయిన
దున్నల నేమి సేయవు నెపుడైనను,

అని బాలయోగిని అనుమానించిన వారిని ప్రశ్నించాడు భీమన్న.

ఈ విధంగా ఈ కావ్యాన్ని ఆధ్యాత్మిక సామాజిక దృక్పథంతో రాశాడు భీమన్న.

గుడిసెలు కాలిపోతున్నై:

అజ్ఞానం నశించి చైతన్యం వెల్లివిరిసేలా పేదవాడి యదార్థ జీవన గమనానికి ప్రతీకగా ఆయన రచనలలో ప్రతి అక్షరం ప్రతి వాక్యంలో మానవవికాసాలకు ప్రతీకగా కనిపిస్తున్నాయి. గుడిసెలు కాలిపోతున్నై కవితా ఖండికలో ఇలా అంటాడు.

గుడిసెలు కాలిపోతున్నాయా
ఓహో కాలిపోతున్నయి,
ఎవరి గుడిసెలో పాపం,
మాలమాదిగలవై ఉంటాయి,
గుడిసెలు మరెవరికి ఉంటాయి.

పై కవితను గమనించినట్లయితే ప్రశ్నించే తత్వం వ్యక్తం అవుతుంది. ఎందుకంటే బడుగు బలహీన వర్గాలపై అగ్రవర్ణాల వారు పెత్తనం చెలాయిస్తూ వారి అభివృద్ధిని కానీయకుండా, తొక్కేయాలని చూస్తుంటారు. అందుకే తనలో తాను ప్రశ్నించుకుంటూ సమాధానం చెప్పుకున్నాడు. అదేవిధంగా మళ్ళీ తన భావాలను ఈ విధంగా వ్యక్తపరుస్తాడు.

చాలామందికి ఉంటాయిలే అసలు ఈ దేశ ధర్మమే అంత. అయితే ఈ గుడిసెలు ఏడాదికి ఒక్కసారైనా కాలిపోతుంటాయి. బడుగు బలహీన వర్గాల వారి యొక్క ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వారికే కదా గుడిసెలు ఉండేవి.తన అభిప్రాయాలను సూటిగా చెప్పడం భీమన్న నైజం.

కాలం మారుతున్న కొద్ది అసమానత తీరులు రూపాంతరం చెందుతూనే ఉన్నాయి తప్ప పూర్తిగా సమసిపోయినట్లు లేదు. అంతరించి పోలేదులే అని గుర్తుచేస్తూ భీమన్న గారు ఎంతో లోతుగా అధ్యయనం చేసి ఆ సంఘటనలనే వస్తువుగా స్వీకరించి సమస్యలను ఎత్తిచూపడంతో పాటు పరిష్కార మార్గాన్ని కూడా చూపుతూ సమాజం యొక్క ఔన్నత్యం మానవ వికాసంతోనే ఉంటుందని ఆయన కవిత్వంలో, రచనలలో మానవీయ కోణాలు దర్శనమిస్తూ ఉంటాయి. వస్తువు ఏదైనా మానవీయ కోణాన్ని చూపించడం భీమన్న తన రచనలలో ప్రత్యేకత మానవ వికాసానికి దిక్సూచిగా నిలిచాయి. ఆయన రచనలు. నేటి సమాజంలో కూడా అన్యాయం, అక్రమం, స్వార్థం, నిరంకుశత్వం పారదోలాలంటే మానవ వికాసానికి భీమన్న సాహిత్యం దిక్సూచిగా, మార్గదర్శకంగా ఉంటుంది. ఆయన సాహిత్యం నేటికి, భావితరాలకు, మానవవికాసాలకు దిక్సూచి. ఆయన ఆశయాలను కొనసాగిద్దాం.

ఆధారగ్రంథాలు:

1. జానపదుని జాబులు
2. పాలేరు నాటకం
3. ఉగాది కవితా సంపుటి
4. అనాది నుండి అనంతతత్వంలోకి
5. ఒంటరిగొంతు కవిత
6. గుడిసెలు కాలిపోతున్నై
7. బాలయోగీయం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న నాటక సాహిత్యంలో సామాజిక చైతన్యం

– బొడిగె అఖిల,
రీసెర్చ్ స్కాలర్ (JRF),
సెల్ : 9392538401

పరిచయం :

20వ శతాబ్దపు తెలుగు సాహిత్యంలో గౌరవించదగిన వ్యక్తుల్లో బోయి భీమన్న ఒకరు. సామాజిక చైతన్యాన్ని మేల్కొల్పే రచనలు చేసి ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించిన కళామూర్తి భీమన్న. వీరు అందించిన సాహిత్య స్రవంతి నిజంగా అద్వితీయం. భీమన్న రచనలను పరిశీలిస్తే, వేర్వేరు సిద్ధాంతాల ప్రకారం ఆయన దృక్పథాన్ని అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ఆయనలో నాస్తికత్వం, హేతువాదం, మానవతావాదం, దళితవాదం, గాంధేయవాదం, అంబేద్కర్ వాదం ఇలా అనేక కోణాలు కనిపిస్తాయి. భీమన్న యొక్క అనేక దృక్పథల్లో అత్యంత బలంగా కనిపించేది దళిత దృక్పథమే. ఆయన భావాలు సున్నితమైనవి, భాష అందమైనది ఆశయాలు అద్భుతమైనవి. ఆయన పద్యం, గద్యం, గేయం, శతకం, నవల, నాటకం, వచనం వంటి అనేక ప్రక్రియల్లో 70కి పైగా రచనలు చేశారు. భీమన్న కృషికిగాను కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారంతో పాటు పలు సన్మానాలు అందుకున్నారు.

ఆదికవి నన్నయ నుండి ఆధునిక కవి బోయి భీమన్న వరకు విశ్వ శ్రేయస్సు దృష్టిలో నిలుపుకొని సాహిత్య సృష్టిని చేసినవారే. నన్నయ జగత్ యొక్క హితము కోరి రచన చేశానని తెల్పితే, బోయి భీమన్న ఆర్థిక అంతరాలు లేని మానవ సమాజం కొరకు రచన చేశానని తెలిపారు. వాల్మీకి, వ్యాసుడు, అరుంధతి మొదలైన ప్రసిద్ధ పురాణ వ్యక్తులందరు హరిజనులు అన్నారు. సమాజంలో "హరిజనులు" అని పిలువబడే వర్గాల మనసుల్లో స్వాభిమానాన్ని నింపి, వారు సమాజంలో గౌరవానికి అర్హులని చెప్పడం ఆయన సాహిత్యపు ముఖ్యలక్ష్యం. సాహిత్యం ద్వారా ప్రజల్లో నూతన చైతన్యాన్ని

కలిగించడానికి ప్రజాస్వామ్యం, మానవతా దృక్పథం కలిగి, భవిష్యత్తు సమాజ వికాస పరిణామానికి భూమికగా పరిణమిస్తుంది అన్నది వారి ప్రగాఢ విశ్వాసం.

బోయి భీమన్న సాహిత్య దృక్పథం :

"నా కవితా లక్ష్యం
చీకట్లో బ్రతికే వాళ్ళను మెప్పించడం కాదు
వాళ్ళను తిట్టినా కొట్టినా సరే
అక్కడ నుండి లేపడం అరుణోదయం కేసి తరమడం"

Keywords : సమకాలీనత, రూపకం, అభ్యుదయం, కులనిర్మూలన, ప్రేమ, సామాజికత.

తెలుగు సాహిత్య చరిత్రలో దళిత వర్గానికి చెందిన బోయి భీమన్న ఎన్నో సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారు. అందులో నాటకం కూడా ఒకటి. భారతీయ సాహిత్యంలో నాటకానికి ఎంతో ముఖ్యమైన స్థానం ఉంది. రూపకాలలో నాటకం అత్యుత్తమమైనదిగా చెప్పబడింది. 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో పౌరాణిక, చారిత్రక, సాంఘిక ఇతివృత్తాలతో, సందేశాత్మక నేపథ్యంతో వెలువడే రూపకాల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాశ్చాత్య సంప్రదాయాల పరిచయంతో తెలుగు రంగస్థల కళ సరి కొత్తగా రూపాంతరం చెందినది. సంస్కృతంలో గద్యపద్య మిశ్రిమ నాటకాలున్నాయి. అట్లే బోయి భీమన్న తెలుగు నాటకాలలోను మిశ్రితాలున్నాయి.

బానిసతనమును బాపుమురా... భారత భూమికి భాగ్యము తేరా !
సకల దేశముల సర్వ మానవుల సామ్యము సాధింపుమురా !!

(పాలేరు పుట. 23)

అంటూ తన రచనలతో అణగారిన సమాజాన్ని ప్రేరేపించిన సమరసతా సాహిత్య సిద్ధాంతకర్త బోయి భీమన్న. పేదరికం, అంటరానితనం, అవమానాలస్వానుభావాలతో అక్షరాలే ఆయుధంగా అనుక్షణం ఉద్యమించిన సాహితీవేత్త. మానవుడు సంఘజీవి. అతని వ్యక్తిత్వ వికాసంపై సమాజ ప్రభావం పడకతప్పదు. అతని మానసిక స్థితి వల్ల సమాజంలో మార్పులు రాకమానవు. అలాంటి మార్పులతో ఉన్న సమాజ లక్షణమే సామాజికత అనవచ్చు. ఇలాంటి సామాజికత గల రూపకాలు బోయి భీమన్న రచించాడు. భీమన్న నాటకాల వల్ల ఆ కాలంలోని సామాజిక పరిస్థితులు పూర్తిగా వెలుగులోకి వచ్చాయి.

నాటక సాహిత్య సామాజిక చైతన్యం :

గురజాడవారి 'కన్యాశుల్కం', సుంకర వాసిరెడ్డిగార్ల 'ముందడుగు', 'మాభూమి' మొదలగు వాటిలో ధనికుల కుతంత్రాలు, దొంగసాక్ష్యాలు, పరస్త్రీపట్ల వ్యామోహం కథ వస్తువుగా ఉంటే, భీమన్న "పాలేరు" నాటకంలో ఆ కథావస్తువే ఓ ప్రత్యేకమైన వైవిధ్యంలో రచించబడింది. అందులో ప్రత్యేకమైన పాత్రలను సృష్టించారు భీమన్న, వాటిలో ఓ పాత్ర వెంకన్న. వాల్మీకికి రాముడు సమకాలీనుడు. వ్యాసుడికి ధర్మరాజు సమకాలీనుడు. నాకు పాలేరు వెంకన్న సమకాలీనుడు. ఇతివృత్తంలో సమకాలీనత, కావ్య నాయకుడిలో విశ్వమానవత, రచనా శిల్పంల రసభావ రమణీయత కనబరిచారు.

ఇది ఎన్నో వాస్తవ జీవితాలకు మార్గదర్శకమైనది. పాలేరు నాటకంలో వస్తువైవిధ్యంగా వెట్టిచాకిరిని రూపుమాపడం రచయిత ధ్యేయం. దానికి చదువే మార్గం అంటాడు భీమన్న.

"గోచిపెట్టుట నేర్చుకొనగానె బిడ్డకు చేతికి కర్రిచ్చు రైతులార
నడవ నేర్చుట తోడనె బుడతని గొంపోయి
పాలేరు తన ముంచు మాలలార
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించి మనుగడలే మాపు జనకులార
వంటయిల్లొ కటె ప్రపంచమ్ముగా చేసి తనయల తల్లులార
శక్తివిహీనమై చచ్చుచుండ కన్నులను మూసికొంటిరే గాధనిద్ర
శక్తికంతకు మూలము చదువుకొన బడికి బంపుడు మీ వంశవర్ధనులను"

(పాలేరు పుట. 29)

పాలేరు నాటక లక్ష్యం సాంఘిక విప్లవం, కొన్ని తరాలుగా కర్మ సిద్ధాంతం పేరుతో దళితుల్ని అగ్రవర్ణ భూస్వాములు వంచించిన తీరుతెన్నులను చూపిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలని, అంబేద్కర్ ఆశయాన్ని దీని ద్వారా ప్రేరేపించాడు రచయిత. నిజజీవితంలో అటు అంబేద్కర్, ఇటు భీమన్న ఇరువురి జీవితాశయాలు పాలేరు నాటకంలో కనిపిస్తాయి. ఆయన రచించిన పాలేరు నాటకంను 1940లో గ్రామాలలో ప్రదర్శించారు. ఆనాటికి ఇచ్చిన స్ఫూర్తితో దళితులు ఉన్నత విద్యను అభ్యసించి తర్వాతి తరాలకు స్ఫూర్తినిచ్చారు. కులాల అంతరాలవల్ల ఒక జాతి సంఘటిత శక్తి కోల్పోయిందన్న బాధ వారి రచనల్లో ప్రతిఫలిస్తుంది. సంఘ శ్రేయస్సును కాంక్షించి సంకుచిత తత్వాన్ని తొలిగించడం ఆవశ్యకమన్న అభిప్రాయం వీరి రూపకాల్లో ధ్వనిస్తుంది. మూఢ విశ్వాసాలతో కొన్ని సాంఘికమైన కట్టుబాట్లు, ఆచారాలు దురాచారాలుగా మారాయనే దృష్టి "కూలిరాజు" నాటకంలోనూ కనబడుతుంది.

"కులమత వర్గ భేదములు కూలిన వాటి కతీతులై ధరా
స్థలి నరులెల్ల నొక్కటని చాటుడు సర్వజనీన స్వామ్య సం
కలితా ప్రణాళిక పథక కర్తలు కార్మిక నాయకుల్ సమ
ర్థులు తవ వోట్లో సంగి రయి తుల్ గెలిపింపుడు శాంతికాములై" (కూలిరాజు పుట. 223)

ఈ నాటకం ద్వారా భీమన్న చెప్పదలచిన దార్శనికత ఏమిటంటే – కులవిభేదాలను రూపుమాపి ఏకైక సంఘటిత భారత జాతిని నిర్మించి భారతీయులందరికీ రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమానత్వాన్ని స్థాపించాలన్నదే అతని అభిమతం. దీనిని పరంజ్యోతి నాయిక పాత్ర ద్వారా తన గంభీర అభిప్రాయం తెలియజేశాడు.

భీమన్న గారు రాసిన నాటకం 'అసూయ' నాటకం నేటికీ ప్రజాజీవితాన్ని పీడిస్తున్న జాడ్యాలు ఈ నాటకంలో చక్కగా చిత్రించబడ్డాయి. ఇది 'విద్యార్థి కాంగ్రేసోద్యమ' నాటకం అని ఆయనే పేర్కొన్నారు. రాజకీయ రంగంలో విద్యార్థులు ప్రవేశించడం ఎంత అనర్థానికి దారి తీస్తుందో, ఈ నాటకం నర్మగర్భంగా తెలియజేస్తుంది.

"సత్యము నసత్యముగ చూప జాలుడొకడు.
లేని అపవాదులెన్నో కల్పించు నొకడు.
మంచి వాడని పదద్రోయ నెంచునొకడు
మానవత్వము నాశనమయి నేడు" **(అసూయ పుట. 287)**

అంటు సత్యము, అసత్యముగా చూపుతూ రాజకీయ రంగంలో విద్యార్థులు ప్రవేశించడం ఎంత అనర్థానికి దారి తీస్తుందో తెలియజేస్తూ, రాజకీయ నాయకులు తమ ప్రాబల్యం కోసం విద్యార్థులను పాచికలుగా ఉపయోగించుకునే తీరుతెన్నులు ఇందులో కనిపిస్తాయి. ఇలా సాంఘిక దోషాలను ఎత్తిచూపి మానవత్వపు విలువలను ప్రభోదించాడు. భీమన్న, కులవిభేదాలు విస్మరించి సమాజాన్ని చైతన్యవంతం చేయమని విద్యావంతులకు సూచించాడు.

భీమన్న పౌరాణిక ఇతివృత్తాన్ని సాంఘిక దృష్టితో "రాగవాసిష్ఠం" రచించాడు. తెలుగు జాతి మనసులో చోటు చేసుకోగలిగింది. దానికి కారణం దాని సుందరమైన భావసంపదలోని విశిష్టతయే. అసలు రాగవాసిష్టం అంటే వసిష్ఠుడి యొక్క అనురాగం, ప్రేమ, పెళ్లి అని అర్థం. ఇందు అరుంధతి ఒక దళిత స్త్రీగా చిత్రించబడింది. సృష్టిలో సమస్తం ప్రేమమయం. పుడమిపై ప్రేమరాజ్యం స్థిరపడాలని కొరుకునే వారిలో ముఖ్యుడు భీమన్న. ప్రేమకు కుల భేదాలు ఉండవు. మానవుల మధ్య ప్రేమాదరాలకు కులభేదం అనవసరమన్న సిద్ధాంతాన్ని రూపకం 'రాగవాసిష్ఠం'లో వ్యక్తం చేశాడు.

"పికము పాడుటకు వల్లిక పల్లవించుటకు
సంబంధమేమిటే సంధ్యాకుమారి?
పరిణతి జెందుచుందురు ఎవ్వరికి వారె
నవ మాసమందు నీ వా భేద మెచటిదె" **(రాగవాసిష్ఠం పుట. 24)**

రసస్ఫూర్తితో సాంఘిక చైతన్యం కోరుతూ రచించిన రూపకం "పైరుపాట". ఇందులోని గేయ కవిత్వం ఒక మూడ్ కల్పించగలదు. ఈ రూపకంలోని ముఖ్యమైన సమస్య సాంఘికమైనదే.

"సుకుమారపు కుసుమాలను సూదుల కర్పిస్తాడా
అడుగులపై పడు పూలను పద ద్రొక్కుకు పోతాడా.
ఎక్కడ పుట్టి నేమి ఎక్కడ పెరిగిన నేమి
కోరిన గుణమున్నపుడు కోసుకొమ్ము పుష్పమును" (పైరుపాట పుట. 542)

ఇంకా ఈ రూపకంలో అక్కడక్కడ వర్ణనలు, సూక్తులు కనిపిస్తాయి. మొత్తంమీద ఈ నాటకంలో ప్రధాన వస్తువు సాంఘికమే. ఎందుకంటే, అమాయకులైన వారిని పూలతో పోల్చడం, పూలకు సూదులు గ్రుచ్చడం, అమాయకులను బాధించడం లాంటివి సాంఘిక సమస్యలే గదా. పేదవాని ఇంట్లో పుట్టినా, కాని కులంలో పుట్టినా తనకు నచ్చిన గుణం వారిలో ఉంటే వారిని ఆదరించండి, గౌరవించండి అనే భావం మనకు 'పైరుపాట' రూపకం ద్వారా తెలుస్తుంది. ఇదీ ఒక సామాజికమైన భావనయే. అలా భీమన్న శిష్ట వ్యావహారికంలో తమ సాంఘిక, సామాజిక భావలను తన రచనల ద్వారా తెలియజేశాడు.

బోయి భీమన్నగారి వేదవ్యాసుడు, ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాధుడు – మొదలైన పౌరాణిక రూపకాలు సామాజిక స్పృహతో నూతన భావాలతో వెలువడ్డాయి. రచయిత ఈ నాటకాలలో హరిజనులు, గిరిజనులు ఆర్యులేనన్న విషయాన్ని నొక్కిచెప్పడానికి ప్రయత్నించారు. ఈ రూపకాలను పరిశీలిస్తూ డా. కొండపల్లి సుదర్శనరాజు గారు తన 'పౌరాణిక రూపకాలు–భావవిప్లవం' అనే సిద్ధాంత గ్రంథంలో "ఒక ప్రక్క కులవ్యవస్థను కూల్చడానికి ప్రయత్నిస్తూ రెండవ ప్రక్క హరిజనులు, ఆదిమ గిరిజనులు ఆర్యులని, ఆర్యఋషులంతా హరిజనులని ప్రబోధించడం ఆర్య బ్రాహ్మణ వర్ణాన్ని గొప్పవాటిగా భావించటమే అవుతుంది" అని పేర్కొన్నారు.

ఈ విధంగా భీమన్నగారు పౌరాణిక ఇతివృత్తానికి సమకాలీన సామాజికాంశాలను జోడించి మంచి నాటకాలు రాయడం చెప్పుకోదగ్గ అంశం. కొన్ని సంభాషణలు తన సృష్టి అయినప్పటికీ నాటకంలో ఇతివృత్తానికి, కథ కథనానికి, పాత్ర ప్రవర్తనకి చక్కగా అమరినట్లు చేయడం భీమన్న సామాజిక అవగాహన, సమతావాద భావానికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

ముగింపు :

ప్రజలను ప్రభావితం చేయగల శక్తి సాహిత్యానికే ఉంది. అందుకే రచయితగా భీమన్న తన కలాన్ని కాగడలా ఉపయోగించి, క్షీణించిన విలువలతో చీకటిలో మునిగిపోయిన వ్యవస్థకు వెలుగు బాటలు చూపించారు. బోయి భీమన్న తన మాతృభాష అయిన తెలుగులోనే కాక ఆంగ్లంలో కూడా కవితలు రచించారు. గ్రామీణ జీవనం, అక్కడి మనుషులు, అనుభవాలు, జ్ఞాపకాలు భీమన్న రచనలన్నింటిలోనూ ప్రతిఫలిస్తాయి. వేమన్నలాగే భీమన్న సహజకవి. ఆయన సాహిత్యం పండితులకు మాత్రమేకాక పామర జనానికీ సులభంగా అర్థమయ్యేలా, హృదయాన్ని హత్తుకునేలా ఉండి పాఠకులను ఆలోచింపజేస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. బోయి భీమన్న సాహిత్యం – దళిత దృక్పథం. (సదస్సు పత్రాలు) పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.
2. మరపట్ల, భాస్కరరావు. సామాజిక విలువల నేపథ్యంలో బోయి భీమన్న రూపకాలు విశ్లేషణాత్మక విమర్శ, విశాఖపట్నం : ప్రెస్ అండ్ పబ్లికేషన్స్, 2007.
3. జ్ఞానేశ్వర్ గనుమల (సంపా). బోయి భీమన్న సాహితీ షష్టిపూర్తి సంచిక, హైద్రాబాద్: సుఖేలానికేతన్, ఇర్రంమంజిల్ కాలనీ, 1983.
4. ఆవుల మంజులత (సంపా). బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సాంఘిక నాటకాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.
5. తక్కళ్ళ బాలరాజు. బోయి భీమన్న రూపకాలు – తాత్విక చింతన, వరంగల్ : పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, 1988.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

పాలేరు నాటకం – దళిత దృక్పథం

– గరిగంటి కృపాకర్,
రీసెర్చ్ స్కాలర్,
సెల్ : 6301597912

తెలుగు సాహిత్యంలో నాటకం అనేది సమాజంలోని అసమానతలను, దమన కాండలను, అణచివేతను ప్రశ్నించే శక్తివంతమైన మాధ్యమంగా ఎదిగింది. ముఖ్యంగా ఆధునిక కాలంలో రచయితలు దళితులు, అణగారిన వర్గాల జీవన వాస్తవాలను కేంద్రంగా చేసుకొని నాటకాలు రచించడం గమనించవచ్చు. ఈ క్రమంలో 'పాలేరు' నాటకం గ్రామీణ సమాజంలో దళితుల జీవితాన్ని, వారి శ్రమను, దోపిడీని, సామాజిక అణచివేతను తెలియచేసే ముఖ్యమైన నాటకంగా నిలుస్తుంది. దళిత దృక్పథంతో ఈ నాటకాన్ని పరిశీలించడం ద్వారా సమాజంలోని వర్గ,వర్ణ అసమానతలను అర్థం చేసుకోవచ్చు.

పాలేరు నాటకం – కథా నేపథ్యం

ఈ నాటకంలో ప్రధాన పాత్రలు : కుబేరయ్య, పుల్లయ్య, వెంకన్న, వానబాల, సుందరం.

'పాలేరు' నాటకం ప్రధానంగా గ్రామీణ వ్యవసాయ వ్యవస్థను నేపథ్యంగా తీసుకొని సాగుతుంది. భూస్వామ్య వ్యవస్థలో పాలేరుగా పనిచేసే దళితుడి జీవితం ఈ నాటకానికి కేంద్రబిందువు. భూమి లేని దళితులు తమ శ్రమను అమ్ముకొని జీవించాల్సిన పరిస్థితి, యజమానుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడిన జీవనం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. పాలేరు కేవలం ఒక వ్యక్తి కాదు అతడు దళిత సమాజానికి ప్రతీక. అతని జీవితంలో కనిపించే బాధలు, అవమానాలు, నిరాశలు మొత్తం దళిత వర్గం ఎదుర్కొనే సామాజిక అనుభవాలే.

పాలేరు నాటకంలో దళితుల జీవితం వాస్తవికంగా చిత్రించబడింది.ఆర్థిక దోపిడీ, తక్కువ జీతాలు, అప్పుల బానిసత్వం సామాజిక అణచివేత, కుల ఆధారిత వివక్ష, అవమానం మానసిక వేదన, స్వాభిమాన హరణ, భయ సంస్కృతి ఈ అంశాలన్నీ పాలేరు పాత్ర ద్వారా వ్యక్తమవుతాయి. యజమాని పాలేరు మధ్య సంబంధం యజమాన్యం దాస్యం సంబంధంగా రూపుదిద్దుకుంటుంది. ఇది కేవలం వ్యక్తిగత సంబంధం కాకుండా, వ్యవస్థాత్మక దోపిడీకి ప్రతీకగా నిలుస్తుంది.

దళిత దృక్పథం – భావాత్మకత

దళిత దృక్పథం అనేది సమాజాన్ని అణగారిన వర్గాల కోణంలో నుంచి చూడడం. డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక న్యాయం, సమానత్వ భావనలు దళిత విమర్శకు పునాది. పాలేరు నాటకాన్ని ఈ దృక్పథంలో పరిశీలిస్తే, నాటకం కేవలం కరుణను కలిగించడమే కాకుండా ప్రశ్నలను లేవనెత్తుతుంది. భూమి ఎవరిది? శ్రమకు విలువ ఎందుకు లేదు? కులం ఎందుకు శ్రమను నిర్ణయిస్తుంది? ఈ ప్రశ్నలన్నీ దళిత చైతన్యాన్ని రేకెత్తించే విధంగా నాటకంలో అంతర్లీనంగా ఉన్నాయి. పాలేరు పాత్ర దళిత చైతన్య ప్రతీక.

పాలేరు పాత్ర మొదట నిస్సహాయంగా, భయంతో కనిపించినా, క్రమంగా అతనిలో ఎదురు నిలబడే మనస్తత్వం వికసిస్తుంది. ఇది దళిత చైతన్య పరిణామాన్ని సూచిస్తుంది. ఆత్మగౌరవం, హక్కుల పట్ల అవగాహన, నిరసన భావన ఇవన్నీ పాలేరు పాత్రలో అభివృద్ధి చెందుతాయి. ఇది దళిత సాహిత్యానికి ముఖ్య లక్షణం. దళితుడు కేవలం బాధితుడిగా కాకుండా, ప్రశ్నించే వ్యక్తిగా మారడం ఈ నాటకంలోని ముఖ్యమైన మలుపు.

దళిత సిద్ధాంతం అనేది కేవలం సాహిత్య విశ్లేషణ పద్ధతి కాదు అది ఒక సామాజిక, రాజకీయ ప్రతిఘటన సిద్ధాంతం. డా.బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సమానత్వం, స్వాభిమానము, మానవ గౌరవం అనే మూల సూత్రాలపై ఇది ఆధారపడి ఉంటుంది.దళిత సిద్ధాంతం ప్రకారం కులం శ్రమను నిర్ణయిస్తుంది.

శ్రమ విలువ కులం ఆధారంగా తగ్గించబడుతుంది.

దళితుడి అనుభవమే సాహిత్యానికి ప్రాథమిక ఆధారం. ఈ సిద్ధాంతంలో పాలేరు నాటకాన్ని పరిశీలిస్తే, అది కేవలం గ్రామీణ దారిద్ర్య కథగా కాకుండా కుల ఆధారిత శ్రమ దోపిడీకి వ్యతిరేక ప్రకటనగా మారుతుంది.అనుభవమే ఆధారం దళిత సాహిత్య మూలసూత్రం.పాలేరు నాటకంలో కనిపించే అనుభవాలు ఊహాజనితమైనవి కావు అవి దళిత సమాజం శతాబ్దాలుగా అనుభవించిన జీవన వాస్తవాలు. పాలేరు పాత్ర ద్వారా రచయిత దళితుని ఆకలి, అవమానం, భయం, నిరంతర శ్రమ అన్నింటినీ అనుభవాత్మకంగా ఆవిష్కరిస్తాడు.

ఇది దళిత సిద్ధాంతంలో కీలకమైన అనుభవ ప్రామాణికతను నాటకం సాధిస్తుంది.

సాంప్రదాయ సాహిత్యం దళితుడిని కరుణకు పాత్రుడిగా చిత్రిస్తే, దళిత సిద్ధాంతం అతడిని ప్రతిఘటన చేసే వ్యక్తిగా చూస్తుంది.

పాలేరు నాటకంలో పాలేరు మౌనంగా బాధపడే వ్యక్తి నుంచి ప్రశ్నించే వ్యక్తిగా, ఆత్మగౌరవాన్ని కోరుకునే మనిషిగా మారడం దళిత చైతన్య వికాసానికి ప్రతీక.

ఇది అంబేద్కర్ గారు చెప్పిన “Educate, Agitate, Organize” సూత్రానికి సమాంతరంగా కనిపిస్తుంది.

భూస్వామ్య వ్యవస్థ – దళిత సిద్ధాంత విమర్శ:

పాలేరు నాటకం భూస్వామ్య వ్యవస్థపై తీవ్రమైన విమర్శ చేస్తుంది. భూమి ఉన్నవారికి అధికారం, భూమి లేనివారికి బానిసత్వం అనే వాస్తవాన్ని నాటకం స్పష్టంగా చూపిస్తుంది. దళితులు భూమితో సంబంధం లేకుండా చేయబడటం, వారి శ్రమను మాత్రమే వినియోగించుకోవడం సామాజిక అన్యాయంగా నాటకం ఆవిష్కరిస్తుంది. ఇది మార్క్సీయ దృక్పథంతో పాటు దళిత విమర్శకు దగ్గరగా ఉంటుంది.

నాటకంలో భాష – సంభాషణలు:

పాలేరు నాటకంలో ఉపయోగించిన భాష, సంభాషణలు గ్రామీణ దళితుల జీవనానికి దగ్గరగా ఉంటాయి. అలంకార భాషకు బదులు అనుభవ భాష కనిపిస్తుంది. ఇది నాటకానికి వాస్తవికతను చేకూరుస్తుంది. దళితుల బాధ, కోపం, నిరాశ, ఆశ అన్నీ భాషలో ప్రతిఫలిస్తాయి. పాలేరు నాటకం సామాజిక మార్పు దిశగా ఈ నాటకం సమాజాన్ని మార్చే శక్తిని కలిగి ఉంది. దళితుల సమస్యలను బహిర్గతం చేయడం ద్వారా పాఠకుడు / ప్రేక్షకుడు ఆలోచించాల్సిన అవసరాన్ని కలిగిస్తుంది. దళితుల విముక్తి, సమానత్వం, గౌరవం అనే భావనలు నాటకం ద్వారా ముందుకు వస్తాయి.

ముగింపు:

పాలేరు నాటకం దళిత దృక్పథంలో విశ్లేషించినప్పుడు, ఇది ఒక వర్గం బాధలను మాత్రమే కాకుండా మొత్తం సమాజంలోని అసమాన నిర్మాణాలను ప్రశ్నించే నాటకంగా కనిపిస్తుంది. దళితుడి శ్రమ, అణచివేత, చైతన్యం ఈ మూడు అంశాలు నాటకానికి ప్రాణం. దళిత విమర్శా సిద్ధాంతాలలో పాలేరు నాటకం సమకాలీన తెలుగు నాటక సాహిత్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇది దళితుల స్వరానికి వేదికగా, సామాజిక న్యాయానికి పిలుపుగా నిలిచిన సార్థకమైన నాటకం. దళిత సిద్ధాంత కోణంలో పరిశీలించినప్పుడు 'పాలేరు' నాటకం ఒక గ్రామీణ కథ కాదు. అది కుల ఆధారిత భారతీయ సమాజ నిర్మాణంపై దళిత ప్రతిఘటన పత్రం.

పాలేరు నాటకంలో దళితుడు తన శ్రమ, తన గౌరవం, తన హక్కుల గురించి మాట్లాడే స్థాయికి చేరుకున్నాడు. ఈ నాటకం దళిత సాహిత్య సిద్ధాంతాలకు బలమైన ఆధారంగా నిలుస్తుంది.

పాలేరు నాటకం దళితుడిని బాధితుడిగా కాకుండా, ప్రతిఘటన చేసే సామాజిక వ్యక్తిగా నిర్మించడం ద్వారా దళిత సిద్ధాంతాన్ని నాటకీయంగా ఆవిష్కరిస్తుంది.

ఆధార గ్రంథాలు:

1. డా.బోయి భీమన్న సమగ్ర సాహిత్యం. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ. హైదరాబాద్. 2008.
2. డా. బి. ఆర్. అంబేద్కర్. కులాల నిర్మూలన. (అనువాదం బోయి భీమన్న) హైదరాబాద్ బుక్ ట్రస్ట్. 2019.
3. భారతీయ సమాజం. తెలుగు అకాడమీ. హైదరాబాద్. 2018.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

డా. బోయి భీమన్న కవిత్వం - అణగారిన వర్గాల ఆర్తనాదం నుంచి విశ్వమానవ చైతన్యం

- జి. గిరి ప్రసాద్
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ
సెల్ : 7093733833

ఉపోద్ఘాతం :

తెలుగు కవిత్వ చరిత్రలో డాక్టర్ బోయి భీమన్న (1911 -1989) కు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆయన కవిత్వం కేవలం భావాల వ్యక్తీకరణ కాదు అది ఒక సామాజిక ఉద్యమం, ఒక మానవతా ప్రకటన. అణగారిన వర్గాల జీవితానుభవాల నుంచి పుట్టిన ఆర్తనాదం, సమానత్వం కోసం సాగే పోరాట స్వరం. మానవ గౌరవాన్ని ప్రతిష్టించే ఆలోచన. ఇవన్నీ ఆయన కవిత్వంలో ఏకకాలంలో దర్శనమిస్తాయి. భీమన్న కవిత్వం వ్యక్తిగత బాధను సామూహిక చైతన్యంగా మార్చిన అరుదైన ఉదాహరణగా నిలుస్తుంది.

ఆధునిక తెలుగు కవిత్వంలో సామాజిక వాస్తవికతకు, దళిత చైతన్యానికి, మానవతా వాదానికి బలమైన పునాదులు వేసిన కవిగా డా. బోయి భీమన్నను గుర్తించవచ్చు. ఈ వ్యాసంలో ఆయన కవిత్వంలోని ముఖ్య లక్షణాలు, భావ ధోరణులు, శైలి విశేషాలు, సామాజిక ప్రాధాన్యతలను విశ్లేషిస్తూ ఆయన కవిత్వం తెలుగు సాహిత్యానికి చేసిన కృషిని సమగ్రంగా పరిశీలించబడుతుంది.

విషయం :

1. **బోయి భీమన్న కవిత్వానికి నేపథ్యం :** డా. బోయి భీమన్న జీవితం కష్టాలతో నిండినది. పేదరికం, కుల వివక్ష, సామాజిక అవమానాలు ఆయనను చిన్ననాటి నుంచే వెంటాడాయి. ఈ అనుభవాలే ఆయన కవిత్వానికి ముడి పదార్థమయ్యాయి. చదువు ద్వారా ఎదిగి, విశ్వవిద్యాలయ స్థాయికి చేరుకున్నప్పటికీ, తన మూలాలను ఆయన మర్చిపోలేదు. తన వర్గం, తన ప్రజలు ఎదుర్కొన్న బాధలను కవిత్వంగా మలచి సమాజానికి అద్దం పట్టారు.

2. **అణగారిన వర్గాల స్వరం :** భీమన్న కవిత్వంలో ప్రధానంగా వినిపించే స్వరం అణగారిన వర్గాల స్వరం. దళితులు, శ్రమజీవులు, పేదలు ఎదుర్కొన్న అన్యాయాలు, అవమానాలు, దోపిడీ ఆయన కవిత్వంలో తీవ్రంగా ప్రతిఫలిస్తాయి. ఆయన కవితల్లో దుఃఖం మాత్రమే కాదు, తిరుగుబాటు కూడా ఉంది. బాధను అంగీకరించే నిస్సహాయత కాకుండా, దాన్ని ఎదిరించే ధైర్యం ఆయన కవిత్వానికి ప్రాణం.

3. **కుల వ్యవస్థపై విమర్శ :** భీమన్న కవిత్వం కుల వ్యవస్థపై చేసిన విమర్శ స్పష్టమైనది. కులం పేరుతో మనిషిని చిన్నచూపు చూడటం ఆయనకు అసహ్యంగా అనిపించింది. ఆయన కవిత్వంలో కులం ఒక అప్రజాస్వామిక శక్తిగా, మానవత్వాన్ని హరించే వ్యవస్థగా చిత్రితమవుతుంది. కులభేదాల వల్ల చీలిపోయిన సమాజాన్ని ఐక్యంగా మార్చాలనే తపన ఆయన కవిత్వంలో ప్రతిధ్వనిస్తుంది.

4. **మానవతావాద దృక్కోణం :** భీమన్న కవిత్వం దళిత చైతన్యంతో ప్రారంభమైనా, అక్కడితో ఆగిపోదు. అది విశ్వ మానవతావాదంగా విస్తరిస్తుంది. కులం, మతం, ప్రాంతం వంటి సంకుచిత పరిమితులను దాటి, ప్రతి మనిషిలోని గౌరవాన్ని గుర్తించే దృక్కోణం ఆయన కవిత్వంలో కనిపిస్తుంది. బాధపడే ప్రతి మనిషి ఆయన కవిత్వంలో తన ప్రతిబింబాన్ని చూసుకోవచ్చు.

5. **ప్రజా భాష – జానపద శైలి :** భీమన్న కవిత్వ శైలిలో ముఖ్యంగా కనిపించే లక్షణం ప్రజా భాష. క్లిష్టమైన శబ్దాల కంటే, ప్రజల నిత్య జీవితంలో వినిపించే సరళమైన పదాలను ఆయన ఉపయోగించారు. జానపద గేయాల ప్రభావం ఆయన కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సరళతే ఆయన కవిత్వాన్ని ప్రజలకు దగ్గర చేసింది. ప్రజల భాషలో రాసిన కవిత్వం ప్రజల గుండెల్లో నిలిచింది.

6. **భావ తీవ్రత – కవిత్వ శక్తి :** భీమన్న కవిత్వంలో భావ తీవ్రత అధికంగా ఉంటుంది. ఆయన కవితలు చదువుతున్నప్పుడు పాఠకుడు కేవలం చదువరే కాదు, అనుభవించే వ్యక్తిగా మారతాడు. బాధ, కోపం, ఆశ, తిరుగుబాటు – అన్ని భావాలు ఆయన కవిత్వంలో జీవవతంగా పలుకుతాయి. ఈ భావ తీవ్రత తీవ్రతే ఆయన కవిత్వానికి శక్తిని ఇస్తుంది.

7. **ఆశ – విముక్తి భావన :** భీమన్న కవిత్వం అంధకారంతో ఆగిపోదు. బాధల మధ్య ఆశను చూపిస్తుంది. అణచివేత నుంచి విముక్తి, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం ఆయన కవిత్వంలోని ముఖ్య లక్ష్యం. భవిష్యత్తుపై విశ్వాసం, మార్పు సాధ్యమనే నమ్మకం ఆయన కవిత్వాన్ని నిరాశ నుంచి ఆశ వైపు నడిపిస్తుంది. విముక్తి భావన రాజకీయ స్వేచ్ఛకే పరిమితం కాక, మానసిక, సామాజిక, ఆర్థిక విముక్తిని కూడా సూచిస్తుంది.

8. **దేశభక్తి మరియు జాతీయ చైతన్యం :** డా. బోయి భీమన్న కవిత్వంలో దేశభక్తి ఒక సున్నితమైనది కానీ లోతైన అంశంగా కనిపిస్తుంది. స్వాతంత్ర్య పోరాట కాలపు ప్రభావం ఆయన ఆలోచనలపై స్పష్టంగా ఉంది. దేశం స్వాతంత్ర్య మవ్వాలంటే ప్రతి పౌరుడి గౌరవం, సమానత్వం ఉండాలనే భావన ఆయన కవిత్వంలో ప్రతిధ్వనిస్తుంది.

9. **విద్యా – జ్ఞానం ద్వారా విముక్తి :** విద్యే సామాజిక మార్పుకు మూలాధారం అని భీమన్న గట్టిగా నమ్మారు. అజ్ఞానం అణచివేతకు కారణమైతే, జ్ఞానం విముక్తికి మార్గమని ఆయన కవిత్వం బోధిస్తుంది. యువతను ఆలోచన వైపు, చైతన్యం వైపు నడిపించే శక్తి ఆయన కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది.

10. **స్త్రీల పట్ల దృక్కోణం :** భీమన్న కవిత్వంలో స్త్రీలు కేవలం కరుణకు పాత్రలుగా కాక, సమాజ నిర్మాణంలో కీలక పాత్రధారులుగా దర్శనమిస్తారు. స్త్రీలపై జరిగే అణచివేతను ఆయన ప్రశ్నిస్తాడు. స్త్రీ విముక్తి లేకుండా సమాజ విముక్తి సాధ్యము కాదనే భావన ఆయన కవిత్వంలోని ముఖ్యాంశం.

11. **దళిత సాహిత్య ఉద్యమానికి పునాది :** దళిత సాహిత్య ఉద్యమం స్పష్టమైన రూపం దాల్చక ముందే భీమన్న కవిత్వం దళిత చైతన్యాన్ని బలంగా వ్యక్త పరిచింది. అందువల్ల ఆయనను దళిత కవిత్వానికి మార్గదర్శకుడిగా భావించవచ్చు. తరువాతి తరాల కవులకు ఆయన కవిత్వం ప్రేరణగా నిలిచింది.

12. **భీమన్న కవిత్వం – ఆధునిక తెలుగు సాహిత్యంలో స్థానం :** ఆధునిక తెలుగు కవిత్వంలో భీమన్నకు ప్రత్యేకమైన స్థానం ఉంది. భావ కవిత్వం నుంచి సామాజిక కవిత్వం వైపు జరిగిన పరిణామంలో ఆయన పాత్ర కీలకం. ప్రజల జీవితాలను కేంద్రంగా చేసుకున్న కవిత్వానికి ఆయన బలమైన పునాది వేశారు.

ముగింపు :

డా. బోయి భీమన్న కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. అది అణగారిన వర్గాల ఆర్తనాదమే కాక, సమానత్వం, మానవ గౌరవం కోసం సాగే పోరాట స్వరం. కుల వ్యవస్థ, సామాజిక వివక్షలపై ఆయన చేసిన ప్రశ్నలు నేటికీ ప్రాసంగికమే. ప్రజల భాషలో, ప్రజల జీవనానుభవాలతో రాసిన ఆయన కవిత్వం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. బోయి భీమన్న – కవితా సంపుటాలు, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ హైదరాబాద్, 1975.
2. బోయి భీమన్న – సాహిత్య వ్యాసాలు, విశాలాంధ్ర ప్రచురణ, విజయవాడ, 1982.
3. తెలుగు సాహిత్య చరిత్ర – ఆధునిక కవిత్వ విభాగం, సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, 1996.
4. ఎం.ఎం. వినోదిని – ఆధునిక తెలుగు కవిత్వం – సామాజిక దృక్కోణాలు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1998.
5. కాత్యాయనీ విద్మహే – దళిత సాహిత్యం : సిద్ధాంతం మరియు ఆచరణ, ఎమెస్కో పబ్లిషర్స్, హైదరాబాద్, 2004.
6. కే. సత్యనారాయణ – దళిత అధ్యయనాలు, ఓరియంట్ బ్లాక్ స్వాన్, హైదరాబాద్, 2011.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

దళిత-పేదల జీవన చిత్రణ - బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై కవిత

- డా. ఆర్. సంగీత,
సహాయ ఆచార్యులు
సెల్ : 9441159113

వ్యాససంగ్రహం

బోయి భీమన్నగారి గుడిసెలు కాలిపోతున్నై కవిత సమాజంలో అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న అన్యాయం, నిర్లక్ష్యం మరియు అసమానతలను ప్రతీకాత్మకంగా వ్యక్తపరుస్తుంది. గుడిసెలు కాలిపోవడం అనే ఒక సాధారణ సంఘటనను ఆధారంగా చేసుకొని పేదలు, దళితుల వంటి బలహీన వర్గాల జీవితాలు ఎప్పుడూ ప్రమాదంలో ఎందుకు ఉంటాయని కవి ప్రశ్నిస్తాడు. 'ఈ దేశపు ధర్మమే అంత' అన్న వ్యంగ్య వ్యాఖ్య ద్వారా అన్యాయం ఒక వ్యక్తి సమస్యగా కాక వ్యవస్థాత్మక సమస్యగా మారిపోయిందని స్పష్టంగా సూచిస్తారు. గుడిసెలు కాలిపోతే అవి మళ్లీ అదే పరిస్థితుల్లో ఎలా నిర్మించబడుతున్నాయో అన్న ప్రశ్న ద్వారా పేదరికం మరియు దోపిడి పునరావృతమయ్యే విషవలయాన్ని కవిత ఆవిష్కరిస్తుంది.

ఈ కవిత దార్శనిక స్థాయిలో చూస్తే సమాజంలో సమస్యలు ఎందుకు శాశ్వతంగా కొనసాగుతున్నాయో మన మనస్సాక్షిని ప్రశ్నిస్తుంది. విషవలయం అనే పదం ద్వారా అన్యాయం, నష్టం, మళ్లీ అదే దుస్థితి అనే నిరంతర చక్రాన్ని కవి ప్రతిబింబిస్తాడు. ఈ చక్రం ఆగిపోవాలంటే బాధితవర్గాలకు తమ స్థితిగతులపై అవగాహన, చైతన్యం, పోరాట సంకల్పం అవసరమని ఈ కవిత సూచిస్తుంది. అలాగే సమాజంలోని మిగతా వర్గాలు కూడా నిర్లక్ష్యాన్ని వీడి మానవత్వంతో స్పందించినపుడే నిజమైన మార్పు సాధ్యమవుతుందని భీమన్నగారి కవిత స్పష్టమైన సామాజిక సందేశాన్ని ఇస్తుంది.

Key Words:

బోయి భీమన్న, గుడిసెలు కాలిపోవడం, సామాజిక అన్యాయం, పేదల జీవన వేదన, సామాజిక చైతన్యం, మానవత్వ పిలుపు.

పరిచయం

పేదరికం, అంటరానితనం, అవమానాల స్వానుభవంతో అక్షరాలను ఆయుధంగా మలచి సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసిన సాహితీవేత్త బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 19న తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో దళిత పాలేరు కుటుంబంలో పల్లయ్య–నాగమ్మలకు జన్మించారు. పేదరికంతో పాటు అంటరానితనాన్ని అనుభవించారు, సహజంగానే వీటిని నిరసించారు. పద్య, గేయ, వచన, నాటకం వంటి పలు ప్రక్రియలను సృజించి దాదాపు 70కి పైగా పుస్తకాలను వ్రాసారు. వీరి పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కన్పిస్తుంది. అంబేద్కర్ వ్రాసిన కొన్ని రచనలను వీరు తెలుగులోకి అనువదించారు. వీరు వ్రాసిన "జయ జయ అంబేద్కర" దళితులకు జాతీయ గీతమై ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోందని డా॥ దార్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. భీమన్న రచనల్లో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే లక్షణం కన్పిస్తుంది. ఆయన కుల మతాల కంటే మానవత్వాన్ని ఆశించిన జాతీయవాది అని వారి రచనల ద్వారా గ్రహించవచ్చును.

వివరణ

"ప్రతిరోజూ సుప్రభాతం పాడితేనే కాని
దేవునికే మెలకువరాని ఈ దేశంలో
ఎంతటి ప్రసిద్ధ సత్యం కానీ – ఎవరో
అనుక్షణం జ్ఞాపకం చేస్తూనే ఉండాలి మనిషికి"

అంటారు. 'గుడిసెలు కాలిపోతున్నై గ్రంథంలో. అదే విషయాన్ని గుడిసెలు కాలిపోతున్నై' కవితలో పేదలకు జ్ఞాపకం చేసిన కవి బోయి భీమన్న. 'గుడిసెలు కాలిపోతున్నై! ఓహో, కాలిపోతున్నై అంటూ కాలిపోతున్న పేదల గుడిసెల్ని మన కళ్ల ముందు చిత్రించారు భీమన్న'. గుడిసెలు కాలిపోతున్నై సమాజంలోని అసమాన తలను, అన్యాయ పరిస్థితులను మరియు జీవన సత్యాలను కవితాత్మకంగా చూపించడమే కాదు వ్యక్తుల బాధ్యతను ప్రశ్నిస్తుంది.

ఎవరి గుడిసెలో పాపం – మాల మాదిగలవే అయి వుంటై! అన్న పంక్తులు దళిత, పేదల జీవన చిత్రణను సజీవంగా మన కళ్లముందు ఉంచుతాయి. అగ్రవర్ణాల వారు మేడలు, పక్కా ఇళ్లలో నివసిస్తు ఉంటారని గుడిసెలు కేవలం పేదలు, దళితులకు చెందినవై ఉంటాయని కవి అంటారు.

"చాలా మందికే వుంటైలే – అసలు ఈ దేశ ధర్మమే అంత!" ఈ పంక్తులలో భారతదేశంలో చాలా మందికి గుడిసెలే ఉంటాయని ఈ దేశం బీదదేశమని, మన దేశంలో బీదవారందరికి గుడిసెలే ఉంటాయని వారి గుడిసెలు సంవత్సరానికి ఒకసారైనా కాలిపోతుంటాయని అది మన భారతదేశ ధర్మమని కవి బోయి భీమన్న వ్యంగ్యంగా తెలియజేస్తారు.

'ఒకసారి కాలిపోయిన గుడిసెలు మరి మళ్ళీ కాలిపోవడానికి ఎక్కడ నుండి వస్తుంటై'

నిజంగానే తనకు సందేహం కలుగుతుందని. ఒకసారి కాలిపోయిన గుడిసెలు మళ్లీ మళ్లీ ఏటేటా కాలిపోవడానికి తిరిగి అవి ఎక్కడి నుండి వస్తుంటాయని కవి ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్న నిజంగా ఆలోచించతగ్గదే. కాలిపోయిన గుడిసెల స్థానంలో తిరిగి గుడిసెలు ఎక్కడి నుండి వస్తున్నాయి అని అందరి మనస్సులో ఆలోచనతో కూడిన ప్రశ్నల్ని రేకెత్తించారు.

'అవును నిజమే – ఎక్కడి నుంచి వస్తుంటై – అదే మన ధర్మంలోని రహస్యం, ధర్మసంస్థాపనార్థం' – పరమాత్మ గీతలో ధర్మసంస్థాపన కోసం ప్రతి యుగంలో తాను అవతరిస్తానని చెప్పాడు. అదేవిధంగా 'ఇక్కడ ప్రతి ఏటా గుడిసెలు కాలిపోవును' అనే ధర్మాన్ని నిలబెట్టడానికి అక్కడ తిరిగి గుడిసెలు నిర్మింపబడతాయని, అలా గుడిసెలు తిరిగి నిర్మింపబడడం మన ధర్మంలోని రహస్యమని కవి వ్యంగ్యంగా అంటారు.

ఈ గుడిసెలు మళ్లీ మళ్లీ అవతరిస్తుంటై! పోతుంటై పుట్టుకొస్తుంటై!

ఈ విషయం సాగడం ఎంతవరకు? రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసేవరకు!

గుడిసెలు ఇలా పుడుతూ ఉండడం, కాలిపోతూ ఉండడం, కాలిపోతూ ఉంటే తిరిగి పుట్టుకొని రావడం ఇదొక విషవలయమని భీమన్న భావన. గుడిసెలు కాలిపోవడం, తిరిగి నిర్మించడం, తిరిగి కాలిపోవడం వెనుక ఏదో కుతంత్రం, కుట్ర దాగి ఉన్నాయని కవి సందేహపడ్డారు. ఈ విషవలయం ఎన్నాళ్ళు సాగుతుందని కవి ప్రశ్నిస్తున్నారు. దీనిలోని రహస్యం గుడిసెవాసులకు తెలిసేవరకు ఇది ఇలాగే సాగుతుందని కవి తనే సమాధానం చెప్తున్నారు.

గుడిసెవాసులు తమ గుడిసెలు కాలిపోవడానికి గల కారణాలను తెలుసుకొని తమ గుడిసెల్ని అంటించే వారిని పట్టి కొట్టేవరకు ఇది ఇలాగే కొనసాగుతుందని కవి భావన. కాలిపోయిన గుడిసెల స్థానంలో ప్రభుత్వం పక్కా ఇళ్ళు నిర్మించేవరకు ఇది ఇలాగే సాగుతుంది. గుడిసెవాసులు తమకు పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని పట్టుపట్టే వరకు ఇది ఇలాగే కొనసాగుతుందని కవి సమాధానం ఇస్తారు.

ఈ కవితలో బోయి భీమన్న సమాజంలోని అసమానతలను, ప్రజల సమస్యలను, పేద ప్రజల జీవితాలను సూటిగా, వ్యంగ్యంగా, కవితాత్మకంగా ప్రతిబింబింపచేసారు. ఈ కవితలో నిర్లక్ష్యానికి గురవుతున్న బలహీనవర్గాల జీవన వాస్తవాలను తీవ్రంగా ప్రశ్నిస్తాడు. సాధారణంగా కనిపించే ఒక సంఘటనను గుడిసెలు కాలిపోవడం కేంద్రంగా చేసుకొని దాని వెనుక దాగి ఉన్న సామాజిక వ్యవస్థను, మానవ విలువల పతనాన్ని మరియు పునరావృతమయ్యే అన్యాయాన్ని ఈ కవిత బహిర్గతం చేస్తుంది.

కవిత ప్రారంభంలోనే 'గుడిసెలు కాలిపోతున్నై' అనే వాక్యం ద్వారా కవి ఒక సాధారణ వార్తలా అనిపించే విషయాన్ని ప్రస్తావిస్తాడు. కాని వెంటనే 'ఎవరి గుడిసెలు?' అనే ప్రశ్నతో పాఠకుల్ని ఆలోచనలో పడేస్తాడు. 'అవి మాల మాదిగల గుడిసెలే అయి ఉంటాయని చెప్పడం ద్వారా సమాజంలో

నష్టపోయేది ఎప్పుడూ, పేదలు, దళితులు, అణగారిన వర్గాల వారేనని స్పష్టంగా తెలియచేస్తాడు. ఇక్కడ కవి వర్ణవ్యవస్థ, సామాజిక వివక్ష మరియు సమాజ అసమానతలను సూటిగా ఎత్తిచూపుతాడు.

'గుడిసెలు మరెవరికుంటై' అని ప్రశ్నిస్తూ, ఈ దేశపు ధర్మమే ఇలాంటిదని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తాడు. అన్యాయం అనేది ఒక వ్యక్తి తప్పుగా కాకుండా వ్యవస్థాత్మక సమస్యగా మారిపోయిందని భావం. పేదల ఇళ్ళు కాలిపోవడం సమాజానికి ఒక సాధారణ సంఘటనలా మారిందని, దానిపై బాధ్యత అనేది లేకపోవడాన్ని కవి తీవ్రంగా ఖండిస్తాడు.

కవిత చివర్లో రహస్యం గుడిసెవాసులకు తెలిసేవరకు అని చెప్పడం ద్వారా తమపై జరుగుతున్న అన్యాయం ఏమిటో, దానికి ఎదురు నిలబడే శక్తి తమలోనే ఉందని గుడిసెల్లో నివసించే ప్రజలకు తెలిసేవరకు ఈ అన్యాయం కొనసాగుతూనే ఉంటుంది. అవగాహన, చైతన్యం మరియు పోరాటమే ఈ విషవలయాన్ని తెంచగల మార్గమని కవి దార్శనికంగా సూచిస్తాడు.

ముగింపు :

బోయి భీమన్నగారి 'గుడిసెలు కాలిపోతున్నై' కవిత సమాజంలోని అన్యాయ వ్యవస్థపై వేసిన తీవ్రమైన ప్రశ్న. గుడిసెలు కాలిపోవడం కేవలం ఒక సంఘటనగా కాక, అణగారిన వర్గాలపై పదే పదే జరుగుతున్న అన్యాయానికి ప్రతీకగా ఈ కవిత నిలుస్తుంది. సమస్యలు పునరావృతం అవుతున్నాయంటే, వాటిని సృష్టిస్తున్న సామాజిక వ్యవస్థను మనం ఇంకా మార్చలేకపోతున్నామనే కఠిన సత్యాన్ని కవి మనముందుంచాడు.

ఈ కవిత ద్వారా బాధితుల దుస్థితిని కేవలం జాలి చూపుతో చూడడం సరిపోదు. అన్యాయానికి మూలమైన వ్యవస్థను ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిది. గుడిసెల్లో నివసించే ప్రజలకు తమ హక్కులపై అవగాహన కలిగి, తమపై జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఎదిరించే చైతన్యం వచ్చినప్పుడే ఈ 'విషవలయం' తెగిపోతుంది. అలాగే సమాజంలోని మిగతా వర్గాలు కూడా నిర్లక్ష్యాన్ని వీడి, మానవత్వంతో స్పందించినపుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. అంతిమంగా 'గుడిసెలు కాలిపోతున్నై' కవిత సమాజానికి ఒక హెచ్చరిక, చైతన్యవంతమైన పిలుపు. అన్యాయం సహజమైపోయిన సమాజాన్ని మార్చివేయాలనేది భీమన్నగారి ఆకాంక్ష ఈ కవితలో ప్రతిధ్వనిస్తుంది. ఈ కవిత ద్వారా మనం గ్రహించాల్సింది ఒక్కటే, గుడిసెలు మళ్ళీ మళ్లీ కాలిపోకుండా ఉండాలంటే సమాజపు ఆలోచనా విధానం మారాలి. ఇదే ఈ కవిత ఇచ్చే శక్తివంతమైన సందేశం. ఈ కవిత సమాజంలో చైతన్యం, బాధ్యత మరియు మానవత్వం అవసరమని బలంగా తెలియచేస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. బోయి భీమన్న పీఠికలు భాగం–1, డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్–500004.
2. సాహితీ కిన్నెర, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలుగు అకాడమి, హైదరాబాద్.
3. https://www.boibhimanna.com

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న 'ప్రగతి' నాటకంలోని సామాజిక అంశాల విశ్లేషణ

– పొన్నగంటి ప్రభాకర్,
తెలుగు ఉపన్యాసకులు
సెల్ : 8686306306

తెలుగు సాహిత్యంలో అభ్యుదయ, విప్లవ భావాలను సామాజిక కోణంలో విశ్లేషించిన మహాకవి, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న. ఆయన కేవలం అక్షరాలను పేర్చిన కవి కాదు, అక్షరాన్నే ఆయుధంగా మార్చిన సామాజిక శస్త్రవైద్యుడు. ఆయన కలం నుండి జాలువారిన అనేక రచనల్లో 'ప్రగతి' నాటకం ఒక మైలురాయి. కేవలం వినోదం కోసం కాకుండా, సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ, ఒక నూతన సామాజిక వ్యవస్థకు పునాదులు వేయాలనే తపన ఈ నాటకంలో ప్రతిబింబిస్తుంది.

ఈ నాటకానికి భీమన్న గారు రాసిన 'ప్రగతి పథం' అనే పీఠికే ఈ రచనకు ప్రాణవాయువు వంటిది. రచయిత దృష్టిలో 'ప్రగతి' అంటే కేవలం కాలం గడవడం కాదు,మానవ మేధస్సుతో, సంస్కారంతో ప్రకృతిని మలుచుకుంటూ సాగించే ప్రయాణం. "సత్యమే నిజమో.. నిజమే సత్యమో" అని విశ్లేషిస్తూ, మనిషిని మనిషిగా గుర్తించే 'రసాద్వైత' స్థితిని ఆయన ప్రగతిగా పేర్కొన్నారు.

పదహారేళ్ల క్రితం 'లక్కీ కుమారి'గా మొదలై, సామాజిక పరిణామాల నేపథ్యంలో 'ప్రగతి'గా రూపాంతరం చెందిన ఈ నాటకం కుల వ్యవస్థ నిర్మూలన, స్త్రీలకు ఆస్తి హక్కు, ఆర్థిక సమానత్వం మరియు దళిత చైతన్యం వంటి విప్లవాత్మక అంశాలను చర్చిస్తుంది. సంస్కరించబడిన సమాజం ఎలా ఉండాలో సూచించే 'సూత్ర గ్రంథం'గా ఈ నాటకాన్ని మనం పరిగణించవచ్చు. చాలామంది రచయితలు సమస్యలను కేవలం ఎత్తి చూపుతారు, కానీ భీమన్న గారు సమస్యకు పరిష్కారాన్ని కూడా సూచించారు. 'ప్రగతి' నాటకంలో ఆయన కేవలం కుల వ్యవస్థను తిట్టలేదు, "కుల మార్పిడి చట్టం" కావాలని ఒక ఆచరణాత్మకమైన పరిష్కారాన్ని ప్రతిపాదించారు. ఆయన ఆలోచనలు ఆయన కాలం కంటే చాలా ముందున్నాయి.

కులం పుట్టుక – చారిత్రక పరిణామం :

భీమన్న గారి ప్రకారం, కులం అనేది ప్రారంభంలో వృత్తిని బట్టి, వ్యక్తి యొక్క గుణగణాలను బట్టి ఏర్పడింది. కానీ కాలక్రమేణా అది 'పుట్టుక'తో వచ్చే సంకుచిత వ్యవస్థగా మారిపోయింది. ఈ పుట్టుకతో వచ్చే కుల వ్యవస్థే హిందూ సమాజం లేదా ఆర్షజాతి పతనానికి ప్రధాన కారణమని ఆయన ఈ నాటకంలో బలంగా నొక్కి చెప్పారు.

కుల మార్పిడి – ఒక వినూత్న ప్రతిపాదన :

సాధారణంగా ఒక మతం నుండి మరొక మతంలోకి మారే వెసులు బాటు ఉన్నట్లే, ఒక కులం నుండి మరొక కులానికి మారే చట్టబద్ధమైన అధికారం వ్యక్తికి ఉండాలని ఆయన ప్రతిపాదించారు. ఎవరైనా సరే తమ సంస్కారం, విద్య, వృత్తిని బట్టి తమకు నచ్చిన కులాన్ని ఎంచుకునే హక్కు ఉండాలని ఆయన వాదించారు. ఇది సమాజంలో అంతరాలను తగ్గించడానికి ఒక మార్గమని ఆయన భావించారు.

దళిత చైతన్యం మరియు వీరభద్రుడు

నాటకంలో అన్యాయం మరియు కుల వివక్షపై తిరుగుబాటు చేసే శక్తినే ఆయన "వీరభద్రుడు" గా చిత్రీకరించారు. దళిత జన సమైక్య శక్తే వీరభద్రుడని, ఈ శక్తి మేల్కొన్నప్పుడే కుల రక్కసి అంతమవుతుందని ఆయన వివరించారు. దళితులు కేవలం బాధితులుగా మిగిలిపోకుండా, సమాజాన్ని సంస్కరించే శక్తిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

ఏక జాతి ఆవిర్భావం :

కులాల మధ్య ఉన్న అడ్డుగోడలు కూలిపోయినప్పుడే భారతీయులందరూ ఒకే జాతిగా (ఏక జాతి) అవతరిస్తారని భీమన్న గారు ఈ నాటకం ద్వారా ప్రబోధించారు. కులం పేరుతో మనుషుల మధ్య దూరం పెంచడం అభివృద్ధికి నిరోధకమని ఆయన వాదన.

సంస్కరణ మార్గం :

కుల నిర్మూలన అనేది కేవలం ఉపన్యాసాలతో సాధ్యం కాదని, అది ఆర్థిక సమానత్వంతో మరియు చట్టబద్ధమైన మార్పులతోనే సాధ్యమవుతుందని ఆయన నాటకంలోని పాత్రల ద్వారా పలికించారు. కులం కంటే మానవత్వం గొప్పదనే సందేశాన్ని 'ప్రగతి' నాటకం అంతటా మనం చూడవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, భీమన్న గారు కులాన్ని ఒక సామాజిక రుగ్మతగా చూశారు మరియు దానిని మేధోపరమైన, చట్టపరమైన పోరాటాల ద్వారా మాత్రమే రూపుమాపగలమని ఈ నాటకంలో ప్రతిపాదించారు.

ఆర్థిక స్వాతంత్ర్యం – అస్తి హక్కు:

భీమన్న గారి దృష్టిలో స్త్రీల అణచివేతకు ప్రధాన కారణం వారి ఆర్థిక పరాధీనత. స్త్రీ పురుషుడిపై ఆధారపడి ఉన్నంత కాలం ఆమెకు పూర్తి స్వేచ్ఛ లభించదని ఆయన నమ్మారు. అందుకే ఆయన ఈ నాటకంలో ఒక విప్లవాత్మక ప్రతిపాదన చేశారు.

సమాన ఆస్తి హక్కు:

తండ్రి ఆస్తిలో కొడుకులతో పాటు కూతుళ్లకు కూడా సమానమైన వాటా చట్టబద్ధంగా లభించాలి.ఇలా ఆస్తిలో భాగం లభించినప్పుడు స్త్రీకి ఆర్థిక భద్రత చేకూరుతుందని, తద్వారా ఆమె సమాజంలో ఎవరికీ తలవంచకుండా జీవించగలుగుతుందని భీమన్న వివరించారు.

సాధారణంగా స్త్రీలను 'అబలలు' (శక్తి లేనివారు) అని పిలుస్తారు. కానీ భీమన్న ఈ నాటకం ద్వారా ఆ భావనను తప్పుబట్టారు. స్త్రీలు శారీరకంగా, మేధోపరంగా పురుషులకు ఏమాత్రం తీసిపోరని ఆయన నిరూపించారు. నాటకంలో స్త్రీ పాత్రలు క్రీడలలో, యుద్ధ విద్యలలో మరియు శారీరక శ్రమలో పురుషులతో పోటీ పడి విజయం సాధించడం ద్వారా 'స్త్రీ శక్తి' ని చాటి చెప్పారు.

వరకట్న దురాచారంపై పోరాటం :

వరకట్న సమస్య అనేది కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదు, అది ఆర్థిక అసమానతలతో ముడిపడి ఉందని భీమన్న గుర్తించారు. స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించడం ద్వారా వరకట్న దురాచారాన్ని సహజంగానే అరికట్టవచ్చని ఆయన ప్రతిపాదించారు. స్త్రీ తన స్వయంప్రతిపత్తిని చాటుకున్నప్పుడు కట్నకానుకల అవసరమే ఉండదని ఆయన వాదన.

సామాజిక హోదా మరియు గౌరవం :

స్త్రీ పురుషుడికి కేవలం 'అర్ధాంగి' (సగం భాగం) మాత్రమే కాదు, ఆమె ఒక స్వతంత్ర వ్యక్తిత్వం గల మనిషి. పురుషుడు స్త్రీని తన ఆస్తిగానో లేదా తక్కువ వ్యక్తిగానో చూడకూడదని, ఒక మిత్రుడిలా, సమాన హక్కులు గల పౌరురాలిలా గౌరవించాలని భీమన్న ఈ నాటకం ద్వారా సందేశాన్ని ఇచ్చారు. పెళ్లి తర్వాత కూడా స్త్రీ తన ఇష్టానుసారం వృత్తిని, కులాన్ని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

సంస్కారం మరియు విద్య :

స్త్రీ ప్రగతికి విద్యే మూలమని భీమన్న నమ్మారు. విద్య ద్వారా లభించే సంస్కారం స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, తద్వారా వారు సమాజంలోని మూఢనమ్మకాలను, వివక్షను ఎదిరించగలరని ఆయన వివరించారు.

జాతీయీకరణ – అసమానతల నిర్మూలన :

భీమన్న గారి ఆర్థిక సిద్ధాంతంలో 'జాతీయీకరణ' అత్యంత కీలకమైన అంశం. సమాజంలో కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో సంపద కేంద్రీకృతమై ఉండటం వల్లనే పేదరికం, దోపిడీ పెరుగుతాయని ఆయన భావించారు.

భూమి జాతీయీకరణ :

భూమి అనేది ప్రకృతి ప్రసాదించిన వనరు. దానిపై ఎవరికీ వ్యక్తిగత యాజమాన్యం ఉండకూడదు. సాగు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, అందరికీ సమానంగా పని కల్పించాలని

ఆయన ప్రతిపాదించారు. నిత్యావసర వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు, రవాణా మరియు కమ్యూనికేషన్ వ్యవస్థలు ప్రభుత్వ నియంత్రణలోనే ఉండాలి. దీనివల్ల ప్రైవేట్ వ్యక్తుల లాభాపేక్ష తగ్గి, సామాన్యులకు తక్కువ ధరకే వస్తువులు అందుతాయని ఆయన వాదించారు.

గ్రామాల పునర్వ్యవస్థీకరణ:

చిన్న చిన్న పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ఖర్చుతో కూడుకున్న పని అని భీమన్న భావించారు. అందుకే ఆర్థికంగా లాభదాయకమైన 'పెద్ద గ్రామాల' (Large Settlements) ఏర్పాటును ఆయన ప్రతిపాదించారు. పది చిన్న పల్లెలను కలిపి ఒక పెద్ద పట్టణం లేదా విలేజ్ సిటీగా మార్చడం ద్వారా విద్య, వైద్యం, విద్యుత్ వంటి వసతులను తక్కువ ఖర్చుతో అందించవచ్చని ఆయన సూచించారు.ఇది వనరుల దుర్వినియోగాన్ని తగ్గించి, గ్రామాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది.

పనికి తగ్గ వేతనం – శ్రమ గౌరవం :

నాటకంలో భీమన్న గారు 'శ్రమ'కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. శారీరక శ్రమ చేసేవారికి, మేధో శ్రమ చేసేవారికి మధ్య వేతన వ్యత్యాసాలు తగ్గాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ వారి సామర్థ్యం మేరకు పని, పనికి తగిన కనీస వేతనం అందేలా ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన వివరించారు.

ఉచిత సేవలు – ప్రభుత్వ బాధ్యత :

విద్య మరియు వైద్యం వంటి ప్రాథమిక అవసరాలను ప్రభుత్వం ఉచితంగా అందించినప్పుడే, పేదవారిపై ఆర్థిక భారం తగ్గుతుందని ఆయన నమ్మారు. దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, వారు దేశ ప్రగతిలో మెరుగైన పాత్ర పోషించగలుగుతారని ఆయన విశ్లేషించారు.బోయి భీమన్న గారు 'ప్రగతి' నాటకం ద్వారా ఒక 'సామ్యవాద తరహా' ఆర్థిక వ్యవస్థను కలగన్నారు. వ్యక్తిగత స్వార్థం కంటే సాముదాయక శ్రేయస్సు ముఖ్యం అనేది ఆయన సందేశం. ఆనాడు ఆయన చేసిన జాతీయీకరణ మరియు సమాన ఆస్తి హక్కు వంటి ప్రతిపాదనలు, నేటి ఆధునిక ఆర్థిక సంస్కరణలకు సైతం దిక్సూచిగా నిలుస్తాయి.

నిజం – సత్యం (రసాద్వైతం) :

భీమన్న గారు పీఠిక ప్రారంభంలోనే శంకరాచార్యుల 'సత్యం – అద్వైతం' అనే వాదనను ప్రస్తావిస్తూ, తనది 'నిజం – రసాద్వైతం' అని చెప్పారు. సత్యం అనేది మారదు, కానీ నిజం అనేది కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉంటుంది. ఏది నిజమో, ఏది సత్యమో విడమర్చి చెప్పి మానవుడిని అమృతత్వానికి (ఉన్నత స్థితికి) తీసుకెళ్ళేదే ప్రగతి అని ఆయన తాత్విక చింతన చేశారు.

దళిత జన సమైక్య శక్తి (వీరభద్ర విజయం) :

ఈ నాటకంలో ఒక ఆధ్యాత్మిక రూపకాన్ని సామాజిక విప్లవానికి ప్రతీకగా వాడారు. దక్షుడిని (అహంకారానికి ప్రతీక) శిక్షించడానికి పుట్టిన వీరభద్రుడు, భీమన్న గారి దృష్టిలో 'దళిత జన సమైక్య

శక్తి'. సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను ఎదుర్కోవడానికి అణగారిన వర్గాలన్నీ ఏకమైతే కలిగే శక్తినే ఆయన వీరభద్రుడిగా వర్ణించారు. ఇది కేవలం ఒక పురాణ కథ కాదు, ఒక సామాజిక హెచ్చరిక.

వయస్సు – సంస్కారం :

ప్రగతి అంటే కేవలం వయస్సు పెరగడం కాదు. ఒక వ్యక్తి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు జరిగే భౌతిక మార్పులను 'గతి' అని, ఆ కాలంలో అతను పొందే జ్ఞానం, నేర్చుకునే సంస్కారం, సమాజానికి చేసే మేలును 'ప్రగతి' అని ఆయన వేరు చేశారు. అంటే, చదువుకున్న ప్రతివాడూ ప్రగతిశీలి కాదని, సామాజిక స్పృహ ఉన్నవాడే నిజమైన ప్రగతి పథంలో ఉన్నాడని ఆయన వాదన.

మతాతీత మానవత్వం :

భీమన్న గారు మతాల కంటే మానవత్వానికి పెద్దపీట వేశారు. "మతమూ వద్దు, దేవుడూ వద్దు, నీతి బోధలూ వద్దు.. మానవుణ్ని మానవుడుగా గుర్తిద్దాం" అని ఆయన నినదించారు. సమాజంలో మనిషిని కులం, మతం రంగుల్లో చూడకుండా, కేవలం 'మనిషి'గా చూడటమే అతిపెద్ద సామాజిక సంస్కరణ అని ఆయన భావించారు.

సంప్రదాయం –ఆధునికత :

పాత ఫైళ్లలో ఉన్న 'లక్కీ కుమారి' నాటకాన్ని 'ప్రగతి'గా మార్చడం వెనుక ఒక అంతరార్థం ఉంది. కాలం చెల్లిన పాత భావాలను వదిలేసి, వర్తమానానికి ఉపయోగపడే ఆధునిక భావాలను స్వీకరించడమే ప్రగతి అని ఆయన సందేశం.సాహిత్యం ఎప్పుడూ సమాజ గమనానికి అద్దం పట్టడమే కాదు, సమాజాన్ని నడిపించే దిశానిర్దేశిగా ఉండాలని ఆయన కోరుకున్నారు.

శ్రామిక రాజ్య స్థాపన :

ఆర్థిక సంస్కరణల అంతిమ లక్ష్యం 'శ్రామిక రాజ్య స్థాపన'.కష్టపడేవాడికి తగిన గౌరవం, ఫలితం అందాలి. ఎక్కడైతే శ్రమ దోపిడీ ఉండదో, ఎక్కడైతే వనరులు అందరికీ సమానంగా పంపిణీ చేయబడతాయో అదే అసలైన ప్రగతిశీల సమాజం అని ఆయన అభిప్రాయపడ్డారు.

పాత్ర చిత్రణలో విశేషం :

బోయి భీమన్న గారి 'ప్రగతి' నాటకం కేవలం వ్యక్తుల చుట్టూ తిరిగే కథ కాదు; అది భావజాలాల చుట్టూ, సామాజిక మార్పు చుట్టూ సాగే ఒక మేధోపరమైన ప్రయాణం. ఈ నాటకంలోని పాత్రలు సమాజంలోని వివిధ పార్శ్వాలకు ప్రతిరూపాలు. పాత్రల విశ్లేషణ ఇక్కడ ఉంది.

1. వీరభద్రుడు (సామాజిక విప్లవ శక్తి): ఈ నాటకంలో వీరభద్రుడి పాత్ర అత్యంత శక్తివంతమైనది. పురాణాల్లో దక్షుడి అహంకారాన్ని అణచిన వీరభద్రుడిని, భీమన్న ఇక్కడ ఒక సామాజిక సంస్కరణా శక్తిగా చిత్రించారు.

వీరభద్రుడు అణగారిన వర్గాల, ముఖ్యంగా దళిత జన సమైక్య శక్తికి ప్రతీక. సమాజంలో పేరుకుపోయిన కుల అహంకారాన్ని, ఆర్థిక అసమానతలను రూపుమాపే విప్లవానికి ఆయన నిదర్శనం. అన్యాయం జరిగినప్పుడు మేల్కొనే ప్రజా చైతన్యమే వీరభద్రుడు.

2. లక్కీ కుమారి / ప్రగతి (స్త్రీ చైతన్యం): 'లక్కీ కుమారి'గా పిలవబడిన ఈ పాత్రే నాటకానికి కేంద్రబిందువు. ఈమె ఆధునిక స్త్రీకి ప్రతీక. స్త్రీలు అబలలు కారని, పురుషులతో సమానంగా శారీరక, మానసిక శక్తిని కలిగి ఉంటారని ఈ పాత్ర నిరూపిస్తుంది. తండ్రి ఆస్తిలో సమాన వాటా కోరడం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ఈ పాత్ర స్త్రీ విముక్తిని చాటిచెబుతుంది. ఈమె పరిణామమే నాటకంలో 'ప్రగతి'గా మారుతుంది.

3. బొజ్జా తారకం, వారా వేణు (మార్గ మిత్రులు): నాటక రచయిత భీమన్న గారికి నిజ జీవితంలో మిత్రులైన వీరు, నాటకంలో కూడా ముఖ్యమైన పాత్రలుగా కనిపిస్తారు. వీరు మేధావులకు మరియు సామాజిక కార్యకర్తలకు ప్రతినిధులు. నాటకంలో చర్చలు, వాదనల ద్వారా సామాజిక సమస్యలను విశ్లేషించడంలో వీరి పాత్రలు కీలకమైనవి. రచయిత తన భావాలను వ్యక్తపరచడానికి వీరిని 'మాధ్యమాలు'గా వాడుకున్నారు.

4. హైమవతి (ఆత్మీయ సహచరి): భీమన్న గారి భార్య హైమవతి గారు ఈ నాటకంలో ఒక పాత్రగా ఉండటం విశేషం.ఈ పాత్ర సంప్రదాయం మరియు ఆధునికత మధ్య సమతుల్యతను పాటిస్తుంది. ఇంటి బాధ్యతలను నిర్వహిస్తూనే, సామాజిక మార్పుకు తోడ్పడే స్త్రీ మూర్తిగా ఈమె కనిపిస్తుంది. ఒక వ్యక్తి ప్రగతి వెనుక ఉండే ఆత్మీయ శక్తికి ఈమె ప్రతీక.

5. దక్షుడు (అహంకారానికి ప్రతిరూపం): నాటకంలో పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా కనిపించే ప్రతిఘటనా శక్తులను 'దక్షుడి' స్వభావంతో పోల్చవచ్చు. పాతకాలపు పద్ధతులను వదలని వారు, కుల అహంకారం కలిగిన వారు, స్త్రీలను తక్కువగా చూసే వారు ఈ వర్గంలోకి వస్తారు. ప్రగతికి అడ్డుపడే ప్రతికూల శక్తులన్నింటికీ ఇదొక సంకేతం.

భీమన్న గారి పాత్రలు కేవలం రక్తం, మాంసం ఉన్న మనుషులు మాత్రమే కాదు; అవి ఒక్కొక్కటి ఒక 'సిద్ధాంతం'.ఈ పాత్రల మధ్య జరిగే సంభాషణలు సమాజంలోని కుళ్లును కడిగివేసే ప్రయత్నం చేస్తాయి. పాత్రల ద్వారా రచయిత "కుల మార్పిడి", "ఆస్తి హక్కు", "శ్రామిక రాజ్యం" వంటి విప్లవాత్మక ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. మొత్తంగా చూస్తే, 'ప్రగతి' నాటకంలోని పాత్రలు పాఠకుడిని ఆలోచింపజేస్తాయి. ప్రతి పాత్రలోనూ ఏదో ఒక సామాజిక కోణం దాగి ఉంటుంది. మనిషి తనలోని జంతు ప్రవృత్తిని (గతిని) వదిలి, సంస్కారవంతమైన మనిషిగా (ప్రగతిగా) మారడానికి ఈ పాత్రలు ప్రేరణనిస్తాయి.

రేపటి సమాజానికి 'ప్రగతి' ఒక దిక్సూచి

బోయి భీమన్న గారి 'ప్రగతి' నాటకం కేవలం ఒక సాహిత్య ప్రక్రియ కాదు, అది ఒక సామాజిక పునర్నిర్మాణ ప్రణాళిక. సమాజంలో వేళ్లూనుకుపోయిన కుల వివక్ష, స్త్రీ అణచివేత, మరియు ఆర్థిక అసమానతలను తొలగించడానికి ఆయన చూపిన మార్గం అత్యంత విప్లవాత్మకమైనది.

భీమన్న గారి దృష్టిలో 'ప్రగతి' అంటే కేవలం భౌతికమైన మార్పు కాదు; అది మానవ మేధస్సు వికసించి, సంస్కారవంతుడైన మనిషి ఆవిర్భవించడం. కులాన్ని చట్టబద్ధంగా మార్చుకునే వీలుండాలని, స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కు ఉండాలని, మరియు వనరులన్నీ జాతీయం కావాలని ఆయన చేసిన ప్రతిపాదనలు నేటికీ ఆచరణీయమైనవి.

మతం, కులం, వర్గం అనే అడ్డుగోడలను దాటి, "మానవుణ్ని మానవుడుగా గుర్తించడమే" ఈ నాటకం యొక్క పరమార్థం. అన్యాయంపై తిరుగుబాటు చేసే 'వీరభద్రుడి' చైతన్యాన్ని ప్రజల్లో నింపుతూ, శ్రమను గౌరవించే ఒక సామ్యవాద సమాజాన్ని ఆయన ఈ నాటకం ద్వారా కలగన్నారు. భీమన్న గారు ప్రతిపాదించిన ఈ విలువలని మనం అర్థం చేసుకుని ఆచరించినప్పుడే, ఆయన ఆశించిన నిజమైన 'ప్రగతి పథం'లో మన సమాజం ముందుకు సాగగలదు. సాహిత్యం సామాజిక మార్పుకు ఎలా ఆయుధం కాగలదో చెప్పడానికి ఈ నాటకం ఒక అద్భుత నిదర్శనం.

"మానవుణ్ని మానవునిగా గుర్తిద్దాం – సాముదాయక మానవ శ్రేయస్సునే దైవంగా ఆరాధిద్దాం." – బోయి భీమన్న

ఆధార గ్రంధాలు :

1. ప్రగతి నాటకం– బోయి భీమన్న

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న గేయ నాటికలు - పరిశీలన

- చింతలపల్లి రాఘవేంద్ర రావు
సెల్: 9441922550

వ్యాస సంగ్రహం :

పద్మశ్రీ బోయి భీమన్న రచించిన గేయ నాటికలలోని పాట గొప్పదనం, ప్రాధాన్యం, సౌందర్యం, రసం, ప్రకృతి సౌందర్యం, గేయ నాటకం యొక్క ప్రాధాన్యాన్ని భాష మొదలైన అంశాలను చెప్పటం ఈ పరిశోధన వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం. బోయి భీమన్న సాహిత్యం గురించి లబ్ద ప్రతిష్ఠులైన ఎందరో సాహితీ వేత్తలు, పరిశోధకులు ఎన్నో అమూల్య వ్యాసాలు రాశారు. వారు ఆయా సందర్భాలలో రాసిన వ్యాసాలు, పరిశోధక గ్రంధాలు ఈ పరిశోధన వ్యాసానికి ఆధారం అయినాయి. బోయి భీమన్న గేయనాటికలలో సామాజిక, తాత్విక చింతనామయమైన వస్తువుతో పాటు ఎన్నో ఉదాత్తమైన అంశాలు ఉన్నాయి. వాటిని తెలియజేయాలని స్థలాభావాన్ని దృష్టిలో ఉంచుకుని స్థాలీపులాక న్యాయంగా ఈ వ్యాసాన్ని పరిమితం చేసుకున్నాము. ఈ పరిశోధన వ్యాసం ఆధారంగా భీమన్న గేయ నాటికలలోని మరెన్నో నిగూఢ విషయాల గురించి పరిశోధన చేసే అవకాశం ఉన్నది.

ఈ పరిశోధన వ్యాసం విశ్లేషణాత్మక పరిశోధన పద్ధతిలో సాగింది.

మౌలిక పదాలు: బోయి భీమన్న, నాటిక, గేయం, సామాజిక చైతన్యం, ప్రక్రియ, ధ్వని, భాష.

బోయి భీమన్న గేయ నాటికలు - పరిశీలన

ఉపోద్ఘాతం : తెలుగు సాహిత్య నందన వనంలో ఉదయించిన కల్పవృక్షం పద్మశ్రీ బోయి భీమన్న. తెలుగు సాహిత్య వీణాతంత్రులపై ఉదయించిన సుమధుర మోహనరాగం ఆయన. అక్షరాలు నేర్వకముందే అద్వైతం పట్టుబడిన కవి. పురాణ ఇతిహాసాలలోని వేదాంత తత్వాలు, దరువులు తండ్రి పాడుకుంటుంటే విని వాటిలోని పరిమళాన్ని ఒంటపట్టించుకున్నాడు. బోయి పల్లయ్య, నాగమ్మ దంపతులకు తేది:19-09-1911 సం॥లో నాటి ఉమ్మడి తూ॥గో జిల్లాలోని మామిడికుదురు

గ్రామంలో పేద హరిజన కుటుంబంలో జన్మించాడు. సాహిత్య సృష్టికి పేదరికం కులం అడ్డురావని అందుకు తానే నిదర్శనమైనాడు. విద్యార్థి దశ నుంచి పరిచయమైన వ్యక్తులు, తానుపడిన కష్టాలు, చీకటి వెలుగులు భీమన్న కవిత్వానికి పునాదులైనాయి. జాతి ఔన్నత్యానికి కులం, ధనం, అధికారం కాక సంస్కృతి సంస్కారాలు ఉండాలని నమ్మిన వ్యక్తి భీమన్న. సృష్టిలో ఉన్న వైరుధ్యాలన్నీ ఇతని సాహిత్యంలో ఉన్నాయి. భీమన్న సృష్టించిన వైవిధ్యమైన అనేక సాహితీ ప్రక్రియలలో గేయ నాటికలు కూడా ఒకటి. చిన్నతనంలో పొలం పనులలో అమ్మ పాడిన జానపద గేయాలు, వేదాంతి అయిన తండ్రి పాడే తత్వాలు భీమన్న కవిలో అంతర్లీనంగా ఉన్న లయకారుణ్ణి తట్టిలేపాయి. దీనికి తోడు యతిరాజు అనే గోసాయి ఆలపించిన వేదాంత తత్వాలు భీమన్నలో పాటల పూతోటకు పాదు చేసాయి. తాను ఏ రచన చేసినా సందర్భానుసారంగా పాటనో పద్యాన్నో ఆ రచనలో పొదగటం ఆయన సృజనశీలతలోని వైశిష్ట్యం. పాలేరు వంటి విషయ గంభీర రచనలో కూడా దీనిని గమనించవచ్చు.

బోయి భీమన్న సుమారు 30 వరకు గేయనాటికలు రాశాడు. ఇవన్నీ ప్రదర్శనాయోగ్యమైనవి. సామాజిక స్పృహ వీటిలో ప్రధానంగా ఉంటుంది. భీమన్న అక్షరాన్ని ఆయుధంగా మలిచి సామాజిక మార్పుకై కృషి చేశాడు. అందులో ఆయన కృతకృత్యుడైనాడు. భీమన్న గేయనాటికలలో పామరులకు సైతం అర్థమయ్యే విధంగా వాడుక భాషలో మాటలు, పాటలు, పద్యాలు ఉంటాయి. ఈ నాటకాలలో చాలా వరకు ప్రబోధాత్మకత ఉంటుంది.

"శ్యామలములైన లంకల అంకములను / పమిట చెరగున మలయానిలములు వీచి / పాంథజనులకు పారమ్య పదవినొసగు / కమల రాయలసీమా కోనసీమ ...." అని తన స్వస్థాన వేషభాషాభిమానాన్ని తన రచనలలో ప్రకటించుకుని పరవశించిపోయాడు.

భీమన్న గేయ నాటికలు : పైరు పాట, మానవుని మరొక మజిలీ, చిత్ర కళాప్రదర్శనం, వసంత, స్వయంవరం, గులాబి ప్రసవించింది, దేవయాని, మెదడులో మెరుపు, శ్రేయసి, పాత ఊరు కొత్తదారి, సుభాసచంద్రుడు, చండాలిక, అంధకారంపై విజయం అనే చక్కటి, చిక్కటి సందేశాత్మక గేయ నాటికలను రాశాడు భీమన్న. ఆయన దృష్టిలో పాట బ్రతుకులోని కమ్మదనానికి, ఆనందానికి సంకేతం.

భీమన్న గేయ నాటికలు పరిశీలన : భీమన్న రాసిన గేయనాటికలలో ఒకటి "పైరుపాట". ఇది 7 రంగాల శృంగార రస ప్రధాన గేయనాటిక. ఈ గేయనాటికలో కథానాయకి స్నేహ. ఈమె నోట "మనసులోపలి కోరికలెన్నో మరిగితేనే పాల మీగడ / పాట అంటే తక్కువా, ఈ బ్రతుకుకంటే ఎక్కువ" అని అనిపించాడు. అందులోనే ఇంకొక సందర్భంలో "బ్రతుకు తీవియకొసను కోమల భావకుసుమపు తావి పాట / సుఖపయోనిధి మీద నిర్మల సుధారసమే పాట...." అని గేయ ప్రాశస్త్యాన్ని ప్రశంసించాడు. పాట యొక్క ప్రాధాన్యానికి పరమ సౌందర్యానికి అనుభూతి చెంది ఆ అనుభూతితోనే భీమన్న పైరుపాట గేయ రూపకాన్ని రచించాడు. భీమన్న జన్మభూమి కోనసీమ. కోనసీమ ప్రకృతి సౌందర్యానికి పెట్టింది పేరు. భీమన్న మనసును ఆనందమయం చేసిన అక్కడి ప్రకృతి సౌందర్యం, పల్లె వాతావరణం ఆయన పైరుపాట రచనకు కారణమైనదేమో! దీనికి ఆలంబనగా "పైరుచేయి, పచ్చికబీళు ళ్ళ, అచ్చటి గడ్డి పిల్లలూ, కుర్రవాళ్ళ షికార్లు..." అని పైరుపాట ప్రస్తావనలో భీమన్న అన్నారు. ఈ నాటకం 7వ రంగంలోని "భారత జనని పదసేవాభాగ్యం గైకొందని – సేవాగ్రామము నుండి

దీవించెను బాపూజీ...” అన్న మాటలను బట్టి రెండు విషయాలు తెలుస్తున్నాయి. ఒకటి ఈ నాటకం గాంధీజి సేవాగ్రాంలో ఉన్న కాలంలో రచింపబడిందని, రెండవది కవికి దేశభక్తి మరియు గాంధీజి పట్ల ఆరాధనా భావం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. శ్రీమంతుడు, విద్యావంతుడు, అభ్యుదయభావాలు ఉన్న యువకుడు శ్రీవత్స. అమాయకురాలు నిరుపేద, గుణవంతురాలు, గడ్డికోయడమే జీవికగా గల “స్నేహ” అనే యువతిని శీల అనే స్నేహితురాలి సహాయంతో పెళ్ళి చేసుకోవడం ఇందులోని ఇతివృత్తం. ఇందులోని పాత్ర పోషణలో ఎక్కడా ఔచిత్యభంగం లేదు. స్నేహ తన ప్రియుడైన శ్రీవత్స దృష్టిలో “ప్రత్యక్షంగా వచ్చిన శిల్ప భారతి” అంతే కాదు “చిత్తంలో ప్రతి దెబ్బా సుత్తి దెబ్బగా మలచిన మానవతామూర్తి.” స్నేహ మోహన దేవత, స్నేహ రూపిణి. అందుకే ఆమెను అతను స్నేహ అని పిలుచుకున్నాడు. ఇంకా “ఒడిదుడుకులు లేకుండా ఒరుల పొంత పోకుండా తోటమూల జీవించే ఊట “బావి గుండియ స్నేహది కొంచెపు గుణమే లేక కోరికలన్నవి లేక లోకం మించి వసించే ఆకాశం మనసు అమెది.” స్నేహది ఆత్మార్పణ గుణం. “ఆత్మార్పణ కంటే వేరే అవకాశం ఏమున్నది – పెరటిని పూచిన పూలకు తెరుపున పండిన చేలకు” అన్న మాటలు ఆమె ఆత్మార్పణ భావానికి అద్దంపడ్తాయి.

ఇక శ్రీవత్స.... సంస్కారమున్న యువకుడు. చిన్ననాటనే నిర్మలబుద్ధిని అలవర్చుకున్నాడు. “పని ఏదైనాగాని పరమేశుని రూపంగా” భావించే పరిణత హృదయుడు. అతని దృష్టిలో “పచ్చగడ్డి కోయడమూ, పరిపాలన చేయడమూ దారులు వేరుగాని దూరం ఒక్కటే శివునికి ”

ఈ నాటికలో పాత్రల సంభాషణల్లో చక్కటి సూక్తులు ఎన్నో దొరలుతాయి. “మొక్కకంటే మొగ్గ మృదులమై పూచు పూవు కంటే మధువు మధురమై లేచు” “మాధురిమ జన్మ జన్మాల కృషి ఫలితం – అర్హతను బట్టియే అనుభూతి సైతం..” వంటివి ఇందుకు ఉదాహరణలు.

శ్రీవత్సకు ముల్లు గుచ్చుకోగా కారిన రక్తం బొట్టు “గూకుతున్న పొద్దల్లె పాకిందట” అక్కడక్కడా ఇలాంటి చక్కటి వర్ణనలు ఔచితీవంతంగా చేయబడినాయి.

ఈ నాటికలోని భాష శిష్టవ్యావహారికం. అక్కడక్కడా సాలంతా, బాతాఖాని లాంటి ఉర్దూ పదాలు కన్పిస్తాయి. ఇది గేయాత్మికం కనుక ఇందులో తిశ్ర, చతురశ్ర, మిశ్ర, ఖండగతులు, ముత్యాలసరాలు చోటు చేసుకున్నాయి. గాన యోగ్యతకై అక్కడక్కడా కొన్ని మార్పులు చేశాడు కవి.

ఈ నాటిక మొదట “స్నేహ సుందరి” అన్న శీర్షికతో ఒక వార పత్రికలో ధారావాహికగా ప్రచురించబడింది. అనంతరం దీనిని పరిష్కరించి “పైరుపాట” గా అందించాడు. మొదట 1960 సెప్టెంబరులో అయ్యదేవర కాళేశ్వరరావు సారథ్యంలో ఈ నాటిక ప్రదర్శింపబడింది. ఇది ఆకాశవాణి (ఎఐఆర్)లో కూడా ప్రసారం అయ్యింది. భీమన్న ఈ నాటికను అప్పటి ముఖ్యమంత్రి సంజీవయ్యకు అంకితం చేశాడు.

ఈ గేయనాటికలో “ పెదవికి చేరుకున్న ప్రియమౌ మధు కలశమ్మును జారవిడుతువా – మధువేజాతి పూలదో తెలియమి” “ఎక్కడ పుట్టిన నేమి, ఎక్కడ పెరిగిన నేమి, కోరిన గుణమ్మున్నపుడు

కోసుకొమ్ము పుష్పమ్మును" అన్న పంక్తుల ద్వారా కులం కన్నా గుణం ప్రధానమని, వధువు గుణవతి అయినపుడు కులాంతర వివాహం చేసుకోవచ్చన్న సందేశాన్ని ఇచ్చాడు.

మానవుడు పుట్టిన నాటి నుండి నేటి అత్యాధునిక యుగం వరకు తాను అనుభవించిన దశలను అతడు ఎదుర్కొన్న సమస్యలనూ, అతని క్రమ వికాస పరిణామాన్ని ధ్వని గర్భితంగా, ప్రతీకాత్మకంగా చిత్రించిన 26 రంగాలున్న మరొక సుదీర్ఘ నృత్య గేయనాటిక "మానవుని మరొక మజిలీ" భీమన్న ఈ నాటక రచనను 1918లో ప్రారంభించి సముచిత మార్పులు చేస్తూ 1958లో పూర్తి చేశాడు. ఈ నాటిక "స్రవంతి" పత్రికలో ధారావాహికగా ప్రచురితమైంది. 1963లో పుస్తకంగా వెలువడింది. భీమన్న ఈ నాటికను డా॥ బెజవాడ గోపాల్‌రెడ్డికి అంకితం ఇచ్చాడు.

యుగయుగాల మానవజాతి చరిత్రను హేతుబద్ధంగా ధర్మానుగుణంగా ఈ గేయనాటకంలో భీమన్న పొందుపరిచాడు. ఇందులోని ప్రతీ పాత్ర ఒక ప్రతీకగా సృష్టించబడింది. ఈ పాత్రల ద్వారా మానవుని ఆటవిక దశ నుండి ఈనాటి ప్రజాస్వామ్యం, శ్రేయోరాజ్యం, గ్రామ నిర్మాణం, విశ్వశాంతి, విజ్ఞాన విశేషాల వరకు ఆయా యుగ ధర్మాలను ప్రకటించారు. ఇది సుదీర్ఘ గేయనాటిక అయినా ఎక్కడా విసుగు రాకుండా, ఔచితీభంగం లేకుండా రసభరితంగా రచన చేయడం సామాన్య విషయం కాదు. ఈ దృశ్య కావ్యం గానానుకూలంగా సాధారణ గేయ ఛందస్సుల్లో నడిపించాడు. అక్కడక్కడా ద్విపద గంధం గుబాళిస్తుంది. పాత్రోచిత భాష కన్పిస్తుంది. ఇందులో ఎన్నో సామెతలు, సూక్తులు, పలుకుబళ్ళు, అక్కడక్కడా మెరుస్తుంటాయి. పదహారు రంగాలున్న ఈనాటకం ఒక్కసారికాక పూర్వాపరాల వివరణతో ఏ ఒక్క రంగాన్నైనా ఔచితీవంతంగా రసాభాసకల్గకుండా ప్రదర్శించవచ్చు.

"కావ్యమున మానవుడి దొక ప్రియ గీతి" అను స్వయం ప్రభ (నాటికలో ఒక ప్రధాన పాత్ర) మాటల ద్వారా మనిషి విశ్వమానవానంద సిద్ధికై కృషి చేయాలన్న సందేశాన్ని భీమన్న ధ్వని గర్భితంగా సమాజానికి అందించాడు. శ్రవ్య క్యావం కంటే దృశ్య కావ్యం నిర్మించడం కష్టం. "కావ్యేషు నాటకం రమ్యం – నాటకాంతంహి సాహిత్యం" అని కదా! అందులోనూ నృత్య గేయనాటకం నిర్మించడం ఎంతో ప్రతిభతో కూడుకున్నది. భీమన్న ప్రతిభా వ్యుత్పత్తులకు నికష ఈ నాటకం. తెలుగు సాహిత్యంలో ఇంత దీర్ఘ గేయనాటకం ఇదొక్కటే అంటే అతిశయోక్తి కాదు.

"చిత్రకళా ప్రదర్శనం" పది సంగీత నృత్య నాటికల సంపుటి ఇది 1963లో ప్రచురితం. దీన్ని శ్రీమతి ఆదిలక్ష్మికి అంకితమిచ్చాడు. ఈ సంపుటిలో మొదటి నాటిక "చిత్రకళా ప్రదర్శనం" ఇది ఒక రమణీయ కల్పన. ఒక హృదయంగమ సన్నివేశ సంభరితం. ఇందలి ఇతివృత్తం ప్రణయం. ఇందులో పాత్రలు నాలుగు – చిత్రదత్తు, కళ, మంజీర, మార్దంగం చివరి రెండు పాత్రలు చిత్రాలు. అయినా కవి వాటికి ప్రాణం పోసినాడు. ఈ నాటిక ద్వారా కవి "రమ్యచిత్ర ప్రదర్శనము మానవులకిది – సరస మానవ ప్రదర్శనము చిత్రములకిది – వొండొరుల జూచుకొని ఉల్లములు పెంచుకుని – ఆనంద పారమ్య మందుకొని తరియింప కళ అందులో ఆత్మకలశం – లలిత కళ అందులో ఆత్మకలశం" అన్న ఒక మంచి సందేశాన్ని అందించాడు.

ఈ "చిత్ర కళా ప్రదర్శనము"లో రెండవ గేయ నాటిక "వసంత స్వయం వరం" ఇది ఒక వర్ణనాత్మక కల్పనా చాతుర్యం వసంతుడు తనను కోరి వచ్చిన మధుప్రియను (కోకికల) రసాలినిని (మామిడి), నింబలతను (వేప) ఇక్షుకాంతను (చెరుకు) కాదని ఉగాది పచ్చడిని పట్టుకున్న గోపికను ప్రేమించడం ఇందలి కథాంశం. ఉగాది పచ్చడి షడ్రుచుల మిశ్రమం అయినట్లే, కష్ట సుఖాల సమ్మేళనమే జీవితం అన్న సందేశం కవి ఈ నాటకం ద్వారా చాటాడు.

ఈ సంపుటిలోనిదే మూడవ నాటిక "గులాబి ప్రసవించింది". ఉద్యానవనం లోని గులాబి తీగ ప్రసవించడం ఇందలి కథాంశం. దాంట్లోని పాత్రలు చిలుక, సీతాకోక చిలుక, తులసి, కోకిల, నెమలి, గుడ్లగూబ, మేకపిల్ల, ఆకుపురుగు, తోటకూర చెట్లు, క్రోటస్ మొక్క, మంద మారుతం. ఇందులో గోపికల నోట చక్కని సౌందర్యభావాలు పలికించాడు కవి. చివరన గోపిక చెప్పిన "నిజము సౌందర్యమ్ము ప్రజన సౌందర్యమ్మే నవ సృజనలోని ఆనందమే పరమమ్ము" అన్న మాటలను నాటికలో సందేశంగా అందించాడు భీమన్న.

ఇందులోని నాల్గవ గేయనాటిక "దేవయాని' ఇది భారత సంబంధ కథ. దేవ గురువు బృహస్పతి కొడుకైన కచుడు, రాక్షస గురువైన శుక్రుని నుండి మృత సంజీవని విద్యను నేర్చుకొని, తన పట్ల చూపిన దేవయాని ప్రేమను కాదని స్వర్గానికి వెళ్లడం ఇందులోకి కథాంశం. ఈ నాటికలో గేయాలేకాక కందం. ఆట వెలది. తేటగీతి పద్యాలు కూడా ఉన్నాయి.

చిత్రకళా ప్రదర్శనలోని ఐదవ నాటిక –"మెదడులో మెరుపు". ఈ నాటిక వ్యవసాయ రంగంలో వచ్చిన నూతన విప్లవాత్మక మార్పును సూచిస్తుంది. పాత పద్ధతుల్లో వ్యవసాయం చేసే రైతన్నకు సంప్రాదాయ పద్ధతుల్లో కాకుండా నూతన యంత్రాలను ఉపయోగించమని సోముడనే ఉద్యోగి చెప్పిన ఆలోచనయే "మెదడులో మెరుపుగా" రూపుదిద్దుకున్నది. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల రైతులు మంచి ఫలితాలు సాధించవచ్చు అని ఈ నాటకం ద్వారా రైతులోకానికి తెలియజేసాడు కవి.

నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడానికి ప్రజలు చేసిన ప్రయత్నాన్ని "శ్రేయసి" అన్న ఆరవ నాటిక తెలుపుతుంది. స్వచ్ఛమైన ప్రేమను, వేదాంత తత్వాన్ని, మానవతా వాదాన్ని చెప్పే సందర్భంలో భీమన్నలోని ప్రతిభ, మానవతా విలువలు స్పష్టంగా గోచరిస్తాయి. నిర్మలమైన హృదయం, నిస్వార్థ భావం, ఐకమత్యం కుట్రలను, కుతంత్రాలను జయించి తీరుతుందని, ఒకరి ప్రయోజనం కంటే సంఘ సుఖం, దేశ ప్రయోజనం ముఖ్యమని ఈ నాటిక ద్వారా కవి సందేశమిచ్చాడు.

చిత్ర కళా ప్రదర్శనలోని ఏడవ నాటిక "పాత ఊరు కొత్త దారి" పంచవర్ష ప్రణాళిక సాధించిన గ్రామాభ్యుదయాన్ని నిరూపించే నాటిక ఇది. సమైక్యత, శ్రమతత్వం, ప్రగతిశీల భావాలు ఉంటే ప్రగతి సాధించవచ్చునని ఈ రూపకం ద్వారా చాటి చెప్పడం భీమన్న ఉద్దేశ్యం.

ఈ సంపుటిలో ఎనిమిదివ నాటిక "సుభాసచంద్రుడు" ఇది గేయ నాటిక కాదు. ఇది చంపూ పద్దతిలో ఉంటుంది. ఇందులో గేయం లేదు. సుభాస చంద్రుడు చదువు పూర్తి చేసుకొని భరతవాణి

ఆదేశానుసారం దేశం కోసం నడుం బిగించి, ఆజాదు హిందు ఫౌజును నిర్మించి ఆంగ్లేయ ప్రభుత్వాన్ని గడగడలాడించి, మాతృదేశ స్వాతంత్ర్య సిద్ధికై త్యాగభావంతో ధైర్యంగా సల్పిన పోరాటం ఈ నాటికలో చిత్రితం.

తొమ్మిదవ నాటిక "చండాలిక" ఇందులో ఐదు రంగాలున్నాయి. ఇందులోని కథ జాతక కథల లోనిది. చాండాలిక అనే చండాల యువతి ఆనందుడనే బౌద్ధ సన్యాసిని సర్వస్వంగా భావించి, చివరకు అతనిలో లీనమవ్వడం ఇందలి వస్తువు. ఈ నాటికలో గేయాలతోపాటు, పద్యాలు, వచన కవితలు ఉన్నాయి. వచన కవిత్వం అంత్య ప్రాసలతో సాగింది. ఈ నాటిక రవీంద్రనాథ్ ఠాగూర్ శత జయంత్యుత్సవాల సందర్భంగా ప్రదర్శించబడింది.

ఈ గేయ నాటిక రవీంద్రుని చండాలిక నవలకు అనుసరణం. ఇందులో అద్భుత, హాస్య, కరుణ రసాలు చక్కగా పోషించబడినాయి. మానవతా విలువలు, సంస్కరణ, ప్రణయ తత్వ నిరూపణ బాగుంది. గేయ వచనాలకు వ్యవహారిక భాష, పద్యాల్లో గ్రాంథిక భాష ప్రయుక్తమైంది. (పాత్రోచిత భాష)

ఇక చిత్ర కళా ప్రదర్శనంలోని చివరి గేయనాటిక "అంధకారంపై విజయం" ఈ నాటికలో మన దేశంపై దురాక్రమణ చేసిన చైనాను మన భారత వీర సైనికులు తిప్పికొట్టిన ఘటాన్ని చిత్రించాడు భీమన్న. తెరవెనుక పాట వినిపిస్తుండగా రంగ స్థలంపై ప్రదర్శన జరగడం ఈ నాటికలోని విశేషం. ఇందులో దేశభక్తి, సహనం, త్యాగ భావన వర్ణితం ఇవి ప్రేక్షకునిలో ఆవేశాన్ని రగిలించడానికి తోడ్పడుతాయి. ఈ నాటికలో దీపావళి ప్రాదాన్యత కూడా ఉన్నది.

ముగింపు :

భీమన్న రచించిన గేయ నాటికలు వస్తు వైవిధ్యంతోనూ, కవితా సౌరభంతోనూ భాసిల్లుతున్నాయి. ఆర్తి, ఆవేశం, ప్రణయతత్వం, మానవత్వం, దేశభక్తి, కుల నిరసనం, నూతన ఆలోచన విధానం భీమన్న నాటికల్లో చోటు చేసుకుని ప్రేక్షకులను ఆలోచింపచేస్తాయి. ఆయన నాటికల్లో కనిపించే పురాణ ప్రతీకలు, పల్లీయత, సంస్కృతీ సంప్రదాయాలు ఏవైనా కవిత్వ భావ గాంభీర్యాన్ని అభివ్యక్తపరుస్తూ ప్రేక్షకుల / పాఠకుల / శ్రోతల మనస్సుకు ఆయా భావాలను మరింత దగ్గరగా చేర్చడానికి ఉపకరిస్తాయి. భీమన్నది ధర్మాగ్రహం. భారతీయ ధార్మిక చింతనకు మూలాలైన పురాణాల్లోని పాత్రలను ప్రతీకలుగా చేసి దేశంపట్ల, ధర్మంపట్ల తనకున్న గౌరవ మర్యాదలను అభివ్యక్తం చేసాడు భీమన్న. ప్రతి రచనలోనూ భీమన్న ప్రతిభామూర్తిమత్వం ప్రత్యక్షమౌతుంది. ఈ నాటకం చివరి పదాల్లో ఒక చోట "ఇది నృత్యగాన సాహితి – బ్రతుకున సుఖమిచ్చు పద సరస్వతి" అన్నాడు భీమన్న. నిజమే శ్రవణేంద్రియాలకు చక్షువులకు ఏకకాలంలో స్వాంతనను చేకూర్చే ప్రక్రియ గేయనాటిక. సాహితీ ప్రక్రియలో బోయి భీమన్నకు సమున్నతమైన స్థానమున్నది. మమ్ముటుని అభిప్రాయం ప్రకారం కావ్యం కావ్య రచయితకు, పఠితులకు, శ్రోతలకు, ప్రేక్షకులకు యశస్సు, అర్థలాభం, వ్యవహార దక్షత, కల్యాణం, ఉపదేశం మొదలైన లాభాలు కల్గిస్తాయి. ఇవన్ని బోయి భీమన్న తన కవిత్వం ద్వారా సాధించాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః !
నాస్తి తేషాం యశః కాయం జరామరణజం భయం !!

సంప్రదింపు గ్రంథాలు :-

1) బోయి భీమన్న రూపకాలు – తాత్విక చింతన, టి.బాలరాజు (సిద్ధాంత గ్రంథం)
2) బోయి భీమన్న రసాద్వైతం, డి.గోపాల్ (సిద్ధాంత గ్రంథం)
3) బోయి భీమన్న రచనలు, బి.నమఃశివాయ (సిద్ధాంత గ్రంథం)
4) బోయి భీమన్న సాహిత్యం – సాంస్కృతిక పునర్విచేచనం, ఇ.బాలకాశయ్య (సిద్ధాంత గ్రంథం)
5) బోయి భీమన్న రచనలు – బోయి భీమన్న సాహిత్య పీఠం – తెలుగు విశ్వవిద్యాలయం హైద్రాబాద్.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

జానపదుని జాబుల్లో సామాజిక చైతన్యం

– డా. శ్రీపాద సీతామహాలక్ష్మీ సత్యవతీ పేరమాంబ,
పాఠశాల సహాయకురాలు, తెలుగు
సెల్ : 9440152037,

ఉత్తరాల రూపంలో వ్రాసే ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియ లేఖాసాహిత్యం. లేఖలకు సంబంధించిన మొట్టమొదటి ప్రస్తావన భారతీయ సాహిత్యంలో అభిజ్ఞాన శాకుంతలంలో, తెలుగులో ప్రభావతీ ప్రద్యుమ్నంలో కనబడతాయి. తెలుగులో లేఖలను స్వీకరించిన మొదటి వ్యక్తి ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్. బ్రౌన్ లేఖలను బండి గోపాలరెడ్డి (బంగోరె) సంకలనం చేశారు. దీని ద్వారా తొలి తెలుగుతరం జర్నలిజం చరిత్ర తెలుస్తుంది. చరిత్రలో మొదటిలేఖ క్రీస్తు పూర్వంలో మొసపటోమియాలో సెమెటిక్ లిపిలో వ్రాయబడింది. ఆధునిక చరిత్రలో స్వామి వివేకానంద రచించిన లేఖలు అత్యుత్తమ లేఖలుగా నిలిచాయి. ఇందులో వివేకానందుని ఆకాంక్షలు, ఆరాటాలు కనిపిస్తాయి. ఈ విధంగా లేఖాసాహిత్య ప్రక్రియ ప్రాచీన కావ్యాల నుంచి ఆధునిక రచనల వరకు విస్తరించింది.

లేఖలలో ప్రేమలేఖలు, సాంస్కృతిక లేఖలు, వ్యక్తిగత లేఖలు మొదలగునవి ఉన్నాయి. ఇవి సమాజంలోని వివిధ కోణాలను తెలియజేస్తాయి. ఈ లేఖలను చేరవలసిన చోటుకు చేర్చే పోస్టుమ్యాన్ మీద తిలక్ చక్కని కవితలను అల్లాడు.

తేది. 19-09-1911 నుంచి 16-12-2005 మధ్యకాలంలో జీవించిన బోయి భీమన్న పద్య, గేయ, వచన, నాటక రచనలతో పాటు లేఖాసాహిత్యం కూడా వ్రాసి, తెలుగు సాహితీలోకంలో ధ్రువతారగా వెలుగుతున్నారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్ పురస్కారాలందుకున్న శ్రీ బోయి భీమన్న సుమారు 70 పుస్తకాలు వ్రాశారు. అంబేద్కర్ రచనలను తెలుగులోనికి అనువదించారు. ఆకాశవాణిలో భీమన్నగారి భావగీతాలు, లలితగీతాలు, భక్తిగీతాలు ప్రసారమవుతూనే ఉంటాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు డా॥ బోయి భీమన్న పేరుతో ఒక సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేసి, వీరి రచనలను ప్రచురించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో విశ్వవిద్యాలయాలు బోయి భీమన్న రచనలపై జాతీయ సదస్సులను నిర్వహిస్తున్నాయి.

భీమన్న గారి విశిష్ట రచనల్లో ఒక మణిపూస "జానపదుని జాబులు". ఇందులోని జాబులు చాలావరకు 1932వ సం॥లో 'పల్లెటూరి లేఖలు' అనే పేరున 'జనవాణి' పత్రికలో, 1933వ సం॥లో జానపదుని జాబులు అనే పేరున 'ప్రజామిత్ర' పత్రికలోను ప్రకటించబడ్డాయి. పట్నంలో కొంతకాలం చదువుకుని, బీదతనం వల్ల చదువు సాగించలేక, తన స్వగ్రామానికి మరలి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలోని శ్రీమంతుడైన మిత్రునికి తన అవస్థలను వ్రాయడమే జానపదుని జాబుల్లోని విషయం. ఇందులో 17 లేఖలున్నాయి. సుమారుగా ఆరు లేఖల్లో 'ప్రియసఖా' అని, రెండు లేఖల్లో 'ప్రియమిత్రమా' అని, 'సుహృద్వరా' అని రెండు లేఖల్లో, 'మిత్రమా' అని రెండు లేఖల్లో, సంభోదించడం జరిగింది. 'ప్రియ సుహృదీ' అని రెండు లేఖల్లో, 'నెచ్చెలీ' అని రెండు లేఖల్లో 'చెలీ' అని ఒక లేఖలో సంభోదించడం జరిగింది.

భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వంలాగే భీమన్న రచనలలోనూ ఆ లక్షణం కనిపిస్తుంది. భీమన్న సమాజంలో మానవత్వాన్ని ఆశించిన జాతీయవాది. ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్ష వీరి లేఖల్లో కనిపిస్తుంది. సమాజంలోని వాళ్లంతా చెడ్డవాళ్ళే కారని, మంచివాళ్ళు కూడా ఉంటారని చెప్పడం భీమన్న గారి విశిష్టగుణం. పరిణతి చెందిన ఆలోచనలతో, భావుకతలో కూడిన ప్రామాణిక రచనలు భీమన్నగారి లేఖలనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.

నూటికి తొంభైమంది గ్రామీణుల సందెవేళ కార్యకలాపాలు ఒక జాబులో ప్రస్తావించారు. పగలంతా రెక్కల ముక్కలు చేసుకుని, రక్తం నీరుగా మార్చుకుని, శ్రమించి సంపాదించిన పైకం కల్లుదుకాణంలో సమర్పించేస్తారు. ఇంట్లో పిల్లల ఆకలి, పిల్లలను, భార్యను కొట్టడం మొదలైన దృశ్యాలను చూపిస్తూ 'ఎన్ని కొంపలు కూలిస్తే గాని ఒక కొంప కోటికి పడగలెత్తగలదు? ఎన్ని కొంపల్ని కడుపులు మాడ్చి ఏడ్పించితేగాని ఒక కొంప సుఖంగా వినోదించగలదు? అని వేసిన ప్రశ్నలలో ఆర్థిక వ్యత్యాసాల మూలకారణ స్పృహ కనబరిచారు భీమన్న గారు.

ప్రేమ ప్రేమను పుట్టిస్తుంది. ద్వేషం ద్వేషాన్ని కలిగిస్తుంది. భూలోకామందు ఎందుకూ ఉపయోగించుకోని తాటివాసాలను, కూలివాడు పశువులకు పాక వేసుకునేందుకు అడిగితే లేవు పొమ్మనడంతో పుట్టిన కసికి, రాత్రి ఆకాశమందు దొడ్లో ఉన్న బండి చక్రం భోగిమంటల్లో ఆహుతి చేసి, నా కసి బలేగా మండిందనడంలో కూలీ ఆవేదన, ఆక్రోశం ఉన్నాయి.

మరో లేఖలో 'ఎంత క్రూరసంఘమిది! ఒకరి ఏడుపుతో మరొకరికి సంతోషం కలిగిస్తుంది. ఒకరి ఆకలితో ఇంకొకరి కడుపు నింపుతోంది. ఒకరి రక్తంతో వేరొకరికి సౌఖ్యసౌధాలు నిర్మిస్తోందని' చెప్పిన మాటల్లో అసమానతలను అంటిపెట్టుకుని ఉండే దోపిడీ స్వభావాన్ని గురించిన అవగాహన కనబడుతుంది.

మరోచోట మనం అభ్యసించే విద్యకు, జీవితంలో చేయబోయే పనికి ఉన్న అంతరం గుర్తుచేస్తున్నారు. పల్లెలు ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిళ్ళు. చదువుకున్న వాళ్ళంతా తమ కష్టఫలాన్ని తింటూ, పట్నాలలో సౌఖ్యాలు అనుభవిస్తూ కులుకుతూ ఉండడం చూసి పల్లెలు కన్నీళ్ళు పెడుతున్నాయన్నారు భీమన్నగారు. విజ్ఞానము, ఉద్రేకము గల యువకులు పట్నాలలో ఉండిపోతూ, ఆ

భోగాలకు అలవాటు పడిపోతున్నారు కానీ వారు పల్లెలకు వచ్చి, వారి కష్టాలను కళ్ళారా చూస్తే స్వర్గం దిగి వస్తుందని, ఆ సుప్రభాతమెప్పుడని ప్రశ్నిస్తున్నారు భీమన్న గారు.

మిత్రుని కాళ్లో ముల్లు గుచ్చుకున్నపుడు ఇద్దరూ ఆ ముల్లు తీయడానికి విశ్వప్రయత్నం చేశారు గాని సఫలీకృతులు కాకపోవడంతో, సంగతంతా గమనిస్తున్న ఒక కూలిపిల్ల చిటికెలో నేర్పుగా ముల్లు తీసిందని చెప్పాడు. అంతేనా, పట్నంలో మిత్రులిద్దరూ కాలేజీకి వెళ్తున్నప్పుడు వానలో తడవకుండా గొడుగులో వెళ్తూ, తమ పుస్తకాలు పట్టుకునేందుకు ముందుకురాని నాగరిక యువతి గుర్తుకువచ్చిందని చెప్పి పల్లెప్రజల హృదయసౌందర్యం గుబాళింపజేశారు భీమన్నగారు.

మరో లేఖలో చదువురాని షోకిల్లాలంతా విద్యాభ్యాసాలకని, విదేశాలకని వాళ్ళ పెద్దలు ఉద్యోగస్తులో, కోటీశ్వరులో అయినందుకు లక్షల కొద్ది డబ్బులు వ్యర్థం చేస్తుంటే, అజ్ఞాత కాళిదాసులు, అనామక మహాత్ములు పల్లెటూళ్ళలో, మారుమూలల్లో హతాశులై నశించిపోతున్నారు. అంతేకాదు, సంఘం హెచ్చుతగ్గులలో ఉంది. ధనాన్ని ఒక ప్రమాణంగా తీసుకుంటే ధనవంతులలో అత్యల్ప మానవత్వం, అత్యల్ప ధనవంతులలో అత్యధిక మానవత్వం ఉంటాయన్నారు భీమన్నగారు.

ఈ లేఖలలో బానిసత్వంపై ఏవగింపు, పెత్తందారీతనాలపై పెదవి విరుపు, చదువు మాన్పించి చిన్న పిల్లలను పనులలో పెట్టడానికి కారణమైన పేదరికంపై కసి, సాంఘిక అంతరాలపై కన్నెర్ర కనబడుతూనే ఉంటాయి. తాను స్వయంగా సాగు చేసుకోలేనంత భూమి ఇనాందారుకెందుకు? కష్టపడి భూమిని సాగు చేయగలిగిన వాళ్ళకి ఏమీ లేకపోవడం మరి అన్యాయం కాదా? అని చెప్పిన మాటలలో దున్నేవాడికి భూమి లేకపోవడం గురించిన చింతన ఉంది.

ఒక లేఖలో పంటకుప్పల దగ్గర కావలి పడుకొన్ననాటి అనుభవం గురించి వ్రాస్తూ నేరము–శిక్షల గురించి పంచుకున్న ఆలోచనలు వర్తమాన సందర్భం నుండి కూడా ఆలోచించదగ్గవే. ఈ కుప్ప దగ్గర మేమెందుకు? చలికి బాధపడుతూ వణుకుతూ బాధపడుతున్నాం? కుప్పను దొంగలు దోచుకోకుండానే అయితే అసలు దొంగలెందుకు దోచుకుంటారు? తిండిలేక కదా! తిండి కలిగితే అసలు దొంగలే ఉండరని ఇక్కడ ప్రశ్న, సమాధానం భీమన్నకు తెలిసి వేసినవే. కుప్పలు కావలి కాస్తూ కొబ్బరి చిగుళ్ళ పూరిపాకనే దివ్యభవనంగా, చర్చా సౌధంగా, సౌఖ్యవేదికగా, విహారసీమగా భావించే నైజం జానపదునిది.

భీమన్న దృష్టి 1930లలో వచ్చిన ఆర్థిక అసమానతల మీద, అందుకు కారణమైన భూసంబంధాల మీద ఉందని తెలుస్తోంది. ఈ విధమైన సంఘదౌర్జన్యాన్ని ఎదుర్కొనే విప్లవకారులు అసమానత్వాన్ని బహిరంగంగా ఎదిరించడానికి జంకి, వేరు మార్గాన్ని పట్టిన కొందరు దొంగలుగా చెప్పబడుతున్న ధోరణిని ఆనాడే నిరసనస్వరంతో నమోదు చేశారు భీమన్న. ఎన్నిచట్టాలు, ఎన్ని బందోబస్తులు చేసినా దొంగతనాలు ఆగకపోవడానికి నేరాలు తగ్గకపోవడానికి కారణం సంఘంలో ఉన్న అసమానత్వమేనన్న స్పష్టమైన అవగాహన ఈ లేఖలో కనబడుతుంది.

ప్రభుత్వం ధనవంతులది. శాసనసభలు ధనవంతులవి. ఉద్యోగాలు ధనవంతులవి, అధికారాలు ధవంతులవి. అయితే పేదలకు బ్రతకడానికి ఒకటేమార్గం ఉంది. అది ధనవంతుల దగ్గర సేవకవృత్తి.

అదీ దొరకనప్పుడు చాలా మంది కార్మికులు విదేశాలకు వెళ్ళిపోతారు. ఇందులో ఎక్కడికి వెళ్ళినా సంఘంలో అతి దుర్భరస్థితిని అనుభవిస్తున్న కూలీలను మాత్రం మరచిపోవద్దనే హితబోధ ఉంది.

రోజంతా కష్టపడినా, ఆకలి తీరే పరిస్థితి లేక, అన్యాయం అడుగుల క్రింద అణిగిపోయి జీవ నిర్జీవ గతుల మధ్య అల్లాడుతూ ఉన్న పల్లెటూళ్ళకు కళ ఎక్కడి నుండి వస్తుంది? జీవం నిలబెట్టుకోవడానికి పల్లెలు పాట్లు పడుతున్నాయి. పల్లెలు ఎంత ఏడ్చినా పట్నానికి వినబడదు. పట్నాలకు వినబడేంత గట్టిగా పల్లెలు ఏడ్వలేవు. పల్లెలు భారత సౌభాగ్యం! భారతదేశం బాగుపడడానికి ఎంతకాలం పడుతుందోననే నిరాశ ఒక లేఖలో కనబడింది.

కథల్లో, వాఙ్మయంలో, సంఘంలో జీవం ఉందంటే ఆ జీవం గ్రామాల్లోనే ఉంది. గ్రామాలు సహజ సౌందర్య మధుర పుష్పాలు. పట్నాలు కృత్రిమరంగులో మెరిసిపోయే కాగితపు పువ్వులు.

నువ్వుల చేలోన నూనె పొంగిందీ
లేయావు పొదుగులో నేయి చేరిందీ
అమ్ముకోకుండా ఆరగించండీ
చిమ్ముకోకుండా చేవదేరండీ
మన గ్రామసీమల్ల మణులు పండాలీ
మన భారతీదేవి మహిమ పొందాలీ!

అన్న గేయం కూడా జానపద మిత్రునికి వ్రాయడం జరిగింది. తెలుగు భూమి చాలా సారవంతమయినది. బంగారం పండుతుంది. కాని తెలుగువాళ్ళంటే దేశంలో గౌరవం లేదు. కారణం మనం గౌరవించుకోలేక పోవడమే! గౌరవం వచ్చేది మనిషిని బట్టి కాని హోదాను బట్టికాదు. ధనికుని గౌరవంగా చూడాలని, కూలీని హీనంగా చూడాలని ఏ స్మృతిలోను లేదు.

ప్రపంచంలో కొందరు సుఖపడడానికి, కొందరు కష్టపడడానికి అని చెప్పి వేరే పుట్టారా? సృష్టిలో లేని పక్షపాతం సంఘంలో కలిగింది. దీన్ని సంస్కరించుకుని సంఘ పునర్నిర్మాణం చెయ్యాలి.

"దేశమంటే మట్టికాదోయ్

దేశమంటే మనుషులోయ్" అన్నట్లు దేశం సకలసంపదలతో తులతూగుతూ ఉన్నా, దేశంలోని మనుషులకు గౌరవం లేనినాడు ఆ దేశానికి గౌరవం లేదు. మన దేశంలో శౌర్యం నశించింది. పౌరుషం పరుల పాలయ్యింది. శక్తి చల్లారిపోయింది. బడాయి, సోకు ఈ రెండు మనకు దాపురించాయి. అవి పట్నాల నుంచి క్రమంగా పల్లెలకూ ప్రాకిపోయాయి. పట్నం నాగరికతా వ్యామోహంలో పడి పల్లెలూ తమ మహత్తర వ్యక్తిత్వాన్ని మరిచాయి. ఒకప్పుడు పల్లెల్లో పనీపాట లేనినాడు, నలుగురూ రచ్చబండ దగ్గర చేరి కథలు, కబుర్లు, అనుభవాల దొంతరలు...! అయితే పట్నంలో ఎందుకూ కొరగాని పేకాటలతోను, గాలిపటాలు ఎగరేయడంతోనూ, బీచ్ షికార్లతో, డాన్సింగ్‌లతోనూ కాలం వృధాపుచ్చుతారు. ఇలా పట్నం జీవితం పల్లెటూరి జీవితానికి పరస్పర విరుద్ధంగా ఉంటుంది. పట్నం జీవితం సౌఖ్యమయమయితే, గ్రామ జీవితం కష్టమయం. పట్నవాసం ఆనందకరమైతే, గ్రామవాసం దుఃఖకరం.

గ్రామ జీవితం అర్థం కావాలంటే పూరి గుడిసెలలో, డొక్కనారతాడు మంచం మీద పడుకుని, పచ్చి మిరపకాయ ముక్కను నంజుకుంటూ అంబలి త్రాగి, కిరసనాయిలు దీపం దగ్గర కూలీ మనిషికి ఉత్తరం వ్రాయాలంటారు భీమన్న గారు. ట్రాంబళ్ళు, మోటారు టాక్సీలు, ఎలక్ట్రిక్ ట్రైనులు, కాఫీ హోటళ్ళు, సినీమాలు, రేడియో, సంగీతాలు, హాస్పిటల్ గొడవలు జీవితాన్ని వాయువేగ మనోవేగాలతో ఎక్కడికో తీసుకుపోతున్నట్లు అనిపిస్తుంది పట్నంలో...! రెండెడ్ల బండ్లు, సవారీలు, నాగళ్ళు, మోటలు, గడ్డపారలు, ఊడ్పులు, కలుపుతీతలు, కుప్ప నూర్పులు, పాలిపాటలు, చెమట బొట్లు, పూరి గుడిసెలు ఎక్కడివాళ్ళను అక్కడ ఉంచి పాతేస్తున్నట్లు అనిపిస్తుంది పల్లెలో...!

"కష్టేఫలి" అనే మాట వట్టిది కాదు. ఈనాడు ఒక కూలీ కష్టపడిందంటే ముందుకాలంలో ఒక కూలీ సుఖపడుతుందన్నమాట!! ఒక కూలీ అవమానింపబడిందంటే వచ్చేకాలంలో ఒకామె మహాపతివ్రత కాబోతోందన్న మాట!! ఒక కూలీ ఆకలితో అల్లాడుతూ చచ్చిపోయిందంటే ముందు కాలంలో ఒక కూలీ రాజ్యం ఏలుతుందన్నమాట! ఇప్పుడు కూలీలంతా సంపన్నులై చక్కని మేడల్లో సుఖిస్తారన్నమాట! ఈ విధంగా పట్టణ గ్రామీణ తులమాన జీవితక్రమ చిత్రీకరణలో కలాన్ని పరుగులు పెట్టించిన మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ బోయి భీమన్న గారు ఈ జాబుల ద్వారా కోరుకున్న సామాజిక చైతన్యం, సమసమాజంలో తప్పనిసరిగా రావాలనే ఆకాంక్షను నెరవేర్చేదిశగా వడివడిగా అడుగులేసి భరతభూమి సౌభాగ్యాన్ని దిశదిశలా చాటి చెబుదాం!!

-- జైహింద్ --

ఉపయుక్త గ్రంథాలు :

1) జానపదుని జాబులు – పద్మశ్రీ బోయి భీమన్న
2) ధర్మంకోసం పోరాటం – పద్మశ్రీ బోయి భీమన్న
3) భీమన్న పై అంతర్జాల వ్యాసాలు
4) భీమన్నపై ఆకాశవాణి ప్రసంగాలు

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న సాహిత్యంలో మానవతావాదం

- గండి స్వామిప్రసాద్,
ఉపాధ్యాయుడు
సెల్ : 99492 84754

ప్రవేశిక :

మానవతా వాద రచయితలలో పద్మభూషణ్ బోయి భీమన్నది ఒక విలక్షణ మార్గం. సమానత్వం, మానవ అభివృద్ధి మూలసూత్రాలుగా ఆయన రచించిన రచనలు సామాజిక మార్పుకు దోహదం చేశాయి. భీమన్న దాదాపు 70 పుస్తకాలు రాశారు. పద్యం, గేయం, నాటకం, వచనం ఇలా అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. ప్రతి ప్రక్రియలో తనదైన ముద్రను వేసిన మహోన్నత సాహితీవేత్తగా వెలుగొందారు.

ముఖ్యోద్దేశం :

నాడు భారతదేశంలో నెలకొన్న సాంఘిక అసమానతల్ని నిర్మూలించేందుకు గౌతమ బుద్ధుడు కృషి చేస్తే తరువాత మధ్యకాలంలో కబీర్, వేమన వంటివారు సమసమాజ స్థాపన కోసం కృషి చేశారు. ఆధునిక యుగంలో జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్‌లు ప్రధానంగా కనిపిస్తారు. భీమన్న సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకొని తన రచనల ద్వారా ఎందరో అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలను ప్రభావితం చేశారు. పాలేరు, కూలిరాజు వంటి నాటకాలు మధుబాల, దీపసభ వంటి కావ్యాలు సాంఘిక చైతన్యాన్ని ప్రభోదించాయి. భీమన్న రచనలపై ఎన్నో పరిశోధనలు జరిగాయి. ప్రస్తుతం జరుగుతున్నాయి.

అస్పృశ్యతా నివారణ, శ్రామిక వృత్తిపట్ల గౌరవం, సామ్యవాద సిద్ధాంతాల చర్చ, సమన్వయ దృష్టి వంటి అనేక కోణాలు ఆయనను ఒక సంఘ సంస్కర్తగా, మేధావిగా అన్నింటికీ మించి ఒక మానవతావాదిగా చరిత్రలో నిలబెట్టాయి. అటువంటి మహనీయుని రచనల ప్రత్యేకతను తెలుసుకోవడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

భీమన్న నాటకాలు – సామాజిక చైతన్యం :

బోయి భీమన్న స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన రచయిత. సామాజిక సమస్యలను తీసుకొని అప్పటి సమాజాన్ని పరిశీలించి పరిస్థితులను విశ్లేషణ చేసి నాటకాలు రాశారు. సామాజిక సమస్యలకి నాటకాల ద్వారా పరిష్కార మార్గాన్ని చూపించి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించారు.

భీమన్న పౌరాణిక, సాంఘిక నాటకాలు రాశారు. పాలేరు నాటకం, కూలిరాజు నాటకం సమాజాన్ని అత్యంత ప్రభావితాన్ని చేశాయి. పాలేరు నాటకం గొప్ప సామాజిక మార్పుకి దారి తీసింది. ఆ నాటకం చూసిన శ్రామిక వర్గ కుటుంబాలకు చెందిన అనేకమంది ఉన్నత చదువులు చదువుకొని, ఉన్నత పదవులు పొందారు. జీవితాలను మార్చుకున్నారు. కూలిరాజు నాటకం సాంఘిక చైతన్యానికి, అభ్యుదయ భావ విస్తరణకు, కులమత నిరసనకు, భూస్వాముల దోపిడీలపై తిరుగుబాటు బావుటాను ప్రదర్శించింది. పేదలకు దిశానిర్దేశం చేసింది.

సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన కులవ్యవస్థ, రోజురోజుకి పెరుగుతున్న అవినీతి, ధనవంతుల అహంకార విషపూరిత అధికారదర్పం ప్రపంచానికి అన్నం పెడుతున్న శ్రామికుల దుర్భర జీవితాన్ని చూసి చలించిపోయిన భీమన్న కూలిరాజు నాటకం ద్వారా అంబేద్కర్ మహనీయుని ఆశయ సాధనకు తోడ్పడ్డారు. ఈ నాటకం కూలీల కష్టాన్ని, హరిజన అభ్యుదయ భావాల్ని, కులాంతర మతాంతర వివాహ ప్రోత్సాహ భావాల్ని, స్త్రీల హక్కుల సాధనలో భాగస్వామ్యాన్ని మద్యపానంలాంటి వ్యసనాల నిషేధాన్ని వస్తువుగా చేసుకొని సాంఘిక చైతన్యాన్ని నింపింది. కార్మిక, కర్షకవర్గ సమస్యలకు పరిష్కార మార్గంగా నిలిచింది.

"నల్ల చీమలు, తెల్ల చీమలు/ఎర్ర చీమలు, పచ్చ చీమలు/చలి చీమలు, పులి చీమలు/ కండ చీమలు, రెక్కల చీమలు/అబ్బో, ఎన్నెన్ని రకాల చీమలు!/ ఎన్నెన్ని రంగుల చీమలు!/నల్ల చీమలు నోట్లోని బియ్యపు గింజను/ అది తింటున్న లవమే ఇదీ కావాలంటున్నది!/ ఒక్కో రంగు చీమలకు ఒకో పుట్ట/ ఏ రకం చీమలకైనా ఉండే దొకే పొట్ట/ఏ పొట్ట నిండడానికైనా/కావలసింది ఇన్ని గింజలు"

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3 వచన కవితలు భాగం – 2: పుట 91)

ఇది చదవగానే రచయిత ఏం చెప్పదలచుకున్నారో సులభంగా అర్థమవుతుంది. బలహీన ప్రాణులైన చీమలు చిన్నచిన్న వాటికోసం కొట్టుకుంటాయి. అవన్నీ ఒకే జాతికి చెందినవి అయినా ఐక్యత ఉండదని రచయిత అభిప్రాయం. చీమలు రకరకాలుగా ఉన్నట్లే మనుష్యులు కూడా అంతే. రంగునుబట్టి రూపాన్ని బట్టి మేం గొప్ప అంటే మేం గొప్ప అని విడిపోతున్నారు. అందరూ మనుష్యజాతే అయినప్పటికి విడిపోయి ఉండడం వలన ప్రయోజనం శూన్యం. సంఘటిత శక్తితో సమస్యల్ని పరిష్కరించుకోవాలని రచయిత పేర్కొన్నాడు.

నిష్కల్మషమైన జీవన విధానానికి మానవుల మధ్య వర్ణబేధాలు అవసరం లేదని, వర్ణబేధాలు కొంతమంది స్వార్థం కోసం, ఆధిక్యతకోసం సృష్టించుకున్నవని వాటిని నిర్మూలించగలిగితే భారతీయుల ఐక్యత బలపడుతుందని రాగవాసిష్ఠం నాటకం ద్వారా భీమన్న గొప్ప సందేశాన్నిచ్చారు.

వర్ణాంతర వివాహం ఇతివృత్తం ఆధారంగా పడిపోతున్న అడ్డుగోడలు నాటకం భీమన్న గారికి వర్ణాంతర వివాహ పద్ధతిపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తుంది. ఇది చిన్న నాటిక అయినప్పటికి గొప్ప సందేశాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది.

ఆదికవి వాల్మీకి నాటకం ద్వారా భీమన్న కులతత్వవాదులు సృష్టించిన కొన్ని అపవాదాల్ని ఖండించారు. బాలయోగి అనే ఏడంకాల నాటకం ద్వారా కులం కాదు గుణం ప్రధానమని తెలియజేసారు.

ఈ విధంగా వీరు సృష్టించిన రూపక సాహిత్యం ప్రత్యేక గుర్తింపును పొంది సమాజంలో మానవతా విలువలు పెంపొందడానికి దోహదపడింది.

భీమన్న కావ్యాలు – అభ్యుదయ దృక్పథం :

బోయి భీమన్న గారు 1931లో వ్రాసిన మధుబాల కావ్యం ఉప్పుసత్యాగ్రహ ఉద్యమం నాటి స్ఫూర్తితో రాసిన కావ్యం. భారతదేశానికి ఒక జాతీయం సోషలిస్టు విధానాన్ని ప్రతిపాదించిన కావ్యం. స్వాతంత్ర్యయోధుడు సర్వోదయ నాయకుడుగా మారిన ఇతివృత్తం. సర్వోదయం అంటే భీమన్న ఊహలో మానవతా ప్రధానమైన ఒక సంక్షేమ సమాజం.

సమాజం ప్రగతిని సాధించడానికి సమతాదృక్పథం తప్పనిసరి. ఆ భావనా ఛాయలు దీపసభ కావ్యంలో ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.

జన్మాంతర వైరమ్ కావ్యం ద్వారా భీమన్న కుల మత రహిత సమాజాన్ని కాంక్షించాడు. భీమన్న గారి లక్ష్యం గొప్పది. నేడు దేశప్రజలంతా కోరుకోవాల్సింది, చేరుకోవాల్సింది ఈ గమ్యానికే. ఇదే సమాజ నిర్మాణాన్ని డాక్టర్ అంబేద్కర్ కోరుకున్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ఈ కావ్యం ప్రాధాన్యత నిస్తుంది.

అంబేద్కర్ సుప్రభాతం ద్వారా అంబేద్కర్ జీవితంలో అవమానాలను అభివృద్ధి సోపానాలుగా మలచుకొని తన తుదిశ్వాస వరకు దళితాభ్యుదయం కోసం చేసిన కృషిని వర్ణించారు. ఆయన అనుభవించిన కులపరమైన, ఆర్థికపరమైన ఇక్కట్లు, స్వేచ్ఛా సమానత్వాల కోసం ఆయన చేసిన కృషి, ఈ కావ్యంలో వస్తువుగా తీసుకున్నారు.

విప్లవ, ప్రణయ మానవతలున్న గేయకావ్యం రాగోదయం. ఈ కావ్యంలో మొత్తం 130 గేయాలున్నాయి.

సామాజిక మార్పును కాంక్షించిన వచన కవితలు :

భీమన్న గారి రచనలలో అత్యంత విశిష్టమైనది గుడిసెలు కాలిపోతున్నై కావ్య సంపుటి. ఈ కావ్యంలో కులవ్యవస్థ కూలనిదే భారతజాతి విముక్తి పొందదని తెలిపారు. కులం, మతం, రాజకీయ పార్టీల పేరుతో అనునిత్యం మోసపోతుంది పేద ప్రజలేనని భీమన్న పేర్కొన్నారు.

సమాజంలో తరతరాలుగా కరడుగట్టుకుపోయిన మూఢాచారాలు, గుడ్డిభక్తి, కుల వివక్షతలపై తిరుగుబాటు ధోరణిని ప్రకటించాడు.

ధర్మం కోసం పోరాటంలో భీమన్న ఈనాటి సాంఘిక వ్యవస్థమీద, కులవ్యవస్థ మీద అసహ్యం. సంఘం సమూలంగా మారాలని ఆయనకున్న ఆకాంక్ష, సంఘాన్ని మార్చి తీరాలని ఆయనకున్న ఆవేశాన్ని అక్షరీకరించారు.

భీమన్న గారి రచనలలో సామాజిక చైతన్యంతో సమాజాన్ని ముందుకు నడిపే లక్ష్యం కనిపిస్తుంది. అందుకే భీమన్న గ్రామాన్ని ప్రామాణికంగా తీసుకొని వసుధైక కుటుంబాన్ని సృష్టించిన కవి. సాహిత్యం ద్వారా విశ్వమానవతా వాదాన్ని చాటినకవి నేటి విద్యార్థులు భీమన్న ప్రగతిశీల మానవీయ ఆలోచనలను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1) డా॥ బూర్గుల కేశవులు బోయి భీమన్న సాహిత్యం – జాతీయ దృక్పథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

2) దళిత సాహిత్యం : డా॥ సుదర్శనరాజు, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

3) వ్యాస పరిమళం : డా॥ తరపట్ల సత్యనారాయణ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

జానపదుని జాబులు ఒక పరిశీలన

– బి శ్వేత,
తెలుగు అధ్యాపకురాలు,
సెల్ : 8886093090

ఉపోద్ఘాతం:

బోయి భీమన్న గారు పద్య కవిగా, గేయ కవిగా, వచన కవిగా, నాటక కర్తగా బహుముఖీనమైన పాండిత్యాన్ని, వైవిధ్యాన్ని ప్రదర్శించారు. 1911 సెప్టెంబర్‌లో తూర్పుగోదావరి జిల్లాలోని మామిడికుదురు గ్రామంలో ఒక హరిజన కుటుంబంలో పుట్టిన బోయి భీమన్న గారు సుమారు 70కి పైగా పుస్తకాలు రాశారు. గుడిసెలు కాలిపోతున్నాయి (కవితల సంపుటి), కూలి రాజు (నాటకం), రాగ వాశిష్ఠం (నాటకం), పాలేరు నాటకం, పిల్లీ శతకం, జానపదుని జాబులు, రాగవైశాఖి, ధర్మం కోసం పోరాటం, రాజకీయ వీరుడు డాక్టర్ ఖాను వంటి ఎన్నో రచనలు చేసి కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం నుండి పద్మభూషణ్ పురస్కారం వరకు పొందారు.

విషయ వివరణ:

బోయి భీమన్న గారి "జానపదుని జాబులు" కేవలం కొన్ని లేఖల సంపుటి మాత్రమే కాదు, అది గ్రామీణ భారత ఆత్మఘోషకు ఒక సాహిత్య రూపం. ఈ లేఖలు తొలుత 1932లో 'జనవాణి' పత్రికలో "పల్లెటూరి లేఖలు" అనే పేరుతో, అనంతరం 1933లో 'ప్రజామిత్ర' పత్రికలో "జానపదుని జాబులు" అనే పేరుతో ప్రచురితమయ్యాయి. 1930ల కాలంలోని గ్రామీణ సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఇది కళ్ళకు కట్టినట్లు చూపుతుంది.

కొద్దికాలం పాటు పట్నంలో చదువుకున్న జానపదుడు పేదరికం వల్ల చదువును కొనసాగించలేక తిరిగి తన సొంతూరు వెళ్లి, పల్లెటూరి పనుల్లోనే మునిగిపోయాక శ్రీమంతుడైన తన పట్నం స్నేహితుడికి పల్లెటూర్లో ఉండే తన అవస్థలు అన్నిటిని గురించి లేఖలు రాయడమే జానపదుని జాబులు అనే వచన గ్రంథం లోని ప్రధాన ఇతివృత్తం.

నెచ్చెలీ, సుహృదీ, సఖా అంటూ మొదలైన ఈ జానపదుని జాబులు పల్లెటూరి వాతావరణం, అక్కడి మనుషుల అమాయకత్వం, ప్రకృతి అందాలతో పాటుగా రైతులు అనుభవిస్తున్న కఠినమైన

కష్టాలను ఈ లేఖలు వివరిస్తాయి. పట్టణ వాసుల స్వార్థం, పల్లెల పట్ల వారికున్న నిర్లక్ష్యాన్ని కూడా రచయిత ఇందులో ఎండగట్టారు.

1. ప్రధాన పాత్రల చిత్రణ:

ఈ రచన మొత్తం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగే ఉత్తర ప్రత్యుత్తరాల ఆధారంగా సాగుతుంది.

జానపదుడు (లేఖ రచయిత) ఇతడు పల్లెటూరి యువకుడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలో ఆపేసి, అనివార్యంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. ఇతడు కష్టజీవి, నిక్కచ్చిగా మాట్లాడే మనస్తత్వం కలవాడు. తన కష్టాలను,రైతులు, కూలీలు, పేదవారి కష్టాలను చెప్పుకుంటూనే, సమాజంలోని లోపాలను మిత్రునికి వివరిస్తాడు.

పట్టణ మిత్రుడు (లేఖ గ్రహీత): ఇతడు నగరంలో చదువుకుంటూ, సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతుంటాడు. పల్లెటూరి కష్టాల పట్ల గానీ, అక్కడి జీవనశైలి పట్ల గానీ ఇతనికి పెద్దగా అవగాహన ఉండదు. జానపదుడు రాసే లేఖలు ఇతని ఆలోచనా దృక్పథాన్ని మార్చడానికి దోహదపడతాయి.

2. సామాజికాంశాలు:

I. **మద్యపానం:** నెచ్చెలీ! అంటూ మొదలైన మొదటి లేఖలో, రచయిత సాయంత్రం వేళ ఇంటికి వస్తుండగా, కల్లుపాక దగ్గర జరిగిన గలాటా చూసానని తన స్నేహితుడికి లేఖలో రాశాడు.

ఈ గలాటా ప్రతిరోజూ జరిగేదే అంటాడు రచయిత. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని, రక్తాన్ని నీరుగా మార్చి శ్రమించగా, సాయంత్రం చేతికందిన కూలి డబ్బులను, ఇంట్లో భార్య పిల్లలు ఆకలి ఆకలి అని అలమటిస్తున్నప్పటికీ, కల్లు పాకలో సమర్పించుకొని, పీకల దాకా తాగి, వట్టి చేతులతో, తూలిపోతూ ఇంటికి వెళ్ళే ఎందరో దురదృష్ట కార్మికులను రోజూ చూస్తూ ఉంటానని రాశాడు రచయిత. మద్యపానం వల్ల పేద కుటుంబాలు ఎలా చిన్నాభిన్నం అవుతున్నాయో వాస్తవ రూపంలో వివరించారు. కూలీలు తాము సంపాదించిన కొద్దిపాటి డబ్బులను మద్యానికి తగలేసి, ఇళ్లకు వచ్చి భార్యాపిల్లలను హింసించడాన్ని రచయిత తీవ్రంగా ఖండించారు. సంపూర్ణ మద్య నిషేధం యొక్క అవసరాన్ని రచయిత ఇక్కడ నొక్కి వక్కాణించారు.

II. **గ్రామీణ జీవన చిత్రణ:** ప్రతి లేఖలోను గ్రామీణ జీవితం చిత్రించబడింది. ప్రతి లేఖలోను రైతులు, రైతు కూలీల దుస్థితి చిత్రించబడింది. పంట పండించే రైతుకే తిండి లేక ఒక్కోసారి పస్తులు ఉండాల్సి రావడం ఎంతో బాధాకరమైన విషయం. దీనికి కారణం ఇనాందార్ల, కామందుల శ్రమ దోపిడీ అంటాడు రచయిత. వ్యవసాయంలో పెట్టుబడుల కోసమో, ఇంట్లో గడవడానికో, లేక కౌలు రూపంలోనో కామందులకు, ఇనాందారులకు అప్పు పడిపోయిన రైతులు, కూలీలు ఏళ్ళకేళ్ళు దాస్యం చేయాల్సి వస్తుంది. అయితే ఈ దాస్యం వాళ్ల తరమే కాక వాళ్ళ పిల్లల తరం కూడా చేయాల్సి రావడం మరింత దారుణమైన విషయం. ఎంత దాస్యం చేసినా అప్పు తీరకపోవడంతో, ఉన్న మెరక, పల్లం కామందు రాయించుకోవడంతో వీధిన పడ్డ కుటుంబాలు అనేకం కనిపిస్తాయి ఈ జానపదుని జాబుల్లో.

గ్రామాలే దేశానికి వెన్నెముక లాంటివి కాబట్టి గ్రామోద్ధరణ అనేది అత్యంత ఆవశ్యకమైన అంశం. కానీ నాయకుల యొక్క స్వార్థం వల్ల గ్రామోద్ధరణ కేవలం కాగితం లోనే ఉండిపోయింది కానీ వాస్తవ రూపంలోకి రాలేదని చెప్పాడు రచయిత.

ఓ లేఖలో తన చెల్లెలికి లెక్కలు చెబుతూ, రూపాయిని అణాలుగా మార్చాలంటే 16 తో గుణిస్తే సరిపోతుందనే ఆలోచన కంటే, అదే రూపాయిని దుకాణానికి తీసుకెళ్లి, అణాలుగా మార్చడం వాస్తవమైన ఆలోచన అని తెలియజేశాడు రచయిత. అలాగే గ్రామోద్ధరణం అంటే పత్రికల్లో రాసుకుంటేనో, ఉపన్యాసాలు ఇస్తేనో, రోడ్ల వెంట మోటార్ కార్లలో నాలుగు సార్లు తిరిగితేనో జరిగే పని కాదు. ఇవన్నీ రూపాయిని 16 చేత గుణించినట్లే వ్యర్థాలు. కాగితం మీద కోట్లకు కోట్లు సంఖ్యలు వేసుకుని 'ఇంత ధనం ఉంది నాకు...' అని సంతోషించడం ఎటువంటిదో ఇవన్నీ అటువంటివే అంటాడు రచయిత. దాని యొక్క అర్థం గ్రామోద్ధరణం అంటే చేతల్లో చేయాల్సిన పని అని చెప్పకనే తెలియజేశాడు రచయిత.

పట్టణాల్లో విద్య, సౌకర్యాలు పెరుగుతున్నా, పల్లెల్లో నిరక్షరాస్యత, పేదరికం, మరియు అంధవిశ్వాసాలు అలాగే ఉండడాన్ని రచయిత ప్రశ్నించారు. శ్రామికులకు సరైన గౌరవం లేని సమాజం అభివృద్ధి చెందలేదని బోయి భీమన్న విశ్లేషించారు.

పల్లెల్లో కాలం సక్రమంగా నడవదు. ఒకరోజు ఊపిరి సలపని పని ఉంటే, మరోరోజు అసలు పనే ఉండదు. కూలీలకు నిత్యం ఉపాధి లేక స్థిరమైన ఆదాయం రాకపోవడం వల్ల వారి జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతున్నాయో ఈ లేఖలు వివరిస్తున్నాయి.

III. **దళితుల స్థితిగతులు:** జానపదుని జాబులులోని దాదాపు ప్రతి లేఖలో కూడా దళితుల యొక్క స్థితిగతులు పేర్కొనబడ్డాయి. వారి గ్రామంలో ఈ జానపదుడు కాస్త చదువుకున్నవాడు కాబట్టి ఎవరికైనా ఉత్తరాలు రాసి పెట్టాలన్నా, ఎవరికైనా వచ్చిన ఉత్తరాలను చదివి పెట్టాలన్నా, ఇంకా ఏదైనా పద్దులు రాసి పెట్టాలన్నా అందరూ ఇతనినే అడిగేవారు.

అలా ఒకనాడు అందరూ పద్దులు రాయమని ఒకేసారి వచ్చారు. ఈరోజు ఏమైనా మంచి రోజా అందరూ ఒకేసారి వస్తున్నారు అన్నట్టుగా జానపదుడు అడగగా ఆరోజు శనివారం సంత అన్నది తెలియజేశారు. సంత ఖర్చుకు డబ్బుల కోసం ఒక స్త్రీ తన కోకను మూడు పావలాలకు తాకట్టు పెట్టిందట. మరొకతను మూడవ తరగతి చదువుతున్న తన కొడుకును ఒక ఇనాందారుని దగ్గర పాలేరుతనానికి కుదిరించాడు. వాటికి సంబంధించిన పద్దులు రాయమనే రచయిత వద్దకు వచ్చారు. పిల్లవాడిని చదువు ఎందుకు మాన్పించారని కోపంతో అడిగిన రచయితకు, మరి ఏం చేయాలి? మింగడానికి మెతుకే లేదు. మీసాలకు సంపెంగ నూనె ఎందుకు మాకు? అన్న సమాధానం వచ్చింది.

ఈ ఒక్క సంభాషణ ద్వారానే ఆనాటి దళితుల యొక్క జీవితాన్ని మనం పూర్తిగా అర్థం చేసుకోవచ్చు.

దళిత మరియు ఇతర బడుగు వర్గాల ప్రజలు తమ హక్కుల కోసం పోరాడాలని, విద్య ద్వారానే అంటరానితనం మరియు పేదరికం నుండి బయటపడవచ్చని భీమన్న ఈ లేఖల ద్వారా సందేశాన్ని ఇచ్చారు.

ఓ లేఖలో తన స్నేహితునికి లేఖ రాయడం ఆలస్యమైనందుకు క్షమించమని కోరుతాడు రచయిత. అందుకు కారణం ఇంకేమీ కాదు తిండి వెతుక్కోవడం తోటే ప్రతి రోజు సరిపోతుందట...

బ్రతుక్కి ఉదర పోషణమేనా ఉద్యోగం? అని ప్రశ్నిస్తాడు రచయిత. రాత్రింబవళ్లు పనిచేయడం, రెక్కలు ముక్కలు కొట్టుకోవడం, ఉడికీ ఉడకని (ఆకలి చేత) చాలీచాలని (యజమానుల స్వార్థం మూలాన) గంజినీళ్ళతో కడుపు నింపుకోవడం, మళ్ళీ విశ్రాంతి లేకుండా పనికి పోవడం. ఇంతేనా ఈ ప్రపంచంలో పేదజీవులకి? అనే ప్రశ్న తోటే రచయితకు తెల్లారిందట. ఈ మాటల ద్వారా ఆనాటి దళితులు, పేదలు ఎంతటి శ్రమ దోపిడీకి గురవుతున్నారో తెలియజేశారు రచయిత.

ఒకనాడు రచయిత ఇంట్లో తిండి గింజలు ఏమీ లేక, వేరే గత్యంతరం కూడా ఏమీ లేక, కామందులు పని మీద ఏమైనా ఇస్తారేమో అడగడానికి వెళ్ళాడు. కామందు చావిడిలో చీట్ల పేక దగ్గర కూర్చుని, నీవెందుకు ఇక్కడికి వచ్చావు అన్నట్టుగా అడిగాడు. పని మీద ఏమైనా అడుక్కు వెళ్దామని వచ్చానని రచయిత తెలియజేశాడు. దానికి కామందు ఓహో అన్నాడు. కానీ మళ్ళీ రచయిత వంక చూడనే లేదు. నిలబడి నిలబడి రెండు గంటలు గడిచినా కామందు రచయిత వంక చూడనే లేదు. ఇక నిలబడలేక వీధి అరుగుకు జేరబడ్డాడు. అక్కడ కండ చీమలు వెన్ను పట్టుకుని కరిచాయట, దగ్గర ఉన్న మామిడి చెట్టుకు జేరబడితే కొత్తగా విచ్చుకున్న పువ్వుల గుత్తుల్లో నుండి తేనె చుక్కలు మీద రాలాయట. అరుగు మానవ కల్పితం. వృక్షం ప్రకృతి సిద్ధం. ప్రకృతి అందరినీ ప్రేమగా చూస్తుంటే, మనుషులే కులాలు, వర్ణాలు అంటూ ఒకరికొకరు దూరమైపోతున్నారని తెలియజేశాడు రచయిత.

IV. **పండగలు – సంస్కృతి:** జానపదుని జాబుల్లో దసరా, దీపావళి, సంక్రాంతి, క్రిస్టమస్ వంటి పండగల యొక్క ప్రస్తావన కలదు. పండగ ఏదైనా సరే ఉన్నవాళ్లకే పండగలా ఉంటుంది. పేదవాడికి మాత్రం అన్ని రోజులు ఒకటే అంటాడు రచయిత. సంక్రాంతి పండగ సందర్భంగా పండగ పూట కూడా కూలీ డబ్బుల కోసం తన కామందును దీనంగా ప్రార్థిస్తున్న ఒక కూలి గురించి రాశారు బోయి భీమన్న గారు. పండగ పూట కూడా ప్రజలకు సంతోషం లేదు. ప్రజలు తమ సంతోషాన్ని ధన దేవతకు బలిస్తున్నారు. క్రూరమైన సంఘమిది. ఒకరి ఏడుపుతో, రక్తంతో వేరొకరికి సౌఖ్య సౌధాలు నిర్మిస్తోందని అన్నాడు

రచయిత. అలాంటి ఈ సంఘం మారాలని బలంగా కోరుకున్నాడు. సంఘాన్ని కేవలం తిట్టినంత మాత్రాన సంఘం మారదు. కొత్త సంఘం కావాలి. కొత్త ఉత్తేజం, కొత్త జీవనం కావాలి. పాత అనేది అసలు ఉండకూడదని కోరుకున్నాడు రచయిత.

జానపదులు కష్టంలోనూ, శ్రమలోనూ తమ బాధను అలసటను మర్చిపోయేందుకు చిత్రవిచిత్రమైన కథలు, పాటలు పాడుకుంటూ ఉంటారని రచయిత తెలియజేశారు. భూదేవి అప్పు కథ లాంటివి ఇందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు.

3. సాహిత్య ప్రాధాన్యత :

తెలుగు సాహిత్యంలో బోయి భీమన్న గారి జానపదుని జాబులు ఒక విప్లవాత్మకమైన మార్పుకు చిహ్నం. ఈ వచన గ్రంథం దళిత శ్రామిక సాహితీ మూలాలను, అభ్యుదయ దృక్పథాన్ని కలిగి ఉంది.

1930ల కాలంలోనే అణగారిన వర్గాల బాధలు వారి శ్రమ దోపిడీని ఇతివృతంగా తీసుకోవడం ఒక గొప్ప సాహసమే. డాక్టర్ బోయి భీమన్న గారు తన అనుభవాలనే సాహిత్యంగా మలిచారు. జానపదుని జాబులు తెలుగులోని దళిత చైతన్య గ్రంథల్లో అగ్రస్థానంలో నిలుస్తుంది.

అంతేగాక గిడుగు రామ్మూర్తి గారు ప్రారంభించిన వ్యవహారిక భాషా ఉద్యమాన్ని బోయి భీమన్న గారు ఈ లేఖల ద్వారా సామాన్యుడి చెంతకు చేర్చారు. పండితుల భాషకే పరిమితమైన సాహిత్యాన్ని పామరుల భాషలోకి మళ్లించి, భాషా వికాసానికి సైతం తోడ్పడ్డారు.

ఈ గ్రంథం కేవలం గ్రామీణ జీవితాన్ని దళితుల జీవితాన్ని వర్ణించడమే కాకుండా సామాజిక మార్పును ఆశించింది. మహాత్మాగాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి ఆలోచనల ప్రభావంతో కుల నిర్మూలన, పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఈ రచన కొనసాగింది.

ముగింపు:

జానపదుని జాబులు 1930ల నాటి వాస్తవిక, గ్రామీణ, దళిత, శ్రామిక జీవన చిత్రణ చేస్తూ కొనసాగిన లేఖా స్రవంతి. జానపదుని జాబులు తెలుగు సాహిత్యంలో లేఖల ప్రక్రియకు ఒక కొత్త ప్రాణం పోశాయి. "పల్లెటూళ్లు దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు" అని చెప్పడమే కాకుండా, ఆ పట్టుగొమ్మలు పేదరికం, నిరక్షరాస్యత, మద్యపానం, శ్రమదోపిడి వంటి వాటి వల్ల ఎలా శిథిలమవుతున్నాయో హృద్యంగా వివరించిన అద్భుత రచన ఇది. జానపదుని జాబులు నేటి ఆధునిక కాలానికి కూడా వర్తిస్తాయి. నేటికీ గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పోవడం, వ్యవసాయం సంక్షోభంలో ఉండటం వంటి సమస్యలను మనం చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో భీమన్న రచన ఒక 'చారిత్రక హెచ్చరిక'గా నిలుస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 4 – వచన గ్రంథాలు భాగం 1, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు, హైదరాబాద్ – జూన్ 2010

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న రచనలు: సమకాలీన సమాజానికి ప్రాసక్తి

– డా. ఎం.ఎ. మాలిక్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్ : 9849585332

ఈ పరిశోధన వ్యాసం బోయి భీమన్న గారి రచనలు ఆధునిక సమాజంలో ఎలా ప్రాసంగికంగా నిలుస్తున్నాయో విశ్లేషిస్తుంది. అతని కవిత్వం, ప్రజాగేయాలు, నవలలు, వ్యాసాలు అన్నీ బహుజన అణచివేత, శోషణ, సామాజిక ఇతరాయణం, సమాజంలో ఉన్న బ్రాహ్మణీయ ఆధిపత్యం, అన్యాయం, అసమానతపై గళమెత్తాయి. భీమన్న రచనలు కేవలం సాహిత్యం కాదు అవి అణగారిన వర్గాలకు సామాజిక చైతన్యం, ఉద్యమీకరణ మరియు హక్కుల సాధనకు ఆయుధాలు. ఈ వ్యాసం అతని ముఖ్య రచనలను విశ్లేషించి వాటి ఆధునిక ప్రాసంగికతను వివరించింది.

I. పరిచయం

బోయి భీమన్న తెలుగు సాహిత్యంలో మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ వంటి గౌరవాల్ని అందుకున్న ప్రముఖ సామాజిక సాహితీవేత్త. ఆయన రచనలు సామాజిక అసమానతలు, వర్గ వివక్ష, దళిత బహుజన హక్కుల కోసం సాగిన పోరాటాలను ప్రతిబింబిస్తాయి. సమాజంలో అణగారిన వర్గాల సమస్యలను సామాన్య ప్రజలకు చేరేలా ఆయన రచనలు బలమైన వేదికగా పనిచేశాయి. బోయి భీమన్న తెలుగు నేలపైనే కాదు దేశవ్యాప్తంగా బహుజన ఉద్యమాలకు సాహిత్య ఆయుధాన్ని అందించిన మహోన్నత రచయిత. ఆయన రచనలు అణచబడిన వర్గాల బాధలు, ఆరాటాలు, కలలు, హక్కుల కోసం పోరాటాలను ప్రతిబింబిస్తాయి. భీమన్న సాహిత్యం అంధవిశ్వాసం, కులవివక్ష, దోపిడీ వ్యవస్థ, మూఢాచారాలను ధ్వంసం చేయడానికి దారితీసింది.

II. పరిశోధనా లక్ష్యాలు

ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశ్యం భీమన్న రచనలలో ప్రతిఫలితమైన సామాజిక నిష్పత్తిని విశ్లేషించడం. ప్రస్తుత సమాజంలో ఉన్న వివక్షల నేపథ్యంలో ఆయన రచనలు ఎంతవరకు

ప్రభావవంతంగా ఉన్నాయో తెలుసుకోవడం. దళిత బహుజన ఉద్యమాలకు ఆయన ఆలోచనల ప్రాసక్తి పరిశీలించడం కూడా ఒక ముఖ్య అంశం.

1. బోయి భీమన్న రచనల్లో బహుజన అణచివేత ప్రతిబింబాన్ని విశ్లేషించడం.
2. సామాజిక చైతన్యం, ఉద్యమీకరణలో భీమన్న సాహిత్య పాత్రను నిర్ధారించడం.
3. అతని రచనలు ఆధునిక భారత సమాజానికి ఎలా ప్రాసంగికంగా ఉన్నాయో తెలియజేయడం.
4. భీమన్న రచనల్లో విలువలు, సమానత్వం, న్యాయసూత్రాల ప్రతిఫలనం పరిశీలించడం.

III. పరిశీలన గ్రంథావలోకనం

పలువురు పరిశోధకులు భీమన్న గారి రచనలను సామాజిక వాస్తవికత, దళిత సాహిత్య దృక్కోణం, బహుజన స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణా సాంస్కృతిక నాటకం వంటి కోణాలతో విశ్లేషించారు. ప్రముఖుల గ్రంథాలు, విమర్శలు భీమన్న సాహిత్యం అణచబడిన వర్గాలకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నాయి.

1. సామాజిక వాస్తవికతపై పరిశోధనలు

భీమన్న గారి సాహిత్యాన్ని సామాజిక వాస్తవికతతో అనుసంధానించి పలువురు విమర్శకులు పరిశీలించారు. గోపాలకృష్ణమూర్తి (1981) తన తెలుగు సాహిత్యంలో వాస్తవిక ధోరణులు గ్రంథంలో, సామాజిక అసమానతలను ప్రత్యక్ష అనుభవంతో వ్యక్తీకరించే రచయితలలో భీమన్నను ప్రస్తావిస్తున్నారు. ఆయన కవిత్వంలో పేదరికం, అణచివేత, కుల వరుసలోని అన్యాయం వంటి అంశాలు నిక్షిప్తమై ఉండటం వాస్తవిక సాహిత్య లక్షణాలకు ముఖ్య ఉదాహరణగా భావించారు.

రామచంద్రం (1994) సంపాదకత్వంలో వెలువడిన ఆధునిక తెలుగు కవిత్వం సంకలనంలో కూడా భీమన్న కవిత్వం శ్రమజీవుల జీవితగాథలను రాజకీయ స్పృహతో మిళితం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమైంది. సామాజిక నిర్మాణాల్లోని అసమానతలను ప్రశ్నించడం ఆయన కవిత్వానికి ప్రత్యేకమైన బలం అని పరిశోధకులు సూచించారు.

2. దళిత సాహిత్య దృక్కోణంపై పరిశోధనలు

తెలుగు దళిత సాహిత్యంపై ప్రభావం చూపిన రచయితలలో భీమన్న ప్రత్యేకంగా చర్చించబడతారు. డా. యాకన్న (1995) సంపాదకత్వంలో వెలువడిన తెలుగు దళిత సాహిత్యం స్వరాలు, స్వప్నాలు గ్రంథంలో, దళిత విముక్తి భావాన్ని తొలి దశలోనే కవిత్వం ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లినవారి జాబితాలో భీమన్నను పొందుపరుస్తారు.

డా. సురేంద్రరెడ్డి (2007) తన పరిశోధనలో, భీమన్న కవిత్వంలోని దళిత ప్రత్యామ్నాయ సంస్కృతి, ప్రతిఘటన ధోరణులు దళిత రచయితలకు ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. కుల ఆధారిత హింస, అణచివేత, శ్రమజీవుల సంకెళ్లు వంటి అంశాలు ఆయన ప్రతిఘటనాత్మక రచనలకు కేంద్రీయ అంశాలుగా నిలిచి, దళిత సాహిత్య స్రవంతికి దిశానిర్దేశం చేశాయని వ్యాఖ్యానించారు.

3. బహుజన స్వాతంత్ర్యోద్యమం – సామాజిక సిద్ధాంత పరిశోధనలు

భీమన్న రచనలను బహుజన రాజకీయాలు, సామాజిక సమానత్వ చర్చలతో అనుసంధానించిన పరిశోధనలు కూడా ఉన్నాయి. కంచ ఐలయ్య Shepherd (2004) రచించిన Why I Am Not a Hindu మరియు Post-Hindu India గ్రంథాలు భీమన్న రచనలను ప్రత్యక్షంగా పరిశీలించకపోయినా, భారతీయ బహుజన సంస్కృతిపై ఆయన రచనలు చూపిన ప్రభావాన్ని అర్థం చేసుకునే సిద్ధాంతాత్మక ఆధారం ఇస్తాయి.

అలాగే డా. శివకుమార్ (2012) తన పరిశోధన వ్యాసాలలో భీమన్న కవిత్వాన్ని బహుజన సమాజపు సాంస్కృతిక ప్రతిఘటనగా విశ్లేషించారు. శ్రమ, సమానత్వం, శోషణ వ్యతిరేక ప్రతిజ్ఞ వంటి విషయాలు ఆయన రచనలను బహుజన స్వరాల ప్రధాన వేదికలుగా నిలబెట్టాయని గుర్తించారు.

4. తెలంగాణా సాంస్కృతిక – జానపద అధ్యయనాల్లో పరిశోధనలు

భీమన్న గారి కవిత్వంలో తెలంగాణా భాష, తీరుతెన్నులు, జానపద సంస్కృతి లయబద్ధంగా ప్రతిబింబిస్తాయని పలువురు పరిశోధకులు భావిస్తున్నారు. డా. ఎల్లూరి శివరామరెడ్డి (1998) రచించిన తెలంగాణ సాహిత్యం – అవగాహన గ్రంథంలో భీమన్న రచనలను తెలంగాణ జానపద జీవనానికి దగ్గరగా ఉన్న కవిత్వంగా విశ్లేషించారు.

అంతేకాక, తెలంగాణా ఉద్యమ కాలంలో ప్రజలలో సంస్కృతిక అస్తిత్వాన్ని పెంపొందించడంలో భీమన్న పాటలు, పద్యాలు కీలక పాత్ర పోషించాయని పరిశోధకులు పేర్కొన్నారు. “పల్లె – పల్లెలో శ్రమజీవి కథలు”, “స్థానిక భాషకు న్యాయం” వంటి అంశాలను ఆయన కవిత్వం ముందుకు తెచ్చినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

5. భీమన్న సాహిత్యం పై సమకాలీన విమర్శలు

తాజా పరిశోధనల్లో భీమన్న రచనలు బహుజన సంస్కృతి నిర్మాణం, పాఠశాల విద్యావ్యవస్థలో సమానత్వ విలువలు, మరియు ఆధునిక దళిత భావజాలంపై చూపిన ప్రభావం విస్తృతంగా చర్చించబడింది.

డా. కొండా లక్ష్మయ్య (2018) తన తొలిజ్ఞాన స్రవంతిలో బహుజన సాహిత్యం గ్రంథంలో భీమన్న రచనలు అణచివేతకు గురైన వర్గాల సాంస్కృతిక చైతన్యాన్ని నిర్మించాయని పేర్కొన్నారు. భీమన్న రచనలు సామాజిక విప్లవానికి స్ఫూర్తి, బహుజన ఆత్మగౌరవానికి పునాది, సామాజిక న్యాయం కోసం మార్గదర్శిగా నిలుస్తాయని సమకాలీన విమర్శకులు అభిప్రాయపడ్డారు.

సారాంశం

పరిశీలించబడిన గ్రంథాలు, పరిశోధనలు, విమర్శలు ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

భీమన్న సాహిత్యం అంటే కేవలం కవిత్వం కాదు. అది అణచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవం, సమానత్వం, బహుజన చైతన్యం, తెలంగాణా సంస్కృతి ప్రతిబింబించే ప్రబోధాత్మక ఉద్యమ సాహిత్యం.

వాస్తవికత, దళిత దృక్కోణం, బహుజన సిద్ధాంతం, తెలంగాణా జానపద సంస్కృతి. ఇవన్నీ భీమన్న రచనల్లో సమన్వయమై, ఆధునిక పరిశోధనలకు మార్గదర్శకంగా మారాయి.

IV. పద్ధతి

ఈ అధ్యయనం గుణాత్మక సాహిత్య విశ్లేషణ మీద ఆధారపడింది. భీమన్న రచనలలోని పద్యాలు, నాటకాలు మరియు కథనాలను పరిశీలించి వాటిలోని భావాలను విశ్లేషించటం జరిగింది. మరికొన్ని ప్రామాణిక గ్రంథాలు, వెబ్ మూలాలు వినియోగించబడ్డాయి.

V. విశ్లేషణ

భీమన్న రచనలు వర్ణవ్యవస్థ ఆధారిత శోషణను సూటిగా సవాలు చేస్తాయి. ఆయన రచనల్లో శోషిత వర్గాల జీవన వాస్తవాలు ఘాటుగా ప్రతిబింబిస్తాయి. 'నల్లనీటి బుడగలు', 'చీకటి వెలుగులు', 'గుడిసెలు కాలిపోతున్నాయి' వంటి రచనలు శ్రమజీవుల దారుణ స్థితిని ప్రత్యక్షంగా చూపుతాయి. కుల ఆధిపత్యం ప్రజల మనుష్యత్వాన్ని ఎలా హరిస్తుందో ఆయన పదాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన సాహిత్యం బహుజన ఉద్యమాలకు చైతన్య కిరణంలా పనిచేస్తూ సమానత్వం, విద్య, ఆత్మగౌరవం వంటి విలువలను ప్రజల్లో నాటింది.

భీమన్న కవిత్వం బహుజన స్వాభిమాన పిలుపు. "నలుపు నా బలం, నా గౌరవం" వంటి వాక్యాలు అణగారిన వర్గాల భావోద్వేగాలను సమగ్రంగా వ్యక్తపరుస్తాయి. ఆయన రచనలు అంబేద్కర్, ఫూలే, పెరియార్ ఆలోచనలతో ఏకరూపంగా నిలుస్తాయి. "చదువు–చదువు–చదువు" అన్న అంబేద్కర్ పిలుపు ఆయన పద్యంలో సమూహ చైతన్య కేకగా వినిపిస్తుంది.

భీమన్న ముఖ్య రచనల్లో 'గద్దెలు, గొర్రెలు', 'కోయిలమ్మ', 'ప్రళయ శిఖరం', 'సూర్యోదయం', 'దళితవేదం', 'చీకటి వెలుగులు', ప్రజా గేయాలు ప్రత్యేక స్థానం పొందాయి. అణచివేత, అసమానత, బహుజన శక్తీకరణ, తిరుగుబాటు ఆత్మ, సమానత్వం, విద్య, చైతన్యోద్యమం వంటి అంశాలు ఇవి నిండుగా ఉంటాయి.

భీమన్న రచనలు 21వ శతాబ్దపు భారత సమాజాన్ని అర్థం చేసుకునేందుకు అత్యంత ప్రాసక్తి కలిగిన సామాజిక పత్రాలు. కులవివక్ష రూపాలు మారుతున్నా మూల స్వభావం అలాగే కొనసాగుతుండటంతో ఆయన రచనలు నేటికీ సజీవంగా ఉన్నాయి. ఆధునికీకరణ, గ్లోబలైజేషన్ పేరుతో జరిగిన పురోగతిలో దాగి ఉన్న కుల వివక్ష, విద్యలో అసమాన అవకాశాలు, కౌలు రైతుల సంక్షోభం, కార్మికుల దోపిడీ, అసంఘటిత రంగ సమస్యలు, రాజకీయ ప్రాతినిధ్య లోపం వంటి అంశాలు భీమన్న చూపించిన వాస్తవాల కొనసాగింపే.

'జవాను' రచన శ్రమజీవుల వాస్తవాలు, 'మట్టి మనిషి' భూమిలేని వర్గాల సంగ్రామం, 'వీధి కార్మికుడు' అసంఘటిత రంగ దుస్థితి, 'మా ఊరు–మా కథలు' గ్రామీణ దళిత జీవన నిర్మాణం, 'నాగరికత – మనుషుల కథ' కుల వ్యవస్థ చరిత్రను శాస్త్రీయంగా విశ్లేషిస్తాయి. 'బహుజన దేవతలు' బహుజన సంస్కృతి ఆత్మగౌరవాన్ని వెలికితీస్తుంది. ఇవన్నీ కలిసి భీమన్నను బహుజన అభ్యుదయ సిద్ధాంతకర్తగా నిలబెడతాయి.

VI. సమకాలీన ప్రాసక్తి

21వ శతాబ్దంలో కూడా సమాజంలో వివక్షలు కొనసాగుతున్న సందర్భంలో భీమన్న రచనలు మార్గదర్శకాలు. బహుజన సాధికారతకు ఆయన చెప్పిన సామాజిక సమానత్వం, విద్య, ఉద్యమ తత్వాలు ఇప్పటికీ ఎంతో ప్రాసక్తి కలవి. బోయి భీమన్న గారి రచనలు నేటి భారతీయ సమాజ నిర్మాణాన్ని అర్థం చేసుకునేందుకు అత్యంత ఉపయోగకరమైన సామాజిక పత్రాలుగా నిలుస్తాయి. ఆయన రచనలు కేవలం సాహిత్య కృతులు మాత్రమే కాకుండా, అణచివేత, అసమానత్వం, కుల వివక్ష, ఆర్థిక దోపిడీ, శ్రమజీవుల జీవన వాస్తవాలు, బహుజనుల స్వాభిమాన పోరాట ధోరణి వంటి విస్తృత అంశాలను పరిక్షణాత్మకంగా విశ్లేషించే సామాజిక పత్రాలు. సమకాలీన పరిస్థితుల్లో ఈ రచనలు మరింత ప్రాసక్తిని సంతరించుకోవడానికి కారణం, భారతీయ సమాజంలో ఇంకా కొనసాగుతున్న వర్గ మరియు వర్ణ ఆధారిత అసమానతలే. భీమన్న గారి రచనలు నేటి బహుజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు వెలుగునిస్తున్నాయి. ఆధునిక అభివృద్ధి నినాదాల వెనుక దాగి ఉన్న కుల వివక్ష, విద్యలో అసమాన అవకాశాలు, గ్రామీణ కార్మిక వర్గాల ఆర్థిక దుర్వినియోగం, పట్టణ వలస కార్మికుల అనిశ్చితిత జీవితం వంటి ఎన్నో అంశాలను ఆయన రచనలు నేటికీ ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. కుల వర్గ ఆధారిత వివక్ష రూపాలు మారుతున్నా, వాటి మూల స్వభావం అలాగే కొనసాగుతుండటమే భీమన్న ఆలోచనలను సమకాలీన చర్చలకు ప్రాధాన్యమైన పునాది చేస్తుంది.

భీమన్న రచనల ఆధారంగా నేటి సామాజిక వాస్తవాలను అర్థం చేసుకోవడం.

భీమన్న రచనలు విడివిడిగా ఏకైక సమస్యలను మాత్రమే చూపించలేదు. ఆయన కవిత్వం, గద్య రచనలు, జాతి సామాజిక విశ్లేషణలు కలిసి ఒక సమగ్ర దృష్టి కోణాన్ని అందిస్తాయి. వీటి ద్వారా నేటి సమాజంలో కనిపిస్తున్న వివిధ సమస్యలను విశ్లేషించేందుకు స్థిరమైన సిద్ధాంత చట్రం లభిస్తుంది.

1. 'జవాను' కార్మిక వర్గం మరియు రాష్ట్ర నిర్మాణం

ఈ గ్రంథంలో భీమన్న శ్రమజీవుల జీవన వాస్తవాలను, దేశ నిర్మాణంలో వారి పాత్రను అత్యంత స్పష్టంగా ప్రతిబింబించారు. నేటి సమాజంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, కాంట్రాక్టు విధానం, పని గంటల పెరుగుదల, కనిష్ట వేతనాల లభ్యతలో అసమానత, భద్రతా ప్రమాణాల లోపం, ఇవన్నీ ఆయన చూపించిన దృశ్యాల సమకాలీన ప్రతిరూపాలే.

డిజిటల్ మరియు కార్పొరేట్ యుగంలో కూడా కార్మిక వర్గం తన హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి కొనసాగుతోందని ఈ రచన గుర్తుచేస్తుంది.

2. 'మట్టి మనిషి' భూమిలేని వర్గాల జీవన సంగ్రామం

ఈ రచనలో భీమన్న భూమిలేని పేదల జీవన వాస్తవాలను, కౌలు రైతుల దుస్థితిని, భూమి అసమాన పంపిణీని చరిత్రాత్మకంగా విశ్లేషించారు. నేటి గ్రామీణ భారతదేశంలో భూమి కేంద్రీకరణ మరింత పెరిగిన నేపథ్యంలో ఈ గ్రంథం ప్రాసక్తి అధికమైంది.

రైతుల ఆత్మహత్యలు, భూస్వాధీన విధానాలు, లీజు వ్యవసాయం సంక్షోభం, కార్పొరేట్ వ్యవసాయ చట్టాలపై నిరసనలు భీమన్న చూపించిన వాస్తవాల కొనసాగింపు.

3. 'వీధి కార్మికుడు' అసంఘటిత రంగ కష్టం

ఇది భారతదేశంలోని అసంఘటిత రంగం యొక్క నిర్మాణాత్మక సమస్యలను ప్రత్యక్షంగా చూపే గ్రంథం. నేడు దేశంలో 90% శ్రామికులు అసంఘటిత రంగంలో ఉండటంతో, ఈ రచన సమాజ శ్రమశక్తి స్వరాన్ని ప్రతిధ్వనిస్తూనే ఉంది.

కరోనా అనంతరం వీధి వ్యాపారులు, వలస కార్మికులు ఎదుర్కొన్న సంక్షోభం భీమన్న విశ్లేషణను మరింత స్పష్టంగా సమర్థిస్తుంది.

4. 'మా ఊరు మా కథలు' గ్రామీణ సామాజిక నిర్మాణం

ఈ గ్రంథం గ్రామీణ దళిత సమాజం జీవనవాస్తవాలను చిత్రీకరించడంలో అద్భుతంగా నిలుస్తుంది. వర్గ వర్ణ వివక్ష, గ్రామ పెద్దల ఆధిపత్యం, పేదరికం, విద్యా వెనుకబాటు, సామాజిక ఒంటరితనం వంటి అంశాలు ఇక్కడ ప్రధానంగా కనిపిస్తాయి.

గ్రామీణ దళితులపై హింస, కేసుల పెరుగుదల, విద్యాసంస్థల్లో వివక్ష, గ్రామ పంచాయతీల్లో ప్రాతినిధ్యం లోపం ఇవన్నీ ఈ రచనను సమకాలీన పర్యవేక్షణకు అనువుగా నిలబెడతాయి.

5. 'నాగరికత మనుషుల కథ' కుల వ్యవస్థ పై విమర్శాత్మక దృష్టి

భీమన్న ఈ గ్రంథంలో కుల వ్యవస్థ యొక్క చారిత్రక నిర్మాణాన్ని, దాని రాజకీయ ఆర్థిక ప్రాముఖ్యతను, దోపిడీ రూపాలను స్పష్టంగా చర్చించారు.

రిజర్వేషన్లపై రాజకీయత, కుల వివక్ష ఘటనలు పెరుగుదల, సామాజిక న్యాయ చట్టాల అమలులో లోపాలు, సమానత్వం పేరుతో నడుస్తున్న వాదాల వెనుక ఉన్న అణచివేత ఇవి అన్నీ ఆయన విశ్లేషణ ఇప్పటికీ సజీవంగా ఉందని సూచిస్తాయి.

6. 'బహుజనదేవతలు' – బహుజన సంస్కృతి, ఆత్మగౌరవం

ఈ రచన బహుజనుల సంస్కృతి, ఆచారాలు, ఆధ్యాత్మిక ధోరణి, బహుజన చరిత్ర పునర్నిర్మాణానికి ఒక శాస్త్రీయ పునాది వంటిది. బహుజన చరిత్ర తిరస్కరణ, సంస్కృతీకరణ, హిందూకరణ ఒత్తిళ్లు, బహుజన దేవతల గుర్తింపు కోసం ఉద్యమాలు ఈ గ్రంథంలో ప్రతిధ్వనించాయి.

7. 'అణగారిన వర్గాల రాజకీయ చరిత్ర' బహుజన రాజకీయ చరిత్ర

ఈ గ్రంథంలో భీమన్న బహుజనుల రాజకీయ ప్రయాణాన్ని, చారిత్రక అణచివేతను, ప్రాతినిధ్య సమస్యలను, ఉద్యమాల అవసరాన్ని వివరించారు. బహుజనులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం, ఓటు బ్యాంకు రాజకీయాలు, సామాజిక న్యాయ ఉద్యమాల బలహీనత ఇవి ఆయన పిలుపు ఇంకా కొనసాగాలని సూచిస్తున్నాయి.

సమగ్ర సమీక్ష

భీమన్న రచనలు ఒక్కో సమస్యను మాత్రమే కాక, ఒక సంపూర్ణ సామాజిక దృక్పథాన్ని అందిస్తాయి. ప్రతి గ్రంథం విభిన్న అంశాన్ని చూపించినా, అన్నింటినీ కలిపితే ఒక సమగ్ర దళిత బహుజన అభ్యుదయ సిద్ధాంతం స్పష్టమవుతుంది. శ్రమసమాజ విశ్లేషణ, కుల వ్యవస్థ పై విమర్శ, బహుజన చరిత్ర పునర్నిర్మాణం, గ్రామీణ శోషణ, రాజకీయ సాధికారత ఈ అన్నింటినీ సమీకృతంగా పరిశీలిస్తే, నేటి బహుజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు భీమన్న రచనలు మార్గదర్శక గ్రంథాలుగా నిలుస్తాయి.

VII. ఫలితాలు

1. భీమన్న రచనలు సామాజిక అసమానతలపై ప్రజల్లో చైతన్యం పెంచాయి.
2. సమానత్వం, హక్కుల కోసం పోరాటం అవసరాన్ని బలంగా తెలియజేశాయి.
3. బహుజన ఉద్యమాలకు ఆయన రచనలు ప్రేరణగా నిలిచాయి.
4. భీమన్న సాహిత్యం బహుజన ఉద్యమాలకు సిద్ధాంతపరమైన పునాది.
5. అతని గేయాలు, కవితలు సామాజిక అణచివేతకు ప్రత్యక్ష ప్రతిస్పందన.
6. ఆధునిక బహుజన రాజకీయాలు, విద్యా ఉద్యమాలు అతని ఆలోచనలతో బలోపేతం అవుతున్నాయి.

VIII. పరిమితులు

ఈ పరిశోధన గుణాత్మక అంశాలపైనే ఆధారపడినందున గణాంకపరమైన విశ్లేషణ అందించలేకపోయింది. భీమన్న రచనలను ఆధునిక రాజకీయ ఉద్యమాలతో అనుసంధానం చేసే విస్తృత అధ్యయనం ఇంకా అవసరం.

IX. సూచనలు

భీమన్న రచనలను విద్యా వ్యవస్థలో భాగం చేయడం. బహుజన హక్కుల కోసం పనిచేసే సంఘాలకు ఆయన సిద్ధాంతాలను అందించడం. సామాజిక చైతన్య కార్యక్రమాలలో ఆయన సాహిత్యాన్ని వినియోగించడం.

మూలాలు *(References)*

Bhimanna, B. (1998). Dalita Vedam. Hyderabad: Dalit Sahitya Academy.

Bhimanna, B. (2002). Gaddelu Gorrelau. Telangana Publications.

Boyi Bhimanna. (n.d.). Mahakavi, Kalaa Prapoorna, Padmabhooshan Dr. Boyi Bhimanna (1911-2005). https://boyibhimanna.com/

Boyi Bhimanna. (n.d.). Wikipedia. https://en.wikipedia.org/wiki/Boyi_Bhimanna

Elluri, S. R. (1998). Telangana Sahityam -- Avagahana. Hyderabad: Telangana Publications.

Forward Press. (2018). Bahujan Sahitya. https://www.forwardpress.in/

Gopalakrishnamurthy, V. (1981). Telugu Sahityamlo Vastavika Dharanulu. Visalandhra Publishing House.

Ilaiah, K. (2004). Why I Am Not a Hindu: A Sudra Critique of Hindutva Philosophy, Culture and Political Economy. Samya.

Ilaiah, K. (2009). Post-Hindu India: A Discourse in Dalit-Bahujan, Socio-Spiritual and Scientific Revolution. Sage Publications.

Konda, L. (2018). Bahujana Sahityam: Tholijnana Sravanti. Hyderabad: Nalanda Publishers.

Ramachandram, D. (Ed.). (1994). Adhunika Telugu Kavithvam. Sahiti Publications.

Rao, K. (2015). The Voice of Bahujans in Telugu Literature. Hyderabad: Scholars Press.

Sharma, V. (2019). Social Movements in Telangana. Oxford University Press.

Surendra Reddy, B. (2007). Dalit cultural resistance in Telugu poetry. Journal of Andhra Studies, 12(3), 44--58.

Yakanna, K. (Ed.). (1995). Telugu Dalita Sahityam -- Svaralu, Swapnalu. Hyderabad: Dalit Studies Circle.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న – దుక్కిటెద్దువు కాదు – రైతు ప్రస్థానం

– బి.మారెప్ప,
తెలుగు అధ్యాపకులు
సెల్ : 9701419945

కీలక పదాలు :

(రైతు – త్యాగం, శ్రమతత్వం, ధైర్యం, జీవన సమీకరణం, పని–పరమాత్మ, చైతన్యం, సత్యం)

మన నాగరికతకు మూలం రైతే:

మన నాగరికత ఎక్కడ మొదలైంది? అడవుల నుంచి గ్రామాలకు, గ్రామాల నుంచి పట్టణాలకు మన ప్రయాణానికి మూలం వ్యవసాయమే. ఈ నాగరికతను మోసుకొచ్చిన వాడు రైతు. 'పై వాడితో ఈ క్రింది వాడు వియ్యమందే నాగరికత' అని చెప్పడం ద్వారా, రైతు లేక పై స్థాయి అభివృద్ధి అసంభవమని భీమన్న స్పష్టం చేస్తారు.

'అన్నం పుట్టించే వాడు తానే అన్నమై బ్రతికే వాడు రైతు'

ఈ వాక్యం ఒక సాహిత్యోక్తి మాత్రమే కాదు. ఇది భారతీయ జీవన తత్వానికి మూలవాక్యం. రైతు తన శ్రమను అమ్ముకొని జీవించడు. తన శ్రమలోనే జీవనార్థాన్ని కలిపేస్తాడు. అతడు పండించేది పంట మాత్రమే కాదు. సమాజం, సంస్కృతి, నాగరికత. బోయి భీమన్న రచనలో రైతు దుక్కిటెద్దువు కాదు. అంటే కేవలం దుక్కి దున్నే సాధనం కాదు. అతడు చైతన్యవంతుడు, ఆలోచనగలవాడు, చరిత్ర నిర్మాత, ఈ రచన రైతును ఒక శ్రమజీవిగా కాకుండా ఒక మహాత్ముడిగా ప్రతిష్టిస్తుంది. అందుకే ఇది కవిత కాదు, కేవలం వచనమూ కాదు. ఇది రైతు మహాకావ్యానికి ప్రస్థావన. ఈ భావనను తన కవిత్వం, ఆలోచనల ద్వారా అక్షర సత్యంగా మలిచిన మహాకవి బోయి భీమన్న. ఆయన దృష్టిలో రైతు కేవలం ఒక వృత్తి కాదు; తన శ్రమను, శక్తిని, ప్రాణాన్నే ధారపోస్తూ సమాజానికి అన్నాన్ని, జీవనాన్ని ప్రసాదించే మహానీయుడు రైతు.

రైతు – వెన్నెముకే వజ్రం: త్యాగానికి ప్రతిరూపం:

వజ్రం బలంగా ఉంటుంది; కాని తన బలాన్ని ప్రదర్శించదు. రైతు అలాగే తనపై పడే భారాన్ని మౌనంగా భరిస్తాడు. నిరంతర నిత్య దధీచి ఈ ఉపమానం అత్యంత అర్థవంతమైనది. దధీచి ఒక్కసారే తన ఎముకలను త్యాగం చేశాడు. రైతు ప్రతిరోజూ తన శరీరాన్ని, కాలాన్ని, ఆశలను త్యాగం చేస్తున్నాడు. విత్తనానికి వెలుగునిచ్చే జీవజ్యోతి రైతు. విత్తనం నేలలో పాతిపెడతారు; రైతు తన జీవితాన్నే నేలలో కలిపేస్తాడు. ఆ త్యాగం నుంచి పంట పుడుతుంది. పంట నుంచి నాగరికత పుడుతుంది. సమాజానికి వెన్నెముక ఎవరు? ఈ ప్రశ్నకు బోయి భీమన్న ఇచ్చిన సమాధానం స్పష్టం – రైతు. వెన్నెముక లేక శరీరం నిలబడలేనట్లే, రైతు లేక సమాజం నిలవదు. అయితే ఆయన అక్కడే ఆగలేదు. రైతు కేవలం వెన్నెముకే కాదు, వజ్రం అని అంటారు. వజ్రం ఎంత గట్టిదో, ఎంత విలువైనదో, అంతే గట్టి మనస్సు, అంతే అపారమైన విలువ రైతులో ఉంది. ఎండలు, వానలు, కష్టనష్టాలు అతడిని విరగ్గొట్టలేవు. అతడు సహజ శక్తుల మధ్య నిలబడి పోరాడే ధీరుడు అని అంటాడు భీమన్న.

దివిలో సూర్యుడు – భువిపై రైతు జీవన సమీకరణం:

సూర్యుడికి కోరికలు లేవు. లోకానికి వెలుగు ఇస్తాడు. రైతుకు కోరికలు లేవు; లోకానికి అన్నం ఇస్తాడు. ఈ రెండింటి మధ్య ఉన్న పోలిక కేవలం అలంకారికం కాదు. అది తాత్వికం, సూర్యుడు కాలాన్ని నడిపిస్తే, రైతు కాలానికి అర్థం ఇస్తాడు. ఆకాశంలో సూర్యుడు జీవనదాత. భూమిపై రైతు కూడా అంతే. సూర్యుడు వెలుగు ఇస్తే, రైతు జీవనాన్ని ఇస్తాడు. సూర్యుడు ఏ కోరిక లేకుండా వెలుగుతాడు. రైతు కూడా ఏ ఆశ లేకుండా పండిస్తాడు. కానీ ఫలితం మాత్రం సమస్త జీవరాశికి మేలు. అందుకే భీమన్న దృష్టిలో రైతు జీవిత నేత, ధాన్యకరుడు, కర్షకుడు అని చెప్పడం జరిగింది.

దేవతలు – రైతు ప్రతీకలు మరియు ప్రత్యక్షం

ఈశ్వరుడికి ఒకే ఎద్దు – రైతుకు రెండు ఎద్దులు
విష్ణువుకు ఒకే చక్రం – రైతుకు రెండు చక్రాలు
బ్రహ్మ చతుర్ముఖుడు – రైతు బహుముఖుడు

ఇది దేవతలను చిన్నచేయడం కాదు. రైతును మహిమపరచడం. దేవతలు ప్రతీకలు, రైతు ప్రత్యక్ష జీవితం. దేవతలకు ఒక్కో బాధ్యత. రైతుకు వంద బాధ్యతలు. మానవుడి సమస్యలు శతాధికం. ఒక్కో సమస్యను రైతు ఒక్కో ముఖంతో ఎదుర్కొంటాడు. వర్షం లేకపోతే దేవుడిని నిందిస్తారు. పంట రాకపోతే రైతును నిందిస్తారు. అయినా రైతు తన బాధ్యత నుంచి తప్పించుకోడు. అందుకే రైతు త్రిమూర్తులకు ప్రతినిధి. సృష్టి, స్థితి, లయ– ఈ మూడూ రైతు శ్రమలోనే నడుస్తాయి అని చెపుతున్నాడు.

పని – పరమాత్మ రైతు తత్వం

రైతు తత్వంలో పని పరమాత్మ
ప్రతిపని ప్రజాశ్రేయం
పనిచేసిన ప్రతిక్షణం పండుగ
పండిన ప్రతిగింజ యజ్ఞఫలం

ఇది గీతా తత్వం కాదు – జీవన తత్వం. రైతు నిష్కామయోగి. ఫలితం వస్తుందో లేదో తెలియకపోయినా శ్రమిస్తాడు. వర్షం వస్తుందో లేదో తెలియకపోయినా విత్తనం వేస్తాడు. ధర దక్కుతుందో లేదో తెలియకపోయినా పంట పండిస్తాడు. అందుకే రైతు నిర్వికారుడు. అతడు సృష్టి–స్థితి దేవత. జీవజగత్తు సాక్షాత్తు అతడే. రైతును దేవునితో పోల్చడం జరిగింది.

పంటకే కాదు – జీవనానికి వెలుగునిచ్చే వాడు రైతు

విత్తనానికి వెలుగిస్తాడు రైతు
అది మొక్కను పెంచుతుంది
మొక్క పంటను ఇస్తుంది

పంట జీవనాన్ని ఇస్తుంది. అందువల్ల రైతు కేవలం భూమిని మాత్రమే కాదు మన జీవనాన్ని పండించే మనిషి అతడు భూమిని దున్నిన ప్రతిసారి, భవిష్యత్ తరాలకు జీవనరసం నింపుతున్నాడు. అతని శ్రమ వలననే పల్లెలు కళకళలాడుతున్నాయి, పట్టణాలు నడుస్తున్నాయి, దేశం ముందుకు సాగుతోందంటే అతిశయోక్తి కాదు.

వెన్ను వంగింది – ధైర్యం వంగలేదు:

రైతు ఒక్కజాతి భారాన్నే కాదు – నానా జాతుల భారాలను మోస్తున్నాడు.

వెన్ను వంగింది, కుంగింది, చిక్కింది, శిథిలమవుతోంది.

కానీ అతడి నీతి వంగలేదు, అతడి మౌనం బలహీనత కాదు. అది నాగరికతకు సంకేతం అని అంటాడు బోయి భీమన్నగారు.

క్విట్ ఇండియా అన్నాడు గాంధీ – పారతంత్ర్యం పోయింది

క్విట్ పవర్టీ అన్నది ఇందిరా గాంధీ – పేదరికం పోయిందా?

క్విట్ ఇండియా వెనక ప్రజాసైన్యం ఉంది

క్విట్ పవర్టీ వెనక రైతు ఒక్కడే నిలబడ్డాడు.

ఇదే ఆధునిక భారతీయ వ్యవస్థ యొక్క క్రూర వ్యంగ్యం

మారిపోయింది అంటున్నాడు భీమన్నగారు.

నిద్రలేవాల్సిన కాలం రైతు చైతన్యం

ఏ ముళ్ళ మొక్కలు పీకాలన్నా,

ఏ పళ్ళ తోటలు పెంచాలన్నా,

ఏ దరిద్రాన్ని నిర్మూలించాలన్నా,

ఏ సౌభాగ్యాన్ని నిర్మించాలన్నా,

రైతు కచ్చబిగించకుండా ఏమీ జరగదు.

ఇదం బ్రాహ్మ్యం, ఇదం క్షాత్రం అంటూ విభజనలు వద్దు

ముగింపు:

రైతు – శాశ్వత సత్యం

బోయి భీమన్న రచనలో రైతు ఒక వ్యక్తి కాదు,

అతడు ఒక తత్వం, ఒక చరిత్ర, ఒక భవిష్యత్.

రైతు ఒక వృత్తికాదు – ఒక సంస్కృతి

రైతు వెన్నెముక మాత్రమే కాదు – నాగరికత హృదయం.

రైతు ఉన్నంతకాలం జీవితం ఉంటుంది

రైతు కూలితే నాగరికత కూలుతుంది

అందుకే –రైతు దుక్కిటెద్దువు కాదు

రైతే జీవజగత్తు

ఆధార గ్రంథాలు:

1. బోయి భీమన్న రచనలు
   బోయి భీమన్న దుక్కిటెద్దువ్వ కాదు
2. అంతర్జాలం నుండి

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న "జానపదుని జాబులు" పరిశీలన (శ్రమ జీవుని అంతరంగం)

– మణి కోపల్లె
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, రచయిత్రి,
సెల్ : 9703044410

వ్యాస ఉద్దేశం:

డా. బోయి భీమన్న గారి వచన సాహిత్యం నుంచి గ్రహించిన "జానపదుని జాబులు" అనే పేరుతో రాసిన లేఖలు ఇవి. ఇందులో పల్లె పదుల జీవన శైలి గురించి వర్ణించారు రచయిత. ఈ లేఖను పట్నంలో వుండే తన మిత్రునికి రాసిన లేఖలు ఇవి. ఇది 1932–33 ప్రాంతాలలో రాసిన లేఖలో గ్రామాలలో నిమ్న జాతుల (దళిత), నిరుపేదల జీవితాలను చిత్రిస్తూ రాశారు. తన మిత్రునికి తాను వున్న పరిస్థితులను, గ్రామ పరిస్థితులను గురించి తెలిపే లేఖలు ఇవి. ఇది ఆధునిక తరానికి నాటి సామాజిక జీవన విధానాలు తెలిపే అద్భుతమైన జాబులు ఇవి. "జానపదుని జాబులు" ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారే అందరికీ ఉచితంగా పంపిణీ చేశారు.

పరిశోధన:

మన దేశ పల్లె జీవన విధానం గురించి తెలుసుకోవాలంటే ఇదివరకు లైబ్రరీలకు వెళ్ళి నోట్సు రాసుకునేవారు.. లేదా ఆ ప్రాంతాలకు వెళ్ళి పరిశోధన చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం పెరిగిన ఆధునిక సాంకేతిక వనరులు ఈ పరిశోధనని ఎంతో సులభతరం చేశాయి. ప్రపంచంలో ఏ నలుమూలల నుంచైనా సమాచారాన్ని అందుకునే సౌలభ్యం పెరిగింది. లైబ్రరీలు, పుస్తకాలు సైతం నెట్ ద్వారా అరచేతిలోకి వచ్చేశాయి. డా. బోయి భీమన్న గారి సాహిత్యం అంతర్జాలంలో అందుబాటులోకి రావటంతో పరిశోధన సులభతరమైంది.

మౌళిక పదాలు:

జానపదుని లేఖలు, పల్లెపాత్రల మనోచిత్రణ, రచయిత గురించి, రచయిత శైలి, ముగింపు.

1. జానపదుని జాబులకు నాంది : డా. బోయి భీమన్నగారి 'జానపదుని జాబులు' 1932లో పల్లెటూరి లేఖలు' అనే పేరుతో జనవాణి పత్రికలోనూ, 1933లో ప్రజామిత్ర పత్రికలో 'జానపదుని 'జాబులు' అనే పేరుతోనూ ముద్రితమయ్యాయి.

సారాంశం: పట్నంలో కొంత కాలం చదువుకుని,పేదరికం వల్ల చదువు సాగించలేక సొంతవూరుకు వెళ్ళి పల్లె పనులలో మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలో శ్రీమంతుడైన తన మిత్రునికి తను ఎదుర్కున్న కష్టాలను, ఇబ్బందులను లేఖా రూపంలో రాస్తాడు. ఇందులో కూలీలుగా వున్న మా. అంటే మాల మాదిగ కులాల జీవితాల దుర్భర పరిస్థితుల గురించి, ఆకలి బాధల గురించి, మహిళల స్థితిగతుల గురించి బోయి భీమన్న గారు కళ్ళకు కట్టినట్లు చూపించారు.

జానపదుని జాబులు – పరిశీలన

ఆరంభం: రచయిత జాబులను ఇలా ప్రారంభిస్తారు.

"నెచ్చెలీ! నీకు హృదయం వుంటే ..' అని మొదలు పెట్టి 'సాయంసంజె వేళ కల్లుపాక దగ్గర రోజంతా కష్టపడ్డ కూలీ బేడ డబ్బులు సమర్పించుకుని పీకల దాకా తాగుతారు మగవాళ్ళు అని అంటారు. (సంజె వేళ – నూటికి తొంభై తొమ్మిది మంది గ్రామీణుల కొంపలు కూల్చే సంజ వేళగా వర్ణిస్తారు రచయిత) వట్టి చేతులతో ఇంటికి వెళ్ళి ఆకలన్న పిల్లాడిని, అడ్డొచ్చిన ఆలిని కొట్టడం, ఏడుపులూ పెడబొబ్బలూనూ.... ఇదీ అందరిళ్ళలోనూ జరిగే దినచర్య. నిరాశ, దుఃఖము తప్ప సుఖం అనేదుండదు ఆ కుటుంబాలలో.

ఒక ఇంటిలో ఎప్పుడో చేసిన కాస్త అప్పుకు నాలుగెకరాల పొలం రాయించుకోవటంతో వీధిన పడ్డ ఒక కుటుంబం తీరు గురించి చెబుతాడు జానపదుడు.

ఎప్పుడో కానీ కనపడని కాయకష్టం చేసే వాళ్ళు వుంటారు పట్నాలలో.. ఆడవారి గురించి చెబుతూ

"ఘోర గంభీర ఘనాఘన ఘోషల
కోమల చంచల రేఖ లవేమీ –
మృత్యుభీకరాఖీల తమస్సున
మిణుగురు బుర్వుల వెలుగేమీ – ..
నిజోద్రిక్త పూరుష పటుశక్తికి
నిదానమో ఈ రమణీ రామము" (15 పే .) అంటూ ..

ఈ సత్యం కాదనను.. మటుమాయమై వుంటుంది. ఇవన్నీ సినిమాలలోనూ, ఉద్యమాలలో కనిపించే ఆదర్శ అభిప్రాయాలు. కాదు కాదు. స్వభావ విరుద్ధాలు. కానీ మా గ్రామాలకు వచ్చి చూతువా? మా పల్లెటూరి పడుచులను పరికించిన

"మలినమై, గుంటపడిన కళ్ళు –
ఎండిపోయి నొక్కుకు పోయిన
చెక్కిళ్లు, ఎన్నడూ నూనె రాయక,
దువ్వక, చింపిరి పోయిన తలలు,
కృశించిపోయి, ఎముకలు బైలుపడ్డ రొమ్ములు
ఆరి, వెన్నుకంటుకు పోయిన కడుపులు,
ఎండు కట్టెల్లాంటి కాలుసేతులు
దరిద్రదేవతా భీకర స్వరూపాలు" అని అంటారు రచయిత.

స్నేహితుడిని హృదయం వుంటే ఈ పరిస్థితి చూస్తే నీకు తప్పక కన్నీరు వస్తుంది. గుండెలని పట్టి పీకుతుంది అని రాసారు. ఇక్కడ 'మా మా'ల (మాల మాదిగల) దరిద్రం రూపు రేఖలు ఎలా వున్నాయో వర్ణించారు రచయిత.

ఇంకో ఘటనలో భూకామందు తోటలో వృధాగా పడి వున్న తాటి మట్టలు గోవుల పాక కోసం అడిగితే ఇవ్వనందుకు పెరిగిన కసితో మిత్రులు ఒక బండి చక్రాన్ని తగలబెడుతూ "విద్వేషం, అసమత్వం – నిరంకుశత్వం– స్వార్థం– ఇవన్నీ కాలి బొగ్గు బొగ్గు అయిపోయేదాకా ఏ జ్వాలలు ఆగకూడదు.... కసి భలేగా మండుతోంది' అని అంటాడొక మిత్రుడు.

పండగ వేళ చేసిన కూలీ డబ్బులు ఇవ్వని కామందు గురించి చెప్తాడు.

ఇంకో లేఖలో ప్రపంచంలో బ్రతకడానికి మూడే మూడు విధానాలు ఒకటి కష్టపడి సంపాదించుకోవడం, 2. భిక్షమెత్తుకోవడం, 3. దొంగిలించడం. అని అంటూ

"ధనికులు పని నా చేయరు, ధనికులు భిక్షింప, రింక ధనమెట్లబ్బున్?" అని ప్రశ్నించుకుంటే పేద రైతుల పేద కూలీల నోరు గొట్టి కూడబెట్టిన ధనమే ధనికులకు ఆధారం. అందుకని ఆ డబ్బు పెట్టి మిత్రుడు కొన్న దుప్పటిని తీసి పారేస్తాడు అది దొంగ సొమ్మే కదా అని అంటాడు జానపదుడు.

మోకాలి నొప్పికి ఆవు పేడ కాపడం పెట్టుకోవడం అనేది ఆ పేదప్రజల ఉపశమన మందు ఎలా వుంటుందో తెలుస్తుంది.

ఇంకో లేఖలో ప్రియ సుహృద్దీ! అని సంభోదిస్తూ రాసిన లేఖలో మానవాభ్యుదయానికి

'చేతనముల్ వసంత వనసీమల లోపల
పల్లవించి, విస్ఫీత వినూత్నలీల
సురభింపగ నుండిన నాటి వేళలన్
మేతలు మేసికొన్నవి సుమీ, యెడదల్
కడసారి! నేటికి ఆ తీయత్రేన్పులే
వెడల నైనవి పస్తులగూడ! నెచ్చెలీ!" (తిరుమలరావు పాట) అని అంటాడు.

ఇంతలో అతని తాత పాడే జానపద గీతం ఆకర్షించింది... అది

"కష్టానికొక ఫలము
కన్నీటికొక వాంఛ
వాంఛలో సౌఖ్యాను
భవమే లేకున్నచో
కష్టమేలోయీ ?
నా బీద కూలీ!
నా బాల కూలీ!"

అని పాడుతుంటాడు. ఈ లేఖలో డా. బోయి భీమన్న గారు చాలా గేయాలు రచించారు. పల్లెపదాలతో చక్కని భావంతో సాగుతాయి పాటలన్నీ ..

ఆకలి ఎంత భయంకరమో.. ఆలోచనా ధోరణి ఎంత పదునుగా మారుతుందో తెలుపుతుంది. జానపదుడు యజమాని దగ్గరకి పని కోసం వచ్చి గంటలు గంటలు నిలబడి (యజమాని ముందు కూర్చో కూడదుగా) నిలబడినపుడు సాగే మనోదృశ్యం ఆలోచనాధోరణి కళ్ళ ముందు కనిపిస్తుంది. చివరికి పనిలేక, డబ్బులు లేక ఆకలి తీరే మార్గం కనపడక మనసు పడే వేదనతో చదువరుల మనోఫలకంపై చిత్రిస్తారు రచయిత...

రూపాయికి ఎన్ని అణాలు అన్న ప్రశ్న చెల్లి అడిగినప్పుడు జవాబు కాగితాల మీద రూపాయిని 16 తో గుణకారాల లెక్కల ద్వారా గుణిస్తే అణాలు వస్తాయి అని చెప్తాడు. కాని లెక్కలు రాని వాళ్ళు దుకాణదారుని వద్దకు వెళ్ళి చిల్లర తెస్తే ఎన్ని అణాలో వెంటనే తెలుస్తుంది. దీని ద్వారా చదువుకున్న విద్యకు జీవితంలో చేయబోయే పనికి వున్న అంతరం ఏమిటో తెలుస్తుంది. కాగితం మీద కోట్లు కోట్లు సంఖ్యలు వేసుకుని నా దగ్గర ఇంత ధనం వుంది అని సంతోషించటం వ్యర్థమే కదా! అని అంటారు రచయిత ఒక లేఖలో.

పల్లె వారి కొబ్బరి చిగుళ్ళ పూరిపాక పట్నం వారికి అసహ్యంగా, తేలికగా కనిపిస్తుంది. కానీ పల్లె వారికి దివ్య భవనం, చర్చా సౌధం, సౌఖ్య వేదిక, విహార సీమ అని అంటారు.

'డబ్బు కావాలి బ్రతకడానికి, ఎవరిస్తారు. ఎక్కడి నుంచి వచ్చినా మమ్మల్ని ఎవరు తిననిస్తారు' అంటూ కూలీలు కూలి పోతున్నారు అంటూ ఎంతో మానసిక వ్యధతో పరి పరి విధాలుగా మనఃస్థాపం చెందుతూ తన కుటుంబానికి ఆకలి తీర్చే మార్గం కనపడక, ఆత్మహత్య చేసుకోవాలా అని అనుకుంటూ చివరికి ఆడ కూడా సాధ్య పడదు అని అనుకుని కూలీగా జీవించే కంటే స్వతంత్రంగా జీవించాలి అని తీసుకునే ఆలోచన..

తల్లి కడుపు చిచ్చు / చల్లార్ప లేకుండి, / కన్నీటి కంటితో/
'కలత' పెట్టలేను/ ఇక గత్యంతరం?/ స్వాతంత్ర్య జీవనం!

స్వయం కృషి!/ ఎట్లు. (65 పే. వచన సాహిత్యం 4). స్వతంత్ర జీవనం ఎలా ?అనే ఆలోచన అమలు చేయాలి అని అనుకోవటంతో ఆ లేఖ ముగుస్తుంది.

మరో లేఖలో గ్రామాలు అడవులు గావు. శాంతిసదానారామాలు. నేడు ఎంత దుస్థితిలో వున్నా ప్రపంచానికి మార్గదర్శక మయ్యేది ఒక్క గ్రామమే. గ్రామం ప్రేమకు పుట్టిల్లు అని అంటారు.

కొన్ని వాక్యాలు చదువుతుంటే పల్లెలలో పంట పనులు లేనపుడు వారి జీవనం గురించి ఇలా అంటారు.

"ఇక్కడ పనులు దొరక్క నాలుగు నెలలు దారిద్ర్యదేవత
కడుపులో గురకలు పెడుతూ వుంటారు". ....

ఇంకో లేఖలో గ్రామాల గురించి చెబుతూ సంఘంలో, కథల్లో జీవం వుంది అంటే ఆ జీవం గ్రామాల్లోనే వుంది అని అంటారు.

నా జీవిత విధానాన్ని గురించి వ్రాయడమంటే పల్లెటూళ్ళ జీవిత విధానం గురించి వ్రాయడమే! అంటే కన్నీళ్ళు కార్చడం అంటే హృదయాన్ని చీల్చుకోవడం అన్నమాట అని అంటారు.

చివరి లేఖలో రచయిత ఆంధ్ర మహా సభలు చెన్నై రాష్ట్రంలో జరిగినపుడు ఆ అనుభవాల సారం గురించి జాబు వ్రాస్తారు. రైలు ప్రయాణం గురించి రాస్తూ "ఎన్నో స్టేషన్లు వెనుకబడిపోతున్నాయి. ప్రపంచ నాగరిక జాతులన్నీ వేగంతో పరుగెడుతుంటే, మన ఆంధ్ర జాతి ఒక వెనుకబడిపోయిన స్టేషన్ వంటిది కదా అని అంటారు. మద్రాసు నగరమంతా తెలుగువారు కూడా తమిళంలోనే మాట్లాడటం, అక్కడ పనిచేసే ప్రతి అధికారీ కూడా తమిళీయుడే కావటం, తెలుగు వారు ఏ హోదాలోనూ కనపడక పోవటం గమనించాను అని అంటారు. ఆంధ్ర మహా సభల గురించి ఎంతో వూహించిన జానపదునికి నిరాశే ఎదురయింది. అసలు సభలు జరిగే వేదిక కనుక్కోవటం ఎంత కష్టమో అయింది వెళ్ళిన వాళ్ళకి. ఎక్కడో పాత థియేటరులో జరిగాయి అని రాశారు. మద్రాసులో ఆంధ్రత్వమెక్కడా కనపడలేదంటారు. చివరగా పట్టణ గ్రామ జీవితాల తులమాన జీవిత క్రమాన్ని ఇప్పుడు బాగా చిత్రించుకోగలను" అని అంటూ లేఖని ముగిస్తారు.

విశ్లేషణ:

జానపదుని అంతరంగాన్ని ఆవిష్కరించే జానపదుని జాబులులో దళిత, రైతు కూలీలకు సంబంధించి, వ్యవసాయానికి సంబంధించిన విషయాలు చర్చకు వచ్చాయి. కుల సమస్యను ఎలా ఎదుర్కొన్నారో తెలుపుతుంది. దళితుల పిల్లలు కూలీలుగా, పాలేర్లుగా మారే స్థితుల నుంచి చదువుకుని ఉద్యోగాలు సంపాదించాలి అనే ఆలోచన వైపు సాగింది ఈ లేఖారచన.

శైలి:

డా. బోయి భీమన్న గారి రచనలు సామాజిక చైతన్యాన్ని కలిగించే ఒక విలక్షణమైన శైలిని కలిగి ఉంటాయి. వారు ఎంచుకున్న వస్తు వైవిధ్యం తెలుగు సాహిత్యంలో విశిష్టమైనది.

భాష:

భీమన్న గారు గ్రామీణ నేపథ్యం నుండి వచ్చారు కాబట్టి ఆయన రచనల్లో సరళమైన, సహజమైన భాష కనిపిస్తుంది. సామాన్య ప్రజలకు కూడా సులభంగా అర్థమయ్యే పదాలను వాడారు. ఆయన శైలి భావోద్వేగపూరితంగా ఉంటుంది. అణగారిన వర్గాల బాధలను, ఆవేదనను పాఠకుల హృదయాలకు హత్తుకునేలా వ్యక్తీకరించారు. వీరి రచనలలో చక్కని భాష, లోతైన తాత్విక చింతన కనిపిస్తుంది. "నగ్నసత్యం వేదాంతం, అలంకృత సత్యం కవిత్వం" అని ఆయన సిద్ధాంతీకరించారు, ఇది ఆయన శైలికి అద్దం పడుతుంది. ఆయన రచనలన్నింటిలోను 'రసద్వైతం' అనే ఆయన సొంత సిద్ధాంతం ప్రవహిస్తుంది, ఇది సౌందర్యం, ప్రేమ మరియు విశ్వ ఐకమత్యం యొక్క సున్నితమైన కలయికను సూచిస్తుంది. వీరి రచనల్లో ప్రశ్నించే తత్వం, సామాజిక మార్పును కాంక్షించే విప్లవ స్ఫూర్తి ఉంటుంది.

వస్తు వైవిధ్యం

బోయి భీమన్న గారు స్పృశించని సాహిత్య ప్రక్రియ, వస్తువు లేదు. వస్తు వైవిధ్యం వుంటుంది. రచనల ప్రధాన వస్తువు నిమ్నజాతి (దళిత) ప్రజల జీవితాలు, వారి కష్టాలు, అంటరానితనం నిర్మూలన మరియు వారి సాధికారత. "పాఠశాలకు వెళ్లే ప్రతి దళిత బాలుడు ఐఏఎస్ కావాలి" అనే సందేశంతో రాసిన 'పాలేరు' నాటకం వేలాది మందిని చదువు వైపు ప్రోత్సహించింది. "గుడిసెలు కాలిపోతున్నాయి" వంటి రచనల్లో సమాజంలోని అసమానతలను, అణగారిన వర్గాలపై జరిగే దాడులను ప్రశ్నించారు. "జానపదుని జాబులు", "కూలిరాజు" వంటి రచనలు వ్యవసాయ కూలీల దుస్థితిని, వారి హక్కుల కోసం పోరాడవలసిన ఆవశ్యకతను తెలియజేస్తాయి.

తాత్విక, ఆధ్యాత్మిక చింతన సామాజిక అంశాలతో పాటు, ఆయనకు లోతైన తాత్విక చింతన కూడా ఉంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి

భీమన్న గారు కవిత్వం, గేయం, నాటకం, బాలెట్, విమర్శ, వ్యంగ్యం, స్వీయచరిత్ర లేఖలు వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారు. మహాత్మాగాంధీ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బోధనల ప్రభావంతో, బోయి భీమన్న గారు తన సాహిత్యాన్ని సామాజిక మార్పు కోసం ఒక ఆయుధంగా ఉపయోగించారు, తనదైన శైలి, తాత్వికతతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. దళితులుగా సమాజంలో పిలువబడుతున్న వారిలో ఆత్మస్థైర్యాన్ని, స్వాభిమానాన్ని నింపి వారూ గౌరవంగా బతికేలా చేసింది భీమన్నగారి సాహిత్యం.

రచయిత గురించి

బోయి అనేది ఇంటిపేరు. కులం పేరు కాదు. 1911 సెప్టెంబరు 19 మామిడికుదురులో జన్మించారు. అస్పృశ్యతను తన కలం ద్వారా రూపుమాపాలను కున్న మేధావి. 11 వ ఏట నుంచే రచనలు సాగించారు. అనేక రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు, వారణాసిలోని కాశీ విద్యా పీఠం నుండి డి.

లిట్, ఆంధ్ర మరియు నాగార్జున విశ్వవిద్యాలయాల నుండి డాక్టరేట్లు, జీవిత సాఫల్య పురస్కారాల వంటి అనేక అవార్డులు, సత్కారాలు మరియు పురస్కారాలను అందుకున్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ శాసన మండలికి కూడా నామినేట్ అయ్యారు మరియు 1978–84 మధ్య యం.యల్.సి.గా ఉన్నారు. కౌన్సిల్‌లో ఆయన ప్రసంగాలు చాలా ప్రజాదరణ పొందాయి మరియు పేదలను ప్రభావితం చేసే అనేక సమస్యలను ఆయన లేవనెత్తారు. ఈ మహా కవిని భారత ప్రభుత్వం 1973 లో పద్మశ్రీతోనూ, 2001 పద్మభూషణ్‌తోనూ సత్కరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళా ప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించి డాక్టరేట్"ను అందించింది. వీరు డిసెంబర్ 16, 2005 న కాలం చేశారు.

ప్రముఖ రచనలు

పాలేరు, కూలిరాజు వంటి నాటకాల లోనూ, 'జన్మాంతర వైరం,' 'అంబేద్కర్ సుప్రభాతం,' 'అంబేద్కరిజం,' 'పంచమ స్వరం' మొదలైనవి. డా. బోయి భీమన్న కవి ఆంగ్లంలోనూ పద్యాలు రాశారు. పద్య కవిగా, గేయ కవిగా కూడా ఎంతో ప్రసిద్ధులు. వారు రాసిన గేయాలు నేటికీ గాయక గళాలలో మారుమ్రోగుతుంటాయి. ఆ రోజుల్లో రేడియోలో వినిపించే అఖండ శివతాండవ స్తోత్రం "అక్షరాక్షర పర బ్రహ్మ .... " అనే గేయం, " అలాగే "ఏది హిందు, ఏది ముస్లిం, ఏది క్రైస్తవము" అనే గేయం .. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో గీతాలు ప్రసిద్ధి చెందాయి. రేడియో కోసం ఎన్నో భావగీతాలు రచించారు.బోయి భీమన్న సాహితీ పీఠం వారు భీమన్న గారి పేరు మీద సాహితీ స్రష్టలకు ప్రతి ఏటా లక్ష రూపాయల పారితోషకంతో పాటు ప్రశంశా పత్రం అందజేస్తుంటారు.

బోయి భీమన్న గారి సమగ్ర సాహిత్యం

పద్మ భూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (ఉభయ తెలుగు రాష్ట్రాల సమయంలో) హైదరాబాదు వారు భీమన్న గారి సమగ్ర సాహిత్యాన్ని సంపుటాలుగా ప్రచురించారు. అందులో సంపుటి 4, వచన గ్రంథాలు 1 లో చేర్చిన గ్రంధాలలో "జానపదుని లేఖలు కూడా ఒకటి. వీరు చెప్పదలుచున్న విషయాన్ని సహేతుకంగా తన రచనలలో చూపిస్తారు. జానపదుని జాబులు ఒక పల్లె యువకుని మదిలో చెలరేగే భావాలను తన మిత్రునికి రాస్తున్నట్లుగా చెబుతారు రచయిత. దళిత రైతు కూలీలకు సంబంధించిన వ్యవసాయానికి సంబంధించిన విషయాలున్నాయి. తూర్పు గోదావరి జిల్లా యాసలో సాగుతాయి ఈ లేఖలు.

బోయి భీమన్న గారి సతీమణి శ్రీమతి హైమవతి భీమన్న గారు రచించిన "పాలేరు నుంచి పద్మశ్రీ వరకు' అనే గ్రంథంలో ఇలా అంటారు 'ఇది కేవలం జీవిత చరిత్ర కాదు సాంఘిక, రాజకీయ సాహిత్య రంగాలలో కృషి చేసే అభ్యుదయ గ్రంథములన్నిటిలో ఇది లక్షణ గ్రంథం" అని.

'భారతీయ సమాజంలోని లోపాలు ఎత్తి చూపుతూ జాతి పునర్నిర్మాణానికి బాటలు వేసిన భీమన్న గారి నాటకాలు, నృత్య గేయ నాటికలూ, కావ్యాలూ వచన కవితలూ ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవలసిన అవసరం వుంది" అని అంటారు బోయి విజయ భారతి, డా.బి. నాగవర్మ. (సెప్టెంబరు 15, 2015 ఆంధ్ర జ్యోతి దిన పత్రికలో.)

ముగింపు

ఈ లేఖల ద్వారా పల్లె ప్రజల జీవితం శ్రమ జీవుల పట్ల సమాజంలో వున్న స్థితి గతులు కళ్ళకు కట్టినట్లు చూపించారు. రైతులే లోకానికి అన్నదాతలు. వారి చెమట చుక్కలే దేశానికి వెన్నెముక అని రచయిత చెబుతారు. చదువుకున్న వారు గ్రామాలను మరచిపోకూడదని పల్లె అభివృద్ధికి తోడ్పాడలని ఈ లేఖల సందేశం అంతర్గతంగా మనకి కనిపిస్తుంది.

"నా ప్రతి రచనా నా ఆత్మకథే! – **బోయి భీమన్న**

ఉపయుక్త గ్రంథ సూచి

1. "పాలేరు నుంచి పద్మశ్రీ దాకా" (శ్రీమతి హైమవతీ భీమన్న గ్రంథం)
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి – 4, వచన రచనలు భాగం – 1
3. యూట్యూబ్ : భీమన్న గారి ప్రముఖ గేయాలు.
4. www.a.pteachers.in ... వికీపీడియా
5. boyibhimanna.com. https://share.google/8cjvBRB2vEpYiKr8F

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

డా. బోయి భీమన్న కవిత్వంలో జానపద మూలాలు – పరిశీలన

– దుప్పటి. మొగిలి,
ఫిజికల్ సైన్స్ బోధకులు

పరిచయం

పద్మ శ్రీ డా. బోయి భీమన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో గ్రామీణ దళిత జీవితాన్ని సహజత్వంతో, విమర్శాత్మక దృష్టితో చిత్రించిన విశిష్ట కవి. ఆయన రచనలు గ్రామీణ జీవన వర్ణనకే పరిమితం కాక, అణగారిన వర్గాల ఆత్మగౌరవం మరియు సామాజిక చైతన్యానికి ప్రతినిధులుగా నిలుస్తాయి. ఈ పరిశోధన పత్రం భీమన్న రచించిన 'జానపదుని జాబులు', 'పాలేరు', 'గుడిసెలు కాలిపోతున్నై' రచనలను ఆధారంగా చేసుకొని, వాటిలో నిక్షిప్తమైన జానపద మూలాలను విశ్లేషిస్తుంది.

a) ముఖ్య ఉద్దేశ్యం

ఈ పరిశోధన పత్రం యొక్క ప్రధాన లక్ష్యాలు.

1. భీమన్న గారి ప్రసిద్ధ రచనలైన 'జానపదుని జాబులు', 'పాలేరు', 'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యాలలో నిక్షిప్తమై ఉన్న జానపద మూలాలను సమగ్రంగా విశ్లేషించడం.
2. వాడుక భాష, మాండలిక పదజాలం, సామెతలు మరియు జాతీయాలు సామాజిక విమర్శకు ఎలా పదునైన ఆయుధాలుగా మారాయో నిరూపించడం.?
3. భీమన్న సృష్టించిన పాత్రలు కేవలం వ్యక్తులు కాక, ఒక వర్గపు ఆత్మగౌరవానికి, శ్రమ సంస్కృతికి ప్రతీకలుగా ఎలా నిలిచాయో చర్చించడం.

4. జానపద గేయరీతులు, పద్ధతులను వాడుకుంటూనే, భీమన్న గారు అజ్ఞానం మరియు మూఢనమ్మకాలపై 'విమర్శల విప్లవాన్ని' ఎలా సాగించారో వివరించడం.
5. జానపద శైలిలోని 'విలాపం' క్రమంగా 'విప్లవం'గా రూపాంతరం చెంది, అణగారిన వర్గాల సామాజిక చైతన్యానికి ఎలా వాహికగా మారిందో విశ్లేషించడం.
6. జానపద సాహిత్యంలోని సహజత్వానికి, ఆధునిక దళిత సాహిత్య విలువలకి మధ్య భీమన్న గారు నిర్మించిన వారధిని తార్కికంగా నిరూపించడం.

b) పరిశోధన ఊహ ప్రణాళిక

డా. బోయి భీమన్న సాహిత్యం జానపద మట్టి నుండి ఉద్భవించిన సజీవ చైతన్యధార అని నిరూపించే పరిశోధన ఇది. జానపద మూలాలను కేవలం సాహిత్య సౌందర్యానికి కాక, సామాజిక విమర్శకు మరియు విప్లవ చైతన్యానికి వాహికలుగా మలిచారని ఈ పరిశోధన ఊహ ప్రతిపాదిస్తుంది.

పల్లెటూరి మాండలికాన్ని, వాడుక భాషను కేవలం గ్రామీణ అలంకరణలుగా కాక, సామాజిక అన్యాయాన్ని ఎండగట్టే ధిక్కార ఆయుధాలుగా ఆయన మలిచిన తీరును ఈ వ్యాసం విశ్లేషిస్తుంది. లేఖ, నాటకం, దీర్ఘకావ్యం వంటి విభిన్న ప్రక్రియలలో అంతర్లీనంగా ప్రవహించే జానపద తత్వాన్ని అన్వేషిస్తూ, 'పాలేరు'లోని బానిసత్వం నుండి 'గుడిసెలు కాలిపోతున్నై' లోని సామూహిక విప్లవం వరకు జానపద పాత్రల చైతన్య పరిణామాన్ని ఈ పరిశోధన పత్రం ఆవిష్కరిస్తుంది. లోతైన సామెతలు, జాతీయాలు మరియు వస్తు సంస్కృతి బుడ్డీ దీపం, అరక వంటి జానపద మూలాలు దారిద్ర్య రేఖను ఆవిష్కరించడం. ఈ సాహిత్యం దళిత చైతన్యానికి, సామాజిక మార్పుకు ఎలా పటిష్టమైన పునాదిగా నిలిచాయో ఈ పత్రం నిరూపిస్తుంది.

c) అనుసరించిన పరిశోధన పద్ధతులు

ఈ పరిశోధనలో పాఠ్య విశ్లేషణ, తులనాత్మక పరిశోధన పద్ధతి మరియు సామాజిక–సాంస్కృతిక విమర్శా విధానాలు అనుసరించబడ్డాయి.

d) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు

ఈ పరిశోధన ద్వారా భీమన్న కవిత్వం జానపద సాహిత్యం మరియు ఆధునిక దళిత సాహిత్యం మధ్య శక్తివంతమైన వారధిగా నిలిచిందని నిర్ధారించబడింది. ఆయన రచనలు జానపద మూలాలను నిస్సత్తువ నుండి సామాజిక చైతన్యం వైపు నడిపించిన అర్థవంతమైన సాహిత్య ప్రకటనలుగా తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయని ఈ అధ్యయనం తేల్చింది.

కీలక పదాలు

1. బోయి భీమన్న
2. పాలేరు
3. గుడిసెలు

4. సామెతలు

5. దళితులు

6. శ్రమ సంస్కృతి

ఉపోద్ఘాతం

బోయి భీమన్న కవిత్వం పల్లెటూరి మట్టి నుండి పెల్లుబికిన భావాల ప్రవాహం. తూర్పు గోదావరి జిల్లా గ్రామీణ జీవితం ఆయన సాహిత్యంపై గాఢమైన ప్రభావం చూపింది. జానపద సాహిత్యంలోని సహజత్వం, సరళత్వం, భావోద్వేగ తీవ్రత

నిరక్షరాస్యులైన శ్రామికుల భాషా సౌందర్యం భీమన్న రచనల్లో అంతర్లీనంగా కనిపిస్తాయి. కేవలం పల్లె నేపథ్యాన్ని ఎంచుకోవడమే కాక, పల్లె ప్రజల సంస్కృతిలో భాగమైన జానపద భాషా రూపాలను తన రచనల్లో ఇముడ్చుకున్నారు.సమాజంలోని అంటరానితనం, దారిద్ర్యం అన్యాయాలను ప్రశ్నిస్తూనే, జానపద మూలాల ద్వారా మానవత్వాన్ని ప్రబోధించడం భీమన్న యొక్క విశిష్టత.

విషయం:

బోయి భీమన్న గారి రచనలు జానపద జీవన వైవిధ్యాన్ని, సామాజిక వైరుధ్యాలను ప్రతిబింబించే అద్దాలు. పల్లె ప్రజల శ్రమను, వారి భాషలోని సొగసును సాహిత్య గౌరవం కల్పించిన తీరును ఈ క్రింది అంశాల ద్వారా విశ్లేషించవచ్చు

1. జానపదుని జాబులు – పల్లె జీవన చిత్రం:

జానపదుని జాబులు' కవిత్వంలో భీమన్న, తన మిత్రుడికి లేఖల రూపంలో పల్లెటూరి (నిత్య) జీవితంలోని వాస్తవాలను, కాలాన్ని, చదువు విలువను గురించి వివరించారు.

ఇది పల్లె–పట్నం వైరుధ్యాన్ని చిత్రించిన వచన కావ్యం. ఇందులో సమయాన్ని వర్ణిస్తూ.. "కాలాన్ని కరకట్టుగా నడవదు మా పల్లెల్లో" అని జానపదుల సహజ దినచర్యను వివరించారు. "కిరసనాయిలు పొగ కళ్ళలో పడుతుంది", "మా యమ్మ తమ్ముడి పక్షమైంది" వంటి వాక్యాలు పల్లెటూరి గృహాల్లోని వాస్తవ పరిస్థితులకు అద్దం పడతాయి.

2. పాలేరు – శ్రమజీవి విప్లవం:

జానపద గాథల్లో ఒక బలహీనుడు, అన్యాయంపై పోరాడటం ప్రధానాంశం.

జానపద సమాజంలోని కట్టుబాట్లను, దోపిడీ వ్యవస్థను స్పష్టంగా చూపించింది. పాలేరు రాజు తన యజమానిని ప్రశ్నించడం, హక్కుల కోసం నిలబడటం కేవలం ఒక వ్యక్తి పోరాటం కాదు. అజ్ఞానం, బానిసత్వంలో మగ్గుతున్న గ్రామీణ పాలేరు వ్యవస్థలోని దోపిడీని ప్రశ్నించిన సాహసోపేత నాటకం. "కాడిదూల", "అరక", "కొబ్బరి కురిడీలు" వంటి మాండలిక పదాలు శ్రమ సంస్కృతిని సూచిస్తాయి. "పాలేరే పల్లె ప్రాణం... పొలాల పుట్టిన ఊపిరి" అనే భావనతో బానిసత్వంపై తిరుగుబాటును ఈ నాటకం ప్రకటించింది.

3. గుడిసెలు కాలిపోతున్నై సామూహిక తిరుగుబాటు

దళితులపై జరిగే దాడులకు వ్యతిరేకంగా సామూహిక నిరసనను తెలిపేది గుడిసెలు కాలిపోతున్నై. ఈ కావ్యం జానపద జీవితంలోని ఆవేదనను తిరుగుబాటుగా మలచింది.గుడిసెలు కాలిపోతున్నాయి కవిత్వం నందు పేదలు, దళితులు వ్యక్తిగత పాత్రల కంటే,గుడిసెల్లో జీవించే సామూహిక జానపద సమూహం ప్రధానం. వారి సామూహిక దుఃఖం, కోపం మరియు విప్లవ స్ఫూర్తి జానపద గాథల స్వరంతో వినిపించాడు."పాడు గుంటకు రుద్రవాటిక... పెంటకుప్పల మధ్య మిత్తికి వంటసాల యది" అంటూ పేదల నివాసాల దుర్భరతను, "మంటల్లో ముడుచుకున్న గుడిసె... పేదరికం బుగ్గలు కాల్చింది" – గుడిసె కాలిపోవడం అంటే ఒక జీవితం బుగ్గిపాలు కావడం అని చిత్రించారు.

"ఆ దిక్కు, ఈ దిక్కు చూసేదెవడు?" అని ప్రశ్నిస్తూ, నిస్సహాయత నుండి పుట్టే ఆగ్రహాన్ని జానపద విలాప గీతాల శైలిలో వినిపించి విప్లవ స్ఫూర్తిని రగిలిస్తుంది. "గుడిసెల పొగలోనే పేదల బతుకులు రాసిపెట్టబడ్డాయి" అంటూ అట్టడుగు వర్గాల అస్థిత్వాన్ని చాటారు.

4. జానపద భాషా రూపాలు – సామెతలు – వస్తువులు

జానపదుల అనుభవ సారాన్ని, భావ వ్యక్తీకరణలోని పదునును తెలియజేస్తాయి.

పల్లె ప్రజల నోటి వెంట వచ్చే సహజ భాషనే భీమన్న గారు ఉపయోగించారు.

"పట్నంలో లాంతర్ల వెలుగు మాకు బుడ్డీ దీపం" – వస్తువుల పోలిక ద్వారా పల్లె నిరాడంబరతను చూపారు. "తట్ట", "గంప", "చాప", "పందిరి" వంటి పదాలు జానపదుల భౌతిక జీవనానికి ప్రతీకలు.

భీమన్న తన రచనల్లో "పాతపాళీ పదివేలు", " "ఒక కంటికి ఆనడం", "పురుటిలో సందు కొట్టడం", "చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు", "గుండెకు రాయి వేసుకోవడం"

వంటి సామెతలు, జాతీయాలు సందర్భోచితంగా పాత్రల భావోద్వేగ తీవ్రతను పెంచాయి.

5. రైతు చిత్రణ – శ్రమ సంస్కృతి

వ్యవసాయ రంగంలోని దోపిడీని భీమన్న అత్యంత ప్రభావవంతంగా చిత్రించారు.

"పంటను కైలుచేసి, ధాన్యం రాసులు పోసి... వట్టిచేతులు నలుపుకుంటూ ఇళ్లకు పోయి పస్తులు పడే రైతుల దీనగతి" – ఇది పల్లెల్లోని ఆర్థిక అసమానతలకు నిదర్శనం."మా చెమటే జాబులై పుస్తకాల్లో పేరైంది" చదువుకూ, శ్రమకూ ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, కష్టజీవులే లోకానికి వెలుగు అని చాటారు. రూపాయిని అణాల్లోకి లెక్కించే పాత పద్ధతిని పేర్కొంటూ, పట్నం చదువు పల్లెటూరి బతుకుదెరువుకు ఎలా అడ్డుపడుతుందో చమత్కరించారు.బాడిబందలు', 'తీరుబడి', 'నానిపోయినాయి', 'ప్రొద్దస్తమానం', 'అన్నొయ్ దోర్లించింది' వంటి అనేక జానపద పదాలు తన కావ్యాలలో కనపడతాయి.

ముగింపు:

బోయి భీమన్న కవిత్వం జానపద సాహిత్యం మరియు ఆధునిక దళిత సాహిత్యం మధ్య ఒక శక్తివంతమైన వారధి.ఆయన 'జానపదుని జాబులు', 'పాలేరు', 'గుడిసెలు కాలిపోతున్నై' వంటి రచనల ద్వారా జానపద మూలాలను అత్యంత నైపుణ్యంగా ఉపయోగించారు. పాలేరులో నీళ్ళు నీరంత సత్యాన్ని బయటపెట్టాయి" నీటి దోపిడీ, కులాధిపత్యంపై వ్యంగ్యం. ఆయన సృష్టించిన జానపద పాత్రలు భాష మాండలికం మరియు వస్తు సంస్కృతి ద్వారా గ్రామీణ జీవితానికి ప్రామాణికతను తెచ్చాయి. తన రచనల్లో కేవలం గ్రామీణ జీవితాన్ని వర్ణించడమే కాకుండా, కాలమానంలో అస్థిరత, వ్యవసాయంలో దోపిడీ, నిరుపయోగమైన విద్య వంటి జానపద జీవితంలోని లోపాలను సూటిగా ఎత్తి చూపారు. ఆయన ఉపయోగించిన సామెతలు, నానుడులు కేవలం భాషా సౌందర్యం కోసం కాక, పీడిత వర్గాల ఆత్మగౌరవాన్ని, సామాజిక విమర్శను వ్యక్తం చేయడానికి ఉపయోగపడ్డాయి. భీమన్న సాహిత్యం జానపద జీవితంలోని దీనగతిని, అజ్ఞానాన్ని, అణచివేతను తెలుగు సాహిత్యానికి పరిచయం చేసి సమాజాన్ని జాగృతం చేశారు.

దుఃఖాన్ని, శ్రమను మాత్రమే కాక, ఆ పల్లె ప్రజల సంస్కృతిని, ఆచారాలను గౌరవిస్తూనే వారిలో దాగిన అపారమైన మానవత్వాన్ని, విజ్ఞానాన్ని మరియు పోరాట స్ఫూర్తిని జానపద మూలాలను నిస్సత్తువ నుంచి సామాజిక చైతన్యం వైపు వైపు నడిపించారు. ఆయన సాహిత్యం జానపద మూలాల నుండి ఉద్భవించిన ఒక మహోజ్వల సామాజిక విప్లవం.జానపద కళారూపాలను, భాషను ఆయుధాలుగా మలుచుకుని సామాజిక మార్పుకు బాటలు వేసి జానపద సాహిత్య విలువలను ఉన్నత శిఖరాలకు చేర్చాడు.

పరిశీలన గ్రంధాలు :

1. భీమన్న, బోయి. (1933). జానపదుని జాబులు.
2. భీమన్న, బోయి. (1952). పాలేరు (నాటకం).
3. భీమన్న, బోయి. (1973). గుడిసెలు కాలిపోతున్నై.
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠ్యపుస్తకం (2024).

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న కవిత్వం - సామాజిక అభ్యుదయం

- డా. యమ్. ఆదిశేషయ్య
అతిథి అధ్యాపకులు,
సెల్ : 9849681369.

బోయి భీమన్న తెలుగు నేలపై పరిచయం అవసరం లేని కవి. జీవిత అనుభవాన్ని కవిత్వం చేశారు. హేతువాద దృష్టితో ఆలోచించారు. మానవతావాదిగా స్పందించి కవిత్వం రాశారు. మౌళికంగా బోయి భీమన్న కవిత్వం సామాజిక అభ్యుదయంతో కూడుకుంది.

బోయి భీమన్న కవిత్వం రాసి దశాబ్దాలు గడిచింది. ఈ కవిత్వానికి నేటికీ ప్రాసంగికత ఉంది. బోయి భీమన్న ఆశించిన మార్పు సమాజంలో రాకపోవడం ఇందుకు కారణం కావచ్చు. వ్యవస్థ తనలోని లోటుపాట్లను సవరించుకోవటానికీ, సామాజిక అభ్యుదయాన్ని నింపుకోవడానికీ బోయి భీమన్న కవిత్వం తోడ్పడుతుంది.

గుడిసెలు కాలిపోతున్నై' అనే రచన బోయి భీమన్న యాభై ఏళ్ల క్రితం రాశారు. 1975 లోనే ఈ రచన కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందింది. పురస్కారాన్ని పొందడం ఒక రచన గొప్పదనాన్ని అంచనా వేయడానికి ఆధారం కాకూడదేమో. ఇంతకు మించిన గొప్పతనం ఈ రచనలో దాగుంది. ఇందువల్లే నేటికీ ఈ రచన మనల్ని ఆలోచింప చేస్తూ ఉంది. మనుషుల్లో మంచి ఆలోచనను కలిగించి, మంచి మార్గంలో నడిపించడానికి మించిన పరమ ప్రయోజనం ఒక రచనకు ఉండకపోవచ్చు. బోయి భీమన్న కవిత్వాన్ని పరిశీలిస్తే మనల్ని సామాజిక అభ్యుదయం వైపు నడిపిస్తుందనే ఆశ కలుగుతుంది. గుడిసెలు కాలిపోతున్నై రచన మన కాలానికి అన్వయించుకోవడానికి వీలుగా కనబడుతుంది. మన కాలంలోనూ ఇంకా గుడిసెలు ఉండటం,

గుడిసెలు కాలిపోతుండటం, కాల్చి వేయబడుతుండటం వంటి కారణాలతో బోయి భీమన్న సృజించిన కవిత్వపు ఆవశ్యకత పెరిగింది.

బోయి భీమన్నలోని సామాజిక అభ్యుదయం ఏమిటి? ఈ రచన ద్వారా బోయి భీమన్న సామాజిక అభ్యుదయాన్ని ఎలా వ్యక్తం చేశారో పరిశీలించడం ఈ పరిశోధనా వ్యాస లక్ష్యం.

బోయి భీమన్న కవితా సంపుటి 'గుడిసెలు కాలిపోతున్నై' గడ్డం వెంకటస్వామికి అంకితమివ్వడం గొప్పగా అనిపిస్తుంది. గుడిసెల్లో బతికే జనం కోసం ఆరాటపడిన వ్యక్తికి, ఈ గుడిసెల్లో వెలుగులు ప్రసరించాలని ఆకాంక్షించే కవి రచనను అంకితమివ్వడం స్ఫూర్తిదాయకం. తన స్వార్థానికి ఉపయోగపడే విషయాలను తెలుసుకున్నంత ఆసక్తిగా మనిషి ఎంత గొప్ప వేద వాక్యాన్ని అయినా వినడని బోయి భీమన్న ఈ గ్రంథంలో పేర్కొన్నారు. ఇందువల్ల మనిషికి నీతిని ఉపదేశించడం కంటే, మంచి జీవన మార్గాన్ని నిర్దేశించాలని సూచించాడు. ఇంతటితో ఆగకుండా, వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు, వేమన వంటి వారి మాటలు అరణ్య రోదనగానే మిగిలిపోతాయా? అనే ప్రశ్నలో మిగిలిపోకూడదనే అకాంక్షను బోయి భీమన్న వ్యక్తం చేసినట్టు అయ్యింది. అయితే, యువతపైన అచంచలమైన విశ్వాసాన్ని బోయి భీమన్న నిలిపాడు. దీనిని బట్టి సమాజ భవిష్యత్తు పట్ల కవిగా బోయి భీమన్నకు మంచి ఆశాభావం ఉన్నట్టు కనిపిస్తుంది.

గుడిసెలు కాలిపోతున్నై
ఓహో, కాలిపోతున్నై..
ఎవరి గుడిసెలో పాపం
మాల మాదిగలవే అయివుంటై
గుడిసెలు మరెవరి కుంటై?

గుడిసెలు కాలిపోవడం కథ పక్కన పెడితే, గుడిసెలు కల్గిన వారు ఎక్కువగా దళితులు అని అనడం సమంజసం. ఈ గుడిసెలు కూడా లేని గిరిజన, ఆదివాసీలు ఉన్నారు. అది వేరే కథ. అయితే, సహజంగా మన చుట్టూ ఒక గుడిసె కాలిపోయిందంటే అది కచ్చితంగా దళితులదే అయి ఉంటుందనే స్పష్టతను బోయి భీమన్న ఈ కవిత ద్వారా మనకు తెలియ చేశారు.

మానవ భావన నుంచి
మతాన్ని తొలిగించగలిగితే చాలు
విశ్వమానవ శ్రేయస్సు
సర్వమానవ సమతోషస్సు
సద్య సముద్భూతమవుతుంది
మబ్బు విడిచిన సూర్యుడిలా
మానవాత్మ జాజ్వల్యమానమవుతుంది

ఇవి 'మతం ఒక పిచ్చి' అనే కవితలోని పంక్తులు. కులం కుళ్ళు, మతం మత్తు అనే మాట బాగా ప్రచారంలో ఉంది. జాషువా కూడా ఒక చోట ఇలా అన్నారు.. 'కులమతాలు గీసుకున్న గీతల జొచ్చి, పంజరాన గట్టుపడను నేను, నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు తిరుగులేదు విశ్వనరుడను

నేను' అని అన్నారు. బోయి భీమన్న కూడా మతం అనేది మనిషికి పిచ్చి వంటిది. ఇది మనుషులను విడదీస్తుంది. మనుషుల మధ్య మానవీయత తొలగి, వైషమ్యాలు పెరుగుతాయనే అవగాహనను ఈ కవితలో బోయి భీమన్న కవితాత్మకంగా చెప్పారు.

ఒరే మానవవుడా, మూర్ఖుడా, బుద్ధిహీనుడా
అలాచూడు, ఆ శ్మశాన కాష్ఠ జ్వాలలు
మానవుడొకడే, మానవత ఒకటే
ఆ ఉమ్మడి అగ్ని సంస్కార జ్వాలలు
కులమత వృత్తి విభేదాలకు అంత్యక్రియలు

సమాజంలో కులమతాలు తొలగాలనే తీవ్రమైన కాంక్షను వ్యక్తం చేశారు. విమాన ప్రమాద ఘటనలో ఎవరు ఏ కులం వారైనా, ఏ మతం వాళ్లైనా, ఆనవాళ్ళు లేకుండా కాలి బూడిదవుతారని చెప్పాడు. ఈ ఘటన నేపథ్యంగా కుల, మత భేదాలకు అతీతంగా మనుషులందరూ ఒక్కటే అనే మానవతా ధర్మాన్ని చాటాడు.

ప్రతిభావంతుడైన ప్రతివాణ్ణీ
ఇలా పరమేశ్వరుణ్ణి చేసేస్తూ
ప్రజల మధ్య నుంచి తీసేస్తూ ఉంటే
ఇక సామాన్యుడు పెరిగేదెలా?
సంఘాభ్యుదయం జరిగేదెలా?

గతంలో ఉన్న ప్రతి ఆదర్శనీయుడినీ దేవుడిని చేసి కొలవడం కాకుండా, వారు సూచించిన ధర్మాన్నీ విలువలను ఆచరించాలనే మహోన్నత తత్వాన్ని బోయి భీమన్న సూచించాడు. మనిషే మార్గదర్శకుడు అనే ఈ కవితలో ఈ విషయాన్ని బలంగా వినిపించాడు. ఆదర్శాన్ని దేవున్ని చేసి కొలవడం కాకుండా, ఆచరించాలనే విషయాన్ని ఈ సందర్భంలో గుర్తు చేసినట్టు అయ్యింది. అలా చేయకపోతే సామాన్యుడు ఎదగడనీ, సంఘాభ్యుదయం జరగదనే నిజాన్ని నిష్కారంగానే బోయి భీమన్న చెప్పారు.

ఎక్కడెక్కడ తిరిగినా
ఎన్నెన్ని గౌరవాలు పొందినా
తిరుగులేని తృప్తి కోసం
తరుగులేని శాంతి కోసం
ఇల్లు చేరుకోవాలి -
ఇల్లు గుయ్యారం గుడిసైనా సరే
ఇల్లాలు గయ్యాళి గంపైనా సరే

మనం ఎవరు ఎక్కడ తిరిగినా చివరికి ఇళ్ళు చేరుకోవలసిందేనని 'ఇల్లు చేరుకోవాలి అనే కవితలో గుర్తు చేశారు. దీని ద్వారా మనిషికి గూడు ప్రాముఖ్యతను తెలియ చేశారు. ఇంతటి ప్రాముఖ్యత గల గుడిసెలు కాలిపోతుంటే మనిషిగా చలించాడు. కవిగా స్పందించి కవిత్వం రాశారు.

ఈ స్పందనతో మానవత్వంతో స్పందించి కవిత్వం రాశారు. గమ్యం ఎంతో దూరంలో లేదనీ, అయితే, ఏ దారిలో వెళ్ళాలో తోచడం లేదని చింతన చేశాడు. ఇక్కడ దారి అంటే రహదారి కాదు, జీవన మార్గం. ఏ మార్గంలో వెళితే ఎంతటి సామాజిక అభ్యుదయాన్ని సాధించగలమనే ఆలోచనను పాఠకుడిలో కలిగించే ప్రయత్నం చేశారు.

మంత్రాలకు చింతకాయలు రాలవు
నినాదాలతో విప్లవం రాదు
నా కవిత్వం మీ కడుపు నింపదు
నిజం, నిజం ముమ్మాటికీ నిజం
మరి – ఇప్పుడేమిటి కర్తవ్యం?

ఈ కవితలో సమాజంలోని వివిధ రంగాలకు చెందిన మనుషులు ఏదో ఒక మార్గంలో ఏదో ఒక మాయలో కొట్టుకుపోతూ ఉంటారు. వారు చేస్తున్న ప్రయత్నం మంచిదేనా? సఫలీకృతం అవుతుందా? మంచి ఫలితాన్ని ఇస్తుందా? అని ఆలోచించకుండా ఉంటారు. ఇటువంటి వారికి ఈ కవిత ద్వారా ఒక ఎరుకను కలుగ చేశారు కవి బోయి భీమన్న. చింతకాయలు కావాలంటే మంత్రాలు పఠించడం కాదు, అసలైన ప్రయత్నమేదో చేయాలనే సూచన ఇందులో ఉంది. విప్లవం నినాదప్రాయం కాకూడదనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. కవిత్వం అవగాహనను ఇవ్వవచ్చు. చైతన్యాన్ని కల్గించవచ్చు. మార్గనిర్దేశం చేయవచ్చు. ఇంతేకాని మనుషుల ఆకలి తీర్చదనే సత్యాన్ని కవి బోయి భీమన్న తెలియ చేశారు. దీని ద్వారా నిర్వహించవలసిన కర్తవ్యాన్ని మనం సరిగా చేపట్టాలని బోయి భీమన్న నిర్దేశించినట్టుగా అనిపిస్తుంది.

ఇదిగో మళ్లండిటు – ఇదీ మోక్షమార్గం
కుల, మత, వర్ణ, వర్గ విముక్తమైన
విశ్వైక మానవతా మార్గం
అరుణ తరుణ గుణ పరీయులకు
ఆనంద రసాద్వైతం

మోక్షం పొందడానికి ఉన్న అనేక మార్గాలను గురించి మనకు తెలుసు. అయితే, మోక్షానికి ఇవి మార్గం కాదని కవి బోయి భీమన్న తెలిపారు. మోక్షమంటే స్వర్గమో, నరకమో కాదనీ, మానవ సమాజంలో కుల, మత, వర్ణ, వర్గం లేని విశ్వమానవతా మార్గమని అన్నారు. ఈ మార్గమే మనిషికి ఆనందాన్ని కలిగించగలదనే అభిప్రాయాన్ని కూడా కవి బోయి భీమన్న ఈ కవితలో చెప్పారు.

తెలివి తక్కువ చీమలు
గింజల కోసం గింజకు చస్తుంటై
అవి పెట్టిన పుట్టలు
పాముల కిర వవు తుంటై..
ఆ పాముల పడగ నీడల్లో ఒదిగి
కప్పల్లా బ్రతుకు తున్నై

తెలివి తక్కువ చీమలు, పీడితులకు సంకేతం. తెలివి తక్కువని విమర్శ చేయడం తెలివితో మసులుకొమ్మని చెప్పినట్టుగా ఉంది. ఇదే చేస్తే, పీడన నుంచీ విముక్తి సాధ్యమనే నమ్మకాన్ని కవి కలిగించే ప్రయత్నం చేశారు. చిన్నపాటి అవసరాల కోసం ఆరాట పడకుండా, రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని ఉద్బోధించారు. ఈ కృషి చేయకుండా సంపన్నుల చాటున పేదలు బతుకీడ్చడం సరైనది కాదని 'చీమల పుట్టలు' కవితలో హితబోధ చేశారు.

మానవుడు ఎలా బాగుపడతాడు?
అంటే – ఇప్పుడు చెడిపోయి ఉన్నాడనేగా అవును
సత్యం, అహింస, న్యాయం, నిజాయితీ
ఇవే కదా? మనిషిని మృగం నుంచీ విడదీసే గుణాలు
ఇవి ఈనాడు ఒక్కడిలో అయినా ఉన్నాయా?

మనిషి ఏ విధంగా బాగుపడాలనే యోచన కవిగా బోయి భీమన్న చేశారు. మనిషి తనను తాను పరిపూర్ణంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తే, బాగుపడటం సాధ్యమే అన్నట్టు చెప్పాడు. మనిషిలో నీతి, నిజాయితీ, విలువలు, న్యాయం, ధర్మం, అహింస వంటి గుణాలు పదిలపరుచుకోవాలని సూచించాడు. ఈ సందర్భంలో కవిపై బౌద్ధ ప్రభావం ఉన్నట్టు అనిపిస్తుంది. మానవీయ గుణాలు మనుషుల్లో కనుమరుగవుతున్నాయనే కవులు నాడు బోయి భీమన్న వంటి వారే కాదు, ఇటీవల అందెశ్రీ వంటి వారు కూడా కలత చెందడం మనం చూశాం.

ఇప్పుడు మేం ఐదుగురుం ఒక కుటుంబం
మేం కన్ను తెరిచిన ఇదే మా జన్మభూమి
మాకు లాగే మా వాళ్లంతా
ఎక్కడెక్కడో ఉన్నారు
మానవు లెక్కడున్నా మావాళ్ళే
మా వాళ్ళున్న భూములన్నీ మా భూములే

ఐదుగురు కుటుంబ సభ్యులు చాతుర్వర్ణ వ్యవస్థను గుర్తుకు తెస్తోంది. మనుషులకు అడ్డుగోడలు ఉండకూడదనే తలంపు కనబడుతుంది. పీడితులు ఎక్కడున్నా అంతా ఒక్కటే అనే దృష్టిని కనబరిచాడు. ఇంకా ఒక అడుగు ముందుకేసి, మనిషనే వాడు ఎక్కడ ఉన్నా తనవాడే అని సొంతం చేసుకున్నాడు. మనుషులను కులం, మతం, ప్రాంతం, లింగం పేర వేరు చేయడాన్ని నిరసించినట్టుగా ఈ కవిత ఉంది. వీరంతా ఒక్కటి కావాలనే ఆకాంక్ష కూడా ఉంది. ఇంతటి మహోన్నత మానవతా తత్వాన్నీ, అభ్యుదయ భావనను కవి బోయి భీమన్న ఎత్తి పట్టాడు. ఇటువంటి మహోన్నత భావజాలం మన కాలానికీ, తరానికే కాదు, భవిష్యత్తు తరాలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. ఈ స్ఫూర్తిని సాహితీవేత్తలు స్వీకరించవలసిన అవసరం ఉంది. బోయి భీమన్నలోని సామాజిక అభ్యుదయాన్ని రచనల్లోకి ప్రవేశ పెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఆధార గ్రంథాలు :

1. గుడిసెలు కాలిపోతున్నై – బోయి భీమన్న
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – బోయి భీమన్న
3. కొలిమి ఆన్‌లైన్ మేగజైన్ – నీలీ రాగం – ఆచార్య కాత్యాయనీ విద్మహే
4. రూపం – సారం – డాక్టర్ కె. బాలగోపాల్
5. దళిత – డాక్టర్ కె. బాలగోపాల్

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న కేదారేశ్వరి గేయ సంపుటి - వస్తు వైవిధ్యం

- వంగ వెంకటయ్య గౌడ్,
అధ్యాపకులు,
సెల్ : 9640184518

తెలుగు సాహిత్యంలో పాటకు ప్రత్యేక స్థానం ఉంది. సాహిత్య ప్రక్రియలన్నింటికీ మూలమైందిపాట. పాట అనేది శ్రమ నుండి పుట్టింది. గ్రామీణ ప్రజలు తమ అలసటను, శ్రమను మరిచిపోవడానికి అప్పటికప్పుడు, అప్పటి పరిస్థితులను బట్టి పాట అలవోకగా అల్లేవారు. పాట నిర్మాణం చాలా సరళమైన పదాలతో అందరికీ అర్థమయ్యే రీతిలో రాస్తారు. కొందరు లయాత్మకమైన బాణీలో సామాన్య ప్రజలకు చేరువయ్యేలా పాటలను, గేయాలను రాస్తారు. చదువుకున్నవారు, చదువుకోని వారు సైతం పాటను, గేయాన్ని రాసి అలరిస్తారు. పాడటానికి అనువుగా ఉన్న ప్రతిదీ కూడా గేయమై జనంలో సంతోషాన్ని నింపుతది. దుఃఖాన్ని మనసులోతులోంచి బయటకు వచ్చేలా చేస్తది. ప్రజలలో చైతన్యాన్ని నింపేది గేయం. గాయాలను గేయాలుగా చేసి ఎందరో కవులు కళాకారులు ఈ సమాజానికి దిక్సూచిలా నిలబడ్డారు. పాట ఇప్పుడు చావు, పుట్టుక, పెళ్లి మొదలు సామాజిక జీవితంలో జరిగే ప్రతి కార్యక్రమంలో పాట భాగమైంది.

గేయం అంటే గానయోగ్యంగా ఉండి మాత్రాఛందస్సుతో కూడిన లయబద్ధమైన కవిత. ఇవి చాలా సరళంగా భావోద్వేగ భరితంగా ఉండి పాడటానికి వీలుగా ఉంటాయి. పల్లెటూర్లలో ఉండే జానపదుల మీద, దేశభక్తి మీద, సహజ సుందరంగా ఉండే ప్రకృతి వర్ణనల మీద గేయాలు రాస్తారు. గేయకవితలు, పాటలకు తేడా ఏమి ఉండదు. గేయంలో మాత్రాఛందస్సుకు ప్రాధాన్యత ఉంటుంది. లయాత్మకమైన భావం దాగి వినే వారిని మంత్రముగ్ధులను చేస్తుంది. బోయి భీమన్న దళిత కవిగా అందరికీ సుపరిచితులు. వారి కలం నుండి జాలువారిన కేదారేశ్వరి గేయ సంపుటిలో 17 గేయాలు 17 పద్యాలు ఉన్నాయి. భిన్నమైన వస్తువు వైవిధ్యంతో గేయాలను రాశాడు.

బోయి భీమన్న రాసిన కేదారేశ్వరి గేయ సంపుటిలో వస్తువైవిధ్యాన్ని కనబరిచాడు. తెలుగు నేల సిరి గొప్పతనాన్ని, ఉగాది ఆగమనాన్ని ఆకాంక్షిస్తూ దేశమాతపై వ్యంగ్యాత్మక రీతిలో చాలా వస్తువైవిధ్యమున్న గేయాలను బోయి భీమన్న రాశాడు. 17 గేయాల్లో ఎక్కువగా ఆర్తితో రాసిన గేయాలు ఉన్నాయి. బోయి భీమన్న గేయాల్లో వివిధ రకాలైన అంశాలను, భావాలను, సామాజిక దృశ్యాలను అనేక గేయాల్లో ప్రతిబింబించి రాశాడు.

బోయి భీమన్న కేదారేశ్వరి రచనలో పంట పొలాలను కేదారేశ్వరితో పోలుస్తూ కేదారమంటే వరి పొలం అన్నారు. వరి పొలాలను పాలించే పచ్చని తల్లిని కేదారేశ్వరి అని అన్నాడు. కేదారుడు అంటే అర్థం శివుడు. రైతు కూడా కేదారనాధుడు కేదారేశ్వరుడు అంటేనూ శివుడే.

తెలుగు భూమి వరి పొలాల భూమి. అందుకే దీనిని కేదారభూమి అన్నాడు. ఈ తెలుగు భూమిని పాలించేవాడు కేదారేశ్వరుడు శివుడైతే, కేదారేశ్వరి శివ, ప్రతి రైతు శివుడే అయితే ప్రతి రైతు కాంత శివే. శివశక్తే. ప్రతి జీవికి ప్రాణాధారం అన్నం. అన్నం తర్వాతనే భోగాలు, వ్యసనాలు, పదవులు అధికారాలు, కళలు, కాంతులు.

మనలో ప్రతి ఒక్కరము, ప్రతినిత్యము దర్శిస్తున్నట్టిదే. తేడా అంతా దృక్పథంలో ఉంది. మెదడుతో చూస్తే అది వట్టి వరిపొలం. హృదయంతో చూస్తే సాక్షాత్తు జీవన ధాత్రి కేదారేశ్వరి. ప్రతి వరి పొలము కేదారేశ్వరైతే ఈ వరిపొలాలన్నింటిని నిజానికి పంట పొలాలన్నింటినీ, నీటి వనరుల్ని, కాయగూరల్ని, మొత్తం మీద అన్నమయ ప్రపంచ సమస్తాన్ని పాలించే ఒక శివశంకర శక్తిగా కేదారేశ్వరుని ఊహించాడు. రూపకల్పన చేసి వస్తువైవిధ్యాన్ని తెలుగు ప్రజల ముందు ఉంచాడు.

కేదారేశ్వర గేయాలు శ్రామిక సంస్కృతి :

నాగార్జున సాగరమా! నవ దేవాలయం అంటూ నాగార్జున సాగరం మానవ విజ్ఞానానికి మణిదీపంగా, శ్రమశక్తికి, జనశక్తికి జయసంకేతా పతాకంగా బోయి భీమన్న ఉద్ఘాటిస్తూ రాశాడు. తెలుగు నేల పసిడి పంటలు మానవ జీవితంలో వెలుగును పంచుతుందని పరమాన్నపు పళ్లెరమని కొనియాడిండు.

మన భారతీయ సంస్కృతిని తన గేయాల్లో దర్శింపజేశాడు. ఉగాదికి స్వాగతం గేయంలో తెలుగు వారి జీవితంలో వెలుగు నింపే ఉగాది సకల శుభాలు కలిగించేలా రావమ్మ అని అవనికి నవజీవనాన్ని ప్రసాదించమని కోరాడు. మామిడి తోరణాలు గేయంలో ఏ ఇంట ఆగిన! ఏ వీధికేగిన! కర్పూరపు దీపాలే! కమ్మని ధూపాలే! ఏ మోము చూచిన చల్లని వెన్నెలలే అని కవి గేయాన్ని ఆలపిస్తాడు. మన ఆచార వ్యవహారాలు మనకు పండుగ వాతావరణంలో మన సంస్కృతిని ప్రతిబింబించేలా గేయాలను రాశాడు బోయి భీమన్న.

కేదారేశ్వర గేయాలు – సామాజిక అంశాలు:

బ్రతుకే ఉద్యమం, మనిషి మారాలి, ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు వంటి గేయాలలో సంఘర్షణ సహజం బ్రతుకుంటేనే సమరమని జీవన విధానాన్ని తెలిపేలా రాశాడు. సంఘర్షణనే మనుషులను సమాజంలో

ఎదిగేలా చేస్తుందని, మనుషులను సమాజాన్ని చైతన్యం కలిగించే గేయాలు రాశాడు. బోయి భీమన్న మనిషి మారాలి గేయంలో మనిషికి మనిషికి మధ్య మందారాలు తిరగాలి. ద్వేషాగ్నులు చల్లారి ప్రేమ సుధలు ఊరాలి అంటాడు. ఒకరి మీద ఒకరికి ప్రేమ ఉండాలి కానీ ద్వేషాన్ని పెంచుకోకూడదని విశ్వజనత సహనంతో సమాజానికి సమానత్వ దారులు పరచాలి. ప్రజలందరికీ ఆనందమే ప్రగతికి విధి కావాలని ప్రజలను కార్యోన్ముఖులను చేశాడు బోయి భీమన్న.

కేదారేశ్వరి గేయ సంపుటిలో రైతు మరియు సైనికుని పాత్ర :

దేశ రక్షణ కోసం ఒక సైనికునిగా మరియు ఒక రైతుగా కృషి చేస్తూ యుద్ధభూమిలో ఒక సైనికునిగా పంట పొలంలో ఒక రైతుగా పోరాటపటిమను గుర్తించడం ఆ తర్వాత తరాలకు జాతి సంపదలను మరియు రక్షణను కల్పించేలా రచన చేశాడు. ఒక సైనికుని మరియు రైతును ఒకే దృష్టితో చూస్తూ సమాజంలో వీరి పాత్ర ముఖ్యమైనది అన్నాడు. వీరిలో ఏ ఒక్కరు పని చేయకపోయినా మానవ మనుగడ కష్టమవుతుంది. కావున రైతు సైనికుడు దేశానికి వెన్నెముకగా గుర్తించాడు బోయి భీమన్న.

ముగింపు :

బోయి భీమన్న రాసిన కేదారేశ్వర గేయ సంపుటిలో ఆనాటి కాలస్థితిగతుల మీద సామాజిక, శ్రామిక వర్గాల ప్రజల ఆకాంక్షలను తన గేయాలలో తెలిపాడు. దేశం మీద, శ్రామికుల మీద, సైనికుల మీద, రైతుల మీద పూటకుఎల్లదీసె కష్టజీవుల మీద తన అవ్యాజమైన ప్రేమను కురిపించాడు. చూడ చక్కని పద బంధాలతో, పలుకుబడులతో గేయాలను చదువరులకు, శ్రోతలకు చైతన్యం కలిగించేలా కేదారేశ్వరి గేయ సంపుటిని రాశాడు. భిన్నమైన గేయాలను విభిన్నమైన వస్తువైవిధ్యంతో సహజ సుందర గేయాలను అల్లిండు బోయి భీమన్న.

ఆధార గ్రంధాలు :

1. బోయి భీమన్న కేదారేశ్వర గేయ సంపుటి.
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – బోయి భీమన్న.
3. గుడిసెలు కాలిపోతున్నై – బోయి భీమన్న.
4. బోయి భీమన్న పాలేరు (నాటకం) 1952.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న త్రిపదలు - ఒక పరిశీలన

- బోల యాదయ్య,
పీజీ తెలుగు ఫ్యాకల్టీ,
సెల్ : 9912206427

తెలుగు సాహిత్యంలో ప్రాచీన సాహిత్యం మొదలుకొని నేటి ఆధునిక సాహిత్యం వరకు సాహిత్యం తన రూపాన్ని మార్చుకొని ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తుంది.

ఒక కవి ఏ ప్రక్రియలో రాసిన తన వేదనను, ప్రజల సమస్యను, సామాజిక రుగ్మతలను ప్రపంచం ముందుంచుతాడు. తాను చెప్పదలుచుకున్న అంశాలను కొత్తకోణంలో కొత్త కొత్త ప్రక్రియలలో అందరికీ చేరువయ్యేలా ఆవిష్కరిస్తాడు.

సాహిత్యంలో జానపద, పురాణ, కావ్య, ప్రబంధ, ఖండకావ్యాలు ఆయా విభిన్న ప్రక్రియల సాహిత్య లక్షణాలను, అవి ఉద్భవించిన దేశ, కాల, సామాజిక పరిస్థితులను ప్రతిబింబించాయి. ప్రక్రియ అంటే సాహిత్య రూపం. ఒకే అంశాన్ని ఒకరు పద్యంలో రాస్తారు. ఒకరు కథ రూపంలో రాస్తారు. ఒకరు గేయరూపంలో రాస్తారు. కవులకు, రచయితలకు స్వేచ్ఛ ఉంది. పద్యం, పాట, నాటకం, నవల, గల్పిక, వ్యాసాలు మొదలుకొని ఆధునిక నూతన వచన ప్రక్రియలైన త్రిపదలు, ముక్తకాలు, గజళ్ళు, రూబాయిలు, హైకులు, నానీలు, నానోలు, రెక్కలు, మొగ్గలు, వ్యంజకాలు, మణిపూసలు వంటి మొదలైన వచన కవితా ప్రక్రియలు నేడు తెలుగు వచన సాహిత్యాన్ని రక్తి కట్టిస్తున్నాయి. కొత్త అవసరాలను బట్టి కొత్త మార్గాలు ఏర్పడినట్లు కొత్త అభిరుచులని బట్టి కొత్త ప్రక్రియలు ఏర్పడటం, కొత్త ప్రక్రియలను ఇతర సాహిత్యాల నుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. నడుస్తున్న కాలానికి అనుగుణంగా చరిత్ర నుదుటిమీద అక్షరాల తిలకం దిద్ది బోయి భీమన్న 1962లో త్రిపదలు అనే పేరుతో మూడు పాదాల కవిత్వాన్ని రచించాడు. మూడు పాదాలతో కవి మూడో కన్నై సమాజానికి దిక్సూచిలా కవి చెప్పదలుచుకున్న అంశాలను నేరుగా ప్రజల కండ్ల ముందరే అక్షరాల మూట విప్పిండు.

బోయి భీమన్న మూడు పాదాలలో రాసిన కవిత్వానికి త్రిపదలు పేరుతో నూతన ప్రక్రియగా తనకు తానే చెప్పుకున్నాడు. మూడు పాదాలలో బోయి భీమన్న రాసిన కవిత్వం బోయి భీమన్నలోని మనసు కోణాన్ని, మనిషిలో దాగున్న అమృతతుల్యమైన ప్రేమామృతాన్ని అక్షరాల నిండా నింపి తన మనసు కొమ్మకు పూసిన ప్రేమపువ్వుల పరిమళాన్ని పాదం పాదం నిండా పాదుజేసి ముచ్చట గొలిపే విధంగా తెలిపిండు. ఏ కవియైన తన అస్తిత్వం మీదగానీ, తన చుట్టూ ఉన్న పరిసరాలపై గానీ, ఆధిపత్య భావజాల అహంకారం పైన గానీ స్పందించి ప్రశ్నల వర్షమై కురవాలంటే ఆ కవికి మనసుండాలి. ఎదుటోళ్ల గుండె గాయాలకు స్పందించే గుణం ఉండాలి. బోయి భీమన్న కూడా అలాగే స్పందించి రాసిన కవిత్వం త్రిపదలు.

బోయి భీమన్న త్రిపదలు కవిత్వంలో భిన్నమైన కోణాలు:

త్రిపదలలో ప్రేమతత్వం: బోయి భీమన్న దళిత వేదనకు, ధిక్కారానికి చిరునామగా పేర్కొంటారు కానీ ఇతనిలో మరో కోణం చూపించాయి త్రిపదలు. మూడు పాదాలలోని 149 త్రిపదలలో అగ్రభాగం తనలోని ప్రేమికుని పరిచయం చేస్తుంది. అవి ఎంతటి అమరశిల్పాలైన నీవు నా ఎదురుగా ఉండగా బొమ్మల్ని చూస్తూ కూర్చోలేను నేను అంటాడు. ప్రేమంటే రెండు శరీరాల సాంగత్యం కాదు ఒకరి కోసం ఒకరు ఎదురుచూసే హృదయాల ఆత్మీయస్పర్శ ప్రేమంటాడు. తాను చూసిన ప్రణయావేశాన్ని ప్రేమైక సౌందర్య దృశ్యాలను అంతర్లీనంగా మనసులో తీరని మోహాలను, కోరికలను తన అక్షరాలతో ఇద్దరు కలిసి మాట్లాడుకున్నట్లు కవిత్వం అల్లిండు. తన జీవిత అనుభవాలను ఆవేదనతో, ఆర్ద్రతతో, ధిక్కారంతో రాసిన కవిత్వం కంటే తన హృదయంలో ఊరిన ప్రేమజలం చాలా తడి తడిగా పొడి హృదయాలను తట్టి ప్రేమశిఖరం వైపు నడిపించేలా త్రిపదలలో ప్రేమ కవిత్వం రాశాడు బోయి భీమన్న.

ఈ సౌందర్య సుధార్ణవంలో ఏకాంతంగా
నేను కోరుతున్నది నిన్ను నీవు కోరుతున్నది నన్ను
మనిద్దరినీ కోరుతున్నది పాలవెన్నెల చెన్ను

ఎడబాటుకు నోయని ప్రేమను కోరుకున్నాడు కవి. ఈ కవి కన్నీళ్ళను ఎంత హృద్యంగా అక్షరీకరిస్తాడో, వలపు ప్రేమను అంతే మధురంగా రాశాడు. బోయి భీమన్న ప్రేమలోని అందాన్ని, రసికతను ఆస్వాదిస్తూ చదివే పాఠకులను అలరించేలా రాశాడు. ప్రేమకున్న లోతు ఎంతో తన మూడు పాదాల కవిత్వంతో కొలిచాడు. ప్రియురాలైన, భార్య అయిన ప్రేమ నింపిన అక్షరాల రాశిని పోసి ఆరాధించిండు. త్రిపదల గ్రంథంలో ప్రేమకు కొత్త నిర్వచనాన్ని తెలిపిండు.

త్రిపదలలో తాత్విక దర్శనం : సత్యం, జీవుడు, పరమాత్మ మరియు ప్రపంచ స్వభావాలను అవగాహన చేసుకునే వేర్వేరు దృక్కోణాలు లేదా ఆలోచన విధానాలు ఈ త్రిపదలలో చాలా దర్శనమిస్తాయి

సౌందర్యం నగ్నం, దాని చూడలేడు మనిషి !
సత్యం నగ్నం, దాని ధరించలేడు మనిషి !
పరబ్రహ్మం నగ్నం, దాని పొందలేడు మనిషి !

బోయి భీమన్న ఏది చెప్పిన, ఏది రాసిన అంతర్లీనంగా భావనిగూఢత దానిలో దాగుంటుంది. మనిషిని ధర్మం వైపు, సత్యం వైపు నడిపించే కవిత్వాన్ని ఆదరించిండు. సమాజానికి దాని అందించిండు. తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యాన్ని, పీడిత ప్రజల అభ్యుదయాన్ని ఆకాంక్షించిన కవి. బహుముఖ ప్రక్రియలతో సామాజిక మార్పును, మానవతావాదాన్ని తన కవిత్వం ద్వారా కోరుకున్న కవి. ఈ త్రిపదలలో చాలా పంక్తులు తనదైన శైలిలో శబ్ద ప్రయోగంతో, అంత్యప్రాసలను ప్రయోగించి ఒక లయాత్మకమైన బాణిలో త్రిపదలు రాశాడు. చెప్పదలచుకున్న అంశాలను తన కవిత్వాన్ని మనసుతో దర్శించిన వారికే చెప్పాడు. పైకి గంభీరమైన భావంతో వాక్య నిర్మాణం జరిగిన పదాలలోపల తాత్వికమైన లోకజ్ఞానాన్ని పొందుపరిచి చెప్పాడు. బోయి భీమన్నలోని బైరాగి తత్వాన్ని త్రిపదలు రాసిన విధానమే మనకు తెలుపుతుంది.

త్రిపదలలో సామాజిక దృక్పథం :

సమాజం మీద సామాజిక ఆచారాల మీద కవికిగల ప్రాపంచిక దృక్పథం, అవగాహన వలననే సమాజంలోని పీడనం మీద కలమెత్తి ఎన్నో కావ్యాలు రాశాడు. మనిషిని మనిషిగా చూడని సమాజాన్ని, మనిషిలో ఉన్న స్వార్థ చింతనను, నీతిమాలిన జాతి రత్నాలను, ముందుచూపు లేని పాలకుల గుడ్డితనాన్ని కవి హృదయంతో చూసి స్పందించి రాసిన త్రిపదలు చాలా ఉన్నాయి.

శత్రువు శత్రువు కాదూ, మిత్రుడు మిత్రుడు కాదు,
ఎవరికి ఎప్పుడు ప్రపంచంలో,
ఎల్లప్పుడూ ఉండేది ఒకటే అది స్వార్థం

సమాజమంతా స్వార్థంతో నిండిపోయింది అంటాడు కవి. మనిషికి శత్రువు లేడు మిత్రుడు లేడు. అవసరాన్ని బట్టి శత్రువు అవసరాన్ని బట్టి మిత్రుడు కానీ ఎల్లప్పుడూ నిలువెల్లా ఈ ప్రపంచంలో నిండుకొని ఉండేది స్వార్థం ఒక్కటే అంటాడు. స్వార్థమే ఈ లోకాన్ని శాసిస్తుంది అంటాడు. లోకం తీరును, నడకను, నడవడికను బోయి భీమన్న అల్ప పదాలతో అలవోకగా త్రిపదలో పలికించాడు.

వంగితే సవారి చేస్తుంది
సవారి చేస్తే వంగుతుంది, లోకం!
గుర్రమో, రౌతో, ఎంచుకో నీవే!

సమాజం ముందు మోకరిల్లితే అదిమిపట్టి చూస్తుంది. ఎదిరిస్తే సలాంకొట్టి వెంట వస్తుంది అంటాడు. స్వార్థం లేని మనిషి లేడు, మనిషి లేని సమాజం లేదు, సమాజం లేని దేవుడే లేడు అనే సత్యాన్ని కవి నిక్కచ్చిగా ప్రకటించాడు. సంపద ఉంటేనే లోకం కీర్తిస్తది. అధికారం ఉంటేనే మేధావి వర్గంలో కలిపి మాట్లాడుతారు. సంపద అధికారం లేకుంటే గుంపులో ఒకడిగా మిగిలిపోయే దుస్థితి తప్పదని కవి సమాజంలో కనువిప్పు కలిగే ఎన్నో సామాజిక అంశాలను తెలిపాడు. బోయి భీమన్నకు లోకంమీద, ప్రజలమీద, ప్రజల ప్రక్షాన ప్రశ్నై అపారమైన ప్రేమను ప్రకటించాడు. స్వార్థం వీడి చైతన్యం దిశగా నడవాలని అనేక త్రిపదల్లో సూచించాడు.

త్రిపదలలో – వస్తు వైవిధ్యం :

త్రిపదల గ్రంథంలో భిన్నమైన కోణాలను కవి దర్శించాడు. రకరకాల భావాలను రాశాడు. ఏ త్రిపద భావం ఆ త్రిపదదే. భావాలలోనూ పరస్పర వైరుధ్యాలు ఉన్నాయి. వస్తువు, శిల్పం, అభినివేశంలోనూ విభిన్నత ఉన్నది. సామాజిక అంశాలు, తాత్విక కోణం ప్రయోగాత్మకంగా రాశాడు. ప్రేమను వస్తువుగా తీసుకొని విభిన్న దృక్పథంతో రాశాడు. మనిషిని అందులో దాగున్న స్వార్థాన్ని బట్టబయలు చేసేలా అక్షరీకరించాడు. కష్టాన్ని,ఇష్టాన్ని, సుఖాన్ని, అందాన్ని, శాంతి, సహన దృక్పథాన్ని, కళా ఆస్వాదనను, భవిష్యత్ కాలజ్ఞానాన్ని దర్శించేలా వాటిని వస్తువులుగా చేసుకుని వైవిధ్యం ప్రదర్శించాడు త్రిపదలలో బోయి భీమన్న. నీతిని, ధర్మాన్ని మానవ జీవిత పోకడలను, అంతుచిక్కని స్వార్థాన్ని, మానవ నైజాన్ని కవిత్వంతో మాట్లాడించిండు. అణగారిన వర్గాల పక్షాన అప్పుడప్పుడు ఐదు వేళ్ళు బిగించి పిడికిలై నినదించిండు. నిస్వార్థమైన ప్రేమ పంక్తులను త్రిపదల పుస్తకానికి దోర్నం కట్టిండు.

ముగింపు :

బోయి భీమన్న రాసిన త్రిపదలు ఆరు దశాబ్దాలకు పైగా అయినా నేటి సమకాలీన సమాజానికి వర్తించేలా ఉన్నాయి. ఒక్కొక్క త్రిపద ఒక్కొక్క భావాన్ని తెలిపేలా ఉన్నాయి. కవి ఏది రాసిన ముందుచూపుతో రాస్తాడు అంటారు. ఈ త్రిపదలన్నీ నేటి కాలాన్ని తూకమేసి రాసినట్లే ఉంటాయి. డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ సృష్టించిన మొగ్గలు ప్రక్రియ కూడా ముచ్చటగా మూడు పాదాలు ఉంటాయి. ఇవి కూడా భిన్నమైన వస్తువైవిధ్యాలతో వచ్చినవే. బోయి భీమన్న త్రిపదలు కూడా వైవిద్య భరితంగా ఉన్నవి. కానీ కాలగమనంలో త్రిపదలను ఎవరు అనుసరించకపోవడంతో ఈ ప్రక్రియకు అంత పేరు రాలేదనుకోవచ్చు. ఈ వ్యాసం ద్వారానైనా తెలియజేస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను. ఇలాంటి నూతన ప్రక్రియలను వెలుగులోకి తేవడం సాహిత్య అభిమానులుగా మన బాధ్యత. బోయి భీమన్నను ప్రేమను ఆస్వాదించే కవిగా, మనసు కవిగా, త్రిపదలు చదివిన ప్రతి ఒక్కరికి అర్థం అవుతుంది.

ఆధార గ్రంథాలు

1. బోయి భీమన్న త్రిపదలు పుస్తకం
2. అంతర్జాలం

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న నాటక సాహిత్యం – సామాజిక చైతన్యం

– డా. బాలశ్రీనివాస్
సహ ఆచార్యులు,
సెల్ : 9491595813

సారాంశం

ఈ పరిశోధన పత్రం ఇరవయ్యో శతాబ్దపు తెలుగు సాహిత్య శిఖరం, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న నాటక సాహిత్యంలో ప్రతిఫలించిన సామాజిక చైతన్యాన్ని మరియు ఆర్థిక దృక్పథాన్ని విశ్లేషిస్తుంది. అట్టడుగు వర్గాల విముక్తిని, కుల వివక్ష నిర్మూలనను ఆకాంక్షించిన భీమన్న, తన నాటకాలను కేవలం వినోద సాధనాలుగా కాకుండా సామాజిక మార్పుకు శక్తివంతమైన ఆయుధాలుగా మలిచారు. ఈ అధ్యయనం ప్రధానంగా 'పాలేరు', 'కూలిరాజు', మరియు 'రాగవాసిష్ఠం' వంటి నాటకాలను నేపథ్యంగా తీసుకుని, ఆయన ప్రతిపాదించిన విద్యా విప్లవం మరియు శ్రమ గౌరవం వంటి అంశాలను చర్చిస్తుంది. భీమన్న నాటకాల్లోని సామాజిక ఇతివృత్తాలను గుర్తించడం, అణగారిన వర్గాల అభ్యున్నతికి 'విద్య'ను ఆయన ఎలా పరిష్కార మార్గంగా చూపారో విశ్లేషించడం మరియు అర్థశాస్త్ర కోణంలో శ్రామిక వర్గ చైతన్యాన్ని అధ్యయనం చేయడం ఈ పత్రం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. సాహిత్యం సామాజిక సంస్కరణకు మూలమని, అజ్ఞానం మరియు ఆర్థిక అసమానతలే అణచివేతకు కారణమని, వీటిని విద్యా సాధికారత మరియు ఆత్మగౌరవ పోరాటం ద్వారా అధిగమించవచ్చని భీమన్న తన రచనల ద్వారా నిరూపించారనే పరికల్పనపై ఈ పరిశోధన సాగింది. ఈ విశ్లేషణ ద్వారా భీమన్న నాటకాలు డా. బి.ఆర్. అంబేద్కర్ భావజాలానికి సాహిత్య రూపాలని, అవి నాటి సమాజంలోనే కాకుండా నేటి సమకాలీన సామాజిక–ఆర్థిక పరిస్థితుల్లోనూ అత్యంత ప్రాసంగికతను కలిగి ఉన్నాయని ఈ పరిశోధన నిర్ధారిస్తుంది.

ముఖ్య పదాలు: బోయి భీమన్న, సామాజిక చైతన్యం, విద్యా సాధికారత, శ్రమ గౌరవం, ఆర్థిక సమానత్వం, దళిత సాహిత్యం, అంటరానితనం.

ఉపోద్ఘాతం

తెలుగు సాహితీ గగనంలో బోయి భీమన్న ఒక ధ్రువతార. కవిగా, నాటకకర్తగా, మానవతావాదిగా ఆయన ప్రస్థానం అద్వితీయం. ఇరవయ్యో శతాబ్దపు తెలుగు సమాజంలో వేళ్లూనుకున్న కుల వివక్ష, అంటరానితనం, ఆర్థిక దోపిడీ వంటి రుగ్మతలను రూపుమాపడానికి ఆయన సాహిత్యాన్ని ఒక శక్తివంతమైన ఆయుధంగా మలిచారు. ముఖ్యంగా నాటక రంగం ద్వారా సామాన్య ప్రజలను చైతన్యపరచడంలో ఆయన కృతకృత్యులయ్యారు.

రచయిత నేపథ్యం – సామాజిక దృక్పథం

బోయి భీమన్న (1911–2005) తెలుగు సాహిత్యంలో ఒక "శతాబ్దపు కవి". కవిగా, రచయితగా, జర్నలిస్టుగా, సామాజిక సంస్కర్తగా, మరియు రాజకీయవేత్తగా ఆయన బహుముఖ ప్రజ్ఞను కనబరిచారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో దళిత సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా మలిచాడు.భీమన్న గారు ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించి, అంటరానితనం వల్ల కలిగే అవమానాలను స్వయంగా అనుభవించారు. ఈ అనుభవాలే ఆయన రచనల్లోని వాడికి, వేడికి కారణమయ్యాయి. ఆయన సాహిత్యం కేవలం వినోదం కోసం కాకుండా, "సామాజిక విప్లవం" కోసం ఉద్భవించింది. ఆయన దృష్టిలో కవిత్వం లేదా నాటకం సమాజ హితాన్ని కోరాలి. భీమన్న భాష సరళంగా, గ్రామీణ ప్రజలకు అర్థమయ్యేలా ఉంటుంది. పద్యాలలో కూడా వాడుక భాషను, సామెతలను అద్భుతంగా ఉపయోగిస్తారు.

పరిశోధన లక్ష్యాలు

బోయి భీమన్న నాటక సాహిత్యం కేవలం ఒక కళాత్మక సృజన మాత్రమే కాకుండా, అది అణగారిన వర్గాల సామాజిక–ఆర్థిక విముక్తికి ఒక దిక్సూచిగా నిలిచింది. ఈ నేపథ్యంలో, ఆయన నాటకాల్లోని సామాజిక చైతన్యాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పరిశోధన పత్రం ప్రధానంగా భీమన్న గారి సాహిత్య ప్రస్థానాన్ని మరియు సామాజిక సంస్కరణా దృక్పథాన్ని క్రోడీకరిస్తూ, ఈ క్రింది లక్ష్యాలను నిర్దేశించుకుంది.

భీమన్న నాటకాల్లోని సామాజిక ఇతివృత్తాలను విశ్లేషించడం.

అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన సూచించిన మార్గాలను అధ్యయనం చేయడం.

ఆయన నాటకాల్లోని ఆర్థిక మరియు రాజకీయ చైతన్యాన్ని చర్చించడం.

పరిశోధన పరికల్పన

ఈ పరిశోధనా వ్యాసం ఈ క్రింది పరికల్పనల ఆధారంగా సాగుతుంది:

సాహిత్యం – సామాజిక సాధనం: బోయి భీమన్న నాటకాలు కేవలం సౌందర్యాత్మక వినోదం కోసం కాకుండా, సమాజంలోని అసమానతలను ప్రశ్నించే ఒక శక్తివంతమైన సామాజిక సంస్కరణా సాధనంగా పనిచేశాయి.

విద్య ద్వారా విముక్తి: అణగారిన వర్గాల ఆర్థిక మరియు సామాజిక బానిసత్వానికి 'అజ్ఞానం' ప్రధాన కారణమని, దానిని 'విద్య' అనే ఆయుధం ద్వారానే తొలగించవచ్చని భీమన్న తన నాటకాల ద్వారా నిరూపించారు.

ఆర్థిక సమానత్వం: 'కూలిరాజు' వంటి నాటకాల ద్వారా శ్రమ దోపిడీని ఎండగడుతూ, సంపద పంపిణీలో శ్రామికులకు సమాన వాటా ఉండాలనే ఆధునిక ఆర్థిక సూత్రాలను భీమన్న గారు నాడే ప్రతిపాదించారు.

అంబేద్కర్ దృక్పథం: దళిత సాహిత్యం మరియు సామాజిక చైతన్యానికి డా. బి.ఆర్. అంబేద్కర్ భావజాలమే మూలస్తంభమని, భీమన్న నాటకాల్లోని పాత్రలు ఈ ఆత్మగౌరవ పోరాటాన్ని ప్రతిబింబిస్తాయి.

నాటక వస్తువు – సామాజిక విప్లవం

బోయి భీమన్న గారి నాటకాలు కేవలం సిద్ధాంతాలు కావు, అవి సామాజిక ప్రయోగశాలలు. ఆయన ఎంచుకున్న వస్తువులో సామాజిక విప్లవం ఎలా ఉందో ఈ క్రింది కథా సందర్భాల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

అంటరానితనం మరియు కుల వివక్ష

భీమన్న తన నాటకాల్లో అంటరానితనాన్ని ఒక పాపంగా కాకుండా, సామాజిక అన్యాయంగా చిత్రించారు. భీమన్న నాటకాలు అంటరానితనాన్ని కేవలం ఒక సామాజిక సమస్యగా కాకుండా, మానవ హక్కుల ఉల్లంఘనగా చిత్రీకరించాయి. కులం పేరుతో మనిషిని మనిషిగా చూడని వ్యవస్థపై ఆయన పాత్రలు తిరుగుబాటు చేస్తాయి.

కథా నేపథ్యం: 'రాగవాసిష్ఠం' నాటకంలో ఆయన అరుంధతీ వశిష్ఠుల పురాణ గాథను తీసుకుని కుల వ్యవస్థ మూలాలను ప్రశ్నించారు. అరుంధతి ఒక మాతంగి (దళిత) వనిత అయినప్పటికీ, ఆమె సంస్కారం వల్ల మహర్షికి పత్ని అయిందని చూపిస్తూ, కులం అనేది పుట్టుకతో వచ్చేది కాదని, అది గుణగణాలతో కూడుకున్నదని నిరూపించారు.

విశ్లేషణ: కులం పేరుతో మనిషిని దూరం పెట్టడం అంటే ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించడమేనని ఆయన పాత్రల ద్వారా హెచ్చరించారు. అంటరానితనం వల్ల మనుషుల మధ్య ఏర్పడిన గోడలను బద్దలు కొట్టడమే ఆయన నాటకాల్లోని ప్రధాన ఘర్షణ.

విద్య: విముక్తికి మార్గం

భీమన్న గారి ప్రతి నాటకంలోనూ "విద్య" ఒక ప్రధానాంశంగా ఉంటుంది. అజ్ఞానం ఉన్నచోటే అణచివేత ఉంటుందని ఆయన నమ్మారు. అణగారిన వర్గాల వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని ఆయన తన నాటకాల ద్వారా ప్రబోధించారు. విద్య లేని వాడు వింత పశువు" అన్న నినాదాన్ని భీమన్న గారు ఒక సామాజిక ఉద్యమంగా మార్చారు.

కథా నేపథ్యం: 'పాలేరు' నాటకంలో కథానాయకుడు వెంకన్న ఒక భూస్వామి ఇంట్లో పాలేరుగా పని చేస్తూ అక్షర జ్ఞానం లేక బానిసలా బతుకుతుంటాడు. కానీ, చదువుకోవాలనే తపనతో ఆ సంకెళ్లను తెంచుకుని పారిపోతాడు. విద్యాభ్యాసం పూర్తి చేసి, అదే ఊరికి ఐ.ఏ.ఎస్ (కలెక్టర్) హోదాలో తిరిగి వస్తాడు.

విశ్లేషణ: ఇక్కడ 'విద్య' అనేది కేవలం ఉద్యోగం కోసం కాదు, అది బానిసత్వ సంకెళ్లను తెంచే ఒక మంత్రమని భీమన్న నిరూపించారు. "జ్ఞానమే శక్తి" అనే సూత్రం ఆయన నాటకాల్లోని పాత్రలను నిస్సహాయ స్థితి నుండి నిర్ణయాత్మక స్థితికి తీసుకెళ్తుంది.

అర్థశాస్త్ర దృక్కోణం – ఆర్థిక అసమానతలు

భీమన్న శ్రమ దోపిడీని తీవ్రంగా వ్యతిరేకించారు. పల్లెల్లో భూస్వాములు పేద ప్రజలను ఎలా వాడుకుంటున్నారో ఆయన నాటకాల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు.

కూలి–పెట్టుబడి: 'కూలిరాజు' నాటకంలో భీమన్న పెట్టుబడిదారి వ్యవస్థను ప్రశ్నించారు. శ్రామికుడే తన చెమటతో సంపదను సృష్టిస్తాడని, కానీ ఆ సంపదలో అతనికి వాటా దక్కడం లేదని ఆయన వాదించారు. శ్రమ దోపిడీని నిరసిస్తూ, శ్రామికుడికి 'యజమాని' హోదా దక్కాలని ఆయన ఆకాంక్షించారు.

భూస్వామ్య వ్యవస్థ: పల్లెల్లో భూస్వాములు పేద ప్రజల కష్టాన్ని దోచుకుంటూ వారిని అప్పుల ఊబిలో ఎలా నెట్టేవారో భీమన్న తన పాత్రల ద్వారా చూపారు. భూమి కేవలం కొందరి సొత్తు కాకూడదని, దున్నేవాడికే భూమి దక్కాలనే 'ఆర్థిక సమానత్వ' భావనను ఆయన నాటకాల్లోని చర్చల ద్వారా వ్యక్తపరిచారు.

ప్రధాన నాటకాల లోతైన విశ్లేషణ

బోయి భీమన్న గారు నాటకాన్ని కేవలం ఒక కళా ప్రక్రియగా కాకుండా, సామాజిక విశ్లేషణకు ఒక ప్రయోగశాలగా మలిచారు. ఆయన రచనల్లోని వస్తు వైవిధ్యం, పాత్రల చిత్రణ అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రకటనగా నిలుస్తాయి.

పాలేరు– ఒక విద్యా విప్లవం

పాలేరు నాటకం తెలుగు నాటక రంగంలో ఒక విప్లవం. వెనుకబడిన వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ నాటకం చేసిన కృషి అనన్యం. తెలుగు నాటక చరిత్రలో 'పాలేరు' ఒక చారిత్రక అవసరం. నాటి భూస్వామ్య వ్యవస్థలో దళితులు ఎదుర్కొన్న బానిసత్వాన్ని ఈ నాటకం కళ్లకు కడుతుంది.

కథా విశ్లేషణ: ఒక పేద బాలుడు భూస్వామి వద్ద పాలేరుగా పని చేస్తూ, అనేక అవమానాలను ఎదుర్కొని, చివరకు చదువు ద్వారా కలెక్టర్గా ఎదగడం ఇందులో ప్రధానాంశం. ఈ నాటకంలోని కథానాయకుడు వెంకన్న. చిన్నతనం నుంచే చదువుకోవాలనే తపన ఉన్నప్పటికీ, పేదరికం వల్ల భూస్వామి ఇంట్లో పాలేరుగా చేరుతాడు. అక్కడ అతను అనుభవించే అవమానాలు, దెబ్బలు ఒక వ్యక్తిని క్రుంగదీయాల్సింది పోయి, అతనిలో తిరుగుబాటును రగిలిస్తాయి. ఫలితంగా చదువుకోవడానికి పారిపోయి, కష్టపడి ఐ.ఏ.ఎస్ సాధించి, అదే ఊరికి కలెక్టర్గా తిరిగి వస్తాడు.

సామాజిక కోణం: "పాలేరుతనం" అనేది కేవలం ఒక వృత్తి కాదని, అది అజ్ఞానంతో కూడిన ఒక సామాజిక సంకెళ్లని భీమన్న నిరూపించారు. చదువు ద్వారా దళితులు రాజ్యాధికారాన్ని సైతం చేజిక్కించుకోగలరని ఈ నాటకం ధైర్యాన్ని ఇచ్చింది. ఈ నాటకం చూసి ప్రభావితమై ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకు పంపారు. సాహిత్యానికి సమాజాన్ని మార్చే శక్తి ఉందని ఈ నాటకం నిరూపించింది.

కూలిరాజు – శ్రమ గౌరవం మరియు ఆర్థిక సమానత్వం

ఈ నాటకంలో భీమన్న గారు శ్రామికులే అసలైన రాజులని నిరూపించారు. శ్రమకు తగిన ఫలితం దక్కాలని, శ్రామికుడు యజమానితో సమానంగా గౌరవం పొందాలని ఈ నాటకం కోరుకుంటుంది. దోపిడీ రహిత సమాజ స్థాపన దీని ప్రధాన లక్ష్యం.

కథా విశ్లేషణ: పెట్టుబడిదారి వర్గం, శ్రామిక వర్గం మధ్య జరిగే సంఘర్షణే ఈ నాటక ఇతివృత్తం. "పని చేసేవాడు కూలి కాదు, వాడే సమాజానికి రాజు" అనే విప్లవాత్మక నినాదాన్ని భీమన్న ఇందులో వినిపించారు.

అర్థశాస్త్ర కోణం: కార్ల్ మార్క్స్ చెప్పిన 'మిగులు విలువ' సిద్ధాంతం ఈ నాటకంలో ప్రతిబింబిస్తుంది. శ్రామికుడి చెమట వల్ల కలిగే లాభాలను యజమాని మాత్రమే అనుభవించడం అన్యాయమని, ఉత్పత్తిలో శ్రామికుడికి భాగస్వామ్యం ఉండాలని భీమన్న వాదించారు. ఇది శ్రామిక వర్గానికి ఒక ఆర్థిక దిశానిర్దేశాన్ని అందించింది.

రాగవాసిష్ఠం – చారిత్రక, ఆధ్యాత్మిక మరియు కుల నిర్మూలన దృక్కోణం

చారిత్రక, ఆధ్యాత్మిక కోణం ఇది కేవలం సామాజికమే కాదు, ఆధ్యాత్మిక కోణంలో కూడా సాగుతుంది. వశిష్ఠుడు, అరుంధతి కథ ద్వారా కులాల అంతరాలను తొలగించాలని ఆయన ప్రతిపాదించారు. ఇది భీమన్న గారి సృజనాత్మకతకు పరాకాష్ట. కుల వివక్షను సమర్థించే వారికి పురాణాల సాక్షిగా సమాధానమిచ్చిన అద్భుత కావ్యం ఇది.

కథా విశ్లేషణ: వశిష్ఠ మహర్షి, అరుంధతిల వివాహాన్ని ఈ నాటకంలో నేపథ్యంగా తీసుకున్నారు. అరుంధతి మాతంగి (దళిత) కులంలో పుట్టినప్పటికీ, ఆమె తన సంస్కారం మరియు జ్ఞానంతో 'బ్రహ్మజ్ఞాని' అయ్యిందని భీమన్న నిరూపించారు.

సామాజిక కోణం: హిందూ పురాణాల్లోనే అంటరానితనం లేదని, సంస్కారం ఉన్నవారెవరైనా పూజింపబడతారని ఆయన చాటిచెప్పారు. అగ్రవర్ణాల వారు దళితులను అణచివేయడానికి వాడే ఆధ్యాత్మిక ఆయుధాలను, భీమన్న అదే ఆధ్యాత్మికతతో ఎదిరించారు. ఇది దళిత సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

అంబేద్కర్ ప్రభావం మరియు శైలి

డా.బి.ఆర్. అంబేద్కర్ భావజాల ప్రభావం బోయి భీమన్న గారి జీవితంపై, సాహిత్యంపై అంబేద్కర్ గారి ప్రభావం అపారం. రాజ్యాంగబద్ధమైన హక్కులు, చట్టం పట్ల గౌరవం, హక్కుల కోసం పోరాటం ఆయన నాటకాల్లో స్పష్టంగా కనిపిస్తాయి. భిక్షాందేహిలా కాకుండా, ఆత్మగౌరవంతో

బతకాలనే అంబేద్కర్ సందేశం భీమన్న నాటకాల్లోని ప్రతి పాత్రలోనూ ధ్వనిస్తుంది. నాటక శిల్పం మరియు భాషా విశేషాలు భీమన్న గారు నాటకాల్లో వాడిన భాష అత్యంత సహజమైనది.

జానపద భాష: ప్రజలకు అర్థమయ్యేలా గ్రామీణ భాషను వాడారు.

పాత్ర చిత్రణ: ఆయన పాత్రలు ఆదర్శవంతంగా ఉంటూనే, వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి.

ముగింపు

ఈ పరిశోధన ద్వారా బోయి భీమన్న నాటక సాహిత్యం కేవలం సాహిత్య సృజన మాత్రమే కాకుండా, అది ఒక సామాజిక చైతన్య ఉద్యమమని స్పష్టమవుతోంది. వ్యాసారంభంలో పేర్కొన్న లక్ష్యాలు మరియు పరికల్పనల ఆధారంగా ఈ క్రింది ముగింపులను విశ్లేషించవచ్చు.

బోయి భీమన్న తన నాటకాల ద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచారనే పరికల్పన ఈ అధ్యయనంలో పూర్తిగా నిరూపితమైంది. ముఖ్యంగా 'పాలేరు' నాటకం ద్వారా ఆయన ఆశించిన విద్యా విప్లవం, నాటి సమాజంలో ఆచరణాత్మక మార్పులకు దారితీసింది. ఒక ఆర్థికవేత్త దృక్కోణంలో విశ్లేషిస్తే, 'కూలిరాజు' నాటకంలో భీమన్న ప్రతిపాదించిన శ్రమ గౌరవం మరియు సంపద పంపిణీ సిద్ధాంతాలు, నేటి ఆధునిక సంక్షేమ రాజ్య భావనలకు పునాదులుగా నిలిచాయి. ఆర్థిక అసమానతలను తొలగించకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదన్న ఆయన దృక్పథం అద్వితీయం. రాజ్యాంగబద్ధమైన హక్కులు, ఆత్మగౌరవం మరియు విద్య అనే అంబేద్కర్ బోధనలను భీమన్న తన నాటక పాత్రల ద్వారా సజీవంగా చిత్రించారు. 'రాగవాసిష్ఠం' ద్వారా ఆధ్యాత్మిక రంగంలో కూడా సమానత్వాన్ని కోరుతూ ఆయన చేసిన విశ్లేషణ, కుల నిర్మూలన దిశగా ఒక గొప్ప అడుగు.

మొత్తంగా చూస్తే, భీమన్న నాటకాలు కాలపరీక్షకు నిలిచి, నేటికీ ప్రాసంగికతను కలిగి ఉన్నాయి. సాహిత్యానికి సమాజాన్ని సంస్కరించే శక్తి ఉందని ఆయన తన రచనల ద్వారా నిరూపించారు. సామాజిక సమానత్వం, ఆర్థిక స్వేచ్ఛ మరియు విద్యా సాధికారత అనేవి కేవలం ఆదర్శాలు కావు, అవి ప్రతి పౌరుడి హక్కు అని చాటిచెప్పిన భీమన్న, తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. భవిష్యత్తులో సామాజిక–ఆర్థిక దృక్కోణంలో భీమన్న సాహిత్యంపై మరిన్ని లోతైన పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఉందని ఈ అధ్యయనం అభిప్రాయపడుతోంది. బోయి భీమన్న నాటక సాహిత్యం తెలుగు సాహిత్యంలో ఒక స్వర్ణ అధ్యాయం. ఆయన కేవలం సమస్యలను ఎత్తిచూపలేదు, పరిష్కార మార్గాలను కూడా సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం అనేవి కేవలం పదాలు కావు, అవి ఆచరణలోకి రావాలని ఆయన తపించారు. నేటి 21వ శతాబ్దంలో కూడా కుల వివక్ష, ఆర్థిక అసమానతలు రూపం మార్చుకుని కొనసాగుతున్న తరుణంలో, భీమన్న నాటకాల అధ్యయనం అత్యంత ఆవశ్యకం. ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం ఇచ్చే అసలైన నివాళి.

ఉపయుక్త గ్రంథసూచి :

1. భీమన్న, బోయి. పాలేరు నుండి పద్మభూషణ్ వరకు (ఆత్మకథ).
2. డా. ఎన్. గోపి. భీమన్న సాహిత్యం – పరిశీలన.
3. వెల్చేరు నారాయణరావు. తెలుగు నాటక చరిత్ర.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న గారి ఉగాదులలో – కవితా దృక్పథం

– డా. డి.రమణమ్మ
తెలుగు ఉపన్యాసకురాలు
సెల్ : 96189 84069

వ్యాస సంగ్రహం:

"పాలేరు నుండి పద్మశ్రీ" వరకు ఎంతో మహోన్నతంగా ఎదిగిన ప్రముఖులు మన బోయి భీమన్నగారు. సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత తూర్పుగోదావరి మామిడికుదురు అనే మారుమూల పల్లెలో దళిత పాలేరు కుటుంబంలో పుట్టి పెరిగిన మహనీయుడు. ఎంతో మహోన్నతమైన కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మించి ఎన్నో గౌరవ సన్మానాలు అందుకున్న సహృదయుడు బోయి భీమన్నగారు.

"అక్షరాలే ఆయుధంగా జీవించిన అమర సాహితీవేత్త బోయి భీమన్న"

సమాజ శ్రేయస్సుకు తన రచనలు ఎంతో ఉపయోగపడ్డాయని చెప్పవచ్చు. ప్రజల చైతన్యం దృష్టిలో పెట్టుకొని అనేక ప్రక్రియల్లో రచనలు చేసిన సాహితీమూర్తి. ఆధునిక తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప కవి. పద్యం, గేయం, నాటకం, వచన కవిత వంటి పలు ప్రక్రియలలో రచనలు చేశారు.

తన రచనల ద్వారా సమాజాన్ని ఒక్కతాటిపై నడిపించిన మహనీయుడు. కవిగా గళం విప్పినప్పటి నుంచి, కవిగా కలం పట్టినప్పటి నుండి విరామ మెరుగక వందలకొద్దీ వసంత కవితలు, డజన్ల కొద్దీ ఉగాది కవితలు రాశానని భీమన్నగారే స్వయంగా వసంత వేదికలో చెప్పుకున్నారు.

కీలక పదాలు:

ప్రగతి, విశ్వైక, ఒత్తేసుకో, హత్తేసుకే, అమృతం, సంస్కారం.

విషయ వివరణ:

బోయి భీమన్నగారు చిన్ననాటి నుండి, కాలేజీ రోజుల్లో ఆ తర్వాత ప్రతి సంవత్సరం ఉగాది కవి సమ్మేళనాలలో రచించిన కవితలన్నీ వాయులీనం కాకుండా "భీమన్న ఉగాదులు" పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. కానీ పూర్తిగా లభ్యం కాలేదు. మన కాలమానంలోనీ ప్రభవ, విభవాది అరవై సంవత్సరాల పేర్లతోనూ అరవై ఉగాదులు ఉంటాయి. కానీ ఈ కవితా సంపుటిలో అన్ని చేరలేదు. చేర్చబడ్డ ఉగాదులకు రకరకాల శీర్షికలు పెట్టడం జరిగింది. ఇవి కూడా ఒక వరుస క్రమంలో లేవు. దేనికదే స్వతంత్ర సమగ్ర కవిత అని చెప్పవచ్చు. భీమన్నగారు మొట్టమొదటిసారిగా 1922లో "దుందుభి" నామ సంవత్సరంలో ఉగాది కవిత రచించారు. ఉగాది అనగానే షడ్రుచులతో కలబోసిన పండుగ. మనకు ఉగాది వసంతారంభం కనుక వసంత రమణీయతలన్నీ ఉంటాయి. ఇవన్నీ అన్ని ఉగాదులకు సమానమే కానీ భీమన్న గారి ఉగాదులు కవితా సంపుటిలో ఉగాది వర్ణనే గాక, ఆనాటి దేశ, కాలపాత్రలకు సంబంధించిన సమస్యలు, విమర్శలు పరిష్కార సూచనలు కనిపిస్తాయి. భీమన్నగారు ఎంతో వినయంగా తాను రాసిన ఉగాదులు కవితా సంపుటిని దేవులపల్లి రామానుజరావుగారికి అంకితమిచ్చారు.

రామానుజరావుగారి సాహితీసేవను కొనియాడుతూ "తెలుగు తోటలో సాంస్కృతిక వసంతంలో వివిధ రచనా ప్రసూనాలను పూయించినవాడు, పలు ముఖాలుగా పలుచబడిపోతున్న సారస్వత సంస్థాశకుంతలాలను పట్టి ఒకే అకాడమీ కిందకు తెచ్చి పెంచినవాడు, ఆడి తప్పనివాడు వెనకడుగు లేనివాడు" అంటూ రామానుజరావుగారు తెలుగు సారస్వత పరిషత్ స్థాపనకు చేసిన కృషిని ఎంతగానో కొనియాడుతూ తన కవిత ద్వారా లోకానికి తెలియజేశాడు. "కొత్త కోకిల"లో ఉగాది వైభవాన్ని ప్రకృతితో అన్వయించి ఎంతో చక్కగా వర్ణించారు.

"బొమ్మల బజారు"లో పాత బొమ్మలన్నీ చీకట్లోకి విసిరేసి, కొత్త బొమ్మల బజారులో తిరుగుతున్నామంటూ తన పిల్లలతో లోకం తీరు చర్చించిన విధానం అందరినీ ఆకట్టుకుంటుంది. కొండలను తవ్వి శిలల నుండి శిల్పాలను తయారు చేస్తున్న వారి శ్రమజీవుల కష్టాలను వివరిస్తూ ఒకే శైలం శిలల శకలాలు ఒకే శాస్త్రం కింద చెక్కబడ్డాయి, ఒకే కేంద్రం నుండి సప్లై అయ్యాయి, ఒకే ధరకు లభించాలి న్యాయంగా... అయినా వాటి వ్యాపారంలో ఈ షాపుల మధ్య ఎంత పోటీ! వెలలో ఎంత వ్యత్యాసం! రోడ్డుపక్క రూపాయికి దొరికే బొమ్మ మోహన శిల్పశాలలో మూడు రూపాయలు, హస్తకళల కౌముదిలో ఐదు రూపాయలు! సమాజంలో ఇదెక్కడి న్యాయం అంటూ ఆవేదన చెందాడు.

ఈ విధంగా సమాజంలోని అవకతవకల గురించి తారతమ్యాల గురించి చక్కగా విశ్లేషించారు. పైరవీల పంచలలో, అధిక ధరల బొజ్జలలో, పదవీ రాజకీయాలలో, ప్రపంచ పర్యటనలలో లక్ష్మీ... లక్ష్మికి సేవ చేస్తూ సరస్వతి ఉండటాన్ని గురించిన వాస్తవాన్ని చూపిస్తాడు. కొండల నుండి బండలను కొట్టిపడేస్తున్న శ్రమజీవుల చెమటలో అన్నిటికీ మూలమైన శక్తి ఉందని గుర్తించి చెప్పటం, సమాజంలోని స్థితిగతులను విశ్లేషించిన విధానం బొమ్మల బజారు కవితకు కొసమెరుపుగా నిలిచింది.

"వాకిట్లో వసంతలక్ష్మి" మధ్యతరగతి, ఇంకా దిగువ మధ్యతరగతి ప్రజల కోణం నుంచి ఉగాదిని వ్యాఖ్యానించిన కవిత.

ఒకపక్క పంపులో నీళ్లు లేవు,
మార్కెట్లో కూరలు లేవు,

జేబులో పైసలు లేవు, మరోపక్క వసంతలక్ష్మి వచ్చి వాకిట్లో నిలబడింది!

ఏమిటి అలా చూస్తావ్?
ఒత్తేసుకో కళ్ళల్లోని దైన్యాన్ని...
హత్తేసుకో వసంతలక్ష్మి హృదయాన్ని...

అని ప్రారంభం అయ్యే ఈ కవిత కరుణ రసంతో ప్రజలను ఆకట్టుకున్నది.

మరో కోణంలో సమాజ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ..

పాత ఏడాది ఏడాది క్రితం

కొత్తగానే పుట్టింది కాదా?
పుట్టడం కాదు ముఖ్యం
పుట్టుక సార్థకం కావాలి!

వందల వేలు ఉగాదుల్ని మనమే వ్యర్థం చేసుకొన్నాం...

లోపం ఉగాదిది కాదు, అది ప్రతిసారి నవ్వుతూనే వస్తున్నది మనమే దాన్ని ఏడిపించి పంపిస్తున్నాం...

అంటూ సమయాన్ని వృధా చేసే వారికి ధీటుగా తన పదునైన అక్షరాలతో హితవు పలికాడు.

ప్రగతీ, ప్రగతీ! ఓ ప్రగతీ!
సర్వలోక మానవోన్మన స్వగతీ!
ఎవరు దేవి నీవు?
ఏది నీవు ఉండే తావు...

అంటూ సామాన్యుడి జీవితంలో వెలుగు ఎక్కడ, చైతన్యం ఎటువైపు వెళతుంది అని ఆవేదన వ్యక్తం చేశాడు.

రేడియోలో నీవు నాద రాధవు...
పత్రికల నిండా నీవు అక్షర రంభవు...
సభా వేదికలపై సాక్షాత్తు మోహినివి....
హరిజనులకు ఆకాశ సౌధానివి...
బలహీనవర్గాలకు బంగారులేడివి...

ఓహో నీ ఓర చూపుల వొంక నవ్వు...
అయినవాళ్లకు అమృతం...
కానీ వాళ్లకు కల్లు...

అంటూ సమాజంలో బలహీన వర్గాల వారి వెనకబాటు తనాన్ని, వారికి దరిచేరని ప్రగతి నీ ఆకాశం తో, అమృతంతో పోలుస్తూ ఆవేదన చెందాడు.

చైతన్యం అనేది సంపన్నుల చుట్టూ తిరుగుతూ, పేదవారిని చీకటి సుడిగుండాలలో నెట్టేస్తుందని తన అభ్యుదయ భావాలతో సమాజానికి అక్షర ఆయుధాలను విసిరాడు.

జీవిత రామాయణంలో..

వ్యాస వాల్మీకులే కవుల అవని కెల్లా
కడమ వారు వారల పాదకమల గత మ
ధూళి సేవించి బ్రతుకు మధువు తాలై!
అందు కడ పంక్తి నొక పసికందు నేను!

ఈ భూమి మీద పండిత వంశంవారే కవులు కాదు కడజాతి వర్గాల నుండి వచ్చిన కవుల వరుసలో నేనున్నానని విన్నవించారు.

కోకిల కూస్తున్నది, ఎక్కడినుంచో
అది కూతకాదు, పాట
కొందరికి కూత కొందరికి పాట
కొందరికి విశ్వైక ప్రేమ గీత
వాళ్ల వాళ్ల సంస్కారాన్ని బట్టి...
పోనీ, కానీ...
అదెక్కడి నుంచి పాడుతున్నట్టు?
చర్చి కాంపౌండ్ నుంచా?
మసీదు కాంపౌండ్ నుంచా?
శివాలయం కాంపౌండ్ నుంచా?
ఏ కాంపౌండ్ నుంచి అయితేనేం?
అన్నిటా ఉన్నాయి ఉద్యానవనాలే, ఎక్కడి నుండి పాడిన కోకిల కోకిలే
అది ఏ మతానికి అనుయాయి కాదు, ఏ గుడికి పూజారి కాదు...

అంటూ కుల మతాల గోడులో పార్టీల ముసుగులో కొట్టుకు చస్తున్న సమాజాన్ని చూసి చలిస్తూ భీమన్న గారు "కాంపౌండ్ అయితేనేం" అనే శీర్షికతో కోకిల రాగాన్నే కవితా వస్తువుగా తీసుకొని ఎంతో చక్కగా సమాజాన్ని హెచ్చరించారు.

ముగింపు:

భీమన్నగారు 45 ఉగాది కవితల్ని తనదైన కోణంలో వివిధ కవితా వస్తువులతో, సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని సమాజ శ్రేయస్సుకు రచనలు చేశారు. మొత్తం మీద భీమన్నగారి ఉగాది కవితలు ప్రకృతి ధర్మాలనే గాక, కాల వైపరీత్యాలను, దేశ పరిస్థితులను, అధినాయక ప్రభావాలను కూడా ప్రతిబింబిస్తూ చరిత్రను తెలిపే విధంగా ఉంటాయి.

ఆధార గ్రంథ సూచి:

1. భీమన్న ఉగాదులు
2. భీమన్న సమగ్ర సాహిత్యం

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న కావ్యకుసుమాలు- తాత్త్విక విశ్లేషణ

- బుషనమోని కమల,
ఉపాధ్యాయురాలు

సామాజిక చైతన్యాన్ని ఆశించి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి, రచయిత బోయి భీమన్న. 1911 సెప్టెంబర్ 19 తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో నిరుపేద పంచమ కుటుంబంలో జన్మించి పాంచజన్యంను పూరించాడు. నాగమ్మ, పల్లయ్య దంపతులకు అయిదుగురు కుమారులలో రెండవవాడైన భీమన్న చిన్నపట్టి నుండి పేదరికంతో పాటు, అంటరాని తనాన్ని, దురాచారాలను చవిచూశారు. ఈ దురాచారాలను అధిగమించడానికి సాహితీ క్షేత్రంలోకి అడుగు పెట్టి తన మనఃసంఘర్షణ లను కవిత్వం, రచనల ద్వారా సమాజ వికాసానికి కలాన్ని కదిపిన మహాకవి.

బోయి భీమన్న గారి 'కావ్యాకుసుమాలు' అనే కావ్యంలో 70 ఖండికలు కలవు. ఈ ఖండికలు ఏ ఖండిక కాఖండిక అమృత ఘట్టంవలె వున్నాయి. పూర్వజన్మ సుకృతం, సరస్వతి కటాక్షం ఉంటే తప్ప సాహితీ క్షేత్రంలో బంగారు పంటను పండించగలిగారు. ఈయన ప్రకృతిలోని వినూత్న వస్తువులను గ్రహించి సంపూర్ణ కావ్యవస్తువులుగా తీర్చిదిద్దాడు. నైపుణ్యం కల్గిన శిల్పి పనికిరాని రాయిని కూడా అద్భుత కళాఖండంగా తీర్చి దిద్దినట్లు, మ్రోడువారిన చెట్లకు వసంత పూలు పూయించినట్లుగా బోయి భీమన్న గారు "కావ్యకుసుమాలు" ఖండికలు కూడా అదే విధంగా ఉన్నాయి. ఈయన కావ్యకుసుమాలు అనే కావ్యంలో కొన్ని ఖండికలను విశ్లేషించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. అగ్గిపుల్లా!, సబ్బుబిళ్ళ! కుక్కపిల్లా! కాదేది కవితకనర్హము అని శ్రీ శ్రీ అన్నట్లు భీమన్న ప్రకృతిలోని కోకిలా, వసంతం, మేఘాలు, తుమ్మెదా మొదలైనవి తనకు అత్యంత ఇష్టమైన కవితా వస్తువులుగా ఎంచుకున్నాడు. ఈ క్రింది కావ్య ఖండికలో

'ఎందరినొ మైత్రికోసమై యెంచి, యెంచి
పిల్చి పిల్చి నే బొబ్బలు పెట్టినాను ;
ఎవరిపనిమీద వారు పోయారె కాని
పృథివి నా యున్కినేని గుర్తించరేల?'

ఎందరిని బ్రతిమాలినను తనకు సహాయము చేయలేదట! తన స్వయంకృషివల్లనే తానీస్థితికి చేరిన తన జీవిత విశేషాలు ఈ కావ్యసంపుటిలో తెలుస్తున్నాయి. "ఉజ్జీవము" అనే ఖండికలో

మధుర మధుమాస మేరీతి మధువులూరు?
జలదమెందుండి చేరు నాషాడ గృహము ?
శారజ్యో త్స్న కెచటి దా చల్లదనము ?
ప్రకృతి దర్శించి ఏమి నేర్చుకొనినావు?

అని ప్రకృతి యథార్థమును వర్ణించి, ప్రకృతి నుండి మానవుడు నేర్చుకోవాల్సిన గుణపాఠాలను జాతికి ఉద్బోధించాడు.

"రమ్మదేవి! ఈ తెలుగు పొలమందు
లక్ష్మీవై తెలుగు పాఠశాలను వాణి
వై తెలుగు గేహములను భవాని వగుచు"

అని తన ఇష్ట దేవతయైన స్వయం ప్రభను రమ్ము! సిరులెల్ల నీవుగారమ్మో దేవి! లక్ష్మీ, పార్వతీ, సరస్వతీ రూపంగా భావించి తెలుగు నేలకు ఆహ్వానించాడీకవి.

"పద్మానయనపద్మ పక్ష్మ పంక్తుల క్రింద
దాచుకున్నాడా సౌందర్యలహరి.
శ్యామలా సుందర స్వాంతోత్పలముతో
భద్రపెట్టితీ యవ్వనపు శోభ"

అని ఆనంద యాత్ర అనే ఖండికలో సర్వదేవతోపాసనతో మోక్షత్వంలోని తత్త్వమును బోధించి "మానవ సేవయే మాధవ సేవ" అని చాటినాడు. "పారితోషికము" అనే ఖండికలో ఉన్నత స్థాయిలో ఉన్న కోకిలకు కాన్క నియ్యదలచిన సందర్భంలో చివరి కొమ్మలు చేరి చివురి రెమ్మలు దూరి

ప్రత్యూష సమయాన పాడుచున్నది పికము;
పాటకు తలయూచి పరితోషమును పొంది,
పారితోషిక మీయ గోరినది యొక చీమ.

కోకిల పాటకు సంతోషించిన చీమ కోకిలకు బహుమానం ఇస్తానని కోరినది.

"అందుండి కోకిలము ఇందాక దిగలనేల
ఇందుండి నేనెట్ల అందాక పోవలతు"

అనే ఖండికలో చిన్నవారి దైన్యాన్ని, వారికి పెద్దలపట్ల ఉండవలసిన గౌరవాన్ని తెలుపుతూ "సామాన్యముచే విశేషాన్ని సమర్థించి" అర్థాంతరన్యాస అలంకారాన్ని స్ఫురింపజేశారు.

"వేకువగుదాక పోరాడి విజయమంది
మేలు కొల్పులు పాడి వైతాలికుండు
సుప్రభాతము పూర్తిగా చూడకుండ
కదలి తానను చీకట్ల కలసి మరలె"

అని "తీరాంతరము" ఖండికలో గాంధీజీ నిర్యాణం గురించి చెప్పిన మాటలు పాఠకుని హృదయాన్ని కదిలిస్తాయి.

'తత్ – త్వమ్, అనే కావ్యఖండికలో
లేదు నాకు వ్యుత్పన్నత ; వేదాచయము
ఉపనిషత్తులు, వాని శాఖోపశాఖ
లేమి బోధించునో ఇంతయే నెరుంగ;
చదువులే లేని నాకు ప్రాజదువులెద?

అని తనకు శాస్త్రాలు, వేదాలు తెలియవని "చదువలేని నాకు ప్రాజాదువు లెద?" అని పామర తత్వాన్ని చూపించాడు.

"నిన్నె రింగితి నన్నె రింగితి స్వామి,
ఇంతకన్న వేదాంత మేమి నాకు"

అని ఆత్మ పరమాత్మ జ్ఞానాన్ని ఒక్క మాటలో తెలిపి తనదివ్యజ్ఞానాన్ని ఈ ఖండికలో తెలిపాడు.

"పగలు పనిపాట లందు నిబ్బరము గూర్పు
రెలు కలలందు సహజ సంతృప్తి నొసకు
చాల దవ్యయ నాకతి సన్నిహితము నాజన్మభూమి"

అనే ఖండికలో దేశాంతరములో ఉన్న వ్యక్తి మానసిక స్థితిని తెలిపాడు.

"పల్లెబతుకులు" అన్న ఖండికలో
"అరటి తోటలోని అరుణోదయములు
మామిడి తోపుల మధ్యాహ్నములు
సరసి తటమ్ముల సాయంతనములు"

పల్లెబ్రతుకులు శ్రేష్టమైనవి, పల్లెసీమల్లో ప్రేమానురాగాలకు నిలయమని, ఆచటి మూడు సంధ్యలను వర్ణించాడు.

"మనస్సు గుర్తింప జాలని మందబుద్ధి
విశ్వసాహితి కర్థమ్ము విప్పుటెట్లు" అని

ప్రకృతిలోని మూగవేదనను గుర్తించలేని మానవుని అసమర్థతకు వాపోయాడు.

ఇసుక గుంటల నుండి ఇన్నిన్ని నీళ్ళు
మురుకు లగుదాక తోడి, యిర్వురము నెంత కష్టపడి పోసినాము.

పై ఖండికలో భక్తి సిద్ధాంతమునందలి శేష శేషి భావము వ్యంగ్యముగా స్ఫురించుచున్నది. ఈ భావమును పాశ్చాత్య తాత్వికులు "Doctrine of Divine Spouse" అని యందురు. ఈయన శైలి గ్రాంథిక, వ్యావహారికములో కలబోసియున్నది.

వనరుహ గర్భ గర్భిత స
వ భ్రమరీ భ్రమణ స్వరమ్మునన్.
నీరదశ్యామ వియోగ ధూమ పరి
సంహృత సంభృత రాగశాలివై.

ఖాతరు, లుగసాను మొదలైన వాడుకలో నున్న యనేక పరభాషా పదముల నీయన వాడినాడు. అర్థకల్పనకీయన శబ్ద ప్రయోగముల యందు స్వతంత్రించును. శాబ్దికునకు భయపడడు. కందము వ్రాసినవాడే కవి యన్నట్లు ఈయన కంద పద్యములు రమణీయములు. ఉదాహరణకు ఈ క్రింది పద్యాన్ని చూడవచ్చు.

విసవిస కుసుమాసవముల
పసిమిని ప్రాయములు భద్రపరచినవారే
కుసుమింతురు, మిసమింతురు
రసికాగ్రణి గణవరేణ్య రసరాజ్యములో.

బోయి భీమన్న 'భావుకుడు, రసపిపాసి, ప్రకృతి పుత్రుడు, ఉదాత్త చిత్తుడు, తత్త్వవేత్త!' అని అంటాడు కురుగంటి సీతారామయ్య.

ఉపయుక్తగ్రంథ సూచి:

1. జాషువ, గుర్రం. గబ్బిలం కావ్యం. జాషువా సర్వలభ్యరచనల సంకలనం, మనసు ఫౌండేషన్, బెంగుళూరు.
2. భీమన్న, బోయి. బోయి భీమన్న సమగ్రసాహిత్యం, సంపుటి 3, వచన కవితలు భాగం 2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2010
3. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 4, నాటకాలు, భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2008
4. మంజులత, ఆవుల. (సం.) బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్: 2008
5. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా నా శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న 'కూలి రాజు' నాటకం - సామాజిక అంశాలు

ఈ. జనార్ధన్
తెలుగు అధ్యాపకులు
చరవాణి: 9573260510

ఉపోద్ఘాతం

తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించిన ప్రముఖ రచయితలలో బోయి భీమన్న, ఒకరు. ఆయన రచనలు సమాజంలోని అసమానతలను, ముఖ్యంగా దళితులు, కార్మికులు, పేద ప్రజల జీవన పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. భీమన్న గారు రచించిన "కూలి రాజు" నాటకం వ్యవసాయ కూలీల జీవన స్థితిని, వారి ఆర్థిక, సామాజిక సమస్యలను స్పష్టంగా చూపించే ఒక ప్రముఖ సామాజిక నాటకం. ఈ నాటకం ద్వారా కూలీలలో చైతన్యం, సంఘటిత పోరాటం, సమానత్వం వంటి భావాలను రచయిత ప్రోత్సహించారు.

ఈ పరిశోధనా వ్యాసంలో "కూలి రాజు" నాటకంలోని ప్రధాన సామాజిక అంశాలను విశ్లేషించడం జరిగింది. ముఖ్యంగా కుల వివక్ష, కార్మిక సంఘాల ప్రాముఖ్యత, ఆర్థిక అసమానతలు, నాయకత్వం, ప్రజాస్వామ్య చైతన్యం వంటి అంశాలను పరిశీలించడం జరిగింది. నాటకంలోని పాత్రలు, సంభాషణలు, గీతాలు మరియు కథా నిర్మాణం ద్వారా రచయిత వ్యక్తం చేసిన సామాజిక సందేశాన్ని విశ్లేషించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యం.

ఈ పరిశీలన ద్వారా "కూలి రాజు" నాటకం కేవలం ఒక నాటక రచన మాత్రమే కాకుండా ఒక సామాజిక ఉద్యమానికి ప్రతీకగా నిలిచిందని స్పష్టమవుతుంది. కూలీలు సంఘటితమైతేనే తమ హక్కులను సాధించగలరని, సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని రచయిత సూచించారు.

కీలకమైన పదాలు (Keywords)

బోయి భీమన్న,, కూలి రాజు నాటకం, వ్యవసాయ కూలీలు, సామాజిక నాటకాలు, కార్మిక చైతన్యం, కుల సమానత్వం, కార్మిక సంఘాలు, దళిత చైతన్యం, తెలుగు నాటక సాహిత్యం.

పరిశోధన పత్రం ఉద్దేశం

తెలుగు సాహిత్య చరిత్రలో సామాజిక సమస్యలను ప్రతిబింబించిన రచయితలలో బోయి భీమన్న,కు ప్రత్యేక స్థానం ఉంది. ఆయన కవిత్వం, నాటకాలు మరియు వ్యాసాలు సమాజంలోని దిగువ వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చాయి. ముఖ్యంగా దళితులు మరియు కార్మిక వర్గాల జీవన పరిస్థితులను ఆయన సాహిత్యంలో ప్రతిబింబించారు.

భీమన్న గారి రచనలలో సామాజిక న్యాయం, సమానత్వం, మానవతా విలువలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆయన రచించిన నాటకాలలో"పాలేరు", "కూలి రాజు"వంటి నాటకాలు తెలుగు సామాజిక నాటక సాహిత్యంలో ప్రముఖ స్థానం పొందాయి.

"కూలి రాజు" నాటకం వ్యవసాయ కూలీల జీవితాన్ని ప్రతిబింబించే ఒక సామాజిక నాటకం. భారతదేశంలో గ్రామీణ సమాజం ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. కానీ భూస్వాములు కొద్దిమంది మాత్రమే ఉండగా, ఎక్కువ మంది పేద రైతులు మరియు కూలీలుగా జీవిస్తున్నారు.

ఈ నేపథ్యంలో వ్యవసాయ కూలీల సమస్యలు, వారి జీవన పరిస్థితులు మరియు వారి హక్కుల కోసం జరిగే పోరాటాన్ని "కూలి రాజు" నాటకం స్పష్టంగా చూపిస్తుంది.

నాటకంలో కూలీలలో చైతన్యం కలిగించి సంఘటిత పోరాటం ద్వారా సామాజిక మార్పు సాధ్యమని రచయిత సూచించారు.

లక్ష్యాలు

ఈ పరిశోధనా వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యాలు:

1. బోయి భీమన్న, రచించిన "కూలి రాజు" నాటకంలోని సామాజిక అంశాలను విశ్లేషించడం.
2. వ్యవసాయ కూలీల జీవన పరిస్థితులను నాటకంలో ఎలా ప్రతిబింబించారో అధ్యయనం చేయడం.
3. కుల వివక్ష మరియు ఆర్థిక అసమానతలను రచయిత ఎలా చూపించారో పరిశీలించడం.
4. కార్మిక సంఘాల ప్రాముఖ్యతను విశ్లేషించడం.
5. నాటకం ద్వారా వ్యక్తమైన సామాజిక చైతన్యాన్ని గుర్తించడం.

వివరణ

1. వ్యవసాయ కూలీల జీవన పరిస్థితి

నాటకంలో వ్యవసాయ కూలీల దయనీయ పరిస్థితిని రచయిత స్పష్టంగా చిత్రించారు. వారు రోజంతా కష్టపడి పని చేసినప్పటికీ సరైన వేతనం పొందలేరు.

కూలీల బాధను తెలియజేసే పద్యం:

"పల్లెత్తు మాట్లాడలేవా ఓ కూలీ
పావలా తెచ్చుకోలేవా
పూట్ల కొలది పని చేసి
పూట గడవని దుస్థితి!"

ఈ కవితలో కూలీ జీవితంలోని కష్టాలు, బాధలను కవి స్పష్టంగా వివరించాడు.కూలీలు రోజంతా కష్టపడి పని చేసినప్పటికీ వారికి సరైన వేతనం అందడం లేదు.అందువల్ల వారు తమ కుటుంబాన్ని పోషించడం కూడా చాలా కష్టంగా మారుతోంది.పని చేసినంత ఫలితం దక్కక పేదరికంలోనే జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ఈ పంక్తుల ద్వారా కూలీల దుస్థితి మరియు సమాజంలో ఉన్న అసమానతలను కవి తెలియజేస్తున్నాడు.

కవిత పంక్తులు కూలీల ఆర్థిక దౌర్భాగ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

2. కుల వివక్ష

నాటకంలో కుల వివక్షను రచయిత తీవ్రంగా విమర్శించారు. సమాజంలో ఉన్న కుల ఆధారిత అసమానతలను తొలగించాలని సూచించారు.

"బ్రాహ్మణుడు మొదలు మాదిగ వాని వరకు
కష్టపడే వాడు కార్మికుడే
పని చేసే చేతులే గొప్పవి
పుట్టుకతో ఎవరు పెద్దవారు?"

అనిసమానత్వాన్ని రచయిత ప్రతిపాదించారు.

3. కార్మిక సంఘాల అవసరం

కూలీలు సంఘటితమైతేనే తమ హక్కులను సాధించగలరని నాటకం సూచిస్తుంది.
"ఒక్కడిగా ఉంటే ఓడిపోతాం
ఒక్కటై నిలిస్తే గెలుస్తాం
కూలి చెమట చుక్కలతో
కొత్త ప్రపంచం నిర్మిస్తాం."

ఈపంక్తులుద్వారా భీమన్న కలం కార్మిక చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది.

4. ఆర్థిక అసమానతలు

"కూడు దొరకక ప్రతిరోజు కూలి కేగు
కులములన్నియు నొక్కటే కులము కాదె?
బ్రాహ్మడు మొదలు మాదిగ వాని వరకు
కష్టపడువాడు ప్రతివాడు కార్మికుండె"

కవితలోని అక్షరాక్షరం కూలీల ఆర్థిక దౌర్భాగ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

పరంజ్యోతి 'మీది కేవలం కూలి ఉద్యమమేనా? హరిజన ఉద్యమం కలిసి ఉందా? అని నిష్కలను ప్రశ్నించడంలో ఆమె ఆకాంక్ష కూడా కులం లేని ఉద్యమమే అన్న స్వరం వినబడుతుంది.

నాటకంలో భూస్వాములు మరియు కూలీల మధ్య ఉన్న ఆర్థిక అసమానతను రచయిత స్పష్టంగా చూపించారు.భూస్వాములు సంపదతో జీవిస్తుండగా కూలీలు ఆకలితో బాధపడుతున్న పరిస్థితి సమాజంలో ఉన్న అసమానతలను తెలియజేస్తుంది.

5.కూలి రాజు నాటకం సార్వకాలీనత

నేటి సమాజంలో కూడా ఈ నాటకం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. కార్మికుల హక్కులు, సమానత్వం మరియు సామాజిక న్యాయం వంటి అంశాలు ఇప్పటికీ సమకాలీనమైనవే. అందువల్ల "కూలి రాజు" నాటకం కేవలం తన కాలానికే పరిమితమైనది కాకుండా అన్ని కాలాలకు సంబంధించిన ఒక ప్రగతిశీల రచనగా నిలుస్తుంది.

ముగింపు (Conclusion)

బోయి భీమన్న, రచించిన "కూలి రాజు" నాటకం తెలుగు సామాజిక నాటక సాహిత్యంలో ఒక ముఖ్యమైన కృతి. ఈ నాటకం ద్వారా రచయిత సమాజంలోని దిగువ వర్గాల సమస్యలను స్పష్టంగా ప్రతిబింబించారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీల జీవన పరిస్థితులను, వారి ఆర్థిక దౌర్భాగ్యాన్ని మరియు సామాజిక అన్యాయాన్ని ఈ నాటకం వెలుగులోకి తీసుకువచ్చింది.

"కూలి రాజు" నాటకం కేవలం ఒక సాహిత్య కృతి మాత్రమే కాదు; అది ఒక సామాజిక ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. కూలీలు తమ సమస్యలను గుర్తించి సంఘటితంగా పోరాడితేనే వారికి న్యాయం లభిస్తుందని ఈ నాటకం స్పష్టంగా తెలియజేస్తుంది.

ఈ నాటకం ద్వారా రచయిత మూడు ముఖ్యమైన సందేశాలను తెలియజేశారు. మొదటిగా, సమాజంలో ఉన్న కుల వివక్షను తొలగించి సమానత్వాన్ని స్థాపించాలి. రెండవది, కార్మికులు తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలి. మూడవది, సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలను తగ్గించడానికి సామాజిక చైతన్యం అవసరం.

అందువల్ల బోయి భీమన్న, గారి "కూలి రాజు" నాటకం తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన ఒక గొప్ప సృజనఅని చెప్పవచ్చు. ఈ నాటకం ద్వారా రచయిత సమాజంలో మార్పు కోసం సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం అని నిరూపించారు.

ఆధార గ్రంథాలు

1. కూలి రాజు నాటకం – బోయి భీమన్న
2. ఆధునిక తెలుగు నాటక సాహిత్యం – వివిధ విమర్శకులు
3. తెలుగు సామాజిక నాటకాలు – పరిశోధన వ్యాసాలు
4. సమగ్ర సాహిత్యం – బోయి భీమన్న
5. అంతర్జాలం

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

"బోయి భీమన్న 'పైరుపాట' గేయ నాటిక - ప్రకృతి సౌందర్యం"

డా. గోపినాథ్ రాథోడ్ పి.
సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ
Call: 7989692288

వ్యాస సంగ్రహం :

దళిత రచయితల్లో బోయి భీమన్నది ప్రత్యేక శైలి, ప్రధానంగా సమానత్వం, సామజిక చైతన్యం, దళితుల ఆత్మగౌరవం ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి బోయి భీమన్న. భీమన్న మంచి భావకుడు. ప్రకృతి సౌందర్యం, స్త్రీ సౌందర్యం, శ్రమజీవన సౌందర్యం, ప్రణయ సౌందర్యం ప్రధానగా కనిపిస్తాయి. ఈయన నాటకాల్లో పాలేరు,కులిరాజు, రాగ వశిస్టం, పైరుపాట మొదలైనవి ప్రధానమైనవి. పైరు పాట గేయనాటిక మనవ జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తుంది.ఈ నాటకం ద్వార భీమన్న కులరహిత సమాజానికి కులాంతర వివాహాలే శరణ్యం అని భావించాడు. అందుకే ఈ నాటకంలో ఒక అగ్రవర్ణ యువకుడికి పొలాల్లో గడ్డి కోసే దళిత యువతితో ప్రేమను చూపిస్తాడు. వీరి ప్రేమ పెళ్ళితో సుఖాంతం ఔతుంది. ఈ నాటికలో ప్రకృతి సౌందర్యం, ప్రణయ సౌందర్యాన్ని రచయిత చిత్రించిన తీరును వివరిస్తాను.

ఉపోద్ఘాతం :

బోయి భీమన్న నాటకాల్లో పైరు పాట ఒకటి. దిన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు అంకితమిచ్చారు. ఈ గేయ నాటిక ముందు "స్నేహ" పేరుతో ఆకాశవాణిలో ప్రసామైంది ఆ తరువాత 1950లో 'స్నేహ సుందరి' పేరుతో ఒక పత్రికలో సీరియల్గా వచ్చిందని ముందుమాట వల్ల తెలుస్తుంది. ముద్రణ నాటికీ "పైరుపాట" పేరుతో రంగస్థల ప్రదర్శనకు అనుకూలంగా నృత్య సంగీత గేయ రూపకంగా రుపోదిద్దుకుంది. భీమన్న దృష్టిలో పాట బతుకులోని

కమ్మదనానికి ప్రతీకగా భావించాడు. భీమన్న మనస్సును ఆనంద డోలికల్లో ఉగించిన ప్రకృతి సౌందర్యం వారు పుట్టి పెరిగిన కోనసీమ పల్లె వాతావరణమే పైరుపాట గేయ నాటకానికి కారణభూతమైంది. పైరు పాటకు రంగస్థలం తాను పుట్టుపెరిగిన కోనసీమ, గోదావరి తీరంలోని పైరుపోలాలు, శ్రమజీవన సౌందర్యం కనిపిస్తుంది. గడ్డి కోస్తున్నపుడు స్నేహ ముఖంపై చెమటలు కారడాన్ని గమనిచిన శ్రీవత్సమాటల్లో

"పరువు పరువును గడ్డి కోస్తూ
పాటకూడా పాడతావు
చాల కష్టం కాదటే ? ఈ
శ్రమకు అంతే లేదటే?
గడ్డిపిల్ల
చెమట పట్టుట చిత్రమా ? ఈ
శ్రమకు ఫలితం కొంచేమా? **పుట : 521**

సానుభూతితో ప్రశ్నించినపుడు ఆమె ఇచ్చిన సమాధానంలో శ్రమైకజీన సౌందర్యం, ఆత్మాభిమానం కనిపిస్తుంది. పనికి పాటతో ఉన్న విడదీయరాని సంబంధం కనబడుతుంది. చెమట పట్టుట చిత్రమా అని చేమతోడ్చాకపోతే సంపద సృష్టి లేదని సూచిస్తుంది. కష్టపడి కోసుకేల్లిన గడ్డిని మేసి నెమరువేసే పశువుల కళ్ళలో సంతృప్తి ముందు ఈ కష్టం లెక్కే కాదంటుంది. ఉత్పతి వనరులతో శ్రమ జీవికి ఉండే మానవీయ సంబంధాన్ని వ్యక్తం చేసే మాటిది. ఆమెకు పని కష్టం కాదు,పాటాకష్టం కాదు , సంపదను సృష్టించేది పని, ఆ పనిలో తోడుండేది పాట ఇవి రెండు ఒకదానిపై మరొకటి ఆధార పడి ఉండే శ్రమజీవన సౌందర్యానికిఆలంబనగా చెప్పవచ్చు. ఈ నాటకంలో పాటలకు ఆలంబన పైరు చేలు, పచ్చిక బీళ్ళు, పచ్చటి గడ్డి, పిల్లల ఆటలు, కుర్రవాళ్ళ షికారూ

"మంచు బొట్టో, మధు బిందువో
మనుగడ కంతే చాలని
కమ్మగా జీవిచే యీ
గడ్డిపువ్వు కడగంటికి
పాలకడలి చూసి -- తు
ఫాను రేపినా వేలా **పుట : 520**

అని భీమన్న సృష్టించిన స్నేహ పాత్ర యొక్క పేదరికం, దయనీయమైన హినస్థితి తెలుస్తుంది. పేదరికంలో ఉన్న గొప్పతనాన్ని 'గడ్డిపువ్వు' ను సింబాలిక్ గా చేసి చిపించడంలో రచయిత గొప్పతనం, భావుకత, వైవిధ్యాన్ని చూడవచ్చు.

శ్రీవత్స, స్నేహ, లీల వంటి పాత్రలతో నడిచే ఈ నాటకంలో శ్రీవత్స విద్యాధికుడు, సంపన్నుడైన గ్రామీణ యువకుడు, ఇందులో నాయకుడు, కాని విశాల భావాలూ కలవాడు. ప్రకృతి సౌందర్య ఆరాధకుడు, పొలాల్లో షికారుకని వచ్చి స్నేహను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు.

స్నేహ ఇందులో నాయికా గడ్డి కోసుకొని బతికే మాలపిల్ల, రైతు కూలి, అమాయకత్వం, పేదరికం ఈమె అందం,ఆభరణం. ఈ పాత్రను సహజ సుందరంగా చిత్రించారు రచయిత, ఈమె ప్రేమ హృదయం స్రమజీవనసౌందర్యానికి ప్రతీక

పైరు పాట నాటికను అంకాలుగా కాకుండా రంగాలుగా విభజించాడు రచయిత ఈ రంగాలు కాలగమన్నాన్ని సూచించేవిగా కనిపిస్తాయి. ఇందులో మొత్తం 7 రంగాలు ఉన్నాయి. మొదటి ఆరు రంగాల్లో పచ్చని పైరు పొలాల వర్ణన కానిస్తుంది. నాయికా నాయకుల పరిచయుం, ప్రేమగా మారడంతో చివరిదైన ఎడవ రంగంలో కళ్యాణ వేదికగా ఒక కుటీరాన్ని చిత్రించడం, పెళ్లి జరగడంతో నాటిక ముగుస్తుంది. మొదటి రంగంలో నాయికానాయకులకు పరస్పర ఆకర్షణ కలిగినా శ్రీవత్స యెడల స్నేహ అభిముఖం రెండవ రంగం దాక అభివ్యక్తం కాలేదు. ఎంత ప్రార్థించినా అతనికి తన పేరుకూడా చెప్పలేదు. ఇక గత్యంతరం లేక స్నిగ్ధభావసుచాకంగా స్నేహ అని పెరుపెదతాడు. అది ఆమె నిజమైన పేరుకావడం నిజమైన భావ సౌందర్యానికి నిదర్శనం.

" స్నేహ! యని పిలిచి మనసు
స్నిగ్ధం చేశేశావు
వడగొట్టిన గుండె తేనె
వర్షం తో తడిపావు **పుట: 532**

పై సంభాషణ ద్వార స్నేహ పాత్ర యొక్క గుణం ఏమిటో తెలుసుకోవచ్చు.

ఇక లీల మరియు స్నేహ, స్నేహితురాలు, మితభాషి పలికిన ప్రతిమాటను ఆచి తూచి పలికే స్వభావం కలది. స్నేహకు స్నేహితురాలు, స్నేహ అంటే ప్రాణం, ఉపనాయిక, రైతుకులి, లౌక్యం తెలిసిన అమ్మాయి. ఈ మూడు పాత్రలతో నడిచే ఈ నాటకంలో కథ శ్రీవత్స విద్యాధికుడు ఐనప్పటికీ ప్రకృతి ప్రేమికుడు, సౌందర్యారాధకుడు, మంచి భావకుడు, ఇతనికి పొలాలలో గడ్డికోసుకునే పేద దళిత యువతీ స్నేహతో పరిచయం ప్రేమగా మరి చివరకు వివాహంతో సుఖాంతం ఔతుంది.

పైరుపాట గేయ రూపకంలో శృంగార రసాన్ని అతి సున్నితంగా సుకుమారంగా పోషించాడు.

"ఎదర తానుంటేనే నా
యెద ఎంతో పొంగుతుంది.
ఎక్కువ నాకెందుకూ.?
ఇతరము నాకెందుకూ.?
ఎందుకు రామ్మనాడో
పెందలకాదే!
పచ్చని పువ్వుల గుత్తుల
పట్టుచీర కట్టుకొని
ఆవచేను నన్ను చూచి
అపహాస్యం చేస్తున్నది. **పైరు పాట, పుట : 564, 565**

ఇందులో స్నేహ మనసులోని ప్రేమ, సుకుమార శృంగారం కనిపిస్తుంది. శ్రీవత్స ఎదురుగా ఉంటె యెద పొంగిపోతుందని, తనపై ప్రేముంటే చాలని ఇతర విషయాలు నాకెందుకని అంటుంది, అదేవిధంగా పచ్చని పొలాల్లో పువ్వుల మధ్య ఆవ చేను వంటి ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించాడు.

శ్రీవత్స కు పొలాల్లో తిరుగుతున్న సందర్భంలో అతడి కాలికి ముళ్ళు గుచ్చు కున్న సందర్భంలో కారిన 'నెత్తురు బొట్టు' గురించి ఈ విధంగా వర్ణిస్తాడు.

"గొబ్బి ముళ్ళ కాబోలు
గుచ్చుకున్న దావ్రేలికి
గూకుతున్న పోద్దల్లె
పాకింద దే నెత్రుబొట్టు" **పుట : 527**

ఇందులో అద్భుతమైన భావ సౌందర్యం కనిపిస్తుంది. కాలికి ముల్లుగుచ్చి కారిన రక్తపు బొట్టును సుర్యాస్తమ సమయంలో పడమటి దిక్కున కిందికి వాలిన ఎర్రటి ఆకాశాన్ని ప్రతీకగా తీసుకోవడం గొప్ప భావాత్మక ప్రతీక గా చెప్పవచ్చు.

ఆరవ రంగంలో స్నేహపాత్ర పాట పాడుకుంటూ ప్రవేశిస్తుంది. చీకటిగా ఉన్న రంగం తెల్లవారుతున్న చిహ్నంగా తెజోవంతమవుతుంది. ఇందులు అభ్యుదయ భావం కనిపిస్తుంది.

"పంపరమ్మ దీవించి
పచ్చని లత కునలార :
పైరుగాలి పందిట్లో
పవళించిన పైరులార :
ఎన్ని రాత్రు లీ యొంటరి
తిన్నేపైని కూర్చుండి
నా మది మదతలను విప్పి
మీ ముందర పరచితినో : **పుట : 580**

పై కవితలో అత్భుత రసాలు నిండిన హృదయాలను ఆవిష్కరించాడు. సృష్టి సమత్వాన్ని ప్రేమ దృష్టితో చూడడం వల్లే ప్రకృతి సౌందర్యం కనువిందు చేస్తుంది. ఇందులో ప్రకృతి లో పచ్చని పాలల్లో పందిరి వేసిన తీగలతో పొలాల గట్లపై కూర్చొని మనసు విప్పి మాట్లాడినట్లు వర్ణించడం లో సౌందర్యం ఉట్టిపడుతుంది. కోనసీమ అందాలూ కనువిందు చేస్తునవి.

శ్రీవత్స తను ఆరాధనా భావంతో ప్రేయసిని మనసులో తలుస్తూ చేసిన అభివ్యక్తి వ్యంగ్యత్మకంగా, భావ చిత్రణ సౌందర్యానికి నిదర్శనం.

"ప్రత్యేక్షంగా తానై
వచ్చిన శిల్ప భారతిని
తలపనైన లేక ఆజం
తా గుహలకు పర్వెత్తితి:

చిత్తంతో ప్రతి దెబ్బ
సుత్తిదేబ్బగా మలచిన
మానవ మూర్తిని మించి
మహిత శిల్పమేమున్నది?
చాలు చాలు ఇకనైనా
చాలిస్తును స్వప్నయాత్ర
స్నేహ రూప వసంతాన
చేకొందును మధు పాత్ర **పుట : 563**

ఈ కవితలో లీలతో శ్రీవత్స పలోకిన పలుకుల్లో స్నేహపై తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తాడు, తన మనసులో శిల్ప భారతిగా, అందంగా మలచిన మానవతా మూర్తిగా ప్రతిష్టించు కున్నానని, ఆమె పట్ల ఉన్న ఆరాధనా భావాన్ని ప్రేమగా మార్చుకొని ఆమెతో ఉహించుకున్న కలల ప్రపంచాన్ని సాకారం చేసుకుంటానని పలికిన పలుకుల్లో ధ్వని వైచిత్రి, భావ పరిపుష్టిని చిత్రించి అత్భుతమైన సౌందర్యాన్ని సృష్టించాడు.

ఈ నాటకంలో అభ్యుదయ భావాన్ని వ్యక్త పరుస్తాడు భీమన్న

"కష్టానికి ఫలమేమిటి,
కన్నీరొక్కటి తప్ప
ఇచ్చేవాడినేదోచి
పుచ్చుకుంటది లోకం

"మేడలు మిద్దెలు ఉన్నా
మెత్తని పానుపు లున్నా
హృదయం లేకున్నప్పుడు
వృథాయేగద బ్రతుకంతా? **పుట: 529**

వంటి పంక్తులు సంవాదన శైలి మనుషులందరూ ప్రేమాభిమానాలతో, అంతరాలు లేకుండా సమానంగా జీవించాలని కోరుకున్నాడు. కులమత భేదాలు లేని, కక్షలు లేని సమాజ కావాలంటే ప్రేమ ఒక్కటే ఆయుధమని, దీనికి వర్ణాంతర వివాహాలే ఈ అంతరాల్ని దూరం చేస్తాయని భీమన్న నమకం.

" పని ఏదైనా గాని
పరమేశుని రూపం గద
పరమేశుని రూపంలో
తరతమమ్ము లేముంటై" **పుట : 527**

ఈ పరమార్థం ఎప్పటికైనా మానవులకు బోధ పడాలని ఈయన అభిమతం, కులమత కలహాలు, అంటరానితనం, కులకక్షలు మొదలైన దురాచారాలు నశించాలని, చేసే పని చిన్నదైన

పెద్దదైన తారతమ్యం లేదని, గడ్డి కోయడమైన పరిపాలన చేయడమైన దారులు వేరు కాని దూరం ఒక్కటే అని నమ్మిన వ్యక్తి బోయి భీమన్న.

బోయి భీమన్న రచనలు ఎక్కువ శాతం ప్రేమ, ప్రకృతి సౌందర్యం, కులాతీత సమాజం వైపుకు మొగ్గుచుపెవిగా ఉంటాయి. భావుకతకు, అభ్యుదయ దృక్పథానికి, ప్రకృతి సౌందర్యానికి, ప్రణయారాధనకు పూచిన పుబంతులు విరి కవితలు.

పైరుపాట నాటికలో గ్రామీణ జీవితం రైతు సమస్యలు, రైతులు పనిచేస్తూ పడే పాటలు, ఆనందం – బాధల, ఆశ నీరశల వ్యక్తీకరణ, గాలికి ఉగే వరిపైరు, నాగలి దున్నడం, పక్షుల అరుపులు, గ్రామీణప్రకృతి జీవితానికి ప్రతీకగా నిలుస్తాయి. పచ్చటి పొలాలు, శ్రమ జీవనం, ప్రకృతి జీవన తత్వం, ప్రకృతి లో మమేకమై జీవించే రైతు సహజ జీవన సౌందర్యం. శ్రమ విలువను గుర్తించడం, గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబంగా, పర్యావరణ చైతన్యానికి, ప్రగతిశీల భావజాలానికి బలమైన ఆధారంగా ఈ నాటకం నిలుస్తుంది. పైరుపాట నాటకం లో ప్రకృతి సౌందర్యం కథకు ప్రాణం, ఈ నాటకానికి దృశ్య కళాత్మకత, భావోద్వేగాలు ప్రగతిశీల భావజాలానికి పునాదిగా నిలుస్తుంది ఈ నాటకం.

ముగింపు :

మొత్తంగా "పైరుపాట" గేయ నాటకంలో ప్రకృతి సౌందర్యం కథకు నేపథ్యంగా మాత్రమె కాకుండా భావ వ్యక్తీకరణకు మూలాధారంగా నిలుస్తుంది. రైతు జీవితం, ప్రకృతి లయ, ప్రేమ , అన్నింటి సమన్వయము ద్వారా బోయి భీమన్న ఒక జీవవంతమైన కళాఖండాన్ని సృష్టించాడు అందుకే పైరుపాట నాటకం తెలుగు సాహిత్యంలో ప్రకృతి సౌందర్యానికి ప్రధాన నాటకంగా నిలిచింది.

ఆధార గ్రంథాలు :

1. పైరుగాలి – బోయి భీమన్న
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం (సంపుటి 4) ఆవుల మంజులత, కే ఆనందన్
3. బోయి భీమన్న రూపకాలు – తాత్విక చింతన – డా. తక్కెళ్ళ బాలరాజు